
ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

ఆగష్టు 2013
₹10



సుబోధ

శ్రీరామకృష్ణులు: రాగభక్తి జనించినట్లయితే, అంటే భగవంతుని పట్ల ప్రేమ కలిగితే ఆయనను ప్రాప్తించుకోవచ్చు. కానీ, వైదికభక్తి మాత్రం ఎంత సులువుగా వస్తుందో అంతే సులువుగా పోనూ పోతుంది. 'ఇంత జపం, ఇంత ధ్యానం, ఇన్ని యజ్ఞయాగాలు చేస్తాను. ఇన్ని ఉపచారాలతో పూజ చేస్తాను, పూజ సమయంలో ఈ మంత్రాలు పఠిస్తాను' అని అనుకోవడం వైదికభక్తి.



రాగభక్తి అనేది ఎవరికి కలుగుతుంది? పూర్వజన్మలలో అనేక పుణ్యకర్మలు చేసిన వారికో, లేకుంటే నిత్యసిద్ధులకో ఆ భక్తి కలుగుతుంది. పూర్తిగా పాడుబడిన ఇల్లు ఒకటి ఉందనుకోండి! అందులో ఉన్న పిచ్చి మొక్కలనూ, చెత్తనూ తీసివేస్తుంటే గొట్టంలో ఉన్న నీటిబుగ్గ ఒకటి కాన వచ్చింది. అది మట్టి, ఇటుకలతో కప్పబడి ఉంది. వాటిని ప్రక్కకు తొలగించిన వెంటనే నీరు పైకి ఎగజిమ్ముతుంది.

రాగభక్తి కలిగి ఉన్నవారు ఎన్నడూ 'తమ్ముడూ! నేను ఎన్నో రోజుల పాటు హవిష్యాన్నమే తింటూ గడిపాను. కానీ, ఏం ఒరిగింది?' - లాంటి మాటలు మాట్లాడరు. క్రొత్తగా వ్యవసాయంలోకి దిగినవారు పంటలు సరిగ్గా పండనట్లయితే వ్యవసాయం మానుకొంటారు. వంశపారంపర్యంగా సాగుబడి చేస్తున్నవారు పంట పండినా, పండకపోయినా సరే వ్యవసాయం మాత్రం కొనసాగిస్తూనే ఉంటారు. తాత తండ్రుల కాలం నాటి నుండే వ్యవసాయం వారికి వృత్తిగా ఉంటూ వచ్చింది; జీవనోపాధి కోసం తాము కూడా వ్యవసాయమే చేయాల్సి ఉంటుందని వారికి తెలుసు.

రాగభక్తి ఉన్నవారిని మాత్రమే భగవంతుడి యథార్థ భక్తులుగా పేర్కొనవచ్చు. భగవంతుడు వారి భారాన్ని స్వీకరిస్తాడు. ఆసుపత్రిలో నువ్వు పేరు నమోదు చేసుకుంటే రోగం నయమయ్యే వరకు వైద్యుడు నిన్ను ఇంటికి పంపడు. భగవంతుడు ఎవరినైతే పట్టుకుని ఉన్నాడో, వారికి ఎలాంటి భయమూ లేదు. అలా కాకుండా, పొలం గట్టు మీద నడిచేటప్పుడు తానే స్వయంగా తండ్రి చేతిని పట్టుకొన్న పిల్లవాడు ఏమరుపాటుతో చేయి జారి క్రింద పడిపోయే ప్రమాదం ఉంది. అయితే, తండ్రే పిల్లవాడి చేతిని పట్టుకున్నట్లయితే వాడు అలా పడిపోయే ప్రమాదం ఉండదు. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, మొబైల్: 8801849494
E-mail: sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద**   సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**



ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 70　　సంచిక: 8　　ఆగష్టు 2013

మురళినినదలోలం ముగ్ధమాయూరచూళం
దళితదనుజజాలం ధన్యసౌజన్యలీలమ్ ।
పరహితనవహేలం పద్మసద్మానుకూలం
నవజలధరనీలం నౌమి గోపాలబాలమ్ ॥

మురళీనాదమందు ఆసక్తి కలవాడు; సిగయందు ముచ్చట గొలిపే నెమలిపింఛం కలవాడు; రాక్షసులను సంహరించినవాడు; ఉత్తమ లీలలను ప్రదర్శించినవాడు; ఇతరులకు హితములను చేయువాడు; లక్ష్మీదేవికి అనుకూలుడు; తొలకరి మేఘం లాంటి నీలవర్ణుడు అయిన గోపాలకృష్ణునికి నమస్కరించుచున్నాను. - శ్రీకృష్ణకర్ణామృతం

స్మృతిపథంలో స్ఫూర్తిప్రదాత




ఆధునిక ప్రపంచ నాగరకతను తీర్చిదిద్దిన మహనీయులలో ఒక ప్రముఖ వ్యక్తిగా స్వామి వివేకానంద ప్రజల స్మృతిపథంలో శాశ్వతంగా నిలిచిపోతారనడంలో సందేహం లేదు.

భారతదేశ మత చరిత్రను విశ్లేషిస్తే వివేకానంద ప్రాముఖ్యం మహా ప్రవక్తలైన శంకరాచార్య, రామానుజాచార్యులతో సరితూగగలదని మనకు అర్థమవుతుంది. కబీర్, చైతన్య మహాప్రభువు, దక్షిణ భారతదేశంలోని నాయన్మార్లు, ఆళ్వార్ల స్థాయితో పోల్చితే స్వామీజీ ఆధిక్యం గణనీయమైనది.


ప్రపంచ చరిత్రలో ఒక విశిష్ట వ్యక్తిగా వివేకానంద ప్రజలచే పరిగణింపబడతారని నా విశ్వాసం. అందుకు కారణం డా॥ సి.ఇ.ఎం. జోడ్ అభివర్ణించినట్లుగా స్వామి వివేకానంద ప్రాక్ దేశ ప్రతివాద సమరాన్ని ప్రారంభించిన వ్యక్తి కావడమే! వేయి సంవత్సరాలకు పూర్వం ఆగ్నేయ ఆసియా దేశాల్లోనూ, చైనాలోనూ బౌద్ధమతాన్నీ, హిందూమతాన్నీ ప్రచారం చేస్తూ పర్యటించిన భారతదేశ మత ప్రచారకులను గమనిస్తే, భారతీయేతర ప్రాంతాల్లోని ప్రజల హృదయాల్లో భారతదేశ మత ప్రవక్తగా రాణించిన వ్యక్తి వివేకానంద మాత్రమేనని రూఢి అవుతుంది. ❖



ఎ.ఎల్. బాషమ్ (1914-1986)
(ఇంగ్లండ్‌కు చెందిన ప్రఖ్యాత భారతీయ ప్రాచీన విజ్ఞానవేత్త)



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాతపేరు చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: శ్రీ ముదునూరి రాజీరాజు & శ్రీమతి సుందర జయలక్ష్మి, కాకినాడ. (కీ॥శే॥ ఎమ్.శ్రీకృష్ణచైతన్యవర్మగారి జ్ఞాపకార్థం)	10,000
మహారాజ పోషకులు	: శ్రీ ఎమ్. సీతారామ శాస్త్రి, గద్వాల్, మహబూబ్‌నగర్ జిల్లా - 509 125	10,000
రాజ పోషకులు	: శ్రీ బాలాజీ సంఫ్వ్బి, బర్కత్‌పురా, హైదరాబాదు (కీ॥శే॥ రాఘవేంద్ర సంఫ్వ్బిగారి జ్ఞాపకార్థం)	5,000
పోషకులు	: శ్రీ కాదా చిన అప్పారావు, అక్కిరెడ్డి పాలెం, విశాఖపట్నం (కీ॥శే॥ కాదా మహాలక్ష్మిగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు	: ఒక పాఠకుడు, గుంటూరు	1,116
పోషకులు	: శ్రీ బొమ్మా వేంకటకృష్ణారెడ్డి, పంచేడు, నెల్లూరు జిల్లా - 524 306	1,000
పోషకులు	: శ్రీ గురుజాడ మధుసూదనరావు, గ్రీన్‌హిల్స్ కాలనీ, సరూర్‌నగర్, హైదరాబాదు - 500 035	1,000
పోషకులు	: శ్రీ టి. రామలింగమూర్తి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చానమిల్లి, పశ్చిమ గోదావరి జిల్లా	1,000
పోషకులు	: శ్రీమతి లక్ష్మీకాంతమ్మ, ఉప్పల్, హైదరాబాదు (కీ॥శే॥ పాండురంగయ్యగారి జ్ఞాపకార్థం)	1,000
పోషకులు	: శ్రీ ఎస్. సుభాష్, మెళియాపుట్టి, శ్రీకాకుళం జిల్లా - 532 215	1,000
పోషకులు	: శ్రీ ఆకెళ్ళ వీరభద్రం, రాధాకృష్ణ నగర్, అత్తాపూర్, హైదరాబాదు - 500 048	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

ప్రియ భక్తులారా!

యువతరంలో ఆత్మవిశ్వాసాన్ని నింపే యువనాయక స్వామి వివేకానంద స్ఫూర్తివచనాలతో వెలువడుతున్న 'శ్రీరామకృష్ణ ప్రభ'ను రాష్ట్రంలోని వివిధ పాఠశాలలకూ, కళాశాలలకూ అందించాలని సంకల్పించాం.

శ్రీరామకృష్ణ పరమహంస, స్వామి వివేకానందుల సందేశాల ఆవశ్యకతను గురించి సుభాష్ చంద్రబోస్ ఒక సందర్భంలో చెబుతూ, "శీలనిర్మాణానికి రామకృష్ణ - వివేకానంద సాహిత్యం కన్నా ఉన్నతమైన సాహిత్యం వేరొకటి లేదు" అని అన్నారు.

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయడానికి మీ ఆర్థిక సహాయాన్ని కోరుతున్నాం. ఈ పథకం కింద రూ. 1,500 మొత్తాన్ని జీవిత చందా (20 సంవత్సరాలకు) కట్టినట్లయితే మీరు సూచించిన, లేదా మేము ఎంపిక చేసిన ఒక పాఠశాల/ కళాశాలకు 20 ఏళ్ళ పాటు పత్రికను మీ పేరున పంపుతాం. చందాదారుని పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

మీ చందాను ఎమ్.ఓ. / డి.డి. రూపంలో Ramakrishna Math, Hyderabad పేరున తీసుకొని, Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029 చిరునామాకు పంపవలెను. (చెక్కులు స్వీకరించబడవు)

స్వామీజీ ఆదర్శాలకు అనుగుణంగా యువతరాన్ని తీర్చిదిద్దడంలో 'శ్రీరామకృష్ణ ప్రభ' చేపట్టిన ఈ పథకానికి చేయూతనందించగలరని ఆశిస్తున్నాం. భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ప్రార్థిస్తూ...

భగవత్సేవలో

స్వామి జ్ఞానదానంద

అధ్యక్షులు

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలలో
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	₹ 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1500	$ 365

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా:

Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే (పోస్టల్ పిన్‌కోడ్‌తో సహా) వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ....

– సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
DOMALGUDA, HYDERABAD - 500 029. Andhra Pradesh
Phone No: 040- 27667799, 8801849494 E-mail : sriramakrishnaprabha@gmail.com



అభయవాణి... ధీరవాణి

'ఉత్సాహం సాహసం ధైర్యం బుద్ధి శక్తిః పరాక్రమః, షడేతే యత్ర తిష్ఠన్తి తత్ర దేవోఽపి తిష్ఠతి; ఉత్సాహం, సాహసం, ధైర్యం, బుద్ధి, శక్తి, పరాక్రమం - ఈ ఆరు లక్షణాలూ ఎవరిలో ఉంటాయో వారిలో సాక్షాత్తూ ఆ భగవంతుడే కొలువై ఉంటాడు' అని ప్రాచీన సుభాషితం చెబుతోంది. ఈ లక్షణాలన్నింటికీ మనోబలమే ఆధారం. ఇందుకు విరుద్ధమైన నిరుత్సాహం, భయం, శోకం, మోహం, మందబుద్ధి, పిరికితనం మొదలైన బలహీనతలకు మానసిక దుర్బలతే మూలం.

మానసిక దుర్బలతకు లోనై ఆత్మవిశ్వాసం కోల్పోయిన వారికి భగవంతుడు కూడా సహాయం చేయడానికి సుముఖత చూపడు. కార్యరంగంలో ఎలాంటి క్లిష్టపరిస్థితులు ఎదురైనప్పటికీ ఆత్మవిశ్వాసం కోల్పోకుండా, ఆత్మస్థైర్యంతో అధిగమించడానికి ప్రయత్నించినవారికి భగవంతుడు అనూహ్యంగా సహాయ మందిస్తాడు. చేయూతనిచ్చి ముందుకు నడిపిస్తాడు. ముందు నడవడానికి మన వంతు ప్రయత్నం మనం చేస్తే, ఆ తరువాత పరమాత్ముని అండదండలు లభిస్తాయి. అందుకే స్వామి వివేకానంద 'ముందు నీపై నీకు విశ్వాసం ఉండాలి. ఆ తరువాత భగవంతునిపై విశ్వాసం - ఇదే విజయానికి సుగమమార్గం' అని అన్నారు.

మనలో ఆత్మవిశ్వాసం లోపించినపుడు మనల్ని భయం ఆవరిస్తుంది. భయమే సకల దుఃఖాలకూ, శోకమోహాలకూ కారణం. అజ్ఞానజనితమైన ఈ రుగ్మతలను పారద్రోలడానికి అభయమే పరమ ఔషధం. అర్జునుడి హృదయ దౌర్బల్యాన్ని పారద్రోలడానికి ఆనాడు శ్రీకృష్ణుడిచ్చిన ఔషధం 'అభయం'. నేడు భారతజాతిని పట్టిపీడిస్తున్న బానిసత్వం, పిరికితనం, ఆత్మన్యూనత అనే రుగ్మతలను పటాపంచలు చేయడానికి స్వామి వివేకానంద భారతీయులకు ఇచ్చిన ఔషధం కూడా 'అభయమే'.

శ్రీకృష్ణుడు, అర్జునుడికి ప్రప్రథమంగా అభయం గురించే బోధించాడు. ఎందుకంటే భయమే అన్ని దుఃఖాలకూ, దుర్గుణాలకూ కారణమని భగవానునికి విదితమే కాబట్టి! నిర్భయత్వం అలవడినప్పుడు కార్యసాఫల్యానికి కావలసిన మిగతా లక్షణాలన్నీ సమకూరతాయి.

స్వామీజీ కూడా భారతజాతి హృదయంలో నూరిపోసింది అభయాన్నే. భయమే సర్వ అనర్థాలకు కారణమంటూ స్వామీజీ ఇలా అన్నారు: "ఉపనిషత్తుల నుండి బాంబులా వినిర్గతమై జనసందోహం మధ్య పడి వారి అజ్ఞానాన్ని పేల్చివేసే పదం ఏదైనా ఉందంటే అది 'అభయమే'. అభయమనే మతాన్ని నేడు మనం వ్యాప్తి చేయాల్సి ఉంది. భయమే దుఃఖ హేతువు, మరణకూపంలో తోసేది భయమే, దుష్కర్మలను చేయించేది భయమే!"

ఒక వ్యక్తి గానీ, ఒక జాతి గానీ అభ్యుదయ పథంలో పయనించడానికి అభయమే ప్రధానమని ప్రబోధించిన యోగీశ్వరుడు - భగవాన్ శ్రీకృష్ణుడు; యతీశ్వరుడు - స్వామి వివేకానంద.

దుర్బలత... దోషం: ధర్మ క్షేత్రమైన కురుక్షేత్రంలో అధర్మాన్ని అణచడానికి క్షత్రియుని స్వధర్మమైన యుద్ధం చేసి శత్రువులను సంహరించాల్సిన సమయంలో మహా పరాక్రమవంతుడు, మహా ధీశాలి అయిన అర్జునుడు మానసిక దుర్బలతకు గురయ్యాడు. అందువల్ల ఆ వీరుణ్ణి భయం ఆవహించింది, శోకం ఆ శూరుణ్ణి ముంచెత్తింది, మోహం ఆ ధీరుణ్ణి అంధుణ్ణి చేసింది. భయశోకాల బారినపడిన పార్థుడు శ్రీకృష్ణుడితో, 'సీదన్తి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి, వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే (గీత-1.29) - కృష్ణా! నా అవయవాలు పట్టు తప్పుతున్నాయి, నా నోరు ఎండిపోతోంది, శరీరం వణుకుతోంది, రోమాంచం కలుగుతోంది...' అంటూ పిరికివాడి లాగా నిస్సహాయతను వ్యక్తం చేశాడు. అప్పుడు శ్రీకృష్ణుడు, 'ఎంతైనా అర్జునుడు నా మిత్రుడు కదా! ఆపద సమయంలో మిత్రునికి సాయపడడమే ధర్మం కదా!' అని అర్జునుని తరఫున యుద్ధం చేయడానికి సిద్ధమవలేదు.

ఆత్మవిశ్వాసం కోల్పోయిన అర్జునుడిలో తలెత్తిన మానసిక దౌర్బల్యాన్ని తొలగించడానికి పూనుకున్నాడు. దుఃఖిస్తున్న అర్జునుణ్ణి చూసి 'కుతస్త్వా కశ్మలమిదం విషమే సముపస్థితమ్, అనార్యజుష్ట మస్వర్గ్య మకీర్తికర మర్జున (గీత–2.2) – అర్జునా! ఇలాంటి విషమ పరిస్థితుల్లో అకీర్తికరమైన ఈ మానసిక దుర్బలత నీకెక్కడి నుండి వచ్చింది?' అంటూ మందలించాడు మాధవుడు.

అధైర్యాన్ని వీడి యుద్ధానికి సన్నద్ధం కావాల్సినదని ప్రోత్సహిస్తూ శ్రీకృష్ణుడు, 'క్లైబ్యం మాస్మగమః పార్థ నైతత్త్వ య్యుపపద్యతే, క్షుద్రం హృదయ దౌర్బల్యం త్యక్త్వోత్తిష్ఠ పరంతప (గీత–2.3) – పార్థా! అధైర్యం చెందకు. పిరికితనం నీకు తగదు. నీచమైన ఈ మానసిక దుర్బలతను వదలి, లే! యుద్ధం చేయడానికి ఉపక్రమించు!' అని పార్థుని మనస్సులో ధైర్యాన్ని నింపాడు, ఆత్మవిశ్వాసాన్ని నెలకొల్పాడు, మానసిక దుర్బలతను పారద్రోలి కార్యశూరుడిగా మలచాడు.

అభయం... అమరం: అర్జునుడు శోకతప్తుడై కర్తవ్యపాలన విస్మరించినప్పుడు శ్రీకృష్ణుడు, 'మానసిక దుర్బలతను వదలి కర్తవ్యం నిర్వర్తించు' అన్న అభయ వచనాలు స్వామీజీకి జీవితాంతం అత్యంత హితవచనాలుగా, స్ఫూర్తి దాయకాలుగా నిలిచిపోయాయి. 'క్లైబ్యం మాస్మగమః పార్థ.... క్షుద్రం హృదయ దౌర్బల్యం...' అనే ఈ ఒక్క శ్లోకం భగవద్గీత అనే ధనాగారం తెరవడానికి ఉపయోగ పడే ఓ తాళంచెవి లాంటిది అని స్వామి వివేకానంద అభిప్రాయ పడ్డారు. పిరికితనం వదలి అభయపథాన్ని అనుసరించినప్పుడే అభ్యుదయం సాధ్యమవుతుందన్నది స్వామీజీ బోధనల సారాంశం.

స్వామీజీ విశ్వమత మహాసభల్లో విశ్వవిఖ్యాతుడై భారతదేశానికి తిరిగి వచ్చినప్పుడు తమోగుణంలో ఉన్న భారతీయులను మేల్కొలుపుతూ, నిద్రాణమై ఉన్న అనంత శక్తిని జాగృతపరుస్తూ 'కొలంబో నుండి అల్మోరా' వరకు చేసిన ప్రసంగాలన్నీ 'అభయనాదం'తో మార్మోగాయి. స్వామీజీ కొలంబో నుండి అల్మోరా వరకు చేసిన ప్రసంగాలను క్షుణ్ణంగా చదివితే భారతజాతి కోల్పోయిన ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆత్మబలాలను పునఃప్రతిష్ఠించడానికి ఆయన పడిన తపన అర్థమవుతుంది. భారతదేశం పూర్వం కంటే వైభవోపేతంగా వెలుగొందాలనే ఆయన ఆరాటం ప్రస్ఫుటమవుతుంది.

ఏళ్ళ తరబడి విదేశీయుల పాలనలో బానిస బ్రతుకులు గడుపుతున్న భారతీయులను ఉద్దేశిస్తూ, "విదేశీయుల దౌర్జన్యాలను భరించడం మనకు అలవాటైపోయింది. అలా బానిస జీవితాలు గడిపితే ఏనాటికైనా స్వతంత్రులం కాగలమా? ధీరులారా! కుక్క పిల్లల అరుపులకు భయపడకండి. ఆకాశం నుండి పడే భయంకరమైన పిడుగులను సైతం లెక్కచేయకండి. లేవండి! కార్యశూరులు కండి. మీరు మహత్తర కార్యాలను సాధించగలరు" అని అంటూ భారతీయులలో ఆత్మగౌరవాన్ని పునరుద్ధరించారు.

మూఢనమ్మకాల కోరల్లో చిక్కుకొని ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన భారతీయులను ఉద్దేశిస్తూ 'లేవండి! దుర్బలత్వమనే మైకం నుండి మేల్కోండి! ముక్కోటి దేవతలందు విశ్వాసం ఉన్నా, మీ మీద మీకు విశ్వాసం లేకపోతే మీకెన్నటికీ ముక్తి కలగదు' అంటూ ధీరవచనాలతో ఆత్మవిశ్వాసాన్ని ప్రజ్వలింపజేశారు.

యావత్ భారతజాతి అంతర్గత శక్తిని మరచి, నిర్వీర్యమై, నిస్సహాయులుగా మారి పతనావస్థకు చేరిన తరుణంలో స్వామీజీ "మనం అనంతశక్తి సంపన్నులం. 'నేను శక్తి హీనుణ్ణి, అసమర్థుణ్ణి, దుర్బలుణ్ణి' అని భావించడం మహాదోషం. ఇప్పుడు మనకు కావలసింది అఖండ శక్తి, అఖండ ఉత్సాహం, అఖండ ధైర్యం" అంటూ భారతీయులలో ఆత్మన్యూనతా భావాన్ని పారద్రోలి, అంతర్గతమై ఉన్న ఆత్మశక్తిని ఉజ్జీవింపజేశారు.

అభయం...అభ్యుదయమార్గం!: మనస్సు ఆవేదనాభరితమైనప్పుడు సాంత్వన ఎలా పొందగలిగానో చెబుతూ గాంధీజీ "సంశయాలతో సతమతమవుతున్నప్పుడు, సమస్యలు చుట్టుముట్టినప్పుడు, నిరుత్సాహం ఆవరించినప్పుడు నేను భగవద్గీతనే ఆశ్రయిస్తాను. భగవద్గీత సాంత్వన చేకూర్చే చల్లని తల్లి లాంటిది" అని శ్రీకృష్ణుని అభయ వచనాలకు ఉన్న శక్తిని శ్లాఘించారు.

> **'ముందు నీపై నీకు విశ్వాసం ఉండాలి. ఆ తరువాత భగవంతునిపై విశ్వాసం - ఇదే విజయానికి సుగమమార్గం'**



ఇండోనేషియా పూర్వ అధ్యక్షులు డాక్టర్ సుకర్ణో తనలో దేశభక్తి ఎలా పెంపొందిందో తెలుపుతూ "స్వామి వివేకానంద బోధలు పిరికితనాన్ని పారద్రోలి ధీరులుగా మలుస్తాయి. స్వామీజీ బోధనలు చదివిన తరువాత నా దేశ ప్రజలకు ఎలా సేవ చేయాలో, దేశభక్తిని ఎలా పెంపొందించుకోవాలో, ప్రపంచాన్ని ఎలా ప్రేమించాలో తెలుసుకున్నాను. ప్రతీ రోజు స్వామీజీ ప్రసంగాలను కనీసం ఒకటి, రెండు పేజీలు చదవనిదే నిద్రించను" అని స్వామీజీ ధీరవచనాల ప్రభావాన్ని కీర్తించారు.

ఆనాటికీ, ఈనాటికీ శ్రీకృష్ణుని అభయవాణి, స్వామీజీ ధీరవాణి సర్వమానవాళినీ జాగృతపరుస్తూనే ఉన్నాయి. భవిష్యత్తు తరాలవారినీ ధీరులుగా తీర్చిదిద్దుతాయి. మనందరిలో కూడా ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆత్మబలం పెంపొందడానికి ఆ యోగీశ్వరుడి అభయవాణి, ఈ యతీశ్వరుడి ధీరవాణి నుండి స్ఫూర్తి పొందుదాం, అభ్యుదయ పథంలో పయనిద్దాం. ❖

మీ భుజకండరాలూ, శరీర అవయవాలూ బలిష్ఠంగా ఉన్నప్పుడు; మీలో రక్తం మరింత పుష్టినొందినప్పుడు మాత్రమే మీరు శ్రీకృష్ణుని మహత్తర ప్రతిభను, అద్భుత శక్తిని గ్రహించగలరు. - స్వామి వివేకానంద

గోరుముద్ద – స్వామి సుప్రియానంద

అక్షరకుక్షి

కొంత మంది పుస్తకాలు తెగ చదువుతారు. చదువుతూనే ఉంటారు. మరికొందరు పుస్తకాలు అసలు చదవనే చదవరు. కారణం–వారికి చదవడం రాదు. వారిని 'నిరక్షరకుక్షి' అంటారు. మనం ఇప్పుడు 'అక్షరకుక్షి'ల గురించి మాట్లాడుకుందాం!

అక్షరాలు వచ్చినంత మాత్రాన చదివింది బుర్రకు ఎక్కుతుందన్న గ్యారంటీ లేదు. కొన్నేళ్ళ క్రితం మాట. ఒక పేరుమోసిన సినిమా నటి 'భగవద్గీత' చదివింది. మహాతల్లి చదివి అక్కడితో ఆగొచ్చుగా! ఊహూ! పత్రికల వాళ్ళతో ఇలా అంది: "పిచ్చి జనాలు భగవద్గీత ఎందుకు చదువుతారో అర్థం కావడం లేదు. కృష్ణుడు కాసేపు 'భక్తి' గొప్పదంటాడు. మరుక్షణం 'జ్ఞానం' గొప్పదంటాడు. ఇంకోసారి 'కర్మ' గొప్పదంటాడు. ఏ విషయమూ తేల్చి చెప్పడు. అయోమయ స్థితిలో పడేస్తాడు."

అజ్ఞానంతో చేసే వ్యాఖ్యలు అలాగే ఉంటాయి. ఏం చదవాలి, ఎలా చదవాలి, దాన్ని ఎలా అర్థం చేసుకోవాలన్నది తెలియకుండా, ఇష్టారాజ్యంగా ప్రతి అంశంపైనా తీర్పులు చెప్పేయడం అజ్ఞానమే! అందుకే, ఆధ్యాత్మిక సాధకులు వారి జాగ్రత్తలో వారు లేకపోతే కలిగే 'అరిష్టం' అంతా ఇంతా కాదు. అవసరం లేని పుస్తకాలను కూడా అతిగా చదివే వారికి ఎక్కువ సందేహాలు కలుగుతుంటాయి. వారి సందేహాలకు తలా తోకా ఉండదు. పైగా చదివింది సరిగా అర్థం చేసుకోకపోతే ఆ చదువే అనర్థానికి దారి తీసి, చివరకు పిచ్చెక్కేలా చేస్తుంది.



మరి దీని నుండి తప్పించుకోవడం ఎలా? అది తెలుసుకోవడానికి శశి మహరాజ్ (స్వామి రామకృష్ణానంద) జీవితంలోని సంఘటనలు చూద్దాం:

శశి మహరాజ్ యువకుడుగా ఉన్నప్పుడు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని సముపార్జించడానికి హిందూమత గ్రంథాలనూ, తత్త్వవేత్తల బోధనలనూ, బైబిల్‌నూ చదువుతూ ఉండేవారు. సూఫీ వేదాంతుల రచనలలో ఎంతో ఆధ్యాత్మిక పరిజ్ఞానం ఉందని ఒక మిత్రుడి ద్వారా శశి మహరాజ్ తెలుసుకున్నారు. సూఫీ వేదాంతుల రచనల మాతృకలను చదవాలని సంకల్పించి పార్శీ భాష నేర్చుకోవడం మొదలుపెట్టారు.

ఒకసారి దక్షిణేశ్వరంలో ఉన్నప్పుడు శశి మహరాజ్ పార్శీ గ్రంథాలను చదువుతూ అందులో నిమగ్నమైపోయారు. అందువల్ల శ్రీరామకృష్ణులు పిలిచినప్పటికీ ఆయనకు వినిపించలేదు. అప్పుడు శ్రీరామకృష్ణులు స్వయంగా వెళ్ళి 'నువ్వు ఏం చేస్తున్నావ'ని అడిగారు. అందుకు 'పార్శీ భాష నేర్చుకుంటున్నాను' అని బదులిచ్చారు. శశి మహరాజ్ మాటలు విన్న శ్రీరామకృష్ణులు 'ఎక్కువ విషయాలు తెలుసుకోవాలన్న ప్రయత్నంలో నీకున్న భక్తి కాస్తా పోతుంది' అని మందలించారు. వెంటనే శశి మహరాజ్ ఆ పుస్తకాలన్నింటినీ కట్టకట్టి గంగలో పారవేశారు.

మరో సంఘటన – అది వేసవి కాలం. మధ్యాహ్న సమయం. మహేంద్రనాథ్ దత్తా (స్వామి వివేకానంద సోదరుడు) తను చదువుతున్న పుస్తకం గురించి స్వామి శివానంద (మహాపురుష్) మహరాజ్‌తో కలసి చర్చిస్తున్నారు. ఆ పుస్తకంలో క్రీస్తు, బుద్ధ, మహమ్మదుల జీవితాలను పోల్చి విశ్లేషించడం జరిగింది.

వీరి మాటలు పక్క గదిలో ఉన్న శశి మహరాజ్ చెవిలో పడ్డాయి. ఆయన ఆగ్రహావేశులై పరుగున వచ్చి మహేంద్రనాథ్ దత్తాతో ఇలా అన్నారు: "ఇదిగో చూడు! ఎప్పుడూ ఇలాంటి పుస్తకాలు చదవవద్దు. వారు పవిత్రాత్ములు, జగద్గురువులు. వారి పాద ధూళి సమస్త మానవాళినీ శుద్ధి పరచగలదు. వారి జీవితాలను పోల్చి విశ్లేషించడమా? మహనీయుల మహత్తరమైన వ్యక్తిత్వంలోని గుణాలను ఏ కొంచెమైనా అనుసరించలేని వారు ఏ అర్హతతో ఈ విశ్లేషణ చేయగలరు?" *(మహేంద్రనాథ్ దత్తా రచించిన 'స్వామి వివేకానంద స్మృతుల' నుండి)*

కాబట్టి మనం మహాత్ములను విశ్లేషించడానికి బదులు వివేకాన్ని ఉపయోగించి వారి బోధనలను సరిగా అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించాలి. విమర్శలను మాని, భక్తి విశ్వాసాలతో వారి మార్గాన్ని అనుసరించడానికి ప్రయత్నించాలి. అప్పుడే మనం భగవద్గీతనైనా, ఏ మహాత్ముని బోధనలనైనా పెడర్థాలు తీయకుండా సరిగ్గా అర్థం చేసుకోగలుగుతాం. ❖



బాల్యలీలల భక్తి ప్రబోధం

నేత్రాభినయం ద్వారా ఎన్నో రకాల భావ ప్రకటనలను చేయవచ్చని మన నాట్యశాస్త్రంలో పేర్కొన్నారు. లలిత నేత్రములు, ఛలిత నేత్రములు, వలిత నేత్రములు, యాచిత నేత్రములు, ఆర్త నేత్రములు, చికిత నేత్రములు, భీత నేత్రములు మొదలైనవి. శ్రీకృష్ణుని నేత్రాల వర్ణన చాలా చిత్ర విచిత్రంగా ఉంటుంది. అతడు కళ్ళతోనే అడుగుతాడు. కళ్ళతోనే చెబుతాడు. శ్రీకృష్ణుని చౌర్య విశంకితములైన నేత్రములను చూసి యశోదమ్మ బెత్తం తీసుకొని అతణ్ణి కొట్టడానికి పరుగెదుతుంది. కృష్ణుడు రోటిపై నుండి క్రిందకు దూకి పరుగులు పెట్టాడు. ఎంతో తపస్సు చేసిన మహాయోగులు కూడా శ్రీకృష్ణుని పొందడం దుర్లభం. అలాంటిది భగవంతుడు భయంతో పారిపోతుంటే, యశోద అతని వెనకాలే బెత్తం తీసుకొని పరుగెదుతున్నది. ఆహా! ఆ దృశ్యం ఎంత మనోహరమో కదా!

భగవంతుణ్ణి బంధించాలంటే...: యశోద పరుగెత్తి పరుగెత్తి అలసిపోయింది. కానీ కృష్ణుడు చిక్కలేదు. అప్పుడు యశోద 'ఓ అల్లరివాడా! ఈ రోజు నువ్వు పాల కుండను ఎందుకు పగలగొట్టావు?' అని ఆయాసపడుతూ అన్నది. గోపాలుడు చేతులు జోడించి 'అమ్మా! ముందు నువ్వు నీ చేతిలోని బెత్తం క్రిందపడవెయ్యి' అని అన్నాడు. యశోద చేతిలోని బెత్తం క్రింద పడేసింది. వెంటనే గోపాలుడు ఆమె చేతికి చిక్కాడు. అంతవరకూ యశోదకు దొరకని గోపాలుడు బెత్తం క్రింద పడేయగానే ఎందుకు పట్టుబడ్డాడు? 'యావత్ జడయుక్తో న తావత్ చేతనాగమః' – చేతిలో జడవస్తువు (మనస్సులో ప్రాపంచిక విషయాలు) ఉన్నంత వరకూ చేతనం (భగవంతుడు) లభించదు. ఎప్పుడైతే యశోదమ్మ జడవస్తువును వదిలిందో, అప్పుడు చైతన్య స్వరూపుడైన కృష్ణుడు ఆమె వశమయ్యాడు.

యశోద, కృష్ణుణ్ణి త్రాడుతో రోటికి కట్టడానికి ప్రయత్నించి నప్పుడల్లా ఆ త్రాడు ఒక అంగుళం తక్కువ పడుతుంది. విచిత్రం ఏమిటంటే కృష్ణుని నడుము పెరగలేదు, త్రాడు తరగలేదు. కానీ అతణ్ణి బంధించడం మాత్రం యశోదకు సాధ్యం కావడం లేదు. ఎందుకంటే, 'కృష్ణుణ్ణి నేను బంధించగలను' అనే అహం కారం యశోదలో ఉంది. అందువల్ల కృష్ణుడికి, యశోద ఒక అంగుళం దూరంలో ఉంటే, కృష్ణుడు కూడా యశోదకు మరో అంగుళం దూరమయ్యేవాడు. ఇలా కృష్ణుణ్ణి బంధించడానికి ప్రయత్నించిన యశోద అలసిపోయింది. తల్లి పరిస్థితిని చూసిన కృష్ణుని హృదయం ద్రవించింది. అప్పుడు కృష్ణుడే యశోదమ్మ చేతిలో బందీ అవడానికి సిద్ధమయ్యాడు. 'కృపయాఽఽసీత్ స్వబంధనే' – భగవంతుడు, భక్తుని చేతిలో బందీ అవ్వాలంటే ఆయన కృప లేనిదే సాధ్యం కాదు. అహంకార మమకారాలు తొలగినప్పుడే భగవంతుడు, భక్తుని హృదయంలో బందీ అవుతాడు.

భక్తుని వెంటే భగవంతుడు: గోపబాలురు శ్రీకృష్ణునితో వనవిహారం చేస్తున్నారు. యోగులు ఏ భగవంతుని చరణ ధూళి కోసం జన్మజన్మలు తపస్సు చేస్తున్నారో అలాంటి భగవంతునితో కలసి గోపబాలురు ఆడుకుంటున్నారు. ఆ గోపబాలుర సౌభాగ్యం ఏమని వర్ణించగలం?

గోపబాలురు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా ఆడుకుంటున్న సమయంలో అఘాసురుడు అజగరరూపం ధరించాడు. గోపబాలురు ఆ కొండచిలువను చూసి బృందా వనంలో ఇదేదో విశేష ప్రదేశంలా ఉందని తలచి, చప్పట్లు కొడుతూ నవ్వుతూ దాని నోట్లోకి ప్రవేశించారు. మృత్యుముఖం లోకి వెళ్ళిన గోపబాలురను రక్షించాలని కృష్ణుడు 'నా భక్తులు పాపముఖంలో పడినా సరే అక్కడి నుండి వాళ్ళను రక్షించడమే నా కర్తవ్యం' అని నిశ్చయించుకున్నాడు. అప్పుడు కృష్ణుడు అజగర రూపంలో ఉన్న ఆ అసురుడి నోటిలోకి ప్రవేశించి, అతణ్ణి సంహరించి గోపబాలురతో సహా బయటకు వచ్చాడు. వెంటనే అజగర శరీరం నుండి ఒక జ్యోతి బయటకు వచ్చి కృష్ణునిలో లీనమైంది.

అఘాసురుడి ఘట్టం నుండి మనం గ్రహించాల్సింది ఏమిటంటే పాపాత్ముడైన వాడి ఇంటికి భక్తుడు వెళ్ళాడంటే అతణ్ణి కాపాడడానికి భగవంతుడు కూడా అతని వెంటే వెళతాడు. అలా భగవంతుడే స్వయంగా వెళ్ళాడంటే అతని చరణ స్పర్శ వల్ల ఎంతటి పాపాత్ముడైనా పునీతుడై ముక్తిని పొందుతాడు. ❖

(ఆగష్టు 28వ తేదీన 'శ్రీకృష్ణ జన్మాష్టమి')

గోపికల ప్రేమ వర్ణనాతీతం. సామాన్య మానవులకది అర్థం కాదు. గోపికల దృష్టిలో కృష్ణుడు తప్ప ప్రపంచమంతా వారికి శూన్యం. కృష్ణునితో బంధాన్ని పెంచే ప్రేమే వారికి సర్వస్వం. - స్వామి వివేకానంద



సమచిత్తం... సమదృష్టి

– స్వామి జ్ఞానదానంద

భగవాన్ రమణ మహర్షి ఆశ్రమంలో ఒకసారి భక్తుల మధ్య వివాదం పొడసూపింది. చాలా కాలంగా అక్కడకు వస్తున్న భక్తులకూ, అప్పుడప్పుడే ఆశ్రమాన్ని సందర్శిస్తున్న భక్తులకూ మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో భక్తుల్లో రెండు వర్గాలు బయలుదేరి, ఒకరంటే మరొకరికి పడని పరిస్థితి ఏర్పడింది. పాతభక్తులు, కొత్తభక్తులు అనే విభజనను సృష్టించుకునే దాకా వచ్చింది. పాత భక్తులుగా కొందరు, కొత్త భక్తులుగా మరికొందరు రెండు వర్గాలుగా విడిపోయి, ఏ మాత్రం సమయం చిక్కినా విమర్శించుకోవడం మొదలుపెట్టారు. ఇది భగవాన్ రమణులు గమనించారు.

ఒకరోజు సాయంత్రం రమణ మహర్షి గిరి ప్రదక్షిణకు బయలుదేరారు. భక్తులందరూ ఆయనను అనుసరిస్తున్నారు. ఇంతలో ఆశ్రమంలో ఎప్పటి నుంచో ఉంటున్న కొన్ని కుక్కలు, బయటి కుక్కలను చూసి మొరగసాగాయి; వాటిని లోపలకు రానీయకుండా తరుముతూ ఉన్నాయి. అవి కూడా వీటిని చూసి తీవ్రంగా మొరుగుతున్నాయి. అప్పుడు రమణమహర్షి ఆ దృశ్యాన్ని చూసి 'పాపం! కుక్కలు కదూ! తామంతా ఒకటేనని తెలియక మూర్ఖత్వంతో పాతవి, కొత్తవిగా విడిపోయి అరుచుకుంటూ అలసిపోతున్నాయి!' అని అంటూ ముందుకు సాగిపోయారు.

అంతే! ఆ రోజు నుంచి ఆశ్రమంలో భక్తుల నోరు మూతపడింది. ఆశ్రమాల్లోనే కాదు లౌకిక సమాజంలో కూడా మన వారు, పరాయివారు అనుకునే ఈ సంకుచిత మనస్తత్వం మనల్ని సాధారణస్థాయికి దిగజారుస్తుంది; ఆ సర్వేశ్వరుడి నుంచి దూరం చేస్తుంది. అదే భావంతో ఆది శంకరాచార్యుల శిష్యులు మేధాతిథి సమచిత్తం, సమదృష్టి ప్రాధాన్యాన్ని వివరిస్తూ 'భజ గోవిందం' ప్రబోధంలో...

శత్రౌ మిత్రే పుత్రే బన్ధౌ మా కురు యత్నం విగ్రహ సన్ధౌ।
భవసమచిత్తఃసర్వత్రత్వం వాంఛస్య చిరాద్యది విష్ణుత్వమ్ ॥

'శత్రువులతో విభేదాలను పెంచుకోవడం, పుత్ర మిత్ర బంధువులంటూ పక్షపాతం చూపడం సరి కాదు. సర్వాంతర్యామి అయిన పరమేశ్వరుడిని చేరుకోవాలంటే అందరి పట్ల సమదృష్టిని కలిగి ఉండమంటు'న్నారు.

మనవారెవరు? పగవారెవరు?: మనస్సును విశాలం చేసుకున్న వ్యక్తికి మనవారు, పరాయివారు అంటూ మనుష్యులు వేరుగా కనిపించరు. కానీ దురదృష్టవశాత్తూ ఆధునిక సమాజంలో నాగరకులమని చెప్పుకుంటున్న మనం చాలా చోట్ల పరిధులు గీసుకొని బతికేస్తూ ఉన్నాం. అందరమూ ఒకే ఆత్మ ధరించిన వివిధ రూపాలన్న శాశ్వతసత్యాన్ని మరచిపోతున్నాం. అంత స్థాయిలో అద్వైతమూర్తులుగా జీవించలేకపోయినా, కనీసం అధమస్థాయికి దిగజారకుండా, సాటిమనిషితో సాదరంగా మసలుకోగలిగినా చాలు! కానీ నేడు ఈ సమదర్శిత్వం లోపించడం వల్లనే మనస్సు క్షణక్షణానికి అశాంతితో అల్లాడిపోతోంది. పైగా ఎదుటివారు ఎంత పెద్ద కష్టంలో ఉన్నా సరే మన మనస్సు కరగకపోవడం, మనకు కలిగిన ప్రతి చిన్న కష్టానికీ ఎదుటివారి నుంచి సానుభూతి ఆశించడం అలవాటుగా మారిపోయింది. అందుకే శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలోని పన్నెండో అధ్యాయమైన 'భక్తియోగం'లో... *(12-18,19)*

సమ శ్శత్రౌ చ మిత్రే చ తథా మానావమానయోః ।
శీతోష్ణ సుఖదుఃఖేషు సమ స్సంగ వివర్జితః ॥
తుల్య నిందాస్తుతి ర్మౌనీ సంతుష్టో యేన కేనచిత్ ।
అనికేతః స్థిరమతిః భక్తిమా న్మే ప్రియో నరః ॥

'మిత్రుల యందును, శత్రువుల యందును, అలాగే మానావమానాలు, శీతోష్ణాలు, సుఖదుఃఖాలు, నిందాస్తోత్రాలు తదితర ద్వంద్వాలలో సమబుద్ధి కలిగి, సంగము లేక ఆసక్తిని వీడి లభించిన దానితో సంతృప్తిపడుతూ మౌనియై, స్థిరమైన నివాసం లేక – అంటే గృహంపై నాది అనే భావం లేక – స్థిరచిత్తుడై ఉంటాడో అతడు నాకు ప్రియమైనవాడు' అని

అంటాడు. ఈ రోజు మనిషి జీవనశైలిలో అలజడి, ఆందోళన, ఆశ నిరాశలు పెరిగిపోవడానికి ఇలాంటి సమచిత్తం లోపించడమే ప్రధాన కారణం.

పరిమితిని మించిన ప్రణాళికలు: ఈ రోజు సమాజంలో అవినీతికీ, ఆశ్రిత పక్షపాతానికీ ప్రధాన కారణం మనలోని లోభత్వం, స్వార్థపరత్వం. 'ఎంతటి సంపద లైనా నాకే దక్కాలి; నా వారే తినాల'నే దురాశ చాలామందిని కన్నూ మిన్నూ కానకుండా తప్పటడుగులు వేయిస్తోంది. మనకు కాకుండా ఇతరులకు ఏ మాత్రం దక్కినా అసూయతో రగిలిపోయేలా చేస్తోంది. వారూ మన లాంటి మనుష్యులే! వాళ్ళకూ సంతోషంగా, సౌభాగ్యంగా ఉండే హక్కు ఉందని ఎందుకు అర్థం చేసుకోలేకపోతున్నాం? వాళ్ళూ సుఖపడాలని ఎందుకు ఆశించలేకపోతున్నాం? అడవిలో జంతువులు కూడా వేటాడి సంపాదించుకున్న ఆహారాన్ని తమ కడుపు నిండిన తరువాత, మరో జంతువుకు వదిలేస్తాయి; కానీ మనిషి ఒక్కడే ఆకలి తీరిన తరువాత కూడా అన్నాన్ని దాచుకుంటూ పరమ లోభిగా ప్రవర్తిస్తాడు. తనకు పదెకరాలున్నా, పక్కవాడు పదిసెంట్లు స్థలం కొనుక్కుంటే ఈర్ష్యతో ఉడికిపోతూ ఉంటాడు. ఇలాంటి దౌర్భాగ్యపు మనస్తత్త్వం వల్లనే, కనీ వినీ ఎరుగని అనర్థాలు కలుగుతున్నాయి. అయినా ఎంత కాలమీ ఆస్తిపాస్తులు! అందుకే ధర్మపురి నరసింహ శతకకర్త...

లక్షాధికారైన లవణమన్నమె కాని
మెరగు బంగారంబు మింగబోడు
విత్తమార్జన చేసి విర్రవీగుటె కాని
కూడబెట్టిన సొమ్ము కుడువబోడు.. అంటారు. పైగా పరిమితిని మించిన ప్రణాళికలు ప్రశాంతతను హరించివేస్తాయి. అలా అని కళత్ర పుత్ర మిత్ర బాంధవ్యాల విషయంలో బాధ్యతా రహితంగా వ్యవహరించమన్నది జగద్గురువుల ఉద్దేశం కాదు. కానీ వారే ప్రపంచంగా బతుకుతూ, వాళ్ళ తోటిదే లోకమనుకుంటూ భగవంతుడి మార్గాన్ని విస్మరించకూడదంటారు.

మాయ....దయ: ప్రాపంచికమైన మాయ నుంచి బయటపడి భగవంతుడికి దగ్గర కావడమే మనిషి పరమలక్ష్యమనేవారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. 'నా భార్య, నా పిల్లలు, నా వారు' అనుకుంటూ కొందరికే నీ ప్రేమ పరిమితమైతే నీవు మాయలో ఉన్నట్లేననీ; అలా కాకుండా అందరూ తనవారే అని ప్రేమించగలిగితే అదే దయ అనీ; అలాంటి దయాగుణంతో పరమాత్ముడికి చేరువ కమ్మనీ వారు చెప్పేవారు. అలాంటి దయాశీలే ప్రపంచాన్ని సమదృష్టితో చూడగలడు.

మాకు తెలిసిన ఓ డాక్టర్ ఉన్నారు. ఆవిడ పిల్లలందరూ అమెరికాలో ఉంటారు. భర్త కన్నుమూశారు. ఆవిడ ఒక్కరే ఇక్కడ ఉంటారు. కానీ పిల్లలపై పెద్దగా బెంగపడరు. రోగులకు ఉచితంగా వైద్యం చేస్తూ, ఆధ్యాత్మిక సాహిత్యాన్ని చదువుకుంటూ, ఇంట్లోని పనిమనిషి పిల్లల్లోనే తన మనవళ్ళను, మనవరాళ్ళను చూసుకుంటూ ఆనందంగా గడిపేస్తూ ఉంటారు. వాళ్ళను చదివిస్తూ, వాళ్ళ ఆలనాపాలనకు సాయపడుతూ, ఆ పిల్లలు 'అమ్మమ్మ' అని పిలుస్తూ ఉంటే మురిసిపోతూ ఉంటారు. కానీ మనలో చాలా మంది జీవనమలిసంధ్యలో కూడా ఉన్నదాన్ని నలుగురితో పంచుకొని, వ్యామోహాలకు దూరంగా, ప్రియాప్రియాలకు అతీతంగా స్థితప్రజ్ఞులుగా ఉండలేరు. దేన్నీ వదులుకోవడానికి ఇష్టపడరు.

> **అందరితో సమత్వంతో ప్రవర్తిస్తూ, తమ తమ ధర్మాలను తప్పకుండా భగవంతుణ్ణి నమ్ముకొని ఉండేవారు సజ్జనులు. సూర్యోదయంతో దట్టమైన చీకటి విడిపోయినట్లు అలాంటి వారికి బంధం విడిపోయి ఆనందం లభిస్తుంది.**
> **- శ్రీమద్భాగవతం**

అందుకే రామాయణంలోని సుందరకాండలో సీతాదేవి...

ప్రియాన్న సంభవే దుఃఖమ్, అప్రియా దధికం భయమ్ ।
తా భ్యాం హి యే వియుజ్యంతే నమస్తేషాం మహాత్మనామ్ ॥

'ప్రియం ప్రాప్తించినప్పుడు దుఃఖం కలుగదు; అంటే సుఖం కలుగుతుంది. అప్రియమైంది ఎదురైనప్పుడు మిక్కిలి భయం కలుగుతుంది. ఇది సామాన్యుల లక్షణం. ఈ ద్వంద్వాలకు అతీతమైనవారు మహాత్ములు. అట్టివారికి నా నమస్కారమ'ని వందనాలర్పిస్తుంది.

ఎవరిపై ప్రతీకారం?: మనలో మరో పశులక్షణం ప్రతీకార వాంఛ. మనకు అపకారం చేసిన వ్యక్తుల విషయంలో కూడా సంయమనంతో మెలిగేందుకే ప్రయత్నించాలి; క్షమాగుణంతో మరచిపోవాలి. సహజంగా ప్రతీకారం తీర్చుకోమనే మనస్సు ప్రేరేపిస్తుంది. కానీ అందుకు విరుద్ధంగా మనలోని దైవత్వాన్నే గెలిపించాలి. "మనం ప్రతిచర్యకు పూనుకోవాలని ప్రకృతి ప్రేరేపిస్తుంది. దెబ్బకు దెబ్బతీయమని ప్రోత్సహిస్తుంది. మోసానికి మోసంతో, మాటకు మాటతో శక్తి కొద్దీ సమాధానం చెప్పమంటూ రెచ్చగొడుతుంది. కానీ ఈ ప్రతీకార వాంఛను అదుపు చేసి, నిగ్రహాన్ని కనబరచడానికి దివ్యమైన గొప్ప శక్తి కావాలి" అంటారు స్వామి వివేకానంద.

నాలుక కొరుక్కున్నామని పళ్ళను పీకేసుకోలేం కదా! అలాగే కష్టపెట్టిన వారిని కూడా క్షమించగలగాలి. ఎదుటివారు కలిగించే బాధలను భగవంతుడు మనకు పెట్టిన పరీక్షలుగా భావించుకోవాలి. సహనంతో ఆయన మెప్పు పొంది నూటికి నూరు మార్కులు వేయించుకునేందుకు ప్రయత్నించాలి. కత్తులు నూరే వ్యక్తి పట్ల కూడా కష్టాల్లో ఉన్నప్పుడు కరుణ చూపగలిగిన వారి పక్షానే భగవంతుడుంటాడు. అందుకే గౌతమబుద్ధుడు...

న హి వైరేణ వైరాణి శామ్యన్తీహ కదాచన
అవైరేణ చ శామ్యన్తి ధర్మ ఏష సనాతనః...

'ఈ లోకంలో వైరాలు ఏనాడూ వైరాల చేత శమించవు. అవైరం చేతనే, మైత్రీభావం చేతనే శమిస్తాయి. ఇది సనాతనధర్మం. శాశ్వతమైన నియమమ'ని బోధిస్తాడు. భజగోవిందమే కాదు భగవద్గీత చెప్పినా, బైబిల్ చెప్పినా అదే! ❖

అమితమైన కర్తవ్య నిర్వహణల నడుమ, బంధాలకు అతీతంగా ప్రశాంతతతో వ్యవహరించడం సాధ్యమేనని శ్రీకృష్ణుడు నిరూపించాడు. ఆయన జీవితం నిరాపేక్ష తత్త్వాన్ని ప్రబోధిస్తుంది. - స్వామి వివేకానంద



సద్గుణ శీలుడే సదా స్మరణీయుడు

– హేమంత్ కుమార్

ఏ సంబంధ బాంధవ్యం లేకుండా సర్వులూ ఒక వ్యక్తిని ఎందుకు ఆరాధిస్తారు? రూపలావణ్యాలనూ, ఐశ్వర్యాన్నీ చూశా? అధికార బలాధిక్యతలను చూశా? కాదు. అతనిలోని సద్గుణాలను చూసి! సద్భావనలను చూసి!! నిస్వార్థంగా, నిష్కామంగా లోక కల్యాణకారకమైన గుణాలతో విరాజిల్లే వ్యక్తి స్వచ్ఛందంగా లోకారాధ్యుడవుతాడు. స్వామి వివేకానంద అలాంటి పునీతుల్లో అగ్రగణ్యులు. గురువైన రామకృష్ణుల కంటే ఎక్కువ ప్రాచుర్యం లోకి వచ్చిన స్వామీజీలో సర్వజనులనూ ఆకర్షించిన ఆ గుణమేది? అవతార వరిష్ఠులైన రామకృష్ణుల ఆధ్యాత్మికత మహోత్కృష్టమైనదే అయినా నాస్తికులకూ, భక్తియోగం పట్టని నిర్భాగ్యులకూ ఆయన అపరిచితులే.

స్వామీజీ పరమ భాగవతోత్తముడే కాక మహా దేశభక్తుడు. గొప్ప మానవతావాది కూడా! దేశభక్తి అనేది దైవభక్తితో సంబంధం లేకుండా అందరినీ ఆకర్షించే గుణం. అందరిలోనూ అంతో ఇంతో అంతర్లీనంగానో, అజ్ఞాతంగానో ఉండే గుణం. భారతదేశపు పవిత్రత పట్ల ఆయనకు ఎంత ఆరాధనో, భారతదేశంలోని పేదప్రజల పట్ల అంత ఆవేదన. ప్రజలను ప్రేమించే వ్యక్తిని ప్రజలు ప్రేమించకుండా ఎలా ఉంటారు? దేశమంటే ప్రజలే మరి! నిజానికి స్వామీజీ ప్రత్యేకంగా ఎవరి ప్రేమ కోసమో, ఎవరి ప్రశంసల కోసమో దేశాన్ని గానీ, ప్రజల్ని గానీ ప్రేమించలేదు. మనల్ని మనం ఎవరి కోసమో ప్రేమించం. మన శరీరం పట్ల ఎవరి ప్రాపకం కోసమో శ్రద్ధ వహించం. నిజమైన మానవుడు ప్రతి జీవినీ తానే అనీ, తన ప్రతిబింబమే అనీ భావిస్తాడు. ఆత్మభావన స్థితులై వున్న మహాత్ములు స్వామీజీ. ప్రపంచరూప పరమాత్మను ప్రేమించకుండా, సేవించకుండా ఎలా ఉంటారు?

భగవంతుడు మనకు జీవితాన్నిచ్చాడు. అన్ని హంగులు, వనరులు ప్రసాదించాడు. వాటిని వినియోగించుకుంటూ మనం మానవులుగా జీవించాలి. మహనీయులుగా ఎదగాలి. మనకిచ్చిన జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మనం హీన జాతిగా నిరసించే పశువులు కూడా పలు రకాలుగా లోకానికి ఉపయోగపడుతున్నాయి. ఈ జన్మను సార్థకం చేసుకుని ఉన్నతస్థాయి జన్మలకు పునాది వేసుకుంటున్నాయి. కానీ, ఉన్నత, ఉత్తమ జాతిలో జన్మించి కూడా మనలో చాలా మందిమి పశుతుల్యంగా (ఒక రకంగా అంతకంటే హీనంగా) బ్రతుకుతూ, జన్మించిన జాతికే తలవంపులు తెస్తున్నాం. ఇది కాదు జీవితం. ఇది కాదు మానవత్వం. మామిడి చెట్టుకు ఉమ్మెత్త కాయలు కాస్తే ఎలా ఉంటుంది? తులసి మొక్కకు గంజాయి గింజలు పండితే ఎలా ఉంటుంది? మనం మానవులం. బ్రహ్మకు బెత్తెడు దూరంలో మాత్రమే ఉన్నవాళ్ళం. శ్రీరామకృష్ణులు, వివేకానందుడు, శిబి చక్రవర్తి, హరిశ్చంద్రుడు, భీష్ముడు, గాంధీజీ... వీళ్ళంతా మన జాతిలోనివారే. మన పెద్దలే. వాళ్ళ దేశాన్ని పంచుకుంటున్నాం. వాళ్ళ ఆస్తుల్ని పంచుకుంటున్నాం. వాళ్ళ కీర్తి ప్రతిష్ఠల్ని వాడుకుంటున్నాం. మరి వారి సుగుణాల్ని? వారి సుప్రతిష్ఠిత స్వభావాల్ని? వారి సంస్కృతీ పరంపరల్ని? మన వేదాలు చెప్పాయి – వాక్కుకు సత్యమే భూషణమని! ధనానికి దానమే సద్వినియోగమని! కర్మలకు సత్కర్మలే ఉద్దేశమని! కాబట్టి, మనది వేదభూమి అని గర్వంగా చెప్పుకోవడం కాదు. ఎంత వరకు వేద విహితంగా జీవిస్తున్నామన్నది ఆలోచించాలి.

రాముడు నడయాడిన భూమిని రావణకాష్ఠం చేస్తున్నాం. ఆశలు ఎవరికి ఉండవు? కష్టాలు ఎవరికి రావు? ఇబ్బందులను ఎవరు ఎదుర్కోరు? మనకు వచ్చే కష్టాలు చాలావరకు మన స్వయంకృతాపరాధాలు. కానీ రాముడు? హరిశ్చంద్రుడు? శిబి? వాళ్ళంతా ధర్మానికై, సత్యానికై, పరోపకారానికై నిలిచినవారు. ఆశయ సాధనకై ఆపదలను ఆహ్వానించినవారు. ఆవాహన చేసుకున్నవారు. స్వామి వివేకానంద గొప్ప భక్తుడు. తిరుగులేని సాధకుడు. అయినా తన సొంత సాధనకే అంకితం కాలేదు. సొంత ముక్తి దగ్గరే ఆగిపోలేదు. లోకంలోని చివరి జీవి ముక్తి పొందే వరకూ తన ముక్తిని వాయిదా వేసుకుంటానన్న గొప్ప మానవతావాది ఆయన. అలా విశ్వ కల్యాణానికై నిలబడినవాడే నిజమైన మానవుడు. నిజమైన మానవుడే.... మాధవుడు. ❖



వివేకానంద సూక్తి సుధ

తాత్కాలికా ఇమే భోగా జీవితం క్షణభంగురమ్ ।
యో జీవతి పరస్యార్థే ప్రశస్తం తస్య జీవనమ్
జీవన్తోఽప్యవశిష్టాస్తు మృతైస్తుల్యా ఇతి స్మృతాః ॥

మనం అనుభవించే ఈ భోగాలు తాత్కాలికాలు. ఈ జీవితం క్షణభంగురం. ఎవడు ఇతరుని కొరకై జీవిస్తాడో వాని జీవితమే ప్రశస్తమైనది. తదితరులు జీవించి ఉన్నా మరణించినవారిగానే పరిగణింపబడతారు.

స్వతంత్రతాం పరేభ్యో యో దాతుం నేచ్ఛతి మానవః ।
స కిం యోగ్యో భవేద్భోక్తుం స్వయమత్ర స్వతంత్రతామ్॥

ఇతరులకు స్వతంత్రత నివ్వడానికి అంగీకరించని మనుజుడు తాను స్వతంత్రతను అనుభవించడానికి యోగ్యుడవుతాడా?

అసంశయం గతః కాలో శ్రేష్ఠ ఇత్యేవ భావ్యతామ్ ।
పరన్త్వాగామికాలస్తు భవిష్యతి మహోజ్జ్వలః ॥

ఇతి మే దృఢవిశ్వాసః క్షమాం స్థైర్యం పవిత్రతామ్ ।
స్థిరీ కరోతు భగవాన్ శంకరోఽస్మాసు సర్వదా ॥

గతించిన కాలం నిస్సంశయంగా శ్రేష్ఠమైనదే అని భావించండి! కానీ రాబోయే కాలం ఇంకా మహోజ్జ్వలంగా ఉండగలదని నా దృఢమైన విశ్వాసం. మహాశివుడు మనలో ఓర్పునూ, స్థిరత్వాన్నీ, పవిత్రతనూ స్థిరీకరించు గాక!

జీవన్తి పరమ ప్రేమమూర్తయో నాన్యమానవాః ।
దరిద్రాః పీడితా జ్ఞాన విహీనా స్సన్తి యే జనాః ॥

తేషాం కృతే పరీతాప మార్తిం భజత వేదనామ్ ।
తతః ప్రపన్నా భవత భగవత్పాద పద్మయోః ॥

తదా శక్తిం చ సాహ్యం చ మహోత్సాహ మవాప్స్యథ ।
హే మద్వత్సా! న భేతవ్యం ధైర్యం న త్యాజ్యమేవ చ ॥

పరమ ప్రేమమూర్తులైనవారే జీవించువారు, తదితరులు కారు. దరిద్రులు, పీడితులు, జ్ఞానహీనులు అయిన జనుల కొరకు పరితాపం చెందండి! ఆర్తి పొందండి! వేదనను అనుభవించండి! ఆ తరువాత భగవంతుని పాదపద్మాల చెంత శరణాగతులు కండి! అప్పుడు మీరు శక్తినీ, సహాయాన్నీ, గొప్ప ఉత్సాహాన్నీ పొందగలరు. నా వత్సలారా! భయపడవద్దు. ధైర్యం వదలవద్దు. ❖

రచన: డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య

స్వామి వివేకానంద క్విజ్

1. విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్, స్వామీజీని ఎప్పుడు, ఎక్కడ కలుసుకున్నారు?
2. స్వామీజీ, నీలాంబర ముఖర్జీ ఉద్యానగృహంలో ఉన్నప్పుడు శ్రీరామకృష్ణులపై రచించిన రెండు స్తోత్రాలు ఏవి?
3. రామకృష్ణ మఠం బెంగాలీ మాసపత్రిక 'ఉద్బోధన్'ను మొదటిసారిగా ఎప్పుడు ప్రచురించారు? తొలి సంపాదకులు ఎవరు?
4. స్వామీజీ కలలు గన్న అద్వైత ఆశ్రమాన్ని ఎప్పుడు, ఎక్కడ స్థాపించారు?
5. స్వామీజీ రెండవసారి పాశ్చాత్య దేశాలకు ఎప్పుడు బయలుదేరి వెళ్ళారు?
6. శాన్‌ఫ్రాన్సిస్కో (అమెరికా)లో వేదాంత సొసైటీని ఎప్పుడు స్థాపించారు?
7. క్యాలిఫోర్నియా (అమెరికా)లో 'శాంతి ఆశ్రమం' స్థాపన ఎప్పుడు జరిగింది? దానికి సహాయం చేసిన వారెవరు?
8. స్వామీజీ రెండవసారి (చివరిసారిగా) పాశ్చాత్య పర్యటన ముగించుకొని భారతదేశానికి ఎప్పుడు వచ్చారు?
9. రామకృష్ణ మఠం, మిషన్‌ల చిహ్నాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎవరు చిత్రీకరించారు?
10. రామకృష్ణ మఠం, మిషన్‌ల చిహ్నానికి స్వామీజీ ఇచ్చిన వివరణ ఏమిటి?
11. 1901 డిసెంబర్‌లో కలకత్తాలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరైన ప్రముఖులలో స్వామీజీని కలుసుకున్న వారెవరు?
12. జపాన్ సందర్శించమంటూ స్వామీజీని ఆహ్వానించిన ప్రముఖ జపనీయులు ఎవరు?
13. స్వామీజీచే స్ఫూర్తి పొందిన కొంత మంది యువకులు 1900 జూన్‌లో వారణాసిలో ఏర్పాటు చేసిన సంఘం ఏమిటి? దానికి స్వామీజీ ఏమని నామకరణం చేశారు?

(జవాబుల కోసం 30వ పేజీ చూడండి)

ఔజ్వల్యమైన నిస్వార్థ ప్రేమ కలవారే లోకానికి అవసరం. ఎవరి వ్యక్తిత్వం ఉన్నతంగా ఉంటుందో, ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా ఒకే రీతిలో ఉంటుందో అతడే నిజమైన మహాత్ముడు. - స్వామి వివేకానంద



మనస్సు పవిత్రమయ్యేదెలా?

- స్వామి యతీశ్వరానంద*

మనం అనంతమైన సుఖాన్నీ, అనంతమైన ప్రేమనూ, అనంతమైన ఆనందాన్నీ కోరుకుంటాం. కానీ వచ్చిన చిక్కేమిటంటే, అనిత్యమైన విషయాలలో ఆనందాన్ని పొందడానికి మనం ప్రయత్నిస్తాం. వాటిలో అది మనకు దొరకనప్పుడు నిరాశ చెందుతాం.

'మీకు అఖండమైన ఆనందం కావాలంటే, మీరు అనంతత్వాన్ని చేరుకోవాలి!' అని గురువు బోధించాడు. అప్పుడు నారదుడు, 'అనంతత్వం అంటే ఏమిటి?' అని ప్రశ్నించాడు. "అదే సర్వవ్యాపకమైన సత్యం. అది – క్రిందా, పైనా, కుడి వైపునా, ఎడమ వైపునా – ఎల్లెడలా ఉంది. దాన్ని పొందిన తర్వాత నీవు దేనినీ చూడవలసిన, వినవలసిన, తెలుసుకోవలసిన పని లేదు. అదే అనంత చైతన్యం" అని గురువు సమాధానమిచ్చాడు *(ఛాందోగ్యోపనిషత్తు)*. కానీ దాన్ని పొందేదెలా? మనం ఉన్న ప్రస్తుత పరిస్థితులలో ఒక్క ఉదుటున, దాన్ని చేరుకోవడానికి అడ్డుపడేదెవరు? దీన్ని వివరిస్తూ ఆ సనాతన గురువు సనత్కుమారుడు ఆధ్యాత్మిక సాధనలోని సారాన్ని రెండుముక్కల్లో చెప్పాడు.

ఆహార శుద్ధౌ సత్త్వ శుద్ధిః సత్త్వశుద్ధౌ ధ్రువా స్మృతిః ।
స్మృతి లమ్భే సర్వ గ్రన్థీనాం విప్రమోక్షః ॥ *(ఛాందోగ్యోపనిషత్తు)*

మనం తీసుకునే ఆహారం పవిత్రమైనప్పుడు, మన మనస్సు పవిత్రమవుతుంది. మన మనస్సు పవిత్రమైనప్పుడు, మన జ్ఞాపకశక్తి స్థిరమవుతుంది. అంటే మనం మన నిజస్వభావమైన ఆత్మను ఎల్లవేళలా మనస్సులో ఉంచుకుని, ఆధ్యాత్మిక చైతన్యంలో నిలదొక్కుకుంటాం. ఇది మన హృదయగ్రంథులను త్రెంచివేసి, ముక్తికి దారితీస్తుంది.

మనం లోనికి తీసుకునే దానికి ఆహారమని పేరు. అంటే నోటితో తినే ఆహారం మాత్రమేనా? శాకాహారం మాత్రమే సాత్త్వికమైన ఆహారమా? అసలు ఆ ఆహారం మనకు ఎంతవరకూ సహాయపడుతుంది? మన కడుపుల్ని సాత్త్వికాహారంతో నింపగానే సరిపోదు, మనలోని విషస్వభావాన్ని వదిలించుకోవాలి. అందుచేతనే ఆది శంకరాచార్యులు పై శ్లోకం మీద ఇలా వ్యాఖ్యానించారు:

"ఆహారమంటే లోపలకు తీసుకోబడేది అని అర్థం. అంటే చెవులతో వినే శబ్దాలు, కంటితో చూచే దృశ్యాలు మొదలైనవన్నీ ఆహారమని అర్థం. జీవుడు తనకు కలిగే వివిధ అనుభూతుల ద్వారా వాటిని లోపలకు తీసుకుంటాడు. ఎప్పుడు ఈ ఇంద్రియార్థాల గురించిన ఈ గ్రాహకశక్తి పవిత్రమవుతుందో, ఎప్పుడు దానికి ద్వేషం, అనురాగం, భ్రమ మొదలైనవన్నీ తొలగిపోతాయో, అప్పుడు అటువంటి శుద్ధమైన గ్రాహకశక్తి కలిగిన మనిషి యొక్క లోపలి స్వభావం పరిశుద్ధమవుతుంది." *(ఛాందోగ్యోపనిషత్తు)*

మీరు జపాన్ వారి మూడు కోతుల బొమ్మల్ని చూసి ఉండవచ్చు. అందులో ఒక కోతి తన చేతులతో తన రెండు కన్నులనూ మూసుకొని ఉంటుంది. మరో కోతి తన రెండు చెవులనూ, ఇంకొకటి తన నోటినీ మూసుకొని ఉంటాయి. నేను ఐరోపాలో ఉన్నప్పుడు, స్విట్జర్లాండ్‌లోని ఒక సరస్సు ఒడ్డున రాతి మీద చెక్కిన ఒక బొమ్మను చూశాను. దాని మీద కూడా మూడు కోతులున్నాయి. అయితే ఒక తేడా ఉంది. అవి ఒక కంటినీ, ఒక చెవినీ, నోటిలో సగభాగాన్ని మాత్రమే మూసుకుని ఉన్నాయి. ముందు నేను వాటిని చూసి ఆశ్చర్యపోయాను. కానీ ఒక్క క్షణంలో వాటి అర్థమేమిటో నాకు స్ఫురించింది. "చెడును చూడకుండా మంచిని చూడు. చెడును వినకుండా మంచిని విను. చెడును మాట్లాడకుండా మంచినే మాట్లాడు!" అని దాని అర్థం. ముందు నేను అది ఆ శిల్పి సొంత భావం అని అనుకున్నాను. కానీ నా మనస్సుకు అప్పుడు ఋగ్వేదంలో చెప్పబడిన ఒక ప్రార్థన గుర్తుకు వచ్చింది.

భద్రం కర్ణేభిః శృణుయామ దేవాః భద్రం పశ్యేమాక్షభిర్యజత్రాః ।
స్థిరైరంగై స్తుష్టువాగ్ం సస్తనూభిః వ్యశేమ దేవహితం యదాయుః ॥
(ఋగ్వేదం 1.89.8)

"ఓ దేవతలారా! మేము మా చెవులతో పవిత్రమైన విషయాలనే వినెదము గాక! మేము మా కన్నులతో పవిత్రమైన విషయాలనే చూచెదము గాక! మేము మీ మహత్తులనే కీర్తించెదము గాక! ఈ బలమైన శరీరంతో, బలమైన అవయవాలతో దేవతలు మాకిచ్చిన జీవితంలో సుఖింతుము గాక!"

దేవుడిచ్చిన నోటిని సద్వినియోగం చేసుకోండి. దుర్భాషలాడి దాన్ని దుర్వినియోగం చేసుకోకండి. భగవన్నామాన్ని స్మరించండి. అలా కొంతకాలం సాధన చేసిన తరువాత మనస్సు పవిత్రమవుతుంది. ఆ పైన మీ ఇష్టదేవతా సాక్షాత్కారం కలుగుతుంది. ❖

(*స్వామి యతీశ్వరానంద – శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానంద మహారాజ్ శిష్యులు)



అన్నమయ్య పదామృతం

చందమామ రావో జాబిల్లి రావో...

- శ్రీమతి బి.కృష్ణకుమారి

చందమామ రావో జాబిల్లి రావో
మంచి కుందనపు పైడికోర వెన్నపాలు తేవో
నగుమోము చక్కనయ్యకు నలువ పుట్టించిన తండ్రికి
నిగమములందుండే అప్పకు మా నీలవర్ణునికి
జగమెల్ల ఏలిన స్వామికి చక్కని ఇందిర మగనికి
ముగురికి మొదలైన ఘనునికి మా ముద్దుల మురారి బాలునికి
తెలిదమ్మి కన్నులమేటికి మంచి తియ్యని మాటలగుమ్మకు
కలికిచేతల కోడెకు మా కతలకారి ఈ బిడ్డకు
కులముద్ధరించిన పట్టెకు మంచి గుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండవొయ్యారికి
నవనిధుల చూపుల చూచె సుగుణునకు
సురల గాచిన దేవరకు చుంచు గరుడనెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు మా నీటు చేతలపట్టికి
విరుల వింటివాని అయ్యకు వేవేలు రూపుల స్వామికి
సిరిమించు నెరవాది జాణకు మా శ్రీవేంకట నాథునికి

పున్నమి చంద్రుడు... పండువెన్నెల అనగానే భక్తుడి మనస్సు బృందావనానికి పరుగెడుతుంది. యమునాతీర నికుంజాలూ, ఇసుకతిన్నెలూ, వేణునాదమూ, యశోదమ్మ గారాబమూ, గోపికల అన్వేషణమూ స్ఫురించి, స్వామి పాద ముద్రల కోసం పరితపిస్తుంది. పగడాల్లాంటి ఆ పసిడిపాదాలకు కట్టిన మువ్వల సవ్వడిని వినాలని ఉవ్విళ్ళూరుతుంది. అలాంటి భక్త్యావేశంతోనే పదకవితా పితామహుడి మనస్సు కూడా బృందావనానికి పరుగులు తీసింది. యశోదాదేవిలా మారి బాలకృష్ణుని భుజాని కెత్తుకొని, పూర్ణచంద్రుడిని చూపుతూ, పాలబువ్వను తినిపిస్తూ, బంగారుగిన్నెలో వెన్నపాలు తెమ్మని ఆ వెన్నెలకు విన్నపాలూ చేసింది. అపురూపమైన ఆ అమ్మ ప్రేమను నవనీతం లాంటి పదాలతో ఆ నెలరాజు ముందు ఆవిష్కరించాడు అన్నమయ్య. **'చందమామ రావో...జాబిల్లి రావో'** అంటూ ఆహ్వానించాడు. ఆకతాయి పిల్లాడిలా అల్లరికృష్ణుడూ అన్నం తిననని మారాం చేశాడు. అందరి తల్లుల్లా ఆ యశోదమ్మ కూడా ఆరుబయట వెన్నెల్లో ఆకాశంలోని చందమామను చూపి బుజ్జగిస్తూ, ఆ చిలిపికృష్ణుడి చిన్ని బొజ్జను నింపే ప్రయత్నం చేసింది. తన ముద్దుల బిడ్డడి సుద్దుల్ని రేరాజుకు వివరించింది. ఆ సుందర సన్నివేశాన్ని వర్ణిస్తూ, అన్నమయ్య తన పదాల పల్లకీలో మనల్నీ ఆ బృందావనంలో విహరింపజేస్తున్నాడు.

వెన్నపాలు తెమ్మని విన్నపాలు...

క్షీరసాగరంలో లక్ష్మీదేవి తరువాత చంద్రుడు పుట్టాడు. అంటే లక్ష్మీదేవికి చంద్రుడు తమ్ముడు. ఆ మహాలక్ష్మి మనందరికీ తల్లి. అలా ఆ వరుసలో చంద్రుడు మనకు మామ అయ్యాడు. ఆ మామను చూపి, తెలుగింటి తల్లులు తమ బిడ్డకు గోరుముద్దలు తినిపిస్తూ, **'చందమామ రావో...జాబిల్లి రావో'** అని పాడుకునే భాగ్యాన్ని కల్పించిన అన్నమయ్య ప్రాతఃస్మరణీయుడు. ఆనాడు రేపల్లెలో ఆ తల్లి తన బిడ్డడు బ్రహ్మాండనాయకుడని తెలియక, ఒడిలో వేసుకొని లాలిపోసింది... జోలపాడింది. **'మంచి కుందనపు పైడికోర వెన్నపాలు తేవో'** అంటూ చక్కటి బంగారు గిన్నెలో తన చల్లనయ్యకు చిక్కటి పాలు తెమ్మని వెన్నెలకు విన్నవించుకుంది. బాలకృష్ణుడిని తలచుకుంటే ఎంతటి కవికైనా పదాలు అలా సెలయేటి ధారలా జలజలా ప్రవహిస్తాయి. ఆ పరంపరలో మహాభారతంలోని ఉద్యోగపర్వాన్ని అనువదిస్తూ తిక్కన సోమయాజి కూడా ఓ సన్నివేశంలో ఆ రాధాకృష్ణుని లీలల్ని రమణీయంగా వర్ణిస్తూ...

ప్రాణంబుతో గూడ రక్కసి చన్నుల పాలు ద్రావిన ప్రౌఢబాలుడితడె!
వ్రేల్మిడి చాణూరు విరిచి లోకముల మెచ్చించిన యా జగజెట్టి ఇతడె!
దుర్వృత్తుడగు కంసు దునిమి యాతని తండ్రిపట్టంబు కట్టిన ప్రభు వితండె!
సత్యభామకు పారిజాతంబుపై గల కోర్కి దీర్చిన రసికుం డితండె!..

'ప్రాణాలతో సహా పూతన చనుబాలు తాగిన ప్రౌఢబాలుడితడు, వ్రేల్మిడి అంటే చిటికెలో కంసుడు పంపిన చాణూరుడనే మల్లయోధుడిని వధించిన జగజెట్టి ఇతడు, దుర్మార్గుడైన కంసుని చంపి అతని తండ్రి ఉగ్రసేనుడికి పట్టం కట్టిన ప్రభువితడు, సత్యభామ మనసు పడిందని పారిజాతాన్ని తెచ్చి ఇచ్చిన రసికుడితడు' అని కొనియాడతాడు.

ముద్దుల మురారికి...

త్రేతాయుగంలో కౌసల్యాదేవి కూడా ఆ సాకేత రాముడిని శ్రీమహావిష్ణువు అవతారమని అర్థం చేసుకోలేదు; కేవలం తన వరాలమూటగానే పెంచుకుంది. ఒకసారి ఆ కౌసల్య శ్రీరామచంద్రుడిని స్నానం చేయించి, అలంకరించి, ఊయలలో

(మిగతా 32వ పేజీలో...)

ఫలాపేక్ష రహితమైన పవిత్ర ప్రేమే నిజమైన ప్రేమ. కీర్తి ప్రతిష్ఠల మీద, ప్రాపంచిక విషయాల మీద వ్యామోహం వదలుకున్నప్పుడే గోపికల ప్రేమలోని నిజతత్త్వాన్ని తెలుసుకోగలం. - స్వామి వివేకానంద



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

భక్తుడు: ఆధ్యాత్మిక సాధనలో శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావాల ప్రాధాన్యం ఏమిటి? ఆ యా భావాల ద్వారా భగవంతుణ్ణి చేరుకున్న భక్తులు ఎవరు?

స్వామీజీ: శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావాలు మానవ సంబంధాలను తెలియజేసే వివిధ పద్ధతులు. భక్తులు ఏ భావం ద్వారానైనా తమ తమ మనోభావాలకు అనుగుణంగా సాధన చేసి భగవంతుణ్ణి పొందవచ్చు.

భగవంతుడు పరమాత్మ, నేను ఆయన భక్తుణ్ణి – అనే భావం శాంత భావం. నారదుడు శాంత భావాన్ని అనుసరించి సాధన చేశాడు. హనుమంతునిది దాస్యభావం. గోపబాలురు సఖ్యభావంతోనూ; నంద యశోదలు వాత్సల్యభావంతోనూ; రాధ, గోపికలు మధురభావంతోనూ శ్రీకృష్ణుణ్ణి ఆరాధించారు.



ఈ భావాల ప్రయోజనాన్ని శ్రీకృష్ణుడు *(భాగవతం–11, 12. 8)* ఇలా తెలిపాడు:

కేవలేన హి భావేన గోప్యో గావో నగా మృగాః ।
యేఽన్యే మూఢధియో నాగాః సిద్ధా మామీయు రంజసా ॥

'గోపికలు, గోవులు, వృక్షాలు, మృగాలు, కాళీయప్రభృతి నాగులు, బృందావనంలోని తరు లతా గుల్మాదులు మొదలైన మూర్ఖ చిత్త పదార్థాలు కేవలం వివిధ భావాల సహాయంతో నన్ను పొందగలిగాయి.'

భక్తుడు: నారదీయ భక్తి అంటే ఏమిటి?

స్వామీజీ: నారదీయ భక్తి అంటే నారదుడు అనుసరించిన భక్తి మార్గం. ఎలాంటి స్వలాభాపేక్షా, స్వార్థచింతనా లేని భక్తియే నారదీయ భక్తి. నారదుని నిస్వార్థ భక్తి గురించి శ్రీరామకృష్ణులు ఇలా వివరించారు: "శ్రీరాముడు నారదుణ్ణి ఏదైనా వరం కోరుకోమని అడిగినప్పుడు నారదుడు 'ఓ రామా! నీ పాదాలను ఆశ్రయించిన నాకు కొరత ఏముంటుంది? నీవు నాకు వరం ఇవ్వదలిస్తే, నన్ను మహామాయలో చిక్కుకోకుండా కాపాడు. నీ పాదపద్మాల యందు నిర్మల భక్తిని ప్రసాదించు".

భక్తుడు: ఊర్జిత భక్తి అంటే ఏమిటి?

స్వామీజీ: ఊర్జిత భక్తి అంటే భగవంతుని పట్ల తీవ్ర వ్యాకులతతో కూడిన భక్తి. భక్తుడు భగవంతుని భావంలో నిమగ్నమై బాహ్యస్థితి పట్ల ఎరుక లేకుండా ఉండే స్థితి. అలాంటి భావపారవశ్య స్థితిలో భక్తుడు ఒక్కోసారి నవ్వుతాడు, విలపిస్తాడు; అలాగే పాడతాడు, నృత్యం చేస్తాడు.

ఊర్జిత భక్తి గురించి అధ్యాత్మ రామాయణంలో రామ లక్ష్మణుల మధ్య జరిగిన సంవాదాన్ని శ్రీరామకృష్ణులు ఇలా తెలిపారు: ఒకసారి లక్ష్మణుడు, శ్రీరాముణ్ణి ఇలా ప్రశ్నించాడు: 'ఓ రామా! నీవు ఏయే రూపాలలో, ఏయే భావాలలో ఉంటావు? నిన్ను గుర్తించడం ఎలా?' అందుకు శ్రీరాముడు 'సోదరా! భక్తి పారవశ్యంలో ఎవరు కొన్ని సార్లు విలపిస్తూ, కొన్ని సార్లు నవ్వుతూ, మరికొన్ని సార్లు నృత్యం చేస్తూ, పాడుతూ ఉంటారో అలాంటి వారిలో నేను ఉన్నానని తెలుసుకో' అని బదులిచ్చాడు.

ఊర్జిత భక్తి ద్వారా మాత్రమే మనస్సు పరిశుద్ధం కాగలదని శ్రీకృష్ణుడు చెబుతూ... *(భాగవతం11, 14. 23)*

కథం వినా రోమహర్షం ద్రవతా చేతసా వినా ।
వినాఽనన్దాశ్రుకలయా శుధ్యేద్భక్త్యా వినాఽశయః ॥

'శరీరం పులకించనంత వరకు, హృదయం ద్రవించనంత వరకు, ఆనందాశ్రువులు ప్రవహింపనంత వరకు శుద్ధభక్తి ఆవిర్భవించదు. ఊర్జిత భక్తి కలుగనిదే మనస్సు పరిశుద్ధం కాదు' అని ఉద్ధవునితో అంటాడు.

భాగవతంలో శ్రీకృష్ణుడు, తాను దేనితో సులభంగా ప్రీతిచెందుతానో తెలుపుతూ ఉద్ధవునితో ఇలా అంటాడు:

న సాధయతి మాం యోగో న సాంఖ్యం ధర్మ ఉద్ధవ ।
న స్వాధ్యాయస్తపస్త్యాగో యథా భక్తిర్మమోర్జితా॥ (11, 14. 20)

'ఉద్ధవా! ఊర్జిత భక్తి నన్ను వశం చేసుకున్నంత సులభంగా యోగం, సాంఖ్యం, ధర్మం, స్వాధ్యాయం, తపస్సు, దానం మొదలైనవేవీ వశం చేసుకోలేవు.'

కాబట్టి అన్యచింతనలు లేని తీవ్రభక్తిని అలవరచుకుంటే భగవంతుణ్ణి సులభంగా ప్రసన్నం చేసుకోవచ్చు. ❖

పండుగలు - పర్వదినాలు

ఆగష్టు - 2013

02	శుక్రవారం	: ఏకాదశి
04	ఆదివారం	: స్వామి రామకృష్ణానంద జయంతి
17	శనివారం	: ఏకాదశి
21	బుధవారం	: స్వామి నిరంజనానంద జయంతి
28	బుధవారం	: శ్రీకృష్ణ జన్మాష్టమి

సెప్టెంబర్ - 2013

01,15	ఆదివారం	: ఏకాదశి
04	బుధవారం	: స్వామి అద్వైతానంద జయంతి
09	సోమవారం	: వినాయక చవితి
28	శనివారం	: స్వామి అభేదానంద జయంతి
30	సోమవారం	: ఏకాదశి



కృష్ణ భక్తే కంటి చూపు

భగవంతుడి లీలలు అనంతం, అవి అర్థం చేసుకోవడానికి సామాన్యుల శక్తి సరిపోదు. ఆయన పరీక్షించిన ఒక మహాభక్తుని చరితే ఈ భక్తిరసవాహినిలోని మొదటి మునక.

'రక్షించండి, కాపాడండి' అని అతను చేసే ఆర్తనాదాలు ఆ అడవి అంతటా ప్రతిధ్వనిస్తున్నాయి, కానీ వాటి వల్ల ఏ మాత్రం ప్రయోజనం లేకపోయింది. అతను ఆ నిస్సహాయ స్థితిలో ఉండగానే ఆరు రోజులు గడిచిపోయాయి. అరిచేందుకు కూడా శక్తి మిగల్లేదు. అశక్తత కన్నీటి రూపంలో చెంపలపై కారుతుండగా, అతను తనలో తానే ఇలా అనుకోసాగాడు – 'నా శక్తియుక్తులన్నీ ఇప్పుడు ఏమైపోయాయి? జ్యోతిష శాస్త్రంలోని నా ప్రావీణ్యాన్ని చూసి పొగిడేవాళ్ళందరూ ఏరి? పద్యాలు రచించి, గానం చేయగల నా ప్రయోజకత్వం ఇప్పుడు ఏ విధంగా ఉపయోగపడుతోంది? నాకు స్తోత్రాలు చేసే వారందరూ ఇప్పుడు ఏరి?' అని విచారపడుతూ, అంతలోనే ప్రస్తుతం ఇతరుల మీదే ఆధారపడి జీవనం సాగిస్తూ ఉన్న దుర్భరస్థితి కూడా గుర్తుకు వచ్చి, తాను మూర్ఖంగా ఆలోచిస్తున్నట్లు తోచింది. తనకు సహాయం లభించే అవకాశం లేదన్న వాస్తవం స్పష్టమై, బాధపడసాగాడు.

అతను ఒక గొప్ప కవితా హృదయం కలవాడు. చంద్రబర్దాయి వంశానికి చెందిన తన పరంపరను గురించి అతనికి ఎంతో గర్వం. అంతేకాదు, మొఘల్ సామ్రాజ్యపు రాజుల ఆస్థానంలో సంగీత విద్వాంసునిగా రాణించే తన తండ్రిని చూసి చాలా సంతోషపడ్డాడు. తాను కూడా తండ్రిలాగా సంగీత విద్వాంసునిగా స్థిరపడాలని ఆశించినా, అతనికి జ్యోతిష్యునిగానే ఎక్కువ గుర్తింపు వచ్చింది.

ఇలాంటి ఆనందకర సమయంలోనే, వారి కుటుంబాన్ని విషాదం చుట్టుముట్టింది. అతని అన్నదమ్ములు ఆరుగురినీ శత్రువులు కక్షతో చంపేశారు. అతని తల్లితండ్రులు అంతులేని పుత్రశోకంతో ఉండగానే, ఒక వింతవ్యాధి సోకి, ఈతను చూపును కోల్పోయి, అంధునిగా మిగిలాడు. ప్రతీ పనికి ఇతరుల సహాయం మీదే ఆధారపడవలసి ఉండడం ఇతనికి దుర్భరంగా అనిపించింది. ఆ వాతావరణం నుండి బయట పడితే, మంచి జరుగుతుందని ఆశించి, ఒకనాడు ఎవ్వరికీ చెప్పకుండా మొండి ధైర్యంతో ఒంటరి ప్రయాణం మొదలుపెట్టాడు. ఆ ప్రయాణంలో నడుస్తూ, నడుస్తూ ఒక దిగుడుబావిలో పడిపోయాడు. ఇంక అప్పటి నుండి నిస్సహాయంగా తన దీనస్థితికి విలపించసాగాడు. తన శక్తియుక్తులు ఎంతటి గొప్పవైనా, అవి ఇప్పుడు నిరర్థకములని గుర్తించి, ఆ దేవదేవుని హృదయ పూర్వకంగా శరణువేడాడు. ఆశువుగా శ్రీకృష్ణుని కీర్తనలను ఆలపించసాగాడు, అవి గుండెలోతుల్లో నుంచి పొంగిపొర్లుతూ వస్తూ ఉన్నాయి. అంతటి భక్తికి దాసోహం అనకుండా ఉండగలడా ఆ భక్తసులభుడు! వెంటనే వచ్చి పువ్వును సుతారంగా ఎత్తి పట్టుకున్నట్లు, తన భక్తుని పొదివి పట్టుకుని పైకి తీసుకువచ్చాడు. తనను పట్టుకున్న ఆ కరస్పర్శ అనిర్వచనీయమైన ఆనందాన్ని కలుగజేస్తుంటే, అది మానవస్పర్శ కాదని అతను గ్రహించాడు. ఇంతలోనే, 'ఎలా ఉన్నావు?' అని మృదుమధురమైన వాణి వినిపించింది.

వెంటనే అతను, 'ఓ దేవా! నా కోసం సింహాసనాన్ని వీడి ఈ అడవికి వచ్చావా?' అని ఆర్తిగా ప్రశ్నించాడు. దానికి నవ్వుతూ ఆ శ్రీకృష్ణుడు, 'నీకు చూపునివ్వనా' అని తిరిగి ప్రశ్నించాడు. 'ఓ ప్రభూ! నీ మందహాస వదనం నా హృదయమంతా నిండి ఉండగా, నాకు ఇక చీకటే లేదు. ఈ బాహ్య ప్రపంచాన్ని చూడాలనే ఆసక్తే లేదు. నువ్వు సుస్థిరంగా నా హృదయమందే నివసిస్తే అదే చాలు నాకు' అని ప్రార్థించాడు. అహాన్ని పూర్తిగా వదిలేసి, సంపూర్ణంగా శరణు వేడిన వారిని నిర్లక్ష్యం చేయడు కదా ఆ పరమాత్ముడు. ఇట్టి అపారమైన కృపకు నోచుకున్న ఆ మహాభక్తుడే – సూరదాస్.

సూరదాస్‌ని బయటకు చేర్చిన ఆ కృష్ణుడు అతనిని అలా వదలక, ఒక చక్కని సరోవరం, మధురమైన ఫలవృక్షాలతో కూడిన తోటలో ఒక కుటీరాన్ని ఏర్పరిచి, సూరదాస్‌ను అక్కడికి చేర్చాడు. ఆ ఆహ్లాదకర వాతావరణంలో ఉంటూ, శ్రీకృష్ణుణ్ణి నిరంతరం ధ్యానిస్తూ, భక్తి రస సాగరంలో ఓలలాడుతూ, తన గానామృతంతో ఆయనకు అభిషేకం చేయసాగాడు. ఇలా కొంత కాలం గడిచింది. ఋతువులు మారుతున్నాయి. శ్రీకృష్ణధామమైన బృందావనం చేరాలనే సంకల్పం సూరదాస్‌కు కలిగింది. సాయంగా రమ్మని ఆ కృష్ణుడినే అర్థించాడు. భక్తునికి మాత్రమే కనిపిస్తూ, బృందావనానికి తీసుకువెళ్ళాడు ఆ మురళీలోలుడు.

బృందావనమందు శ్రీవల్లభాచార్యుల వారిని కలిశాడు సూరదాస్. అతని గానాన్ని విని, కన్నులు చెమరిస్తుండగా ఆప్యాయంగా కౌగిలించుకున్నారు వల్లభాచార్యులు. అంతట ఆయనతో సూరదాస్ – తెలియని వెలితి ఏదో తనను పీడిస్తోందని, ఏమి చేస్తే ఆ అశాంతి పోతుందని అడిగాడు. దానికి శ్రీవల్లభులు 'నీవు తులసీదాస్ గురించి వినే ఉంటావు. అతను శ్రీరాముని చరితమును వాడుక భాషలో సామాన్యులకు కూడా అర్థమయ్యేలా రచించాడు. అలాగే ఆ లీలా మానుషుడైన శ్రీకృష్ణుడు తన చరిత్ర నీ ద్వారా ప్రజలకు అందాలని ఆశిస్తున్నాడేమో! ఈ మహత్తర కార్యం ఆలస్యం చేయకుండా మొదలుపెట్టు' అని ప్రబోధించారు. దానికి సూరదాస్ బదులిస్తూ,

'నాకు సంపదలూ వద్దు. స్వర్గమూ వద్దు. నేను జన్మజన్మలకూ నిన్నే ప్రేమిస్తూ జీవించాలి' అని ఓ గోపిక కృష్ణుణ్ణి కోరింది. ప్రేమ కొరకే ప్రేమించడమనే ఆదర్శాన్ని పాటించిన వారు గోపికలు. - స్వామి వివేకానంద

ఆచార వ్యవహారాలు - అంతరార్థాలు

– డాక్టర్ రెంటాల జయదేవ

ఓంకార ప్రభావం



ఓంకారమనేది సృష్టి అంతటా వ్యాపించి ఉన్న శబ్దం. అలాంటి ప్రణవాన్ని ఉచ్చరించడం వల్ల మన శరీరంలోని సూక్ష్మమైన చక్రాలన్నీ ప్రభావానికి లోనవుతాయి. ఓంకారాన్ని ఉచ్చరించడంతో శరీరంలోని ప్రాణశక్తి ఉత్తేజిత మవుతుంది. ఏకాత్మ చైతన్య భావన కలుగు తుంది. 'ఆజ్ఞా చక్రం' *(భ్రూమధ్య స్థానం)* పై దృష్టి నిలుపుతూ ప్రణవోచ్చారణ చేయడం వల్ల, మెదడులో మూడో పొర వెనుక దేవదారు ఫలం ఆకారంలో ఉండే పీనియల్ గ్రంథి ఉత్తేజితమవుతుంది. ఏ అంశానికి సంబంధించి అయినా ఎరుక కలిగే సామర్థ్యం వెలికి వస్తుంది. ఆత్మ చైతన్యాన్ని మేల్కొల్పడం లాంటి ఉన్నత స్థాయి ప్రయోజనాలకు దాన్ని వినియోగించు కోవచ్చు. అర్థం లేని శబ్దాలను నిరంతరాయంగా పదే పదే ఉచ్చరించడం వల్ల మనస్సు నిద్రావస్థకు చేరుకుంటుంది. కానీ, ఓంకారం విషయం అలా కాదు. ఆగకుండా ప్రణవాన్ని ఉచ్చరించడం వల్ల జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు మూడింటిలోనూ ఎంతో ప్రశాంతత చేకూరుతుంది. అంతేకాక, మనస్సులోని చాంచల్యానికి అడ్డుకట్ట పడుతుంది. అంతర్దృష్టి శక్తి పెరుగుతుంది. ఒక్కసారిగా 'ప్రజ్ఞా చక్షువు' తెరుచుకుంటుంది.

అలాగే, ఓంకారం ప్రకంపించే స్థానం – మన శరీరంలోని 'విశుద్ధ చక్రం' *(గొంతు మధ్యభాగం)*. ఆ ఓంకార ప్రకంపనలు విశుద్ధ చక్ర స్థానాన్ని పరిశుద్ధం చేస్తాయి. నోటి ద్వారా బయటకు వ్యక్తమయ్యేందుకు సిద్ధమవుతున్న మనస్సులోని ప్రతికూల భావ ప్రసారాలను నిరోధిస్తాయి.

అనాహత చక్రం (హృదయ స్థానం) నుంచి ఓంకారాన్ని జపించడం మొదలు పెడితే, మనలో దయ, ప్రేమ లాంటి భావాలు పెరుగుతాయి. క్రోధం, ద్వేషం లాంటి ప్రతికూల భావాలు నశిస్తాయి. ఓంకార శబ్దం మన నాభి (బొడ్డు) ప్రాంతాన్ని, అంటే మణిపూర చక్ర స్థానాన్ని స్పృశించగానే, మన స్థూల శరీరంలోని అగ్ని తత్త్వాన్ని నియంత్రిస్తుంది. ఫలితంగా, దేహంలోని విష పదార్థాలన్నీ దహనమవుతాయి. ఇక, మరింత దిగువ చక్రాలైన స్వాధిష్ఠాన, మూలాధార చక్రాల స్థానానికి ఓంకార ఉచ్చారణ ప్రసరించినప్పుడు ఇంద్రియాలు ఇష్టారాజ్యంగా తిరగకుండా నియంత్రితమవుతాయి. శరీరంలోని ప్రాణశక్తిని శుద్ధి చేయడానికి కూడా అది తోడ్పడుతుంది.

మొత్తం మీద కొద్ది నిమిషాల పాటు ప్రణవోచ్చారణ చేసినా దాని వల్ల కలిగే సత్ఫలితాలు అనేకం. ప్రణవ జప సాధకుడికే కాక, ఆ పరిసర వాతావరణం అంతటికీ ప్రశాంత ప్రకంపనలు వ్యాపిస్తాయి. మొక్కలు, చెట్లు, చివరకు జంతుజాలం మీద కూడా అది ప్రభావం చూపిస్తుంది. అందుకే, శారీరక, మానసిక ప్రశాంతతకూ, పవిత్రతకూ, సమున్నత జీవనానికీ శ్రీకారం–ఓంకారం. ❖ *(వచ్చే సంచిక నుండి 'నమస్కారం' గురించి)*

ఎంతో వినయంగా 'నాకు అంత జ్ఞానం లేదు, నాకు ఏమీ తెలియదు' అన్నాడు. 'శ్రీకృష్ణుణ్ణి హృదయంలో నిలుపగల భక్తే నీ అర్హత. ఇంతకంటే గొప్ప అర్హత ఏమి ఉంటుంది? అయినా నీ భయాన్ని తొలగించడానికి, భాగవత గ్రంథానికి హృదయస్థానమైన దశమ స్కంధాన్ని నేను నీకు వివరిస్తాను' అని తెలిపి, అతని కోరికపై మంత్రోపదేశం చేసి, మార్గం చూపారు వల్లభులు. ఎంతటివారికైనా సద్గురువులు ఎంతటి అవసరమో ఈ సంఘటనతో తెలుస్తోంది.

శ్రీవల్లభుల ఆదేశానుసారం శ్రీనాథుని ఆలయంలోనే ఉంటూ, తన కర్తవ్యానికి శ్రీకారం చుట్టాడు సూరదాస్. ఆ శ్రీకృష్ణుని హావభావాలు కళ్ళకు కట్టినట్లు అతను పాడుతూ ఉంటే, వందలాదిగా ప్రజలు ఆ గానామృతాన్ని పానం చేసేవారు. సుమారు ఒక లక్ష పద్యాలలో, అత్యంత మనోహర శైలితో ఆయన ఆ కృష్ణుణ్ణి వర్ణించారు.

సూరదాస్ ఖ్యాతి క్రమంగా విస్తరించి, ఢిల్లీ పాదుషా అక్బరు చక్రవర్తికి చేరింది. ఆయన బృందావనానికి వచ్చి ఆ గానామృతాన్ని ఆస్వాదించాడు. సూరదాస్‌ను పరీక్షించదలచి, తనపై కూడా కవిత్వం చెప్పమన్నాడు. అది తనకు సాధ్యం కాదని సూరదాస్ వినయంగా జవాబిచ్చాడు. ఆ జవాబుకు ఆనందిస్తూ, ఆయన పేరిట కొన్ని గ్రామాలను దానం చేయాలని తనకు కోరికగా ఉందని అక్బరు తెలిపాడు. అందుకు సున్నితంగా తిరస్కరిస్తూ, అపారమైన కరుణను కురిపించే నల్లనయ్య తన చెంతనే ఉండగా, వేరే వాటి మీదకు తన మనస్సు పోదనీ, అలాంటి బంధనాలలో తనను ఇరికించవద్దనీ వేడుకున్నాడు. ఎలాంటి మోహానికీ, కీర్తికీ లోబడకుండా తన భక్తినే చాటుకున్నాడు.

ఒకనాడు సూరదాస్‌ను కలవడానికి తులసీదాస్ బృందావనం వచ్చాడు. ఉప్పొంగిన ఆనందంతో ఆయనను స్వాగతించి, జన్మ ధన్యమైనట్లుగా సంతోషించాడు సూరదాస్. భగవద్భక్తులు పరస్పరం కలుసుకున్నప్పుడు ఇది అత్యంత సహజం కదా! వారిరువురూ తన్మయత్వంతో ముచ్చటించుకుంటూ ఉంటే, త్రివేణీ సంగమంలోని పవిత్ర నదులు గంగా, యమునల లాగా, నడుమ పరమాత్ముడు అంతర్వాహిని అయిన సరస్వతీ నది లాగా ఆ దృశ్యం భాసించింది.

'సూర సాగర్' పేరుతో భాగవతామృతాన్ని పూర్తి చేసిన సూరదాస్, నిండు నూరేళ్ళు జీవించినట్లుగా తెలుస్తోంది. అంత్యకాలం ఆసన్న మయిందని తెలుసుకుని, తనను శ్రీకృష్ణుడు రాసలీల ఆడిన ప్రదేశానికి తీసుకువెళ్ళమని చెప్పి, అక్కడకు శ్రీనాథుని దేవాలయ ధ్వజం కనిపించే దిశకు తన చూపును సారించి, చివరిసారిగా ఒక పాటలో తన భావాన్ని ఇలా వెల్లడి చేశాడు – 'నా మనస్సు, ఆత్మ రాధామయమవగా, ఆ లీలాకృష్ణుని సన్నిధికి, ఇంక వియోగం లేని చోటుకు తరలి వెళుతున్నాను'.

క్రీస్తుశకం 1478లో ఢిల్లీ సమీప గ్రామంలో జన్మించిన సూరదాస్, తన జీవితం యావత్తూ శ్రీకృష్ణమయంగా చేసుకున్న మహా భక్తుడు, ధన్యజీవి, చిరస్మరణీయుడు. ❖

(రామకృష్ణ సంఘ ఆంగ్ల మాసపత్రిక – 'ప్రబుద్ధ భారత' నుండి)

తెలుగు సేత: డాక్టర్ అపర్ణా శ్రీనివాస్



పరివర్తన తెచ్చిన ప్రసన్నవదనం

- స్వామి భాస్కరానంద

భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస జన్మస్థలమైన కామార్పుకూర్ ఆశ్రమానికి అధ్యక్షులుగా స్వామి శారదేశ్వరానంద ఎన్నో ఏళ్ళు సేవలు చేశారు. వారి సౌమ్యతకూ, ఆధ్యాత్మికశక్తికీ ఎందరో ప్రభావితులయ్యారు. ఒకరోజు మధ్యాహ్నం ఒక యువకుడు, స్వామీజీని కలవడానికి ఆశ్రమానికి వచ్చాడు. వచ్చీ రావడంతోనే వారితో 'నేను ఇక్కడ రెండు, మూడు రోజులు ఉండాలనుకుంటున్నాను' అంటూ తన మనస్సులో మాటను బయటపెట్టాడు.

అయితే అపరిచితులకు ఆశ్రమాలలో వసతి సౌకర్యం కల్పించడం రామకృష్ణ సంఘ నియమాలకు విరుద్ధం. సంఘ ఆశ్రమాల్లో వసతి కావాలనుకున్న వారు, ఏ రామకృష్ణ సంఘం స్వామీజీ నుంచి అయినా పరిచయ పత్రాలను తీసుకు రావలసి ఉంటుంది. అలా సంఘంతో పరిచయమున్న వ్యక్తులకే రామకృష్ణ ఆశ్రమాల్లో ఉండే అవకాశాన్ని కల్పిస్తారు.

స్వామి శారదేశ్వరానంద అదే ఉద్దేశంతో ఆ వ్యక్తిని 'ఏ స్వామీజీ నుంచైనా పరిచయ పత్రం తీసుకువచ్చారా?' అని ప్రశ్నించారు. దానికి ఆయన 'నా దగ్గర అలాంటి పత్రాలు ఏమీ లేవు' అని కఠినంగా సమాధానం చెప్పాడు.

అప్పుడు స్వామీజీ 'అయితే క్షమించండి! అలాంటి పత్రాలేవీ లేకుండా ఆశ్రమంలో వసతి సౌకర్యం కల్పించడం కుదరదు' అన్నారు. దాంతో ఆ వ్యక్తి తీవ్రంగా ప్రతిస్పందించాడు. పరుష పదజాలంతో స్వామీజీపై విరుచుకుపడ్డాడు. నానా మాటలన్నాడు. కొన్ని నిమిషాల పాటు అక్కడ హడావిడి సృష్టించాడు. ఇతర స్వామీజీలు, భక్తులు అక్కడే ఉన్నారు. అంత పెద్ద స్వామీజీని పట్టుకొని ఆ యువకుడు అన్నేసి మాటలు అంటూ ఉంటే, వాళ్ళు తట్టుకోలేకపోయారు. కానీ స్వామి శారదేశ్వరానంద ఏ మాత్రం చలించలేదు. ప్రసన్నంగా, నిర్మలంగా అలాగే చూస్తుండిపోయారు. ఆ వ్యక్తి ఆవేశమంతా చల్లారాక, 'అతనికి ప్రసాదం ఇవ్వండి' అని చెప్పారు మహరాజ్. కానీ ఆ వ్యక్తి ప్రసాదాన్ని తీసుకోవడానికి నిరాకరించి రుసరుసమంటూ ఆశ్రమం నుంచి బయటకు వెళ్ళిపోయాడు.

మరుసటి రోజు ఉదయం స్వామి శారదేశ్వరానంద వాలుకుర్చీలో కూర్చొని ఏవో కాగితాలు చూసుకుంటూ ఉన్నారు. ఇంతలో అంతకు ముందు రోజు పరుషంగా మాట్లాడి వెళ్ళిపోయిన వ్యక్తి, ఆయన వద్దకు వచ్చాడు. వచ్చీ రావడంతోనే స్వామీజీ పాదాలపై పడిపోయాడు. ఎంతో పశ్చాత్తాపంతో కుమిలిపోతూ "మహరాజ్! నేను కలకత్తాలో పేరుమోసిన దోపిడీదొంగను. మీ ఆశ్రమానికి పొరుగున ఉన్న కొందరు మీరంటే పడక, మీ పైకి నన్ను రెచ్చగొట్టి పంపారు. మిమ్మల్ని అవమానిస్తే, నాకు డబ్బులు కూడా ఇస్తామన్నారు. అందుకే నేను నిన్న మీతో అలా ప్రవర్తించాను. కానీ మీరు ఎంతో మహాత్ములు. అందుకే నేను అన్ని మాటలు అంటున్నా, మీరు రవ్వంత కూడా ప్రతిస్పందించలేదు. కోపం తెచ్చుకోలేదు. ఇక్కడి నుంచి వెళ్ళినప్పటి నుంచి నా మనస్సులో మీ ప్రసన్నవదనమే మెదలుతూ ఉంది. మీ సౌమ్యత, క్షమాగుణం నన్ను కదిలించాయి. నన్ను క్షమించండి మహరాజ్!" అంటూ విలపించాడు. పశ్చిమ బెంగాల్ మొత్తంలోనే అతను పేరుమోసిన దోపిడీదొంగ అని మహరాజ్‌కే కాదు, అక్కడి వారెవరికీ తెలియదు. అతను ఎంతో ప్రమాదకారి అయిన దోపిడీ దొంగ అని తరువాత తెలిసింది.

స్వామి శారదేశ్వరానంద చిరునవ్వుతో అతణ్ణి దగ్గరకు తీసుకుంటూ, 'సరే! ఈ రోజు ఆశ్రమంలో మధ్యాహ్నం భోజన ప్రసాదం తీసుకొని వెళ్ళు' అన్నారు. దానికి అతను 'ఈసారి నేను, నా భార్య వచ్చినప్పుడు ఆశ్రమంలో ఉండే అవకాశం కల్పిస్తానంటేనే, ప్రసాదం తీసుకుంటాను' అని ప్రాధేయపడ్డాడు. అలాగేనని స్వామీజీ అంగీకరించారు.

పూర్తిగా జీవనశైలినే మార్చుకున్న ఆ యువకుడు కొన్నాళ్ళకు భార్యతో కలసి కామార్పుకూర్ ఆశ్రమానికి వచ్చాడు. స్వామీజీ అనుమతితో కొన్నిరోజులు అక్కడే ఉన్నాడు. రోజూ ఉదయమే స్నానంచేసి ఆలయంలో జరిగే మంగళహారతికి హాజరయ్యేవాడు. తరువాత ఎంతో సేపు కూర్చొని చండీ పారాయణం చేస్తూ ఉండేవాడు. అతను మారిన తీరు, గురుమహరాజ్‌పై అతనికి ఉన్న భక్తి చూసి అక్కడి స్వామీజీలు, భక్తులు ఎంతో ఆశ్చర్యపోయేవారు. అలా స్వామి శారదేశ్వరానంద ఆయన జీవితంలో పెనుమార్పు తీసుకువచ్చారు. ❖

ఇతరులు ఎంత దుష్టులైనా సరే వారి దోషాలను గురించి ఎన్నడూ చర్చించకు. ఓర్పుతో జీవించు. నువ్వు పవిత్రంగా జీవిస్తూ, ఆదర్శాలకు కట్టుబడి ఉన్నంత కాలం నీకు అపజయం కలుగదు. - స్వామి వివేకానంద



నిజమైన దేశభక్తి...

– స్వామి అర్చనానంద

“నీవు స్పందిస్తున్నావా? లక్షలాది, కోట్లాది మంది, దేవీదేవతల, ఋషీశ్వరుల పరంపరలో వచ్చిన వారి సంతానం ఈనాడు పశుప్రాయులై జీవిస్తున్నారని నీవు బాధపడుతున్నావా? కోట్ల మంది ఈ రోజు ఆకలితో అలమటిస్తున్నారని, తరతరాలుగా కోట్ల మంది పస్తులుంటున్నారనీ నీవు పరితపిస్తున్నావా? అజ్ఞానం యావత్ దేశంపై నల్ల మబ్బుల్లా కమ్ముకుందని నీవు బాధపడుతున్నావా? ఆ బాధ నిన్ను కలచివేస్తోందా? ఆ పరితాపం నిన్ను నిద్రపోనీయడం లేదా? ఆ ఆవేదన నీ రక్తంలోనికి ప్రవేశించిందా? నీ నాడులలో, అణువణువులోకీ చొచ్చుకొని పోయిందా? ఆ ఆక్రందన నీ హృదయ స్పందనలతో మమేకమయ్యిందా? అది నిన్ను దాదాపు పిచ్చివానిగా మార్చేసిందా? ‘బీదసాదల దుఃఖ దారిద్ర్య సంతాపం’ – ఈ ఒక్క భావన భరింపలేని వేదనగా నిన్ను ఆవేశించిందా? ఈ బాధానుభూతితో నీవు నీ పేరుప్రతిష్ఠలనూ, నీ భార్యా బిడ్డలనూ, నీ ఆస్తి అంతస్తులనూ, నీ నిజ శరీరాన్నే పూర్తిగా మరచిపోయావా? నీవలా చేశావా? ‘దేశభక్తుడు’ అవడానికి ఇదే మొదటి మెట్టు! మొట్ట మొదటి మెట్టు!”

అమెరికాలో చికాగో విశ్వమత మహాసభ దిగ్విజయానంతరం భారత భూమిపై అడుగుపెట్టినప్పుడు మద్రాసులో మహోత్సాహంతో అపూర్వ స్వాగతం పలికిన దేశ ప్రజలను, యువతను సంబోధిస్తూ స్వామి వివేకానంద చేసిన ఉద్బోధనలివి! సంధించిన బ్రహ్మతేజాస్త్రములివి!

ప్రతి భారతీయుడూ – ఏ రంగం, ఏ రాష్ట్రం, ఏ మతం, ఏ మార్గానికి చెందినవాడైనా తప్పక చదివి జీర్ణించుకోవలసినవి ‘కొలంబో నుండి అల్మోరా’ ఉపన్యాసాలు. మద్రాసులో ఇచ్చిన ఆ ఐదు ఉపన్యాసాలు ప్రతి యువకుడూ, ప్రజా ప్రతినిధీ, ప్రతీ నాయకుడూ, విద్యార్థీ చదివి, జీర్ణించుకొని, కొంచెమైనా ఆచరణలో పెట్టి ఉంటే ఈనాడు మన భారతమాత దివ్య దరహాస చంద్రికలతో, సుమంగళ బాలభాను తేజోకిరణాలతో దేదీప్యమానమై విరాజిల్లేది! విశ్వమానవ హృదయ సింహాసనాధీశ్వరియై ‘విశ్వమాత’ అయ్యేది! పిల్లల తల్లులు, తండ్రులూ, బడి పంతుళ్ళూ – ఉగ్గుపాలతో ఈ ‘వివేకానంద అమృతం’ కలిపి ఆ పసిపాపలకు త్రాగించి ఉంటే, ఈనాడు మన స్వర్గీయ సోదరి ‘నిర్భయ’ను ఆ ఐదు మంది యువకులు తమ సొంత చెల్లెలిగా రక్షించేవారు, గౌరవించేవారు; నరరూప రాక్షసులుగా మారేవారు కాదు! కల్లాకపటం తెలియని పసిపాప ‘గుడియా’ను ఆ యువకుడు తన కంటిపాపగా కాపాడేవాడు; పశువుల కన్నా హీనంగా ప్రవర్తించి భారతమాత గౌరవాన్నీ, ప్రతిష్ఠనూ కళంకితం చేసేవాడు కాదు! తాజా విందు వంటకాలతో కళకళలాడే తాజ్ హోటల్, ఉగ్రవాద రాక్షసుల స్వైరవిహారంతో రక్తపు మహల్‌గా మారేదీ కాదు!

మనకు జన్మనిచ్చిన తల్లిని ప్రేమిస్తాం, తండ్రిని ప్రేమిస్తాం. సొంత అన్న, తమ్ముడు, అక్క, చెల్లి, అత్త, మామ, అవ్వ, తాత – వీరందరినీ ప్రేమిస్తాం! ఎందుకు? వీరందరూ ‘మన’వారు కాబట్టి! ఇక ఈ ‘మన’వారు అనే ఇంకా ఎందరెందరికో, ఎన్నేళ్ళుగానో జన్మనూ, జీవనాన్నీ, ధన్యతనూ ఇచ్చిన ఈ దేశం ‘మన’ది కాదా? ఈ దేశంలోని జనం అందరూ ‘మన’వారు కారా? పరాయివారా? మనమంతా ‘భారతమాత’ సంతానమైనప్పుడు భారతీయులందరూ ‘మన’వారు కారా?

మరి ‘మన’ సొంత భారతదేశ పౌరుల కష్టార్జితమైన ధనాన్ని, దేశసేవకై, ప్రజాహిత కార్యాలకై వినియోగించాల్సిన లక్షల కోట్ల రూపాయలను ‘స్వాహా’ చేయగలమా? ప్రజల సొమ్మును

(మిగతా 30వ పేజీలో...)

ధీరవాణి

– స్వామి వివేకానంద

భారత భాగ్యోదయానికి బాధ్యులం మనమే!



భారత పుత్రులారా! లోకంలో అవతరించిన అత్యంత పూజ్యులైన ఋషిసత్తముల పాదస్పర్శతో పవిత్రీభూతమైన క్షేత్రాలు ఈ భారతదేశంలోనే ఉన్నాయి! మానవుని అభ్యంతర ప్రకృతిని గూర్చి, ఆంతరిక ప్రపంచాన్ని గూర్చి పరిశోధనలు మొట్టమొదట ప్రారంభమైందీ ఇక్కడే! జీవాత్మ గురించి, అమృతత్వాన్ని గురించి, ఈశ్వరుని పరిపాలనాకర్తృత్వాన్ని గురించి ప్రకృతిలో, మనిషిలో అంతర్యామిగా ఉన్న భగవంతుని గురించి సిద్ధాంతాలు మొట్టమొదట బయలుదేరింది కూడా ఇక్కడ నుండే! మతధర్మం, తత్త్వశాస్త్రం యొక్క అత్యుత్తమ ఆదర్శాలు తమ పరమ ప్రాప్యస్థానాన్ని పొందగలిగింది ఇక్కడనే!

ప్రపంచాన్ని చాలాసార్లు పూర్తిగా ముంచి లేవనెత్తిన ఆధ్యాత్మిక జ్ఞానం, తత్త్వవిద్య అనే మహోత్తుంగ తరంగాలు బయలుదేరిందీ ఈ దేశం నుండే! మానవకోటిలో శుష్కించి నిర్జీవమైపోతున్న జాతులను మళ్ళీ ఒకసారి ఉజ్జీవింపజేసి, జవసత్త్వాలు చేకూర్చడానికి అలాంటి తరంగజాలం ఇక బయలుదేరవలసి ఉన్నది కూడా ఈ భారతక్షేత్రం నుండే! వందలకొద్దీ విదేశీయుల దాడులనూ, భిన్నమైన ఆచార మర్యాదల సమ్మేళనం వల్ల కలిగిన వందల కొద్దీ విప్లవాలనూ భరించి నిలిచిన భారతభూమి ఇదే! చెక్కుచెదరని శౌర్యంతో, వినాశమెరుగని చైతన్య ప్రభలతో, లోకంలోని ఏ శైలరాజాన్నైనా మించగలిగిన సుస్థిరత్వంతో నిలిచింది ఈ పవిత్ర దేశమే! ఆద్యంతాలు లేక, అమృతమై ఒప్పే నిత్యాత్మ ఎలాంటిదో, ఈ పవిత్ర దేశ జీవితం కూడా అలాంటిదే! మనం అలాంటి దేశమాత సంతానం!

మీకు శక్తి ఉన్నంత వరకు వెనుదిరిగి దృష్టి సారించండి! మీ వెనుకవున్న ఆ అఖండ నిధుల నుండి కడుపు నిండా జ్ఞానజలాలను పానం చేయండి. అటు తర్వాత ముందుకు చూడండి. ముందుకు పరుగులిడుతూ పోండి! భారతదేశాన్ని పూర్వకాలం నాటి కన్నా తేజోమయంగా, మాననీయంగా, మహిమాఢ్యంగా వెలయించండి. మన పూర్వులు చాలా గొప్పవారు! ముందుగా మనం ఆ విషయాన్ని జ్ఞప్తికి తెచ్చుకోవాలి! మన స్వరూప సత్యాలనూ, మన నాళాల్లో ప్రవహించే రక్త స్వభావాన్నీ తెలుసుకోవాలి! ఆ రక్త పటుత్వంలో, భూతకాలంలో ఆ రక్తపటిమ సాధించగలిగిన ఘనకార్యాలలో మనం విశ్వాసం ఉంచాలి! అలాంటి విశ్వాసాన్నీ, మన ప్రాచీన ఔన్నత్యం గురించిన పరిజ్ఞానాన్ని ఆధారంగా చేసుకొని, మునుపటి కన్నా గొప్ప మహిమతో ప్రకాశించే విధంగా భారతభూమిని పునరుద్ధరించాలి!

జాతీయ శరీరం దుర్బలమైనప్పుడే నానా విధమైన రోగజీవాణువులు జాతి రాజకీయ పరిస్థితిలోనో, సాంఘికావస్థలోనో, విద్యా విధానంలోనో, చిత్తవైఖరిలోనో గుంపులు గుంపులుగా ప్రవేశించి రోగాన్ని సృష్టిస్తాయి. దీన్ని నివారించడానికి ఆ రోగానికి మూల మెక్కడో కనుక్కొని, రక్తంలోని మలినాలన్నింటినీ తొలగించాలి. వెలుపలి నుండి వచ్చే విషాలనన్నిటినీ ఎదుర్కొని నెట్టివేయగల సమర్థత మానవునిలో కలిగేలా చేయాలి. ఇప్పుడు మన ప్రయత్నమంతా మానవుణ్ణి పుష్టిమంతునిగా చేయడమే!

జీవరక్తం నిర్మలంగా, పుష్టిగా ఉంటే, ఏ రోగ జీవాణువులూ శరీరంలో ప్రవేశించ లేవు. మన జీవరక్తం ఆధ్యాత్మిక ధర్మమే! అది స్వేచ్ఛగా ప్రవహించేంత కాలం, అది బలంగా, శుద్ధంగా, పుష్టిగా ఉన్నంత కాలం అంతా సక్రమంగానే నడుస్తుంది. ఆ రక్తం నిర్మలంగా ఉంటే చాలు – రాజకీయ బాధలు, సాంఘిక దోషాలు ఇంకా ఇతరమైన కొరతలు, దేశదారిద్ర్యం సైతం నివారణ కాగలవు. ❖

మహోన్నత మనస్తత్త్వవేత్త స్వామీజీ!

– స్వామి నిత్యస్థానంద

మనస్సును వివిధ కోణాల నుండి పరిశీలించడమే మనస్తత్త్వశాస్త్రం. మానవజాతి స్వాభావిక, అస్వాభావిక నడవడిక, జంతువుల ప్రవర్తనను అధ్యయనం చేసి మనస్తత్త్వవేత్తలు మానవ ప్రవర్తన గురించి నిర్ణయాలు చేస్తారు. ఈ అధ్యయనానికి నేడు ఎన్నో పరికరాలు లభ్యమవడంతో, మెదడు పనితనం గురించి ఎన్నో క్రొత్త క్రొత్త ఆవిష్కరణలు జరుగుతున్నాయి. ఆధునిక మనస్తత్త్వ శాస్త్రాన్ని అధ్యయనం చేయనప్పటికీ, స్వామి వివేకానంద యోగశాస్త్ర పారంగతుడు. ప్రపంచంలో వివిధ భావాలున్న వ్యక్తులతో పరిచయం, నిశిత పరిశీలనా దృష్టి, అపార మేధాశక్తి, ఆధ్యాత్మిక దృష్టి మూలంగా నేటి మనస్తత్త్వ భావాలను నాడే స్వామీజీ ప్రవచించారు.

సాంఖ్య దర్శన పితామహుడు కపిలుడు గొప్ప మనస్తత్త్వజ్ఞుడని భావించారు స్వామీజీ. సాంఖ్య దర్శనానుసారం ఏ పదార్థం గురించి కానీ, ఏ శాస్త్రం మూలంగా కానీ ఇదమిత్థంగా వాస్తవాన్ని తెలుసుకోలేం. ఆధునిక విజ్ఞానశాస్త్రం కూడా దీనికి మినహాయింపు కాదు. మనకు కలిగే సుఖదుఃఖాలు రెండూ వెలుపల ఉండే ప్రేరణల సాయంతో మనస్సు చేసే కల్పన మాత్రమే. సాధారణంగా మనం అన్యులు, అన్య ఘటనలే దుఃఖ హేతువులు అని తలుస్తాం. "బాహ్య ప్రపంచం మన మనస్సు అధీనంలో ఉంటుంది. మనస్సు దృక్పథం మారితే బాహ్య ప్రపంచం మారిపోతుంది. మనస్సు శుద్ధమైతే సర్వం శుద్ధమవుతుంది. ఈ విషయం తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది" అని అంటారు స్వామీజీ.

మనం ఇతరులలో దోషాలను ఎందుకు చూస్తాం? మనం దోషపూరితులం కనుక! నా బలహీనతే నా క్లేశాలకు కారణం. స్వామీజీ బెల్గామ్‌లో హరిపద మిత్రా ఇంట్లో బస చేశారు. మిత్రాకు తన అధికారులతో పొసగేది కాదు. స్వామీజీ "మనకు ఒకరి గురించి ఉన్న అభిప్రాయం మన ప్రవర్తనలో (మనకు తెలియకపోయినా) వెల్లడి అవుతుంది. మన మనస్సులోని చిత్రమే బాహ్య ప్రపంచంలో కనపడుతుంది. నేను మంచివాణ్ణి అయితే లోకమంతా మంచిగా కనపడుతుంది. ఇతరుల దోషాలు వెతికే అలవాటు నేటి నుండే మానుకో! నువ్వు ఎంతగా మారితే వారూ అంతగా మారతారని నిశ్చయంగా తెలుసుకో!" అని అన్నారు. ఆ మాటలతో హరిపద మిత్రా సమస్య పరిష్కారమైంది.

స్వామీజీ పలుకులు ఒక గొప్ప మనస్తత్త్వ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. దీనిని విక్షేపం (projection) అంటారు. 'నాలో నేను చూడడానికి ఇచ్చగించనివి నాకు ఇతరులలో కనపడతా యన్నమాట. ఇతరుల ప్రవర్తనను నిరంతరం విమర్శించే వ్యక్తిలోనే ఆయా బలహీనతలు ఉంటాయి' అంటారు స్వామీజీ. మనకు నచ్చనివి జరిగితే, మనస్సును పరిశీలించి తగిన దిద్దుబాట్లు చేసుకోవాలి. పాము కాటేస్తే, ఆ పాము విషానికి విరుగుడు వెతుకుతాం. అంతేకానీ పామును చంపాలని దాని వెంబడి పరుగెత్తం కదా!

విక్షేపం అనే విషయంలో మరొక ముఖ్యమైన అంశం ఉంది. 'విక్షేపించిన భావం, ఎప్పుడో ఒకప్పుడు తిరిగి మనస్సుపై దాడి చేస్తుంది. ఈ విషయం తెలియక, 'నేను చేయని తప్పుకు ఈ శిక్ష ఏమిట'ని బాధ పడతాం. అందరూ మనల్ని ద్వేషిస్తున్నారని తలుస్తాం. కానీ మనలో చిన్న భాగం ప్రపంచాన్ని ద్వేషిస్తున్నదని ఎరగం' అంటారు ఒక పాశ్చాత్య మనస్తత్త్వవేత్త. అంటే, ఇతరుల పట్ల ప్రేమను సరిగ్గా వెల్లడి చేయలేకపోతున్నామన్న మాట. ఒక వ్యక్తి ఎలాంటి వాడో తెలుసుకోవాలంటే, అన్యుల గురించి ఆ వ్యక్తి ఏమంటున్నాడో వినమంటాడు ఆ శాస్త్రవేత్త. అన్యులను ప్రేమించగలిగితే వారు మనల్ని ద్వేషిస్తున్నారన్న అభిప్రాయం కలగదు. "మనలో ప్రేమ, పవిత్రత హెచ్చితే, బాహ్య ప్రపంచాన్ని మరింతగా ప్రేమించగలం. నీ మనస్సును మార్చుకో! బాహ్య ప్రపంచం తదనుగుణంగా మారుతుంది"అని అంటారు స్వామీజీ.

స్వామీజీ మరొక ముఖ్యమైన విషయాన్ని మన దృష్టికి తెస్తారు. పరిసర వాతావరణంలో మంచి, చెడు – ఇలా వివిధ ప్రకంపనలు ఉంటాయి. మన మనస్సున్న స్థితిని బట్టి మనం ఆ ప్రకంపనలను దొరకబుచ్చుకొంటాం. ఆ కారణంగా మన నడవడిక మెరుగు పడవచ్చు లేదా దిగజారవచ్చు. వ్యక్తి మానసం ఒక పట్టు కలిగి ఉండి (వీణ తీగ లాగా), దానికి తగిన ప్రకంపనలను పరిసరాల నుండి గ్రహిస్తుంది. మంచి పనులు చేసేవారు మంచి పనులే చేస్తుండడానికీ, చెడు పనులు చేసేవారు చెడే చేయడానికీ ఇదే కారణం.

పోతే మనల్ని బాధపెట్టే వారు, కలవరపెట్టే వారు ఉండరని కాదు సుమా! స్వామీజీ చెప్పేది ఏమిటంటే – మనస్సు బలంగా, దృఢంగా ఉంటే, బాహ్య విషయాలకు మనస్సు సులభంగా ప్రభావితం కాదు. దేహంలో రోగనిరోధక శక్తి బలంగా ఉంటే, వాతావరణంలో క్రిములు మన శరీర వ్యవస్థపై దాడి చేయలేవని. ఆ విధంగానే, 'బలహీనమైన మానసిక స్థైర్యాన్ని అన్యులు, అన్య విషయాలు సులభంగా దెబ్బ తీస్తాయి. ఇతరులు మనల్ని కీలుబొమ్మలను ఆడించినట్లు ఆడించగలరు. మనస్సంయమనం

కలవాడికి బానిసధోరణి ఉండదు' అంటారు స్వామీజీ. 'దృఢమైన వేళ్ళున్న చెట్టు ఎంత పెద్ద తుపానునైనా తట్టుకొని నిలవగలదు. కానీ తుపాను మొదలైన తరువాత చెట్టు వేళ్ళూనుకొనలేదు కదా!' అంటాడు కట్లర్ అనే పాశ్చాత్యుడు.

మన గురించి మనకు సకారాత్మక అభిప్రాయం (positive self-image) ఉండడం ముఖ్యం. ఇతరులతో మన సంబంధ బాంధవ్యాలు దీని పైనే ఆధారపడి ఉంటాయట. ఆత్మన్యూనత ఉంటే, ఇతరులు మనల్ని నిరాదరిస్తున్నారనీ, నిర్లక్ష్యం చేస్తున్నారనీ తలుస్తాం.

"మీరు ఎందుకూ పనికిరారని నిరంతరం పిల్లలను దూషిస్తూ ఉంటే వారు నిజంగానే పనికిమాలిన వారవుతారు. వారిని



ప్రోత్సహించండి, వారి పరిస్థితి మెరుగుపడుతుంది" అని అంటారు స్వామీజీ.

ఆత్మన్యూనత అనేది వ్యక్తి అభివృద్ధికి హానికరం. కార్యసిద్ధికి అవరోధకరం. ఏ కొంచెం ఎదురుదెబ్బ తగిలినా, అలాంటి మనిషి తాను చేస్తున్న పని నుండి విరమించుకుంటాడు. ఆత్మన్యూనత వల్ల అవకాశాలు కూడా ప్రతికూలాలుగా, ప్రేమ సైతం ద్వేషంగా, మైత్రి కూడా విరోధంగా అగుపడుతుంది. 'ఒక పని కష్టమైనదంటే – మనం వెనుకాడతాం. వెనుకంజ వేశాం కనుక అది కష్టంగా తోస్తోంది' అంటాడు ప్రాచీన రోమను తత్త్వవేత్త శెనెక.

ఆత్మవిశ్వాసం హెచ్చిన కొద్దీ మన కష్టాలు, బాధలు చాలా వరకు తగ్గుతాయి. 'నిన్ను నీవు ద్వేషించుకోకు! ఆత్మవిశ్వాసం కలిగి ఉండు. ఆత్మవిశ్వాసం లేని వాడికి భగవంతుని పట్ల విశ్వాసం కలగనేరదు' అని అంటారు స్వామీజీ.

ఆత్మద్వేషమనేది వ్యక్తిని నాశనం చేస్తుంది. అంతేకాదు, ఇతరులకు హాని కలిగించే తత్త్వాన్ని పెంచి పోషిస్తుంది. ఈర్ష్య అసూయలకూ, ఎదురుతిరిగే స్వభావానికీ ఇదే కారణం. నన్ను నేను ప్రేమించుకొనలేకపోతే, ఇతరులను ప్రేమించలేను. పోతే ఇది స్వార్థం కాకూడదు. 'జీవితాన్ని ఆస్వాదించు. ప్రార్థన కంటే నవ్వడం మేలు. దుఃఖాన్నీ, దైన్యాన్నీ విడనాడు. దయచేసి వీటిని ఇతరులకు సంక్రమింపజేయకు' అంటారు స్వామీజీ.

మనలో బలహీనతలు ఉండవని కాదు. సున్నితమనస్కులు ఈ బలహీనతలకు దాసోహమంటారు. ఫలితంగా, అపరాధ భావన పెరుగుతుంది. కానీ ఉత్సాహాన్ని కోల్పోకూడదు, క్రుంగిపోకూడదు. ఇది మన బలహీనతను మరింత పెంచుతుంది. ఆత్మవిశ్వాసం, ఆత్మప్రేమ, జీవితంలో ఆనంద ఆస్వాదనపై స్వామీజీ వెలిబుచ్చిన అభిప్రాయాలు బలవర్ధకాలు. పాశ్చాత్య మనస్తత్త్వవేత్తలు తొలిదశలో మానవుణ్ణి ఒక అసంపూర్ణ, నీచ జీవిగా చూశారు. వారి అభిప్రాయాలు వృద్ధి పొందుతూ, స్వామీజీ ఉన్నతాభిప్రాయాలకు నేడు ఎదిగారు.

మానసిక రుగ్మతలకు కారణం – ఉద్వేగాలను (కామ, క్రోధాల్లాంటివి) అణచుకోవడమే అన్నాడు ఫ్రాయిడ్. అధికార కాంక్షను అణచుకోవడమే అన్నాడు ఆడ్లర్. ప్రతిభ, సామర్థ్యాల అణచివేతే కారణమని ఎరిక్‌ఫ్రాం అన్నాడు. చివరగా కెన్ విల్బర్ 'భౌతిక పరిధికి అతీతమైన పారమార్థికశక్తిని మరిచిపోవడం శోచనీయం. మానవజాతి దుఃఖానికి కారణం కామోద్వేగం, వైరాలు మొదలైనవాటి అణచివేత కన్నా దివ్యశక్తిని విస్మరించడమే ముఖ్య కారణం' అని అన్నాడు.

మనలోని దివ్యత్వాన్ని ప్రకటించడంపై స్వామి వివేకానంద నొక్కి వక్కాణించడాన్ని ఈ సందర్భంలో గుర్తు చేసుకోవాలి. 'మనస్సు శుద్ధమవడం ప్రధానం. కాని పక్షంలో మబ్బు కమ్మిన సూర్యబింబం లాగా ఆత్మ మరుగున ఉండిపోతుంది. నీ దివ్యత్వాన్ని ప్రకటించు! సర్వమూ దాని చుట్టూ సామరస్యంగా అమరిపోతుంది' అన్నారు స్వామీజీ. అతి గంభీరమైన మానసిక – ఆధ్యాత్మిక (psycho - spiritual) సందేశమిది. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

మన గురించి మనకు ఎప్పుడూ సకారాత్మక భావం ఉండాలి. ఆత్మన్యూనత ఉంటే ఇతరులు మనల్ని నిరాదరిస్తున్నారని తలుస్తాం. కాబట్టి మనల్ని మనం ఎన్నడూ ద్వేషించుకోకూడదు. - స్వామి వివేకానంద



వివేక దీప్తి

ఈ సమూహ వ్యామోహాన్ని వీడుదాం!

– స్వామి శితికంఠానంద

వివేకానందుణ్ణి చదువుతూ, ఆ భావామృతాన్ని గ్రోలుతూ తమకు కలిగిన ఆనందాన్ని తమ సమవయస్కులతో పంచుకోవడమే వివేక్, వినీత్‌ల కోరిక. ఆ కోరికే ఇలా వివేకదీప్తి శీర్షికగా అవతరించిందని యువ పాఠకులకు తెలుసు. స్నేహితులిద్దరూ మళ్ళీ మాసాంతంలో కలుసుకొని సమకాలీన సమాజాన్ని విశ్లేషించడానికీ, అర్థం చేసుకోవడానికీ, ఇతరులకు జీవనయానం కాస్త సుఖవంతం చేయడానికీ పూనుకుంటున్నారు.

వికాస్: వినీత్! నాకు తెలిసినంతవరకూ ఇప్పుడు చాలా మంది అనుకుంటున్నదేమంటే 'ఈ సమాజాన్ని ఎవరూ బాగుచేయలేరు. ఒక వందమంది వివేకానందులు వచ్చినా కానీ ప్రస్తుత సమాజాన్ని ధర్మమార్గంలో ప్రవేశ పెట్టలేర'ని. నువ్వు ఏమంటావు?

వినీత్: అవును. వాళ్ళ భావనలో కొంత సత్యం ఉంది. 'వ్యవస్థ పాడైపోయింది. ఇప్పుడిక వ్యవస్థను బాగు చేయకుండా వ్యక్తులు బాగుండాలని అనుకోవడం అవివేకం' అనే భావనలోకి చాలామంది వచ్చారు. అలా రావడంలో ఆశ్చర్యం ఏమీ లేదు. కానీ వారంతా ఒక్క విషయం మరిచిపోతున్నారు. వ్యవస్థను నిర్మించేది వ్యక్తి అయినప్పుడు వ్యక్తులు మారినప్పుడు వ్యవస్థ మారాల్సిందే. వ్యక్తి ఎప్పుడూ ఒకే రకంగా ఉండడు. మంచి ఆదర్శాలు, ఆశయాలు ఇచ్చి వ్యక్తిని ఉన్నతుడిగా తీర్చిదిద్దవచ్చు. తద్వారా వ్యవస్థలో మార్పు తీసుకు రావచ్చు. ఇక్కడ మనం 'Never lose faith in man – వ్యక్తి మీద విశ్వాసం కోల్పోకు' అన్న స్వామీజీ వాక్కులను స్మరించుకుంటే బాగుంటుంది.

వికాస్: అవును. ఈ ప్రపంచంలో ధర్మాన్నీ, త్యాగాన్నీ ప్రేమించే వ్యక్తులు కొద్దిమంది ఉన్నా వాళ్ళే ప్రపంచాన్ని ముందుకు నడిపిస్తారు. సంఖ్యాపరంగా అలాంటి వారు తక్కువైనప్పటికీ వారి శక్తి అనూహ్యంగా పనిచేస్తుంది. స్వామీజీ అంటారు కదా – Multitude counts for nothing. A few heart-whole, sincere, and energetic men can do more in a year than a mob in a century. సంఖ్య లెక్కలోకి రాదు. జన సమూహం ఓ శతాబ్దంలో చేసే పనిని, పవిత్ర హృదయులు, శ్రద్ధాళువులు, శక్తిమంతులు కొద్దిమందైనా ఒక సంవత్సరంలోనే చేయగలరు.

వినీత్: పాండవులు ఐదుగురు. కౌరవులు వందమంది. చివరికి విజయం ఎవరిని వరించింది? పాండవులనే కదా! సంఖ్య ముఖ్యం కాదని మహాభారత గాథ నుంచి తెలుస్తూనే ఉంది.

వికాస్: అందరూ పాండవుల లాగే ధీరులుగా ఉండాలని అనుకుంటారు. వాళ్ళనే నిత్యానుసరణీయులుగా భావిస్తారు. ఐనా మన సమాజంలో దుర్యోధనులే ఎక్కువగా కనపడుతున్నారు. ఇది వాస్తవమా? కాదా?

వినీత్: నీవన్నది నిజం. పాండవులనే ఆదర్శవ్యక్తులుగా భావించినప్పటికీ వాళ్ళను అనుసరించే సాహసం అందరూ చేయలేక పోతున్నారు. పాండవుల లాగా ఉండాలంటే వాళ్ళు కూడా కష్టాలను అనుభవించాలని అనుకుంటున్నారు. పాండవులు కష్టాలు పడ్డట్లు బయటకు అనిపించినా, అడవులలో కూడా సంతోషంగానే ఉన్నారు. ధర్మపథంలో ఉన్నారు కాబట్టి భగవంతుడు నిరంతరం వారితో ఉన్నాడు. దైవమే మనిషి ప్రక్కన ఉన్నప్పుడు ఇక అక్కడ సుఖశాంతులు ఉండవా? ధర్మమార్గాన్ని వీడి దేవేంద్ర సిరిని పొందినా అక్కడ దుఃఖం కొలువుతీరి ఉంటుంది. దుర్యోధనుడు మహా సౌధాలలో ఉన్నా ఈర్ష్య అసూయల వల్ల, అశాంతితోనే జీవించాడు. శాంతిలేని వారికి సుఖమెలా కలుగుతుంది?

వికాస్: సుఖదుఃఖాలను సమంగా అనుభవించాలని తెలుసుకున్నవాళ్ళు సత్యమార్గాన్ని వదిలి జీవితాలను సుఖప్రదం చేసుకోవాలన్న వృథా ప్రయత్నం చేయరు. నిజానికి నాకు కనిపిస్తున్నంత వరకూ ఈ ప్రపంచంలో కాస్త సుఖం ఎవరికైనా ఉంది అంటే నీతి నిజాయతీలతో ఉండడానికి సిద్ధపడ్డవారికే! ఇహంలోనూ, పరంలోనూ శాంతి సౌఖ్యాలు కావాలనుకునే వారందరూ ధార్మిక జీవితానికి పెద్ద పీట వేయాల్సిందే. తపస్సు, త్యాగం, సత్యనిష్ఠ, కష్టించి పనిచేసే తత్త్వం పెంపొందించుకోవాలి. స్వామీజీ ఈ వాక్యాలను మనం జ్ఞప్తికి తెచ్చుకుంటే బాగుంటుంది: 'How many times I have been asked for a “comfortable religion!” Very few men ask for the truth, fewer still dare to learn the truth, and fewest of all dare to follow it in all its practical bearings. – ఎన్నిసార్లు సులభంగా అనుష్ఠించే ధర్మం కోసం జనులు నన్ను అడిగారు? కొద్దిమంది మాత్రమే సత్యం గురించి అడుగుతారు, అందులో ఏ కొద్దిమందో తెలుసుకోవడానికి సాహసిస్తారు, అలా తెలుసుకున్న వారిలో ఏ కొద్దిమందో సత్యమార్గాన్ని పరిపూర్ణంగా అనుష్ఠించడానికి పూనుకుంటారు.' మంచికి మార్గం అంత తేలికైతే అందరూ సత్యాన్ని ఆవిష్కరింపజేసుకుంటారు. అందుకని ప్రతికూల పరిస్థితులలో కూడా విలువల కోసం, సత్యం కోసం నిలబడ గలగడమే వ్యక్తి శక్తికి నిజమైన పరీక్ష. పరమాత్మ పెట్టే ఈ పరీక్షలో నెగ్గడమే జీవన లక్ష్యమని ఎప్పుడైతే ఎక్కువమంది అర్థం చేసుకుంటారో అప్పుడు ఒక గొప్ప సమాజం నిర్మాణమవుతుంది.

వినీత్: మనిషి సహనాన్ని కోల్పోతున్నాడనిపిస్తుంది నాకు. అధిక సంఖ్యాకులు ఎటు వెళితే తాను అటు వెళ్ళిపోతున్నాడు. దానితో ఎవరికీ శాంతి ఉండడం లేదు. జనబాహుళ్యానికి ధార్మిక విలువలపై అవగాహన లేదు. ఉన్నవారు ఈ కాలంలో ఆచరణ దుర్లభం అనుకుంటూ వాటికి తిలోదకాలిస్తున్నారు. కానీ ఇలాంటి పరిస్థితులలో కూడా కొద్దిమంది ధీర మానవులు ప్రవాహానికి ఎదురీదుతున్నారు. బలహీనులను అనుకరించకుండా సాహసోపేత జీవితాన్ని గడుపుతున్నారు. వారు ఎంత అదృష్టవంతులో కదా! **'యద్యదాచరతి శ్రేష్ఠః తత్త దేవేతరో జనాః సయత్ప్రమాణం కురుతే లోక స్తదనువర్తతే!** – శ్రేష్ఠ మానవులు ఏ మార్గాన్ని చూపెడతారో, ఆ మార్గాన్ని ఇతరులు అనుసరిస్తారు.' ప్రతికూల పరిస్థితులకు నిలదొక్కుకొని శ్రేయోమార్గాన్ని జనులకు చూపిస్తున్న ఈ కొద్దిశాతం మనుజులు మహామహితాత్ములు. వీరివి నిజానికి ఆదర్శ జీవితాలు.

వికాస్: ప్రతి విషయంలోనూ ఈ మెజారిటీ మానియా మన సమాజాన్ని పట్టి పీడిస్తున్నది. బలహీనులై సత్యపథాన్నీ, సంస్కృతినీ



విస్మరిస్తున్న వారిని అనుకరించడం కూడా ఒక జీవితమేనా? అలాంటి వారిని అనుసరించకుండా ఉన్నవారే మేరునగధీరులుగా భాసిస్తారు. గొర్రెలమందలను కాకుండా అలాంటి ధీరులను తయారుచేసేదే నిజమైన సంస్కృతి, నాగరకత.

వినీత్: చక్కని మాటన్నావు వికాస్! నీతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. వేషభాషలు, ఆహారపుటలవాట్లకు వచ్చేసరికి ట్రెండ్ అనీ, ఫ్యాషన్ అనీ మన తరం వారు ఒకరిని ఒకరు విపరీతంగా అనుకరిస్తున్నారు. యువతరం అలా చేస్తున్నారంటే వయసు ప్రభావం అనుకోవచ్చు. పెద్దవారికేమవుతున్నదటా? వారి విషయంలోనూ ఈ సమూహ ప్రభావం అనూహ్యంగా ఉంది. ఉదాహరణకు మనం చూస్తూనే ఉన్నాం. తల్లితండ్రులు తమ ఆర్థిక స్థితి సహకరించనప్పటికీ తమ పిల్లలను ప్రైవేట్ బడులకు పంపుతూ నిరంతరం ఒత్తిడి, సంఘర్షణలతో బ్రతుకుతున్నారే తప్ప ప్రభుత్వం అందిస్తున్న మౌలిక సదుపాయాలను ఉపయోగించుకోవడం లేదు. ప్రభుత్వ ధనమంటే ప్రజలదే కదా! ప్రజల నుంచి పన్నుల రూపేణా వసూలు చేసినది. అంటే ప్రజలు తమ ధనాన్ని తామే దుర్వినియోగం చేసుకుంటున్నారు. జీవితాన్ని మోయలేని భారంగా మార్చుకుంటున్నారు. వీరూ లోకపు పోకడలను గుడ్డిగా అనుకరిస్తున్నవారే!

వికాస్: అవునవును. అసలు ఈ ట్రెండ్, ఫ్యాషన్, 'వారి కంటే మనం ఏమి తక్కువ', 'వారి లాగానే మనమూ ఉండాలి' అన్న భావనలు ఎలాంటివో చెప్పనా! ఒక వెర్రివాడిని మిగతా వెర్రివాళ్ళు వెర్రిగా అనుకరించటం లాంటివి! అసలు అది అనుసరించదగినదేనా, అందులో సభ్యత, సంస్కారానికి సంబంధించిన విషయాలు ఏమన్నా ఉన్నాయా? అని ఆలోచించడమే లేదు. అవునులే! రాత్రి పగలు వ్యాపార ప్రకటనలు చూసి చూసి ప్రభావితం కాకుండా ఉండాలంటే సామాన్యులకు సాధ్యపడుతుందా? భగవంతుడు సర్వవ్యాపి అని మనకు తెలుసు. అలానే మన ప్రపంచంలో సర్వవ్యాపకత్వాన్ని పొందినవి అడ్వర్టైజ్‌మెంట్స్. బ్రహ్మదేవుడు కూడా ఈ నాటి వ్యాపార ప్రకటనలను చూస్తే వెంటనే కుబేరుడి దగ్గరకు వెళ్ళి అప్పు తెచ్చుకొని మాల్స్‌కు పరుగుపెడతాడు. ఇక దివారాత్రాలు ఆ మాయాపేటిక (టీవీ) నుంచి వెలువడే మాయా ప్రకటనలను చూస్తూ కోరికలను నిగ్రహించుకోగలిగే మానవుడు ఉంటాడా? కోరికలను నిగ్రహించకుండా ఆశాపాశాన్ని త్రెంచకుండా ధర్మ మార్గంలో నిలబడగలిగిన మనుజుడెవడైనా ఉన్నాడా ఇతఃపూర్వం?

వినీత్: అందుకనే, 'మూడు అడుగులు మాత్రమే అడిగావేమిటీ! ఇంకా కోరుకోవచ్చు కదా!' అన్న బలి చక్రవర్తితో శ్రీమహాభాగవతంలో వామనమూర్తి 'ఆశాపాశానికి అంతు లేదు రాజేంద్రా! శాంతి తెరువును చూడాలంటే సంతృప్తిని పెంపొందించుకోవాలి' అని పలికాడు కదా!

వికాస్: నిగ్రహం లేకుండా శాంతి లేదు. ప్రశాంతత లేకుండా అంతరంగం లోతులను తరిచి చూడలేం. హృదయ కుహరంలో ఉన్న భగవంతుడిని చూడడం కల్ల! అందుకని మనతరం వారి జీవితాలు పైన పటారం లోన లొటారం లాగా తయారవుతున్నాయి. పరుగెత్తి పాలు త్రాగడం కన్నా నిలబడి నీరు త్రాగడం ఉత్తమమన్న నానుడిని జనులు గ్రహిస్తే మంచిది.

వినీత్: అంతా వెర్రి అనుకరణను మాని, ఉన్న దానితో తృప్తి పొంది, సహజంగా జీవిస్తూ, తోటివాడితో పోల్చుకోకుండా, జీవించిన నాలుగు రోజులూ తాను ధర్మ మార్గంలో సంపాదించిన దానిని అనుభవిస్తూ, తన శక్తి కొద్దీ ఇతరులకు సహాయం చేస్తూ, ఈ జీవనయానాన్ని ప్రశాంతంగా ముగించే వాడే ఉత్తమోత్తమ మానవుడని నా అభిప్రాయం.

వికాస్: భగవంతుడు అందరికీ అలా జీవించటానికి శక్తిని ప్రసాదించాలని ప్రార్థిద్దాం. మళ్ళీ కలుద్దాం మిత్రమా! ❖

మిమ్మల్ని శారీరకంగానూ, మానసికంగానూ, ఆధ్యాత్మికంగానూ ఏది బలహీన పరుస్తుందో దానిని విషంలాగ త్యజించండి. అందులో జీవం లేదు. అది సత్యమెన్నటికీ కాదు. - స్వామి వివేకానంద



నా దేశం

మువ్వన్నెల పతాకం రెపరెపలాడుతోంది. అది మన జాతికి చిహ్నం. అది భారత జాతి వైభవ పతాకం. ఆ రెపరెపలాడే జెండా వెనుక భారతదేశ మహోన్నత సంస్కృతీ సంప్రదాయాల మేళవింపు, గత వైభవపు కీర్తి, ఋషిపుంగవుల ఆధ్యాత్మిక తపస్సు, వేదాంత జ్ఞానం, శాస్త్రవేత్తల మేధస్సు, స్వార్థరహితుల అపూర్వ త్యాగం ఉన్నాయి. ఈ విషయాన్ని నేటి యువతరానికి తెలియజేసి వారిలో దేశభక్తినీ, దేశాభిమానాన్నీ జాగృత పరచాలని కొన్ని సంవత్సరాల క్రితం ఒక సంస్థవారు ఒక పట్టణంలో రాష్ట్రస్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యువత, పెద్దలు చేసే ప్రసంగాలను వినడానికి ఏ మాత్రం ఆసక్తిని కనబరచకపోవడం నిర్వాహకులకు ఆశ్చర్యం కలిగించింది. రాజకీయ నేతలు పదే పదే నిశ్శబ్దం పాటించమంటూ చెబుతున్నా వినలేదు. సభలో పాల్గొన్న అనేకమంది పెద్దలు 'ఈ కాలం పిల్లలకు దేశభక్తిని అలవరచాలనుకోవడం మన బుద్ధిలేని తనం. వీరు మన భావి పౌరులని తలుచుకొంటేనే భయం వేస్తోంది' అన్నారు.

ఇంతలో ఒక వ్యక్తి సభావేదిక పైకి వచ్చారు. ఆయనను చూడగానే సభాసదులలో ఒక్కసారిగా నిశ్శబ్దం అలముకొంది. అప్పటివరకు అల్లరి చేసిన యువతరం ఆయన ప్రసంగాన్ని వినడానికి ఉత్సుకతను చూపించారు. ఆయన ముంబయ్ ఉగ్రవాదుల దాడిలో పోరాడి అసువులు బాసిన సైనిక అధికారి సందీప్ ఉన్నికృష్ణన్ తండ్రి. ఆయన గంభీరంగా ప్రసంగాన్ని ప్రారంభించి, 'దేశ రక్షణ కోసం ముందు వెనుక ఆలోచించకుండా ప్రాణాలను అర్పించడానికి సిద్ధపడిన వ్యక్తులు మీ ముందు ఇద్దరు ఉన్నారు – నేను, నా భార్య. నా కుమారుడు దాన్ని ఆచరించి చూపించాడు. ఇప్పుడు చెప్పండి! మీలో ఎంతమంది మన దేశం ఆపదలో చిక్కుకున్నప్పుడు దేశరక్షణ కోసం వెనుకా ముందు ఆలోచించకుండా ప్రాణాల్ని అర్పించడానికి సిద్ధంగా ఉన్నారు?' అని ప్రశ్నించారు. అది విన్న యువతీ యువకులు 'మేమున్నామని' ఘోషించారు. 'అయితే మీరు ఇంతకు ముందు ప్రవర్తించిన తీరు మీలో ఏ మాత్రం దేశభక్తి ఉన్నట్లు కనిపించలేదు. దేశభక్తి ఉండాలంటే మనకు ఎలాంటి వ్యక్తిత్వం ఉండాలి?' అంటూ ఎవరినీ లక్ష్యపెట్టకుండా స్వేచ్ఛగా ప్రవర్తించే తీరును ప్రస్తావించి, అవి దేశానికి ఏ విధంగా ద్రోహం తలపెడతాయో చెప్పారు. ఆయన చెప్పిన వాస్తవాలను అక్కడున్న యువతరం కోపంతో కాక ఆదరంతో స్వీకరించింది. ప్రసంగానంతరం సభ అంతా ముక్తకంఠంతో "జై హింద్... జై భారత్‌మాత" అంటూ మారుమ్రోగింది. దేశభక్తి ఉండాలంటే మన గత వైభవాన్ని తెలుసుకోవాలి.

గతమెంతో ఘనకీర్తి కలవోడా!: ఆధునిక వైద్య శాస్త్రానికి ఆయువు పోసింది భారతీయులు. సున్నా నుంచి తొమ్మిది వరకు ఉన్న అంకెలను గణితశాస్త్రానికి అందించింది భారతీయులే. ఈ అంకెలు సంస్కృతంలో అనాదిగా ఉన్నవే. సుసంపన్న దేవాలయాల నుంచి ఎన్నిసార్లు దోచుకొని పోయినా ఇప్పటికీ భారతదేశం సంపన్న దేశమే. వేదాంత విషయాలలో నేటికీ అగ్రస్థానం భారతీయులదే. సంగీతానికి సప్తస్వరాలనూ, లిపినీ అందించింది భారతీయులే. సారస్వత విభాగాన్ని విశ్లేషిస్తే మన ఇతిహాసాలు, పద్యకావ్యాలు, నాటకాలు మరి ఏ ఇతర దేశాల గ్రంథాలతో పోల్చినా, ఉన్నతస్థాయి గ్రంథాలుగా పరిగణింప బడతాయి. ఇంకా ఎన్నిటినో భారతదేశం సాధించింది. ఈ భూగోళం మీద పవిత్ర పుణ్యభూమి అని ప్రశంసించబడే ప్రదేశం ఏదైనా ఉందీ అంటే ఆ అర్హత కలిగింది భారతదేశమే.

భారతీయులలో కనిపించే సుహృద్భావం, ఉదారత, పవిత్రత, విచారం, తాత్త్విక ప్రవృత్తి మరి ఏ ఇతర దేశీయులలోనూ కనిపించవు. వేదాలు మన ముందు ఉంచిన లక్ష్యాన్నే దృష్టిలో ఉంచుకొని; భౌతిక సంపదలకు ఎన్నడూ ప్రాముఖ్యం ఇవ్వని దేశం మనది. పాశ్చాత్యులు భౌతిక సంపదలపై దృష్టి సారిస్తే, భారతీయులు బుద్ధివికాసానికి దారితీసే మార్గాలను వెతికారు. ఇంతటి వైభవ కీర్తి ఉన్న భారతదేశం గురించి ప్రపంచ దేశాలకు తెలియజేస్తూ, **'నా దేశం గతంలోకి, చరిత్రలోకి ఒకసారి వెనుదిరిగి చూస్తే నా దేశంతో సరిసమానమైనదిగా, పుణ్యభూమిగా ప్రశంసలు**

అందుకునే దేశం మరొకటి లేదు. బుద్ధివికాసానికి భారతీయులు ఇచ్చినంత ప్రాముఖ్యం మరే దేశీయులూ ఇవ్వలేదు' అని అంటారు స్వామి వివేకానంద.

గత వైభవ కీర్తి – వర్తమానానికి స్ఫూర్తి: పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఇలా అంటారు – Inspired by their past, nations must live in the future and act in the present - 'గత వైభవపు స్ఫూర్తిని భవిష్యత్తుకు పునాదిగా భావిస్తూ వర్తమానంలో కార్యాలు నిర్వహించాలి.' ప్రతీ భారతీయుడు వారి వారి పనులలో భారతీయతను ప్రతిబింబించేలా ప్రతిన బూనాలి. చికాగో సర్వమత మహాసభలో స్వామి వివేకానంద చేసిన ప్రసంగానికి ముగ్ధురాలైన శ్రీమతి అనీబిసెంట్ ఈ విధంగా అభివర్ణించింది – 'స్వామి వివేకానంద సనాతన ధర్మ ప్రతినిధిగా జాతిగౌరవాన్నీ, దేశభక్తినీ ప్రతిబింబించేలా దర్పాన్ని అణువణువునా ప్రదర్శించారు. భారతదేశ దూతగా విచ్చేసిన ఆయనను పరిశీలించిన వారెవ్వరూ అతిశయంతో విర్రవీగుతున్న పాశ్చాత్య దేశాల ముందు భారతదేశ ఔన్నత్యాన్ని తక్కువగా అంచనా వేయలేరు.' ఆ విధమైన దర్పాన్ని ప్రదర్శించాలంటే మనకు ఏ

అమరదేశం

– స్వామి రఘునాయకానంద

పాటి దేశభక్తి ఉండాలో చూడండి. ఆ విధమైన దేశభక్తి ఉన్ననాడు కవి తన దేశభక్తిని చాటుకొన్నట్లుగా మనమూ 'పాడరా ఎలుగెత్తి భవ్య భారతగీతి, చాటరా చెయ్యెత్తి జాతి వైభవ కీర్తి' అంటూ దేశభక్తిని చాటుకోగలం.

దేశభక్తి అంటే క్షణికమైన, ఆకస్మికంగా ఉప్పొంగే భావోద్వేగం కాదు. అది జీవితాంతం ఉండే ప్రశాంతమైన, స్థిరమైన సమర్పణా భావం. దేశభక్తి అంటే రెండు దేశాల మధ్య జరుగుతున్న ఆటల పోటీలో మనం వ్యక్తపరచే భావోద్వేగం అనుకొంటాం. అది కాదు. ఆ భావోద్వేగాన్ని మన ప్రవర్తన, కర్తవ్యనిష్ఠ, కార్యదక్షతల్లో వ్యక్తపరచాలి. ఏ పని చేసినా దాని వల్ల 'నా దేశానికి ఏమి మేలు జరుగుతుంద'ని ఆలోచించి చేయాలి. Ask not what your country did for you... Ask what you did for your country – 'నీ కోసం దేశం ఏమి చేసిందని అడగకు.. నీవు నీ దేశం కోసం ఏమి చేశావు అన్న దాని మీద నీ దృష్టిని సారించు.' జపాన్ లాంటి దేశాలలో ప్రతీ పౌరుడు జాతీయ గర్వం (National pride) కలిగి ఉంటాడు. 'నా దేశ పురోభివృద్ధికి నేను శ్రమించాలి' అన్న భావన కలిగి ప్రతీ పనిలో నాణ్యతను ప్రదర్శిస్తాడు. అదే మన ఆదర్శం కావాలి. విద్యార్థిగా జ్ఞానసముపార్జన చేయాలి, జీవితాంతం ఉన్నత విలువలను నేర్చుకొంటూ, ఆచరణలో చూపిస్తూ, మేధను ఉపయోగించి కొత్త విషయాలను సృష్టించాలి. నూతన ఉత్పత్తులను తయారు చేసి అంతర్జాతీయంగా ధ్రువీకరణ హక్కులను (Patent rights) సాధించాలి.

పాశ్చాత్య పోకడలను ఆచరించడమే గొప్ప అని భావించి, భారతీయ విధానాన్ని పూర్తిగా వదిలిపెట్టడం చాలా హాస్యాస్పదంగా, ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఇతరుల సంస్కృతిని అంగీకరించే ఉదారహృదయులమే కావచ్చు కానీ యుగయుగాలుగా వస్తున్న మన జీవనశైలిని విస్మరించే స్థాయికి దిగజారకూడదు. మన ఆచార వ్యవహారాలలో ఉన్న మర్మాన్ని గ్రహించి, ఆచరించడం మంచిది. పాశ్చాత్య దేశాలలోని మంచి విషయాలను గ్రహిద్దాం. కానీ వాటిని మన దేశ విధానాలకు అనుగుణంగా మలచుకొని స్వీకరిద్దాం. ఇదే నిజమైన దేశభక్తి. గత వైభవాన్ని స్ఫూర్తిగా నిలుపుకొని వర్తమానంలో ఆచరణలో పెడుతూ భవిష్యత్తుకు పునాదిగా మలచుకొందాం.

వివేకానందుని దేశభక్తి: స్వామి వివేకానందకున్న దేశభక్తి అసామాన్యమైనది. ఆయనలో దేశభక్తి ఎంత పొంగి పొరలిందంటే తన పాశ్చాత్య శిష్యురాలు 'మీకు ఏ విధంగా సహాయపడగలను' అని ప్రశ్నించినప్పుడు దానికి ప్రత్యుత్తరంగా 'భారతదేశాన్ని ప్రేమించు' అన్నారు.

స్వామీజీకి భారతభూమి ఒక పవిత్రభూమి. ఒక ఆధ్యాత్మిక సౌధం. భరతభూమిలో దీనజనుల సేవకై వెయ్యి జన్మలు ఎత్తడానికైనా సిద్ధం అని స్వామీజీ ఉద్ఘాటించారు. ఆయనకు భారతదేశం పట్ల ఉన్న గౌరవం అపారం. దేశాన్ని ప్రేమించే విషయంలో గానీ, దేశాన్ని గురించి గర్వపడే విషయంలో గానీ, దేశ శ్రేయస్సుకు కృషి చేసే విషయంలో గానీ ఆయనకు ఆయనే సాటి. 'భారతదేశమే స్వామీజీ ఆత్మస్పందన. ఆయన గుండె చప్పుళ్ళు భారతదేశాన్నే ధ్వనింపజేస్తాయి. ఆయన నాడిలో భారతదేశం సవ్వడిస్తుంది' అంటారు సోదరి నివేదిత. రోమారోలాతో 'మీరు భారతదేశం గురించి తెలుసుకోవాలంటే స్వామి వివేకానందుణ్ణి అధ్యయనం చేయండి' అన్న రవీంద్రనాథ్ టాగూర్ వ్యాఖ్యలు అక్షరాలా సత్యం.

భరతభూమిపై పుట్టిన ప్రతీ పౌరుడూ దేశభక్తిని కలిగి ఉండాలి. అయితే ఈనాడు ఒక విధమైన నిరాశావాదంతో దేశం నిండిపోయింది. 'భ్రష్టులతో నిండిన ఈ దేశాన్ని తీర్చిదిద్దలేం' అన్న నిరాశావాదం భారతీయులలో చోటు చేసుకుంది. 'నేను ఒంటరిగానైనా సరే దేశాన్ని కాపాడగలననే' ఆశావాదంతో ప్రతీ పౌరుడు ముందుకు సాగాలి. 'నా దేశం అమరదేశ'మని చాటాలి. ❖

'భారత భూమియే నా అత్యున్నత స్వర్గం. భారత దేశపు శ్రేయస్సే నా శ్రేయస్సు' అని పలుకుము. 'జగజ్జననీ! నాలో దుర్బలత్వాన్నీ, పౌరుషవిహీనత్వాన్నీ పారద్రోలుము!' అని ప్రార్థింపుము – స్వామి వివేకానంద

ప్రపంచసుందరిగా స్వర్ణకిరీటాన్ని గెలుచుకున్న ఓ యువతి ఓ రోజు అంధుల అనాథ శరణాలయానికి వెళ్ళింది. ఎంతో సంబరంతో పిల్లలందరూ ఆ అమ్మాయికి స్వాగతం పలికారు. ఆ పిల్లలకు పండ్లూ, మిఠాయిలు పంచి పెట్టి, ఎంతో ఉల్లాసంగా గడిపిన తరువాత ఆ ప్రపంచసుందరికి ఓ సందేహం కలిగింది. పుట్టు అంధులైన ఆ చిన్నారులు అసలు అందం గురించి ఏమనుకుంటున్నారో, అందానికి ఏం నిర్వచనం చెబుతారో తెలుసుకోవాలనిపించింది. అదే భావనతో అక్కడే అన్నం తింటున్న ఓ ఎనిమిదేళ్ళ పాప దగ్గరకు వెళ్ళి సరదాగా "పాపా! నేను ఈ ప్రపంచంలోని అమ్మాయిల్లోనే అందమైన దాన్నని కిరీటం పెట్టారు కదా! 'అందం' అంటే ఏంటో నీకు తెలుసా? అసలు అందం గురించి నీవేమనుకుంటున్నావు?" అని ప్రశ్నించింది. వెంటనే ఆ పాప ప్రసన్నంగా నవ్వుతూ, ఏమీ మాట్లాడకుండా తన ముందున్న పళ్ళెంలోంచి ఓ ముద్దతీసి ఆ ప్రపంచసుందరికి నోటి దగ్గర పెడుతూ తినిపించే ప్రయత్నం చేసింది. ఒక్కసారిగా ఆ యువతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఆ పాప ముఖంలోని నిర్మలత, మనస్సులోని ప్రేమమయ స్పందనలనే అంతఃసౌందర్యం ముందు తన బాహ్యసౌందర్యం వెలవెల బోయినట్లనిపించింది. వెంటనే తన తలపై ఉన్న కిరీటాన్ని ఆ అమ్మాయికి అలంకరించి, ఆలింగనం చేసుకుంది. కాలంలో కరిగిపోయే ఈ భౌతికమైన సౌందర్యం కన్నా, అంతరసౌందర్యం ఎంత అపురూపమైందో అర్థమైంది. కానీ ఆధునిక సమాజంలో చర్మచక్షువులకు కనబడే పైపై మెరుగులనే అంద చందాలనుకొని అపోహపడుతున్నాం.

సౌందర్యం....సౌశీల్యం: ముఖ్యంగా ఈతరం యువతీ యువకుల్లో చాలామంది శారీరక సౌందర్యమే తమ అస్తిత్వానికి (identity) ప్రమాణంగా భావిస్తున్నారు. అందంగా ఉంటే అన్నీ సాధించినట్లేనన్న భ్రమల్లో ఉన్నారు. వ్యక్తిత్వవికాసం, మానవతా విలువల కన్నా అందచందాలు, ఆకర్షణలు, అలంకరణలకే ప్రాధాన్యాన్నిస్తున్నారు; అవే ప్రపంచమనుకుంటున్నారు. ప్రసార, ప్రచార సాధనాలు కూడా యుక్తవయస్సు అనగానే ఈ పైపై పటాటోపాలే అన్నట్లుగా హోరెత్తిస్తున్నాయి; మోజుల మైకంలో పడేస్తున్నాయి. అవి లేకపోతే అది యవ్వనకాలమే కాదన్నట్లుగా కలవరపెడుతున్నాయి. అందుకే ఆ స్థాయిలో హడావిడి చేయలేని అమ్మాయిలు, అబ్బాయిలు ఆత్మన్యూనతతో కుంగిపోతున్నారు. తమకు ఈ సమాజంలో విలువలేదని విచారపడుతున్నారు. ఎంతోమంది తల్లితండ్రులు కూడా తమ పిల్లల్లో పసితనం నుంచే సౌందర్యస్పృహను పెంచిపోషిస్తున్నారు. వారి ఆలోచనలను శరీర సౌందర్యోపాసనకే పరిమితం చేస్తున్నారు. కేవలం బాహ్య సౌందర్యమే ప్రధానమనుకొని యుక్తవయస్సులో ఆ సౌందర్య సంరక్షణకే సమయమంతా కేటాయించేవారు, ఆంతరిక పరిణతిని విస్మరించామేనని భవిష్యత్తులో తీవ్రమైన పశ్చాత్తాపానికి గురికావలసి ఉంటుంది. వ్యక్తికి పరిపూర్ణమైన గౌరవాన్ని, గుర్తింపును తెచ్చిపెట్టేది మానసిక వికాసం, శీలసంపద అన్న విషయాన్ని మరచిపోకూడదు. అందుకే మన సనాతన ధర్మం...

రూప యౌవన సంపన్నా విశుద్ధ కుల సంభవాః ।
జ్ఞాన హీనో న శోభంతే నిర్గంధా ఇవః కింశుకా ॥ అంటూ

మోదుగపూలు ఎంతో ఎఱ్ఱగా, చూడటానికి అందంగా కూడా ఉంటాయి. కానీ వాసన లేనందున శోభ లేకుండా పోయాయి. అలాగే ఎంత అందంగా ఉన్నా, వయస్సులో ఉన్నా, సంపద ఉన్నా, ఎంత మంచి కులంలో పుట్టినా, జ్ఞానం లేకపోతే లోకంలో గౌరవం ఉండదు, రాణింపు ఉండదని హితవుపలికింది.

అందం...అహంకారం: అందంగా కనిపించాలను కోవడం, ఆకర్షణీయంగా అలంకరించుకోవడం తప్పు కాదు. ముఖంలో కళాకాంతులు లేకుండా జీవించమనీ కాదు. కానీ ఆ సౌందర్యకాంక్ష పరిధిని మించకూడదు. కృతకమై మన వ్యక్తిత్వానికే మచ్చ తేకూడదు. పైగా చాలా మంది కాస్తంత అందంగా ఉండగానే అహంకారంతో విఱ్ఱవీగుతూ ఉంటారు. తమకు, తాము ఓ ప్రత్యేకమైన వ్యక్తిగా అపోహపడుతూ

అందమంటే...

– బి. సైదులు

ఉంటారు. అలాంటి వారు ఏదో వస్త్రాలయంలో రంగుల బొమ్మల్లా కొన్నాళ్ళు అందరినీ ఆకర్షించగలరేమో కానీ నిజమైన ఆదరణను, అభిమానాన్నేమీ చూరగొనలేరు. సమాజంలో విభిన్నరంగాల్లో కీర్తిశిఖరాలను అధిరోహించినవారూ, మార్గ దర్శులుగా నిలిచినవారూ భౌతికంగా పెద్ద ఆకర్షణీయులేమీ కారు. వారికి అలా కనిపించాల్సిన అవసరమూ లేదు. ఉదాహరణకు మదర్‌థెరెసా ఏ అందాలపోటీల్లో గెలిచారని ఆమెను ప్రపంచం ఆరాధిస్తోంది... మహాత్మాగాంధీ, అబ్రహాం లింకన్ ఏం ఆకర్షణీయంగా ఉన్నారని లోకమంతా బ్రహ్మరథం పట్టింది. అందుకే ఓ ఆంగ్లకవి... 'Real beauty is not what the eyes can behold, but what the heart can hold. What we see with our eyes will vanish someday. But what we store in our heart will forever stay... కళ్ళను కట్టి పడేసేది అసలైన అందం కాదు; మనస్సును కదిలించే హృదయసౌందర్యమే కలకాలం నిలిచి ఉంటుంది' అని అంటారు. ఆంతరంగికంగా ఎక్కడో అసంతృప్తి, ఆత్మన్యూనతతో అవస్థలు పడేవారే, విపరీతంగా బాహ్యాకర్షణలు, సౌందర్య ప్రదర్శనల కోసం తాపత్రయపడుతూ ఉంటారు. ఖరీదైన దుస్తులు ధరించి, కళ్ళు మిరుమిట్లు గొలిపే ఆభరణాలు

అలంకరించుకున్నంత మాత్రాన మనమేమీ ఎదుటివాళ్ళ మనస్సులో సుస్థిర స్థానాన్ని దక్కించుకోలేం.

ప్రసన్నతే పరమసౌందర్యం...: ఓ యువ ఐఏఎస్ అధికారి వివాహం ఓ ఐదుతారల ఆహారశాల (ఫైవ్‌స్టార్ హోటల్)లో జరిగింది. ఆ వేడుకల్లో పాల్గొన్న శ్రీమంతుల వస్త్రాలు, వజ్రాభరణాలు కుబేరుడికే కళ్ళుకుట్టేలా ఉన్నాయి. కానీ ఒక్కరి ముఖంలో కూడా ప్రసన్నత, ప్రశాంతత కనిపించలేదు. చివరకు యువబృందాల వదనంలో కూడా ఆహ్లాదం, సహజత్వం మచ్చుకైనా పొడచూపలేదు. ప్రతి ఒక్కరూ నవీన నాగరకత పేరుతో ముఖాలకు ఏవేవో రంగులు పులుముకోవడం, విచిత్ర కేశాలంకరణలతో తిరుగాడటం కృతకంగా అనిపించింది.



అందానికీ హంతకులు...

బాహ్యసౌందర్యానికి వివశులై, బాహువులున్న పశువులై సభ్యసమాజం తలదించుకునేలా అమ్మాయిలపై అరాచకాలకు పాల్పడుతున్న అపరరాక్షసులు పెరిగిపోయారు. కన్నకడుపుకే చేటు తెస్తున్న అపరకీచకులు ఈ భూమికే భారం...మానవజన్మకే కళంకం. అందుకే 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రిగారు...

బుద్ధదేవుని భూమిలో పుట్టినావు,
సహజమౌ ప్రేమ నీలోన చచ్చెనేమో?
అందమును హత్యజేసెడి హంతకుండ!
మైలపడిపోయెనోయి! నీ మనుజ జన్మ!... అంటారు.

అందరూ మరబొమ్మల్లా కదలాడుతున్నట్లు తోచింది. పైగా వారి పలకరింపులు, పోకడలు కూడా చాలా అసహజంగా ఉన్నాయి. అక్కడ ఒక శుభకార్య వాతావరణమే కనిపించలేదు. ఇలా జీవకళ లేని ముఖాలతో మనస్సులు ఏం బావుంటాయి? మానవ సంబంధాలు ఎలా మెరుగవుతాయి?. మధురమైన మందహాసాలు, మసకబారని ఆలోచనలతో అల్లుకుపోయిన వదనమే సౌందర్య నిలయం. అందుకే మన పెద్దలు....

వదనం ప్రసాద సదనం హృదయం సుధా మువాచః ।
కరణం పరోపకరణం ఏషాం కేషాం సతే వంద్యాః ॥

'ఎవరి ముఖమైతే ఎప్పుడూ ప్రసన్నంగా ఉంటుందో, ఎవరి హృదయమైతే ఎప్పుడూ దయాగుణం కలదై ఉంటుందో, ఎవరి పలుకులు ఎల్లప్పుడూ అమృతాన్ని ఒలికిస్తూ ఉంటాయో, ఎవరి పనులు ఎప్పుడూ పరోపకారాలుగా ఉంటాయో, అలాంటి వారు అవశ్యం వందనీయులం'టారు. అందుకే ఆదిశంకరాచార్యులు సౌందర్యలహరిలో అమ్మవారిని వర్ణిస్తూ దయే సౌందర్యమంటారు.

యువతీయువకులకు అన్ని విషయాల్లో మాదిరే అందం విషయంలో కూడా అనుకరణ వ్యామోహం పట్టుకుంది. ఎవరి శారీరక ధర్మాన్ని బట్టి వారు నడుచుకోవాలన్న స్పృహే కొరవడుతోంది. అందుకే మనకు అనువుకాని సౌందర్యసాధనాలను, లేపనాలను దిగుమతి చేసుకుంటూ, వాటికి అలవాటుపడుతూ లేనిపోని అవస్థల పాలవుతున్నాం. ఆరోగ్యాలనూ పాడుచేసుకుంటున్నాం.

ఆనందమే అందం...: నిజానికి ఆనందమే అందం. మరొకరి జీవితంలో ఆనందాన్ని పల్లవింపచేస్తే అది అందానికే అందం. అందుకే సీతామాత జాడతెలిపి సీతారాముల జీవితంలో ఆనందచంద్రికలను వెలిగించిన ఘట్టం కనుకనే సీతాన్వేషణ ఘట్టాన్ని 'సుందరకాండ' అని పిలుస్తారు.

చాలా మంది ఆకర్షణీయంగా ముస్తాబవుతున్నా, ముఖంలో మాత్రం నిరంతరం ఏదో కోల్పోయినట్లు, ఉదాసీనత, ఉత్సాహరాహిత్యం! ఇలాంటి ముఖస్థితితో ఎంత అందంగా ఉన్నా, చూసేవారికి మాత్రం నైరాశ్యం పుట్టుకొస్తుంది. ఇలాంటి నవతరాన్ని ఉద్దేశించే స్వామి వివేకానంద...

'If you have a clouded face do not go out that day, shut yourself up in your room. What right have you to carry this disease out into the world? -

మనోవ్యాకులత నీ ముఖాన ద్యోతకమవుతున్న రోజున బయటకు రాకుండా తలుపులేసుకొని గదిలో కూర్చో! ఈ వ్యాధిని ప్రపంచమంతా వ్యాపింపచేయటానికి నీకేం హక్కుంద'ని ప్రశ్నిస్తారు. ఎలాంటి అలజడి, అరమరికలు లేని నిర్మల మనస్కులు బాహ్యంగా ఎలా ఉన్నా, సుందరమూర్తులే; కోటి వికారాలతో కోతిలా ప్రవర్తించేవారు బయటకు ఆకర్షణీయంగా కనిపించినా పురుగులు పట్టిన మేడిపళ్ళలాంటివారే! ❖

ధనం కాదు, కీర్తి ప్రతిష్ఠలు కాదు, పాండిత్యం కాదు, సౌశీల్యమొక్కటే కష్టాలనే దుర్భేద్యమైన అడ్డుగోడలను ఛీల్చుకొని పోగలిగినది. దీనిని ఎల్లప్పుడూ జ్ఞప్తిలో ఉంచుకోండి. - స్వామి వివేకానంద



మతాలను మించిన మమతలు

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

ఎన్నో రోజులుగా మా సేవాకార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనే రహమాన్ అంటే నాకు ప్రత్యేకమైన అభిమానం. మేము నడిపే శరణాలయంలో పిల్లలు, అనాథల విషయంలో అతను ఎంతో దయగా ఉంటాడు. నాపై గౌరవంతో ఒక రోజు రహమాన్ వాళ్ళ అమ్మ, భార్య నా రచనలు చదివి అభిమానులయ్యారనీ, ఎలాగైనా నన్ను చూడాలని అనుకుంటున్నారనీ చెప్పి, నన్ను వాళ్ళింటికి భోజనానికి ఆహ్వానించాడు.

రహమాన్‌పై ఉన్న అభిమానంతో, కాదనలేక ఓ ఆదివారం వాళ్ళింటికి అతిథిగా వెళ్ళాను. ఎంతో పొందికగా ఉన్న ఆ ఇంట్లోకి వెళ్ళగానే, ఆయన భార్య సల్మా చిరునవ్వుతో నాకు స్వాగతం పలికింది. తరువాత కొద్ది క్షణాలకు వంటింట్లో నుంచి ఓ స్త్రీ వచ్చింది. 'మేడమ్! ఈవిడే మా అమ్మ' అని రహమాన్ పరిచయం చేశాడు.

ఆమెను చూస్తే నాకు ఆశ్చర్యమేసింది. పెద్దబొట్టు, రెండు చేతులకూ నిండుగా ఆకుపచ్చ గాజులు, తలలో పూలు పెట్టుకొని ఉన్న ఆమె నాకు నమస్కారం చేసింది. ఇంతలో పక్క గదిలో నుంచి వచ్చిన వాళ్ళ అక్క ఉషను, రహమాన్ పరిచయం చేశాడు. అక్కా తమ్ముళ్ళకు పోలికే లేదు. ఆ కుటుంబాన్ని చూశాక నాకు అంతా అయోమయంగా అనిపించింది. అయినా వాళ్ళ ప్రేమలు, పలకరింపులు నాకు చాలా ఆనందాన్ని కలిగించాయి. తరువాత ఆ ముగ్గురూ వంటకాల పని మీద పక్కగదిలోకి వెళ్ళిపోయారు. నేను, రహమాన్ మాత్రం మిగిలిపోయాం. నా అయోమయాన్ని గమనించి...

'మేడమ్! మీరు ఏం ఆలోచిస్తున్నారో నేను అర్థం చేసుకోగలను. నేను పుట్టక ముందు నుంచి ఉష అక్క వాళ్ళు మా ఇంటి పక్కనే ఉండేవాళ్ళు. మతాలు వేరైనా మా నాన్న, వాళ్ళ నాన్న మిత్రులుగానే ఉండేవారు. కానీ ఆడవాళ్ళకు అంతగా పడకపోయేది. మా అమ్మ ఫాతిమాకూ, ఉష అక్క వాళ్ళ అమ్మ కాశీబాయికీ మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేది. ఇంతలో మా అమ్మకు నేను కడుపులో పడ్డాను. కానీ, ప్రసూతి సమయంలో నన్ను కని, మా అమ్మ కన్నుమూసింది. ఆ రోజు ఉష అక్క, వాళ్ళ అమ్మ ఎంతో ఏడ్చారట! నేను, నాన్న ఒంటరి వాళ్ళమైపోయాం.

రెండు నెలల పిల్లవాడిగా ఉన్నప్పుడు ఒక రోజు అర్ధరాత్రి నేను గుక్కపట్టి ఏడుస్తుంటే, పక్కింట్లో నుంచి కాశీబాయి పరుగెత్తుకొని వచ్చింది. సహజమైన మాతృత్వపు మమకారంతో నన్ను తన ఒడిలోకి తీసుకుంది. గుండెలకు హత్తుకొని పాలిచ్చింది. ఆ రోజు నుంచి ఆమే నాకు అమ్మ అయింది. నాకు రహమాన్ అని పేరుపెట్టినా, కాశీబాయినే నేను అమ్మ అని, ఉషనే నేను అక్క అని పిలిచేవాణ్ణి. రాత్రి నాన్న దగ్గర పడుకునేవాణ్ణి. కానీ రోజంతా వాళ్ళింట్లోనే ఉండేవాణ్ణి. ఉషక్కను మాత్రం తననే స్నానం చేసుకోమని చెప్పేది అమ్మ. నాకు మాత్రం అమ్మే స్నానం చేయించేది. అక్కతో పాటు నాకూ భోజనం క్యారేజీలో కట్టి, పాఠశాలకు పంపేది. కొన్నాళ్ళకు మా నాన్న క్షయ వ్యాధితో చనిపోయాడు. మా నాన్న అంత్యక్రియలు కూడా వాళ్ళే చేశారు. నా బాధ్యతను పూర్తిగా వాళ్ళే తీసుకున్నారు.

నా మతం, నమ్మకాల గురించి మాత్రం కాశీబాయి అమ్మ ఎన్నో జాగ్రత్తలు తీసుకునేది. ప్రతి శుక్రవారం నమాజుకూ, ఖురాన్ తరగతులకూ పంపేది. ముస్లిం పండగలప్పుడు నాకు ఏ లోటూ రాకుండా చూసుకునేది. ఇంట్లో తమ సొంత బిడ్డ ఉషక్కను ఎలా చూసుకునేవాళ్ళో నన్నూ అలాగే చూసుకునేవాళ్ళు. పై చదువుల కోసం కూడా ఒకే కళాశాలకు పంపారు.

చదువులు పూర్తయ్యాక ఒక రోజు అమ్మ నాతో, "దురదృష్టం కొద్దీ మీ అమ్మానాన్నల ఫోటోలు లేవు బాబూ! అందుకని మక్కావైపు తిరిగి అల్లానూ, మీ అమ్మ ఫాతిమాబీనీ, నాన్న హుస్సేన్‌నూ ప్రార్థించు. వాళ్ళు నిన్ను దీవిస్తారు" అంది. ఆ ఆప్యాయత, అనురాగాలకు నేను చలించిపోయాను. నాకు అప్పుడు మా అమ్మ ఫాతిమా ముఖమైనా గుర్తుకు రాలేదు. వెంటనే కళ్ళ ముందున్న కాశీబాయి అమ్మ కాళ్ళ మీద పడిపోయాను. 'అమ్మా! నువ్వే మా అమ్మవి, నువ్వే మా మక్కావి' అన్నాను. తరువాత వాళ్ళ దయ వల్ల నాకు బెంగుళూరులో మంచి ఉద్యోగం వచ్చింది. వాళ్ళ ఆశీస్సులతోనే సల్మాను పెళ్ళి చేసుకున్నాను. అమ్మ, సల్మా – ఇద్దరూ ఇప్పుడు నా దగ్గరే ఉంటారు. రాఖీ కట్టేందుకు ఈ రోజు వాళ్ళ ఊరు నుంచి నా కోసం ఉషక్క వచ్చింది' అన్నాడు రహమాన్.

నా కళ్ళు చెమ్మగిల్లాయి. కాశీబాయి ఏమీ చదువుకోలేదు. అయినా ఎంత పెద్ద మనస్సు! పరాయిబిడ్డను తన బిడ్డగా పెంచింది. మతాలకు అతీతంగా మమతలను పంచింది. ఆ క్షణంలో నాకు ఆ ఇంటి గోడపై ఉన్న మక్కా, శ్రీకృష్ణుడి ఛాయాచిత్రాలు మరింత ప్రకాశవంతంగా కనిపించాయి. ❖

సేకరణ: జి.సతీష్


సరళతే పరిణతి

– స్వామి రంగనాథానంద

(రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

మనలో చాలా మంది చతురతనూ, కాపట్యాన్నీ కార్యదక్షతగా భ్రమపడుతూ ఉంటారు. ఇతరుల ముందు మనస్సులకు ముసుగేసుకొని మసలుకుంటూ ఉంటారు. చాలా విషయాల్లో దాపరికంగా వ్యవహరిస్తూ ఎవరికీ తాము చిక్కడం లేదని గర్వపడుతూ ఉంటారు. కానీ ఈ వైఖరి మానవ సంబంధాలను దెబ్బతీస్తుంది. అంతే కాకుండా ఇలాంటి మనస్తత్వం వల్ల ఇతరులకు మనపై నమ్మకం కూడా సన్నగిల్లుతుంది. అందుకే సరళత్వం, నిర్మలత్వం తోనే మనిషి ఎక్కడైనా దీర్ఘకాలంగా గౌరవాన్ని సంపాదించగలడు. పసిపిల్లల నుంచి మనం నేర్చుకోవలసిన అత్యంత గొప్ప లక్షణం సరళత్వం. కానీ దురదృష్ట వశాత్తూ వయసు పెరుగుతున్న కొద్దీ మన మనస్సులో లేతదనం కనుమరుగవుతోంది.

స్వామి వివేకానంద సంపూర్ణ సాహిత్యాన్ని చదివిన తరువాత అందులోని ఒక వాక్యం నన్ను ఎంతో ఎక్కువగా ప్రభావితం చేసింది. నా జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవడానికీ, సమాజసేవలో నిమగ్నమవడానికీ ఆ వాక్యమే ఎక్కువ స్ఫూర్తినిచ్చింది. స్వామీజీ తన ప్రసంగ పరంపరలో ఓ చోట 'Can you combine seriousness with child like naivete?' అని ప్రశ్నిస్తారు. 'naivete' అంటే సరళత. ఇంకా చెప్పాలంటే, కృత్రిమత్వం, కపటత్వం లేకపోవడం! సరళతతో కూడిన హుందాతనం, గాంభీర్యం మనల్ని నిజమైన నాయకులుగా నిలబెడతాయి. అలాంటి వ్యక్తులే శాశ్వతమైన విజయాలను కూడా సాధించగలరు. అదృష్టవశాత్తూ నాకు అలాంటి ఎంతో మంది గొప్ప వ్యక్తుల సాహచర్యం లభించింది. సరళత, సహకారంతో కూడిన వారి సాన్నిహిత్యం మనలో శక్తినీ, స్థైర్యాన్నీ ఇనుమడింపజేస్తాయి. ...If that spirit is not there in any section, I feel somewhat suffocated in its atmosphere. A group of people who only talk about their own little things, trivial things, selfish things, that group will not be able to inspire persons like me. నిరంతరం కపటత్వంతో, స్వార్థంతో, నిరర్థకమైన, అల్పమైన విషయాల గురించి చర్చించుకొంటూ కాలం గడిపే వ్యక్తుల మధ్య వాతావరణం అంత ఆశాజనకంగా ఉండదు. పైగా అలాంటి వారి నుంచి మనం ఎలాంటి స్ఫూర్తినీ పొందలేం. ఆ సంభాషణలు, వ్యవహారాలు అటు వారికీ, ఇటు మనకూ ప్రయోజనకరంగా ఉండవు. ముఖ్యంగా నా లాంటి వ్యక్తులకు అలాంటి వ్యక్తుల సమూహం అంతగా సరిపడదు.



ఎలాంటి కాపట్యమూ లేకుండా నిర్మలంగా ఉన్న మనస్సే ఉన్నతమైన విషయాలపై దృష్టి పెట్టగలదు. అరమరికలు లేకుండా ఆలోచించుకొని మంచి నిర్ణయాలు తీసుకోగలదు. అయితే బాధాకరమైన విషయం ఏమిటంటే, ఆధునిక జీవన వ్యవహారాలు, వృత్తి ఉద్యోగాల్లో యువతీ యువకులు చౌకబారైన చతురతను ప్రదర్శించడానికే ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి చతురత వల్ల స్వల్పకాలికంగా ఏదో లాభం కలిగినట్లు కనిపిస్తుంది. కానీ అది ఎంతో కాలం నిలబడదు. పైగా చేసే ప్రతి పనిలో, వ్యక్తిగత జీవితాల్లో కూడా గోప్యంగా, రహస్యంగా వ్యవహరించడం అలవాటుగా మారిపోతుంది. ఇది మానసిక అలజడికి దారితీయడమే కాక, వ్యక్తి విశ్వసనీయతను దెబ్బతీస్తుంది. అందుకే స్వామి వివేకానంద 'చతురత, కిలాడీతనం వల్ల మహత్తరమైన కార్యాలేవీ సాధ్యపడవ'ని హితవు పలుకుతారు.

చాలామంది పనిని తప్పించుకొనేందుకూ, బాధ్యతలను తగ్గించుకొనేందుకూ ఇలాంటి కాపట్యాన్నీ, చలాకీతనాన్నీ ప్రదర్శిస్తూ ఉంటారు. కష్టపడకుండా ఒళ్ళు దాచుకుంటూ ఉంటారు. పిల్లలు ఇలాంటి చతురతను అలవరచుకోకుండా చిన్నప్పటి నుంచే శిక్షణనివ్వాలి. సమస్య నుంచి తప్పించుకొనే సాధారణ స్థాయి తెలివితేటలు పొడసూపకుండా చూడాలి. దొంగచాటు వ్యవహారాలను ప్రోత్సహించకుండా, ఋజువర్తన పెంపొందేలా జాగ్రత్తలు తీసుకోవాలి.

కపటత్వం, రహస్యం, కిలాడీతనం లాంటి దుర్గుణాలు మనలోని నిర్భయత్వాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ దెబ్బ తీస్తాయి. మానసికశక్తిని హరించి వేస్తాయి. మనలోని ఆత్మశక్తిని ఆవిష్కరింపజేయడానికి అడ్డుపడతాయి. ప్రపంచంలో మహత్తరమైన కార్యాలను సాధించిన వారంతా సరళమైన మనస్తత్వం కలిగినవారే! ఎలాంటి దాపరికమూ లేకుండా స్వచ్ఛమైన మనస్సుతో మెలిగేవారు తాము అనుకున్నది సాధించడానికి అడ్డదారుల కోసం అన్వేషించరు. విశేషమైన వ్యక్తిత్వంతో శోభిల్లుతూ ఎంతోమందికి ఆదర్శంగా నిలబడగలరు. ❖ **సేకరణ: ఆర్. కృష్ణ**

అసూయా ద్వేషాలనూ, శునకాలలాగా ఒకరిపై ఒకరు అరుచుకోవడాన్నీ త్యజించండి. సన్మార్గాన్ని ఆశ్రయించి ధైర్యస్థైర్యాలతో ఉండండి. ముందు మనిషిగా మారడానికి ప్రయత్నించండి. - స్వామి వివేకానంద

స్వామి వివేకానంద క్విజ్ - జవాబులు

(1) 1899 జనవరి 29న సోదరి నివేదిత ఏర్పాటు చేసిన తేనీటి విందులో.

(2) 'ఆచండాలా ప్రతిహతరయో...', 'ఓం హ్రీం ఋతం...'

(3) 1899 జనవరిలో; స్వామి త్రిగుణాతీతానంద.

(4) 1899 మార్చి 19న, హిమాలయ పర్వతాలలో ఉన్న మాయావతిలో.

(5) స్వామి తురీయానంద, సోదరి నివేదితలతో కలసి ఎస్.ఎస్. గోల్కొండ అనే ఓడలో 1899 జూన్ 20న బయలుదేరి వెళ్ళారు.

(6) 1900 ఏప్రిల్ 14న స్వామీజీయే స్వయంగా స్థాపించారు.

(7) 1900 జూన్ 25న; స్వామి అభేదానంద శిష్యురాలు మిస్ మిన్నీబ్రూక్ ఆశ్రమ స్థాపనకు 160 ఎకరాల స్థలం ఇచ్చారు.

(8) 1900 డిసెంబర్ 6న.

(9) 1900 జూలై, న్యూయార్క్‌లో స్వామీజీయే స్వయంగా ఒక నమూనా రేఖాచిత్రాన్ని గీసి, దాన్ని తన శిష్యుడు హెన్రీవాన్ హాగెన్‌కు ఇచ్చారు. తగిన కొలతలతో చిత్రీకరించమన్నారు.

(10) తరంగజలం - కర్మయోగం, పద్మం-భక్తియోగం, ఉదయిస్తున్న సూర్యుడు - జ్ఞానయోగం, చుట్టుకొని ఉన్న పాము - రాజయోగం (జాగృతి చెందిన కుండలినీశక్తి), హంస-పరమాత్మలను సూచిస్తున్నాయి. అంటే కర్మ, భక్తి, జ్ఞాన, రాజ యోగాల సమన్వయంతో పరమాత్మను పొందవచ్చున్నది ఈ చిహ్నంలోని అంతరార్థం.

(11) లోకమాన్య బాలగంగాధర్ తిలక్ స్వామీజీని కలుసుకున్నారు. మహాత్మా గాంధీ స్వామీజీని కలుసుకోవడానికి బేలూరు మఠానికి వెళ్ళినప్పటికీ ఆయన అక్కడ లేకపోవడంతో వెనుదిరిగారు.

(12) మిస్టర్ హోరి - ప్రముఖ బౌద్ధ మఠాధ్యక్షుడు. మిస్టర్ ఒకాకురా కకుజొ - ప్రముఖ చిత్రకారుడు

(13) పేదల సహాయ సంఘం, రామకృష్ణ సేవాగృహం. నేడు 'రామకృష్ణ మిషన్ సేవాశ్రమం'గా పిలువబడుతోంది.

(...18వ పేజీ తరువాయి)

'పర్సెంటేజ్', 'మార్జిన్', 'మామూలు', 'కమీషన్', 'వాటా'లు, 'ఎక్స్‌ట్రా'లుగా పంచుకోగలమా?

'దేశభక్తి' అంటే కేవలం మాటలు, ఊకదంపుడు ఉపన్యాసాలు కాదనీ, 'చేవ కలిగిన చేతలు' అనీ గ్రహించాలి. 'రామకృష్ణ మిషన్ - మఠా'న్ని స్థాపించి కోట్ల మందికి ఆహారం, విద్య, వైద్యం, నైతిక, ధార్మిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక విలువలతో ప్రశిక్షణ, సేవలు అందిస్తూ - 'నేను మానవాళిని మేల్కొలుపుతూనే ఉంటాను' - 'I shall inspire men everywhere...' అంటూ గర్జించిన ఆ వేదాంత కేసరి, దేశభక్త శిరోమణి, వీర సన్న్యాసి - విశ్వాచార్య వివేకానందుని వేదాంత గర్జనను వినండి!

"So long as the millions live in hunger and ignorance, I hold every man a traitor who, having been educated at their expense, pays not the least heed to them" - "కోట్లాది ప్రజలు ఆకలితో, అజ్ఞానంతో అలమటిస్తూ ఉన్నంత కాలం, వారి కష్టార్జితంతో విద్య నేర్చి, వారి గోడు కొంచెమైనా పట్టించుకోని, వారికి కొంచెమైనా మేలు చేయని, సేవ చేయని ప్రతి ఒక్కరినీ 'దేశద్రోహి' అని నేను అంటాను."

మనం చదువుకున్న పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఎవరు కట్టారు? నిరుపేద కూలీలు. మనం నడిచిన, నడుస్తూన్న రోడ్డు ఎవరు వేశారు? నిరుపేద కూలీలు. మన ఫ్యాషన్ షాంపూలు, లిప్‌స్టిక్కులు, బెంజ్‌కార్లు, సుజుకీలు, టీవీలు, ఫ్రిజ్‌లు, పట్టుచీరలు, గ్లిట్టరింగ్ నెక్లెస్‌లు, డన్‌లప్ బెడ్డులు, ఏసీలు, వీడియో ఫోన్‌లు, లగ్జరీ సోఫాలూ, ఇన్‌స్టాంట్ కాఫీలు, బూందీ లడ్డూలు, సోనా బాస్మతీ రైస్‌లూ, లిచీ బాదామ్ ఐస్‌లూ - ఇవన్నీ, ఎవరు తయారు చేశారు, నిర్మించారు? నిరుపేద కార్మికులు, వ్యవసాయకూలీలు, కర్మాగారంలోని శ్రామికులు! అందరూ నిరుపేదలే! వారు నిర్మించిన వీటన్నింటినీ మనం దర్జాగా, హాయిగా భోగిస్తూ, ఉపయోగిస్తూ ఉన్నాం. కానీ, ఆ నిరుపేద కూలీల, కార్మికుల, శ్రామికుల స్వేదాన్ని ఏ కొద్దిగానైనా తుడవడానికీ, వారి ఆకలి మంటలను చల్లార్చడానికీ, హృదయ వేదనల్ని చిరునవ్వులుగా మార్చడానికీ మన వంతుగా ఏ కొంచెమైనా కృషి చేశామా? చేస్తున్నామా?

ఇక మాటలు కట్టిపెట్టి, రాసిన రాతల కట్టలు మూటకట్టి బంగాళాఖాతంలో పారవేసి - ఇప్పుడే, ఇక్కడే ఓ ప్రతిన బూనుదాం! మన నిరుపేద సోదరుల కోసం, మన వివేకానంద స్వామి కోసం, మన భరతమాత కోసం ఏదైనా 'మంచిపని' చేద్దాం! మన వివేకానంద గురుదేవుల పాదాలకు పుష్పాంజలి అర్పిద్దాం! ❖ **(ఆగష్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా)**



(1884 – 1967)

ముందుకు సాగిపో !

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ,
27-3-1953

ప్రియమైన సుధీన్!*

ఈ ప్రపంచం దిగ్భ్రాంతి గొలిపే అంశం. ఋషులు దాని రహస్యాలన్నింటినీ సులభంగా అవగాహన అయ్యేలా చేశారు. కానీ ఈ అంశాల గురించి చర్చించేందుకు మనకు సమయం లేదు. ఒక వేళ ఉన్నా అనేక కారణాల వల్ల మనస్సు అలాంటి ప్రశ్నలలోకి చొచ్చుకుపోలేదు. *'...శ్రుత్వాప్యేనం వేద న చైవ కశ్చిత్'* *(గీత 2.29)* – దాని (ఆత్మ) గురించి విన్నప్పటికీ కొందరు అర్థం చేసుకోలేరు.

నా జీవితంలోని జరిగిపోయిన సంఘటనలన్నింటినీ నేను గుర్తు చేసుకుంటున్నప్పుడు అవి నాకు స్వప్న సదృశంగా కనిపిస్తాయి. చాలా బాధాకరమైన అంశాలను కూడా ప్రస్తుతం నేను మర్చిపోయాను. మనకు వర్తమానం బాగా అర్థమవుతుంది. గతం మర్చిపోతాం. భవిష్యత్తు గురించి మనకు తెలియదు. మనం ఒక నదీ ప్రవాహంలో కొట్టుకుపోతున్నట్లు ఉంటుంది. ఎన్నో విషయాలను మనం దాటి వచ్చాం. వాటికి అంతే లేదు. ఎన్నో క్రొత్త విషయాలను భవిష్యత్తులో చూడబోతున్నాం. రాబోయే అద్భుత విషయాలను గురించి ముందుగానే తెలుసుకోవాలనే ఒక విధమైన తపన మనకు ఉంటుంది. ఈ విషయాలన్నీ ఎంతో ఆశ్చర్యకరమైనవి, అద్భుతమైనవి. కానీ మనం ఆగడానికి అవకాశం లేదు. కాలమనే ప్రవాహంలో తేలుతూ ముందుకు సాగిపోవలసిందే. ఎక్కడికో తెలియదు.

'మాత్రా స్పర్శాస్తు కౌంతేయ శీతోష్ణ సుఖ దుఃఖదాః... *(గీత 2.14)* – ఓ కౌంతేయా! విషయవస్తువులతో సంగత్వమన్నది శీతోష్ణాలు, సుఖదుఃఖాలు అనే ద్వంద్వాలను కలుగ జేస్తుంది.' భగవంతుణ్ణి ప్రత్యక్షం చేసుకోవాలంటే, ప్రపంచంలోని సుఖదుఃఖాలు, లాభనష్టాలు, దూషణభూషణలు మొదలైన వాటి పట్ల నువ్వు నిర్వికారంగా ఉండాలి సుమా! ఈ మార్గంలో నీ మనస్సుకు నిరంతర సాధనను అందజేస్తే బాహ్య ప్రపంచపు తాడనల వల్ల నీలో ఏ విధమైన ప్రతిస్పందనా ఉండదు. ఆ స్థితినే 'యోగారూఢత' అని అంటారు. యోగస్థితిని చేరాలనుకొనే మునికి, మతం అన్నది ఒక సైన్సు. దానిలోని సాధనలన్నీ కచ్చితమైన శాస్త్రీయ ఫలితాలనందిస్తాయని గుర్తుంచుకో!

ప్రపంచాన్ని కోరుకోకుండా కేవలం భగవంతుడే కావాలని అనుకున్నప్పుడు తప్పకుండా శాంతి లభిస్తుంది. ప్రాపంచిక విషయాలు మనిషి మనస్సులో అలజడి కలిగిస్తాయి. అదే సమయంలో మనిషి తన మనస్సును భగవదర్పితం చెయ్యాలనుకుంటాడు. ఇది చాలా అసంబద్ధమైన విషయం. అందుచేతనే భగవద్గీత మొట్టమొదటిగా కర్మయోగాన్ని సూచించింది. క్రియలు చేస్తూ కూడా వ్యక్తి అక్రియుడై ఉండవచ్చని చెబుతోంది భగవద్గీత. *'అనాశ్రితః కర్మ ఫలం కార్యం కర్మ కరోతి యః'* (*గీత 6.1*). విద్యుక్త కర్మలను చేస్తూ కూడా కర్మఫలితాలకు అతీతంగా ఉండడమని అర్థం.

వెయ్యి పనులు చేస్తున్నా కూడా మనస్సును ఫలితాలకు అతీతంగా, ఉన్నతంగా ఉంచగలగడమే కర్మయోగం. ఇది ఎలాంటిదంటే ఒక స్త్రీ తన ఇంటి పనులన్నిటినీ ఏకాగ్రతతో చేస్తూనే, మనస్సును తన ప్రేమికునిపై నిలిపి ఉంచుతుంది చూడు... అలాంటిది.

ఆ శ్రీహరే శ్రీరామకృష్ణులుగా మనల్ని ఉద్ధరించడానికి వచ్చారు. మనం సిద్ధంగా ఉండాలి. అంతే!

(*యువకుడిగా స్వామి ప్రేమేశానందకు పరిచితుడైన
సుధీన్ కాలాంతరంలో స్వామి భీమానందగా ప్రసిద్ధులు)

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద


తెలుగుసేత: కె. త్రివిక్రమరావు

మార్గదర్శకమైన ఆదర్శం లేకపోతే మీరు కేవలం పశుతుల్యులే! కాబట్టి మీ ఆదర్శాన్ని తగ్గించు కోకండి. అలా అని అసాధ్యమైన దాన్ని ప్రయత్నించకండి. ఈ రెండూ విసర్జనీయాలే! - స్వామి వివేకానంద

(...13వ పేజీ తరువాయి)
పడుకోబెడుతుంది. తరువాత తను స్నానం చేసి, పూజ చేసి, నైవేద్యం సమర్పించి, పని మీద వంటగదిలోకి వెళుతుంది. మళ్ళీ పూజాగృహానికి వచ్చేసరికి దేవుడికి నైవేద్యంగా పెట్టిన ఫలహారాన్ని తన చిన్ని కుమారుడు భుజిస్తూ ఉండడం చూసి నిశ్చేష్టురాలు అవుతుంది. ఆ మనోహరదృశ్యాన్ని భక్త తులసీదాస్ తన 'రామచరిత మానస్'లో అక్షరీకరిస్తూ...

దేఖ రావా మాతహి నిజ అద్భుత రూప అఖండ్ ।
రోమ రోమ ప్రతిలాగే కోటి కోటి బ్రహ్మాండ్ ॥

'బాలరాముని రోమరోమాన కోట్లాది బ్రహ్మాండాలున్నాయి. అసంఖ్యాకంగా సూర్యుళ్ళు, చంద్రుళ్ళు, శివుళ్ళు, బ్రహ్మదేవుళ్ళు కౌసల్యా మాతకు కనిపించారు' అని వివరిస్తాడు. ద్వాపరయుగం లోనూ అమ్మగా ఇలాంటి ఎన్నో అద్భుతాలను గాంచిన యశోద తన ముద్దుల కొడుకు మాయల్ని చందమామతో పంచుకుంటూ...



నగుమోము చక్కనయ్యకు నలువ పుట్టించిన తండ్రికి
నిగమములందుండే అప్పకు మా నీలవర్ణునికి
జగమెల్ల ఏలిన స్వామికి చక్కని ఇందిర మగనికి
ముగురికి మొదలైన ఘనునికి మా ముద్దులమురారి బాలునికి

'నవ్వులు కురిపించే తన తండ్రికి, వేదాల సారమైన తన నీలవర్ణునికి, జగాన్ని ఏలే మా స్వామికి, త్రిమూర్తులకే మూలమైన తన ముద్దుల మురారికి పసిడిపాత్రలో పాలు తెమ్మ'ని జాబిలిని కోరుతోంది. నలువ అంటే సమర్థత.

కలికి చేతల కోడెకు....

తెల్లని తామరపూల లాంటి కళ్ళతో, గుమ్మపాలు పితికితే వచ్చే ధారలా మాటలాడుతూ, మరికొన్నిసార్లు మాట్లాడకుండానే చిన్ని చిన్ని చేతులు, కాళ్ళు కదుపుతూ ఎన్నో కతలు చెబుతాడని యశోద మురిసిపోతూ, అందాల చందమామతో ముచ్చట్లు చెబుతోంది. మా వంశాన్ని ఉద్ధరించేవాడు, మంచిగుణాలు కలిగిన మా చిన్నవాడు ఒక్కసారి చూశాడంటే ఆ చూపుల్లో కుబేరుని నవనిధులైన మహాపద్మము, పద్మము, శంఖము, మకరము, కచ్ఛపము, ముకుందము, కుందము, నీలము, ఖర్వరము అనేవి వరాల్లా జలజలా కురవాల్సిందేనని ఆ తల్లి గర్వంగా చెబుతోంది. అలాంటి నా ముద్దుల తనయుడికి పాలు తెమ్మంటూ...

తెలిదమ్మి కన్నులమేటికి మంచి తియ్యని మాటలగుమ్మకు
కలికిచేతల కోడెకు మా కతలకారి ఈ బిడ్డకు
కులముద్ధరించిన పట్టెకు మంచి గుణములు కలిగిన కోడెకు
నిలువెల్ల నిండ వొయ్యారికి నవనిధుల చూపులచూచెసుగుణునకు

...అంటోంది. ధర్మసంస్థాపనార్థం భగవానుడు ఈ నేలపై అవతరించి, సాధారణ మానవుడిలా మసలుకోవడం మన అదృష్టం. శ్రీరాముడు, శ్రీకృష్ణుడు నుంచి శ్రీరామకృష్ణుల వరకు ఎందరో అవతారపురుషులు తమ లీలలతో మనల్ని ఉద్ధరించారు. అందుకే పోతనామాత్యులు శ్రీమద్భాగవతంలో...

శ్రీకైవల్య పదంబు చేరుటకునై చింతించెదన్, లోక ర
క్షైకారంభకు, భక్త పాలన కళా సంరంభకున్, దానవో
ద్రేక స్తంభకు, కేళీ లోల విలసద్దృగ్జాల సంభూత నా
నా కంజాత భవాండ కుంభకు, మహా నందాంగనా డింభకున్

'అక్షరమైన మోక్ష సంపదను అపేక్షించిన నేను ఆనందస్వరూపిణి అయిన ఆ నందగోపుని ఇల్లాలి ఒడిలో అల్లారుముద్దుగా ఆడుకుంటున్న అందాల బాలుణ్ణి ధ్యానిస్తున్నాను. ఆ యశోదా కిశోరుడు సామాన్యుడు కాడు; ఏ మాత్రం ఏమరపాటు లేకుండా ఎల్లలోకాలనూ చల్లగా పాలిస్తూ ఉంటాడు. నిరంకుశులైన నిశాచరుల ఔద్ధత్యాన్ని నిర్మూలిస్తూ ఉంటాడు. అంతేకాదు, కన్నతల్లి ఒడిలో ఒయ్యారంగా కూర్చున్న ఆ చిన్నికృష్ణయ్య ఒక్కమాటు అలా కన్నులెత్తి చూస్తే చాలు, ఎన్నెన్నో బ్రహ్మాండ భాండాలు ఆ చూపుల్లో రూపులు దిద్దుకుంటాయి' అని అంటాడు.

మా వేంకటనాథునికి...

శ్రీనివాస పదధ్యాన పారీణుడైన ఈ పదకవితా పితామహుడు వేంకటనాథుడిలో ఆ వెన్నదొంగను మనసారా దర్శించుకొని, రేపల్లె నుంచి తిరుమలకు తిరుగుముఖం పడుతూ...

సురలగాచిన దేవరకు చుంచు గరుడనెక్కిన గబ్బికి
నెరవాది బుద్ధుల పెద్దకు మా నీటు చేతలపట్టికి
విరుల వింటివాని అయ్యకు వేవేలు రూపుల స్వామికి
సిరి మించు నెరవాది జాణకు మా శ్రీవేంకటనాథునికి...

అని తన కీర్తనకు ముక్తాయింపు పలుకుతున్నాడు. మావాడు దేవతలను రక్షించినవాడు, గరుత్మంతునిపై ఎక్కి తిరిగేవాడు, బుద్ధిమంతులైన పెద్దలలో గొప్పవాడు, విరులవింటివాని అంటే మన్మథుని తండ్రి, వేల రూపాలు ధరించగలిగినవాడు, మంచి మంచి ఉపాయాలు కలిగినవాడు, వేంకటాద్రిపై కూడా కొలువై ఉన్నవాడు వాడేనని అన్నమయ్య యశోదమ్మలా మారి పరవశించిపోతున్నాడు; పున్నమిచంద్రుడిని పాలు తెమ్మంటున్నాడు. అన్నమయ్య స్ఫూర్తితో ఓ కవి తన 'యశోదా గీతా'ల్లో, పరమభక్తితో...

నీతోనే నా ఆటలు... నా మాటలు!
నీ కోసమే నా కన్నీరు... నా కోపం!
నువ్వే నా గర్వం... నువ్వే నా నిరాశ!
నీ కోసమే ఈ గోవులు... నీ కోసమే ఈ యశోద!
నీ కోసమే ఈ ఉదయాలు... అస్తమయాలు!
ఈ విశ్వమంతా నీ హృదయంలో...నువ్వేమో నా హృదయంలో!

అని గోపాలకృష్ణుడిని తలచుకుంటాడు. ❖

...ఆ వీరపురుషుడి వారసుడవు!





చిన్నా సమీర్..! 2007 జూలై 6

నీవు మా ప్రపంచంలోకి అడుగుపెట్టాక మొట్టమొదటి సారిగా నీ ఛాయాచిత్రం ముందు చిరుదీపాన్ని పెట్టి నీ పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతున్నాను. పాతికేళ్ళు దాటిన కొడుకుకు ఇలా నీళ్ళు నిండిన కళ్ళతో నివాళి తెలిపే దయనీయ స్థితి ఏ తల్లికీ రాకూడదని కోరుకుంటున్నాను. కానీ నీ విషయంలో ఓ పక్క విషాదంతో పాటు, మరోపక్క వీరమరణం పొందిన సైనికుడి మాతృమూర్తిగా నా మనస్సు గర్వంతో పొంగిపోతోంది.

చిన్నప్పుడు నీవు స్వామి వివేకానంద సూక్తులను వల్లిస్తూ ఉంటే, అందరూ నీ అసలు పేరు వదిలేసి, 'వివేక్' అనే ముద్దుగా పిలుచుకునేవారు. పెద్దయ్యాక కూడా నీ పుస్తకాల అరలో స్వామీజీ సాహిత్యాన్ని చూసి ఎంతో ఆనందపడేదాన్ని. కేవలం ఆ మహనీయుని సాహిత్యం చదవడమే కాక, దాన్ని నూటికి నూరుపాళ్ళూ ఆచరించేందుకు ప్రయత్నిస్తుంటే ఒక తల్లిగా ఎంతో పులకించిపోయేదాన్ని. 'సత్యం, పవిత్రత, నిస్వార్థం కలగలసిన మనిషి, విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా ప్రతిఘటించగలడు' అన్న స్వామి వివేకానంద మాటల్ని నువ్వు తరచూ ఎందుకు గుర్తు చేసుకునేవాడివో ఇప్పుడు అర్థమవుతోంది.

ఎలాంటి పోటీ లేకుండా స్కూల్ కెప్టెన్‌గా నిన్ను ఎంపిక చేసినప్పుడు; 'సమీర్ ఉంటేనే మా కూతుళ్ళను టూర్‌కి పంపిస్తామ'ని కళాశాల ప్రిన్సిపాల్‌తో తల్లితండ్రులు చెప్పినప్పుడు; ఏ సేవాకార్యక్రమాలు చేయడానికైనా ముందు చేయి నువ్వే ఎత్తినప్పుడు – 'అమితమైన ఉత్సాహం, అపరిమితమైన ధైర్యం, అప్రతిహతమైన శక్తి – అన్నింటినీ మించి పరిపూర్ణ విధేయత ఓ వ్యక్తిని ధీరుడిగా నిలబెట్టగలవు' అన్న స్వామీజీ మాటలు జ్ఞాపకానికి వచ్చేవి. చదువులో, ఆటల్లో నువ్వు కనబరచే ఉత్సాహం, పట్టుదల చూసి ఎంతో ముచ్చటేసేది. ముఖ్యంగా ఆ వయస్సులోనే జీవితం పట్ల నీవు రచించుకున్న ప్రణాళిక, పరిస్థితులకు ఇమిడిపోయే అణకువ, బంధువులు, మిత్రుల కోసం నీవు పడే తపన చూస్తుంటే మాకే ఆశ్చర్యమేసేది. మలిసంధ్యలోని నాయనమ్మ, తాతయ్యలకు తోడుగా నువ్వు నడుస్తూ, కబుర్లు చెబుతూ ఉంటే వారు ఎంత సంబరపడేవారో!

'ఈ జీవితం అశాశ్వతం, ఈ సుఖాలు క్షణికం! పరుల సేవలో జీవితాన్ని సగర్వంగా సమర్పించే వారే సార్థక జీవులు; మిగిలిన వారంతా జీవన్మృతులు' అన్న స్వామీజీ మాటల్ని ఎందుకు మననం చేసుకుంటూ ఉండేవాడివో నువ్వు సైన్యంలో చేరాలని నిర్ణయం తీసుకున్నప్పుడు నాకు అర్థమైంది. విలువైన యౌవనాన్ని యుద్ధభూమి కోసం అర్పిస్తానంటే, ఏ తల్లి గుండె తల్లడిల్లదు? కానీ, నీ దీక్ష, దేశభక్తి చూసి నేను అడ్డుచెప్పలేకపోయాను.

'అమ్మా! జీవితంలో మరణాన్ని మించిన విషాదం మరొకటి లేదు; అదెలాగూ తప్పదు. అలాంటప్పుడు ఈ మధ్యలో వచ్చే చిన్న, చిన్న కష్టాలకు ఎందుకు భయపడాలి?' అంటూ, ఇంట్లో నువ్వుంటేనే పండుగ అనిపించేలా ఆనందంగా గడిపేవాడివి. ఆర్థికంగా మనం గడ్డు పరిస్థితుల్లో ఉన్నప్పుడు కూడా నీ ముఖంలో చిరునవ్వు చెరిగిపోకుండా ఎంతగా సర్దుకుపోయావో ఈ అమ్మ మనస్సు ఎన్నటికీ మరచిపోలేదు.

భారతసైన్యంలో రక్షణాధికారిగా నువ్వు ఎదిగావని తెలిసిన రోజున మా ఆనందానికి అవధులు లేవు. ఎప్పుడు ఫోన్ మోగినా, నువ్వే అనుకొని మాట్లాడేందుకు ఆతురత పడేదాన్ని. కొన్ని క్షణాలు నువ్వు మాట్లాడి ఫోన్ పెట్టేశాక, ఆ మాటలనే మననం చేసుకుంటూ, మరో ఫోన్ కాల్ వచ్చేదాకా వేచిచూస్తూ ఉండేదాన్ని. అలాంటి నిరీక్షణలో ఉండగా నాకు గుండె పగిలే సమాచారం అందింది... భారత సరిహద్దుల్లో శత్రుసమూహాల ఎదురుకాల్పుల్లో నువ్వు శాశ్వతంగా ఈ లోకాన్ని విడిచి వెళ్ళిపోయావని తెలిసింది. కొన్ని రోజులకు నీ పార్థివ శరీరం ఇంటి ముందుకు వచ్చింది. ఆ క్షణంలో కాళ్ళ కన్నా ముందు కళ్ళే పరుగెత్తాయి. వందలాది నీ అభిమానుల నడుమ నా కన్నీళ్ళూ ఇంకిపోయాయి. ఆ కన్నీటి మసకలో అప్పుడు కనిపించింది – అచేతనమైన నీ శరీరం పక్కన, నువ్వు యుద్ధభూమిలో కూడా తోడుగా, ఆయన ఆశయాలకు వారసుడిగా దాచుకున్న పుస్తకం – 'స్వామి వివేకానంద జీవితచరిత్ర'. ఆ వీరపురుషుడి వారసుడవైన నిన్ను కన్న నా జన్మ ధన్యమైందిరా చిన్నా!

...కన్నీళ్ళతో
మీ అమ్మ
సోఫియా రాయ్


నాయనా! మరణం అనివార్యమైనప్పుడు, రాళ్ళురప్పల్లాగా ఉండడం కన్నా ధీరుల్లాగ మరణించడం శ్రేయస్కరం. తృప్పపట్టడం కన్నా పరుల సేవలో అరిగిపోవడం మంచిది. - స్వామి వివేకానంద


అపార భక్తి - అనంత కరుణ


కథ: స్వామి విమూర్తానంద   చిత్రాలు: పద్మవాసన్   అనుసృజన: స్వామి జ్ఞానదానంద


1 భగవాన్ శ్రీరామకృష్ణుల శిష్యుడు స్వామి రామకృష్ణానంద. ఈయన పూర్వాశ్రమ నామధేయం శశి. శ్రీరామకృష్ణులు జీవించి ఉన్నప్పుడు ఆయనకు ఎలా సేవ చేశారో, అలాగే మహాసమాధి చెందిన తరువాత కూడా ఆయనకు శశిమహరాజ్ సేవలందించారు. సుఖదుఃఖాలు, ఆదరణ-నిరాదరణ, కలిమి-లేమి వంటి ఏ పరిస్థితులు ఎదురైనా సరే శశిమహరాజ్ అచంచల శ్రద్ధాభక్తులతో శ్రీరామకృష్ణులను సేవిస్తూనే వచ్చారు.


2 శ్రీరామకృష్ణుల దర్శనార్థం మొట్టమొదట శశి దక్షిణేశ్వరం వెళ్ళాడు. శశి ప్రణామం చేయబోతున్నప్పుడు ఆయన తమ పాదాలను ఠక్కున వెనక్కు తీసుకున్నారు.








4
ఒకసారి గురుదేవులు జామ్రూల్ అనే పండు తినగోరారు. ఒక భక్తుణ్ణి వాకబు చేశాడు శశి.
శశీ! ఆ పండు ఎక్కడా లభించదే!
లేదు. మన గురుదేవులు సత్యసంకల్పులు. ఆయన వాక్కు నిశ్చయంగా జరిగే తీరుతుంది.
5
శశి అనేక చోట్ల వెతికి, ఎంతో శ్రమకోర్చి ఎట్టకేలకు ఆ పండును తీసుకువచ్చాడు.
శశీ! ఈ అకాలంలో నువ్వు ఎలా ఈ పండును తేగలిగావు? నువ్వు నీ గురుభక్తితో అసాధ్యాన్ని సుసాధ్యం చెయ్యగలవు!
6
గురుదేవులు మహాసమాధి చెందిన తరువాత, మరెక్కడికీ పోకుండా వరాహనగర మఠంలో గురుదేవులను భక్తి శ్రద్ధలతో పూజిస్తూ వచ్చాడు శశి. తదనంతరం సన్న్యాసాశ్రమం స్వీకరించి, స్వామి రామకృష్ణానంద అయ్యారు.
7
స్వామి వివేకానంద పాశ్చాత్య దేశాల్లో వేదాంత భేరి మోగించి 1897 జనవరిలో తమిళనాట అడుగిడారు. అప్పుడు మద్రాసు భక్తులు ఆయనతో...
స్వామీజీ! మద్రాసులో మాకు మార్గదర్శిగా ఒక సన్న్యాసి కావాలి.
సరే! దక్షిణదేశంలోని అగ్రగణ్యులైన వేదధర్మ పరాయణుల కన్నా గొప్ప వేదధర్మ పరాయణుడూ, భక్తిలో, పూజలో, పరిత్యాగంలో సాటిలేనివాడూ అయిన ఒక సన్న్యాసిని మీ కోసం పంపుతాను.
8
స్వామీజీ ఇచ్చిన మాట ప్రకారం శశిమహరాజ్ మద్రాసుకి వచ్చారు. తిరువళ్ళికేణిలో ఆశ్రమం ప్రారంభించారు. ప్రారంభంలో ఆశ్రమ నిర్వహణకు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కోవలసి వచ్చింది.
9
పూజకు కూడా నోచుకోని దుఃస్థితి. ఒక రోజు మధ్యాహ్నం ఒక బ్రహ్మచారి వచ్చి...
గురుదేవులకు నైవేద్యం అర్పించడానికి ఏమీ లేదు.
ఎందుకింత ఆలస్యంగా ఈ విషయం చెబుతున్నావు? సరే! నేను దీని గురించి ఆయనతోనే మాట్లాడతాను.


10
స్వామి పూజామందిరంలోకి వెళ్ళారు. ఆగ్రహంతో...
మీరు నన్ను ఎలా నడిపించినా సరే, నేను నా ప్రగాఢ భక్తి నుండి కించిత్తు కూడా వైదొలగను. ఇక ఎవరి వద్దకూ వెళ్ళి, ఏమీ అడగను. యాదృచ్ఛికంగా లభించిన దానినే మీకు అర్పిస్తాను. అదీ లేకపోతే సముద్రతీరంలోని ఇసుకనే మీకు అర్పించి, దానినే నేనూ తింటాను.
స్వామి అలా మాట్లాడింది, పూజామందిరంలో కొలువుదీరిన భగవాన్ శ్రీరామకృష్ణులతోనే!
11
స్వామి తమ ఉక్రోషాన్ని అలా వెళ్ళగక్కి బయటకు వచ్చారు. అప్పుడు కొండయ్య చెట్టి అనే భక్తుడు లోపలకు వచ్చాడు. స్వామి అతడి కుశలాన్ని విచారించారు.
స్వామీజీ! మన గురుదేవులకు కానుకలు అర్పించాలనే బలీయమైన కోర్కె కలిగింది. అంతే! పరుగున వచ్చాను.
12
ఇలా పలికి ఆ శ్రేష్ఠి గారు నెయ్యి, పప్పులు, ఉప్పు మొదలైన సామాన్లు, ఐదు రూపాయలు విరాళంగా ఇచ్చాడు. ఆశ్చర్యంగా చూస్తున్న బ్రహ్మచారులతో వెంటనే స్వామి,
తమ్ముళ్ళారా! చూశారా గురుదేవుల కారుణ్యాన్ని! వీటిని తీసుకెళ్ళి వెంటనే వండి, గురుదేవులకు అర్పించండి.
ఆ బ్రహ్మచారులు స్వామి భక్తిని నిదర్శనపూర్వకంగా తిలకించారు.
13
అది 1906వ సంవత్సరం. మద్రాసులో సముద్రానికి ఎదురుగా, తిరువళ్ళికేణిలో స్వామి నివాసం ఉన్న ఐస్‌హౌస్ వేలానికి వచ్చింది. అప్పుడు కూడా ఆయన ప్రశాంతతను కోల్పోలేదు.
స్వామీ! ఇకపై మీరెక్కడ బస చేస్తారు?
గురుదేవుల పూజకు ఒక చిన్న గది లభిస్తే చాలు. నేను ఆయన్ని స్మరించుకుంటూ ఎక్కడైనా జీవితాన్ని గడపగలను.
14
1907లో మైలాపూర్‌కు మఠం మార్చబడింది. నాటి రాత్రి 11 గంటలు. కుంభవృష్టి కురుస్తోంది.
స్వామీ! పూజా మందిరమూ కారుతోంది. రేపు ఎలాగైనా మరమ్మత్తు చేయించాలి.
దాని సంగతి తర్వాత చూద్దాం. వెంటనే ఒక గొడుగు పట్టుకురా!


15
మందిరం తెరిచి, గురుదేవుల చిత్తరువుకు గొడుగు పట్టి కూర్చున్నారు స్వామి రామకృష్ణానంద.
గురుదేవుల చిత్తరువును నీరు కారని చోటుకు తరలిద్దామా స్వామీ?
మెల్లగా మాట్లాడు. ఇది చిత్తరువు కాదు, గురుదేవులు నిద్రిస్తున్నారు.
ఆ రాత్రంతా స్వామి రామకృష్ణానంద, గురుదేవులకు గొడుగు పట్టుకొని, అలాగే కూర్చుండిపోయారు.


16
అది తీవ్రమైన వేసవి కాలం. చెమటలు ధారకట్టి ఇబ్బందికి గురైన స్వామికి, 'గురుదేవులకు కూడా చెమట పడుతుంది కదా!' అని స్ఫురించింది. వెంటనే ఆయన గురుదేవుల చిత్తరువు ముందు కూర్చుని, 'హే ప్రాణనాథా! హే ప్రభో!' అంటూ విసనకర్రతో విసర నారంభించారు.


17
ఒకసారి శ్రీరామకృష్ణ జయంతి జరుపుకోవలసిన సమయం. అప్పుడు కరవు కాలమైనప్పటికీ, అన్నదానం జరుగుతుందని స్వామి రామకృష్ణానంద ప్రకటించారు. జయంతికి ముందు రోజు...
మహారాజ్! రేపటి అన్నదానానికి కావలసిన సరుకులు ఏవీ లేవే! ఏం చేద్దాం?
తమ్ముడూ! అన్నపూర్ణాదేవి మీద నమ్మకం పెట్టుకో! ఆ దేవి తన పిల్లలను పస్తు ఉంచుతుందా ఏమిటి?
18
స్వామి ధ్యానమగ్నులయ్యారు. కాసేపట్లో కొందరు శ్రేయోభిలాషులు మఠానికి వచ్చారు.
స్వామీ! మీరు తలపెట్టిన అన్నదానానికై చాలా రోజులుగా ఈ బియ్యం, పప్పులు వగైరా మేము సేకరిస్తూ వచ్చాం. వీటిని స్వీకరించండి.
చూశారా? ఒక బిడ్డ తన తల్లిని అడిగినట్లుగా మీకు అవసరమైన వాటిని భగవంతుణ్ణి చిత్తశుద్ధితో అడగండి. ఆయన నిశ్చయంగా అనుగ్రహిస్తాడు.
19
మరుసటి శ్రీరామకృష్ణ జయంత్యుత్సవానికి కూడా కావలసిన పచారీ సామాన్లు లభించలేదు. అన్నదానం లేకుండా ఉత్సవం ప్రసక్తే లేదన్నారు స్వామి. పేదలకు అన్నం పెట్టడానికి ధనం అవసరమని గురుదేవులతో స్వామి మొర పెట్టుకున్నారు. మరునాడు మైసూర్ యువరాజు పంపిన ఒక వ్యక్తి మఠానికి వచ్చాడు.
స్వామీ! మీరు ఆంగ్లంలో రచించిన 'ప్రపంచం-మనిషి' అనే పుస్తకాన్ని మా యువరాజు ఎంతో ఆస్వాదించి చదివారు. అందుకే ఈ మొత్తాన్ని కానుకగా మీకు పంపించారు.
కృతజ్ఞతలు. ఈ పెద్ద మొత్తంతో భగవాన్ శ్రీరామకృష్ణుల పేరిట వేలాది పేదలకు అన్నదానం చేస్తామని యువరాజులకు తెలియజేయండి.
20
ఈ విధంగా స్వామి రామకృష్ణానంద, శ్రీరామకృష్ణులకు చేసిన సేవను ఆంజనేయుడు, శ్రీరామునికి చేసిన సేవతో పోల్చవచ్చు.

- స్వామి విశారదానంద

బెంగుళూరులోని వివేకానంద యోగ అనుసంధాన మహా విద్యాపీఠానికి చెందిన స్వామి విశారదానంద భగవద్గీత పదమూడో అధ్యాయంలో 7-11 శ్లోకాల్లోని భగవానుడి బోధామృతాన్ని వివరిస్తూ 'భగవద్గీత - మానవీయ విలువలు' అనే శీర్షికతో ప్రసంగాలు ఇచ్చారు. చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠ ఆంగ్ల మాసపత్రిక 'వేదాంత కేసరి'లో ప్రచురితమైన ఆ ప్రసంగాల సారాన్ని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

కష్టాలను భరించేదెలా?

కర్మ సిద్ధాంతం: ఒక పరిస్థితి మనకు దుఃఖకారకంగా ఉందంటే, అది మన 'కర్మ'ను అనుసరించే జరుగుతున్నదని గ్రహించాలి. అలాంటి 'అవగాహన' ఉంటే, దుఃఖకరమైన పరిస్థితులను కూడా మనం భరించగలుగుతాం. మన ఆనందానికి కానీ, క్లేశానికి కానీ మనం చేసిన కర్మల ఫలితమే కారణం. ఇతరులెవరో మనల్ని సంతోషంగానో, విచారంగానో ఉండేలా చేస్తారనేది అర్థం లేని మాట.

మనం చేసే దుష్కర్మలే తిరిగి మనకు బాధలు, కష్టాల రూపంలో వస్తాయి. అది మనకొచ్చిన మనియార్డర్‌ను పోస్ట్‌మ్యాన్ తీసుకొచ్చి ఇచ్చినట్లు! 'ఎ.టి.యం' యంత్రం మన డబ్బు మనకు ఇచ్చినట్లు! మనదైనదేదో అది మనకు ఇస్తోంది. కాబట్టి, పోస్ట్‌మ్యాన్‌ను గానీ, ఎ.టి.యం.ను గానీ ప్రశంసించలేం. అలాగే నిందించనూ లేము. అదే విధంగా మనం చేసిన కర్మల ఫలితమే మనకు తిరిగి వస్తుంది.

ఇతరులను మన కర్మను మనకు తెచ్చి ఇచ్చే వాహికల లాగానో, ఉపకరణాల లాగానో భావించడం అభ్యసించాలి. దీనివల్ల ప్రశాంత దృక్పథాన్ని అలవరచుకోగలుగుతాం.

సమ్మతించడం, పరిష్కార మార్గాలు: దేనినైనా సమ్మతించక పోవడమే మన సమస్య. 'ఇది ఈ విధంగా జరిగి ఉండవలసింది కాదు' అని గొణుక్కుంటాం. నిజమే! ఇక ముందు రాబోయే బాధనూ, కష్టాన్నీ ఆపడానికి ప్రయత్నించవచ్చు గానీ, ఇంతకు ముందే వచ్చి మన ముందున్న బాధను ధైర్యంగా ఎదుర్కోవాలి. ఉదాహరణకు జనన, మరణాలు మన అధీనంలో లేవు. మరణించినవారు మళ్ళీ వెనక్కి ఎన్నడూ రారు. ఈ సత్యాన్ని మనం అంగీకరించి తీరాలి. 'సంతోషం కలిగితే ఆనందిద్దాం. కష్టం వస్తే దాన్ని ఎదుర్కొందాం. పైకీ, క్రిందకూ తిరిగే రంగుల రాట్నంలా సుఖ దుఃఖాలు జీవితంలో వంతులవారీగా వస్తాయి' అని ఓ సంస్కృత సూక్తి చెబుతోంది.

జీవితంలో కొన్ని అనివార్యమైన కష్టాలు సంభవిస్తాయి. అనివార్యమని దేనిని అంటాం? చాలా ప్రయత్నాలు చేసిన తరువాత కూడా పరిస్థితులు మారకపోతే వాటిని 'అనివార్యం' అంటాం. ఒక కష్టం కలిగినప్పుడు శక్తి వంచన లేకుండా దాన్ని నివారించడానికి ప్రయత్నించాలి. అప్పటికీ కుదరకపోతే వచ్చినదాన్ని అంగీకరించాలి. ఒక విషయానికి పరిష్కారం కనుగొనేటప్పుడు, వాటికి ఇంకా కొత్త పరిష్కారమార్గాలు అనేకం కనిపిస్తాయి. మన శాస్త్రాలు ఈ విషయంలో ఎన్నో సూచనలు చేస్తున్నాయి. ఉదాహరణకు ఒక పరిస్థితిని సరిచేయడానికి బ్రహ్మాండమైన కృషి చేయాల్సి వస్తే, అసలు అలాంటి కృషి అవసరమా? కాదా? అని పరిశీలించాలి. ఒక్కోసారి అంత కష్టమైన శ్రమ చేసే బదులు ఆ పరిస్థితిని సమ్మతించి, దానిని అనుసరించడం సులువైన, తెలివైన పని అవుతుంది. దాన్ని సరి చేయాలన్నా, వృద్ధి చేయాలన్నా, చివరకు ఇంకా ఎక్కువ కష్టాలను కొని తెచ్చుకుంటాం. దేనినైనా సవరణ చేయడం వల్ల ప్రతికూలత, వ్యతిరేకత సృష్టించేటట్లుంటే, అలాంటి సవరణను చేయకుండా ఉండడమే శ్రేయస్కరం.

మనం మరణించిన తరువాత కూడా ఈ సమాజం దాని పద్ధతిలో అది కొనసాగుతుందని అర్థం చేసుకోవాలి. కాబట్టి మనకు చేతనైనంత చేసి, మన చేతులలో లేని వాటిని వదలి వేయాలి. మనశ్శాంతి కావాలంటే, ఆత్మపరిశీలన చేసుకుంటూ, మనల్ని మనం క్రమశిక్షణాయుతంగా, బాధ్యతాయుతంగా ప్రవర్తించేలా చేసుకోవాలి. కష్టమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు కూడా మన పోరాటాన్ని ఆపకూడదు. 'ఈ రోజు చాలా వేడిగా ఉంది. ఎలా ధ్యానం చేయగలను? ఈ రోజు ఇంత ప్రచండ గాలి వీస్తోంది. ధ్యానం చేయడం ఎలా?' లాంటి అతి చిన్న కారణాలను సాకుగా చూపి, మనం రోజూ చేసే ధ్యానాన్ని మానేస్తాం. మనం ఎట్టి పరిస్థితులలోనూ 'ధ్యానం' మానకూడదు. ఇదే 'పరిణతి' అంటే! వాతావరణం వేడిగా ఉన్నా, చల్లగా ఉన్నా భోజనం చేయడం మానేస్తామా? అలాంటప్పుడు 'ధ్యానం' విషయంలో మాత్రం రాజీపడడం దేనికి?

పరిస్థితి ఏ విధంగా ఉన్నా సరే, ముందుకు కదులుతూనే ఉండాలని భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్మ అంటాడు. మనస్సు కలవరం చెందితే, "ఎందుకా అలజడి? అల్పమైన సమస్యలను అధిగమించడం ఎలా?" అని మనస్సునే అడగాల్సిన అవసరం ఉంది. ఎల్లప్పుడూ మనం మంచి ఆరోగ్యంతో ఉండలేం. అలాగే అందరూ మనతో స్నేహంగా ఉండరు. అన్ని పరిస్థితులూ మనకు అనుకూలంగా ఉండవు. జీవితాన్ని ఎలా ఉంటే అలా అంగీకరించి ముందుకు నడుద్దాం. ❖

తెలుగుసేత: డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి

(వచ్చే సంచికలో... 'కష్టాలు - పరిష్కార మార్గాలు')

దారాసుతులు, బంధువులు, కీర్తిప్రతిష్ఠలు - దేనినీ మనం కాదనవలసిన పనిలేదు. మమకారం మాత్రం ఉండకూడదు. మనం ప్రతిష్ఠించుకోవాల్సిన అనుబంధం ఆ ఒక్క పరమాత్మతోనే! -స్వామి వివేకానంద

రామకృష్ణ మిషన్

పి.ఓ. బేలూరు మఠం, హౌరా జిల్లా -711 202. ఫోన్ : 033-2654 1144, 1180, 5700
E-mail: rkmrelief@gmail.com website: www.belurmath.org

ఉత్తరాఖండ్ వరద బాధితులకు సహాయక చర్యలు

విరాళాలకు విజ్ఞప్తి











2013 జూన్ మాసంలో ఉత్తరాఖండ్‌లో అనూహ్యమైన కుంభవృష్టి కారణంగా సంభవించిన ఉద్ధృత వరదలు జన జీవనాన్ని అతలాకుతలం చేశాయి. అనేక గ్రామాలు జలమయమయ్యాయి. వేలాది మంది గ్రామస్థులు నిరాశ్రయులయ్యారు.

రామకృష్ణ మిషన్, కంఖల్ సేవాశ్రమ (హరిద్వార్) శాఖ ద్వారా వరద బాధితులకు సహాయక చర్యలను చేపట్టింది. రుద్రప్రయాగకు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న అగస్త్యముని గ్రామంలో వరద బాధితుల సహాయ శిబిరాన్ని ఏర్పాటు చేసింది. వరద బాధితులకు - ఆహార పొట్లాలనూ, నిత్యావసర వస్తువులనూ, శిశు పోషకాహారాన్నీ పంపిణీ చేస్తోంది. ఉచిత వైద్య సేవలను అందిస్తోంది.

వరద బాధితుల సహాయ, సేవా కార్యక్రమాల నిమిత్తం ఉదార హృదయులైన భక్తులు, శ్రేయోభిలాషుల నుండి విరాళాలను కోరుతున్నాం. మీ విరాళాల్ని Ramakrishna Mission, Kolkata పేరున చెక్కు/ డి.డి. తీసి The General Secretary, Ramakrishna Mission, (Relief Section) Belur Math, Howrah, West Bengal - 711 202 చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

మా వెబ్‌సైట్ http://www.belurmath.org/donation cca/ donation.php ను ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా విరాళాలను అందజేసే సదుపాయం కలదు. విరాళాలను మీకు సమీపంలో ఉన్న రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ కేంద్రాలలో కూడా అందజేయవచ్చును.

వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు ఇచ్చే విరాళాలకు 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.

భగవత్సేవలో
స్వామి సుహితానంద
ప్రధాన కార్యదర్శి







Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**



వివేక కీర్తి

"స్వర్గ ఖండ"మందు పుట్టి
లక్ష్యాన్ని సాధించినావు
భరతమాత కీర్తిని
అవనిలోన చాటినావు

నీ మాటకు సాటిలేదు
నీ ఘనతకు లోటులేదు
వివేకమును ప్రదర్శించి
విశ్వకీర్తి గాంచినావు

చిన్ననాటి దాన గుణం
మరువలేని మంచితనం
ఎల్లకాలముంచి నావు
జగతిలోన వెలిగినావు

విదేశాల సభలలోన
భరతమాత చరిత జెప్పి
సోదర ప్రేమను నిలిపి
సాదరమును పొందినావు

ఝరిలా సాగే భాషణ
ధైర్యాన్ని పెంచే భాషణ
భవితను దిద్దే భాషణ
భవమును ద్రుంచే భాషణ

నీ మాటలు మణి మూటలు
ఆలోచనలకు బాటలు
మంచిని నేర్పే గీతలు
మరువలేని మణి కోటలు

విశ్వానికి ముఖ్యమన్న
విలువ యున్న మాటలన్న
విన్నవారి భాగ్యమన్న
విలువ తెలిసి నడవమన్న

"నీలోనున్నది శక్తి
లేచిచూపు నీ యుక్తి
భయమెందుకు ఓ వ్యక్తి"
అదే నరేంద్రుని సూక్తి.

రచన : సి.శ్రీనివాస్

Vol.70-8, Sri Ramakrishna Prabha (Telugu Monthly) August 2013, Regd. with the Registrar of Newspaper for India Under No. 1120/57. Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14.

అదిగో చూడు సజీవ కృష్ణుణ్ణి!

జైపూరు సంస్థాన సేనాధిపతియైన హరిసింగ్‌కు విగ్రహారాధన అంటే నమ్మకం లేదు. విగ్రహారాధన ప్రాశస్త్యాన్ని స్వామీజీ ఎంత వివరించినా అతడు అంగీకరించలేదు.

ఒకరోజు సాయంత్రం స్వామీజీ, హరిసింగ్ కాలినడకన వెళుతున్నారు. అప్పుడు ఎదురుగా కృష్ణుని విగ్రహాన్ని ఊరేగిస్తూ ఒక భజన బృందం రాసాగింది. ఇద్దరూ కాసేపు నిలబడి ఊరేగింపు చూశారు.

అప్పుడు స్వామీజీ హరిసింగ్‌ను తాకి 'హరిసింగ్‌జీ! అదిగో సజీవ కృష్ణుణ్ణి దర్శించండి' అని అన్నారు. అలా స్వామీజీ చెప్పిన వెంటనే హరిసింగ్‌కు సజీవ కృష్ణుడు దర్శనమిచ్చాడు. పారవశ్యానికి లోనైన అతడి కళ్ళ నుండి నీరు ధారకట్టింది. అప్పుడు 'స్వామీజీ! మీ కర స్పర్శ వల్ల అలవోకగా శ్రీకృష్ణుణ్ణి దర్శించగలిగాను' అని అన్నాడు హరిసింగ్ గద్గద స్వరంతో. ❖





చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 'వివేకానంద రథం' పర్యటన వివరాలు:


2013 ఆగష్టు 4-మదనపల్లి; 5-పలమనేరు; 6-చిత్తూరు; 7-పాకాల; 8,9 తిరుపతి; 10-పుత్తూరు; 11,12 శ్రీకాళహస్తి; 13-సూళ్ళూరుపేట; 14-నాయుడుపేట; 15- గూడూరు; 16-18 నెల్లూరు; 19-లేగుంటపాడు; 20-అల్లూరు; 21-రాపూరు; 22-కాలువాయ; 23-ఆత్మకూరు; 24-వింజమూరు; 25,26 కావలి; 27-ఎస్.కొండ; 28-కందుకూరు; 29-కనిగిరి; 30-పామూరు; 31- వెలిగండ్ల.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సెప్టెంబర్ 2013

₹10





సుబోధ

భక్తుడు: గుర్రం కళ్ళకు గంతలు కట్టకుండా దాన్ని ముందుకు ఎలా నడిపించగలం? కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరుగురు శత్రువులు వశంలోకి రాకుండా భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోగలమా?

శ్రీరామకృష్ణులు: నువ్వు చెబుతున్నదాన్ని 'విచారణ మార్గం' అంటారు. 'జ్ఞానయోగం' అని కూడా అంటారు. ఈ మార్గం గుండా కూడా భగవంతుణ్ణి పొందవచ్చు. 'మొట్టమొదట చిత్తశుద్ధి కలగడం అవసరం' అని జ్ఞానులు చెబుతారు.

భక్తిమార్గం ద్వారా కూడా భగవంతుణ్ణి పొందవచ్చు. భగవంతుడి పాదపద్మాలపై ఒకసారి భక్తి కనుక కలిగినట్లయితే, ఆయన నామగుణ కీర్తనలు చేయడం రుచించినట్లయితే, అప్పుడు ఇంద్రియ సంయమనం కోసం ప్రత్యేకంగా ప్రయత్నించాల్సిన పనిలేదు. శత్రువులు తమంతట తామే వశంలోకి వస్తారు.

దీపపు పురుగు ఒకసారి ప్రకాశాన్ని కనుక చూసినట్లయితే అటుపైన అది అంధకారంలో ఉండగలదా?

భక్తుడు: కాలిపోయినా సరే, దీపపు పురుగు వెలుగును మాత్రం వదలదు.

శ్రీరామకృష్ణులు: ఆ, అయితే భక్తుడు దీపపు పురుగులాగా కాలి చనిపోడు. భక్తుడు ఏ ప్రకాశం వెంట అయితే పడతాడో, అది వజ్ర ప్రకాశం. వజ్రప్రకాశం ఉజ్జ్వలంగా ఉంటుంది కానీ అది సమశీతలంగా, ఉపశమనంగా ఉంటుంది. ఆ ప్రకాశంతో దేహం దగ్ధం కాదు. దానితో శాంతి లభిస్తుంది, ఆనందం కలుగుతుంది.

జ్ఞానమార్గంలో భగవంతుణ్ణి పొందవచ్చు. కానీ ఈ మార్గం కష్టతరమైనది. నేను దేహం కాదు. మనస్సు కాదు, బుద్ధి కాదు; నేను సచ్చిదానంద స్వరూపుణ్ణి, నేను సుఖదుఃఖాలకు అతీతుడను... ఈ మాటలన్నీ నోటితో చెప్పడం చాలా సులభం. కానీ వీటిని కార్యరూపంలోకి తీసుకురావడం, అవగతం చేసుకోవడం చాలా కష్టం. ❖

శ్రీరామకృష్ణ ప్రభ

రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, మొబైల్: 8801849494
E-mail: sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద** సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**



అవతారమూర్తి

విశ్వహృదయాలందు విజ్ఞానకిరణాల
విలసిల్లగాజేసి, యిలలోన రవివోలె,
వెలిగి, చీకటితెరల, తొలగించి యెల్లెడల,
వెలుగొసంగిన భరతవీర పుత్రుండెవరు?

నాస్తికత్వము వీడి, ఆస్తికత్వము వేడి,
హైందవత్వము దెసల, నలరారగాజేసి,
మత భేదములతోడ, సతమతమ్మగుచున్న
మనుజులకు కనువిప్పి, మంచిజెప్పినదెవరు?

కనుచూపులోశాంతి, తనురూపులోకాంతి,
ఏకమై లోకాన, వెల్లులను వెదజల్ల
ఆర్ష సంస్కృతిలోని యర్థమ్ము వివరించి,
భరతమాతకు కీర్తి పరల జేసినదెవరు?

ఆజానుబాహుడై, ఆనందహృదయుడై,
ఎంతవారలనైన నెదిరించి, వాదించి,
గంభీర వాక్సరణి గర్జించి, ధీరుడై
కొదమసింగమువోలె గోచరించునదెవరు?

రామకృష్ణునిమాట, రత్నాలమూటగా
భావించి, సేవించి, భారతీయతలోని
భావమ్ము నల్దెసల భాసింపగాజేసి,
జాతిరత్నమువోలె జ్యోతియైనదియెవరు?

సత్యమ్ము, న్యాయమ్ము, సహజన్ములైయుండ,
ధర్మమ్ము, జ్ఞానమ్ము, తనసొమ్ములైయుండ,
కర్మవీరుండగుచు, ధర్మధీరుండగుచు
బ్రహ్మచర్యముతోడ ప్రాజ్ఞుడైనది యెవరు?

ఆత్మసాక్షాత్కార మద్భుతమ్ముగనొంది,
అద్వైతతత్త్వమ్ము నందరికి బోధింప,
ఆచార్యుడై భువిని అవతరించినయట్టి
సరసవాగ్విభుడెవరు? సద్యశోఘనుడెవరు?

'దేహమే' విజ్ఞాన గేహమై విలసిల్ల,
'భావమే' చైతన్య దీపమై రాజిల్ల,
'వచనమే' మాధుర్యవాహినిగ రంజిల్ల
అలరారినది యెవరు? చేలువొందినది యెవరు?

సర్వమతధర్మముల సారమ్ముచవిచూచి,
సరసవాక్కులతోడ చవులూర వినిపించి,
హిందూమతోన్నతిని విశ్వమెల్లనుచాటి
ఖ్యాతినొందిన భరతజాతి వీరుండెవరు?

అతడే వివేకాఖ్యానానందమయమూర్తి!
భువనేశ్వరీ విశ్వనాథులకు తొలినోము
పుణ్యంపుఫలముగా భువివెలింగినయట్టి
దైవాంశజుండైన **శ్రీవివేకానంద!**

రచన: సురభి నరసింహాము

('శ్రీరామకృష్ణ ప్రభ' 1972 జూన్ సంచిక నుండి)



ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 70 సంచిక: 9 సెప్టెంబర్ 2013

చిదానంద సాంద్రాయ శాంతాయ తుభ్యం
నమో విశ్వకర్త్రే చ హర్త్రే చ తుభ్యమ్
నమోఽ నన్త లీలాయ కైవల్యభాసే
నమో విశ్వబీజ! ప్రసీదేశ సూనో!

విశ్వానికి బీజం, కర్త, పిత, హర్తవై,
విశ్వంలోని అనంత లీలలకు ఏకైక శాంతప్రభా కందమై,
సత్యజ్ఞానానంద ఘన మూర్తివైన శివపుత్రా
నీకు నమస్కారాలు. *– గణేశ భుజంగ ప్రయాత స్తోత్రమ్*

స్మృతిపథంలో స్ఫూర్తిప్రదాత



స్వామి వివేకానంద పేరు తెలియని వారెవరూ ఉండరు. 19వ శతాబ్దంలో భౌతికశాస్త్ర విజ్ఞానం అపరిమితంగా పురోగమించింది. అలాంటి పరిస్థితుల్లో భారతదేశంలో వేల సంవత్సరాలుగా ప్రచారంలో ఉన్న ఆధ్యాత్మిక విజ్ఞానాన్ని పాశ్చాత్య విద్యావేత్తల ముందు ప్రవచించడం, వారి మన్ననలు, ప్రశంసలు పొందడం, వాటితో పాటు తాత్త్విక జ్ఞానానికి పుట్టినిల్లయిన భారతదేశం పట్ల వారి సానుభూతిని సంపాదించడం కేవలం ఒక మానవాతీత శక్తికే సాధ్యం. ఆంగ్ల విద్యావ్యాప్తితో భౌతిక విజ్ఞానం ఎల్లలు లేకుండా విస్తరించిన నేపథ్యంలో ఆ శక్తిని ఎదుర్కొని, దాని దిశను మార్చడానికి అద్భుత సాహసం, అసమాన ప్రతిభ అత్యావశ్యకం. అలాంటి పాశ్చాత్యుల భౌతిక శాస్త్ర విజ్ఞానానికి సవాలుగా హిందూమత పతాకాన్ని నలుదిశలా ఎగురవేసి, దానికి ఉన్నత స్థాయిని అందించింది స్వామి వివేకానంద మాత్రమే!

దాదాపు 12 శతాబ్దాలకు పూర్వం శంకరాచార్యులు మన మత ఔన్నత్యం, పవిత్రతల గురించి ప్రవచిస్తూ, మన మతమే మన సంపద అనీ, అది మనకు అండగా నిలుస్తుందంటూ ప్రతి హిందువూ తన మతాన్ని గురించి ప్రచారం చేయవలసిన అవసరం ఉందనీ ప్రబోధించారు. దాన్ని వివేకానంద ఆచరణలో పెట్టి చూపించారు. ఆదిశంకరాచార్యతో సరిపోల్చదగిన వ్యక్తి స్వామీజీ. ❖ *– బాలగంగాధర తిలక్*





శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు............	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు.................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: శ్రీ బండారు హరిప్రసాద్, కొత్తపేట, హైదరాబాద్ (కీ॥శే॥ బండారు రెడ్డప్ప, నాగరత్నమ్మగార్ల జ్ఞాపకార్థం)	11,111
మహారాజ పోషకులు	: శ్రీ ఎమ్. రాజశేఖర శాస్త్రి & శ్రీమతి విజయలక్ష్మి శాస్త్రి, నిజాంపేట, హైదరాబాద్-500 090	10,116
మహారాజ పోషకులు	: శ్రీమతి లక్ష్మీచంద్ర, జూబ్లీహిల్స్, హైదరాబాద్ (కీ॥శే॥ చంద్ర జయరావు,సత్యనారాయణగార్ల జ్ఞాపకార్థం)	10,011
మహారాజ పోషకులు	: శ్రీ ఎస్. సత్యనారాయణ, 15166473A, 18RR E Coy, C/o 56 APO.	10,000
రాజ పోషకులు	: శ్రీమతి దాసరి కృష్ణకుమారి, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా (కీ॥శే॥ దాసరి ఉదయ్‌శంకర్‌గారి జ్ఞాపకార్థం)	5,116
రాజ పోషకులు	: శ్రీమతి చల్లా లక్ష్మీనారాయణమ్మ, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029	5,000
రాజ పోషకులు	: శ్రీమతి కాదా పద్మావతమ్మ, రాజేంద్రనగర్, మహబూబ్‌నగర్ (కీ॥శే॥ కె.కృష్ణవేణమ్మగారి జ్ఞాపకార్థం)	5,000
రాజ పోషకులు	: శ్రీమతి బి. అరుణ, ఆనంద్ నగర్, న్యూ మలక్‌పేట, హైదరాబాద్ -500 036	5,000
రాజ పోషకులు	: శ్రీ సి. నాగభూషణ, ధర్మవరం, అనంతపురం జిల్లా - 515 671	5,000
పోషకులు	: శ్రీ వై. శ్రీనివాసులు, 1వ పట్టణ పోలీస్ స్టేషన్, ఆదోని, కర్నూలు జిల్లా	1,500
పోషకులు	: శ్రీ ఐ. వెంకన్న, వరంగన్, జల్‌గావ్ జిల్లా, మహారాష్ట్ర (కీ॥శే॥ ఈతరాజు పాపయ్యగారి జ్ఞాపకార్థం)	1,125
పోషకులు	: శ్రీ జి. చిన్నయ్య, అక్కాయపల్లి, ఆర్.వి.నగర్, కడప	1,116
పోషకులు	: శ్రీమతి నేమాని వేంకట రత్నావతి, వానపల్లి, తూ.గో.జిల్లా (కీ॥శే॥ నేమాని సుబ్బారావుగారి జ్ఞాపకార్థం)	1,001
పోషకులు	: ఒక భక్తుడు	1,000
పోషకులు	: శ్రీ అబ్బులు చౌదరి, అంకం పాలెం, తూర్పు గోదావరి జిల్లా - 533 236	1,000
పోషకులు	: శ్రీ ఎమ్. మౌళీశ్వర రావు, నందిగామ, కృష్ణా జిల్లా - 521 185	1,000

ముఖచిత్రం: 1893 సెప్టెంబర్ 11న విశ్వమత మహాసభల్లో 'అమెరికా సోదర సోదరీమణులారా!' అంటూ ప్రారంభించిన స్వామి వివేకానంద చారిత్రాత్మక ప్రసంగానికి వేదికైన అమెరికా చికాగో నగరంలోని ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ భవనం.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలలో
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	₹ 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1500	$ 365

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా:

Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే (పోస్టల్ పిన్‌కోడ్‌తో సహా) వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
DOMALGUDA, HYDERABAD - 500 029. Andhra Pradesh
Phone No: 040- 27667799, 8801849494 E-mail : sriramakrishnaprabha@gmail.com

సంపాదకీయం

విఘ్నవిదూర వినాయక తాపహారణ

పవిత్రత, ప్రసన్నత, ప్రేమతత్త్వం, దయాగుణం, జ్ఞానశక్తి, తపశ్శక్తి, మాహాత్మ్యం - ఇవన్నీ 'భగ' అనే పదానికి అర్థం. కాబట్టి ఈ లక్షణాలున్నవారిని 'భగవంతుడు' అని అంటాం. యుగాలు మారినా, తరాలు తరలినా, శతాబ్దాలు మరలినా ఉత్తమ గుణాలున్న మహాత్ములు, మాహాత్మ్యం గల మహాపురుషులు జగద్వంద్యులై విలసిల్లుతారు, మానవాళి హృదయంలో శాశ్వత స్థానాన్ని ఏర్పరచుకొని పూజలందుకుంటారు.

లోకారాధ్యులైన మహాత్ములు పురాణకాలం నాటి వారు కావచ్చు, నవీన కాలానికి చెందినవారైనా కావచ్చు. భగవల్లక్షణాలున్న వారెవరైనా సదా, సర్వత్రా పూజనీయులే! విఘ్నాలను తొలగించే దైవంగా ప్రథమ పూజలు అందుకొంటున్న విఘ్నేశ్వరుడు పురాణకాలానికి చెందిన దైవమైతే, భారతజాతి ప్రతిష్ఠ పతనావస్థకు చేరుకొన్న తరుణంలో భారతదేశ ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిన ప్రథమ సన్న్యాసిగా కీర్తిశిఖరాలందుకొన్న వివేకానంద నవయుగ వైతాళికుడు.



వినాయకుని సుందర రూపాన్ని వర్ణిస్తూ పిల్లలు ***'తుండము నేకదంతమును తోరపు బొజ్జయు వామహస్తమున్ మెండుగ మ్రోయు గజ్జెలును మెల్లని చూపులు మందహాసమున్ కొండొక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల నొజ్జయై యుండెడి పార్వతీ తనయ ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్'*** అని పాడుతూ విద్యాప్రదాతను వేడుకుంటారు.

అలాగే విశ్వమత మహాసభల్లో పాల్గొన్న స్వామి వివేకానందను దర్శించిన అనిబిసెంట్ ఆయన ఠీవికి అబ్బురపడి స్వామీజీని ఇలా అభివర్ణించింది: "అతడు భానుతేజ ప్రభాసమానుడై ప్రజ్వరిల్లుతున్నాడు. ఆయనలో మృగరాజ ధీరత్వం ప్రస్ఫుటమవుతోంది. అందరినీ సమ్మోహపరిచే ఠీవి, తీక్షణమైన వీక్షణాలు ఆయనవి. అమృత వాక్కులను జాలువార్చే పెదవులు ఆయనవి. ఆయన పోరాట పటిమ గల సన్న్యాసి. ప్రతిభాపాటవాలతో ప్రజలను చైతన్యవంతం చేయగల వ్యక్తిగా వివేకానంద భాసించారు".

జనని... జన్మభూమి: శ్రీరామకృష్ణులు, వినాయకుని మాతృభక్తిని ఇలా వివరించారు: "ఒకసారి పార్వతీదేవి ఆసీనురాలై ఉండగా వినాయకుడు, కుమారస్వామి వచ్చారు. కుమారులిద్దరికీ పార్వతీదేవి మెడలో ఉన్న రత్నాలహారాన్ని చూసి, దాన్ని పొందాలనే ఆశ కలిగింది. అప్పుడు ఆమె కుమారులిద్దరి ఉద్దేశాన్ని గ్రహించి వారితో 'కుమారులారా! మీలో ఎవరైతే ముందుగా ఈ భూమండలాన్ని చుట్టి వస్తారో వారికి నా మెడలోని రత్నాలహారాన్ని బహుమతిగా ఇస్తాను' అని చెప్పింది. తల్లి చెప్పిన మాట విన్న వెంటనే ప్రపంచాన్ని చుట్టిరావడానికి కుమారస్వామి తన నెమలి వాహనాన్ని ఎక్కి బయలుదేరాడు.

వినాయకుడు మాత్రం 'బ్రహ్మాండాలన్నీ తన తల్లి పార్వతీదేవిలోనే ఇమిడి ఉన్నాయనీ, ఆ బ్రహ్మాండ నాయకికి ప్రదక్షిణ చేస్తే ప్రపంచమంతా ప్రదక్షిణ చేసినట్లే' అని భావించి, పార్వతీదేవికి ప్రదక్షిణ చేసి పాదాభివందనాలు అర్పించాడు.

తనయుడి భక్తి విశ్వాసాలకు మెచ్చి పార్వతీదేవి తన మెడలోని రత్నాలహారాన్ని వినాయకుడికి బహుమతిగా ఇచ్చింది. ఇంతలో నెమలి వాహనంపై విశ్వమంతటా పరిభ్రమించి వచ్చిన కుమారస్వామికి తల్లి పెట్టిన పరీక్షలోని అంతరార్థం అవగతమైంది."

స్వామి వివేకానంద నిర్వికల్ప సమాధి అనుభూతులనూ, స్వీయముక్తినీ త్యజించి భారతజాతి ఉద్ధరణ కోసం, భారతదేశ స్థితిగతులను తెలుసుకోవడం కోసం దేశమంతా పర్యటించారు.

వినాయకుడు తల్లి పార్వతీదేవికి ప్రదక్షిణ చేసి తల్లి పట్ల తన భక్తి విశ్వాసాలను ప్రదర్శించాడు. అలాగే వివేకానంద భారతదేశమంతా పర్యటించి (భారతమాతకు ప్రదక్షిణ చేసి) తన మాతృదేశభక్తిని చాటారు. పార్వతీదేవి వినాయకుని మాతృభక్తికి మెచ్చి తన మెడలోని రత్నాలహారాన్ని కానుకగా ఇస్తే, స్వామీజీ మాతృదేశభక్తికి ప్రీతి చెంది రత్నగర్భ అయిన భారతమాత తన హృదయస్థానంలో సుస్థిర స్థానాన్నిచ్చింది.

స్వామీజీ భారతదేశంతో ఎంతగా తాదాత్మ్యం చెందారో తెలియజేస్తూ సోదరి నివేదిత, 'వివేకానందే భారతదేశం! భారతదేశమే వివేకానంద! భారతదేశం ఆయన ఆత్మ. ఆయనే భారతదేశం అయ్యారు' అని కీర్తించారు. స్వామీజీయే స్వయంగా 'నేను సాంద్రీకృత భారతం' అని తనను తాను అభివర్ణించుకున్నారు. దీన్నిబట్టి స్వామీజీ దేశభక్తి ఎంత మహోన్నతమైందో అర్థం చేసుకోవచ్చు.

వినాయకుడు మాతృభక్తినీ, వివేకానంద దేశభక్తినీ ప్రదర్శించి, '**జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి**- జనని,

వివేకానంద



జన్మభూమి స్వర్గం కన్నా మిన్న' అన్న మహోన్నత సత్యాన్ని ఆచరణాత్మకం చేసి లోకారాధ్యులయ్యారు.

దివ్యపురుషుల ధీశక్తి: పంచమ వేదంగా ప్రసిద్ధి చెందిన మహాభారతాన్ని గ్రంథస్థం చేయడానికి వ్యాసమహర్షి, వినాయకుడి సహాయాన్ని అర్థించాడు. అందుకు వినాయకుడు సమ్మతించాడు. 'నేను చెప్పిన విషయాన్ని మరోసారి అడగకుండా నిరాఘాటంగా వ్రాయాలి' అని వ్యాసుడు షరతు పెట్టాడు. అందుకు వినాయకుడు సమ్మతిస్తూనే, 'నేను నిరాటంకంగా వ్రాస్తాను కానీ మీరు ఎక్కడా ఆపకుండా చెప్పాలి' అని వ్యాసుడికి కూడా ఓ షరతు పెట్టాడు. 'మరి, నేను చెప్పిన దాన్ని అర్థం చేసుకొని వ్రాయాలి సుమా!' అని వ్యాసుడు కూడా ఇంకో షరతు పెట్టాడు. అందుకు వినాయకుడు అంగీకరించాడు. వ్యాస భగవానుడు ధారా ప్రవాహంగా భారత గాథను చెబుతూ ఉంటే, దాన్ని అర్థం చేసుకొని లిఖించిన వినాయకుని ధీశక్తి అనంతం, అనిర్వచనీయం.

స్వామి వివేకానంద అద్భుత ఏకాగ్రతాశక్తి గురించి కూడా ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలు ఉన్నాయి. అందులో రెండింటిని తెలుసుకుందాం.

స్వామీజీ గదిలో 'ఎన్‌సైక్లోపెడియా ఆఫ్ బ్రిటానికా' సంపుటాలను చూసిన ఒక శిష్యుడు 'ఇవన్నీ చదవడానికి ఒక జీవిత కాలం సరిపోదు' అని అన్నాడు. అప్పుడు స్వామీజీ 'నేను పది సంపుటాలు చదివాను. వాటిలో నీకు ఇష్టమొచ్చిన ప్రశ్నను అడుగు' అని అన్నారు. ఆ శిష్యుడు అడిగిన ప్రశ్నలన్నింటికీ స్వామీజీ సరైన సమాధానమిచ్చారు. దాంతో, స్వామీజీ మేధాశక్తికి అతడు ఆశ్చర్యపోయాడు.

అలాగే ఒకసారి ఓ పాశ్చాత్య శిష్యుడు గోల్ఫ్ ఆట ఆడుతుండడం చూసి, ఆ ఆట గురించి వివరాలు అడిగారు స్వామీజీ. అతడు 'కర్రతో బంతిని దూరంగా ఉన్న రంధ్రంలో పడేలా కొట్టాలి. ఈ ఆటలో ఎంతో నైపుణ్యం ఉన్నవారు కూడా ఎన్నోసార్లు ప్రయత్నిస్తేగాని బంతిని రంధ్రంలో పడేలా కొట్టలేరు' అని అన్నాడు. అప్పుడు స్వామీజీ, 'నేను ఒక్క ప్రయత్నంలోనే బంతి రంధ్రంలో పడేలా కొడతాను' అని అన్నారు. అందుకు ఆ శిష్యుడు 'అలాచేస్తే మీకు పది డాలర్లు ఇస్తాన'ని చెప్పాడు.

స్వామీజీ కర్రను చేత పట్టుకుని ఏకాగ్రతతో రంధ్రాన్ని చూస్తూ బంతిని కొట్టారు. బంతి సరిగ్గా రంధ్రంలో వెళ్ళి పడింది. అందరూ ఆశ్చర్యంతో 'స్వామీజీ! ఈ ఆట గురించి ఏమీ తెలియని మీకు మొదటి ప్రయత్నంలోనే ఇది ఎలా సాధ్యమైంది?' అని ప్రశ్నించారు. 'మానసిక ఏకాగ్రతే అందుకు కారణం' అని అన్నారు స్వామీజీ.

విద్యలోనైనా, క్రీడల్లోనైనా, మరే రంగంలోనైనా నైపుణ్యాన్ని ప్రదర్శించాలంటే ఏకాగ్రత ముఖ్యమని నిరూపించారు స్వామీజీ. అందుకే 'విద్యల సారం ఏకాగ్రతే' అని ఆయన అన్నారు. ప్రొఫెసర్ విలియం హేస్టీ, స్వామీజీ మేధాశక్తిని శ్లాఘిస్తూ, 'నరేంద్రనాథ్ మహామేధావి. నేను జర్మనీ లాంటి ఎన్నో దేశాలను సందర్శించాను. కానీ నరేంద్రుని లాంటి ప్రతిభ గల వ్యక్తి ఒక్కరు కూడా తారసపడలేదు' అని అన్నారు.

గణరాజు... యతిరాజు: నిజమైన నాయకుడికి కార్యదక్షత, ధీశక్తితో పాటు పవిత్రత, ప్రసన్నత, సహనం, దయాగుణం మొదలైన లక్షణాలుండాలి.

శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

'తెల్లని వస్త్రాలను ధరించేవాడు (పవిత్రతా స్వరూపుడు), శశివర్ణం (నిర్మలాకారుడు), ప్రసన్న వదనం కలవాడు (శాంత స్వరూపుడు), విఘ్నాలను తొలగించే (దయార్ద్ర హృదయుడు) వినాయకుణ్ణి ధ్యానిస్తున్నాను' అని ప్రార్థిస్తాం. వినాయకుడిలో ఈ దివ్యగుణాలన్నీ ఉండడం వల్ల పరమేశ్వరుడు అతణ్ణి గణాలకు నాయకుడిగా నియమించాడు. అందుకే వినాయకుణ్ణి గణనాయక, గణాధిప, గణనాథ, గణరాజ అని సంబోధిస్తాం.

దీన జనుల తాపాలను హరించే యతిరాజైన వివేకానందను

నమః శ్రీ యతిరాజాయ వివేకానంద సూరయే ।
సచ్చిత్ సుఖస్వరూపాయ స్వామినే తాపహారిణే ॥

'మహర్షి వివేకానందా! సచ్చిదానంద స్వరూపా! తాపాలను హరించే యతిరాజా! నీకు వందనాలు!' అని ప్రార్థిస్తాం.

స్వామీజీలో నిజమైన నాయకుడి లక్షణాలన్నీ ఉండడం వల్లనే శ్రీరామకృష్ణులు మహాసమాధికి ముందు నరేంద్రుణ్ణి పిలిచి 'చూడు నరేన్! నువ్వు బుద్ధిశాలివీ, ప్రతిభావంతుడివి. అందువల్ల వీరందరి (మిగతా శిష్యుల) బాధ్యతను నీకు అప్పగిస్తున్నాను. నువ్వు వారిని ప్రేమతో ముందుండి నడిపించు' అని చెప్పారు. ఆ విధంగా శ్రీరామకృష్ణులే, స్వామీజీని భవిష్యత్తులో ఆవిర్భవించబోయే రామకృష్ణ సంఘానికి నాయకునిగా నియమించారు.

విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుణ్ణీ, తాపాలను హరించే వివేకానందుణ్ణీ పూజిద్దాం. మనలో కూడా పవిత్రత, ప్రసన్నత, ధీశక్తి, కార్యదక్షతలు పెంపొందేలా ఆశీర్వదించాల్సిందిగా ఆ దివ్యపురుషులను ప్రార్థిద్దాం. ❖

ప్రేమ చాలా దుస్సాధ్యమైన ద్వారాలను తెరుస్తుంది; జగద్రహస్యాలన్నిటికీ ప్రేమ సింహద్వారం. కాబట్టి దేశభక్తులు కాగోరే మహాత్ములారా! ముందు సానుభూతిని అలవరుచుకోండి. - స్వామి వివేకానంద

భారత సోదర సోదరీమణులారా!

అమెరికాలోని చికాగో మహానగరంలో జరిగిన విశ్వమత మహాసభల్లో 'అమెరికా సోదర సోదరీమణులారా!' అని స్వామి వివేకానంద సంబోధించగానే సభ అంతా కరతాళధ్వనులతో మారుమ్రోగింది.

కానీ మీరిప్పుడు 'భారత సోదర సోదరీమణులారా!' అన్న ఈ ముచ్చటైన మూడు మాటలు విని చప్పట్లు కొట్టకండి. చప్పట్లు కొట్టి మురిసి పోవడానికి ఇది సమయమూ కాదు, సందర్భమూ కాదు. ఇక చెప్పదలచుకున్నది చెప్పే తీరాలి. విన్న తర్వాత కొడుదురుగాని చప్పట్లు!

ఇప్పుడు అసలు విషయానికి వద్దాం. స్వామి వివేకానంద గొప్పతనాన్ని గుర్తు చేసుకుంటూ ఎన్ని 11 సెప్టెంబర్లు, ఎన్ని 12 జనవర్లు మన జీవితాలలో గడిచిపోయాయో కదా! కానీ 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్లు ఉంది మన పరిస్థితి. గొంగళి పురుగులు సీతాకోక చిలుకలవుతున్నాయి. కానీ మనం మాత్రం గొంగళి ముసుగులో నిద్రపోతున్నాం. ఇక గొంగళి ముసుగులో నుంచి బయటకు రావాలి. గొంగళి దులపాలి.

భారతమాత బిడ్డగా అమెరికా గడ్డ మీద కాలుమోపిన స్వామీజీ భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచ దేశాలకు చాటారు. ఆయనకు ఆద్యంతం మన మీదే ధ్యాస. కానీ మనం మాత్రం భారతదేశాన్ని 'పాత చింతకాయ పచ్చడి'గా పక్కకు నెట్టాం. మన వారసత్వపు విలువలు మరచి, లేని దారిద్ర్యాన్ని మన పైన ఆపాదించుకుంటున్నాం! అశాంతి పాలవుతున్నాం.

ఆనందానికై అన్వేషణ. ఈ కలికాలంలో అది దొరకడం లేదు. అనేకులు డబ్బుతో ఆనందాన్ని కొనడానికి ప్రయత్నిస్తున్నారు. ఇది హానికరం. కలియుగంలో 'జ్ఞాన మిశ్రిత భక్తి' కావాలంటారు శ్రీరామకృష్ణులు. అలాగే 'వివేక మిశ్రిత ఆనందం' అన్ని విధాలా శ్రేయస్కరం. అదెలాగో చూద్దాం.

ఒక వ్యక్తి రామకృష్ణ మఠంలో ఒక స్వామీజీని కలిసి తన కుటుంబ సమస్యలు చెప్పుకున్నాడు. మనశ్శాంతికి ధ్యానం నేర్పమన్నాడు. స్వామీజీ ఆ వ్యక్తితో 'మనస్సు ప్రశాంతంగా ఉన్నప్పుడే ధ్యానం చేయడానికి వీలవుతుంది. అందువల్ల తరచుగా మఠానికి రండి' అని సలహా ఇచ్చారు. ఆ స్వామీజీ సూచన విన్న అతడు మళ్ళీ మఠానికి రానే లేదు.

కొన్ని నెలల తర్వాత అదే వ్యక్తి మఠానికి వచ్చి స్వామీజీతో ఇలా అన్నాడు: "స్వామీజీ! ఇంతకు ముందు మిమ్మల్ని కలిసినప్పుడు మీరిచ్చిన సలహా విని, నాకు చాలా కోపం వచ్చింది. వెంటనే ఒక కౌన్సిలింగ్ సెంటర్‌కు వెళ్ళి అక్కడ 'ఎల్లలు లేని ఆనందం' అనే కోర్సులో చేరాను. ఆ 'కోర్సు ఫీజు'కు కూడా ఎల్లలు లేవు.

ఆ కోర్సులో ముఖ్యంగా సూచించింది ఏమిటంటే – భార్య, పిల్లల ముచ్చట్లు తీర్చడం. ఆ కోర్సులో సూచించిన ప్రకారం నా భార్యనూ, కుమారుణ్ణీ ఆనంద పరచడానికి ఎంతో డబ్బు ఖర్చుపెట్టాను. కానీ నా భార్య చివరకు విడాకులు ఇవ్వడానికి సిద్ధమయింది. పెద్ద మొత్తంలో డబ్బు ఇవ్వకపోతే నా ఫోటోను 'పిచ్చివాళ్ళ' ఫోటోలతో కలిపి 'ఫేస్ బుక్'లో పెడతానని కుమారుడు బెదిరిస్తున్నాడు.

దీనికంతటికీ కారణం 'నేనే' అని తెలుసుకున్నాను. ఎందుకంటే 'ఎల్లలు లేని ఆనందం' కోర్సు నిర్వాహకులు ఒక విడాకుల బృందం. వారికే మరొకరి 'కౌన్సిలింగ్' అవసరం ఉందని తెలిసి ఆశ్చర్యపోయాను" అని అన్నాడు.

ఈ నిజజీవిత సంఘటనను బట్టి, ఇక్కడ మనం ఒకటి గుర్తుంచుకోవాలి. మారేది సమాజమే తప్ప, విలువలు కాదు. కొత్త విలువల కోసం వెతికితే సమాజం 'పిచ్చాసుపత్రి' అవుతుంది. పిల్లలకు అవసరాలకు మించి వస్తువులు గుప్పించి, '(ఐ)పాడు పిల్లాడు!' అని వాపోతే ఏం లాభం? కాబట్టి ఇకనైనా మనం స్వామి వివేకానంద చూపిన మార్గంలో పయనిద్దాం. భారతీయ వారసత్వపు విలువలను సంతరించుకొందాం. అప్పుడే నిజమైన 'ఎల్లలు లేని ఆనందం' పొందగలుగుతాం. ఆ ఆనందాన్ని ఇతరులకు కూడా పంచగలుగుతాం. ❖



తొండంతో అనుగ్రహం

అది సూర్యకిరణాలు పడని కారడవి. ఎత్తైన చెట్ల మధ్య నుండి అప్పుడప్పుడు ఆకాశం కనిపిస్తోంది. అడవి మధ్య ఒక సన్నని కాలిబాట. అక్కడ ఇద్దరే వ్యక్తులు నడుస్తారు – ఒకరుసన్న్యాసి, రెండో వ్యక్తి పూజారి. అడవి మధ్యనే చిన్నగుడి. గుడిలో వినాయకుని ప్రతిమ. పాదాల చెంత చిన్న మూషికం. గోడపై పార్వతీదేవి చిత్రపటం వ్రేలాడుతూ ఉంటుంది.

పూజారి పిన్నవాడు కానీ ఎంతో భక్తిపరుడు. ప్రతి రోజూ గణేశుడికి అభిషేకం చేసి, ఎర్రమందారాలు, కొన్ని అడవి పూలు, దర్భలు సమర్పిస్తాడు. స్వామికి సిందూరం పూస్తాడు. గంభీర స్వరంతో '*ఖర్వం స్థూలతనుం గజేంద్ర వదనం లంబోదరం సుందరం... వందే శైలసుతా సుతం గణపతిం సిద్ధిప్రదం కామదం*' అని గణేశ ప్రణామ మంత్రం పఠిస్తాడు. తిరుగు ప్రయాణంలో సన్న్యాసి దర్శనం. ఆయన గుడికి వెళతాడు. ప్రతి దినం దారిలోనే పరిచయం. సన్న్యాసి అరుగు మీద కూర్చొని రాత్రంతా ధ్యానం చేసి, తెల్లవారగానే వెళ్ళిపోతాడు. అడవి చివర ఉన్న ఒక బండపై దినమంతా కాలక్షేపం. ఎవరినీ భిక్ష అర్థించడు.

ఒకనాడు ఇద్దరు యువకులు వచ్చారు. 'ఇక్కడ చూడదగిన గుళ్ళు ఏమైనా ఉన్నాయా?' అని అడిగారు. 'వినాయకుని గుడి ఉంది. ఇక్కడ వినాయకుడు జాగృతదైవం' అన్నాడు సన్న్యాసి. 'మీకు ఎలా తెలుసు?' అని అడిగారు ఆ యువకులు. 'ఒక కథ ఉంది. నమ్మశక్యం కాదు. కానీ, వింటారా?' అని అన్నాడు సన్న్యాసి. 'అదేమిటో చెప్పండి' అని ఉత్సుకతతో అడిగారు.

"పాతికేళ్ళ క్రితం సంగతి. అప్పుడు ఈ అడవి లేదు. మంచి బాట. కానీ ఇద్దరు భక్తులు మాత్రమే గుడికి వెళ్ళేవారు. ఒకడు– పూజారి, రెండోవాడు – ఒక నిరుపేద, పుట్టుగుడ్డి. దినమంతా గుడి బయట కూర్చొని భజన కీర్తన చేసేవాడు. ఎవరైనా, ఏమైనా ఇస్తేనే కడుపు నిండేది. లేదంటే ఉపవాసమే.

మూడో భక్తుడు కూడా వచ్చేవాడు. సంపన్నుడు. జట్కాలో వచ్చేవాడు. గుడిలో ప్రవేశించి, చేతులు జోడించి 'స్వామీ! ఇవాళ వ్యాపారంలో వెయ్యి రూపాయలు లాభం వచ్చేటట్లు దీవించు' అని ప్రార్థించేవాడు. అంధుడికి ఈ ప్రార్థన వినపడేది కానీ అతడు మాత్రం ఏమీ అభ్యర్థించేవాడు కాదు. ఒకసారి వరుసగా నాలుగు దినాలు కొంచెమైనా భిక్ష దొరకలేదు. నీరసం మూలంగా నోటి నుండి పాట రావడం లేదు. ఆయాసపడుతూ 'స్వామీ! ఇక నా వల్ల కాదు. ఆకలితో ప్రాణాలు వదులుతాను' అన్నాడు.

ధనికుడు వచ్చి, గడప దాటబోతున్నాడు. ఇంతలో ఎవరో గుడిలో మాట్లాడుకుంటున్న మాటలు వాళ్ళకు వినపడ్డాయి. అందులో ఒకటి – కోమల స్త్రీ కంఠస్వరం. 'ఆ కుర్రవాడు పరమ భక్తుడు కదా! వాడికి కొంచెం సాయం చేయరాదూ?'

దానికి పురుష స్వరం ఇలా అన్నది – 'అమ్మా! రేపు మధ్యాహ్నం నాటికి వాడు లక్షాధికారి అయిపోతాడు'.

ఇది పార్వతీదేవి, వినాయకుల సంభాషణ అని నిశ్చయించుకున్నాడు ధనికుడు. చటుక్కున ఓ ఆలోచన తళుక్కుమంది. అంధుని దగ్గరకు వచ్చి, 'ఇదిగో యాభై రూపాయలు! కడుపు నిండా భుజించు. కానీ, ఒక షరతు. రేపు మధ్యాహ్నం దాటగానే నీకు ఎంత భిక్ష దొరికితే, అంతా నాకు ఇవ్వాలి, తెలిసిందా?' అంధునికి ఇది కలలోనైనా ఊహించని ఘటన. ఈ జన్మలో ఇప్పటివరకు ఇటువంటి దాతలు తారసిల్లలేదు. అంతా వినాయకుని కృప. రకరకాల తీపి పదార్థాలు కొని, ఆయనకు నివేదించి, తిన్నాడు.

మర్నాడు మధ్యాహ్నానికి ముందరే గుడికి వచ్చాడు ధనికుడు. మధ్యాహ్నం, అపరాహ్ణం కూడా దాటిపోయింది. సాయంకాలపు మసక చీకట్లు ముసురుతున్నాయి. అంధుడి పళ్ళెంలో దమ్మిడీ లేదు. కోపంతో పళ్ళు పటపట కొరుకుతూ గుడిలోకి పోయి, 'ఏమి పనయ్యా ఇది? అసత్యం పలుకుతావా? వాడి పళ్ళెంలో డబ్బు లేదు సరి కదా! నా యాభై రూపాయలు దండుగ అయ్యాయి' అని వినాయకుని బొజ్జపై పిడికిలి బిగించి గుద్దాడు.

అప్పుడు ఏమి జరిగినది అనుకొన్నారు? వినాయకుని తొండం సజీవమై ధనికుడి మెడకు చుట్టుకొంది! ప్రాణం పోయేటట్లుంది. 'వినాయకా! వదులు తండ్రీ! నువ్వు ఏం కోరితే అది సమర్పించుకొంటాను.' అప్పుడు 'నీ జేబులో నుండి చెక్కు పుస్తకం తీసి, అంధుని పేర ఒక లక్ష రూపాయలు వ్రాయి' అన్నాడు గంభీర స్వరంతో వినాయకుడు. అలాగే చేశాడు ధనికుడు.

వినాయకుని స్పర్శతో, ఆయన మనస్సు ఒక క్రొత్త రాజ్యంలో ప్రవేశించింది. 'ఛీ! జీవితమంతా తుచ్ఛ విషయాలకై ప్రాకులాడాను కదా!' అని తనను తానే చీదరించుకొన్నాడు. వినాయకుని తొండం సడలిపోయింది. తొండం ఆయన భవపాశాలను తొలగించింది. వినాయకునికి సాష్టాంగ ప్రణామం చేసి, తనను తాను పూర్తిగా సమర్పించుకొన్నాడు. తిన్నగా ఇంటికి వెళ్ళాడు. ఆస్తిని భార్యా పిల్లలకు, పేదలకు పంచాడు. కట్టుబట్టలతో గుడికి తిరిగి వచ్చాడు. ఆయనకు పిచ్చి పట్టిందని తలచింది లోకం."

'ఏమి కట్టు కథండీ! రాతి విగ్రహానికి ప్రాణం వచ్చిందా? ఆ మూర్తిని దర్శించుకోవాల్సిన అగత్యం లేదు' అని నవ్వారు యువకులిద్దరూ! 'నేనే ఆ ధనికుణ్ణి' అంటూ సన్న్యాసి వడి వడిగా ఆ అడవిలోని చెట్ల మధ్యకు వెళ్ళిపోయాడు. ❖

అనువాదం: డాక్టర్ కమల జయరావు

(శారదా మఠం – బెంగాలీ మాసపత్రిక 'నిబోధత' నుండి)

నిస్వార్థమే మతానికి పరీక్ష! ఈ నిస్వార్థం ఎవరిలో ఎంత ఎక్కువగా ఉంటే వారు అంత ఉన్నతమైన ఆధ్యాత్మికపరులు. సోమరితనంతో గడిపే స్వార్థపరునికి నరకంలో కూడా స్థానం లేదు. - స్వామి వివేకానంద



భజ గోవిందమ్ భజ గోవిందమ్

> కామం క్రోధం లోభం మోహం
> త్యక్త్వాత్మానం పశ్యతి సోహం ।
> ఆత్మజ్ఞాన విహీనా మూఢాః
> తే పచ్యన్తే నరక నిగూఢాః ॥

...అవి వదులుకుంటేనే ఆత్మజ్ఞానం!

– స్వామి జ్ఞానదానంద

భగవాన్ షిరిడీసాయిబాబా మాహాత్మ్యాన్ని ఆ నోటా, ఈ నోటా విన్న ఓ వ్యాపారి ఒకానొక రోజు వారిని దర్శించుకోవడానికి వెళ్ళాడు. సిరిసంపదలకు లోటు లేని ఆ శ్రీమంతుడు బాబా పాదాలకు సాష్టాంగ ప్రణామం చేసి 'బాబా! ఇక్కడకు వచ్చిన వారి కోర్కెలన్నీ మీరు తీరుస్తారట కదా! నాకు అన్నీ ఉన్నాయి; ధనానికీ, పొలాలకూ, తోటలకూ, ఇళ్ళకూ లోటు లేదు. కానీ, ఆత్మజ్ఞానమే కొరవడింది. ఆ జ్ఞానాన్ని నాకు త్వరగా ప్రసాదిస్తే చాలా సంతోషిస్తాను' అన్నాడు. అప్పుడు బాబా 'అష్టైశ్వర్యాలు



కాకుండా, ఆత్మజ్ఞానాన్ని కోరుకున్నావు. చాలా మంచిది; దాన్ని తప్పకుండా నీకు ప్రసాదిస్తాను' అంటూ పక్కన కూర్చోబెట్టుకున్నారు. తరువాత ఏదో మాటల్లో పడ్డారు.

కొన్ని క్షణాలకు బాబా దూరంగా ఉన్న ఓ బాలుడిని పిలిచి 'మార్వాడీ వద్దకు పోయి నేనడిగానని చెప్పి ఓ అయిదు రూపాయలు చేబదులు తెమ్మ'ని పంపారు. కుర్రవాడు వెళ్ళి, వెంటనే తిరిగి వచ్చి, మార్వాడీ ఇంటికి తాళం వేసి ఉందని చెప్పాడు. అప్పు కోసం మరో ఇద్దరు ముగ్గురి ఇంటికి కూడా పంపి చూశారు బాబా. కానీ ఎక్కడా అయిదు రూపాయలు పుట్టలేదు. ఆత్మజ్ఞానం కోసం వచ్చిన ఆ వ్యాపారి అక్కడే ఉన్నాడు; అతని జేబులో నోట్లకట్టలు ఉన్నాయి. బాబా అయిదు రూపాయల కోసం పడుతున్న ఇబ్బంది చూస్తూ ఉన్నాడే కానీ జేబులో నుంచి ఒక్క నోటు కూడా తీయడం లేదు. పైగా, తనకు ఆత్మజ్ఞానం ఇవ్వడానికి ఆలస్యమవుతోందంటూ తొందరపడసాగాడు.

అప్పుడు బాబా నవ్వుతూ, 'నాయనా! నీకు ఇంకా అర్థం కావడం లేదా? నాపై నమ్మకం లేక అయిదు రూపాయలు తీసి ఇవ్వడానికే నువ్వు ఇంత ఆలోచిస్తున్నావు. ఇలాంటి నిన్ను నమ్మి ఆత్మజ్ఞానాన్ని ప్రదానం చేయమని అడుగుతున్నావే! వ్యామోహాలు వదులుకోనిదే ఆ అపురూపమైన జ్ఞానం ఎలా వస్తుందనుకున్నావు?' అని ప్రశ్నించారు. ఈ ఆత్మజ్ఞాన రహస్యాన్ని ఆదిశంకరుల ప్రియశిష్యులు భారతీవంశ కూడా 'భజగోవిందం'లో ప్రబోధిస్తూ...

కామం క్రోధం లోభం మోహం త్యక్త్వాత్మానం పశ్యతి సోహం ।
ఆత్మజ్ఞాన విహీనా మూఢాః తే పచ్యన్తే నరక నిగూఢాః ॥

'కామ క్రోధ లోభ మోహాల్ని వదిలినవాడే ఆత్మను తెలుసుకోగలడు. ఆత్మజ్ఞానం లేని మూర్ఖులు నరకబాధల్ని అనుభవిస్తారు' అని విస్పష్టం చేస్తారు.

అరిషడ్వర్గాలే అడ్డంకులు: బాబా చెప్పినా, 'భజగోవిందం' చెప్పినా ఒక్కటే! ఈ ఇహలోక విషయ వాసనలపై విసుగు చెందనంత కాలం పారమార్థికత వైపునకు మనస్సు మరలదు. ముందు ఈ ప్రాపంచిక వాసనలను వదులుకుంటేనే ఆత్మజ్ఞానానికి అర్హత లభిస్తుంది. అందుకే ముందు కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే అరిషడ్వర్గాలను అదుపులో పెట్టుకోవాలి.

అలా ఆ ఆరింటినీ కట్టడి చేయకుండా, ఒక్కో గుణానికి ఒక్కరు ప్రతినిధులుగా చరిత్రలో హీనులుగా మిగిలిపోయిన వారు ఎందరో! 'కామం' వల్ల రావణుడు నేలకూలాడు; 'క్రోధం' వల్ల దుర్వాసుడు పాడయ్యాడు; 'లోభం' వల్ల హిరణ్యాక్షుడు నాశనమయ్యాడు; 'మోహం' వల్ల భస్మాసురుడు భస్మమయ్యాడు; 'మదం' వల్ల హిరణ్యకశిపుడు మట్టికరిచాడు; 'మాత్సర్యం' వలన దుర్యోధనుడు మరణించాడు. ఆ యా గుణాలు మనలో వేళ్ళూనుకొని వటవృక్షాలుగా ఎదుగుతున్నప్పుడల్లా, వీళ్ళను గుర్తు చేసుకుంటూ, వాటిని పెరికివేస్తూ ఉండాలి. ఈ దుర్గుణాలు ఆత్మ జ్ఞానాని కన్నా ముందు మనిషిలోని ఆనందానికీ అడ్డంకిగా నిలుస్తాయి. కామం, మోహం, మాదకద్రవ్యాలలాంటివి. ముందు ఆహ్లాదంగా అనిపిస్తాయి; తరువాత మనిషిని అగాధంలోకి నెట్టేస్తాయి. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస

"కామినీ కాంచనాల ఆసక్తి ఉన్నంత వరకు దేహబుద్ధి నశించదు. విషయాసక్తత తగ్గినంత మేరకు ఆత్మజ్ఞానం కేసి పురోగమించవచ్చు; దేహబుద్ధీ తగ్గుతుంది. విషయాసక్తి అడుగంటా నశిస్తేనే ఆత్మజ్ఞానం కలుగుతుంది. అప్పుడు ఆత్మ వేరు, దేహం వేరు అని బోధపడుతుంది. కొబ్బరికాయలో నీరు ఇంకిపోనంత వరకు దానిలోని కొబ్బరినీ, చిప్పనూ కత్తితో కూడా వేరు చేయడం కష్టం. నీరు ఇంకిపోతే లోపల ఎండు కొబ్బరి దబదబలాడుతుంది, చిప్ప నుంచి కొబ్బరి వేరైపోతుంది" అంటారు.

దారి తప్పించేవి దేహవాంఛలే!: ఆత్మకు సంబంధించిన జ్ఞానాన్ని ఆర్జించాలంటే ముందు దేహవాంఛలను తగ్గించుకుంటూ ఉండాలి. దీర్ఘంగా ఆలోచిస్తే మనకు వచ్చే కష్టాలన్నీ కూడా ఈ తనువుకు సంబంధించిన తపనల వల్లేనని అర్థమవుతుంది. శరీరం మాటున సాక్షిలా వీక్షిస్తున్న ఆత్మను ఆ వాంఛలు మాయతెరల్లా కమ్మేస్తున్నాయని స్పష్టమవుతుంది. శరీరం కోరే గొంతెమ్మ కోర్కెలన్నీ తీర్చుకుంటూ, అలసిసొలసి, ఆత్మజ్ఞానానికి మార్గాన్ని చూపే ఆ భగవంతుడినే మరచిపోతున్నాం. అశాశ్వతమైన శరీరాన్ని సంతృప్తి పరచడం అసాధ్యమనీ, శాశ్వతమైన ఆత్మానందాన్ని పొందడమే పరమ లక్ష్యమనీ తెలుసుకోలేకపోతున్నాం. ఎంతెంత కాలాన్ని, ఎన్నెన్ని ధనరాసుల్ని ఈ శరీరం కోసం వెచ్చించామో ఆలోచిస్తే మతిపోతుంది. అందులో ఏ కాస్తయినా పరోపకారం వైపు, పారమార్థికత వైపు మళ్ళిస్తూ ఉంటే మనలోని భగవంతుడు మనకు దర్శనమిస్తాడు; ప్రాపంచిక సమస్యల నుంచి ఆదుకుంటాడు. అందుకే భగవాన్ రమణ మహర్షి 'మనం కేవలం దేహానికి పరిమితులమన్న తప్పుడు నమ్మకమే మన సమస్యలకు మూలం. నిరంతర ఆత్మ పరిశీలన వల్ల మనకు నిజమైన జ్ఞానం కలుగుతుంది. మన స్వస్వరూపం తెలుస్తుంది. ఆ అసలు స్వరూపం మనలోని ఆత్మే' అంటారు.

కోరికలే కొబ్బరి నీళ్ళు. కొబ్బరే ఆత్మ. కొబ్బరి పెంకే శరీరం. నీరు ఇంకిపోనంత వరకూ పెంకు నుంచి కొబ్బరి వేరు కానట్లే, కోరికలపై ఆసక్తి పోనంత వరకు దేహానికీ, ఆత్మకూ మధ్య భేదం తొలగదు.

క్రోధమూ క్రూరమే...: ఈ రోజుల్లో మనిషిని మరింత మూర్ఖుణ్ణి చేసే దుర్గుణాల్లో క్రోధమూ ఒకటి. అలవి మాలిన ఆగ్రహం మనిషిని క్రూరజంతువుగా మార్చేస్తుంది. ఆధునిక జీవనంలో మనిషి అసహనానికి లోనై, ఆగ్రహావేశాల పాలై తన సహజప్రవృత్తినే విస్మరిస్తున్నాడు. నోటి దురుసుతో తనకు తానే శత్రువులను పెంచుకుంటున్నాడు. ముక్కు మీద కోపంతో మసలుకునేవాణ్ణి లోకం మృగంలా భావించి పక్కకు తప్పుకుంటుందే కానీ, మక్కువతో దగ్గరకు తీసుకోదు. చివరకు ఆత్మీయులు కూడా ఆమడ దూరంలో ఉంటారు. అందుకే హనుమంతుడు 'సుందరకాండ'లో...

ధన్యాస్తే పురుష శ్రేష్ఠాః యే బుద్ధ్యా కోపముత్థితమ్
నిరుంధతి మహాత్మానః దీప్తమగ్ని మివాంభసా। అంటూ మహాత్ములైన ధీరపురుషులు తమలో పెల్లుబుకిన ఆగ్రహావేశాలనూ, పైకి ఎగసిపడుతున్న మంటనూ నీటితో చల్లార్చినట్లు నిశ్చయాత్మక బుద్ధితో నిగ్రహించుకుంటారు; నిజంగా వారు ధన్యాత్ములని శ్లాఘిస్తాడు. ఇలా సంయమనంతో మెలిగేవారి మనస్సు స్ఫటికంలా తేటగా ఉంటుంది. ఆత్మ ప్రకాశవంతంగా ప్రకటితమవుతుంది.

నరకం మరెక్కడో లేదు: ఆత్మజ్ఞాన రహితుడై జీవించే మూర్ఖుడు నరకబాధల్ని అనుభవిస్తాడని 'భజ గోవిందం' హెచ్చరిస్తోంది. నిజానికి నరకం ఎక్కడో ఆ పై లోకంలో లేదు. అంధకూపం, కుంభీపాకం లాంటి అన్ని రకాల నరకబాధలను అనుభవింప చేసే పాపపరిహార ప్రాంగణం ఈ భూలోకమే. కోర్కెల పరంపర ఫలితంగా అవి తీరే అవకాశమున్న ఉపాధులలోకి ఆత్మ ప్రవేశించాల్సి ఉంటుంది. అంటే మనోవాంఛలకు అనుగుణంగా దేహాలను ధరించాల్సి ఉంటుంది. అప్పుడు ఆ యా శరీరాలకు సంబంధించిన సుఖదుఃఖాలను జీవుడు అనుభవించక తప్పదు. అలా కర్మలు, వాసనలు, వాంఛల ఫలంగా లభించిన శరీరాలతో గరుడపురాణంలో చెప్పిన ఎనభై నాలుగు లక్షల నరక బాధలను భరించాల్సి ఉంటుంది. కుక్కలా పుడితే కర్రదెబ్బలు తినాల్సి ఉంటుంది; కోళ్ళు, మేకల్లా పుడితే పసందైన వంటల కోసం కోతలకు గురి కావలసి ఉంటుంది. ఇలా సృష్టిలో ఏ జీవిగా పుట్టినా నానా రకాల నరక బాధలకు గురి కావలసిందే! అలాంటి నరక బాధలు తప్పించుకోవాలంటే మానవజన్మ ఎత్తినప్పుడే పుణ్యకార్యాలు చేసుకోవాలి. కొత్త పాపాలకు అవకాశం లేకుండా, పాపభారాన్ని క్షయం చేసుకోవాలి. అలా కాకుండా స్వార్థంతో, లోభంతో బతికితే మన కష్టాల్ని మనం కొనితెచ్చుకున్నట్లే. అందుకే శ్రీమద్భాగవతం...


ధనవంతుండగు మానవుడు కడగన్ ధర్మోపకారంబులన్
ఘనతం చేయక యుండెనేని యమలోకంబందు సూచీముఖం
బను నా దుర్గతి బట్టి త్రోచి నిధిగా పైయున్న భూతంబటం
చును పాశంబుల పట్టి కట్టి వడిలో నొప్పింతు రత్యుగ్రులై

అంటూ, ధర్మకార్యాలు చేయకుండా ఇతరులకు ఏ మాత్రం ఉపకారం చేయకుండా ధనం కూడబెట్టడమే తన ధ్యేయంగా భావించినవాడు చనిపోతే వాణ్ణి యమభటులు 'సూచీముఖ'మనే నరకంలో పడదోస్తారు. అక్కడ భయంకరమైన యమకింకరులు 'డబ్బుకు కాపలా ఉన్న దెయ్యమా' అంటూ వాణ్ణి పట్టి, తాళ్ళతో బంధించి నానా బాధలు పెడతారని హెచ్చరించింది. దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కదిద్దుకున్నట్లు, మానవరూపంలో ఉన్నప్పుడే ఆ ఆరుగురు శత్రువులనూ గెలిచి, భగవంతుడి వైపు జీవుడు దృష్టి మరలిస్తే ఆనందం, ఆత్మజ్ఞానం ఆయనే ప్రసాదిస్తాడు. ❖

భారతజాతి ఎన్నడూ ద్రవ్యార్జన లక్ష్యంగా పెట్టుకోలేదు. 'ధనం చేత కాదు, సంతతి చేత కాదు, త్యాగం చేతనే అమృతత్వం పొందగలం' అనే ఆదర్శాన్ని ప్రపంచానికి చాటిన జాతి మనది. - స్వామి వివేకానంద

పిల్లలకు మనం ఏమివ్వాలి ?

– హేమంత్ కుమార్



సకల సద్గుణాలలో ఒక్క సద్గుణాన్ని అనుసరించినా మిగిలిన వన్నీ అలవడతాయి. అలాగే ఒక్క దుర్గుణం ఉన్నా దాని ఆచరణలో అనేక దుర్గుణాలనూ ఆశ్రయించవలసి వస్తుంది. ఇందుకు ఉదాహరణగా చరిత్ర మనకెన్నో సాక్ష్యాలను ఇస్తుంది. పురాణేతిహాసాల సంగతి చెప్పనక్కర్లేదు. ఏ లక్షణమైనా, అలవాటైనా పెరిగి పెద్దయ్యాక అలవడడం కష్టం. ముఖ్యంగా ఉత్తమ విషయాలు. అదృష్ట వశాత్తూ మన దేశంలో పిల్లలు పెద్దయి విద్య, వివాహం పూర్తయ్యే వరకు పెద్దల రక్షణలో, అజమాయిషీలో ఉండే సంప్రదాయం ఉంది. అంటే పిల్లలను తగిన రీతిగా మలుచుకునే వీలు ఇతర దేశాల కన్నా మనకే ఎక్కువగా ఉందన్నమాట. ఈ అవకాశాన్నీ, అదృష్టాన్నీ మనం ఎంతవరకు ఉపయోగించుకుంటున్నాం? అలా కాని పక్షంలో నష్టపోయేది మనమే. ఎందుకంటే మనమెంత గొప్ప స్థితిలో ఉన్నా మన పిల్లలు హీనస్థితిలో ఉంటే అంతకంటే నరకం మరొకటి ఉండదు. ఎప్పుడైనా హైన్యత పేదరికంలో ఉండదు. శీలరాహిత్యంలో ఉంటుంది. ప్రపంచ చరిత్రలో మకుటాయ మానంగా సువర్ణాక్షరాలతో లిఖించిన పేర్లు ధనికులవీ, సౌందర్యవంతులవీ, బలాఢ్యులవీ కాదు. సత్యపాలకులవి, అహింసా మూర్తులవి, ఆధ్యాత్మిక పరులవి, త్యాగధనులవి.

ప్రపంచంలో ఏ గొప్ప వ్యక్తీ పెరిగిపెద్దయి, సొంత బాధ్యతతో ఆ స్థాయికి ఎదగలేదు... చాలా అరుదుగా తప్ప. బాల్యంలో తల్లితండ్రులో, గురువులో వారిలో ఆ బీజాలు నాటారు. మొలకెత్తించి, చిగురువయసులో పోషణ, రక్షణ అందించారు. ఆ పునాదుల మీదే, ఆ గుణాల ఆసరాతోనే వారు ఆ తర్వాత ఉత్తములుగా తమను తాము తీర్చిదిద్దుకున్నారు. ఇందుకు ఉదాహరణగా మనకు శివాజీ, గాంధీజీ లాంటివారు ముందు వరుసలో నిలుస్తారు.

సమాజ సేవలో మనమూ భాగం పంచుకోవాలంటే మన వంతు సేవగా ఏమైనా చేయాలంటే ప్రత్యేకంగా ఏ త్యాగమూ చేయనక్కర్లేదు. మన వ్యక్తిగత బాధ్యతలను, కర్తవ్యాలను వదులుకోనక్కర్లేదు. ఆ ధర్మాలను పాటిస్తూనే, ఆ బాధ్యతలను నిర్వహిస్తూనే మన పిల్లలను ఉత్తమ గుణసంపన్నులుగా తీర్చిదిద్దితే చాలు.

సంస్కారవంతులుగా సమాజానికి అందిస్తే చాలు. బాధ్యత గల పౌరులుగా దేశానికి అప్పజెబితే చాలు. దేవాలయంలో భగవంతుని అర్చనకు అన్ని సంబారాలనూ మనమే ఇవ్వాల్సిన పనిలేదు. అది సాధ్యమూ కాదు. ఒక్క పువ్వును అందిస్తే చాలు. కొన్ని ఫలాలు అర్పిస్తే చాలు. పూజకు ప్రతి సంబారమూ ముఖ్యమే మరి. దేశసేవలో మన వంతు పాత్ర కూడా అంతే.

మనం మన పిల్లల కందించవలసినవి తరతరాలకు తరగని ఆస్తిపాస్తులు, ధనరాశులు కాదు. మన పూర్వతరాలు, తరతరాలుగా నిలబెడుతూ వచ్చిన అత్యంత శ్రేష్ఠమైన మన సంస్కృతీ సంప్రదాయాలు. అవి కేవలం శ్రేష్ఠమైనవే కాదు, అత్యంత సనాతనమైనవి. అంటే సదా ఆధునికమైనవి. ఏ కాలానికీ పాతబడనివి. అన్ని కాలాలకూ అనుగుణమైనవి. అనుసరించతగ్గవి. ఎందుకంటే మన దేశ సంస్కృతి ధార్మిక పునాదుల మీద నిర్మితమైంది. త్యాగవైరాగ్యాలు ఆ భవనానికి గోడలు. ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లే సౌగంధికా పుష్పం మన సంస్కృతి. ప్రపంచ దేశాల మధ్య మనల్ని ఇంత ఉన్నతంగా నిలబెట్టింది అదే. అవన్నీ విలువైనవని మణిమంజూషలో భద్రపరచవలసినవి కావు. మనం ఆచరిస్తూ మన పిల్లలకు మన ఆచరణ ద్వారా అందించవలసినవి.

ఎప్పుడైనా దేశ సంపన్నతను మనకున్న సంపద ద్వారా లెక్కించరు. సుసంపన్నమైన సంస్కృతీ సంప్రదాయాల ద్వారా, సద్గుణరాశుల ద్వారా, సమున్నత వ్యక్తిత్వాల ద్వారా మాత్రమే లెక్కిస్తారు. మన అనాది వారసత్వాన్ని, మన సనాతన ధార్మిక నిధిని మన పిల్లలకు అందించి మన పెద్దల ఋణం తీర్చుకుందాం. భవిష్యత్ తరాల ముందు దోషులుగా నిలబడే ప్రమాదం నుంచి తప్పించుకుందాం.... మన ఆభిజాత్యాన్ని వారికి గర్వంగా అందజేయడం ద్వారా! ❖



వివేకానంద సూక్తి సుధ

ధనం కీర్తిశ్చ పాండిత్యం న రక్షన్తి జనానిహ ।
ప్రేమ రక్షతి, సచ్ఛీలం సర్వక్లేశ వినాశకమ్ ॥

ధనం, కీర్తి, పాండిత్యం - ఇవేవీ జనులను రక్షించవు. ప్రేమ రక్షిస్తుంది. సత్ప్రవర్తన సకల క్లేశాలనూ నశింపజేస్తుంది.

వ్యాప్తా భవన్తు సర్వాసు దిక్షు స్వీయేన తేజసా ।
కర్తవ్యకరణే తీవ్రదీక్షాదక్షా భవన్తు చ ।
సేవకా ఇవ వర్తధ్వం నేతృత్వేఽంగీకృతే సతి ॥

మీ స్వకీయమైన తేజంతో సకల దిక్కులలోనూ వ్యాపించండి! కర్తవ్య నిర్వహణలో తీవ్ర దీక్షాదక్షులు కండి! నాయకత్వం అంగీకరించినపుడు సేవకుల లాగా మెలగండి!

స్వార్థచింతాం నిరాకృత్య భజన్తు సహనం దృఢమ్।
ఏవం కృతే జయో యుష్మాన్ వృణీతే నాత్ర సంశయః॥

స్వార్థచింతన వీడి దృఢమైన సహనాన్ని పాటించండి! అలా చేస్తే జయం మిమ్మల్ని వరిస్తుంది. ఇందులో సందేహం లేదు.

అకించిత్కర మిత్యాహు ర్లోకే త్వసహనం నృణామ్ ।
విజయః సర్వకార్యేషు సహనేనైవ లభ్యతే ॥

మనుజుల అసహనం వల్ల ఒనగూడే ప్రయోజనమేదీ లేదు. కార్యాలన్నింటిలోనూ విజయం సహనం వల్లనే సమకూరుతుంది.

పరేషాం శ్రేయసే యద్యత్క్రియతే కర్మతత్పరైః ।
తేషాం జీవిత సాఫల్యం తత్క ర్మైవేతి చింతయ ॥
తపసా ప్రాప్యతే శక్తి రిత్యేతత్సత్యమేవ హి ।
పరోపకారే యో యత్నః స ఏవ తప ఉచ్యతే ॥
కర్మైవ తప ఇత్యాహుః కర్మయోగ పరాయణాః ।

పరుల శ్రేయస్సు కోసం కర్మపరాయణులు ఏ కర్మ ఆచరిస్తారో ఆ కర్మయే వారి జీవితానికి సాఫల్యమని భావించు. తపస్సుచేతనే శక్తి లభిస్తుందన్న మాట సత్యమే. పరోపకారం కోసం చేసే ప్రయత్నమే తపస్సు. కర్మయోగ పరాయణులైన వారు అట్టి కర్మనే తపస్సు అన్నారు. ❖

రచన: డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య

స్వామి వివేకానంద క్విజ్

1. 'ఆయన గ్రంథాల్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. అవి చదివిన తర్వాత మాతృదేశం పట్ల నాకున్న ప్రేమ వెయ్యి రెట్లు అధికమయింది' అని స్వామీజీని గురించి అన్న ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు ఎవరు?
2. స్వామీజీని గురించి రవీంద్రనాథ్ టాగూర్ ఏమన్నారు?
3. 'స్వామి వివేకానంద ఇంకా తన మాతృభూమి, ఆమె సంతతి హృదయాల్లో నివసిస్తూనే ఉన్నారు' అని ఎవరన్నారు?
4. 'స్వామీజీ జీవించి ఉంటే నేనాయన పాదాల వద్ద స్థానాన్ని అభిలషించేవాణ్ణి. నా గురువుగా స్వీకరించి పూజించే వాణ్ణి. నేను జీవించి ఉన్నంత వరకు రామకృష్ణ - వివేకానందలకు సేవకునిగా, భక్తునిగా ఉండగలను' అన్న మాటలు ఎవరివి?
5. '19వ శతాబ్ది ఉత్తరార్ధంలో జీవించి శంకరాచార్య స్థాయికి ఎదిగిన వ్యక్తి' అని స్వామీజీని కీర్తించిన వారెవరు?
6. స్వామీజీని గురించి జవహర్‌లాల్ నెహ్రూ ఏమన్నారు?
7. 'బాధలు అనుభవించే స్థితిలో మనకు అవసరమైన స్థైర్యాన్నీ, కష్టాల నుండి తేరుకునేందుకు కావలసిన ఆశాస్ఫూర్తినీ, నిస్పృహను నివారించే మనోధైర్యాన్నీ స్వామీజీ మనకు సమకూర్చార'ని ఎవరన్నారు?
8. 'స్వామి వివేకానంద హిందూమతాన్ని, భారతదేశాన్ని కూడా రక్షించారు. ఆయన కృషి లేకపోతే, మనం మన మతాన్ని కోల్పోయేవాళ్ళం, స్వాతంత్ర్యం సిద్ధించేది కాదు. ఆయనకు మనం ఎల్లప్పుడూ ఋణపడి ఉంటాం' అని ఎవరన్నారు?
9. 'మనం దరిద్ర నారాయణుని (కోట్ల సంఖ్యలో ఉన్న క్షుత్పీడితుల, అనాథలలో ఉండే భగవానుని) సేవకు అంకితం కావాలని స్వామీజీ సలహా ఇచ్చారు. 'దరిద్ర నారాయణ' అన్న పదాన్ని స్వామీజీయే రూపొందించారు. దాన్ని గాంధీజీ ప్రచారంలోకి తెచ్చారు' అని అన్నది ఎవరు?
10. స్వామీజీ గురించి ప్రముఖ ఫ్రెంచ్ సాహితీవేత్త రోమారోలా ఏమన్నారు?
11. స్వామీజీని గురించి ఇంగ్లండ్‌కు చెందిన ప్రఖ్యాత ఇండాలజిస్ట్ ఎ.ఎల్.భాషమ్ వెలిబుచ్చిన అభిప్రాయం ఏమిటి?
12. స్వామీజీని గురించి అమెరికన్ చరిత్రకారుడు విల్ డ్యురాంట్ ఏమన్నారు?

(జవాబుల కోసం 30వ పేజీ చూడండి)

పిల్లలకు అనవసరమైన కట్టుబాట్లు పెట్టడం వల్ల వారి మానసిక వికాసం కుంటుపడుతుంది. వారిలో ఉన్న అనేక పూర్వజన్మ సంస్కారాలను తృప్తిపరచడానికి అవకాశాలు కల్పించాలి. - స్వామి వివేకానంద

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

దాతపేరు	విద్యాసంస్థ
శ్రీ వి.వి.రాఘవరావు, విస్సూరు, వరంగల్ జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, విస్సూరు, వరంగల్ జిల్లా
ఆయుర్ దర్శన్ ట్రస్ట్, ఓ.యు.రోడ్, హైదరాబాద్	ప్రాథమికోన్నత పాఠశాల, జక్కన్నపేట, మెదక్ జిల్లా
శ్రీ నందమూరి బుజ్జి, అమీర్‌పేట, హైదరాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొత్తపేట, ఖమ్మం జిల్లా
శ్రీమతి ఎన్.కె.దేవి, ఫతే మైదాన్, హైదరాబాద్	శారదా విద్యానికేతన్ పాఠశాల, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా
శ్రీ హనుమంతరావు, జహీర్‌పుర, ఖమ్మం	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఖాజీపుర, ఖమ్మం
శ్రీ టి.లింగమూర్తి, వివేక్ నగర్, చిక్కడపల్లి, హైదరాబాద్	కేశవ్ మెమోరియల్ ఉన్నత పాఠశాల, నారాయణగూడ, హైదరాబాద్
శ్రీ జి.లోకనాథం, చాకిపల్లి, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చాకిపల్లి, టెక్కలి, శ్రీకాకుళం జిల్లా
శ్రీ ఎమ్.రవికాంత్, అన్నానగర్, చెన్నై	కృష్ణా జిల్లాలోని 9 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.
శ్రీమతి బి.అరుణ, ఆనంద్ నగర్, న్యూ మలక్‌పేట, హైదరాబాద్	రాష్ట్రంలోని 15 విద్యాసంస్థలకు ఒక సంవత్సరంపాటు స్పాన్సర్ చేశారు.
డా॥ ఎ.ప్రభాకరరావు, ప్రశాంత్ నగర్, కాప్రా, హైదరాబాద్	స్వామి వివేకానంద సేవాసమితి,సంస్థాన్ నారాయణపురం, నల్లగొండ జిల్లా
శ్రీ సాయి సేవా ట్రస్ట్, శ్రీనగర్, కాకినాడ, తూ.గో.జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొల్లప్రోలు, తూర్పు గోదావరి జిల్లా
శ్రీమతి కె. శకుంతల కోదండపాణి శెట్టి, చూళై, చెన్నై	స్వామి ఎయిడెడ్ ఉన్నత పాఠశాల, శ్రీరామపురం, చిత్తూరు జిల్లా
శ్రీ పి.ఎ. నాగరాజ, షిరిడీసాయి నగర్, హిందూపూర్, అనంతపురం జిల్లా	శ్రీ సత్యసాయి ప్రేమ సదన్, హిందూపూర్, అనంతపురం జిల్లా
శ్రీ జి. డోకా రెడ్డి, కృష్ణారెడ్డి నగర్, కర్నూలు	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దేవనకొండ, కర్నూలు జిల్లా
శ్రీ ఎ.వి.నరసింహారావు, అభినవ కాలనీ, సికింద్రాబాద్	నెల్లూరు జిల్లాలోని 62 ప్రభుత్వ పాఠశాలలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ వి.రాజశేఖర్	రాష్ట్రంలోని 15 విద్యాసంస్థలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ కూచిభొట్ల నగేశ్, హైదరాబాద్	జె.కె.సి. డిగ్రీ కళాశాల, గుంటూరు
శ్రీ వై. రాకేశ్, గూడూరు, నెల్లూరు జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిల్లమానుచేను, నెల్లూరు జిల్లా
శ్రీ కె.శివ, మల్లాపూర్, యు.కె.జిల్లా, కర్నాటక	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పందిల్లపల్లి, ప్రకాశం జిల్లా
శ్రీమతి వేముల భానుమతి, కాకినాడ, తూ.గో.జిల్లా	ప్రాథమిక పాఠశాల, నర్సాపురపేట్, రామచంద్రాపురం, తూ.గో.జిల్లా
శ్రీ సిహెచ్.రాజమోహన్ శర్మ, మల్కాజ్‌గిరి, హైదరాబాద్	కె.ఆర్.ఆర్. డిగ్రీ కళాశాల, కోదాడ, నల్లగొండ జిల్లా
శ్రీ టి.సాయి బాబా, బేగంపేట, హైదరాబాద్	వివేకానంద లైబ్రరీ, శ్యామలాపురం, శ్రీకాకుళం జిల్లా
శ్రీ ఎస్.ఎస్.రావు, విమాన్ నగర్, పుణే, మహారాష్ట్ర	టేలర్ ఉన్నత శాఖా పాఠశాల, నరసాపురం, పశ్చిమ గోదావరి జిల్లా
కుమారి నిశి సుందరి, విద్యానగర్, హైదరాబాద్	రాష్ట్రంలోని 37 పాఠశాలలకు మూడు సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ పి.నాగేశ్వరరావు, నాటింగ్‌హామ్, బ్రిటన్	రాష్ట్రంలోని 10 పాఠశాలలకు ఒక సంవత్సరానికి స్పాన్సర్ చేశారు.
శ్రీ జి.దేముడు, వరలక్ష్మి, విశాఖపట్నం(కీ॥శే॥జి.పైడితల్లమ్మగారి జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వేపగుంట, విశాఖపట్నం
శ్రీమతి బి. వరలక్ష్మి, మల్కాజ్‌గిరి, హైదరాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బండారులంక, తూ.గో.జిల్లా
శ్రీ కావూరి మోహన్‌రావు, న్యూ నాగోల్ కాలనీ, హైదరాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్వకుర్తి, మహబూబ్‌నగర్ జిల్లా

ఈ పథకం ద్వారా **శ్రీరామకృష్ణ ప్రభ**ను మరింత మందికి చేరువ చేస్తున్న దాతలకు కృతజ్ఞతలు



జగన్మోహనాకార...

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు
వెగటు నాసోదంబు ఇది నీవెలితో నా వెలితో

ఎన్నిమారులు సేవించినా కన్నులూ తనియవు
విన్న నీ కథామృతమున వీనులు తనియవు
సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వాయుతనియదు
విన్నకన్నది కాదు ఇది నా వెలితో నీ వెలితో

కడగి నీ ప్రసాదమే కొని కాయమూ తనియదు
బడి ప్రదక్షిణములుసేసి పాదములు ఇవి తనియవు
నుడివి సాష్టాంగంబు చేసి నుదురునూ తనియదు
వెడగుతనమిది కలిగె నిది ఇది నా వెలితో నీవెలితో

చెలగి నిను నే పూజించి చేతులూ తనియవు
చెలువు సింగారంబు తలచి చిత్తమూ తనియదు
అలరి శ్రీవేంకటగిరీశ్వర ఆత్మనను మోహింపజేసితి
వెలయనిన్నియు దేరెమును నీవెలితో నా వెలితో ॥

సౌందర్య నిలయుడు... సౌజన్య శిఖరుడు శ్రీనివాసుడు. పురాణపురుషుడు, పుండరీకాక్షుడు ఆ పద్మావతీ ప్రియుడు. ముగ్ధమనోహర రూపంతో అఖిలాండకోటి బ్రహ్మాండాన్ని మోహింపజేయగల శ్రీముద్రాంకితుడు. అంతటి ఆ జగన్మోహనాకారుడిని అన్నమయ్య చతురుడిగా, పురుషోత్తముడిగా కొనియాడుతున్నారు. ఆ ధరణీనాయకుడి దర్శనంతో అలౌకికమైన ఆనందంలో తేలియాడుతున్నాడు. తనివి తీరని తన అనుభూతికి అక్షరాల ఊయలలు కట్టి మనల్ని కూడా ఓలలాడిస్తున్నాడు. **'జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు'** అంటూ ఆ వేంకటాచలపతిని వేనోళ్ళా స్తుతిస్తున్నాడు. పెదవుల నుంచి పాదాల వరకు అణువణువూ ఆ ఆపద్బాంధవుడి ఆరాధనకే అంకితం చేసుకున్న ఈ పదకవితా పితామహుడు భక్తసామ్రాజ్యానికే మహారాజుగా వెలిగాడు. ఏడుకొండలపై వెలసిన ఆ శంఖచక్రధరుడిని ఎన్నిసార్లు వీక్షించినా, ఆయన గుణగానాన్ని ఎన్నిసార్లు ఆలకించినా, ఆ దివ్యనామాన్ని ఎన్నిసార్లు ఆలపించినా ఇంకా వెలితిగానే ఉందని అసంతృప్తి పడుతున్నాడు. ఇలా పారమార్థిక పరవశం ముందు ప్రాపంచిక పరవశం రసహీనమైనదని నిరూపించాడు. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస కూడా 'భగవదానందాన్ని చవిచూశాక సంసారంలోని ఆనందం రుచించదు. భగవదానందాన్ని ప్రాప్తించుకున్నట్లయితే సంసారం రుచిహీనంగా తోస్తుంది. ఎవరికైనా పట్టుపంచె దొరికినట్లయితే ఆ వ్యక్తి కోరాగుడ్డను ఖాతరు చేయడు' అంటారు. నిజమే! పరమాత్మ ప్రాప్తి పట్టుపంచె లాంటిది.

నీ వెలితో, నా వెలితో...

ప్రాపంచిక వ్యామోహం దుఃఖహేతువు; కానీ పరమాత్మపై వ్యామోహం ఆనంద సేతువు. ఆయనపై ప్రేమను పెంచుకుంటే, భౌతికపరమైన బంధాలు సడలి, మనస్సు పరమోన్నత స్థితికి చేరుకుంటుంది. అలా అలమేలుపతికి అమర ప్రేమికుడయ్యాడు; ఆ ఆనందనిలయుడిని ఆవాహన చేసుకొని తన్మయుడయ్యాడు అన్నమయ్య. ఆ పదాలపులకింతతోనే...

జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు
వెగటు నాసోదంబు ఇది నీవెలితో నా వెలితో...

అని పాడుకున్నాడు. 'ఆసోదము' అంటే శరీరమంతటా వ్యాపించే అతి గాఢమైన భావన. ఈ లోకంలోని ఏ అందమూ ఆ భగవంతుడి సౌందర్యానికి సాటిరాదని ఎందరో భక్త శిఖామణులు చాటిచెప్పారు. ఈ ప్రపంచంలో మనం ఏ అందానికి ఆకర్షితులమైనా, అది కొంత కాలానికి వెగటు కలిగిస్తుంది. 'మనం ఇంతకాలం వెంపర్లాడింది దీని కోసమా?' అని ఏవగింపు పుడుతుంది. కానీ భగవంతుడిపై పెంచుకున్న ప్రీతి అలాంటిది కాదు. కాలగతిలో అది మనస్సుకు మరింత మాధుర్యాన్ని ప్రసాదిస్తుంది. ఎంత ఆస్వాదించినా అంతు లేదనిపిస్తుంది. అందుకే అన్ని వేల కీర్తనలు రాసినా అన్నమయ్యకు ఆ మాధవుడిపైన మోహం మొత్తలేదు. మనస్సును ప్రాపంచిక లౌల్యం నుంచి రక్షించడంలో భక్తిని మించినది మరేదీ లేదు. ఆ భావంతోనే ఆది శంకరాచార్యులు 'శివానంద లహరి'లో

హే కపాలిన్! భిక్షూ! మే హృదయకపి మత్యంత చపలం
దృఢం భక్త్యాబధ్వా శివ! భవదధీనం కురువిభో ।

"ఓ కపాలీ! ఆదిభిక్షూ! నా మనస్సనే కోతి అతి చంచలమైంది. నేను దానిని నా అధీనంలోకి తీసుకురాలేక పోతున్నాను. నీవే 'భక్తి' అనే తాడుతో దాన్ని గట్టిగా కట్టి నీ అధీనంలో పెట్టుకోవయ్యా! అప్పుడే నా మనస్సు స్థిరంగా చెప్పిన మాట వింటుంద"ని వేడుకుంటారు.

(మిగతా 32వ పేజీలో...)

ఆధ్యాత్మికతను ఆవలనెట్టి పాశ్చాత్యుల నాగరకత వెంటబడ్డారంటే, దాని ఫలితంగా మూడు తరాలలో జాతీయ భవంతి పునాదులు సడలిపోయి జాతి మొత్తం సర్వనాశనమవుతుంది. -స్వామి వివేకానంద




పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

భక్తుడు: భగవద్భక్తిని పెంపొందించుకోవడం ఎలా?

స్వామీజీ: పవిత్ర జీవనం గడపడం ద్వారా, భగవద్భక్తుల సాంగత్యం చేయడం ద్వారా, భగవన్నామ జపం చేయడం ద్వారా, భగవన్నామ కీర్తన చేయడం ద్వారా భగవద్భక్తిని పెంపొందించుకోవచ్చు.



భాగవతంలో శ్రీకృష్ణుడు భగవద్భక్తి పెంపొందడానికి మార్గాలను తెలుపుతూ ఉద్ధవునితో ఇలా అంటాడు:

మల్లింగ మద్భక్త జనదర్శన స్పర్శనార్చనమ్ ।
పరిచర్యా స్తుతిః ప్రహ్వగుణ కర్మానుకీర్తనమ్॥

(భాగవతం-11,11.34)

'ఉద్ధవా! నా మూర్తినీ, నా భక్తులనూ దర్శించవలెను, స్పృశించవలెను, సేవించవలెను, స్తుతించవలెను, నమస్కరించవలెను. నా గుణకర్మలను కీర్తించవలెను.'

నిర్మలమైన, ఏకాగ్రమైన మనస్సుతో భగవంతుణ్ణి నిత్యమూ ప్రార్థించడం అలవరచుకోవాలి. వీలైనప్పుడు ఏకాంతవాసం చేయడం అభ్యసించాలి. భగవద్భక్తి పెంపొందడానికి మరికొన్ని మార్గాలివి.

భక్తుడు: భగవంతుని పట్ల విశ్వాసం ఎప్పుడు కలుగుతుంది? భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోవడం ఎలా?

స్వామీజీ: భగవంతుని పట్ల విశ్వాసమే లేకపోతే సాధన చేయడానికి మనస్సు ఉపక్రమించదు. మొదట సాధన చేయడం ప్రారంభిస్తే, ఆధ్యాత్మిక పురోగతి సాధిస్తున్నట్లు అర్థమవుతుంది. అంటే మనలో భగవంతుని పట్ల విశ్వాసం కూడా అధికతరమవుతున్నదని అర్థం. ఆ విశ్వాసమే భగవదనుభూతికి తోడ్పడుతుంది.

తీవ్ర వ్యాకులతతో సాధన చేయడం ద్వారా భగవంతుణ్ణి సాక్షాత్కరింపజేసుకోవచ్చు. శ్రీరామకృష్ణులు చెప్పినట్లు భగవత్ సాక్షాత్కారానికి కావలసిన ప్రథమ అర్హత – 'వ్యాకులత'.

సాధకుడు శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావాలలో ఏదో ఒక మార్గాన్ని అనుసరించి సాధన చేయాలి. శ్రీరామకృష్ణులు మాతృభావంతో భగవంతుణ్ణి ఆరాధించి భగవల్లాభాన్ని పొందారు.

పసిబిడ్డ తల్లి కోసం వ్యాకులతతో విలపిస్తే, తల్లి ఎన్ని పనుల్లో మునిగి ఉన్నప్పటికీ వాటిని వదిలి పరుగున వచ్చి బిడ్డను లాలిస్తుంది. అదే విధంగా సాధకుడు వ్యాకులతతో విలపిస్తే భగవంతుడు తప్పక ప్రత్యక్షమవుతాడు. ఈ యుగంలో భగవంతుణ్ణి మాతృభావంతో ఆరాధించడం శ్రేయస్కరం, సులభతరమని శ్రీరామకృష్ణులు నిరూపించారు.

భక్తుడు: జపం చేస్తున్నప్పుడు మనస్సు ఇతర ఆలోచనల వైపు పరుగెడుతోంది. దీనికి పరిష్కారం ఏమిటి?

స్వామీజీ: మనస్సు చంచలమైనది. అది దాని సహజ స్వభావం. అనేక విషయాలను గురించి ఆలోచించే మనస్సును ఏకాగ్రం చేయాలంటే నిష్ఠతో కూడిన నిరంతర అభ్యాసం చాలా అవసరం. ముఖ్యంగా గడిచిన కాలం తిరిగి రాదన్న విషయాన్ని మనం సదా జ్ఞాపకం ఉంచుకొని, సమయాన్ని సద్వినియోగం చేయడానికి ప్రయత్నించాలి.

శివాపరాధ క్షమాపణ స్తోత్రంలో శంకరాచార్యులు ఇలా అంటారు:

ఆయుర్నశ్యతి పశ్యతాం ప్రతిదినం యాతి క్షయం యౌవనం
ప్రత్యాయాన్తి గతాః పునర్న దివసాః కాలో జగద్భక్షకః
లక్ష్మీస్తోయ తరంగ భంగ చపలా విద్యుచ్చలం జీవితం
తస్మా న్మాం శరణాగతం కరుణయాత్వం రక్ష రక్షాధునా

"చూస్తుండగానే దినదినమూ ఆయువు నశిస్తోంది. యౌవనం నశిస్తోంది. గడచిన రోజులు తిరిగిరావు. కాలం జగత్తును భక్షిస్తుంది. సంపద నీటి తరంగాల లాగా చంచలమైనది. జీవితం మెరుపు తీగలా నశ్వరమైనది. కాబట్టి, ఓ దేవా! నిన్ను శరణు పొందిన నన్ను దయతో తప్పక కాపాడు."

ఉత్తమమైన మానవజన్మ పొంది, జీవితంలో ఏమి సాధించామని మనల్ని మనం ప్రశ్నించుకుంటే మనస్సు వృథా ఆలోచనల వైపు, ప్రాపంచిక విషయాల వైపు పరుగులు తీయదు. ఈ ఆలోచన మనలో ఎంత దృఢంగా నాటుకుంటే అంత త్వరగా మనస్సును భగవంతునిపై ఏకాగ్రం చేయవచ్చు. ❖

పండుగలు-పర్వదినాలు

సెప్టెంబర్ - 2013

1, 15	ఆదివారం	:	ఏకాదశి
4	బుధవారం	:	స్వామి అద్వైతానంద జయంతి
9	సోమవారం	:	వినాయక చవితి
28	శనివారం	:	స్వామి అభేదానంద జయంతి
30	సోమవారం	:	ఏకాదశి

అక్టోబర్ - 2013

4	శుక్రవారం	:	స్వామి అఖండానంద జయంతి
14	సోమవారం	:	విజయదశమి
15	మంగళవారం	:	ఏకాదశి
18	శుక్రవారం	:	లక్ష్మీపూజ
30	బుధవారం	:	ఏకాదశి

- డాక్టర్ రెంటాల జయదేవ

నమస్కారం



భారతీయులు నమస్కారం ద్వారా పరస్పరం పలకరించుకుంటారు. మనం నిత్యం చేసే నమస్కారంలో విశేషం ఏముందంటారా! ఉంది. రెండు చేతులూ జోడించి, ఛాతీ దగ్గర ఉంచుకొని, తల వంచుతూ, 'నమస్కారం' అనడంలో ఓ విశేషం ఉంది. మన కన్నా చిన్నవాళ్ళ దగ్గర నుంచి సమవయస్కులు, పెద్దవాళ్ళు, స్నేహితులు, అపరిచితుల దాకా ప్రతి ఒక్కరినీ నమస్కారం ద్వారా పలకరిస్తుంటాం.

పాప ప్రక్షాళన సాధనం - నమస్కారం: ధార్మికంగా చూస్తే, నమస్కారం సైతం ఓ ముఖ్యమైన పరిహార సాధనం. నిత్య జీవితంలో తెలిసి కానీ, తెలియక కానీ మనం ఎన్నో పొరపాట్లు, పాపాలు చేస్తూ ఉంటాం. అలా సంక్రమించిన పాపాలను ప్రక్షాళన చేసుకోవడానికి మన చేతిలోని సులభమైన మార్గం ఒక్కటే - భగవంతుని ముందు మోకరిల్లి నమస్కరించడం! దైనందిన జీవితంలో కూడా ఎవరితోనైనా పొరపాటుగా ప్రవర్తిస్తే, వారి వద్దకు వెళ్ళి నమస్కరించి, తప్పును క్షమించాల్సిందిగా కోరతాం.

భగవంతుని ముందు మోకరిల్లి, శిరస్సు వంచి ప్రార్థనలు చేయడం, పశ్చాత్తాపంతో క్షమాభిక్ష కోరడం క్రైస్తవ మతంలో, ఇస్లామ్ మతంలో కూడా ఉంది. ఒక్కొక్కరూ ఒక్కో రకంగా నమస్కారం చేస్తుంటారు. కొంతమంది ఒక చేతిని శిరస్సు పక్కన చేర్చి, తల వంచుతారు. మరికొంతమంది తమ గడ్డం రెండు చివరలనూ చేతితో రెండు సార్లు స్పృశిస్తారు. ఇంకొందరు రెండు చేతులనూ పైకెత్తి, నమస్కరిస్తారు. కేరళ ప్రాంతంలో అయితే, ప్రజలు ముందుగా నేలను తాకి, ఆ చేతితో వెంటనే శిరస్సును స్పృశించుకుంటారు.

'నమః' శబ్దానికి అర్థాలెన్నో! : కొంత లోతుగా వెళ్ళి, సాంప్రదాయికంగా చెప్పాలంటే, నమస్కారమంటే అహంకార రాహిత్యం. 'మః' అంటే 'నాకు నేను ఉపయుక్తుడను' అనీ, 'న' అంటే 'కాను' అనీ అర్థం. 'నమః' అనడం ద్వారా 'నాకు నేను ఉపయుక్తుణ్ణి కాదు. నన్ను నేను ఉద్ధరించుకోలేను. కాబట్టి, నువ్వే నన్ను ఉద్ధరించ వలసింది' అని పెద్దలకూ, దేవుడికీ చెప్పుకోవడమన్న మాట! కాబట్టి, 'ఆత్మార్పణం చేసుకోవడం' అనే అపూర్వ యోగాన్ని 'నమః' అనే పదం సూచిస్తోంది. మన వినమ్రతనూ, పూజ్యుడైనవాడి ఉత్కృష్టతనూ చూపడమనే అంతరార్థం నమస్కారంలో ఉంది.

పద్మపాదాచార్యులు నమస్కారానికి అనేక అర్థాలు చెప్పారు. ***'త్యాగో నమ శ్శబ్దస్య వాచ్యార్థః'*** అన్నారు. అంటే, 'నమః అనే శబ్దానికి త్యాగమని అర్థం'. అహంకారాన్ని త్యజించి, 'నీ కన్నా నేను తక్కువవాణ్ణి. నా కన్నా నువ్వు గొప్పవాడివి' అంటూ పెద్దల ఎదుట దైన్యం (దీనత్వం) చూపడమన్న మాట! దైవానికీ, దైవ సంబంధమైన విషయాలకూ 'దాస్య భావం' ప్రదర్శించడమన్న మాట! మరో రకంగా చెప్పాలంటే, నమశ్శబ్దం మనం భగవంతుడికి దాసులమని బోధిస్తోంది.

తాత్త్వికులు, వేదాంతుల పరంగా తరచి చూస్తే - నమశ్శబ్దానికి 'వంగుట' అనే వాచ్యార్థం ఉంది. దీనికి ధ్యానమనేది లక్ష్యార్థం. నిరంతర ధ్యానమనేది 'నిధి ధ్యాసం'! అలాగే, 'నమః' అనే దానికి షడ్భావ వికారాలు లేకుండా అని కూడా అర్థముంది. షడ్భావ వికారాలు ఏమిటయ్యా అంటే - 'జాయతే, అస్తి, పరిణమతే, వర్ధతే, అపక్షీయతే, వినశ్యతి'. అంటే, ఉత్పత్తి, స్థితి, పరిణామం, వృద్ధి, క్షయం, నాశం - అనే ఆరింటినీ 'భావ వికారాలు' అంటారు. ఆ భావ వికారాలు లేకపోవడమే నమస్కారం.

వ్యుత్పత్త్యర్థం ప్రకారం చూస్తే, 'నమతీతి నమః'. అంటే, నమస్కరించే ఉపాసకుడు, భగవంతుడితో 'స్వామీ! నేను నీకు దాసుణ్ణి. నీ స్వరూపమనే ఆత్మస్వరూప జ్ఞానాన్ని నాకు ఒసంగి, నీ సారూప్యాన్ని పొందించుము' అని వేడుకోవడమన్న మాట.

నమస్కారం వల్ల దైన్యభావం, అంటే నిరాడంబరత, సేవాభావం అలవడతాయి. ఫలితంగా మనలోని అహంకారం తగ్గుతుంది. ఇక, ఈ సేవాభావం వల్ల భగవద్భక్తి కలుగుతుంది. భక్తి పెంపొందడం వల్ల దేవుడి పట్ల విశేషమైన ఆరాధనా భావం వస్తుంది. ఆ భక్తి, ఆరాధనలతో సాధించరానిదంటూ ఏమీ లేదు. ఆ భక్తే ఆత్మసాక్షాత్కార జ్ఞానానికి మూలం. చివరకు మోక్షప్రాప్తికి ఉత్తమ సాధనం కూడా! ❖ (మరిన్ని విశేషాలు... వచ్చే సంచికలో...)

నాయనా! భగవద్భక్తి, గురుభక్తి, ధర్మం పట్ల విశ్వాసం ఉన్నంత వరకు ఏదీ నీకు హాని కలిగించలేదు. పవిత్రతే గొప్పశక్తి. దాని ముందు మిగిలినవన్నీ బిత్తర పోతాయి. -స్వామి వివేకానంద

సాకారంగా ఒక్కొక్క భావానికి, ఒక్కొక్క రూపంతో భాసించే ఆ పరమాత్మ విఘ్న సంహారక అనే భావంతో స్మరించగానే, వినాయక రూపంతో దర్శనమిస్తాడు. వేదాలలో గణపతి తత్త్వం విస్తృతంగానే వివరించబడింది. గణపతిని ప్రస్తుతించిన ఋగ్వేదమంత్రంలోని ప్రథమభాగం ప్రతి దైవకార్యంలోనూ మనం పేర్కొంటాం.

ఓమ్ గణానాం త్వా గణపతి(గ్)ం హవామహే
కవిం కవీనా ముపమశ్రవస్తమమ్ ।
జ్యేష్ఠరాజం బ్రహ్మణాం బ్రహ్మణస్పత
ఆ నః శృణ్వన్ ఊతిభిః సీద సాదనమ్ ॥

విశేష రూపంలో విలువైన పాఠాలు

– స్వామి హర్షానంద



'గణాలలో గణపతిగా, కవులకు కవిగా, ఐశ్వర్య సమృద్ధి గలవానిగా, అగ్రపూజ్యుడవై ప్రకాశించే బ్రహ్మణస్పతీ! నీ పాలనా హేతువులైన శక్తులతో మా సదనములలో ప్రవేశించి ఉండు' అని దీని తాత్పర్యం.

గణపతి – బ్రహ్మణస్పతి, బృహస్పతి, వాగధిపతి, వాచస్పతి – ఇలా పలు విధాలుగా చెప్పబడి, బంగారు వన్నెతో, పరశువును ధరించి ఉంటాడు. గణపతి నామాన్ని గురించి యోచిస్తే, గణం అంటే సమూహం, అసలు ఈ విశ్వమంతా గణమయం, ఈ గణాలన్నింటిలోనూ అంతర్యామిగా ఉంటూ శాసించేవాడు గణపతి. మరుత్తులు లేదా మరుద్గణాలు అనబడేవారు విఘ్నాలను సృష్టించడంలోనూ, నివారించడంలోనూ ప్రముఖంగా పేర్కొనబడతారు. అలాంటి వారిని శాసించే విఘ్న నాయకునిగా గణపతి ఋగ్వేదంలో ప్రస్తుతిని అందుకున్నాడు.

గణపతి చేసిన సాహసకృత్యాలు చాలా ఉన్నాయి. స్కందునితో పోటీపడి, విఘ్ననాయకునిగా నియమితుడవడమే కాక, సిద్ధి,బుద్ధి అనే శక్తులను సముపార్జించుకున్నాడు. పరశురామునితో ఒకానొక సందర్భంలో యుద్ధానికి తలబడి, ఆ పోరాటంలో దంతాన్ని కోల్పోయి, ఆ విరిగిన దంతాన్నే వ్యాసుడు చెప్పిన మహాభారతాన్ని లిఖించడానికి ఘంటంగా వాడాడు. అంతే కాదు, చంద్రుడు తనను చూసి పరిహసించినందుకు వినాయకుడు ఇచ్చిన శాపకారణంగానే చంద్రకళలు పెరగడం, తరగడం అని చెబుతారు.

సాధారణంగా వినాయకుని రూపం రక్తవర్ణంలో, ధగద్ధగాయమానశోభలు కలిగిన కిరీటాన్ని ధరించిన ఏనుగు మోముతో, ఏకదంతంతో, చతుర్భుజాలు కలిగి ఉంటుంది. ఈ నాలుగు చేతులలో – రెండింటిలో పాశాన్నీ, అంకుశాన్నీ ధరించి, మరి రెండు చేతులతో అభయ, వరద ముద్రలను కలిగి ఉంటాడు. యజ్ఞోపవీతం ధరించి, సర్పాన్ని మొలత్రాడుగా చుట్టుకున్న గణపతి పద్మంలో ఆసీనుడై ఉంటాడు. అతని పాదాల చెంత మూషికరాజం కూర్చుని ఉంటుంది. ఈ విధంగానే కాక ఇంకా, వీర గణపతి, శక్తి గణపతి, క్షిప్ర గణపతి, హేరంబ గణపతి ఇత్యాదులుగా 32 రకాల గణపతుల గురించి చెప్పారు.

రూపప్రపంచాన్ని తెలియజేసేవి గణాలు, శబ్ద ప్రపంచాన్ని తెలియజేసేవి మంత్రాలు, వాటికి అధిపతి అయిన గణపతి తత్త్వం ఆత్మజ్ఞానపరమైనది. ఇప్పుడు ఈ స్వరూపాన్ని నిశితంగా పరిశీలించే యత్నం చేద్దాం.

గణమనగా ఒక వర్గం లేదా సమూహం. ఈ విశ్వమంతా గణమయం – మనుష్యగణం, వృక్షగణం, జంతుగణం,

గ్రహగణం - ఇలా వివిధ లక్షణాలను అనుసరించి, ఇంకా ఎన్నో గణాలు ఉన్నాయి. ఈ గణాలన్నింటిలోనూ అంతర్యామిగా ఉంటూ, శాసించే పరమేశ్వరుడు **గణపతి.**

గజాననుడు: గజాననుడు, గజముఖుడు ఇత్యాది నామాలు వినాయకునికున్నాయి. ఈ గజశబ్దంలోని 'గ'కారం గతినీ, జీవితపు అంతిమలక్ష్యాన్నీ నిర్దేశించేది కాగా, 'జ'కారం జన్మను సూచిస్తుంది. ఇలాంటి తత్త్వాన్ని తెలియజేస్తూ, మనకు మార్గనిర్దేశం చేసేవాడు గజాననుడు.

ఈ సృష్టిలో బ్రహ్మాండంలో సూక్ష్మాండం, సూక్ష్మాండంలో బ్రహ్మాండం ఇమిడి ఉన్నాయి. ఇవి రెండింటిలో ఒకటిగా, ఒకటిలో రెండుగా ఉంటాయి. ఇదే విషయం ఛాందోగ్యోపనిషత్తులో ప్రస్తావితమై, 'తత్త్వమసి' అని చెప్పబడింది. 'తత్-త్వమ్-అసి' అన్న వాక్యార్థానికి, 'అది నీవే అయి ఉన్నావు' అని చెప్పబడినదానికి ప్రామాణికంగా చెబుతూ, సూక్ష్మాతి సూక్ష్మం నుండి బృహదాకారం గల భూమండలం, పర్వతాలు ఇత్యాదులు సృష్టించబడ్డాయి అని వివరించారు. ఈ గజానన రూపంలో మానవదేహం ఆత్మతత్త్వానికి ప్రతీకగా సూక్ష్మాండాన్ని తెలుపగా, ఏనుగు శిరం బృహదాకారమైన బ్రహ్మాండాన్ని సూచిస్తుంది. ఈ రెంటి కలయిక అయిన ఏకస్వరూపమే గజానన రూపం.

శివుడు పరమ పురుషునికి ప్రతీక అయితే, పార్వతీమాత సాక్షాత్తూ పరమ ప్రకృతియై, ఆయనకు అభిన్నంగా ఉంది. ఈ ప్రకృతి మాయతో కూడి ఉన్నది. ఈ మాయా ప్రకృతిలోని త్రిగుణాలలో సత్త్వగుణం శుద్ధం కాగా, రజో, తమోగుణాలు శుద్ధం కానివి. బంగారానికి లోహం తోడైనప్పుడే ఆభరణాలు తయారైనట్లుగా, శుద్ధసత్త్వానికి రజస్సు, తమస్సు తోడైనప్పుడే జీవనిర్మాణం జరుగుతుంది. ఈ త్రిగుణాల కలయికచే పార్వతీమాత నలుగు పిండితో (శుద్ధం కాని రజో, తమో గుణాలు) బాలుని చేసిందన్న దానికి అర్థం. ఈ నరాకారానికి కారణం మాయ, ప్రకృతి కాగా, ఆ శిరస్సును ఖండించి గజముఖం తెచ్చి పునరుజ్జీవుని చేసిన పరమ శివుడు పురుష శబ్దార్థం. ఈ ప్రకృతి పురుషుల అభేదాకృతి గణపతి.

శూర్పకర్ణుడు: గణపతి మనకు శూర్పకర్ణునిగా దర్శనమిస్తాడు. ఆయన చెవులు శూర్పముల (చేటలు) లాంటివి. ఆర్తుల సమస్యలను సావధానంగా వినడానికీ, మంచీ చెడులను వేరు చేసేందుకూ శూర్పకర్ణాలు ఉన్నాయని లౌకికంగా భావించినా, విఘ్నకారణ, విఘ్ననివారణ శక్తులను తెలియజేసే ఆ రెండు చెవులు జ్ఞానం, సంపదలకు ప్రతిరూపాలు.

ఏకదంతుడు: ఏకదంతుడు అనే నామంలో, ఏకశబ్దానికి ప్రధానం అనేది అర్థం కాగా, దంత శబ్దం బలవాచకం. సర్వోత్కృష్ట బలశాలి అని ఏకదంత నామార్థం. పూర్ణదంతం అజరామరమైన సత్యానికి ప్రతీకగా, విరిగిన దంతం మిథ్యా జగత్తుకు ప్రతీకగా నిలుస్తాయి.

వక్రతుండం ఓంకార ఆకారానికి ప్రతీక. గణపతి యొక్క **లంబోదర** నామం సమస్తలోకాలనూ దాచుకున్న ఆయన కుక్షిని (ఉదరం) తెలియజేస్తుంది.

పాశాంకుశధరుడు: గణపతి అస్త్రాలు పాశం, అంకుశం. అందులో పాశం రాగానికీ, అంకుశం క్రోధానికీ సంకేతాలు. రాగం బంధనానికి దారి తీస్తుంది. ఇక, క్రోధం అంకుశం లాగా మనస్సును గాయపరుస్తుంది. వీటి బారి నుంచి తప్పించుకోవడానికి, మనలోని రాగాన్నీ, క్రోధాన్నీ ఆయనకు సంపూర్ణంగా ధారాదత్తం చేసి, శరణాగతి పొందాలన్నదే పాశాంకుశధర గణపతి వెనుకనున్న తత్త్వరహస్యం.

మూషికవాహనుడు: మూషికవాహనునిగా ప్రఖ్యాతి గడించిన గణపతి వాహనానికి 'అనింద్యుడు' అని పేరు. మూషిక శబ్దానికి అర్థం - దొంగతనము చేసేది అని! ఎలుక ఎలాగైతే దొంగతనంగా ఇంట్లోకి జొరబడి వస్తువులను చెల్లాచెదురు చేస్తుందో, అలాగే అహంకారం కూడా దొంగతనంగా, మన ప్రమేయం లేకుండా, మన మనస్సులలో జొరబడి మనలోని ఆలోచనాశక్తిని కకావికలు చేస్తుంది. మూషికాన్ని దాసోహం చేసుకున్న గణపతి లాగా, మనలోని అహంకారాన్ని పాదాల చెంత కూర్చోబెట్టగలగాలి. ఈ మూషిక శబ్దానికే అర్థం ఇంకొక రకంగా చెబితే - దొంగతనం చేసేది ప్రేమ అనుకుంటే, మానవునిపై ప్రేమ ఎంత వరకు ఉండాలో అంత వరకే ఉండాలి. హద్దులు మీరిన ప్రేమ చేటు తెస్తుంది. పాదాల చెంత ఉంచిన ఎలుక లాగా, మానవ ప్రేమను ఒక స్థాయిలోనే ఉంచాలి.ఆ ప్రేమను, దైవం వైపు తిప్పగలిగిననాడు, ఆధ్యాత్మిక శిఖరంపై మరొక అడుగు వేసినట్లే!

కాలాన్ని విఘ్నమంటాం. అది అనుకూలమైనా, ప్రతికూలమైనా దానిని శాసించేవాడు విఘ్నేశ్వరుడు కనుక ప్రతి పనికీ ఆయన అనుగ్రహం ఉంటే విఘ్నాలు వాటంతట అవే తొలగుతాయి. 'శ్రేయాంసి బహు విఘ్నాని' అన్నట్లుగా కార్యసాధకునికి అనేక ఆటంకాలు కలుగుతాయి. వాటిని అధిగమిస్తూ, భోగలాలసతకు తావివ్వక, దైవం వైపు అడుగులు వేయగలిగినవాడు విజయుడు కాగలడు. సిద్ధి, బుద్ధి శక్తులు ఆధ్యాత్మిక సాధనలో ఎదురైనా, వాటిని లక్ష్యపెట్టక అధిగమించిన వారు అత్యున్నత జ్ఞానాన్ని కైవసం చేసుకుంటారు. సిద్ధి బుద్ధి గణపతి మనకు తెలియజేసే రహస్యమిదే. అగ్రపూజ్యుడైన ఆ మహాగణపతికి ఇవే నమోవాకాలు. ❖

తెలుగు సేత: డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

(సెప్టెంబర్ 9వ తేదీ, సోమవారం 'వినాయక చవితి' సందర్భంగా)

బ్రహ్మచర్యం వల్ల అద్భుత సామర్థ్యం, సంకల్పశక్తి కలుగుతాయి. బ్రహ్మచర్యం లేనిదే ఎట్టి ఆధ్యాత్మిక శక్తీ కలగదు. ఇంద్రియ నిగ్రహం వల్ల మానవకోటిని ఆకర్షించే శక్తి లభిస్తుంది. -స్వామి వివేకానంద

ఐదు మంత్రజాలపు మాటలు



- స్వామి అర్చనానంద

అది 1893 సెప్టెంబర్ 11వ తేదీ. అమెరికాలోని చికాగో మహానగరంలో మొట్టమొదటిసారిగా ప్రపంచంలోని అన్ని ధర్మాల, మతాల ఆచార్యులు, ప్రతినిధులు, ప్రచారకులు ఒక్కచోట సమావేశమయ్యారు. దాదాపు ఏడు వేల మందితో క్రిక్కిరిసిన ఆ మహాసభలో ఎవ్వరూ సామాన్యులు కారు. అందరూ గొప్పవారే! మేధావులే! ఆ సభలో భారతదేశం నుండి హిందూ మతానికీ, భారతీయ వైదిక సంస్కృతికీ ప్రతినిధిగా మహాకష్టంతో ఒక యువ సన్న్యాసి ప్రసంగించడానికి ప్రవేశపత్రం సంపాదించాడు. అతను కేవలం 30 ఏళ్ళ నవ యువ కిశోరం. ఆనాటి సభ ఉదయం ప్రారంభమై ఎన్నోసార్లు నిర్వాహకులు ఆ యువసన్న్యాసిని ప్రసంగించాల్సిందిగా ఆహ్వానించారు. ఆయన ఆ ఏడు వేల మంది ఉత్తమోత్తముల మధ్య ప్రసంగించడానికి తానేమీ 'ప్రసంగ పాఠం' సిద్ధం చేసుకుని రాలేదని సంకోచించి, 'తరువాత, తరువాత' అంటూ దాటవేశాడు. ఈ 'తరువాత, తరువాత' అన్న ఆ యువ వేదాంత సింహం – ఆ 'తరువాత' ప్రపంచ మతాల 'తలరాత'నే మార్చేశాడు!



చికాగో విశ్వమత మహాసభలనాటి స్వామీజీ ఛాయాచిత్రం

ఇక సాయంత్రం ఈ యువ సన్న్యాసికి పక్కనే కూర్చున్న జి. బోనెట్ మౌరీ అనే గొప్ప ఫ్రెంచి మతాచార్యుడు, మహా విద్వాంసుడు – చనువుతో, ప్రేమతో ఈ సన్న్యాసిని 'ఇక మీరు తప్పక ప్రసంగించి తీరాలి' అంటూ ప్రోత్సహించాడు. అంతకు ముందు చాలా మంది అతి చక్కటి పదజాలం, వైవిధ్యం, పాండిత్యంతో కూడిన 'తయారు' చేసుకుని వచ్చిన తమ ప్రసంగాలను చదివి వినిపించారు. ఈ భారతీయ వేదాంత యువ కిశోరం – అది దైవాజ్ఞగా తలచి తన అంతరాత్మలో జ్ఞానదాయిని శ్రీసరస్వతీ దేవిని స్మరించుకొని, 'Sisters and Brothers of America!' (అమెరికా సోదరీ సోదరులారా!) అని కేవలం అయిదు పదాలతో ఆ మహాసభలోని ఏడు వేల మందిని సంబోధించాడు. అంతే! ఆ పెద్ద హాలులోని అందరూ ఒక్కసారిగా ఏదో అదృశ్య, అద్భుత, ఆధ్యాత్మిక శక్తిప్రవాహం, ఆనందపు పులకరింత తమ అంతరాత్మల్ని మేలుకొల్పగా – తమ కుర్చీల నుండి లేచి నిలబడి నింగీ నేలా ప్రతిధ్వనించేలా రెండు నిమిషాల పాటు ఏకధాటిగా కరతాళధ్వనులు చేశారు. విశ్వమత మహాసభ ఆ హర్షధ్వానాలతో దద్దరిల్లింది. విశ్వమానవాంతరంగం ఆనందాశ్చర్యాతిశయంతో పులకరించింది!

ఏమున్నదీ, ఆ అయిదు మాటలలో, ఆ అయిదు పదాలలో? ఎవరీ యువ సన్న్యాసి? ఆనాటి నుండి ప్రపంచంలోని ఆధ్యాత్మిక చింతనాశైలినీ, తత్త్వాన్నీ ఒక మలుపు తిప్పిన మహా వీరుడు, ఆధ్యాత్మిక ఆకాశంలో మత దురభిమాన తమోహర

(మిగతా 30వ పేజీలో...)



మార్గాలు వేరైనా గమ్యం ఒక్కటే!

అమెరికా సోదర సోదరీమణులారా!

మాకు మీ రొసగిన మనఃపూర్వకమైన స్వాగతాన్ని పురస్కరించుకొని ఈ సమయంలో మీతో ముచ్చటించడం నాకు మహానందదాయకం. ప్రపంచంలోని అత్యంత ప్రాచీన యతి సంప్రదాయం తరఫున మీకు నా అభివాదాలు; సమస్త మతాలకూ సమస్త ధర్మాలకూ తల్లి అనదగ్గ సనాతనధర్మం తరఫున మీకు నా అభివాదాలు; వివిధ జాతులతో, అనేక సంప్రదాయాలతో కూడిన భారత జన సహస్రాల తరఫున మీకు నా అభివాదాలు.

సహనభావాన్ని వివిధ దేశస్థులకు తెలిపిన ఘనతా, గౌరవమూ సుదూర దేశస్థులైన ప్రాచ్యులకు చెందడం ఎంతో సమంజసమని తత్ప్రతినిధులను గురించి ఈ సభావేదిక నుండి మీకు తెలిపిన వక్తలకూ నా అభివాదాలు. సహనాన్నీ, సర్వమత సత్యత్వాన్నీ లోకానికి బోధించిన సనాతనధర్మం నా ధర్మమని గర్విస్తున్నాను. సర్వమత సహనాన్నే కాక, సర్వమతాలూ సత్యాలనే మేము విశ్వసిస్తాం.

సమస్త మత, సమస్త దేశాల నుండీ పరపీడితులై, శరణాగతులై వచ్చినవారికి శరణ్యమైన దేశం నా దేశమని గర్విస్తున్నాను. రోమన్‌ల నిరంకుశత్వానికి గురై తమ దేవాలయం తుత్తునియలైన ఏటనే దక్షిణ భారతదేశానికి వచ్చి, శరణు పొందిన యూదులను– నిజమైన యూదుల నదగ్గవారిలో మిగిలినవారిని – మా కౌగిట చేర్చుకొన్నామని తెలుపడానికి గర్విస్తున్నాను. మహాజొరాస్ట్రీయ సంఘంలో శేషించినవారికి శరణు ఒసగి – నేటికీ వారిని ఆదరిస్తున్న (సనాతన) ధర్మం నా ధర్మమని గర్విస్తున్నాను.

సోదరులారా! అతి బాల్యం నుండీ పారాయణ చేస్తున్నట్లు నాకు జ్ఞాపకం ఉన్న ఒక స్తోత్రం నుండి, ప్రతిరోజూ కోట్లాది మానవులు పారాయణ చేసే ఒక స్తోత్రం నుండి – కొన్ని చరణాలను ఉదాహరిస్తాను: "వివిధ ప్రదేశాల్లో జన్మించిన నదులు సముద్రంలో సంగమించినట్లే వివిధ భావాలచే మనుషులు అవలంబించే వివిధ ఆరాధనామార్గాలు వక్రాలై కనపడినా, అవక్రాలై కనపడినా – సర్వేశ్వరా! నిన్నే చేరుతున్నాయి."

"ఎవరు ఏ రూపంలో నన్ను గ్రహిస్తారో, నేను వారిని అలాగే అనుగ్రహిస్తున్నాను. ఎల్లరూ సమస్త మార్గాల చేతను తుదకు నన్నే చేరుతున్నారు" అని భగవద్గీతలో తెలుపబడ్డ అద్భుత సిద్ధాంతాన్ని ప్రపంచంలో ఇంతవరకు జరిగిన మహోత్కృష్ట సమావేశాల్లో ఒకటైన ఈ మత మహాసభే సమర్థిస్తూ, ముక్తకంఠంతో లోకానికి చాటుతోందని చెప్పనొప్పుతుంది.

శాఖాభిమానం, స్వమత దురభిమానం, దానివల్ల జనించిన మూర్ఖాభినివేశం సుందరమైన ఈ జగత్తును చిరకాలంగా ఆక్రమించి ఉన్నాయి. భూమిని అవి దౌర్జన్యమయం గావించి, అనేక పర్యాయాలు మానవ రక్తసిక్తం చేశాయి. ఈ ఘోరరాక్షసులు చెలరేగి ఉండకుంటే, మానవ సమాజం నేటి కన్నా విశేషాభివృద్ధి పొందివుండేది. కానీ వాటి అవసానసమయం ఆసన్నమైంది; ఈ మహాసభ గౌరవార్థం నేటి ఉదయం మోగించబడిన గంట సర్వవిధాలైన స్వమత దురభిమానానికీ, పరమత ద్వేషానికీ – కత్తితో గానివ్వండి, కలంతో గానివ్వండి సాగించే నానావిధాలైన హింసకు మాత్రమే కాక, ఒక్క గమ్యాన్నే ప్రాపించబోయే జనం కొందరిలోని నిష్ఠుర ద్వేషభావాలకు కూడా శాంతి పాఠం కాగలదని నేను మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాను. ❖

(1893 సెప్టెంబర్ 11 న విశ్వమత మహాసభల్లో 'స్వామి వివేకానంద-ప్రథమ ప్రసంగం'.)

మన మాతృభూమి మహాయోగులకు జన్మస్థానం, తీవ్రవైరాగ్యానికి ఆలవాలం. మానవుడు సాధించాల్సిన మహోన్నత ఆదర్శం ప్రాచీన కాలం నుండి నేటి వరకు విరాజిల్లుతున్నది ఇక్కడే! -స్వామి వివేకానంద



నిరంతర స్ఫూర్తి... చికాగో

నిజమైన మతం: 'పుణ్యస్య ఫలమిచ్ఛంతి పుణ్యం న కుర్వంతి మానవాః - నేటి మానవులు పుణ్యఫలాన్ని కోరుకుంటారు. కానీ పుణ్యకర్మలను మాత్రం ఆచరించరు'. ఈనాటి మనుషుల ప్రత్యేకత ఇది. 'ఏ పని చేయాలో అది చేయరు; ఏ పని చేయకూడదో అది చేస్తారు'. ఇది మంద బుద్ధుల లక్షణం. ఉదాహరణకు మతవ్యవస్థనే తీసుకుందాం. అన్ని మతాలూ శాంతినీ, సకల మానవ కల్యాణాన్నీ సర్వదా కాంక్షిస్తున్నా, వాస్తవంలో అవి ఎడారిలోని ఎండమావులే! ఆచరణ లేని పలుకులు జీవం లేని కళేబరాలు. కనుక ఏదైనా సాధించాలంటే మనస్సు-మాట ఒక్కటై, చిత్తశుద్ధితో ఆచరించాలి. ఇదే విజయ రహస్యం.

మనమందరం మన మన మతాలను ప్రేమిస్తాం. అది సహజం. మన మతంపై మనకున్న భక్తి నిష్ఠలు ఇతర మతాలపై ద్వేషభావాన్ని పెంచేవిగా ఉండకూడదు. స్వమత అభిమానం, పరమత ద్వేషానికి దారి తీయరాదు. మత ఛాందసత్వం అంటే ఇదే! "We have religion enough to hate each other, but not enough to love each other" అన్నట్లు మనలోని ద్వేషాన్ని అధిగమింపజేసి, ప్రేమను పెంచేదే నిజమైన మతం. మతాలు వేరైనా దాని నాచరించే మనిషి, ఆ మనిషి మనస్సు, ఆ మనస్సులోని మంచితనం ముఖ్యం.

మతమన్నది మన కళ్ళకు మసక పొరలు కాకూడదు. విశాల దృక్పథాన్ని ప్రసాదించాలి. ప్రస్తుతం సమాజ సుస్థిర మనుగడకూ, ప్రగతికీ అవరోధాలుగా నిలిచే దుష్టశక్తులు, స్వప్రయోజన సాధనకూ, స్వలాభాలకూ, స్వార్థానికీ లోబడి, మత సిద్ధాంతాలకే వక్రభాష్యం చెప్పి ప్రజలను పెడదారులు పట్టిస్తున్నాయి. ప్రపంచ సమైక్యతకు గొడ్డలి పెట్టులా తయారవుతున్నాయి. ఈ పరిస్థితుల్లో వర్తమాన సమాజానికి అమెరికాలోని చికాగో విశ్వమత మహాసభలలో వివేకానంద స్వామి ఇచ్చిన దివ్య సందేశం స్ఫూర్తిదాయకం, శిరోధార్యం.

చికాగో విశ్వమతసభలు: కొలంబస్ అమెరికా దేశాన్ని కనుగొని 400 సంవత్సరాలు నిండిన సందర్భంగా 'కొలంబియన్ ప్రదర్శన' నిర్వహింపబడింది. ఆ ఉత్సవాలలోని అంతర్భాగమే ఈ విశ్వమత మహాసభలు. ఈ సభలు ప్రపంచ దేశాల చరిత్రలో మరపురాని ఘట్టం. ప్రపంచ సాంస్కృతిక - ఆధ్యాత్మిక చరిత్రలో చిరస్మరణీయమైన రోజు 1893 సెప్టెంబర్ 11. మతాల మధ్య పరస్పర అవగాహనకూ, సర్వమత సమన్వయానికీ, సామరస్యానికీ చక్కటి నిర్వచనం ప్రపంచ దేశాలకు అందించి సమగ్ర సమాఖ్యగా పేరొందిన చికాగో విశ్వమత మహాసభలకు శుభారంభం జరిగింది ఆ రోజునే. ఒక సాధారణ హిందూ సన్న్యాసి సనాతన ధర్మ ప్రతినిధిగా పాల్గొని, వినూత్న శోభను చేకూర్చి, విశ్వవిఖ్యాత వివేకానందునిగా వన్నెకెక్కినదీ ఈ సభలోనే. 'నిర్వాహకులు ఆశించిన దాని కన్నా నేటి ఈ సభలు విజయవంతంగా రాణించాయంటే దానికి ముఖ్య కారకుడు వివేకానంద స్వామియే' అనీ; 'నిస్సందేహంగా ఆ సభలను ఆకట్టుకొని అశేష సభికుల మన్ననలు పొందిన వారిలో స్వామీజీయే ప్రథముడనీ' అమెరికా దేశపు వార్తా పత్రికలు అప్పట్లోనే వేనోళ్ళ కొనియాడాయి. ఈ సభలు ముగిసేనాటికి మతసామరస్యానికి సుస్థిర పునాదులు వేయడమే కాక, ప్రపంచ దేశాలలో మత అవగాహనకు సరికొత్త రూపురేఖలు దిద్దబడ్డాయి. మత దురభిమానమే సమాజ శ్రేయస్సుకు అడ్డుగోడ అని చాటి, మత సమన్వయ, సామరస్యాలకు రూపకల్పన చేయడంలో సభ్యసమాజం చూపిన చొరవ ఫలితమే ఈ విశ్వమత మహాసభలు అని గమనించాలి.

ప్రథమ సమావేశం: ప్రారంభ సమావేశంలో స్వాగతోపన్యాసానికి ప్రతిస్పందిస్తూ వివిధ మతాల ప్రతినిధులు ప్రసంగిస్తున్నారు. నాటి సభాధ్యక్షులు వివేకానంద స్వామిని మాట్లాడమని కోరుతున్నప్పుడల్లా 'ఇప్పుడు కాదు, తరువాత' అని దాటవేస్తున్నారు. అసలు ఈయన ప్రసంగించ గలరా? అన్న సందేహం నిర్వాహకులకు రాకపోలేదు! చివరకు ఆనాటి మధ్యాహ్నం సభ ముగియబోయే సమయానికి స్వామి వివేకానంద ఉపన్యసించడానికి ఉద్యుక్తులయ్యారు. వారి తొలిపలుకులే యావన్మంది సభికులనూ సమ్మోహితులను చేశాయి. 'అమెరికా సోదర సోదరీమణులారా!' అన్న



ప్రసంగాల దీప్తి!

– స్వామి శశికాంతానంద

ముచ్చటైన ఈ మూడు మాటలు సభికుల హృదయాంతరాళాలను తాకాయి. పూర్తిగా రెండు నిమిషాలు కరతాళ ధ్వనులతో సభ మారుమ్రోగింది.

వివేకానందుడు పలికినవి వట్టి మాటలా? కావు. సర్వాత్మభావంతో, హృదయాంతరంగం నుండి నిండు మనస్సుతో అన్న మాటలవి. యుగయుగాల భారతీయ సంస్కృతినీ, ఆత్మీయతనూ రంగరించుకున్న ఈ మూడు మాటలూ ఆ దేశ ప్రజల హృదయాలను చూరగొనగా – వారంతా వివేకానందునికి బ్రహ్మరథం పట్టారు. రాబోయే వైశ్వీకరణ (globalization)కు దృఢమైన చక్కటి పునాది స్వామీజీ చికాగో ప్రసంగాలు.

మొత్తం 17 రోజులు జరిగిన ఈ సభలలో 15 ప్రసంగాలు చేశారు – స్వామి వివేకానంద. ప్రధాన సభావేదిక నుండి ఇచ్చిన ప్రసంగాలు ఆరు. ఇన్నిసార్లు ప్రసంగించే అవకాశం ఒక్క వివేకానందునికే కల్పించారు! ఈ ఆరు ప్రసంగాలలో అయిదు సంగ్రహంగా సాగినవి, ఒక ప్రసంగం Paper on Hinduism హిందూ మత విశ్వజనీనతను వెల్లడిచేసే సనాతన ధర్మ ప్రకాశిని. ఈ ఆరూ అతి ముఖ్యమైనవి. వీటిని అతి సంగ్రహంగా కొంత పరిశీలిద్దాం.

సభలో రెండు నిమిషాల కరతాళ ధ్వనుల అనంతరం అమెరికా దేశానికీ, ఆ సభా నిర్వాహకులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు స్వామీజీ. భారత దేశం నుండి కొందరు వ్యక్తులు హిందూ మతంలోని కొన్ని సాంప్రదాయాలకు మాత్రమే ప్రాతినిధ్యం వహించగా, వివేకానంద స్వామి సమగ్ర హిందూమత వ్యవస్థకూ, సనాతన ధర్మానికీ ప్రాతినిధ్యం వహించడం గమనార్హం.

వివిధ దేశాల నుండి, మతాల నుండి వచ్చిన బాధితులకూ, శరణార్థులకూ భారతదేశం ఆశ్రయమిచ్చిన చరిత్రాత్మక సత్యాలను వివరించి, తద్వారా హిందూమతం ఆచరణాత్మకంగా ప్రపంచ దేశాలకు మత సహనమే కాక, అన్ని మతాల వారినీ సాదరంగా ఆహ్వానించి తనలో ఇముడ్చుకునే ఔదార్యాన్ని చూపిన విధానాన్ని సోదాహరణంగా వివరించారు స్వామి వివేకానంద. భారతీయుల విశ్వజనీనతనూ, హృదయ వైశాల్యాన్నీ, భావ ఔదార్యాన్నీ తెలిపే ఈ రెండు సంస్కృత శ్లోకాలనూ సందర్భోచితంగా వివరించారు ఆ సభలో స్వామీజీ!

త్రయీ సాంఖ్యంయోగః పశుపతిమతం వైష్ణవమితి
ప్రభిన్నే ప్రస్థానే పరమిదమదః పథ్యమితి చ ।
రుచీనాం వైచిత్ర్యాత్ ఋజుకుటిల నానాపథ జుషాం
నృణామేకో గమ్యస్త్వ మసి పయసా మర్ణవ ఇవ ॥

'నదులు వేరు వేరు చోట్ల పుట్టినా, ఏ మార్గాన్ని అనుసరించినా, కడకు సముద్రంలో కలిసినట్లే, జనులు వారి వారి అభిరుచులకు అనుగుణంగా వివిధ మతాలను అవలంబించినప్పటికీ – ఓ ప్రభో! చివరకు వారంతా చేరుకునేది నీ దరికే!' అని పై శ్లోకానికి భావం. ఎంతటి ఉదాత్త భావం ఇది.

ఇలాంటిదే ఈ గీతా వాక్యం:

యే యథామాం ప్రపద్యంతే తాం స్తథైవ భజామ్యహం ।
మమ వర్త్మాను వర్తంతే మనుష్యాః పార్థ సర్వశః ॥


'ఎవరు ఏ విధంగా నన్ను భజిస్తారో, వారిని ఆ విధంగానే అనుగ్రహిస్తాను. అర్జునా! అన్ని విధాలా మనుష్యులు నా మార్గాన్నే అనుసరించి, నన్నే చేరుకుంటున్నారు' అని ఈ శ్లోకానికి అర్థం.

తరువాత మత దురభిమానం, మతం పేరిట జరిగే హింసా ప్రవృత్తి, ప్రపంచపు శోచనీయ స్థితిని చూసి ఆవేదన వ్యక్తపరచారు ఆ ప్రసంగంలోనే స్వామీజీ. ఇక...

విషాద నిశీథిలో కాంతిరేఖల్లా విశ్వమత మహాసభలు విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని చాటుతూ ప్రపంచ ప్రజలను ఒక్కటిగా కలపడానికి చేస్తున్న ప్రయత్నాన్ని కొనియాడుతూ, సభారంభాన్ని తెలియజేస్తూ ఆ ఉదయం మ్రోగిన జేగంటలు మత ఛాందసత్వానికీ, మతం పేరిట జరిగే హింసాత్మక చర్యలకూ, మనుషుల మధ్య ఉండే విద్వేషాలకూ చావు గంటలు కావాలనీ, అందరూ కలిసి ఈ దుష్టశక్తులను అణచి వేయాలనీ స్వామి వివేకానంద ఆశను వ్యక్తపరచారు ఈ తొలి ప్రసంగంలో. ❖

(వచ్చే సంచికలో... విశ్వమత మహాసభల్లో స్వామి వివేకానందుని మిగతా ఐదు ప్రసంగాల సారాంశం.)

సహనాన్నీ, సర్వమత సత్యత్వాన్నీ లోకానికి బోధించిన సనాతన ధర్మం నా ధర్మమనీ, శరణాగతులై వచ్చిన సర్వమతస్థులకు శరణ్యమైన దేశం నా దేశమనీ చెప్పడానికి గర్విస్తున్నాను. -స్వామి వివేకానంద



- స్వామి శితికంఠానంద

మహాత్ముల మార్గంలో సింహాసదృశులమవుదాం!

ఆగష్టు మాసాంతం వచ్చింది. స్నేహితులు వికాస్ వినీత్ కలుసుకున్నారు. మహాచార్యుడు వివేకానందుడిని చదవగలుగుతున్నందుకు సంతోషిస్తూ తమకు అర్థమైన ఆ అనన్య సామాన్య దేశభక్తుడి భావాలను పంచుకుంటున్నారు. ఈ నెలలో వారి సంభాషణ ఇలా కొనసాగింది..

వినీత్: యావద్భారతం వివేకానందుడి 150వ జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న సందర్భంలో నాదొక చిన్న సందేహం వికాస్. మన వయస్కులలో ఇప్పుడు ఒక వింత ఆలోచనా ధోరణి ప్రబలుతుంది. అదేమిటంటే అందరూ గొప్పవ్యక్తిని గొప్ప వ్యక్తి అంటున్నారు. కానీ ఆయన చూపిన మార్గంలో నడవడానికి ఉద్యుక్తులవడం లేదు. ఇదొక గర్హించదగిన విగ్రహారాధన అని నా భావన. నీవేమంటావు?

వికాస్: నీ భావనతో ఏకీభవిస్తున్నాను. అందుకనే సమాజం ఇలా ఉంది. ఒక వ్యక్తిని కేవలం గొప్ప వ్యక్తి అనడం వలన మనం గొప్ప వాళ్ళమవుతామా? మనమూ వాళ్ళలాగా గొప్పవాళ్ళమవడానికి ప్రయత్నించాలి. అదే వారికి మనమిచ్చే నిజమైన నివాళి.

వినీత్: తెలుసుకోవడం ఒక ఎత్తు. తెలుసుకున్నదానిని ఆచరించడం ఒక ఎత్తు. మన యువమిత్రులంతా చదువు, తరువాత ఉద్యోగాన్వేషణ...ఉద్యోగం తర్వాత వివాహం..ఇలా చక్రం తిరుగుతున్నది. ఆలోచించుకునే సమయం కూడా ఉండడం లేదు. కాబట్టి జీవితమంటే ఏమిటి? ఎందుకు? అన్న ప్రశ్నలు వాళ్ళ మనసుల్లో ఉదయించే అవకాశం లేదు. వివేకానందుడి లాంటి తత్త్వవేత్త వాళ్ళకు పరిచయం అయ్యే అవకాశమే అసలు లేదు.

వికాస్: నీవన్నది నిజమే వినీత్. మానవ చరిత్రను జాగ్రత్తగా పరిశీలిస్తే కొట్టొచ్చినట్లుగా కనపడే పరిణామం ఇది. మహాత్ములను మహాత్ములుగానే గుర్తిస్తున్నారు ప్రజలు. వాళ్ళకు నీరాజనాలు అర్పిస్తున్నారు. ఐనా జీవితాలను వాళ్ళు చూపిన బాటలో నిర్దేశించుకోవడానికి మాత్రం ముందుకు రావడం లేదు. అందుకే సమాజం ఆశించిన స్థాయికి ఎదగడం లేదు. దీనికి కారణాలు ఏమై ఉంటాయి అనుకుంటున్నావు? ఉపనిషత్తులలో చెప్పినట్లు శ్రేయస్సు, ప్రేయస్సులే అందుకు కారణాలు.

వినీత్: శ్రేయస్సు, ప్రేయస్సా..? ఈ పదాలు ఎప్పుడూ వినలేదే. వాటికి అర్థం ఏమిటో కాస్త విడమర్చి చెప్పు వికాస్?

వికాస్: శ్రేయస్సు అంటే ముందు ఇబ్బందికరంగా, కష్టతరంగా అనిపించినా చివరకు అనంత సుఖ ప్రదాయిని. ప్రేయస్సు అంటే అశుభకరమైనది, కేవలం నిమిష సౌఖ్యాలని ప్రసాదించేది. పరిణామ క్రమంలో అనంతమైన దుఃఖాన్ని ప్రోది చేసి పెట్టేది. గీతలో భగవానుడు చెప్పినట్లు **'యత్తదగ్రే విషమివ పరిణామే అమృతోపమ్। తత్సుఖం సాత్త్వికం ప్రోక్తం ఆత్మబుద్ధి ప్రసాదజమ్॥** ముందు విషం లాగా అనిపించినా క్రమేణ అమృతోపమైన ఆత్మానందాన్ని, శాంతిని ప్రసాదించేది సాత్త్విక సుఖం. ధ్యానం, జపం, సత్యవాక్పరిపాలన లాంటి కర్మలు సాత్త్విక సుఖాన్ని ప్రసాదిస్తాయి. వీటికి భిన్నంగా ఇంద్రియ పరజీవితం ముందు సుఖంగా అనిపించిన కాలక్రమంలో దుస్తర దుఃఖానికి దారి తీస్తుంది.

వినీత్: మరి ఈ విషయం తెలియక జనులు ప్రేయస్సుకై పరుగెడుతున్నారంటావా? మరి వారిని శ్రేయో మార్గంలో పయనింపజేయడానికి మనం ఏమి చేయాలి?

వికాస్: ఇలా మనుజులకు సదా శ్రేయోమార్గం ఏమిటో తెలియజేసేదే భారతీయ ధార్మిక సాహిత్యం అంతా. అనాదిగా మనిషి పుట్టుకకు అర్థాన్ని, జీవిత ప్రయోజనాన్ని, చరమ లక్ష్యాన్ని అన్వేషిస్తూ వచ్చిన మన ఋషిసత్తములు నశ్వరమైన మానవజన్మ ధర్మాలంబన జీవనం ద్వారానే అమృతతుల్యమవుతుందని ఉపదేశించారు. కానీ మన సమాజంలో నేడు జన్మను సార్థకం చేసుకోవడం, అమృతత్వాన్ని పొందడం లాంటి మాటలు వట్టిమాటలగానే వినిపిస్తున్నాయి లోకులకు. పథం తెలియని పయనం అయింది నేటి మనిషి జీవితం..



వినీత్: లేదనుకుంటాను వికాస్. మార్గం తెలియక కాదు. మార్గం దుష్కరం అన్న భావన వలన వారు ఈ మార్గాన్ని ఎంచుకోవడం లేదని భావిస్తున్నాను. మిగతా ప్రాపంచిక భోగాలు ప్రత్యక్షావగమాలు. తక్షణం మనకు అనుభవమయ్యేవి. ఇక శ్రేయోమార్గం నుంచి వచ్చే ఆనందం శాశ్వతమైనది, కాలాతీతమైనది అని తెలిసినప్పటికీ అది అతిప్రయాసతో లభ్యమవుతుందన్నది జనుల భావన.

వికాస్: ఏమన్నావు వినీత్? ప్రయాసా! ప్రయాస రెండింటిలో సమానమే అని నా భావన. నా ఉద్దేశ్యంలో పారమార్థిక జీవితంపై దృష్టిపెట్టిన వారే ఇహంలో కూడా సుఖంగా ఉన్నారు. ఇక జీవితం యొక్క ఈ పరమోత్కృష్ట పార్శ్వం ఎవరికైతే అర్థంకాలేదో వారు పూర్తి వెలితితో బ్రతుకుతున్నారు. జనానీకంలో ఎక్కువమంది ధర్మమార్గం వదిలి ప్రేయోమార్గంలోనే ప్రయాణిస్తున్నారు. కానీ వారందరు ఏపాటి ఆనందాన్ని జుర్రుకుంటున్నారు? వారేమన్నా ఆనందాబ్ధిలో ఓలలాడుతున్నారా? లేదుకదా!

'ఈ పాటి ఆనందాలకే ఇంత ప్రశస్తమైన మానవజీవితాన్ని వెచ్చించాలా? ఈ మహోపకరణంతో ఇంకా ఉన్నతమైన వాటినే మన్నా సాధించవచ్చా?' అని వివేకబుద్ధితో ఆలోచించినప్పుడు జీవితానికి ఒక కొత్త సొబగు సమకూరుతుంది. పోరాటం యొక్క అర్థమేమిటో అవగతమవుతుంది. అప్పుడు ఇక ఈ జీవన పయనంలో అలుపు ఉండదు. లేకపోతే జీవితమంతా అలజడి, అలసట, నిరర్థక ప్రయాసయే!

వినీత్: ఈ వివేకబుద్ధి వలననే మనిషి జీవులన్నింటిలోకీ వరిష్ఠజీవిగా పరిగణింపబడుతున్నాడు. ఉపయోగించిన కొద్దీ ఈ బుద్ధి సూక్ష్మతరం అవుతూ ఉంటుంది. ఉపయోగించక పోతే



ఉన్నది కూడా మొద్దుబారి పోతుంది. చదువులన్నీ ఈ ధీశక్తిని ప్రకాశింపజేసుకోవటానికే. బుద్ధి పరిణతిని సాధించినవారికందరికీ ఈ లోకవ్యవహారం అంతా అర్థరహితం అని తోపింపక మానదు. స్వామీజీ అంటారు కదా! 'Everything is vanity of vanities. God alone lives. Truth alone lives- లోకవ్యవహారమంతా అర్థరహిత ఆడంబరమే. భగవంతుడే నిజం. సత్యమే నిజం'

వికాస్: మహాత్ములందరూ ఏకకంఠంతో 'ఓ మానవా! ప్రపంచం నిస్సారం. భగవంతుడికై ప్రయత్నించు' అని పలికినా శ్రేయోమార్గాన్ని మనం ఎంచుకోలేక పోతున్నామంటే మనం వివేకంతో జీవించడం లేదు. మనిషి అంటేనే మననశీలుడు. చుట్టూ ఉన్న జీవితాలను జాగ్రత్తగా పరిశీలించి జీవించడం నేర్చుకుంటే మనిషి తప్పక శ్రేయోమార్గంలో ప్రవేశిస్తాడు. క్షణభంగురమైన జీవితాలకై ధర్మాన్ని తాకట్టు పెట్టడు. అప్పుడు మహాత్ముల బాటలో ప్రవేశించగలుగుతాడు.

వినీత్: ప్రపంచం సారరహితమని తెలుసుకొని శ్రేయోమార్గంలో ప్రవేశించడానికి కొన్ని అనుభవాలు అవసరమవుతాయి. ఆ అనుభవ పరంపర పూర్తి కాకుండా ఇతరులు ఎంత చెప్పినా మనుషులకు శ్రేయోమార్గం అవగతమవదు. రుచించదనుకుంటా వికాస్. అందుకే విద్య అనేది మనిషిని సదా ఆలోచింపజేయాలి. పరిశీలన కలిగిన వ్యక్తిగా తీర్చిదిద్దాలి. కానీ మన జీవితాలు చాలా అనాలోచితంగా సాగుతున్నాయి. అందరూ ఒకరిని చూసి ఒకరు పరుగెడుతున్నారే కానీ ఎవరికి వారు ఆలోచించి వివేకవంతమైన జీవితాలను గడప లేకపోతున్నారు. అందుకే దుఃఖపరంపరలను చవిచూస్తున్నప్పటికీ సత్యపథంలో అడుగుపెట్టడం లేదనిపిస్తున్నది. నీవేమంటావ్?

వికాస్: స్వామీజీ ఈ ప్రపంచం గురించి కొన్ని చక్కని వ్యాఖ్యలు చేశారు. అవి ప్రతిమనిషినీ ఆలోచింపజేస్తాయి. వాటి అంతరార్థం గ్రహించిన వ్యక్తి తప్పక శ్రేయోమార్గంలో ప్రవేశించగలడు. ఆయనంటారు, 'When a man begins to see the vanity of worldly things, he will feel he ought not to be thus played upon or borne along by nature' ప్రపంచం నిస్సారం అని తెలుసుకున్న వ్యక్తి తాను ఆ విధంగా ప్రకృతి చేతిలో కీలుబొమ్మగా ఉండటానికి ఇష్టపడడు. తాను బంధనాల నుండి స్వేచ్ఛకై ప్రయత్నిస్తాడు. తనకు విధి, కర్తవ్యం అంటూ ఏమీ లేదు అని గ్రహిస్తాడు. అన్నీ మనోకల్పితాలు అని గ్రహించి **నిర్గచ్ఛతి జగజ్జాలాత్ పింజరాదివ కేసరిః** ఈ ప్రపంచం అనే మాయాపంజరం నుండి సింహంలాగా బయటపడతాడు.

వినీత్: అవును వికాస్. నూట ఇరవై సంవత్సరాల క్రితమే పాశ్చాత్య సమాజాలను చూసి ఆ సమాజాలలోని వారు కూడా ఈ భౌతికపరమైన, దేహసౌఖ్యాలే జీవిత పరమావధిగా సాగుతున్న సమాజంతో విసిగిపోయారు అని స్వామీజీ తెలియజేశారు. ఆయన మాటల్లోనే... అక్కడ వాళ్ళకు వాళ్ళ మేధావులు ఉన్నారు. వారంతా ధనంకోసం, అధికారం కోసం ఈ పరుగు అంతా వృథా శ్రమ అని గ్రహిస్తున్నారు. సంస్కారవంతులైన స్త్రీపురుషులు ఈ పోటీ, పోరాటం, వారి వ్యాపార నాగరకతలోని అమానుషత్వంతో విసిగిపోయి ఒక ఉన్నతమైనదానికోసం అన్వేషిస్తున్నారు' అంటారు.

వికాస్: నూట ఇరవై సంవత్సరాల క్రితమే వారిది దోషభూయిష్ఠ సమాజంగా గ్రహించి ఆధ్యాత్మికతకోసం, జీవనసాఫల్యంకోసం మన నాగరకతనుంచి నేర్చుకోవాలనుకున్నారు పాశ్చాత్యులు. కానీ మనం ఏమి చేస్తున్నాం? వారి జీవనవిధానాన్ని మన సమాజంలో చొప్పించుకొని అదే పోటీని, పోరాటాన్ని ఇక్కడ స్వీకరించి ధర్మమార్గాన్ని విస్మరిస్తున్నాం! జీవితాలను దుర్భర దుఃఖానికి ఆలవాలంగా చేసుకుంటున్నాం. ఔరా ఎంత విచిత్రం?

వినీత్: నిజం వికాస్. జనులు అత్యధిక సంఖ్యలో శ్రేయోమార్గం ఏదో తెలుసుకొని, స్వార్థ త్యాగంతో మహాత్ములు చూపిన బాటలో పయనించడానికి సిద్ధమైతే తప్ప అలజడి రహిత జీవన సరళి మనకు కలగదేమో! ఇప్పటికి సెలవు వికాస్. శుభం భూయాత్!! ❖

ప్రపంచం నిస్సారమని తెలుసుకున్న వ్యక్తి ప్రకృతి చేతిలో కీలుబొమ్మగా ఉండడానికి ఇష్టపడడు. బంధాలను త్రెంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. తనకు కర్తవ్యం అంటూ ఏమీ లేదు అని గ్రహిస్తాడు. -స్వామి వివేకానంద



...మీదే

'బోధ అంటే శుష్కప్రసంగం కాదు. తత్త్వాలను ప్రవచించడమూ బోధ కాదు. బోధించడం అంటే భావ ప్రదానం. బోధించడం ఇచ్చి పుచ్చుకోవడంలో ఉంది. ఇచ్చే అర్హత గురువుకూ, గ్రహించే యోగ్యత శిష్యునికీ ఉండాలి.' *- స్వామి వివేకానంద*

ఈ భూమి మీద పుట్టినందుకు "నా కర్తవ్యం ఏమిటి?" అని ఒక బాలిక తన గురువును ప్రశ్నించింది. ఆ గురువు కాసేపు ఆలోచించి, దగ్గరలో ఉన్న ఉద్యానాన్ని చూపిస్తూ, "దాన్ని పరిశీలించి చెబితే నీ ప్రశ్నకు సమాధానాన్ని చెబుతా"నన్నాడు.

ఆ బాలిక ఉద్యానాన్ని చూసి వచ్చి తన పరిశీలనను గురువుకు ఈ విధంగా వివరించింది: "తోటలో చక్కగా విరబూసి పరిమళాన్ని వెదజల్లుతున్న పుష్పాలను చూశాను. అంతేగాక కొన్ని మొక్కలకు పూసిన మొగ్గలను కూడా చూశాను. అవి అందంగానూ లేవు, సువాసనలను వెదజల్లడమూ లేదు. అవి పుష్పాలుగా వికసించే సమయం కోసం వేచి ఉన్నాయి."

గురువు ఆ బాలిక పరిశీలనను ప్రశంసిస్తూ "నీవు గమనించిన మొగ్గలోనే దాని అందం, వర్ణం, పరిమళం దాగి ఉన్నాయి. పుష్పం అందంగా వికసించి, సువాసనలు వెదజల్లడమే ఆ మొగ్గ యొక్క ఉద్దేశం. ప్రతీ మొగ్గ ఏ విధంగా పుష్పంగా వికసించి పరిమళాన్ని వెదజల్లుతుందో ఆ విధంగానే నీ వ్యక్తిత్వం కూడా వికసించాల"ని బోధించాడు గురువు.

స్వామి వివేకానంద **'విద్య అంటే మనిషిలో ఉన్న అంతర్లీన శక్తిని వ్యక్తపరచడమే'** అంటారు. అంతర్లీనమైన శక్తిని వ్యక్తపరచడానికి ఉపాధ్యాయులు చేయాల్సినవేమిటో చూద్దాం.

విద్యార్థిలో ఉన్న అంతర్లీన శక్తిని వెలికితీయడం: ఉపాధ్యాయుడు పాఠాలు చెప్పడం వరకే పరిమితం కాకూడదు. ప్రతీ విద్యార్థిలోనూ నిబిడీకృతమై ఉన్న జ్ఞానాన్ని జాగృతం చేయడమే ఉపాధ్యాయుడి కర్తవ్యం. మన కంటికి కనిపించని అంతర్లీన శక్తి ప్రతీ ఒక్కరిలో ఉంటుంది. **'విత్తనం అంకురించడానికి అవసరమైన మట్టి, నీరు, గాలిని సమకూర్చడం మాత్రమే మీరు చేయవలసిన పని'** అంటారు స్వామి వివేకానంద.

అదే విధంగా విద్యార్థిలో ఉన్న జ్ఞానాన్ని బయటకు తీసుకురావడానికి ఉపాధ్యాయుడిగా తన వంతు కృషి చేసి, మార్గాన్ని సుగమం చేయాలి. అంతేకాక మంచితనం, పవిత్రత మొదలైన గుణాలు విద్యార్థిలో ఉన్నాయి. ఆ గుణాలు వృద్ధి చెందేందుకు శ్రద్ధ వహించాలి. మనిషికున్న సంకల్ప శక్తితో, విచక్షణా జ్ఞానంతో కేవలం మంచి మార్కులు తెచ్చుకోవడమే ధ్యేయం కాదనీ, నూతన ప్రసారమాధ్యమాలను ఉపయోగించడమే పరమావధి కాదనీ తెలియజేయాలి. మొగ్గ ఏ విధంగా అయితే పుష్పంగా వికసించి తన పరిమళాన్ని వెదజల్లుతుందో అదే విధంగా విద్యార్థి తనలో ఉన్న సుగుణాలను అభివ్యక్తీకరించు కోవాలని తెలియజేయాలి. అంతేకాక ఈ విశ్వంలో గొప్ప వ్యక్తులందరూ వారిలో ఉన్న దివ్యత్వ లక్షణాలను వ్యక్తీకరించుకొని గొప్పవాళ్ళు అయినవారే అని తెలియజేయాలి. 'Education is not a 'filling in' of something from outside. It is a 'drawing out' from within, of the highest and best qualities inherent in the individual.' – 'విద్య అంటే బయటి విషయాన్ని లోపలకు పంపించడం కాదు. ఇదివరకే తనలో ఉన్న మహోన్నత సుగుణాలను వ్యక్తపరచడం.' ఈ విధంగా విద్యార్థి సంపూర్ణ వ్యక్తిగా తనను తాను మలచుకోవడానికి ఉపాధ్యాయులు సహాయపడాలి.

భావ వ్యక్తీకరణ చేయడం: ఉపాధ్యాయుడి బాధ్యత పాఠ్య పుస్తకంలో ఉన్న పాఠాన్ని యథాతథంగా బోధించడం కాదు. **'శిష్యుడి ప్రవృత్తికి అనుగుణంగా తన యావచ్ఛక్తితో సహకరించేవాడే నిజమైన గురువు. నిజమైన సానుభూతి లేనిదే మనం ఎన్నటికీ చక్కగా బోధించలేం'** అంటారు స్వామి వివేకానంద. అవసరమైతే శిష్యుని స్థాయికి దిగి బోధించే మనోనేత్రం ఉన్నప్పుడే ఉపాధ్యాయుడు భావవ్యక్తీకరణ చేయగలడు. జాతి నిర్మాణానికి నడుము బిగించాల్సింది ఉపాధ్యాయులే అన్న భావన ఉన్నప్పుడు మాత్రమే వృత్తిని గౌరవప్రదంగా చేపట్టగలరు.

ఉపాధ్యాయుడు ఒక నిర్మాణకర్త. అయితే వంతెనలు, గృహ నిర్మాణాలకు కాదు. మనుష్యులను తయారుచేసే నిర్మాణకర్త. జీవితాలను వెలిగించే దివిటీ. నవీన భారతదేశాన్ని దిగువ, ఎగువ చట్టసభల్లో నిర్మించలేం! ఆ పనిని పాఠశాలలు,

మహోన్నత బాధ్యత

– స్వామి రఘునాయకానంద

కళాశాలల్లో ఉపాధ్యాయులు మాత్రమే చేయగలుగుతారు. విలియమ్ ఆర్థర్‌వర్డ్ ఇలా అంటారు: The mediocre teacher tells, the good teacher explains, the superior teacher demonstrates, the great teacher inspires - సాధారణ గురువు చెబుతాడు, మంచి గురువు వివరిస్తాడు, ఉన్నత గురువు చేసి చూపుతూ విశదీకరిస్తాడు, మహోన్నత గురువు ప్రేరణ కలిగిస్తాడు.

జ్ఞానం, విజ్ఞానం - రెంటినీ బోధించడం: ఉపాధ్యాయుడు చేసే విద్యాబోధన జ్ఞాన, విజ్ఞాన సహితంగా ఉండాలి. కేవలం జ్ఞాన సముపార్జన ధ్యేయంగా విద్యాబోధన జరిగితే పిల్లలను మానవ రూపంలో ఉన్న యంత్రాలుగా తయారుచేయగలమే తప్ప అసలు సిసలు మనుషులుగా ఎంత మాత్రమూ తయారుచేయలేం. శ్రీకృష్ణుడు భగవద్గీతలో 'జ్ఞాన విజ్ఞాన సహితం' అంటాడు. Excess knowledge of power, without holiness, makes human beings devils – **'పవిత్రత లేని మితిమీరిన జ్ఞానం మనుష్యులను రాక్షసులుగా మారుస్తుంది'** అంటారు స్వామి వివేకానంద. జ్ఞానసముపార్జన, వికసించిన వ్యక్తిత్వం – రెండింటికీ ఉన్న తారతమ్యాన్ని గుర్తించి, వాటి ఆవశ్యకతను విద్యార్థులకు వివరించాలి ఉపాధ్యాయుడు. నిజానికి విద్య అంటే 'సా విద్య యా విముక్తయే' – భవబంధాల నుండి విముక్తుణ్ణి చేసేదే విద్య. అందుకే వేదకాలంలో విద్యార్థిని నైతిక, ఆధ్యాత్మిక, ఆత్మ జ్ఞానాలలో సుస్థిరుణ్ణి చేసేవారు గురువులు.

ఏకాగ్రతాశక్తి వికాసానికి దోహదపడడం: జ్ఞానసముపార్జనకు ఏకైక మార్గం ఏకాగ్రతను సాధించడం. ఏకాగ్రతను సాధించాలంటే మనోనైర్మల్యం తప్పనిసరి. **'మనస్సు ఎంత నిర్మలమైతే, దాన్ని నిగ్రహించడం అంత సులభమవుతుంది. మనస్సును నిగ్రహించాలనుకుంటే, చిత్తశుద్ధికి తప్పకుండా ప్రాధాన్యం ఇవ్వాలి'** అని స్వామి వివేకానంద అంటారు. దైనందిన జీవితంలో మనం చేసే ప్రతీ పనీ, ఆలోచన (అది మంచి అయినా, చెడు అయినా) మనస్సుపై ముద్ర వేస్తుంది. దాన్నే 'సంస్కారం' అంటారు. మనోఫలకంపై ఏర్పడ్డ చెడు సంస్కారాలకు విరుగుడుగా ధ్యానం, ప్రార్థనలు తప్పనిసరి అని తెలియజేయాలి. ఉదాత్తమైన ఆలోచనలనూ, ఇతిహాసాలనూ, మహోన్నత వ్యక్తుల జీవిత చరిత్రలనూ వారికి పరిచయం చేయాలి. సంస్కరణకు నోచుకోక, స్వీయ సంకల్పిత ఆలోచనలతో పయనిస్తున్న యువతీ యువకుల మానసిక శక్తులు నిష్ప్రయోజనంగా వ్యర్థం కాకుండా, వాటికి క్రమశిక్షణ, నిబంధనలనే ఆనకట్ట కట్టాలి. ప్రవర్తనా నియమావళి అనే కాలువలను తవ్వాలి. మానసిక శక్తులనే ఆ నీటిని సేవ, కళలు, సాహిత్యం మొదలైనవాటి వైపునకు మళ్ళించాలి. ఈ విధంగా వారి ఏకాగ్రతాశక్తి వికాసానికి ఏర్పడే అడ్డంకులను తొలగించాలి.

ఉపాధ్యాయ వృత్తికి విజయప్రతీకలు: ఏ వ్యక్తి అయినా తన వృత్తిలో విజయాన్ని సాధించాలంటే తన వృత్తి పట్ల ప్రేమను కలిగి ఉండాలి. అది ఉపాధ్యాయ వృత్తి కావచ్చు, వ్యాపారం కావచ్చు, చర్మకార వృత్తి కావచ్చు. మరేదైనా కావచ్చు. స్వామి వివేకానంద **'ప్రతీ ఒక్కరూ ఎవరి స్థానంలో వారే గొప్ప'** అంటారు. అయితే ఉపాధ్యాయుడిగా విజయం సాధించాలంటే కావాల్సినవి – ఉత్సాహం, ప్రేమ.

ఒక విశ్వవిద్యాలయంలోని అధ్యాపకుడు తన తరగతి విద్యార్థులను మురికివాడలకు వెళ్ళి, అక్కడి విద్యార్థుల స్థితిగతులు, వారు చదివింది, ప్రస్తుతం వారు చేస్తున్న వృత్తి మొదలైన విషయాలను సేకరించి నివేదికను తయారు చేయాల్సిందిగా చెప్పారు. వెళ్ళినవారు రెండువందల మంది విద్యార్థులను పరిశీలించి నివేదికను ఆ అధ్యాపకుడికి సమర్పించారు. కేవలం ఇరవై మంది (వేరే ప్రదేశాలకు వెళ్ళినవారు) తప్ప, మిగిలిన 180 మంది అనూహ్య విజయాన్ని సాధించినట్లు ఆ నివేదిక వెల్లడించింది. అలా విజయం సాధించిన విద్యార్థుల్లో వైద్యులు, ఉపాధ్యాయులు, వ్యాపారవేత్తలు అయినవారు కూడా ఉన్నారు.

ఆ నివేదికను చూసి ఆశ్చర్యచకితుడైన అధ్యాపకుడు ఆ మురికివాడలకు వెళ్ళి, “మీ విజయానికి కారణమేమిటి”ని ప్రశ్నించాడు. “మా ఉపాధ్యాయురాలు” అన్నది ఆ విద్యార్థుల జవాబు. దాంతో, వృద్ధాప్యంలో ఉన్న ఆ ఉపాధ్యాయురాలి దగ్గరికి వెళ్ళి, “ఈ మురికివాడలలో ఉన్న చిన్నారులను ఇంత గొప్పవారిగా ఎలా తీర్చదిద్దగలిగారు? మీ ఈ విజయానికి కారణమేమిటి?” అని అధ్యాపకుడు ప్రశ్నించాడు. ముడతలు పడిన ముఖంతో, ముసిముసి బోసినవ్వులతో ఆమె ఒక్కముక్కలో ఇలా సమాధానం చెప్పింది – “నేను ఈ పిల్లల్ని ప్రేమించాను.”❖

పిల్లలు ముందంజ వేయడానికి మీరు తోడ్పడాలి. విషయాన్ని నిర్దేశం చేయడం మీ పని కాదు. అడ్డంకులను తొలగించడమే మీ పని. అప్పుడు వారిలో జ్ఞానం దానంతట అదే వస్తుంది. -స్వామి వివేకానంద

సీతాదేవి అన్వేషణకు బయలుదేరిన ఆంజనేయుడు అనూహ్యంగా లంకాధీశుణ్ణి ఎదుర్కొన్నాడు. జానకి జాడ కనుగొనడమే కాదు; లంకా దహనంతో తన ప్రతాపమేమిటో రాక్షసులకు చూపించాడు. శ్రీరామచంద్రుడి గుర్తుగా అంగుళీయకాన్ని ఆ వైదేహికిచ్చి, ఆ తల్లి జ్ఞాపకంగా శిరోభూషణాన్ని వెంట తీసుకొని కిష్కింధకు చేరుకున్నాడు. 'కనుగొంటి సీతమ్మ జాడ'నంటూ ఎలుగెత్తి చాటి, తన విజయయాత్ర విశేషాలను ఆ రామచంద్రమూర్తికి వివరించాడు. దశరథ నందనుడి వదనంలో చిరునవ్వులు పూయించాడు.

ఆ కేసరి నందనుని సాహసానికి శ్రీరాముడు పులకించి పోయాడు. సాక్షాత్తూ శ్రీమహావిష్ణువైన ఆ సీతానాథుడు ఏ మాత్రం సంశయించకుండా, ఆ హనుమంతుడి సాహస కార్యాన్ని ప్రశంసించాడు. 'గరుత్మంతుడు, వాయుదేవుడు,



ప్రశంసలు...

– బి. సైదులు

హనుమంతుడు – ఈ ముగ్గురు తప్ప ఇతరులెవ్వరూ ఈ మహా సముద్రాన్ని లంఘించలేరు. హనుమంతునితో సమానమైన తేజోబల సంపన్నుడు ఎవరూ లేరు. మహావీరుడైన సుగ్రీవుడికి నిజమైన సేవకునిగా ఆ ప్రభుకార్యాన్ని సఫలమొనర్చాడు' అంటూ అందరి ఎదుటా అభినందనతో, ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నాడు.

ఆనాటి నుంచి శ్రీరామావతార పరిసమాప్తి వరకు అంజనీ సుతుడు, ఆ జగదేకనాయకుడిని వీడలేదు. ఇలా తన పరివారంలో ప్రతి ఒక్కరి సామర్థ్యాన్నీ గుర్తించి, సమయం వచ్చినప్పుడల్లా వారిని ఆ సాకేతరాముడు మనస్ఫూర్తిగా ప్రశంసించేవాడు. ఇలా మనసారా అభినందించే లక్షణం చాలా మందిలో మచ్చుకైనా కనిపించదు. వేలెత్తి చూపడానికి ముందుంటాం; కానీ మంచి కనిపించినప్పుడు మాటవరసకైనా మెచ్చుకోం. అభినందించడం మన విశాల హృదయానికి నిదర్శనం. అయితే ప్రశంస కోసమే పనిచేయడం మానసిక బలహీనతకూ, పరాధీనతకూ దారితీస్తుందని మరచిపోకూడదు.

ప్రశంస... ప్రోత్సాహం: నలుగురూ తమను గుర్తించాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. యోగులు, జ్ఞానులు అయినవారు వీటన్నింటికీ అతీతమేమో కానీ, సాధారణంగా ఈ సమాజంలో మనుగడ సాగిస్తున్న వారందరూ ఎప్పుడో ఒకప్పుడు ఎదుటివారి నుంచి చిన్న ప్రశంసను ఆశిస్తూనే ఉంటారు. ఆ చిన్న ప్రశంసే వారికి కొండంత బలం. వారితో మరింత ఉత్సాహంగా పనిచేయిస్తుంది. అందుకే హనుమంతుడు అసాధ్యమైన కార్యాన్ని సుసాధ్యం చేసుకొని వచ్చినప్పుడు రాముడు ఆశ్చర్యానందాలకు లోనయ్యాడు. నేను ఇప్పుడు రాజ్యహీనుడనై, అతడికి ఏమీ ఇవ్వలేకపోతున్నాను. కానీ...

ఏష సర్వస్వ భూతస్తు పరిష్వంగో హనూమతః ।
మయా కాలమిమం ప్రాప్య దత్తస్తస్య మహాత్మనః ।

'మహాత్ముడైన ఈ హనుమంతుణ్ణి హృదయపూర్వకంగా గుండెలకు హత్తుకుంటున్నాను. ఇదే అతనికి పరమ సుఖానుభవాలను కలిగించగలదు. ప్రస్తుతం నేను ఇవ్వగలిగిన నా సర్వస్వమిదే' అంటాడు. ఆ స్పందనతో అన్ని రోజుల ప్రయాసనూ మరచిపోతాడు మారుతి.

మనలో చాలామంది తమను అందరూ ప్రత్యేకంగా గుర్తించాలని కోరుకుంటారే కానీ, తాము ఎదుటివారిని ఏ మాత్రం గుర్తిస్తున్నారో ఆలోచించరు! మనకు ఒకరి గొప్పతనంతో సంబంధం లేనప్పుడు, మన గొప్పతనాన్ని మాత్రం వాళ్ళెందుకు పట్టించుకోవాలి? మనం ఏదైనా కోరుకునే ముందు, అది ఎదుటివాళ్ళకు ఇవ్వడం అలవాటు చేసుకోవాలి. అభినందన విషయంలోనూ అదే పద్ధతిని పాటించాలి. అదే విధంగా ఎవరైనా మనల్ని మెచ్చుకున్నప్పుడు, ఆ ప్రశంసల్ని తలకు

ఎక్కించుకోకుండా వినయంతో స్వీకరించాలి. బాధ్యత మరింత పెరిగిందనుకోవాలి. 'పై అధికారి మన భుజం తడితే, మెచ్చుకున్నట్లు కాదు; కష్టపడడంతో చెమట వచ్చిందో లేదో తెలుసుకోవడానికనుకోవాలి' అంటారు సరదాగా ఓ రచయిత.

అభినందన...ఆత్మవిశ్వాసం: మనతో రోజూ కలిసుండే మిత్రుడే కావచ్చు, మన దగ్గర పనిచేసే తోటి ఉద్యోగే కావచ్చు! ప్రశంసనీయమైన పని చేసినప్పుడు గుర్తు పెట్టుకొని మరీ నలుగురిలో ప్రస్తావించాలి. అప్పుడు తెలియకుండానే ఆ వ్యక్తిలో

అభినందనల జల్లు

ప్రతిభ అనే పిల్లవానికి ప్రశంస చిరుజల్లు లాంటిది.
తొలకరిలా ఆ జల్లు పలకరిస్తూ ఉంటే,
ప్రతిభ పూలతోటలా విరబూస్తుంది.
ఆ చిరుజల్లుకూ పరిమళాలను అద్దుతుంది.
పూలకు వానజల్లు ఎలాగో, ప్రతిభకు ప్రశంస అలాగ!

ఆత్మవిశ్వాసం ఇనుమడిస్తుంది. చేసే పని పట్ల అంకితభావం పెరుగుతుంది. అందుకే జాక్సన్ బ్రౌన్ 'A person's greatest emotional need is to feel appreciated' అంటారు. ప్రశంసిస్తే ఎదుటి వ్యక్తి పొంగిపోతాడు; తన పరిధిలో తాను ఒక ప్రధానమైన వ్యక్తినన్న భావనతో మసలుకుంటాడు. భార్య కూర కాస్త బాగా వండనప్పుడు, కొందరు కొంపలు మునిగిపోయినట్లు కేకలేస్తారు; కానీ రుచిగా చేసినప్పుడు మాత్రం ముక్తసరిగానైనా బాగుందని మెచ్చుకోరు. అలాగే మరికొందరు తమ కింద పనిచేసే వారు పొరపాట్లు చేసినప్పుడు విరుచుకు పడతారే కానీ, చక్కగా పనిచేసినప్పుడు భుజం తట్టాలన్న విషయాన్నే మరచిపోతారు.

మనం ఇలా ప్రవర్తిస్తే ఎదుటివారు తమ నిస్సహాయ స్థితి వల్ల మన ముందు బయటపడక పోవచ్చు కానీ, పరోక్షంగా చాలా నిరాశకూ, నిస్తేజానికీ గురవుతారు. మాటలు అనేటప్పుడు చూపే చొరవ, మెచ్చుకొనేటప్పుడు చూపకపోతే మన వ్యవహార శైలికి అర్థమే లేదు. అలా అని ప్రతిసారీ పొగడ్తలతో గుండెలకు హత్తుకొమ్మని కాదు, కనీసం ప్రశంసాపూర్వకంగా స్పందించడం అలవాటు చేసుకోవాలి. నిజంగా ఇలాంటి చిన్న చిన్న ప్రశంసలే ఎదుటివారికి మరపురాని కానుకలుగా మిగిలిపోతాయి. అలా మనం మెచ్చుకునే సమయంలో మెచ్చుకోగలిగితే, వారి లోపాలను ఎత్తిచూపినప్పుడూ, సద్విమర్శ చేసినప్పుడూ కుంగిపోకుండా, తమ పనితీరును మార్చుకుంటారు.

మరిగే గుండెల నుంచి మల్లెల పరిమళాలా?: అభినందన విషయంలో విదేశీయులు మన కన్నా చాలా ఉదారంగా వ్యవహరిస్తారు. ఎవరు ఏ కాస్త ప్రతిభ కనబరచినా మనస్ఫూర్తిగా ప్రశంసలజల్లు కురిపిస్తారు. ప్రావీణ్యానికి పట్టం కడతారు. మిత్రుడు ఓ మంచి కవిత రాసినా, అందంగా ఓ బొమ్మగీసినా, చక్కగా ఓ పాట పాడినా, సహోద్యోగి సమర్థంగా ఓ పని పూర్తి చేసినా ప్రత్యేకంగా పలకరించి మరీ ప్రశంసిస్తారు.

కానీ మనలో చాలామంది స్పందనా రహితులు. మన గోరంత గొప్పతనాన్ని కొండంతలు చేసి చూపెడుతూ ఉంటాం. ఇతరుల కొండంత ప్రతిభను కూడా గోరంతను చేసి తగ్గించేస్తూ ఉంటాం. మనం చేస్తే అది అద్భుతమనీ, వారు చేస్తే అది అతి సాధారణమనీ వ్యాఖ్యానిస్తూ ఉంటాం. విశేషమైనది కనిపించినప్పుడల్లా, మనస్సు మెచ్చుకోమని చెబుతున్నా, మూతి ముడుచుకొని ముభావంగా వెళ్ళిపోతూ ఉంటాం. ఎదుటివారిలోని ప్రత్యేకతను గుర్తించినా, మన కుత్సితస్వభావం, అసూయతో రగిలే గుణం ప్రశంసించ నీయదు. ఇలాంటి మరిగే గుండెలతో మానవ సంబంధాల్లో మల్లెలనెలా పూయించగలం. అందుకే తత్త్వవేత్త ఖలీల్ జిబ్రాన్ 'If your heart is a volcano, how can you expect flowers to bloom' అంటారు.

పరుల పనితీరును ప్రశంసిస్తున్నారంటే, వారు మానసికంగా ఎంతో ఉన్నతస్థితిలో ఉన్నారని అర్థం. ముఖ్యంగా నాయకుడై సమూహాన్ని ముందుకు నడిపే వ్యక్తి, ఎప్పుడు ఎలా తమ సంఘ సభ్యులను అభినందించి ప్రేరణనివ్వాలో తెలుసుకోవాలి.


అభినందన...అహంకారం: పొగడ్తలతో ముంచెత్తేసరికి చాలాసార్లు మనస్సు విర్రవీగేందుకు ప్రయత్నిస్తుంది. అందుకే మన అభినందనలు ఎదుటివ్యక్తిలో అహంకారాన్ని పెంచకుండా చూసుకోవాలి. అభినందన అనేది ఆకాశానికి ఎత్తేసే రీతిలో ఉండకుండా, నేలపై నడుస్తూ, ఇంకాస్త సమర్థంగా పనిచేసేలా ప్రేరేపించేదిగా ఉండాలి. అందుకే మన సనాతన ధర్మంలో ప్రశంసలకు కూడా కొన్ని నియమాలను విధిస్తూ....

ప్రత్యక్షే గురవః స్తుత్యాః పరోక్షే మిత్ర బాంధవాః ।
కర్మాంతే దాస భృత్యాశ్చ న కదాచన పుత్రకాః ।

'గురువులను వారి సమక్షంలో ప్రస్తుతించాలి. మిత్రులనూ, బంధువులనూ వారి పరోక్షంలో ప్రశంసించాలి. అప్పగించిన కార్యాన్ని పూర్తి చేసిన తరువాతనే దాసులనూ, భృత్యులనూ మెచ్చుకోవాలి. సంతానాన్ని మాత్రం ఎన్నడూ పొగడకూడదు' అని హితవు పలుకుతోంది. అలా అని పిల్లల ప్రతిభను పట్టించు కోవద్దని కాదు; అది ప్రోత్సాహపూర్వకమైన ఆశీర్వాదంగా ఉండాలే కానీ అహంకారాన్ని పెంచే పొగడ్తలా ఉండకూడదు.

ఇలా విచక్షణను పాటిస్తూ వారిలోని ప్రతిభను వెలికితీస్తే, వారు మరింత సమర్థంగా ముందుకు సాగిపోగలరు. అందుకే స్వామి వివేకానంద కూడా ఓ మారు ప్రశంస ప్రాధాన్యాన్ని వివరిస్తూ, 'Appreciate all as long as you find they are doing well, and in cases where they seem to be going wrong, show them their mistakes gently – ఎదుటివారు ఓ మంచిపని చేసినప్పుడు మనస్ఫూర్తిగా అభినందించండి. వారు తప్పు చేస్తున్నారని గమనించినప్పుడు మాత్రం సున్నితంగా చెప్పి సరిదిద్దండ'ని సూచిస్తారు. ❖

విమర్శించడం విడిచిపెట్టండి. ఎదుటివారు చేసే పని మంచిదైతే చేతనైన సహాయం చేయండి. అసూయ, అహంకారాలను పూర్తిగా విడిచిపెట్టండి. సాహసవంతులై పని చేయండి. -స్వామి వివేకానంద



మా కథల టీచర్

- శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

ఓ మారు విశ్వవిద్యాలయంలో ఉపన్యాసమిచ్చేందుకు నన్ను ఆహ్వానించారు. ఉపన్యాసం తరువాత విద్యార్థులు ఎన్నో ప్రశ్నలతో నా చుట్టూ మూగిపోయారు. గుంపులో నుంచి ఓ అమ్మాయి, 'మీరు ఏదైనా కష్టంలో చిక్కుకుంటే ఎలా బయటపడతారు? అసలు ఆ కష్టమే రాకుండా ముందు జాగ్రత్తలు ఎలా తీసుకుంటారు?' అని ప్రశ్నించింది. అప్పుడు నాకు రామాయణంలో ఓ సంఘటన గుర్తొచ్చి వివరించాను.

"రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడు మూర్ఛపోయాడు. అతను తేరుకునేందుకు 'సంజీవిని' మూలిక కావాలి. ఆ మూలిక ద్రోణపర్వతాల్లో ఉంటుందని తెలిసి, ఆ పనిని హనుమంతుడికి అప్పగించారు. అందరి ఆజ్ఞ మేరకు ఆంజనేయుడు ఆ పర్వతాలకు ఎగిరిపోయాడు. కానీ పాపం సంజీవిని మొక్క ఏదో మారుతికి తెలియలేదు. సమయమేమో మించిపోతోంది. ఆయనకు ఒకటే మార్గం కనిపించింది. అమాంతం పర్వతాన్ని వృక్షాలతో పెకలించుకుపోయి రాముడి ముందు పెట్టాలనుకున్నాడు. పర్వతం చాలా పెద్దది. దాన్ని ఎత్తేదెలా? హనుమంతుడికి తన శరీర పరిమాణాన్ని పెంచుకోగల వరం ఉంది. పర్వతం కంటే పెద్దగా పెరిగాడు. పర్వతం గులకరాయిలా కనిపించేంత ఎత్తు పెరిగాడు. పర్వతాన్ని అరచేతిలో పెట్టుకున్నాడు. లంకకు పయనమయ్యాడు. ఆ తరువాత కథ మీకు తెలుసు కదా!

కష్టాలు ఎదురైనప్పుడు మనం వాటి కంటే పెద్దగా అలా ఎదగాలి. మనలో ఆ శక్తి ఉంది. కానీ ఆ విషయం మనకు తెలియదు. మనం మానసికంగా అలా ఎదిగితే కష్టాలు చిన్నవిగా కనిపిస్తాయి. కష్టాల కన్నా నీవు చిన్నగా అయిపోతే అవి పర్వతాల్లా కనిపిస్తాయి. నేను జీవితంలో ఈ సిద్ధాంతాన్నే అనుసరిస్తాను" అన్నాను.

విద్యార్థుల చప్పట్లతో గది మారుమోగిపోయింది. అప్పుడు నేను తడి కళ్ళతో, గద్గద స్వరంతో 'ఈ ఘనత అంతా మా టీచరు గౌరమ్మకు దక్కాలి. నా చిన్నతనంలో ఆవిడ నాకీ కథ చెప్పింది. ఆమె పాత కథలు చాలా చెప్పేది. అవి అందించే విజ్ఞానానికి వెల కట్టలేము. వాటిని అర్థం చేసుకునేందుకు గౌరమ్మ లాంటి గొప్ప కథకులు కావాలి. నా చిన్నతనంలో కథల్ని ప్రేమించటం నేర్పింది ఆవిడే. నేను రాయడానికీ, చెప్పడానికీ ఆమే కారణం' అన్నాను.

ఇంటికి తిరిగి వస్తున్నప్పుడు గౌరమ్మ టీచర్ జ్ఞాపకాలు నా మది నిండా మెదిలాయి. ఆమె సంస్కృత ఉపాధ్యాయురాలైనా, అందరూ ఆమెను కథల టీచరే అనేవారు. పురాణాలు, ఇతిహాసాల నుంచి ఎన్నో కథల్ని ఆసక్తికరంగా చెప్పేది. ఆమె దగ్గర కూర్చుంటే కాలమే తెలిసేది కాదు. అలా ఏడోతరగతి వరకు గౌరమ్మ కథల ప్రపంచంలో విహరించాను.

గౌరమ్మ టీచర్‌కు భగవంతుడు తల్లి అయ్యే భాగ్యాన్ని కల్పించలేదు. అందుకే ఆమె భర్త మరో ఆమెను పెళ్ళిచేసుకున్నాడు; మొదటి భార్యను నిర్లక్ష్యం చేశాడు. కానీ గౌరమ్మ టీచర్ అంతటి బాధను కూడా మనస్సులో దాచుకొని విద్యార్థుల్లోనే తన బిడ్డల్ని చూసుకునేది.

కొన్నాళ్ళకు నాకు ఒక ఉత్తరం వచ్చింది. 'మేడమ్! మిమ్మల్ని చాలాకాలంగా తెలిసిన వాళ్ళెవరో రాసినట్లుంది' అంటూ సెక్రెటరీ ఆ జాబును నాకు అందించింది. తెరచి చూశాను. ఆ ఉత్తరం వణుకుతున్న చేతులతో రాసినట్లుంది. గౌరమ్మ టీచర్ రాసిన జాబు అది.

"అమ్మా సుధా! నా పరిస్థితి నీకు తెలియంది కాదు. నన్ను గొడ్రాలని అందరూ ఎగతాళి చేసేవారు, చులకనగా చూసేవారు. 'కథలు చెబుతూ కాలక్షేపం చేసే కన్నా, ట్యూషన్లు చెప్పి నాలుగు డబ్బులు సంపాదించుకోరాదా?' అని కొందరు ఉచిత సలహాలు ఇచ్చేవారు. నన్ను కాదని ఆయన రెండో పెళ్ళి చేసుకున్నాడు. పిల్లల్ని కన్నాడు. వాళ్ళందరూ చెడు అలవాట్లకు లోనయ్యారు. ఆయనకు అవమానాలు, అప్పులు మిగిల్చారు. ఆ బాధతో ఆయన చివరకు నన్నే ఆశ్రయించాడు. ఇవాళ ఆయన వార్తాపత్రిక తీసుకువచ్చి నాకు చూపించాడు. అందరి ముందు ఓ సభలో నువ్వు నన్ను గుర్తుచేసుకున్నావట. నీ విజయానికి నా కథలే కారణమన్నావట! నిమిషం పాటు కదిలిపోయాను. నేను నీ కన్నతల్లిని కాదు; కానీ నువ్వు నా కన్నబిడ్డలా ప్రవర్తించావు. పిల్లలు పుడతారు; ఎందుకు? వాళ్ళలో వాళ్ళు తన్నుకుంటారు. కన్నవాళ్ళకు అవమానం తెస్తారు. నా భర్త తన సంతానాన్ని చూసి సిగ్గుపడుతున్నాడు. కానీ నేను ఇప్పుడు నా సంతానాన్ని చూసి గర్విస్తున్నాను. అందువల్ల నాకు దేవుడిపై ఎలాంటి ఆరోపణా లేదు. బిడ్డలను ఇవ్వలేదని ఆయననిక తప్పు పట్టను" అంటూ సాగిందా ఉత్తరం. నా కళ్ళలో నీళ్ళు ఉబికాయి. ఉత్తరం మీద ఆ కన్నీళ్ళు పడి సిరా అలుక్కుపోయింది. ఆ తరువాత చదవలేకపోయాను. ❖ సేకరణ: జి.సతీష్

(సెప్టెంబర్ 5, ఉపాధ్యాయ దినోత్సవం)



కాలం మీ చేతుల్లోనే!

- స్వామి రంగనాథానంద
(రామకృష్ణ సంఘు 13వ సర్వాధ్యక్షులు)



నేను ఏడో తరగతి చదువుతున్న రోజులవి. ఒకరోజు మా మాష్టారు రోజువారీ పాఠాలేమీ చెప్పకుండా సరదాగా ఓ నీతివాక్యంపై చర్చ పెట్టారు. ఆ రోజు అనుకోకుండా వారి నోటి నుంచి వచ్చిన మాటలు నా జీవితాన్ని ఎంతో ప్రభావితం చేశాయి. మా మాష్టారు ఆ రోజు మమ్మల్ని ఉద్దేశించి 'Procrastination is the thief of the time' అన్నారు.

'అంటే ఏంటి సార్?' అని మేమందరమూ మూకుమ్మడిగా ప్రశ్నించాం. procrastination అంటే కాలాన్ని వృథా చేస్తూ, ప్రతి పనినీ వాయిదావేయడం అని ఆయన వివరించారు. అయినా మాకెవరికీ అర్థం కానట్లు ముఖం పెట్టాం. వారు ఎంతో సహృదయులు. అందుకే వెంటనే బోర్డు దగ్గరకు వెళ్ళి బంతిలా ఉన్న ఓ గుండ్రటి బొమ్మనూ, దాని తలకు నాలుగు వెంట్రుకలనూ గీశారు.

'పిల్లలూ! ఈ బొమ్మకున్న తల కాలానికి గుర్తు. ఇది నిరంతరం తిరుగుతూనే ఉంటుంది. అలా తిరుగుతూ మన వైపునకు వచ్చినప్పుడు ఆ నాలుగు వెంట్రుకలను పట్టుకుంటేనే బొమ్మ నిలబడుతుంది. ఒక్కసారి ఆ అవకాశం చేతిలో నుంచి జారిపోయిందంటే మళ్ళీ మన వంతు వచ్చే వరకు వేచి చూడాలి. కాలమూ అంతే! ఒక్కసారి జారిపోయిందా! వృథా అయినట్లే' అని వివరిస్తూ, కాలాన్ని మన చేతిలోకి తీసుకోవాలి. సద్వినియోగం చేసుకోవాలని బోధిస్తూ, 'Take time by the forelock' అన్న ఆంగ్ల సామెతను గుర్తు చేశారు. పనిని వాయిదా వేసే అలవాటు భవిష్యత్తులో మన ప్రగతికి విఘాతం కలిగిస్తుందని హితవు పలికారు.

ఆ రోజు నేను జీవితంలో అతి ముఖ్యమైన పాఠాన్ని నేర్చుకున్నట్లయింది. కాలాన్ని జారవిడుచుకోకుండా సద్వినియోగం చేసుకున్నట్లయితే జీవితంలో మనం ఎన్నో సాధించవచ్చు. 'నాకు సమయం లేదు; అందుకే ఆ పని చేయలేకపోయాను; ఈ పని చేయలేకపోయాను' అని ఎవరైనా చెబుతుంటే, నాకు ఆ రోజు పాఠమే గుర్తొస్తుంది. ఇలాంటి సాకులు చెబుతున్నారంటే, వారిలో శ్రద్ధ, పట్టుదల లోపించాయని అర్థం. మనస్సుకు సరైన శిక్షణనిచ్చుకునే వారు ఎప్పుడూ ఇలాంటి సాకులు చెప్పరు. సమయాన్ని చక్కగా వినియోగించుకునేవారు ఇరవై నాలుగు గంటల్లోనే ఎన్నో పనులు చేయగలరు. కాలప్రణాళిక సరిగ్గా లేనివారు, ఎన్ని రోజులైనా ఏమీ సాధించలేరు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విన్‌స్టన్ చర్చిల్‌కు ఉన్నవీ ఇరవై నాలుగు గంటలే, మనకున్నవీ ఇరవై నాలుగు గంటలే! ఆయన అదే సమయంలో ఎంతో సాధించాడు; మనం అందులో అతి కొద్ది శాతం కూడా సాధించలేకపోతున్నాం. అంటే ఉన్న ఆ కాలాన్ని ఎలా సక్రమంగా ఉపయోగించుకోవాలో మనం మనస్సుకు శిక్షణనివ్వలేకపోతున్నాం. ముఖ్యంగా ఎప్పుడూ కాలాన్నీ, పరిస్థితులనూ నిందించకూడదు. ఉన్న సమయాన్నే ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటూ, పరిస్థితులను మనకు అనుకూలంగా మలుచుకున్నప్పుడే సార్థకమైన జీవితాన్ని గడిపినవారమవుతాం. పైగా ఉన్న ఆ కొద్ది కాలంలో వీలైనన్ని గొప్ప గొప్ప పనులు చేసేలా మనస్సుకూ, బుద్ధికీ శిక్షణ నిచ్చుకోవాలి. దేనికి ఎంత సమయాన్ని కేటాయించుకోవాలో తెలిస్తే, ఏ విషయంలోనూ మనకు హడావిడి ఉండదు. ఎవరినీ, ఏ రోజూ ఆరోపించే అవకాశమూ రాదు. పైగా ఇతరులకు సాధ్యం కాని ఎన్నో పనులను మన జీవనకాలంలోనే చేసి నిరూపించవచ్చు.

సమయ సద్వినియోగం... సృజనాత్మకత: సమయపాలనతో పాటు సృజనాత్మక జీవనం కూడా మనల్ని ప్రత్యేకమైన వ్యక్తులుగా శోభింపచేస్తుంది. చేస్తున్న పనిని మొక్కుబడిగా చేయకుండా, దానికి కొంత శ్రద్ధనూ, ఉత్సాహాన్నీ జోడిస్తే అది సృజనాత్మకత అవుతుంది. కానీ మనలో చాలామందికి కాలాన్నీ, పనినీ తేలిగ్గా తీసుకోవడం అలవాటుగా మారింది. పైగా ఏదో ఒక కారణాన్ని చూపి సమయాన్ని వృథా చేస్తూ ఉంటారు; చేసే పని విషయంలో నిరాసక్తత చూపుతూ, ఏదో ఒక ఆరోపణతో కాలం గడిపేస్తూ ఉంటారు. ... Such people are half-dead without any interest or zest in the life of people around them; they are a bag of complaints and a tissue of frustrations. తమ జీవితంపై, లక్ష్యాలపై సరైన అవగాహన లేనివారే ఇలా జీవన్మృతులుగా మిగిలిపోతారు. నిరాశామయంగా, రసహీనంగా, జీవకళ లేని ముఖాలతో కాలాన్ని వెళ్ళదీస్తూ ఉంటారు. ❖ **సేకరణ: ఆర్. కృష్ణ**

జీవచ్ఛవంలా పడి ఉండకండి. కాలయాపన పనికి రాదు. శ్రమించడం మొదలుపెడితే అనంతశక్తి మీలో జాగృతమవుతున్నట్లు మీకు అనుభూతి కలుగుతుంది. - *స్వామి వివేకానంద*

స్వామి వివేకానంద క్విజ్ - జవాబులు

(1) మహాత్మా గాంధీ
(2) "భారతదేశాన్ని గురించి తెలుసుకోవాలంటే వివేకానందుణ్ణి అధ్యయనం చేయండి. ఆయనలో అంతా పురోగామిత్వమే గానీ తిరోగమనానికి తావుండదు".
(3) అరవిందయోగి
(4) నేతాజీ సుభాష్ చంద్రబోస్
(5) బాలగంగాధర తిలక్.
(6) "జాతీయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నేతలందరూ స్వామి వివేకానంద నుండి స్ఫూర్తిని పొందినవారే. ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ మొత్తం భారతదేశాన్ని ఆయన ప్రభావితం చేశారు. అమూల్యమైన ఆయన విజ్ఞాన వివేక సంపదల నుండి, ఉత్సాహ ఉద్దీపనల నుండి యువతరం ప్రయోజనం పొందగలదని నా విశ్వాసం".
(7) డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్.
(8) చక్రవర్తుల రాజగోపాలాచారి.
(9) వినోబా భావే.
(10) "ముప్ఫై సంవత్సరాల తర్వాత కూడా ఆయన రచనల్లోని ప్రవచనాలను స్పృశిస్తేనే చాలు, నా దేహం విద్యుదాఘాతం తగిలినట్లు ప్రకంపనలతో ఝల్లుమంటుంది. దీన్ని బట్టి అప్రతిహత ప్రతిభా యోధుడైన స్వామీజీ ఆ సందేశాన్ని స్వయంగా ఉచ్చరించినప్పుడు వాటి ప్రభావం ఎంత ఉందో ఊహించవచ్చు".
(11) "ఆయన జన్మించిన వంద సంవత్సరాల తరువాత కూడా ప్రపంచ చరిత్ర పరిగణనలో ఆయన ప్రాధాన్యాన్ని అంచనా వేయలేని పరిస్థితిలో మనం ఉన్నాం. రానున్న శతాబ్దాలలో ఆధునిక ప్రపంచ నాగరకతను తీర్చిదిద్దిన మహనీయులలో ఒక ప్రముఖ వ్యక్తిగా స్వామి వివేకానందను ప్రజలు తమ స్మృతిపథంలో పదిలపరచుకుంటారని విశ్వసిస్తున్నాను".
(12) "వేదకాలం నుండి ఏ హిందూమత ప్రవక్తా చేయని రీతిలో, పటిష్ఠమైన మత విశ్వాసాలను స్వామి వివేకానంద భారతదేశ ప్రజలకు ప్రబోధించారు".

ఐదు మంత్రజాలపు మాటలు

(...18వ పేజీ తరువాయి)

జ్ఞాన భాస్కరుడు; విశ్వమానవ ప్రేమ, సౌభ్రాతృత్వం, మంచితనం – అనే చల్లని చూపులను ప్రసాదించిన భక్తి చంద్రుడు – మన నరేంద్రుడు. మన 'జాతివజ్రం' – స్వామి వివేకానంద. స్వామీజీలాగే అంతకు ముందు కొంతమంది అవే పదాలతో – 'Sisters and Brothers' అని సభను సంబోధించకపోలేదు. మరి అప్పుడెందుకు ఇలా సభ స్పందించలేదు?

ఎందుకంటే అమ్మ శ్రీశారదాదేవి చెప్పినట్లు' 'నాయనా! వారి మాటలు కేవలం 'ముఖస్థ' (నోటి నుండి వచ్చినవి), 'అంతస్థ' (హృదయం నుండి వచ్చినవి) కావు! స్వామి వివేకానంద కేవలం ఒక పండితుడు, మేధావి, ఉపన్యాసకుడు కాదు. విశ్వంలోని సకల ఆత్మలకూ 'ఆత్మ', 'అంతరాత్మ' అయిన 'పరమాత్మ'ను ప్రత్యక్షం చేసుకుని అనుభూతితో, ఆ పరమాత్మతో తాదాత్మ్యం చెందిన ఆధ్యాత్మిక సిద్ధపురుషుడు. విశ్వమానవ మానసాన్ని అపరోక్షానుభూతితో సొంతం చేసుకున్న మహా యోగి పుంగవుడు; నిత్యసిద్ధుడు, ధ్యానసిద్ధుడు.

ఏమున్నదా పంచపదాలలో? పంచేంద్రియాలకు 'ఆవల' ఉన్న 'ఆ' పరంజ్యోతిని దర్శించిన మహాయుగాచార్యుని 'ఆధ్యాత్మికశక్తి' ఉంది. పంచవిషయ భోగాలకు బానిస కాని పరమయోగి, మహాత్యాగి, బ్రహ్మజ్ఞాని యొక్క ఓజస్సు ఉంది. తేజస్సు ఉంది. స్వామీజీ గురుదేవులైన శ్రీరామకృష్ణ పరమహంస తమ మహాసమాధికి ముందు నరేంద్రునికి (వివేకానంద పూర్వనామం) తమ సకల ఆధ్యాత్మిక సంపదనూ, శక్తుల్నీ ధారపోసి, 'నరేన్! నా సర్వస్వాన్నీ నీకు ధారపోసి నేను ఈనాడు ఒక ఫకీరునయ్యాను. నాయనా! ఈ 'శక్తి'తో నీవు విశ్వం విస్మయం పొందేలా జ్ఞానబోధ చేస్తావు. మహాకార్యాలు సాధిస్తావు, ఉగ్రూతలూగిస్తావు!' అంటూ ఆనందబాష్పాలు కార్చారు.

ఈ విధంగా ఆ రోజు ఒక మహా అవతార వరిష్ఠులు, యుగధర్మ ప్రవర్తకులైన శ్రీరామకృష్ణులు తమ శిష్యశ్రేష్ఠునికి, భావిమహా యుగాచార్యునికి, విశ్వగురువుకు 'శక్తిపాత దీక్ష' ఒసంగి ఆశీర్వదించారు. ఆ'శక్తిపాతమే' దుష్ట, దురహంకార మతాంధుల పాలిట, మతమౌఢ్యులు, సంకుచిత బుద్ధుల పాలిట, సనాతన వైదిక ధర్మద్వేషుల పాలిట 'వజ్రపాతమైంది'! విశ్వమానవ ప్రేమ, శాంతి, సౌహార్దం, సోదరభావాలతో 'ఓతప్రోతమై'ంది. అందరిలోనూ అంతరాత్మయై ఉన్న ఒకే ఒక్క భగవంతుని 'దివ్యస్రోతమైం'ది.

ఆ శక్తిపాతంతో, వజ్రపాతంతో, ఓతప్రోతంతో, దివ్యస్రోతంతో, విశ్వాత్మ వివేకానందునితో మనమూ మన అంతరాత్మలను 'సంయోగం' చేసుకుందాం! ఆ ఈశ్వర ప్రేరిత మహావక్త, ప్రవక్త మన ఆత్మలనూ, హృదయాలనూ ప్రేరేపించుగాక! ❖



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

నారాయణగంజ్,
4-10-1940

ప్రియమైన విపత్ భంజన్!*

ప్రపంచం మొత్తంలో మనిషికి తప్ప ఏ జీవికీ భాష లేదనేది లోకవిదితమే. భాష కారణంగానే మానవుడు పురోభివృద్ధిని సాధించాడు. కానీ చిట్టచివరికి ఎవరైనా సరే భాషను కూడా త్యజించవలసిందే.

ఒక ఉత్తరంలో ఇలా ఉంది: "ఆరు సేర్ల మిఠాయిలు, రెండు ఎర్రంచు ఉత్తరీయాలు పంపు" (శ్రీరామకృష్ణ కథామృతం). ఈ ఉత్తరం చదివాక డబ్బు పట్టుకుని బజారుకు వెళ్ళి బట్టలు, మిఠాయిలు కొని వాటిని పంపవలసిన వారికి పంపిన తరువాత ఆ ఉత్తరం అవసరం ఉండదు. భాష ఎంతవరకూ ఉపయోగకరమంటే నీ జీవిత గమ్యం ఏమిటో అక్కడకు చేరే మార్గం ఏమిటో నిర్ణయించుకొనే వరకే. తర్వాత దాని అవసరం లేదు.

శ్రీరామకృష్ణులు ప్రతి ఒక్కరినీ ఇలా అడిగేవారు 'మానవ జీవిత లక్ష్యం ఏమిటి?' అని! ప్రప్రథమంగా మనిషి సుఖంగా జీవించాలని అనుకొంటాడు. రెండో దశలో పేరు ప్రతిష్ఠలు రావడం సుఖజీవనం కన్నా గొప్పది అనుకుంటాడు. ఇంక మూడో దశలో తన గురించి తాను, అంటే ఆత్మను తెలుసుకోవాలనే మేలుకొలుపు కలుగుతుంది.

మొదటి దశ: సుఖంగా జీవించాలనే అభిలాష ఎంతగా వృద్ధి చెందుతుందంటే మానవ మేధస్సు స్వర్గాన్ని గురించి ఆలోచించే స్థాయికి చేరుతుంది. 'వైకుంఠం', 'కైలాసం' మనస్సులో చోటుచేసుకుంటాయి. సాధనతో ముక్తిని పొందవచ్చనే ఆశ జనిస్తుంది. ఇదంతా ఆనందం కోసమే. ప్రాపంచిక సుఖాలకు అలవాటు పడ్డ వ్యక్తి 'తర్వాత ఏమిటి', 'ఆ తర్వాత ఏమిటి?' అనే ఆలోచనలో పడతాడు. ఈ విధంగా ఆనందం కోసమైన వేటలో భగవంతుడు అనే భావం అతనిలో వృద్ధి చెందుతుంది.

రెండో దశ: అస్తిత్వం నిలుపుకోవడానికీ, పేరు ప్రతిష్ఠలు పొందడానికీ మనిషి అన్నిటినీ త్యాగం చేసే స్థితికి వెళతాడు. అలాంటి వ్యక్తి మతాచారాలను పాటించడం, దానధర్మాలు చెయ్యడం, పూజాపునస్కారాలు చెయ్యడం, ఇతరులకు మంచిని చెయ్యడం లాంటి సాధనలు చేపడతాడు. అలాంటి జనులు ముఖ్యమైన సందర్భాలలో ప్రత్యేక గుర్తింపును కాంక్షిస్తారు. పేరుప్రతిష్ఠలు పొందాలనే కోరికే క్రమంగా వారిని తమ ఇంద్రియాలపైన, ప్రపంచంపైన అదుపు సంపాదించడానికి పురిగొల్పుతుంది.

మూడో దశ: 'ఆత్మ తప్ప ఇతరమైనవేవీ నాకు విలువైనవి కావు' అనే తాత్త్విక అవగాహన రాగానే వ్యక్తి సన్న్యాసానికి అర్హుడవుతాడు. ఆ విధమైన ఆత్మ వికాసం పొందకపోతే సన్న్యాసాన్ని స్వీకరించడం సాధ్యం కాదు. ఈ విధమైన ఆత్మాభివృద్ధిని గురించి భగవద్గీత బాగా బోధిస్తుంది.

నువ్వు నీ శరీరం, మనస్సు, బుద్ధులను నిశితంగా పరీక్షించాలి. నిజమైన జ్ఞానాన్ని ఆర్జించడానికి కావలసిన ఆధ్యాత్మిక శిక్షణ పొందడానికి నిశ్చయించుకున్న తర్వాతే ఈ మార్గానికి పూర్తిగా అంకితం కావాలి.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగు సేత: కె. త్రివిక్రమరావు

(*విపత్ భంజన్, కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో సన్న్యాసం స్వీకరించి స్వామి స్వాహానందగా ప్రసిద్ధులయ్యారు.)

పళ్ళనూ, నీడనూ ఇచ్చే వృక్షాన్నాశ్రయించాలి. ఒకవేళ పళ్ళు లభించకపోతే, దాని నీడను అనుభవించకుండా మనల్ని ఎవరు ఆపగలరు? గొప్ప ప్రయత్నాలను వదలకూడదన్నదే నీతి. -స్వామి వివేకానంద

(...13వ పేజీ తరువాయి)

కన్నులూ, వీనులూ తనియవు...

ఈ లోకంలో ఎంత సౌందర్యమూర్తిని చూసినా ఏదో ఒక సమయానికి ఇక చాలనిపిస్తుంది! కానీ అందానికే అందమైన ఆ దేవదేవుడిని ఎంతసేపు చూసినా మనస్సు మరలదు. భగవంతుణ్ణి సాక్షాత్కరించుకునే వరకు భక్తుడి మనస్సు అద్దంలా ఉంటుంది; ప్రత్యక్షమయ్యాక ఆ మనస్సు ఆయన గాఢమైన ముద్రతో పసిడిపటంలా మారిపోతుంది. ఇక ఆ తరువాత ఆ మనోఫలకంపై మరో ప్రతిమకు అవకాశమే ఉండదు. అలా ఏడుకొండలవాడిని తన గుండెల్లో నిలుపుకున్నాడు అన్నమయ్య. ఆ మధురభావంతోనే...



ఎన్నిమారులు సేవించినా కన్నులూ తనియవు
విన్న నీ కథామృతమున వీనులు తనియవు
సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వయు తనియదు
విన్న కన్నది కాదు ఇది నావెలితో నీవెలితో...

'నీ రూపదర్శనంతో నయనాలకూ, నీ నామమాధుర్యంతో శ్రవణాలకే కాదు చివరకు నీ కీర్తనతో నాలుకకు కూడా తనివితీరటం లేదు'నీ, 'ఇలాంటి అనుభవం ఇంత వరకు ఎక్కడా కలగలేదు'నీ, 'ఆ అనుభూతి గురించి వినలేదు, చూడలేదు'నీ వేంకటేశ్వరుడికి విన్నవించుకుంటున్నాడు. 'తనియవు' అంటే తృప్తి చెందడం లేదని అర్థం.

భక్త రామదాసు కూడా శ్రీరాముడి నామామృత పానంతో ఆనందడోలికల్లో ఊగుతూ...

జుట్టెదమీ కథామృతము, జుట్టెదమీ పదకంజ తోయమున్
జుట్టెద రామనామమున జొబ్బిలుచున్న సుధారసంబు, నే
జుట్టెద జుట్టుజుట్టున రుచుల్ గనువారి పదంబుగూర్ప వే
తట్టుల తోడి పొత్తిడక దాశరథీ కరుణాపయోనిధీ

"అమృతంతో సమానమైన నీ కథలను నేను అమితానందంతో వింటాననీ, మీ పాదపద్మాలను కడిగిన నీటిని సంతోషంగా సేవిస్తాననీ, నన్ను దుష్టులతో పొత్తు కూడనట్లుగా చేసి, నీ నామామృతాన్ని ఆస్వాదించిన కొద్దీ మహదానందాన్ని పొందే పరమభక్తుల పాదాలతో చెలిమి కలిగేట్లు చేయు" అని ఆ కోదండ రాముడిని కోరుకుంటాడు.

కాయము, పాదములూ తనియవు...

అదే విధంగా ఆ శేషాద్రి నిలయుడి ప్రసాదాన్ని ప్రీతితో ఎన్నిసార్లు స్వీకరించినా శరీరానికీ, ఆ సన్నిధిలో ఎన్ని ప్రదక్షిణలు చేసినా పాదాలకూ, ప్రేమతో ఎంతసేపు సాష్టాంగ ప్రణామాలు చేసినా నుదురుకూ తనివి తీరడం లేదని తాళ్ళపాక వంశభూషణుడు తబ్బిబ్బైపోతూ, 'నీ భక్తిలో వెర్రివాడినై పోతున్నా'నని వడ్డికాసులవాడిని వినుతిస్తూ....

కడగి నీ ప్రసాదమే కొని కాయమూ తనియదు
బడి ప్రదక్షిణములుసేసి పాదములు ఇవి తనియవు
నుడివి సాష్టాంగంబు చేసి నుదురునూ తనియదు
వెడగుతనమిది కలిగె నిది ఇది నా వెలితో నీవెలితో!

అంటున్నాడు. 'కడగి' అంటే ప్రయత్నించి, 'బడి' అంటే క్రమము, 'వెడగుతనం' అంటే వెర్రితనం అని అర్థం. ఇలా ఆపాదమస్తకం ఆ పాపవినాశకుడి సేవకే పునరంకితం చేశాడు పదకవితా పితామహుడు. శ్రీకాళహస్తీశ్వరుడి సేవలో మహాకవి ధూర్జటి కూడా అదే రీతిలో సేవించి తరిస్తూ,

నీ రూపంబు తలంపగా తుదమొద ల్లేగాన నీవైనచో
రారా రమ్మనియంచు చెప్పవు, పృథారంభంబు లింకేటికిన్
నీరన్ముంపుము పాలముంపు మిక నిన్నే నమ్మినాడం సుమీ
శ్రీరామార్చిత పాదపద్మ యుగళా! శ్రీకాళహస్తీశ్వరా!

'పరమశివా! నీ స్వరూపాన్ని తెలుసుకోవాలంటే నాకు నీ మూర్తికి సంబంధించిన ఆది, అంతాలేవో అర్థం కాకుండా ఉన్నాయి. నీవైనా నా యందు ప్రేమతో 'రారా' అని పిలిచి తెలియచేయకపోతివి; నిన్నే నమ్ముకున్నాను; ఇక నీట ముంచినా, పాలముంచినా నీదే భారం' అని ప్రార్థిస్తాడు.

చేతులూ, చిత్తమూ తనియవు....

ఓ మారు రాక్షసనాథుడైన హిరణ్యకశిపుడికి కుమారుడు ప్రహ్లాదుడు భక్తి మాధుర్యాన్ని వివరిస్తూ, దేహమున్నది దేవదేవుడిని అర్చించేందుకేనని హితవు పలుకుతాడు. కాళ్ళు, చేతులు, కళ్ళు, చెవులు, మనస్సు ప్రసాదించింది ఆ పరంధాముడి సేవకేనని స్పష్టం చేస్తూ...

కమలాక్షు నర్చించు కరములు కరములు
శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ
సురరక్షకుని జూచు చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు శిరము శిరము
విష్ణు నాకర్ణించు వీనులు, వీనులు
మధువైరి దవిలిన మనము మనము
భగవంతు వలగొను పదములు పదములు..అంటాడు.

అదే తలంపుతో శ్రీనివాసుడి సేవాగ్రగణ్యుడు కూడా తన పదకవితను ముగిస్తూ...

చెలగి నినునే పూజించి చేతులూ తనియవు
చెలువు సింగారంబు తలచి చిత్తమూ తనియదు
అలరి శ్రీవేంకటగిరీశ్వర ఆత్మనను మోహింపజేసితి
వెలయనిన్నియు దేరెమును నీవెలితో నావెలితో!

'నిన్ను పూజించి చేతులకు, నీ సుందరరూపాన్ని తలచి చిత్తానికి తనివితీరడం లేదు'నీ, 'ఆత్మతత్త్వంతో నన్ను మోహింపజేసిన నీ ప్రకాశం, ఆ తన్మయం నాతోనే ఉంటుంద'నీ ఉప్పొంగిపోతూ అంటాడు. 'చెలువు' అంటే అందాల పురుషుడు, వెలయ అంటే 'ప్రకాశించు' అని భావం. ❖

మారుతున్న కాలంలో మనుగడ సూత్రాలు

– 'భారతరత్న' అబ్దుల్ కలామ్



నా జీవితంలో ఎన్నో మలుపులున్నాయి. ఈ మలుపులు ఏళ్ళ తరబడి సాగిన కఠోరశ్రమనూ, సంశయాన్నీ, సంక్షోభాన్నీ, సంఘర్షణనూ సూచిస్తూ ఉన్నాయి. నేను పడ్డ శ్రమ అన్ని వేళలా సత్కారానికీ, సత్ఫలితాలకూ నోచుకోలేదు. నా స్వేదం అన్ని వేళలా విజయ సుమాలనే పూయించలేదు. దేశాధ్యక్ష పదవి లాంటి శిఖరాగ్రాలు నన్ను సుప్రసిద్ధుణ్ణి చేసిన మాట నిజమే కానీ, వాటి వెనుక సుదీర్ఘమైన అభ్యసన జీవితముంది; జారుడు మెట్ల దారి ఉంది. ఈ మిశ్రమ అనుభవాల ఆధారంగా ఈ తరానికి, మారుతున్న కాలంలో వృత్తిపరమైన, ప్రవృత్తిపరమైన కొన్ని మనుగడసూత్రాలు...

పాఠాల కోసం పరితపించండి....

మీ వృత్తిపరమైన జీవితంలో ముందు మీకు తోడ్పాటును అందించగల శిక్షకుల కోసం, మార్గదర్శకుల కోసం అన్వేషించండి. వారి అనుభవం మిమ్మల్ని మీ వృత్తి జీవితంలో విజయపథంలో నడిపిస్తుంది. మీరు నడవాలనుకున్న దారిలో మీ కన్నా ముందే నడిచేవాళ్ళు ఏం చెబుతున్నారో ఓపిగ్గా వినడం అలవాటు చేసుకోండి. మీ జీవితాన్ని ప్రభావితం చేయగల పాఠాల కోసం పరితపించండి.

బాధ్యతలను భుజాలకెత్తుకోండి..

ఎప్పటికప్పుడు కొత్త కొత్త బాధ్యతలు నెరవేర్చడానికి మీరు సంసిద్ధులుగా ఉండండి. కొందరు పాత తరం అధికారులు మీకు అదనపు బాధ్యత ఇవ్వడమంటే శిక్ష విధించడమేనని నమ్ముతూ ఉండవచ్చు. అది ఆ తరం భావన. కానీ వారి ఆలోచనలను తారుమారు చేస్తూ, అదనపు బాధ్యత అంటే మీరు కొత్త విషయాలు నేర్చుకోవడానికీ, మిమ్మల్ని మీరు నిరూపించుకోవడానికీ కొత్త అవకాశమని విశ్వసిస్తూ ముందుకు సాగిపోండి.

గండు తుమ్మెదలవ్వండి...

ఏరో డైనమిక్స్ సూత్రాల ప్రకారం గండు తుమ్మెద ఎగరడం అసాధ్యమనే చెప్పవలసి ఉంటుంది. దాని రెక్కల కొలత గానీ, అది సెకనుకు ఎన్నిసార్లు కొట్టుకోగలదన్నది గానీ లెక్కగట్టి చూస్తే ఎగరడానికి అవసరమైన చలనసామర్థ్యం దానికి లభించే అవకాశమే లేదు. కానీ శాస్త్రవేత్తలు తనకు ఎగిరే సామర్థ్యం లేదంటున్నారని తెలియని గండు తుమ్మెద మాత్రం ఎగరడానికే ప్రయత్నిస్తోంది; ఎగరగలుగుతోంది కూడా! ఇలా ఎంతో మంది అంచనాలనూ, అపోహలనూ తలకిందులు చేసి ఎవరి జీవితాన్ని వారు తీర్చిదిద్దుకోవాలి. గెలుపు గగనం వైపు గండు తుమ్మెదలాగ ఎగిరిపోండి!

వినమ్రతను అలవరచుకోండి...

కొండల్ని కూడా తుడిచిపెట్టగల వరదలాగా మదించిన యౌవనాన్ని జ్ఞానం లొంగదీస్తుంది; ఆ జ్ఞానం మాత్రం వినయం ద్వారానే సాధ్యమవుతుంది. జీవనపాఠాలు ఒంటబట్టాలంటే, విజయఫలాలను ఆస్వాదించాలంటే ముందు వినమ్రతను అలవరచుకోండి. అందుకే ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త హజరత్ ఇనాయత్‌ఖాన్ 'మనిషి తన సర్వస్వాన్నీ ధారాదత్తం చేయకుండా జ్ఞానం మనిషికేదీ ధారాదత్తం చేయదు' అంటారు.

మనోమైదానంలో విహరించండి...

నా మనస్సులో విస్తృత ఆంతరంగిక మహా మైదానం ఒకటి ఉంటున్నట్లుగా నాకెప్పుడూ అనుభవానికి వస్తూ ఉంటుంది. నేను తరచూ ఆ ఆంతరంగిక క్షేత్రంలో విహరిస్తూ ఉంటాను. నా జీవితం ఎలా ఉంటే బాగుంటుందో ఊహించుకుంటూ ఉంటాను. నేను చేరుకోవాలనుకుంటున్న గమ్యాన్ని అక్కడ దర్శిస్తూ ఉంటాను. నేను కోరుకున్న సమస్తం నేను సాధించగలుగుతున్నట్లుగా చిత్రించుకుంటూ ఉంటాను. మన బాహ్యజీవితంలో మనకు అత్యంత సన్నిహితంగా ఉన్న వాస్తవం కన్నా ఈ ఆంతరంగిక ప్రపంచం మనకు మరింత వాస్తవం. ఇది మన అంతరంగంలో నిక్షిప్తమై ఉన్న రహస్య రత్నకోశం లాంటిది. అలాంటి ఆంతరంగిక మనో ప్రపంచంలో విహరించడం అలవాటు చేసుకోండి. మిమ్మల్ని మీరు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి.

ప్రశాంతత నుంచే ఆనందమూ, ఆరోగ్యమూ...

ప్రకృతిలో జీవిస్తున్న తక్కిన జీవుల లాగానే మనిషి కూడా తన లోపలా, బయటా సమన్వయంతో, సామరస్యంతో జీవించడమెలాగో నేర్చుకొని తీరాలి. ఒక్కక్షణం నువ్వు నీ మనస్సులో నుంచి 'నేను, నాది' అనే భావాలను తొలగించి చూడు. నీకు నీ తోటి మనుషుల పట్ల ఉండే భిన్నత్వమంతా తొలగిపోతుంది. దోషాలకు తావివ్వని హృదయంలో వ్యతిరేక భావాలు ప్రవేశించలేవు. మన హృదయాల నుంచి స్వార్థం, సంకుచితత్వం తొలగిపోయినప్పుడు శాంతి అవతరిస్తుంది. అది మన ఆనందానికే కాదు, ఆరోగ్యానికీ కారణమవుతుంది. సమాజంలో శాంతి ప్రతిఫలిస్తుంది.

సేకరణ : ఎమ్.రాంబాబు

- స్వామి విశారదానంద

బెంగుళూరులోని వివేకానంద యోగ అనుసంధాన మహా విద్యాపీఠానికి చెందిన స్వామి విశారదానంద భగవద్గీత పదమూడో అధ్యాయంలో 7-11 శ్లోకాల్లోని భగవానుడి బోధామృతాన్ని వివరిస్తూ 'భగవద్గీత - మానవీయ విలువలు' అనే శీర్షికతో ప్రసంగాలు ఇచ్చారు. చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠ ఆంగ్ల మాసపత్రిక 'వేదాంత కేసరి'లో ప్రచురితమైన ఆ ప్రసంగాల సారాన్ని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

అశాశ్వతమే

మన మనస్సు రకరకాల కుయుక్తులు పన్ని, ఆధ్యాత్మిక సాధనల్ని తగ్గించుకొనేలా చేస్తుంది. మన జీవనానికి కావాల్సిన ప్రాథమిక పరిస్థితులైన నీరు, గాలి, భూమి, ఆకాశం లాంటి వాటికి మనకేమీ లోటు లేదు. కొద్దిసార్లు మాత్రం పైకి మంచివిగా అనిపించే కొన్ని సౌకర్యాలు మనకు లభించక పోవచ్చు. కానీ సాధారణ జీవనానికి అత్యవసరమైన సౌకర్యాలు మాత్రం మనందరికీ ఉన్నాయి. కాబట్టి అదనపు సౌకర్యాలు లేకపోయినా మన పోరాటాన్ని కొనసాగించాలి.



అసౌకర్యం కలిగినప్పుడు ఒక విధమైన మానసిక పరాధీనతకూ, ఉద్రేకపూరితమైన బంధానికీ మనస్సు లోనవుతుంది. అలజడి చెందుతుంది. అక్కడే ఒక్క క్షణం ఆగి, ఆలోచించాలి. ఉదాహరణకు 'ఎవరైనా మనతో స్నేహంగా లేకపోతే దాని వల్ల కలిగే తేడా ఏమిటి? ఆ కారణంతో నా ఆధ్యాత్మిక సాధనను నేను మానుకోవాలా? ఆ వ్యక్తి ఎటూ అంతకు ముందు నాకు తెలియని వ్యక్తే. ఇక ముందు కొన్నేళ్ళ తరువాత అతనుండడు. ఈ మధ్యలో అతను స్నేహంగా లేకపోతే నష్టమేమిటి? ఈ వాస్తవాన్ని మనం అంగీకరిద్దాం' అనుకోవాలి. మన ఆశలను ఏ విధంగా తగ్గించుకోవాలో తెలుసుకుంటే జీవితం హాయిగా గడిచిపోతుంది. అది అంత సంతోషకరంగా ఉండకపోవచ్చు. కానీ, సంబాళించుకోవడానికీ, సాధారణంగా గడపడానికీ వీలు కానిది మాత్రం కాదు.

కొంతమంది తమ ఉద్యోగం పోతుందేమోనని ఆందోళన చెంది, రకరకాల కల్పిత ఊహలకు లోనవుతుంటారు. దానివల్ల విషయం ఇంకా ఎక్కువ చెడిపోతుంది. అలాంటి ఊహలలో తేలిపోయే కన్నా ముందు జరగాల్సిన దాని గురించి ఆలోచించడం నేర్చుకోవాలి. జీవితమే అశాశ్వతం. అశాశ్వతమన్నదే ఈ ప్రపంచపు శాశ్వత సత్యం.

అంతేకాక, మనం తల్లి కడుపులో ఉన్నప్పుడు భద్రంగా చూడబడ్డాం. పసిబిడ్డగా ఉన్నప్పుడూ జాగ్రత్తగా చూడబడ్డాం. పక్షులకూ, జంతువులకూ బ్యాంకులో ధనం ఏమీ ఉండదు. ఇల్లూ ఉండదు. అయినా అవి ఎంతో సంతోషంగా, జీవిస్తున్నాయి. ఇంద్రియాలు, అవయవాలు, ఆలోచించే మనస్సూ ఉన్న మానవులమైన మనం ఎందుకు ఆకలితో పస్తులుంటాం. ఈ శరీరానికీ, మనకున్న ఇతర వస్తువులన్నిటికీ కారణభూతమైన మన కర్మ, భవిష్యత్తులో మనకు అవసరమైన వస్తువులనన్నిటినీ కూడా తెస్తుంది.

మనపై మనకే కాక దేవునిపై కూడా మనకు విశ్వాసం లేదు. కాబట్టే ఆందోళన చెందుతుంటాం. మనం అడగకుండానే కలలో కూడా ఊహించని వస్తువులెన్నో మనకు లభిస్తాయి. అదే విధంగా ఎన్నో వస్తువులు వాటినెంత భద్రంగా మన దగ్గర ఉంచుకుందామని ప్రయత్నించినా, మాయమై

పోతాయి. మనమే నిజమైన 'అధికారులు' (పర్యవేక్షకుల)మైతే నిజంగా అంతా మన అధీనంలో ఉంటే, మనం కావాలనుకున్నది మన నుంచి మాయం కాదు. మనం వద్దనుకున్నది మనకు రానే రాదు. ఇదంతా చూస్తుంటే మన జీవితాలలో ముఖ్యపాత్ర వహించే 'ఉన్నత శక్తి' ఒకటి ఉన్నదని అర్థమవుతుంది. కాబట్టి దాని మీద నమ్మకం కలిగి ఉందాం.

వేదాంతం సూచించిన పరిష్కారం: ఆత్మజ్ఞానం, లేక ఉన్నత సత్యాన్ని పొందడానికి బాహ్య పరిస్థితులతో సంబంధం లేని స్థిరమైన మనస్సు అత్యంత ప్రధానమైనదని గ్రహించాలి. ఇది మనకు అలవడాలంటే ఆత్మపరిశోధకులుగా, పరిశీలకులుగా ఉండాలి. మంచి పరిస్థితులు గానీ, చెడుపరిస్థితులు గానీ మనల్ని కలవరపరచకూడదు. ఉద్రేక పరచకూడదు. మనస్సును ఏ విధంగా ప్రవర్తింపజేయాలో తెలుసుకొని, ఆవేశకావేశాలకూ, ఉద్రేకాలకూ, నిరాశా నిస్పృహలకూ దూరంగా ఉండాలి.

ఎలాంటి పరిస్థితులలోనైనా సరే మానసిక సమతౌల్యాన్ని ఏ విధంగా నిలకడగా ఉంచుకోవాలో వేదాంతం మనకొక

శాశ్వత సత్యం

దృశ్యంగా తెలియజేస్తుంది. బాహ్యపరిస్థితులే మారి పోతుంటాయి తప్ప, ఆత్మ గానీ, పరమాత్మ గానీ ఎల్లప్పుడూ ఒకే రకంగా ఉంటాయి. ఆత్మతో అనుసంధానమై ఉంటే, బాహ్యంగా జరిగే మార్పులు మనల్ని ప్రభావితం చేయలేవు. ప్రస్తుతం మన మనస్సు బాహ్య పరిస్థితులకు అనుగుణంగా ఉండి, వాటి వల్ల కలిగే కెరటాల తాకిడికి ఊగిసలాడుతోంది. కాబట్టి బాధలకూ, దుఃఖాలకూ లోనవుతున్నాం.

బాహ్య ప్రపంచం నుండి మన అంతరంగంలో ఉన్న ఆత్మ వైపు మరలితే, ఎల్లప్పుడూ ఆనందంగానే ఉంటాం. ఒక భయంకరమైన కల గన్నా, సంతోషకరమైన కల గన్నా, ఆత్మ కేవలం 'సాక్షి' లాగా ఉండి, ఎలాంటి మార్పూ చెందదు. కలను గనక తీవ్రంగా పరిగణిస్తే మనస్సు అలజడి చెందుతుంది. 'అది అంతకు ముందు లేనిదీ, ఇక ముందు ఉండబోనిదీ' అయినప్పుడు ప్రస్తుతం (వర్తమానంలో) దాని గురించి ఆందోళన చెందడమెందుకు?

ఆత్మజ్ఞానాన్ని అన్వేషించాలంటే, మనం ఆత్మపరిశోధనా శక్తినీ, ఆత్మ విచారణశక్తినీ ఉపయోగించాలి. ఆత్మ విచారణ వల్ల మనోవికారం తొలగి, ప్రశాంతత చేకూరుతుంది. అంటే మన దృక్పథంలో మార్పు వస్తుంది. మనల్ని మనం ఒక పెద్ద వృక్షంగానూ, మన శరీరం ఆ వృక్షంలో కేవలం ఒక 'ఆకు'గానూ భావిద్దాం. ఒక్క ఆకు రాలిపోతే ఏం పోతుంది మనం అనేక ఆకులున్న పెద్దవృక్షం కదా! మనల్ని మనం అనంత ఆత్మలుగా, విరాట్ స్వరూపులుగా భావించుకుందాం. పైకి కనిపించే నష్టం వెనకాల లాభం ఉంటుంది. అలాగే పైకి లాభంగా కనిపించే దాని వెనక నష్టమూ ఉంటుంది.

'ఆత్మజ్ఞాన సముపార్జనే' మన జీవిత లక్ష్యమన్న సంగతి మరువకూడదు. మన లక్ష్యసాధనా యాత్రకు అంతరాయం కలగనంత వరకూ కొంచెం స్వార్థం (మానం), అవమానం, నింద, స్తుతులు ఉన్నా, అవి మన దృష్టిని మరల్చే అవకాశం లేదు. జీవితానికి అవి కొంచెం చమత్కారాన్నీ, సౌరభాన్నీ కలుగజేస్తాయి.

ఒక సంస్కృత శ్లోకంలో ఈ విధంగా ఉంది. యోగి తన సాధనా మార్గంలో నడుస్తుంటే, కొంతమంది అతణ్ణి 'మంత్రగాడ'నీ, కొంతమంది 'జ్ఞాని' అనీ, కొంతమంది 'సన్యాసి' అనీ, మరికొంత మంది 'గొప్ప యోగి' అనీ అంటారు. ఈ వ్యాఖ్యానాలేవీ ఆ యోగిని స్పృశించవు. ఆయనకు కోపమూ రాదు; పొంగిపోనూ పొంగిపోడు. కుక్కలు మొరిగినా లక్ష్యపెట్టక ముందుకు కదిలే ఏనుగు లాగా ఆ యోగి ముందుకు సాగిపోతాడు.

ఆ కుక్కలను అభినందించడానికో, బదులు చెప్పడానికో ఆ ఏనుగు ఆగదు. తన మార్గం వైపు అది మరలి వెళుతుంది. జనం ఏమనుకున్నా సరే, యోగులు తాము ఏ విధంగా ఉన్నారో అలాగే ఉంటారు. మనమూ అలాగే ఉండి, ముందుకు సాగాలి.

మనం ఆలోచించడానికి పెద్ద విషయాలు లేకపోతే, చిన్న విషయాలే పెద్దవిగా తయారవుతాయి. పోట్లాడడం కూడా ప్రారంభమవుతుంది. పెద్ద విషయాలు కూడా అప్రధానమని అనిపించేటంత పెద్దవాళ్ళుగా మనం తయారవ్వాలి. పెద్ద వారవడం వల్లనే విభేదాలను రూపుమాపగలం. మనం చిన్నవాళ్ళుగానే ఉంటే, ఈ ప్రపంచం మనల్ని ముంచెత్తుతుంది. పెద్ద వాళ్ళమైతే కష్టాలు మాయమవుతాయి. ఈ విధంగా అంతర్గత శాంతి (సమచిత్తత్వం) పొందగలం. ❖


తెలుగు సేత: డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి


(వచ్చే సంచికలో - 'నిశ్చల భక్తి')


'మానవుని అంతరంగంలో సహజంగానే ఉన్న శక్తిని అభివ్యక్తం చేయడమే మతం' అన్నది నేను ప్రబోధించే వాటన్నిటిలో ప్రధానమైన అంశమని నొక్కివక్కాణించి చెబుతాను. -స్వామి వివేకానంద

అహాన్ని త్యజించిన రాజు

మూలం: శ్రీరమణ మహర్షి చెప్పిన కథ **చిత్రాలు:** సదాశివం **అనుసృజన:** స్వామి జ్ఞానదానంద










4 ఇలా ఉండగా అమరసేనుడు ఒక రోజు రాత్రి మారువేషంలో నగర సంచారం చేస్తూ, హరికథ జరుగుతున్న ఒక మండపంలోకి వెళ్ళాడు.
ఆత్మవికాసానికి అవరోధమైన అహంకారాన్ని త్యజించమంటోంది భగవద్గీత. అలా చేయకుండా ఏ పెద్ద లౌకిక విజయమూ నిరంతర శాంతినివ్వదు.
5
'నా వీరత్వం, నా పాలన' అనే అహంభావనలన్నీ సమసిపోతేనే నాకు ఆత్మవికాసం చేకూరుతుందా?
6 మరునాడు రాజు కృతనిశ్చయుడై అధీరుణ్ణి తన వద్దకు రమ్మని కబురు పంపించాడు.
మహారాజా! నన్ను రప్పించిన కారణం ఏమిటో తెలుసుకోవచ్చా?
అధీరా! నేను నా రాజ్యాన్ని నీకు అప్పగించి వేస్తున్నాను. నీ రాజ్యంతో పాటు దీనినీ నువ్వే పాలించు!
7 మీరు మీ రాజ్యాన్ని త్యజించడానికి కారణం ఏమిటి రాజా?
నా శేషజీవితాన్ని తపస్సులో గడపాలనుకుంటున్నాను.
అలా అమరసేనుడు తన రాజ్యాన్ని అధీరునికి శాసనబద్ధంగా సమర్పించి, అడవులకు వెళ్ళిపోయాడు.
8 అమరసేనుడు అరణ్యంలో నిరాడంబరంగా జీవిస్తూ, తపస్సు చేయసాగాడు. అలా చాలా ఏళ్ళు గడిచాయి. ఒక రోజు...
ధ్యానమూ, తపస్సూ నన్ను అహంకార రహితునిగా మార్చాయా, లేదా అన్నది ఎలా తెలుసుకోవాలి?





పేరు ప్రతిష్ఠల కోసం దేవులాడేవారు, ఆ భగవంతుడే అన్నిటికీ కర్త అని గ్రహించలేరు. అహంకారం ఉన్నంత వరకూ ఆత్మజ్ఞానం లభించదు, జనన మరణ చక్రం నుండి ముక్తి లభించదు. - *శ్రీరామకృష్ణ పరమహంస*



సౌమ్యమూర్తి

– స్వామి భాస్కరానంద

భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్షశిష్యులైన స్వామి శారదానంద గుణగణాలను పుణికిపుచ్చుకున్న మహానుభావులు స్వామి భూతేశానంద. స్వామి శారదానంద శిష్యులుగా వారు రామకృష్ణ సంఘంలో విశిష్టమైన పాత్రను పోషించి, పన్నెండో సర్వాధ్యక్షులుగా సేవలందించారు. ఒక్క మాటలో చెప్పాలంటే విజయ్ మహరాజ్ (స్వామి భూతేశానంద పూర్వనామం) సౌమ్యత్వానికి మారుపేరు.

ఒకసారి ప్రకృతి వైపరీత్యాల కారణంగా బీహార్‌లో రామకృష్ణ సంఘం సహాయచర్యలను చేపట్టింది. అక్కడ సేవా కార్యక్రమాల పర్యవేక్షణకు నియమితులైన సంఘ సాధువు, సంస్థ విధి విధానాలను పాటించలేదనీ, ఫలితంగా సహాయచర్యల్లో లోపం జరిగిందనీ బేలూరు మఠానికి నివేదిక అందింది. స్వామి భూతేశానంద మహరాజ్, బీహార్‌లో ఆ బాధ్యతలను నిర్వర్తిస్తున్న సంబంధిత సాధువును వెంటనే వచ్చి తనను కలుసుకోవలసిందిగా కోరారు.

ప్రధాన పర్యవేక్షక బాధ్యతలో ఉన్న ఆ సాధువు సమర్థుడే అయినప్పటికీ, అహంభావం ఎక్కువ. ఆయన బీహార్ నుంచి బేలూరు మఠంలోని స్వామి భూతేశానంద మహరాజ్ దగ్గరకు వచ్చీ రావడంతోనే సంయమనాన్ని కోల్పోయాడు. ఏ మాత్రం ఆలోచించకుండా స్వామీజీపై విరుచుకుపడ్డాడు. ఆవేశంగా ఎన్నో మాటలు అన్నాడు. అక్కడే ఉన్న మా అందరికీ విస్మయం కలిగింది. కానీ మహరాజ్ ఏమీ చలించలేదు; మారుమాట్లాడ లేదు; తనదైన రీతిలో నిర్మలంగా నిలబడ్డారు. సదరు సాధువుపై క్రమశిక్షణచర్యలు తీసుకునే అవకాశం, అధికారం ఉన్నా స్వామి భూతేశానంద మహరాజ్ ఆవిధంగా ఆలోచించను కూడా ఆలోచించ లేదు. తరువాత ఆ విషయాన్నే మరచిపోయారు. బీహార్ సహాయక చర్యల నుంచి తిరిగి వచ్చాక కూడా ఆ సాధువును మహరాజ్ అదే ప్రేమ, వాత్సల్యాలతో పలకరించేవారు. సోదర సన్యాసిగానే మసలుకునేవారు. కానీ రెండు మూడేళ్ళకు ఆ సాధువు ఏవో వ్యక్తిగత కారణాలతో రామకృష్ణ సంఘం నుంచి తనే బయటకు వెళ్ళిపోయారు.

స్వామి భూతేశానంద మహరాజ్ రామకృష్ణ సంఘ సర్వాధ్యక్షులయ్యాక వారిని కలవడానికి అమెరికా నుంచి బేలూరు మఠానికి వచ్చేవాడిని. ఓ సందర్భంలో మాటల్లో మాటగా వారు నాతో, 'ప్రతి ఒక్కరినీ ఈ సంఘంలోనికి ఆహ్వానించాలన్నదే నా ఉద్దేశం. ఈ సంఘం నుంచి ఎవరినీ వదులుకోవడానికి నాకు ఇష్టం ఉండదు; ఎవరూ బయటకు వెళ్ళకూడదని నా ఆకాంక్ష' అన్నారు. వారి సౌమ్యత్వం వెనుక ఇంత మహోన్నత ఆశయం ఉందని నాకు అప్పుడు అర్థమైంది.

అదే విధంగా రామకృష్ణ సంఘంలో అధికారం, కార్యదక్షత, పాండిత్యం కన్నా సన్న్యాస ధర్మానికీ, సేవాతత్పరతకే ఎక్కువ గౌరవాభిమానాలు దక్కుతాయని నిరూపించిన వారిలో స్వామి భూతేశానంద మహరాజ్ ఒకరు. వారు సంఘ సర్వాధ్యక్షులయ్యాక, తొంభయ్యో ఏట హృదయసంబంధమైన శస్త్రచికిత్స జరిగింది. ఆ తరువాత ఓ మారు ఉదయం పూట నడుస్తూ సేవక సాధువులతో 'నేను రామకృష్ణ సంఘానికి అధ్యక్షుడినయ్యానని అందరూ అంటున్నారు; కానీ అరవై ఏళ్ళ క్రితం షిల్లాంగ్‌లో సాధారణ సాధువుగా ఉన్నప్పుడు ఎలా ఉన్నానో, ఇప్పుడూ అలాగే ఉన్నాను. నాకు పెద్దగా మార్పేమీ అనిపించడం లేదు. తేడా అల్లా ఒక్కటే; అప్పుడు నాకు వ్యక్తిగత సహాయకులు ఎవరూ లేరు. ఇప్పుడు కొత్తగా ఇద్దరు సహాయకులు వచ్చారంతే!' అన్నారు.

మహరాజ్ తన సహజమైన సరళస్వభావంతో, సౌమ్యత్వంతో మా లాంటి వారికి ఆదర్శనీయులంటే అతిశయోక్తి కాదు. అదే విధంగా మహరాజ్ సంస్కృతభాషపై సాధికారత కలిగిన సాధుపుంగవులు. పెద్ద పెద్ద పండితులు కూడా శాస్త్ర సంబంధమైన సంశయాలతో వారి వద్దకు వచ్చేవారు. మహరాజ్ వారి సంశయాలను ఓపిగ్గా నివృత్తి చేసేవారు. వ్యక్తిగతంగా వారు ఎప్పుడూ తన పేరున పుస్తకాలు వెలువడాలని తాపత్రయ పడలేదు. అదే విధంగా ఆంగ్లం, బెంగాలీ, గుజరాతీ భాషలలో కూడా వారికి విశేష ప్రావీణ్యం ఉండేది. అద్భుతంగా ఉపన్యాసాలు ఇచ్చేవారు. వారి తదనంతరం ఆ ప్రసంగాలనే పుస్తకాలుగా ప్రచురించారు. ❖

(సెప్టెంబర్ 8న, రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులైన స్వామి భూతేశానంద మహరాజ్ జయంతి)

ప్రేమ, మంచితనం, పవిత్రత మనలో ఎంత అభివృద్ధి చెందితే, బయట ప్రపంచంలో అంత ప్రేమ, మంచితనం, పవిత్రత మనకు కనబడతాయి. సహనశీలురై మెలగండి. *-స్వామి వివేకానంద*

రామకృష్ణ మిషన్

పి.ఓ. బేలూరు మఠం, హౌరా జిల్లా -711 202. ఫోన్ : 033-2654 1144, 1180, 5700
E-mail: rkmrelief@gmail.com website: www.belurmath.org

ఉత్తరాఖండ్ వరద బాధితులకు సహాయక చర్యలు

విరాళాలకు విజ్ఞప్తి

2013 జూన్ మాసంలో ఉత్తరాఖండ్‌లో అనూహ్యమైన కుంభవృష్టి కారణంగా సంభవించిన ఉద్ధృతమైన వరదలు జన జీవనాన్ని అతలాకుతలం చేశాయి. అనేక గ్రామాలు జలమయమయ్యాయి. వేలాది గ్రామస్థులు నిరాశ్రయులయ్యారు.

రామకృష్ణ మిషన్ – కంఖల్ సేవాశ్రమ (హరిద్వార్) శాఖ, డెహ్రాడూన్ శాఖల ద్వారా వరద బాధితులకు సహాయక చర్యలను చేపట్టింది. వరద బాధితులకు – ఆహార పొట్లాలనూ, నిత్యావసర వస్తువులనూ, శిశు పోషకాహారాన్నీ పంపిణీ చేస్తోంది. ఉచిత వైద్య సేవలను అందిస్తోంది.




వరద బాధితుల సహాయ, సేవా కార్యక్రమాల నిమిత్తం ఉదార హృదయులైన భక్తులు, శ్రేయోభిలాషుల నుండి విరాళాలను కోరుతున్నాం. మీ విరాళాల్ని Ramakrishna Mission, Kolkata పేరున చెక్కు/ డి.డి. తీసి The General Secretary, Ramakrishna Mission, (Relief Section) Belur Math, Howrah, West Bengal-711 202 చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

మా వెబ్‌సైట్ http://www.belurmath.org/donation cca/donation.phpను ఉపయోగించి ఆన్‌లైన్ ద్వారా విరాళాలను అందజేసే సదుపాయం కూడా ఉంది. విరాళాలను మీకు సమీపంలో ఉన్న రామకృష్ణ మఠం, రామకృష్ణ మిషన్ కేంద్రాలలో కూడా అందజేయవచ్చు.

వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు ఇచ్చే విరాళాలకు ఆదాయ పన్ను చట్టంలోని సెక్షన్ 80జి కింద పన్ను మినహాయింపు లభిస్తుంది.

భగవత్సేవలో
స్వామి సుహితానంద
ప్రధాన కార్యదర్శి


గ్రంథపరిచయం



బుద్ధ దర్శనం


రచన: శ్రీమతి బొప్పన అరుణాదేవి
వెల: రూ. 70/- పుటలు: 309
ప్రతులకు: రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాద్ – 29

అహింసా పరమోధర్మః అని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు గౌతమబుద్ధుడు. కర్మకాండలలో నలిగిపోతూ, జంతుబలులకు ప్రాధాన్యమిస్తున్న కాలంలో ఆవిర్భవించి ధర్మాచరణే ముఖ్యమని బోధించిన మహనీయుడు గౌతమబుద్ధుడు. హింస, స్వార్థాలతో కూడిన ఆధునిక సమాజానికి బుద్ధుని బోధనలు తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ లోటును పూడుస్తూ అరుణాదేవి గారు సరళంగా, సమగ్రంగా బుద్ధ చరిత్రనూ, ధర్మాన్నీ పాఠకులకు అందించడం ముదావహం. ఈ గ్రంథాన్ని విశ్వమానవ కల్యాణం, విశ్వశాంతి కోసం కృషిచేస్తున్న రామకృష్ణ మఠం ప్రచురించడం బంగారానికి తావి అద్దినట్లుగా ఉంది. జ్ఞాన పిపాసులందరూ చదవవలసిన గ్రంథమిది. – *ఎం.వి.నాగప్రసాద్*



శ్రీవివేకానందసూక్తిసుధా

రచన : డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య
వెల: రూ. 20/- పుటలు: 43
ప్రతులకు: వి. అంజనమ్మ, 18-1-84, యశోదానగర్, కపిలతీర్థం రోడ్, తిరుపతి – 517 507
ఫోన్: 0877-2230679



చాణక్య నీతి మాలికలు

అనుసృజన : శ్రీ యల్లాప్రగడ ప్రభాకర రావు
భావార్థం: శ్రీ పంగులూరి హనుమంతరావు
వెల: రూ. 120/- పుటలు: 128
ప్రతులకు: పంగులూరి హనుమంతరావు ఇ.నెం.16-11-511.జి/7, శాలివాహన నగర్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్- 36
ఫోన్ నెం: 040-2414 1560

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

Vol.70-9, Sri Ramakrishna Prabha (Telugu Monthly) September 2013, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57.
Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18th of every month.

మృగమూ శాంతించిన వేళ...



ఇంగ్లండ్‌లో ఒకరోజు స్వామి వివేకానంద, ఇద్దరు పాశ్చాత్య శిష్యులతో పొలం గట్టు మీద నడిచి వెళుతున్నారు. హఠాత్తుగా ఎదురుగా ఒక ఎద్దు రంకె వేస్తూ వేగంగా వస్తోంది. ఒక శిష్యుడు పరుగెత్తి, సురక్షితమైన చోటికి చేరుకున్నాడు. ముల్లర్ అనే శిష్యురాలు మాత్రం పరుగెత్తలేక పడిపోయింది. ఎద్దు నుంచి ఆమెను రక్షించాలని స్వామీజీ, ఆమెకు అడ్డుగా నిలబడ్డారు.

ఎద్దు వేగంగా వచ్చి వాడియైన కొమ్ములతో తనను చీల్చనున్న ఆ క్షణంలో కూడా స్వామీజీ నిశ్చలంగా నిలబడి , 'ఈ ఎద్దు తన కొమ్ములతో అమాంతం ఎత్తి విసిరేస్తే నేను ఎన్ని అడుగుల దూరంలో పడతాను?' అని తనలో తాను అనుకున్నారు. కానీ ఆవేశంతో వస్తున్న ఆ ఎద్దు స్వామీజీని చూడగానే హఠాత్తుగా ఆగిపోయింది. ఒకసారి స్వామీజీని తేరిపార చూసి, తన దారిన తాను వెళ్ళిపోయింది. ❖



ప్రకాశం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 'వివేకానంద రథం' పర్యటన వివరాలు:

2013 సెప్టెంబర్ 1-3 కనిగిరి; 4-గిద్దలూరు; 5,6 మార్కాపురం; 7-దరిసి; 8-పూనూరు; 9-ఇంకొల్లు; 10- చీరాల; 11-ఉప్పుగుండూరు; 12,13 ఒంగోలు; 15,16 మిర్యాలగూడ; 17,18 నేరేడుచర్ల, హుజూర్‌నగర్; 19,20 కోదాడ; 21,22 మునగాల, సూర్యాపేట; 23-కేతేపల్లి, నకిరేకల్; 24-చౌటుప్పల్, చిట్యాల, 25,26 నార్కట్‌పల్లి, నల్లగొండ; 27-దేవరకొండ; 28-కల్వకుర్తి; 29- అచ్చంపేట; 30-నాగర్‌కర్నూలు, పాలెం, బిజినేపల్లి.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

అక్టోబర్ 2013

₹10





సుబోధ

భక్తుడు: భగవద్దర్శనం ఎందుకు కలగడం లేదు?

శ్రీరామకృష్ణులు: పాండిత్యం, పేరుప్రతిష్ఠలు, ప్రతిఫల కోసం ఆరాటపడుతున్నావు కదా! అందుకే భగవద్దర్శనం కలగడం లేదు. పసిబిడ్డ పాలపీకను చీకుతూ ఉన్నంత వరకు తల్లి అక్కడకు రాదు. ఎప్పుడైతే పాలపీకను ఆవల పారేసి బిడ్డ ఏడుస్తాడో అప్పుడు తల్లి పరుగున వస్తుంది.

నువ్వు వ్యాజ్యాలు పరిష్కరిస్తూ తిరుగుతున్నావు. అందువల్ల అమ్మ 'పోనీలే! నా కుమారుడు వ్యాజ్యాలు పరిష్కరిస్తూ ఆనందంగా ఉన్నాడు, అలాగే ఉండనీ' అని భావిస్తుంది.

భక్తుడు: నేను ఇష్టపడి ఈ పనులు చేయడం లేదు.

శ్రీరామకృష్ణులు: నాకు తెలుసు. ఇది జగన్మాత ఆడుతున్న ఆట. సంసారంలో బంధించి ఉంచడమే మహామాయి ఇచ్ఛ. ఎలాగో తెలుసా? లక్ష మందిలో ఏదో ఒకరిద్దరు మాత్రమే ముక్తులవుతున్నారు. మిగిలినవారంతా బద్ధజీవులై ఉన్నారు.

మరో విషయం - పెద్ద అంగళ్ళలో బియ్యం, పప్పు దినుసులను పెద్ద రాశులుగా పోసి ఉంచుతారు. వాటిని ఎలుకలు తినకుండా ఉండడానికి వ్యాపారి ఒక తట్టలో చక్కెరతో కలిపిన మరమరాలు ఉంచుతాడు. దాని తీపిదనం ఎలుకలకు ఎంతో ఇష్టం. కనుక ఎలుకలు ఆ తట్ట వైపునకే వెళతాయి తప్ప బియ్యపు రాశుల దగ్గరకు వెళ్ళవు. అలాగే మానవులు కామినీ కాంచనాలలోనే అభిరుచి కలిగి ఉండడం వల్ల భగవంతుడిని గురించి తెలుసుకోరు.

భక్తుడు: భగవంతుడి పట్ల భక్తిని ఎలా పెంపొందించుకోవాలి?

శ్రీరామకృష్ణులు: భగవన్నామాన్ని జపించడం ద్వారా ఇంద్రియ సుఖాల పట్ల ఆసక్తి తొలగిపోయి, భగవంతుని పట్ల అనురక్తి కలుగుతుంది.

భక్తుడు: భగవన్నామం పట్ల రుచి ఎలా కలుగుతుంది?

శ్రీరామకృష్ణులు: 'నీ నామం పట్ల రుచి జనించేలా చేయ'మంటూ వ్యాకులతతో భగవంతుణ్ణి ప్రార్థించాలి. ఆయన తప్పక ఆ మనోవాంఛితాన్ని నెరవేరుస్తారు. మనుష్యులకు ప్రాపంచికత అనే సన్నిపాత జ్వరం వచ్చింది. భగవన్నామం పట్ల రుచి ఏర్పడితే ఆ జ్వరం పోతుంది. కాబట్టి భగవన్నామం పట్ల అభిరుచిని అలవరచుకోవాలి.

దుర్గ, కృష్ణ, లేక శివ - ఇలా ఏదో ఒక భగవన్నామ స్మరణ ద్వారా భగవంతుని పట్ల అనురాగం దినదినాభివృద్ధి చెంది, హృదయం ఆనందంతో నిండిపోయినట్లయితే ఇక దేనికీ భయపడాల్సిన అవసరం లేదు. ప్రాపంచికత అనే సన్నిపాత జ్వరం అదృశ్యమవుతుంది. భగవంతుడి కృప తప్పక వర్షిస్తుంది. ❖

శ్రీరామకృష్ణ ప్రభ
రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు-500 029
ఫోన్: 040-27667799, మొబైల్: 8801849494
E-mail: sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద**   సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 70 సంచిక: 10 అక్టోబర్ 2013




శరణ్యే వరేణ్యే సుకారుణ్య మూర్తే
హిరణ్యోదరాద్యై రగణ్యే సుపుణ్యే ।
భవారణ్య భీతే శ్చ మాం పాహి భద్రే
నమస్తే నమస్తే నమస్తే భవాని ॥

దయామూర్తివైన ఓ తల్లీ! సర్వలోకాలకు శ్రేష్ఠమగు శరణ్య (ఆధార)ము కాదగినదానవు నీవే. బ్రహ్మాది దేవతలకు కూడా అనంత పుణ్యాలను ప్రసాదించేదానవు నీవే! ఈ సంసార మహారణ్య భయం నుండి నన్ను రక్షించు. నీకు నమస్కారాలను అర్పిస్తున్నాను.

– భవానీ భుజంగ స్తోత్రమ్

స్మృతిపథంలో స్ఫూర్తిప్రదాత








"స్వామి వివేకానంద జయంత్యుత్సవాల (1921 ఫిబ్రవరి 6వ తేదీ) సందర్భంగా స్వామీజీని స్మరించి నా గౌరవాభివందనాన్ని సమర్పించడానికి ఈ బేలూరు మఠానికి విచ్చేశాను. స్వామీజీ గ్రంథాల్ని క్షుణ్ణంగా పఠించాను. అవి చదివిన తరువాత మాతృదేశం పట్ల నాకున్న ప్రేమ వెయ్యి రెట్లు అధికమైంది.

స్వామి వివేకానంద జీవించిన ఈ పవిత్ర స్థలపు శక్తిని స్వాయత్తం చేసుకొని వెళ్ళండి. అంతేగానీ రిక్త హస్తాలతో, శూన్యహృదయాలతో వెనుదిరగకండి. ఇక్కడ సమావేశమైన యువకులకు ఇదే నా సందేశం." ❖ *– మహాత్మా గాంధీ*


"నా విద్యార్థి దశలో స్వామి వివేకానందుని ఉపన్యాసాలను చదివి ఎంతో స్ఫూర్తి పొందాను. ఆ స్ఫూర్తిదాయక ప్రసంగాలు నా మనస్సుపై చెరగని ముద్ర వేశాయి. నా ఆలోచనా సరళినీ, నా జీవిత దృక్పథాన్నీ పూర్తిగా మార్చివేశాయి. మహా ఋషి, తత్త్వవేత్త అయిన స్వామీజీ నిద్రాణమై ఉన్న భారత జాతిని తమ బోధలతో మేలుకొల్పారు.

'ఇది నా తలరాత, ఇది నా దురదృష్టం అనే ధోరణి వదిలి, భారతీయులు కార్యోన్ముఖులు కావాల'ని బోధించారు. లక్షల మంది పేద ప్రజలు ఆకలితో అలమటిస్తుంటే, ధనవంతులు భోగభాగ్యాలను అనుభవిస్తూ సుఖంగా జీవించడాన్ని స్వామీజీ ఖండించారు." ❖

– లాల్ బహదూర్ శాస్త్రి



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు........... రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................ రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: శ్రీ ఎం.వి. కృష్ణారెడ్డి, కూకట్‌పల్లి, హైదరాబాద్ (కీ॥శే॥ మాలె పెదచెంచురెడ్డి గారి జ్ఞాపకార్థం)	10,000
రాజ పోషకులు	: శ్రీమతి లక్ష్మి తమ్మారెడ్డి, పటమట లంక, విజయవాడ - 520 010	8,500
పోషకులు	: శ్రీ ఆకుల మహేశ్వర్ రావు, మట్టెవాడ, వరంగల్ (కీ॥శే॥ ఆకుల కనకమ్మ, అయిలయ్య గార్ల జ్ఞాపకార్థం)	3,000
పోషకులు	: శ్రీ గుమ్మళ్ళ వీర్రాజు, వేట్లపాలెం, సామర్లకోట, తూర్పు గోదావరి జిల్లా - 533 434	1,116
పోషకులు	: శ్రీ ఎన్.ఎల్. నరసింహారావు, విష్ణుపురి, కాజీపేట, వరంగల్ (కీ॥శే॥ ఎన్.ఆర్.కె. మూర్తి, జగన్నాథమ్మ గార్ల జ్ఞాపకార్థం)	1,001
పోషకులు	: శ్రీ సిహెచ్. నరసింహారావు, ఆర్.కె.పురం, సికింద్రాబాద్ - 500 056	1,000
పోషకులు	: శ్రీ మహేశ్వరం సుభాష్‌రెడ్డి, దమ్మన్నపేట, వరంగల్ జిల్లా (కీ॥శే॥ పెదరాజిరెడ్డి గారి జ్ఞాపకార్థం)	1,000
పోషకులు	: శ్రీ యండమూరి సత్యానందరావు, ప్రతాపనగర్, కాకినాడ - 533 004	1,000
పోషకులు	: శ్రీ వి. కేశవనాయుడు, వెంకటరెడ్డి కాలనీ, ఎస్.టి.వి. నగర్, తిరుపతి	1,000
పోషకులు	: శ్రీమతి పత్తి శారదాదేవి, బెస్తపాలెం, బాపట్ల, గుంటూరు జిల్లా (కీ॥శే॥ పోతురాజు అంజయ్య గారి జ్ఞాపకార్థం)	1,000
పోషకులు	: శ్రీమతి కె. పద్మ, మధురానగర్, యూసఫ్‌గూడ, హైదరాబాద్	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1500/-, అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ ఎస్.వి. కులకర్ణి, చిక్కడపల్లి, హైదరాబాద్	ప్రకాశం జిల్లాలోని 11 పాఠశాలలకు 5 సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీమతి బి. శ్రావణి	ప్రకాశం జిల్లాలోని 4 పాఠశాలలకు 5 సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ వి. శ్రీనివాస్, దోమల్‌గూడ, హైదరాబాద్ (కీ॥శే॥ సాంక్య నాయక్ జ్ఞాపకార్థం)	ప్రకాశం జిల్లాలోని 3 పాఠశాలలకు 5 సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీ జి. విద్యానాథ్, అర్రూర్, సదాశివపేట్, మెదక్ జిల్లా	ప్రాథమికోన్నత పాఠశాల, అర్రూర్, మెదక్ జిల్లా
శ్రీమతి పి. ప్రమీలా సుబ్బారావు	ప్రాథమికోన్నత పాఠశాల, ఈస్ట్ కొప్పెరపాడు, రావినూతల, ప్రకాశం జిల్లా
శ్రీ ఎన్. వసంత కుమార్, మౌలాలీ రైల్వే క్వార్టర్స్, హైదరాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చిన్న గంజామ్, ప్రకాశం జిల్లా
శ్రీ యల్లపు వి. రమణ, రైల్ నిలయం, సికింద్రాబాద్	శ్రీసరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల, ఖైరతాబాద్, హైదరాబాద్
బాలాజీ ట్రేడింగ్ కో., తాడ్‌బన్, హైదరాబాద్	ప్రకాశం జిల్లాలోని 11 పాఠశాలలకు 5 సంవత్సరాలకు స్పాన్సర్ చేశారు.
శ్రీమతి ఆర్.వర్ధనీలక్ష్మి, కానాజిగూడ, సికింద్రాబాద్ (కీ॥శే॥ సామ్రాజ్య మహాలక్ష్మి జ్ఞాపకార్థం)	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గౌరాయిపల్లి, నల్లగొండ జిల్లా
శ్రీ కె. దేవేంద్ర రెడ్డి, చంగల్, వరంగల్ జిల్లా	ప్రభుత్వ ఉన్నత పాఠశాల, చంగల్, వరంగల్ జిల్లా
శ్రీ పి. కృష్ణారావు, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొట్లభద్ర, శ్రీకాకుళం జిల్లా
శ్రీ నందీశ్వర్ రెడ్డి, నారాయణ్‌ఖేడ్ సర్కిల్, మెదక్ జిల్లా	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంచాల, రంగారెడ్డి జిల్లా

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలలో
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	₹ 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1500	$ 365

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో **Ramakrishna Math, Hyderabad** అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా:
Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

ఈ సంచికలోని రచయిత(త్రు)ల అభిప్రాయాలు వ్యక్తిగతమైనవి. సంపాదకులు గానీ, హైదరాబాద్ రామకృష్ణ మఠం గానీ వాటికి బాధ్యత వహించజాలరు. - సంపాదకులు

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే (పోస్టల్ పిన్‌కోడ్‌తో సహా) వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
DOMALGUDA, HYDERABAD - 500 029. Andhra Pradesh
Phone No: 040- 27667799, 8801849494 E-mail : sriramakrishnaprabha@gmail.com

సంపాదకీయం

విశ్వేశ్వరి మార్గదర్శనంలో వివేకానంద





"సృష్టి, స్థితి, లయాలను నిర్వహించే అనంతశక్తి స్వరూపిణి జగన్మాతే! ఈ జగత్తుగా మూర్తీభవించిన నిత్య స్వరూపిణి ఆ జగన్మాతే" అని అఖిల జగత్తుకూ ఆధార భూతమైన ఆదిపరాశక్తి గురించి 'దేవీ మాహాత్మ్యం' వర్ణిస్తోంది.

శ్రీరామకృష్ణులు కూడా జగన్మాత లీలావిలాసాన్ని వర్ణిస్తూ "ఈ విశ్వమంతా వ్యాపించి ఉన్నది ఆ విశ్వేశ్వరే! ఈ జీవజగత్తులో అమ్మ అనంతశక్తి అనేక రూపాలుగా అభివ్యక్తమవుతోంది. వేదాంతులు నిర్గుణ, నిరాకార బ్రహ్మమని పిలిచేది నా జగన్మాతనే; యోగులు సగుణ, సాకార బ్రహ్మమని పిలిచేది నా జగన్మాతనే. అమ్మ అనుగ్రహం ఉంటేనే మోక్ష ద్వారాలు తెరుచుకుంటాయి" అని అన్నారు.

శ్రీరామకృష్ణుల అద్వైత గురువైన తోతాపురి మొదట సగుణ, సాకార తత్త్వాన్ని నిరాకరించారు. జగన్మాతే విశ్వాధార మనీ, మూర్తీభవించిన విశ్వమనీ గ్రహించని తోతాపురిని చివరకు నిర్గుణబ్రహ్మం, సగుణబ్రహ్మం - ఈ రెండూ ఆ జగన్మాతే అని విశ్వసించేలా చేశారు శ్రీరామకృష్ణులు.

సర్వవ్యాపి అయిన సర్వేశ్వరిని దర్శించాలంటే ఆమె పరచిన మోహభ్రాంతులనే మాయావలయాన్ని ఛేదించాలి. జగన్మాత అనుగ్రహం లేనిదే జ్ఞానులకైనా అది సాధ్యం కాదు.

జ్ఞానినా మపి చేతాంసి దేవీ భగవతీ హి సా ।
బలాదాకృష్య మోహాయ మహామాయా ప్రయచ్ఛతి ॥
సైషా ప్రసన్నా వరదా నృణాం భవతి ముక్తయే । (దేవీ మాహాత్మ్యం)

'మహాజ్ఞానులను కూడా మోహగ్రస్థులను చేసే మహా మాయాశక్తి ఆ దేవే. అమ్మ అనుగ్రహం ఉంటేనే సమ్మోహనం తొలగి ముక్తి లభిస్తుంది'.

మోహనాశిని... మోక్షదాయిని!: ఈ ప్రపంచంలో మన దుఃఖాలకు మోహమనే పాశమే కారణం. మనం ఎప్పుడైతే మోహపాశాన్ని తొలగించుకుంటామో అప్పుడే మనకు చిరశాంతి, ముక్తి లభిస్తాయి. అయితే జగన్మాత మనల్ని మోహపాశాలతో బంధించి తన లీలానాటకాన్ని కొనసాగిస్తోంది. ఈ ఆట నుండి విరమించాలంటే బంధముక్తులను చేయమంటూ అమ్మనే శరణు వేడాలి. మోక్షమార్గాన్ని తెలిపే 'దేవీ మాహాత్మ్యం'లోని ఓ కథను తెలుసుకుందాం:

సురథుడు అనే మహారాజు యుద్ధంలో పరాజయం పాలై శత్రువుల బారి నుండి తప్పించుకోవడానికి అడవులకు పారిపోయాడు. భార్యాపుత్రులచే ఇంటి నుండి వెడలగొట్ట బడిన సమాధి అనే వ్యాపారి కూడా అడవులకు పారిపోయాడు. అలా సురథుడు, సమాధి అడవిలో కలుసుకున్నారు. రాజ్యం పైన మమకారంతో సురథుడు; భార్యాపుత్రులపై మోహం వల్ల సమాధి దుఃఖితులయ్యారు. ఆ ఇద్దరూ తమ దుఃఖానికి హేతువు ఏమిటో తెలుపమని అరణ్యంలో తపస్సు చేస్తున్న సుమేధ అనే మహర్షి దగ్గరకు వెళ్ళి ప్రాధేయపడ్డారు.

అప్పుడు ఆ మహర్షి **"మమతావర్తే మోహగర్తే నిపాతితాః, మహామాయా ప్రభావేణ సంసార స్థితికారిణా** - ఈ విశ్వాన్ని పాలించే జగన్మాత మహామాయ ప్రభావం వల్ల మానవులు మమత అనే సుడిగుండంలో చిక్కుకుపోతున్నారు; మోహమనే లోయలో పడి కొట్టుకుంటున్నారు" అని దుఃఖానికి కారణాన్ని వివరించాడు. 'జ్ఞానస్వరూపిణి అయిన జగన్మాతను శరణు వేడితే మోహపాశాలను తొలగించి ముక్తిని ప్రసాదిస్తుంది' అని మోక్షమార్గాన్ని బోధించాడు. మహర్షి బోధించిన ప్రకారం సురథుడు, సమాధి జగన్మాతను ప్రార్థించారు. దుఃఖహేతువైన మోహపాశాల నుండి విముక్తులై, శాశ్వతానందాన్ని పొందారు.

నరేంద్రుడు తండ్రి మరణానంతరం తన కుటుంబం దారిద్ర్యంతో బాధపడుతున్నప్పుడు ఎన్నో ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. కానీ అవన్నీ విఫలమయ్యాయి. అప్పుడు నరేంద్రుడు తల్లి, సోదరీ సోదరుల దీనస్థితిని చూడలేక శ్రీరామకృష్ణుల దగ్గరకు వెళ్ళి 'మా కుటుంబ కష్టాలను తీర్చమంటూ మీరు జగన్మాతను ప్రార్థించండి' అని వేడుకున్నాడు. అందుకు

శ్రీరామకృష్ణులు 'నువ్వు అమ్మను అంగీకరించలేదు. అందువల్లనే నీకీ కష్టాలన్నీ సంభవించాయి. నువ్వే అమ్మను ప్రార్థించు. ఆ దయామయి నువ్వు కోరినదాన్ని తప్పక ప్రసాదిస్తుంది' అని సూచించారు.

శ్రీరామకృష్ణుల సలహా మేరకు నరేంద్రుడు కాళి కాలయానికి వెళ్ళి, జగన్మాతను ప్రాపంచిక సంపదను కోరకుండా, మోహపాశాన్ని తొలగించే ఆధ్యాత్మిక సంపదైన జ్ఞాన, భక్తి, వైరాగ్యాలను ప్రసాదించాల్సిందిగా అర్థించాడు. అందువల్లనే స్వామీజీ ఏ బంధమోహాలూ లేకుండా ఈ ప్రపంచంలో నిత్యముక్తుడిగా జీవించారు.

జగన్మాతను శరణు వేడితే మోహపాశాలను తొలగిస్తుందనీ, మోక్ష ద్వారాలను తెరచే జ్ఞాన వైరాగ్యాలను ప్రసాదిస్తుందనీ సురథ – సమాధుల కథ, స్వామీజీ జీవితంలోని సంఘటనలే నిదర్శనం.

మూడు శక్తుల మూలపుటమ్మ: మనం ఏ కార్యం నిర్వహించాలన్నా మూడు శక్తులు అవసరం. అవి – పని చేయడానికి సంకల్పం – 'ఇచ్ఛాశక్తి'; సంకల్పం కార్యరూపం దాల్చడానికి – 'క్రియాశక్తి'; కార్యనిర్వహణా విధానానికి – 'జ్ఞానశక్తి'. ఈ మూడు శక్తులకూ మూలం ఆదిపరాశక్తి. అమ్మకు చెందిన ఈ మూడు శక్తులూ మన ద్వారా వ్యక్తమైనప్పుడే మనం ఏ కార్యాన్నైనా సాధించగలం. కానీ అమ్మ అనంత శక్తితో మనల్ని మనం అనుసంధానం చేసుకోలేక, అజ్ఞానానికి లోనై మన శక్తియుక్తుల వల్లనే అన్నీ సాధ్యమవుతున్నాయని భ్రమిస్తున్నాం. జగన్మాత సంకల్పం లేకుండా గడ్డిపోచ కూడా కదలదు అన్న సత్యాన్ని గ్రహించిన శ్రీరామకృష్ణులు – 'అమ్మా! నేను యంత్రాన్ని, నువ్వు యంత్రాన్ని నడిపించేదానవు' అని జగన్మాత పట్ల సంపూర్ణ సమర్పణ భావంతో జీవించారు.

ఇంద్రాది దేవతలు తమ విజయాలకు కారణం తమ శౌర్యప్రతాపాలు, ప్రతిభే కారణం అని భ్రమించినప్పుడు, జగన్మాత వారికి కనువిప్పు కలిగించిన వృత్తాంతం 'కేనోపనిషత్తు'లో ఇలా వర్ణితమైంది:

దేవదానవుల మధ్య జరిగిన యుద్ధంలో దేవతలు విజయం సాధించారు. ఆ విజయానికి కారణం వారి శక్తిపరాక్రమాలే అని ప్రగల్భాలు పలుకుతున్నప్పుడు, మహా తేజోరూపంతో యక్షుడు అక్కడ ప్రత్యక్షమయ్యాడు. యక్షుడు అక్కడ ఉన్న అగ్ని, వాయు, ఇంద్రాది దేవతల ముందు ఒక గడ్డిపోచను ఉంచి, 'మీ మీ శక్తులను ఉపయోగించి దీన్ని అంతం చేయండి' అన్నాడు.

అప్పుడు అగ్నిదేవుడు తన సర్వశక్తినీ ప్రయోగించినప్పటికీ గడ్డిపోచను దహించలేకపోయాడు. అలాగే వాయుదేవుడు కూడా తన సంపూర్ణ శక్తిని ఉపయోగించినా ఆ గడ్డిపోచను ఇసుమంతైనా కదల్చలేకపోయాడు.

ఆశ్చర్యానికి లోనైన ఇంద్రుడు ఆ యక్షుడు ఎవరో తెలుసుకోవాలనుకున్నాడు. అప్పుడు యక్షుని స్థానంలో ఉమాదేవి ప్రత్యక్షమైంది. దాంతో, ఈ విశ్వంలో సకల కార్యసాధనకూ మూలశక్తి జగన్మాతే అనీ, ఆమె సంకల్పం లేనిదే ఏదీ సాధ్యం కాదనీ దేవతలు గ్రహించారు.

అలాగే, ఈ చరాచర సృష్టిలో ఏదైనా జగన్మాత ఇచ్ఛానుసారమే జరుగుతుందని తెలియజేసే స్వామీజీ జీవితంలోని సంఘటనను గుర్తు చేసుకుందాం:

స్వామి వివేకానంద శ్రీనగర్‌లోని క్షీరభవానీ ఆలయానికి వెళ్ళారు. మొఘలాయిల దండయాత్రలో శిథిలమైపోయిన ఆ ఆలయాన్ని చూసి, "నేనే గనక అప్పుడు ఉండివుంటే – నా ప్రాణాన్ని అర్పించైనా ఈ దుష్కార్యాన్ని నిరోధించి, జగన్మాత ఆలయాన్ని పరిరక్షించేవాడిని... ఈ శిథిలావస్థలో ఉన్న దేవాలయానికి బదులు ఓ నూతన దేవాలయం నిర్మిస్తే బాగుంటుంది" అని తనలో తాను అనుకున్నారు. స్వామీజీ మనస్సులో ఆ ఆలోచన రాగానే "నాయనా! నేను నిన్ను రక్షిస్తున్నానా? నువ్వు నన్ను రక్షిస్తున్నావా? నేను సంకల్పిస్తే క్షణకాలంలో ఏడు అంతస్తుల స్వర్ణదేవాలయాన్ని నిర్మించుకోగలను" అని జగన్మాత తన ఇచ్ఛాశక్తిని స్వామీజీకి తెలియజేసింది. అప్పుడు స్వామీజీ దిగ్భ్రాంతి చెంది, "అమ్మా! అజ్ఞానంతో మాట్లాడిన నన్ను మన్నించి, అనుగ్రహించు తల్లీ!" అని పసివాడిలా విలపించారు.

అమ్మమయం స్వామీజీ జీవితం: సర్వం జగన్మాత సంకల్పానుసారమే జరుగుతుందని స్వామీజీ దృఢంగా విశ్వసించి, సంపూర్ణ శరణాగత భావంతో జీవించారు. సర్వత్రా జగన్మాతను దర్శించేవారు. ఒకసారి స్వామీజీ తన అనుభవాన్ని తెలుపుతూ "రాత్రి పడుకొన్న కాసేపటికల్లా నాకు జగన్మాత దర్శనమయ్యేది. ఈ చరాచర సృష్టి అంతా దివ్యచైతన్యంతో నిండివున్నట్లు అనుభూతమయ్యేది. జగన్మాత సర్వత్రా కొలువై ఉంది" అని అన్నారు.

సాక్షాత్తూ జగన్మాతే తన ద్వారా సకల కార్యాలనూ నిర్వహించిందని చెబుతూ, "శ్రీరామకృష్ణులు మహాసమాధి చెందడానికి రెండు రోజుల ముందు కాళీమాత నా శరీరంలో ప్రవేశించింది. నా దేహం ద్వారా అమ్మ ఏయే పనులు చేయగోరిందో అవన్నీ పూర్తి చేయించింది. ఇప్పుడు అమ్మ నా నుండి వైదొలగింది" అని తన అవతార నిష్క్రమణకు ముందు స్వామీజీయే స్వయంగా అన్నారు.

విశ్వేశ్వరి అనుగ్రహంతో విశ్వారాధ్యుడైన వివేకానంద నడచిన బాటలో పయనిద్దాం. మనకూ జ్ఞాన, భక్తి, వైరాగ్యాలను ప్రసాదించాల్సిందిగా ఆ జగన్మాతను ప్రార్థిద్దాం. మోక్ష సామ్రాజ్యానికి అర్హతను సాధిద్దాం. ❖

భగవంతుడు విశ్వమంతటా వ్యాపించి ఉన్న శక్తిస్వరూపమనీ, స్త్రీలు ఆ శక్తికి ప్రతిరూపాలనీ భావించేవాడే నిజమైన 'శక్తి ఆరాధకుడు'. స్త్రీలను గౌరవించని దేశం గొప్పది కాలేదు. - స్వామి వివేకానంద

గోరుముద్ద - స్వామి సుప్రియానంద

సనాతన ధర్మం - సామాజిక స్పృహ

ఒక వస్తువు నాణ్యత ఎలా తెలుస్తుంది? 'బ్రాండ్' పేరు చూసి తెలుసుకోవచ్చని చాలా మంది అనుకుంటారు. కానీ అన్ని సందర్భాలలో ఇది నిజం కాదు. ఎలాగంటే చినిగిన చొక్కా వేసుకున్న వ్యక్తిని చూసి, ఎవరైనా ఆ చొక్కా గురించి ప్రస్తావించినప్పుడు అతడు 'చూడవోయ్! నా చొక్కా బ్రాండ్!' అని గొప్పగా మీసాలు మెలేస్తే ఉపయోగం ఏముంటుంది!

హిందూమతం గొప్పది. హిందువులంతా గొప్పవాళ్ళవడానికి అవకాశం ఉంది. అది ఎప్పుడంటే బ్రాండ్ పేరు చెప్పుకొని మురిసిపోకుండా వాస్తవికతను అర్థం చేసుకున్నప్పుడు!

ఒకసారి కొంత మంది పెద్దలు రామకృష్ణ మఠ స్వామీజీ ఒకరిని ఒక సభకు ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. అది ఒక పాఠశాల ప్రాంగణం. సభకు చాలా మంది హాజరయ్యారు. వక్తలు ఒకరి తరువాత ఒకరు హిందూ మతం గొప్పతనాన్ని నొక్కి వక్కాణించారు. మన మతాన్ని పరిరక్షించుకోవాలంటూ ఎన్నో సూచనలిచ్చారు. చివరకు స్వామీజీని మాట్లాడమన్నారు. ఆయన తాపీగా లేచి నిలబడి మైకు చేతబుచ్చుకుని నెమ్మదిగా ఇలా అన్నారు:



"మీరందరూ హిందూమతం ఔన్నత్యాన్ని చక్కగా వివరించినందుకు ఒక పక్క సంతోషంగా ఉన్నప్పటికీ, మరొక పక్క వాస్తవికతను అర్థం చేసుకోవడానికి ఏ ఒక్కరూ ప్రయత్నించడం లేదన్న బాధ కలుగుతోంది. ప్రతి రోజూ మన పిల్లలు ఎంతోమంది ఈ పాఠశాలలో చదువుకోవడానికి వస్తున్నారు. ఈ పాఠశాలలో వారు అడుగు పెట్టే ముందు వారికి మొదట దర్శనమయ్యేది పక్కనున్న సారాయి దుకాణం. ఆ లేత మనసుల్లో కలిగే 'మార్పు' గురించి మనం ఎవరమైనా ఆలోచిస్తున్నామా? వారిని రక్షించుకోవలసిన బాధ్యత మనది కాదా?"

యా దేవీ సర్వభూతేషు శక్తి రూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥
యా దేవీ సర్వభూతేషు మాతృ రూపేణ సంస్థితా ।
నమస్తస్యై నమస్తస్యై నమస్తస్యై నమో నమః ॥

'సర్వ జీవులలో శక్తి స్వరూపమై నెలకొని ఉన్న దేవికి వందనాలు. సర్వ జీవులలో మాతృస్వరూపమై నెలకొని ఉన్న దేవికి వందనాలు' అని స్తుతిస్తాం.

కానీ సమాజంలో స్త్రీలకు కలిగే అవమానాలు, ఇబ్బందుల గురించి మాత్రం పట్టించుకోం. ఉదాహరణకు మన దేవాలయాలలో స్వామివారి అభిషేక జలం భక్తులకు సులభంగా అందడానికి పాలరాతి 'తూములు' నిర్మిస్తాం. కానీ స్కూలుకు వెళ్ళే మన ఆడపిల్లలు టిఫిన్ బాక్స్‌తో తీసుకువెళ్ళే మంచినీళ్ళ బాటిల్ యథాతథంగా ఇంటికి తెచ్చినప్పుడు ఎందుకు వారు సరిగ్గా మంచి నీళ్ళు తాగడం లేదో అడిగి తెలుసుకోవడానికి మనం ప్రయత్నించం. పాఠశాల యాజమాన్యం 'కంప్యూటర్ సెంటర్' మీద చూపించే శ్రద్ధ స్కూల్లో ఉండే 'మరుగుదొడ్ల' మీద చూపించక పోవడమే దానికి కారణమన్న విషయం మనం తెలుసుకోవాలి.

మన సనాతనధర్మం బోధించిన విలువలను అర్థం చేసుకొని వాటిని ఆచరించినప్పుడు, సామాజిక స్పృహతో వ్యవహరించినప్పుడు మనమూ గొప్పవాళ్ళమవుతాం. ❖



ఇగిరిపోని గంధం

– హేమంత్ కుమార్

ప్రేమించడం తెలిస్తే జీవితంలో విజయం సాధించినట్లే. ప్రేమ రాహిత్యం జీవితాన్ని నిర్వీర్యం చేస్తుంది. రసం ఇగిరిపోయిన చెట్టులా నిస్తేజం అయిపోతుంది. ప్రేమ అనేది పరిధి ఎరుగని ఒక భావం. ఒక మధురమైన అనుభూతి. రసప్లావితమైన హృదయ సౌందర్యం. ఈ లోకంలో ఎవరికైనా ఏ వస్తువైనా, ఏ ధనమైనా, ఏ అధికారమైనా... ఇలా ఏదైనా మోహం మొత్తవచ్చు. ప్రేమ విషయంలో దానికి మినహాయింపు ఉంది. ప్రేమను నిరాకరించే వాళ్ళు ఎవరూ ఉండరు (అర్థంలేని, ఉబుసు పోని... ప్రేమలనుకునే వ్యవహారాలను తప్ప).

ఎందుకంటే అది దైవీ భావం. ఎవరికీ ఎలాంటి హానీ చేయని హితకరమైన మధుర స్పందన. మనుషులే కాదు. పశుపక్ష్యాదులు, చెట్లూచేమలు కూడా ప్రేమను ఆస్వాదిస్తాయి. గర్భస్థ శిశువు తన పట్ల తల్లి భావనలనూ, ఆనందాన్నీ, శ్రేయోకామననూ గ్రహిస్తుంది.

ఎలాగంటే ప్రేమప్రసారం చాలా సులువు. సానుకూలం. పశుపక్ష్యాదులు తమను ప్రేమించే వారికి ప్రాణాలను సైతం ఇవ్వగలిగినంత విశ్వాసాన్ని కలిగివుంటాయి. (నిజానికి మనుషుల కన్నా అవే ప్రేమను స్పష్టంగా, పూర్తిగా గ్రహిస్తాయి. ఎందుకంటే వాటికి భేషజాలు ఉండవు. అంతస్తులు, లాభనష్టాలను అవి బేరీజు వేసుకోవు.) చెట్లు తమను ప్రేమించేవారి స్పర్శతో ప్రఫుల్లమైపోతాయి. పెంచేవారి ప్రేమ నిండిన చూపులతోనే భావాన్ని గ్రహించి, ద్విగుణీకృతంగా పుష్పిస్తాయి. ఫలిస్తాయి.

ప్రేమ ఒక ఆశ్వాసననిస్తుంది. భయరాహిత్యాన్ని కలిగిస్తుంది. అభయాన్నిస్తుంది. ఒక జీవికి ఇంతకన్నా ఏం కావాలి? మనం కూడా ప్రేమను ఆశిస్తాం. ఆహ్వానిస్తాం. ఆనందిస్తాం. చతురాశ్రమాల్లో మనం ఏ ఆశ్రమవాసులమైనా అవనీగాక. మనకు ప్రేమ కావాలి. ప్రేమే మనకు శ్వాస. జీవజాలం దేనికైనా ప్రేమ అనే ప్రాణవాయువు కావాలి.

అంతెందుకు... ఒక రాయిని సైతం మనం ఆప్యాయంగా స్పృశిస్తే, ప్రేమగా చూస్తే, ప్రేమిస్తే ప్రాణం పోసుకోదా? ప్రేమతో సంగీతం ఆలపిస్తే శిల కూడా కరుగుతుంది కదా! ప్రేమకు స్పందించని హృదయం ఉంటుందా? అది లేని వస్తుజాలంలో సైతం హృదయం పొటమరించి స్పందించదా? రసాలూరదా? 'శిలలోని జల' అదే కదా! ఇన్ని మాటలెందుకు? దేవుడికి కావలసింది ప్రేమే. అదే ఆయన ప్రధాన పూజా ద్రవ్యం.

నిజానికి రసం ఉంటేనే స్పందన. స్పందనే జీవం. జీవం అన్నా, ప్రాణం అన్నా ప్రేమే. ప్రేమ ఉంటేనే ఒక నవ్వు చిగురిస్తుంది. ఒక పువ్వు వికసిస్తుంది. భగవంతుడు సృష్టి చేసిన కారణం ప్రేమే. సృష్టి మొత్తాన్నీ అకారణంగా (అహేతుకంగా) ప్రేమించే కారణమూ ప్రేమే. ఈ సృష్టి మొత్తంలో ఎవరైనా ఎవరికైనా ఇవ్వదగ్గదీ, ఎవరి నుండైనా తీసుకోదగ్గదీ ప్రేమ మాత్రమే. శబరి ఇచ్చిన ఎంగిలి పళ్ళను శ్రీరాముడు స్వీకరించాడంటే ప్రేమే. విదురుడు తొక్క అందించినా అందులో నుంచి శ్రీకృష్ణుడు ఆస్వాదించిందీ ప్రేమే. శివుడికి తిన్నడు పెట్టిన మాంస నైవేద్యంలో ఆయనకు ప్రేమ మాత్రమే కనిపించింది. తన ముందు అణు సదృశం కూడా చేయని భక్తుణ్ణి పల్లకీలో మోసినా, పిండి విసిరినా, పాచిక లాడినా, పాదధూళిని ఔషధంగా స్వీకరించినా మనస్సు మడతల్లో భక్తుడు తన కోసం దాచిన ప్రేమ కోసమే. నారదుడు భక్తిని 'పరమ ప్రేమ'గా నిర్వచించాడు. పరమ ప్రేమ అంటే అతిశయించిన ప్రేమ. కల్మష మెరుగని ప్రేమ. భాష కందని ప్రేమ.

శ్రీరామకృష్ణులు శిష్యులకు అందించిన ప్రేమకు సాటి లేదు. జ్ఞానాన్నీ, ప్రేమనూ ఏక కాలంలో సమతూకంగా పంచారు. శారదామాత ప్రేమతో తొణికిసలాడే తన హృదయాన్ని తన పర భేదం లేకుండా పంచారు. రామకృష్ణులు భౌతికంగా తోడు లేకపోయినా ఆమె బ్రతికివున్న కారణం ప్రపంచ శిశువులకు తల్లిగా మాతృప్రేమను అందించాలనే అతిశయించిన ప్రేమ.

భగవంతుడి ప్రతిరూపం ప్రేమ! అందుకే... ప్రేమిద్దాం. ప్రేమను ఆస్వాదిద్దాం. ❖

బాలురను గురించి ఎంత జాగరూకత వహిస్తున్నామో అంతే జాగరూకత బాలికల పట్ల చూపాలి. వారిని కూడా విద్యావంతులను చేయాలి. అప్పుడే మనకు మేలు కలుగుతుంది. - స్వామి వివేకానంద



గేయం గీతానామ సహస్రం,
ధ్యేయం శ్రీపతి రూప మజస్రమ్ ।
నేయం సజ్జన సంగే చిత్తం,
దేయం దీన జనాయ చ విత్తమ్ ॥

దైవం... ధ్యానం... దానం

– స్వామి జ్ఞానదానంద



శ్రీశుక బ్రహ్మాశ్రమ వ్యవస్థాపకులు, పరమ పూజ్యులు శ్రీవిద్యాప్రకాశానందగిరి స్వామి వారు సన్న్యాసాశ్రమం స్వీకరించక ముందు రోజులవి... అప్పుడు వారి పేరు ఆనంద మోహన్. వారణాసిలో ఉన్నత విద్యాభ్యాసం పూర్తిచేసుకొని భవిష్యత్తు రూపకల్పన విషయంలో మల్లగుల్లాలు పడుతూ, అగమ్యగోచరమైన మానసికస్థితితో మథనపడుతూ ఉన్నారు. గృహస్థాశ్రమమా? వైరాగ్యమార్గమా? అన్న సందిగ్ధంలో ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. అదే సంశయస్థితితో హరిద్వార్‌ను దర్శించుకొని, ఆ తరువాత ఋషీకేశ్ చేరుకున్నారు.

అక్కడ ఓ రోజు ఆనందమోహన్ పడవలో గంగానదిపై సాగిపోతున్నారు. ఇంతలో వారికి ప్రవాహంలో తేలి కొట్టుకు పోతున్న ఓ చిన్న గడ్డికుప్ప అల్లంత దూరంలో కంటపడింది. ‘ఏమిటది?’ అనుకుంటూ వారు తదేకదృష్టితో దానివైపే చూపు సారించారు. ఆ గడ్డికుప్ప చివరకు తన పడవ చెంతకే వచ్చి చేరింది. ఆనందమోహన్ దాన్ని మెల్లగా తన చేతుల్లోకి తీసుకున్నారు. పైకి తీసి, కుప్ప విప్పి చూశారు. చిత్రంగా అందులో దేవనాగరి లిపిలో, కుంకుమతోనూ, పుష్పాలతోనూ పూజించి ఉన్న భగవద్గీత గ్రంథం కనిపించింది.

ఆ పుస్తకం ఆనందమోహన్‌ను ఆనందాశ్చర్యాలలో ముంచెత్తింది. వారి భావిజీవిత గతిని నిర్దేశించింది. సాక్షాత్తూ భగవంతుడే ఆ గ్రంథాన్ని తనకు పంపాడని వారు భావించారు. తన సంశయాలకు స్వస్తి పలికి, సన్న్యాసాశ్రమంలోకి ప్రవేశించారు. శ్రీశుకబ్రహ్మాశ్రమ స్థాపనతో శ్రీవిద్యాప్రకాశా నందగిరి స్వామిగా భగవద్గీత సందేశానికీ, శ్రీమన్నారాయణ నామసంకీర్తనకూ, సమాజ సేవకూ తమ జీవితాన్ని అంకితం చేశారు. ఇలాంటి భగవద్గీత పారాయణం, శ్రీమహావిష్ణు సహస్రనామ సంకీర్తనం సాధారణమైనవి కావని ఈ కలియుగంలో అవి కైవల్య సోపానాలని ఆదిశంకరుల ప్రియశిష్యులు సుమతి ‘భజగోవిందం’ పరంపరగా బోధిస్తూ...

గేయం గీతానామ సహస్రం, ధ్యేయం శ్రీపతి రూపమజస్రమ్ ।
నేయం సజ్జనసంగే చిత్తం, దేయం దీనజనాయ చ విత్తమ్ ॥

“భగవద్గీత, విష్ణుసహస్రనామం పఠించాలి; లక్ష్మీ నారాయణుని రూపాన్ని ధ్యానించాలి; సజ్జన సాంగత్యంలో మనస్సును ప్రవర్తింపజేయాలి. దీనులైన వారికి దానం చేయాలి” అని మనకు నాలుగు ఉపాయమార్గాలను ఉపదేశించారు.

ప్రేరణ...ప్రార్థన: కురుక్షేత్రంలో కిరీటి సమర విముఖుడై విషాదంలో మునిగిన వేళ సారథిగా శ్రీకృష్ణుడు చేసిన జ్ఞానబోధ ‘భగవద్గీత’. అది కేవలం ఫల్గుణుడికే పరమాత్మ చేసిన ప్రబోధం కాదు; యావత్ మానవాళిని మేల్కొలిపేందుకు మధుసూదనుడు పూరించిన శంఖమది. జీవితంలో పట్టుజారే వేళ ప్రేరణగా నిలిచే భగవద్గీతను మించిన అక్షరబంధువు మరొకటి లేదు. అంపశయ్యపై ఆఖరి క్షణాలు గడుపుతున్న ఘడియల్లో భీష్మాచార్యులు, సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు అవతారమైన శ్రీకృష్ణుడిని వేయినామాలతో స్తుతించాడు. అదే ‘విష్ణుసహస్రనామం’. అందులో ఒక్కో నామం ఒక్కో మంత్రశక్తి సమన్వితం.

షిరిడీ సాయిబాబా తన భక్తుడైన శ్యామాతో, “శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం ఎంతో శక్తిమంతమైంది. ఒకప్పుడు నాకు

గుండెనొప్పి వచ్చి, మరణం తప్పదనిపించగా, ఆ పుస్తకాన్ని నా హృదయానికి హత్తుకొనగానే భగవంతుడే దిగివచ్చి ఆ వ్యాధిని పోగొట్టినట్లు అనిపించింది. ప్రతిరోజూ విష్ణుసహస్రనామంలోని ఒక్క నామమైనా, భావయుక్తంగా, నెమ్మదిగా చదవాలి. ఇది ఎంతో శ్రేయస్కరం" అంటారు. అలా భగవద్గీత ప్రేరణగా, విష్ణుసహస్రనామం ప్రార్థనగా మనకు నిత్యజీవనంలో రక్షణనిస్తాయని 'భజగోవిందం' కూడా స్పష్టం చేస్తోంది. శారీరకంగా, మానసికంగా పటుత్వం కోల్పోక ముందే ప్రతిరోజూ కొంతసేపు గీతాపఠనం, శ్రీవిష్ణుసహస్రనామ పారాయణం చేయడం అలవాటు చేసుకుంటే అనుక్షణం భగవంతుడు మన చెంతనే ఉన్నాడన్న భావన కలుగుతుంది. మనోవ్యాధులన్నింటికీ దివ్యౌషధంలా పనిచేస్తుంది.

రూపం...ధ్యానం: శ్రీమన్నారాయణుడి రూపాన్ని ధ్యానిస్తూ, సేవించుకోవడమే మానవ జీవిత పరమార్థం. అయితే అది అంత సులువుగా సాధ్యమయ్యే విషయం కాదు. బతుకు తొలినాళ్ళ నుంచే దైవాన్ని ఆరాధించడం ఆరంభించాలి. అలా అభ్యాసం చేస్తూ, చేస్తూ పోగా శ్రీహరి రూపంపై గురి కుదురుతుంది; ధ్యానిస్తే మనస్సు ఏకాగ్రమవుతుంది. జీవన చరమాంకంలో కూడా భగవంతుడి స్పృహ మన నుంచి దూరం కాదు. ఒకవేళ శారీరక, మానసిక అననుకూలతలతో తన స్మరణను విడిచినా, ఆయన మాత్రం మనల్ని విస్మరించడు. అందుకే శ్రీనరసింహస్వామి ఓ మారు...

సత్యం బ్రవీమి మనుజా స్వయ మూర్ధ్వ బాహుః
యో మాం ముకుంద! నరసింహ! జనార్దనేతి!
జీవన్ జప త్యనుదినం, మరణే ఋణే చ!
పాషాణ కాష్ఠ సదృశాయి, దదామి ముక్తిమ్...

"మానవులారా! నేను రెండు చేతులను ఎత్తి సత్యాన్ని పలుకుతున్నాను. ఎవరు నన్ను తమ జీవితకాలంలో 'ముకుంద! నరసింహ!! జనార్దన!!!' అని ప్రతిదినం జపిస్తారో, వారు మరణ ఆసన్న వేళ స్మృతి తప్పి బండరాయిలా, గొంతు పూడిపోయి ఉన్నా, నేనే వారికి ఋణపడిన వాడిలా తలంచి ముక్తిని ప్రసాదిస్తా"నని అభయమిస్తాడు. ఆ పరమాత్మకు మనపై ఎంత ప్రీతో, తనే మనకు ఋణపడిన వాడిలా రక్షించుకుంటాడట!

సజ్జనసంగం.. సత్ఫలితం: బతుకును చక్కదిద్దుకోవడానికి అత్యవసరమైంది సజ్జనసాంగత్యం. సచ్ఛీలురు ముందు అద్దంలా మనల్ని మనకు తెలియపరుస్తారు; ఆ తరువాత తమ సాహచర్యంతో మన అంతరంగాన్ని తేటపరుస్తారు; చివరకు మనల్ని భగవంతుడి వైపు నడిపిస్తారు. దురదృష్టవశాత్తూ ఆధునిక జీవనంలో అలాంటి సాంగత్యమే గగనమైపోతోంది. ఎక్కడ చూసినా మనల్ని మరింత లౌకిక లంపటంలోకి లాగే వ్యక్తులే తారసపడుతూ ఉంటారు; కానీ ఒడ్డుకు చేర్చే వారు ఒక్కరూ ఉండరు. ఫలితంగా అలాంటి సమూహాల్లో చాలాసార్లు మన స్వస్వరూపాన్నే మరచిపోతూ ఉంటాం.

కానీ ఎవరి సహవాసం మనపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతోందో ఎప్పటికప్పుడు విచక్షణతో విశ్లేషించుకుంటూ ఉండాలి. పూలపరిమళం సూత్రానికీ అబ్బినట్టు కాలక్రమంలో సత్సాంగత్య ప్రభావం దుర్జనులనూ పునీతులను చేస్తుంది. భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస సన్నిధిలో అలా ఎందరో కళంకితులు కూడా పవిత్రమూర్తులుగా పరిణమించారు. అందుకే భగవంతుడి దర్శనం కావాలంటే శమం, విచారణ, సంతోషం, సాధుసాంగత్యం అనే నలుగురు ద్వారపాలకులను ఆశ్రయించాలంటారు వశిష్ఠ మహర్షి. 'శమం' అంటే అంతరింద్రియ నిగ్రహం; మనస్సులోకి సుఖం, భోగం తదితర ఆలోచనలు రాకుండా చూసుకోవడం.

దానం....ధన్యం: కలియుగంలో మరో ముఖ్యమైన ముక్తిమార్గం – దీనజన సేవ. ఉన్నదాంట్లో నలుగురికీ దానం చేసే దయార్ద్ర హృదయులు ధన్యులు. ఎక్కడో ఊరు కాని ఊరులో, దేశం కాని దేశంలో చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న మీ పిల్లలకు రక్షణనిచ్చేది ఆస్తిపాస్తులు కాదు; మీ అధికార హోదాలూ కాదు. అవన్నీ ఉండి కూడా ప్రమాదాల పాలవుతున్న అభాగ్యులు ఎందరో! మీరు చేసుకున్న పుణ్యకార్యాలే మిమ్మల్నీ, మీ బిడ్డల్నీ వెన్నంటి కాపాడతాయని మరచిపోకూడదు. ఆయన ప్రాపకాన్ని

ఎక్కడో ఊరు కాని ఊరులో, దేశం కాని దేశంలో చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న మీ పిల్లలకు రక్షణనిచ్చేది మీ ఆస్తిపాస్తులు కాదు; అధికారహోదాలూ కాదు. మీరు చేసుకున్న పుణ్యకార్యాలే మిమ్మల్నీ, మీ బిడ్డల్నీ వెన్నంటి కాపాడతాయి. మన కనుసన్నల్లో కన్నా భగవంతుడి కనుసన్నల్లోనే బిడ్డలు భద్రంగా ఉంటారు.

సంపాదించాలంటే మనం సేవాతత్పరులుగా మారాలి. సాటి మనిషి పైన కాస్తంత కరుణ చూపితే, మనపై భగవంతుడు కరుణ చూపుతాడు. అందుకే భర్తృహరి...

వనే రణే శత్రు జలాగ్ని మధ్యే, మహార్ణవే పర్వత మస్తకే వా
సుప్తం ప్రమత్తం విషయం స్థితం వా, రక్షంతి పుణ్యాని పురా కృతాని

"అరణ్యంలో, యుద్ధంలో, శత్రువుల నడుమ, నీటిలో – నిప్పులో పడ్డప్పుడు, సముద్రంలో – కొండ కోనల్లో ఉన్నప్పుడు, నిద్ర పోతున్నప్పుడు, స్పృహలో లేనప్పుడు, భయంకర పరిస్థితులలోనూ మానవులను పూర్వపుణ్యాలే కాపాడతాయి" అని అంటాడు. మనం సముపార్జించుకున్న సిరిసంపదలు, పేరుప్రఖ్యాతులు, మందీమార్బలం – ఇవేవీ మనల్ని కాపాడవు. భగవంతుడి ఖాతాలో లెక్కలోకి రావు. కేవలం మన నిస్వార్థ కార్యకలాపాలనే ఆయన పరిగణనలోకి తీసుకుంటాడు. వాటికి అనుగుణంగానే మనకు సుఖదుఃఖాలను ప్రసాదిస్తాడు. అందుకే 'ధనవంతుడు డబ్బును దానం చేయడం ద్వారా సేవ చేయాలి; అది లేనివాడు జప తపాదుల ద్వారా సేవ చేయాలి' అంటారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస. ❖

ప్రపంచంలోని స్త్రీలందరికన్నా హైందవ స్త్రీలు ఎంతో ఆధ్యాత్మికత కలవారు. ఈ భావాలను మన స్త్రీలలో పెంపొందించగలిగితే భావి హైందవ స్త్రీ ప్రపంచానికి ఆదర్శం కాగలదు. - స్వామి వివేకానంద

జగన్మాత లీల

– పంచానన

కామినీ కాంచనాసక్తమైన ఈ నా (పంచానన) జీవితంలో ఒక అలౌకిక సంఘటన చోటుచేసుకుంది. ఒకనాడు ఉదయం నుండి శరీరంలో నలతగా ఉంది. కనుక ఆ రోజు విశ్రాంతి తీసుకుంటున్నాను. మా షిల్లాంగులో, మా పేటలో 80 ఇళ్ళు; వీటి నడుమ మూడు, నాలుగు ఖాసీ తెగ గిరిజనుల ఇళ్ళు.

ఆ ఖాసీ వారి పిల్లలు మహా ధూర్తులు. తాళాలు వేసిన ఇళ్ళ తలుపులు, కిటికీల గాజురెక్కలు రాళ్ళతో విరగగొట్టి, లోనికి దూరి చేతికి అందినవి తీసుకొనిపోతారు. చివరకు వారు ఎంతగా తెగించేవారంటే, ఇళ్ళకు కూడా నిప్పుపెట్టేవారు.

ఒకరోజు దుండగులు మా ఇంటికి నిప్పుపెట్టారు. పై కప్పు కాలుతోంది. నేను నీళ్ళ బాల్చీ చేత పట్టుకొని ఇంటి పై కప్పు పైకి ఎక్కాను. నిప్పు చెలరేగి నన్ను చుట్టుముట్టింది. నా ముఖం కాలిపోయింది. ప్రాణాలు గతి తప్పుతున్నాయి. తప్పించుకోవాలనే ఆలోచన రాని స్థితి. అకస్మాత్తుగా 'అమ్మా, అమ్మా' అని అరిచాను.

అప్పుడు 'మా భైః మా భైః – భయం వలదు, భయం వలదు, నేను వస్తున్నాను' అని ఓ మధుర స్వరం వినపడింది. నేను కళ్ళు తెరిచి చూశాను. ఆ దృశ్యంతో నా జన్మ ధన్యమైనది. అటువంటి రూపం ముందెన్నడూ చూడలేదు. మెరుపు లాంటి తేజోమూర్తి. ఆ తేజస్సు ముందు అగ్ని కాంతిహీనంగా తోచింది. అభయ హస్తములతో జగన్మాత ప్రత్యక్షమైంది. ఆ దివ్యతేజోమూర్తిని దర్శించగానే 'అమ్మా, అమ్మా' అంటూ స్పృహ కోల్పోయాను.



సూర్యాస్తమయ కాలానికి మెల్లగా స్పృహ వచ్చింది. అక్కడ గుమికూడిన ప్రజలు నాలో కదలికలు గమనించి 'అయ్యా! మీరు బ్రతికి బయటపడ్డారు. మిమ్మల్ని క్రిందకు దింపుతాం' అని అరిచారు. ఎలాగో పైకప్పు అంచు వరకు మెల్లమెల్లగా జరిగాను. చిన్న పిల్లవాడిని ఎత్తుకున్నట్లు, నన్ను ఎత్తుకున్నారు. 'అయ్యా! క్షేమంగా ఉన్నారండి. ముఖం మాత్రం కాలి, పెద్ద పెద్ద బొబ్బలు లేచాయి' అన్నారు.

ముందు వసారా దగ్గర ఉన్న పూల చెట్టు పూర్తిగా కాలిపోయింది. కానీ పైకప్పు పై పరచిన ఒక్క కొబ్బరాకు కూడా కాలలేదు! అది చూసి విహ్వలుడనయ్యాను. ఇంటికి తిరిగి వచ్చి తలుపులు మూసుకొని, రాత్రి అంతా 'అమ్మా, అమ్మా' అని విలపిస్తూ గడిపాను.

ముఖం నానాటికీ భయంకరంగా కనబడుతోంది. మొదట్లో కందగడ్డ లాగా ఎర్రగా ఉంది. ఆ పైన నల్లగా మారుతోంది. పది, పన్నెండేళ్ళుగా ఎవరితో పని చేస్తున్నానో, వాళ్ళు సైతం నన్ను గుర్తుపట్టలేని పరిస్థితి. ఒక డాక్టరు నన్ను చూడడం జరిగింది. చర్మం పై పొర పూర్తిగా కాలిపోయింది. అది మెల్లగా ఊడి వస్తుంది. అప్పుడు, బొల్లి రోగుల ముఖం లాగా కనపడుతుంది. బొబ్బలు లేచిన చోట్ల భయంకరమైన మచ్చలు మిగులుతాయి అన్నాడు. మొట్ట మొదటిసారిగా బాధపడ్డాను. చేసేదేముంది!

రాత్రి పడుకున్నాను. తెల్లవారి 3 గంటలకు మెలకువ వచ్చింది. లేచి కుర్చీపై కూర్చున్నాను. గది అంతా కనులు మిరుమిట్లు గొలిపే కాంతితో నిండిపోయింది. ఎదుట సరిగ్గా ఆనాటి ఆకారం. ఎర్రటి కళ్ళు, కానీ సౌమ్య రూపం. 'ఒక్కసారి నన్ను



వేడుకో. ముఖం బాగవుతుంది' – వీణ మీటినట్లున్న అదే స్వరం. 'నా వల్ల కాదు తల్లీ! ఇది నీవు ప్రదానం చేసిన అలంకారం' అన్నాను. ఆమె గలగలా నవ్వింది. ఆ దరహాస సౌందర్యం వర్ణించలేను. 'సరే! ఉగాది నాడు స్నానం చేయగానే నీ ముఖం సహజరూపం సంతరించుకుంటుంది' అని పలికింది.

మా ఇంట్లో ఒక అతిథి. 'మీ ముఖం నానాటికీ భయంకరంగా తయారవుతోంది' అని ఆయన నాతో అన్నాడు. ఆయనకూ, మరికొందరు సన్నిహితులకూ జరిగింది చెప్పాను.

ఉగాది పర్వదినాన ఉదయం అలవాటు ప్రకారం ప్రక్కనున్న కొండపై నుంచి జారే జలపాతం వద్దకు వెళ్ళి, స్నానం చేసి ఇంటికి వస్తున్నాను. దారిలో నన్ను చూసిన సన్నిహితులంతా 'బాబూ! ఏమి ఆశ్చర్యం! నీ ముఖంపై చిన్న మచ్చ అయినా లేదు' అని అంటూ స్థాణువులై నిలబడ్డారు.

నా శరీరం కంపించింది. 'అమ్మా, అమ్మా' అంటూ విలపించాను. ఇంటికి వచ్చి, జగన్మాత లీలలను ధ్యానిస్తూ కూర్చున్నాను. ❖ **సేకరణ: డాక్టర్ కమల జయరావు**



వివేకానంద సూక్తి సుధ

భారతీయో౽స్మి మే సర్వో భారతీయశ్చ సోదరః ।
భారతీయో మమ ప్రాణాః స్వర్గో భారత భూర్మమ ॥
భారతీయసమాజో౽యం మమాభూద్బాల్యదోలికా ।
యౌవనే నందనవనం వారణాసీ చ వార్ధకే ॥
శ్రేయో భారతదేశస్య మమ శ్రేయో భవిష్యతి ।
ఇతి మత్వా సదా కుర్యాద్భగవత్ప్రార్థనాం తతః ॥
మహేశ్వర! జగన్మాతః! మహ్యం ధైర్యం ప్రయచ్ఛతమ్ ।
దూరీకురుత మేతన్మే దౌర్బల్యం భీరుతాం తథా ॥

నేను భారతీయుడను. ప్రతి భారతీయుడూ నా సోదరుడే. భారతీయుడు నా ప్రాణాలు. భారతభూమియే నా స్వర్గం. ఈ భారతీయ సమాజం నాకు బాల్యంలో డోలిక, యౌవనంలో నందనవనం, వార్ధక్యంలో వారణాశి. భారతదేశానికి ఏది శ్రేయస్సో నాకు కూడా అదే శ్రేయస్సు– ఇలా భావించి, తరువాత సర్వదా భగవంతుణ్ణి “మహేశ్వరా! జగన్మాతా! నాకు ధైర్యం ప్రసాదించండి! నా ఈ దౌర్బల్యాన్ని దూరీకరించండి! నా పిరికితనాన్ని దూరం చేయండి” అని ప్రార్థించాలి.

నిష్కామకర్మ యోగేన పరక్షేమో న కేవలమ్।
హృదయస్య విశుద్ధిశ్చ ఫలం స్యాత్కర్మయోగినః॥
తస్య తావత్పరబ్రహ్మ సాక్షాత్కారో౽పి సిధ్యతి।
తపశ్చరణవత్క్లేశకరం నిష్కామకర్మ తత్॥

కర్మయోగికి నిష్కామకర్మ వల్ల పరక్షేమం మాత్రమే కాక హృదయశుద్ధి కూడా సిద్ధిస్తుంది. అతనికి పరబ్రహ్మ సాక్షాత్కారం కూడా కలుగుతుంది. నిష్కామకర్మ తపశ్చరణం లాగా క్లేశకరమైనది.

సుఖం తు న భవత్యేవ సత్యస్య నికషోపలమ్ ।
అన్తరం బహుదూరం హి వర్తతే సుఖసత్యయోః ॥
సుఖాసక్తిం పరిత్యజ్య సత్యాన్వేషీ భవేన్నరః ।
సత్యస్య దర్శనం తావత్త్యాగే నైవోపలభ్యతే ॥

సుఖం సత్యానికి గీటురాయి కాదు. సుఖానికీ, సత్యానికీ మధ్య ఎంతో వ్యవధానముంది. సుఖాసక్తిని వదలి నరుడు సత్యాన్వేషి కావాలి. త్యాగం చేత మాత్రమే సత్యదర్శనం కలుగుతుంది. ❖ రచన: డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య

స్వామి వివేకానంద క్విజ్

1. స్వామీజీని గురించి తమిళనాడుకు చెందిన మహాకవి సుబ్రహ్మణ్య భారతి ఏమన్నారు?
2. భారత స్త్రీత్వానికీ, ఆధునిక స్త్రీకీ ఆదర్శమూర్తులుగా స్వామీజీ ఎవరిని అభివర్ణించారు?
3. స్వామీజీ ఎవరిని యువతకు ఆదర్శంగా పేర్కొన్నారు?
4. స్వామీజీ ఉపనిషత్తులలోకెల్లా అత్యంత మనోహరమైన ఉపనిషత్తుగా దేనిని కొనియాడారు?
5. భారతీయులకు కావలసింది ‘శ్రద్ధ’ అనీ, ‘మనిషికీ, మనిషికీ మధ్య గల భేదం శ్రద్ధలో ఉన్న భేదమే తప్ప వేరే ఏమీ కాద’నీ అంటూ, అలాంటి శ్రద్ధకు మనం ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలని స్వామీజీ సూచించారు?
6. విజ్ఞాన సముపార్జన విషయంలో స్త్రీలు ఎవరిలా ఉండాలని స్వామీజీ ఆశించారు?
7. మానవాళి మానసిక రుగ్మతలకు స్వామీజీ సూచించిన ఆధ్యాత్మిక దివ్యౌషధ గ్రంథం ఏది?
8. పాశ్చాత్య తత్త్వవేత్తలలో స్వామీజీకి బాగా నచ్చినవారెవరు?
9. యావజ్జీవితం స్వామీజీని ఆకట్టుకున్న నాయకుడు ఎవరు?
10. స్వామీజీకి బాగా నచ్చిన పాశ్చాత్య కావ్యం ఏది?
11. చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం, స్వామీజీ పాశ్చాత్య దేశాలలో ఎన్నిసార్లు, ఏయే ప్రదేశాల్లో నిర్వికల్ప సమాధి స్థితిని పొందారు?
12. స్వామీజీ యావత్ మానవజాతిని మేల్కొలుపుతూ పలికిన ‘లెండి! మేల్కొండి! మీ గమ్యాన్ని చేరేవరకు విశ్రమించకండి’ అన్న స్ఫూర్తి వచనాలు ఏ ఉపనిషత్తు నుండి తీసుకున్నారు?
13. స్వామీజీ ‘ఇతరుల కోసం జీవించిన వారే నిజానికి జీవిస్తున్నట్లు, తక్కినవారు జీవన్మృతులు’ అని ఎవరికి వ్రాశారు?
14. స్వామీజీ పిలుపునకు స్పందించి మొదటిసారిగా దీన జనోద్ధరణకు నడుం బిగించిన ఆయన సోదర సన్న్యాసి ఎవరు?
15. స్వామీజీయే కాకుండా, ఆయన సోదర సన్న్యాసులు ఎవరెవరు పాశ్చాత్య దేశాలలో వేదాంత ప్రచారం చేశారు?

(జవాబుల కోసం 40వ పేజీ చూడండి)

భారతీయ స్త్రీలను ఆధునికతవైపు మళ్ళించే ప్రయత్నం ఏమాత్రం చేసినా, అది తక్షణం కొరగానిదై పోతుంది. మన స్త్రీలు సీత అడుగుజాడలను అనుసరించి వికాసాన్ని పొందాలి. - స్వామి వివేకానంద



స్వామి వివేకానంద దర్శన స్మృతి

– ప్రవ్రాజిక బ్రహ్మప్రాణా

అల్మోరాలోని లాల్ బద్రీషా గారింటికి ప్రవ్రాజిక ప్రభాప్రాణా నన్ను (ప్రవ్రాజిక బ్రహ్మప్రాణా) తీసుకువెళ్ళారు. అక్కడ ఇంటి యజమాని మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి, మేడపై ఉన్న గదికి తీసుకువెళ్ళారు, అది సోదరి నివేదిత నివసించిన గది. ఆ తరువాత అక్కడ నుండి, వ్యతిరేక దిశలో ఉన్న ఒక ప్రత్యేక గదికి తీసుకుని వెళ్ళారు. అది లాల్ బద్రీషా గారి ప్రత్యేక అతిథిగా స్వామి వివేకానంద నివసించిన గది.

ఎంతో విశాలంగా ఉన్న ఆ గదిలో ఒక పక్కగా స్వామీజీ ఉపయోగించిన మంచం, వాలు కుర్చీ, ఇంకో పక్కన నిలువెత్తు అద్దమున్న అందమైన అల్మారా ఉన్నాయి. స్వామీజీ ఉపయోగించిన మంచినీటి కుండ, దీపపుసెమ్మె ఇత్యాదులు ఆ అద్దాల అల్మారా నుండి తమ ఉనికిని చాటుతున్నాయి.

అయితే వీటన్నిటి కన్నా గోడ పైన ఉన్న ఒక చిత్రపటం నన్ను చాలా ఆకర్షించింది. అది నేను మునుపెక్కడా చూడనటువంటి స్వామి వివేకానందుని అరుదైన చిత్రపటం. అది చాలా సజీవంగా ఉండి, స్వామీజీ నన్ను చూస్తున్నారా? అని అనిపించసాగింది. ఆ కళ్ళలో ఒక వింత ఆకర్షణ ఉండి, మామూలుగా కనిపించే విశాలమైన స్వామి కళ్ళలా కాకుండా, ఆ కమలాక్షుడైన శ్రీకృష్ణుని నయనాల లాగా తోచాయి. ఆ ఇంటి యజమాని భార్య శ్రీమతి ఇందు ఆ చిత్ర వృత్తాంతాన్ని ఇలా తెలియజేశారు:

ఇందు గారి అత్తగారైన జానకీదేవి నవవధువుగా అత్తవారింట అడుగుపెట్టిన తొలి రోజులలోనే, తన భర్తకు తాతగారైన లాల్ బద్రీషా గారు, స్వామి వివేకానందుని అనుంగు శిష్యులనీ, అంతేకాక ఆయనకు సాధు సన్న్యాసులంటే ఆదరాభిమానాలు ఎక్కువనీ గ్రహించారు. ఒకనాడు తేజోవంతుడైన ఒక సాధువు వారింటికి రాగా, ఆవిడ పెద్ద గ్లాసులో పాలు తెచ్చి ఇచ్చారు. ఆయన అవి త్రాగి, 'నీకు ప్రీతి పాత్రమైనవారెవరు?' అని జానకీ దేవిని ప్రశ్నించారు. ఆవిడ శ్రీకృష్ణుడని జవాబిచ్చారు. అంతట ఆయన చిరునవ్వుతో మంచిదని పలికి వెళ్ళిపోయారు. ఇంతకీ ఆ వచ్చినదెవరంటే, స్వామి వివేకానందులే!.

ఆ తరువాత ఇంకొక సాధువు వారింటికి వచ్చి, చుట్ట చుట్టి ఉన్న ఒక పటాన్ని ఆవిడకు ఇస్తూ, దీన్ని ఇరవై ఏళ్ళ తరువాత మాత్రమే తీసి చూడాలని చెప్పారు. కాల చక్రంలో ఇరవై ఏళ్ళు గడిచిపోయాయి. ఒక రోజు సామానులు సర్దుతూ, ఆవిడ ఈ పటాన్ని తెరిచి చూశారు. అది రంగులు అద్దబడిన స్వామి వివేకానంద చిత్రపటం. మరికొంత కాలానికి, ఇందు, జానకీదేవి కోడలిగా ఆ ఇంట అడుగుపెట్టారు. అత్తగారు స్వామీజీ చిత్రపటంతో మాట్లాడుతుండడం తాను చాలా సార్లు చూశానని ఇందు తెలిపారు.

ప్రవ్రాజిక ప్రభాప్రాణాతో, లాల్ బద్రీషా గారికీ, స్వామీజీకీ ఉన్న అనుబంధం గురించి, ఆ చిత్రపటం గురించి జానకీదేవి చెబుతుండేవారు. అంతేకాక, 'ఆ పటాన్ని కుడి పక్క నుండి చూసినా, ఎడమ పక్క నుండి చూసినా స్వామీజీ మనవైపే చూస్తున్నట్లుగా అనిపిస్తుంది. నేను ఎప్పుడు ఏ అవసరంతో మాట్లాడినా, ఆయన నాకు జవాబిస్తారు. కావాలంటే మీరూ ప్రయత్నించి చూడండ'ని ఆమె చెప్పారు.

ఆ తరువాత ఇంకోసారి ప్రభాప్రాణాతో మాట్లాడుతూ, జానకీదేవి ఇలా తెలిపారు – 'స్వామీజీ, నాకు కొన్ని విషయాలు అవి జరగక మునుపే చెప్పేవారు. ఒకసారి నేను మా అబ్బాయి దగ్గర హల్ద్వానీలో ఉండగా, ఓ అర్ధరాత్రి ఆకస్మికంగా మెలకువ వచ్చింది. లేచి చూడగా పక్కనే చెమ్మగిల్లిన కళ్ళతో స్వామీజీ కనబడి, 'నీవు తక్షణం మీ ఇంటికి వెళ్ళు' అని చెప్పారు. నేను వెంటనే మా అబ్బాయిని లేపి, తక్షణమే అల్మోరాకి వెళదామన్నాను. అతను సందేహించినా, పట్టుబట్టి బయలుదేరదీశాను. మేము వెళ్ళేసరికి నా భర్త మరణశయ్యపై, ఆఖరుక్షణాలలో కనిపించారు. గంగాజలం త్రాగించాక, ఆయన తనువు చాలించారు. ఇదేకాక, ఇంకా కొన్ని విషయాలు ముందుగానే స్వామీజీ తెలిపేవారు' అని ఆవిడ చెప్పారు.

ఇలాంటి ఆసక్తికరమైన విషయాలు, ఆధ్యాత్మికత నిండిన మన పుణ్యభూమిలో జరుగుతూనే ఉంటాయి. ఈశ్వరకోటి ప్రణిధానంలోని అద్భుత వ్యక్తుల జీవితాలు సుగంధాలు వెదజల్లుతూనే ఉంటాయి. వారి జీవితాలలో ఉన్న ఒక పార్శ్వాన్ని మాత్రమే మనం గ్రహించగలం. ఆ నవవధువు ఇచ్చిన గ్లాసెడు పాలు త్రాగిన వివేకానందుడు, ఆవిడ కర్మఫలాన్ని క్షయం చేశారు. ఆవిడకు ఎంతో ఇష్టమైన శ్రీకృష్ణుని కళ్ళను పోలి ఉన్న తన చిత్రపటాన్ని ఆవిడకు బహూకరించారు స్వామీజీ. ఆవిడ చిత్తశుద్ధితో చేసే పూజకు అనుగుణంగా స్పందిస్తూ, సహాయ మందించారు. స్వామీజీకి, లాల్ బద్రీషాతో ఉన్న అనుబంధానికి గుర్తుగా, తరతరాల ఆ వారసులు సంరక్షించుకునే విధంగా అరుదైన చిత్రపటాన్నిచ్చి ఆశీర్వదించారు. ❖

తెలుగు సేత: డాక్టర్ అపర్ణా శ్రీనివాస్



అన్నమయ్య పదామృతం

అదివో అల్లదివో శ్రీ హరివాసము
పదివేల శేషుల పడగలమయము ॥
అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిల మునులకు
అదె చూడు డదె మొక్కు డానందమయము ॥
చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము
బంగారు శిఖరాల బహుబ్రహ్మ మయము ॥
కైవల్యపదము వెంకటనగమదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపద రూపమదివో
పావనములకెల్ల పావనమయము ॥

అదివో... అల్లదివో!

– శ్రీమతి బి.కృష్ణకుమారి

పావనమూర్తి సన్నిధానం...పరమపద సోపానం ఆ శ్రీవేంకటాచలం. అల వైకుంఠ పురంబులో ఆదిశేషుడిపై పవళించే పద్మనాభుడు, అవనిపై అనంతశిఖరాల అంచున ఆనంద నిలయుడిగా అవతరించాడు. పైలోకాల తన పరివార మంతటినీ వేంకటాద్రి పైన కొలువుతీర్చాడు. ఆ పరంపరలో ప్రాపంచిక భావ కాలుష్యాన్ని పారదోలే పారమార్థిక లక్ష్యంతో, ఏకంగా తన నందకాన్నే పదకవితా పితామహుడైన అన్నమయ్యగా అవతరింపజేశాడు. భావంతో కలసిన భక్తి, శరణాగతితో కూడిన సేవే తనకు మక్కువని నిరూపించాడు... నిరూపిస్తూ ఉన్నాడు.

అలా ఆ హరికొలువులో ఆస్థాన సంకీర్తనా సామ్రాట్టుగా అన్నమయ్య వెలిగాడు; ఆ శేషాద్రి శిఖరాల శ్యామల కోమల కానన సీమల్లో భాగవతోత్తముడై విహరించాడు... అనంత పరవశంతో **'అదివో...అల్లదివో శ్రీహరివాసము'** అంటూ ఆ తిరుమల తీర్థక్షేత్రాన్ని అభివర్ణించాడు అన్నమయ్య.

భక్తులకు దైవమెంతో, దేవాలయమూ అంతే! చూడగలగాలే కానీ అక్కడి అణువణువూ ఆ పరమాత్మ స్వరూపంగానే గోచరిస్తుంది. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస "భగవంతుడు కేవలం అంతర్యామే కాదు. ఆయన అంతరంగంలోనూ, బాహ్యంలోనూ ఉన్నాడు. సమస్తం చిన్మయంగా ఉండడం కాళికాలయంలో ఒకసారి అమ్మ నాకు చూపించింది. ఆమే సమస్తంగా ఉంది. విగ్రహం, నేను, పూజాపాత్రలు, వేదిక, చలువరాళ్ళు అన్నీ చిన్మయమే! దీన్ని అనుభూతం చేసుకోవడానికే భగవంతుణ్ణి ప్రార్థించడం, సాధనలు చేయడం, నామగుణ కీర్తనలు చేయడం అన్నీను..." అంటారు. అలా అన్నమయ్య తన అనుభూతితో ఏడుకొండల్లో ఎక్కడ చూసినా ఆ ఏక స్వరూపుడినే దర్శించుకోగలిగాడు.

అదే శ్రీహరివాసము!

అశేషమైన ఆ శేషగిరి శిఖరాలు అన్నమయ్యకు అనంతమైన ఫణి ఫణాగ్రాలుగా తోచాయి. అలా ఎనిమిదేళ్ళ వయస్సులో ఏడుకొండలవాడిని దర్శించి ఆనందతాండవం చేస్తూ **'అదివో...అల్లదివో శ్రీహరివాసము, పదివేల శేషుల పడగల మయము'** అంటూ ఆలపించాడు. ఆయనకు ఆ కొండలన్నీ ఆ ఆదిశేషుడి పడగలు గానే అనిపించాయి. ఇలాంటి మనోభావంతో తీర్థయాత్రలు చేసినప్పుడే, మనకు ఆ భగవంతుడిపై ప్రేమ పెరుగుతుంది. యాత్ర ఆరంభం నుంచి అంతం వరకు భగవన్మయమే అవుతుంది. అనంతరం ఆ క్షేత్రాన్ని తలచుకున్నా, అక్కడి విశేషాల గురించి విన్నా – సందర్శించినంత పుణ్యం కలుగుతుంది. అందుకే మనుచరిత్రలో అల్లసాని పెద్దన గారు **'పోయి సేవింప లేకున్న, పుణ్య తీర్థ మహిమ**
వినుటయు నఖిల కల్మష హరంబు...' అంటారు. ఏదో మొక్కుబడిగానో, మొక్కుల కోసమో కాకుండా మక్కువతో క్షేత్రాలను దర్శించుకుంటేనే పుణ్యం, పురుషార్థం.

అదే ఆనందమయము!

అదిగో వడ్డికాసులవాడు వేంచేసి ఉన్న ఆ వేంకటాచలం సాధారణమైన శిఖరం కాదనీ, భూమండలంలోనే అఖిలోన్నతమైనదనీ, బ్రహ్మాదులకే అపురూపమైనదనీ, మునులందరికీ నిత్యనివాసమై అలరారుతోందనీ, అంతటి ఆ కొండను కోరి మొక్కమనీ, అది ఆనందమయమనీ అన్నమయ్య పులకించిపోతూ....

(మిగతా 32వ పేజీలో...)

స్త్రీలను ముందుగా విద్యావంతులను చేయండి. అప్పుడు వారి సమస్యలను వారే పరిష్కరించు కోగలుగుతారు. వారికి ఏది శ్రేయస్కరమని తోస్తుందో దాన్ని అవలంబిస్తారు. -స్వామి వివేకానంద


పరిప్రశ్న

– స్వామి భూతేశానంద
(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)



భక్తుడు: జప ధ్యానాలకు రోజులో పది నిమిషాల కన్నా ఎక్కువ సమయాన్ని కేటాయించలేని వారి పరిస్థితి ఏమిటి?

స్వామీజీ: భగవంతుని పట్ల ఎంత అనురాగం ఉంటే అంత ఎక్కువ సమయాన్ని జప ధ్యానాల కోసం వినియోగించాలన్న భావన కలుగుతుంది. ఉదాహరణకు మీ పిల్లల కోసం రోజుకు ఎంత సమయాన్ని వినియోగిస్తున్నారో ఆలోచించండి! వారి కోసం ఆలోచించడానికీ, వారితో గడపడానికీ సమయం లేదని అనగలరా? అలా ఎన్నటికీ అనలేరు. ఎందుకంటే పిల్లల పట్ల మీకున్న అనురాగమే అందుకు కారణం. ఎన్ని పనులున్నా వారి కోసం ఏదో విధంగా సమయం కేటాయించడానికి ప్రయత్నిస్తారు. అలాగే భగవంతుని పట్ల మనకు అనురాగం పెరుగుతున్నకొద్దీ, ఎక్కువ సమయాన్ని భగవచ్చింతనలో గడపడానికి ప్రయత్నిస్తాం. నిజానికి జప ధ్యానాలకు సమయం సరిపోవడం లేదు అనడానికి కారణం భగవంతుణ్ణి పొందాలనే వ్యాకులత మనలో తీవ్రంగా లేకపోవడమే!



భగవాన్ శ్రీరామకృష్ణులను దర్శించడానికి వచ్చిన భక్తులు తమతో పాటు తమ స్నేహితులను కూడా దక్షిణేశ్వరానికి తీసుకువచ్చేవారు. కానీ ఆ స్నేహితులకు మాత్రం శ్రీరామకృష్ణుల బోధనలు వినడం ఇష్టముండేది కాదు. అందువల్ల వారు గంగానదీ తీరానికి వెళ్ళి కాలక్షేపం చేసేవారు. భగవంతుని పట్ల అనురక్తి లేకపోతే ఎంత సమయమున్నా ప్రయోజనమేమిటి? కాబట్టి ముందుగా మనం భగవంతుని పట్ల అనురక్తి పెంచుకుంటే, ఆయన పట్ల ఆకర్షణ పెరుగుతుంది. అప్పుడు భగవంతుణ్ణి స్మరించకుండా ఉండలేం. జపధ్యానాలకు సమయం దొరకడం లేదన్న ప్రశ్నే తలెత్తదు.

భక్తుడు: జపం చేస్తున్నప్పుడు మంత్రాన్ని లెక్కించడం అవసరమా? సహజంగానే మనస్సు భగవంతుని గురించి ఆలోచించగలిగితే జపం చేయడం ఎందుకు?

స్వామీజీ: మానసిక జపం ఉత్తమమైనది. కానీ సాధన జీవిత ప్రారంభంలో జపం చేస్తున్నప్పుడు మనస్సు త్వరగా ఏకాగ్రం కాదు. కాబట్టి మంత్రాన్ని లెక్కిస్తూ జపం చేయడం మంచిది. అలా కొంత కాలం అభ్యసించిన తరువాత మానసిక జపం చేయవచ్చు.

మనస్సును భగవంతునిపై నిలపడానికి ప్రయత్నించడమే జపం యొక్క ఉద్దేశం. చల్లని గాలి వీస్తున్నప్పుడు పంఖా అవసరం ఉండదు. అలాగే స్వాభావికంగా మనస్సు భగవచ్చింతనలో నిమగ్నం కాగలిగినప్పుడు ప్రత్యేకంగా జపం చేయాల్సిన అవసరం ఉండదు.

మనస్సు సదా భగవంతుని యందే నిమగ్నమైన వ్యక్తి లక్షణాలను శ్రీమద్భాగవతం ఇలా వివరిస్తోంది:

భక్తిః పరేశానుభవో విరక్తిః
అన్యత్ర చైషత్రిక ఏకకాలః ।
ప్రపద్యమానస్య యథాశ్నతః స్యుస్ తుష్టిః
పుష్టిః క్షుదపాయోఽనుఘాసమ్ ॥

(భాగవతం 11,2.42)

"ఆకలితో ఉన్న మనిషిలో శారీరక బలహీనత, అసంతృప్తి కలుగుతాయి. కానీ ఆహారం స్వీకరించిన వ్యక్తికి శారీరక శక్తి, తృప్తి కలుగుతాయి. అదే విధంగా భగవంతుని యందు మనస్సు నిమగ్నమైన వ్యక్తి – భగవంతుని పట్ల సంపూర్ణ ప్రేమ, భగవంతుని పట్ల సంపూర్ణ విశ్వాసం, ప్రాపంచిక సంపదల పట్ల వైరాగ్యం అనే మూడు లక్షణాలు కలిగివుంటాడు".

భగవంతుని సన్నిధిని కోరుకున్నప్పుడు మనస్సు నుండి ప్రాపంచిక ఆలోచనలు తొలగిపోతాయి. మనలో కలిగే సందేహాలన్నీ మటుమాయమైపోతాయి. ❖

పండుగలు - పర్వదినాలు

అక్టోబర్ - 2013			నవంబర్ - 2013		
04	శుక్రవారం	: స్వామి అఖండానంద జయంతి	03	ఆదివారం	: దీపావళి - కాళీపూజ
14	సోమవారం	: విజయదశమి	13	బుధవారం	: ఏకాదశి
15	మంగళవారం	: ఏకాదశి	14	గురువారం	: స్వామి సుబోధానంద జయంతి
18	శుక్రవారం	: లక్ష్మీపూజ	16	శనివారం	: స్వామి విజ్ఞానానంద జయంతి
30	బుధవారం	: ఏకాదశి	29	శుక్రవారం	: ఏకాదశి

త్రివిధ నమస్కారాలు



కాయకం, వాచికం, మానసికం - అంటూ నమస్కారాలు ప్రధానంగా మూడు విధాలు.

1. కాయక నమస్కారం: 'కాయము' అంటే శరీరమని అర్థం. కాయక నమస్కారమంటే శారీరకమైన నమస్కారమన్న మాట. సర్వసాధారణంగా మనమందరం రెండు అరిచేతులనూ కలిపి చేసే నమస్కారం ఇది. ఇక, పడుకొని అష్టాంగాలనూ నేలపై మోపి చేసేది - 'సాష్టాంగ నమస్కారం'.

ధ్యానముద్ర నమస్కారమని మరొకటి ఉంది. ఎడమ చేతి బొటనవేలిపై కుడి చేతి బొటన వేలును ఉంచి, పరస్పరం పట్టుకొని, మిగతా వేళ్ళను సాచి ఉంచితే, దాన్ని 'మహా ముద్ర' అంటారు. ఈ ధ్యాన ముద్ర నమస్కారంతో భగవంతుణ్ణి ధ్యానిస్తే,త్వరగా సత్ఫలితాలు సిద్ధిస్తాయి.

2. వాచిక నమస్కారం: వాచిక మంటే, మనం మాట్లాడే మాట. 'నమః' అనో, 'నమస్కారం' అనో రకరకాల శబ్దాలతో మన మనోభావాన్ని తెలియజేయడం 'వాచిక నమస్కారం'.

3. మానసిక నమస్కారం: ఏకాగ్రతతో దేవుణ్ణి తలుచుకుంటూ, మనఃపూర్వకంగా ఆయన పట్ల నమస్కార భావాన్ని ప్రదర్శించడం ఇంకో పద్ధతి. దాన్ని 'మానసిక నమస్కారం' అంటారు.

ఈ మూడు విధాలైన నమస్కారాలలో ఏ విధమైన నమస్కారం చేసినా, అది 'ఆత్మార్పణ చేసుకోవడమే' అవుతుంది. కాబట్టి, మన భావన ప్రధానం తప్ప, ఏ విధమైన నమస్కారమైనా చేయవచ్చు.

కాయక నమస్కారం (శారీరక నమస్కారం)లో మళ్ళీ నాలుగు రకాలున్నాయి. ఆ నాలుగూ ఏమిటంటే - సాష్టాంగం, పంచాంగం, త్రయ్యంగము, ఏకాంగము అనేవి!

మన గ్రంథాలు ప్రత్యేకంగా 'పంచాంగ నమస్కారా'న్నీ, 'సాష్టాంగ నమస్కారా'న్నీ చెప్పాయి. 'పంచాంగ నమస్కార' విధానంలో శరీరంలోని ముఖ్యమైన అయిదు అవయవాలు నేలను తాకుతాయి. ఇక, 'సాష్టాంగ నమస్కార' పద్ధతిలో శరీరంలోని ముఖ్యమైన ఎనిమిది అవయవాలు భూమిని స్పృశిస్తాయి.

దండ ప్రణామంలోని అంతరార్థం: భగవంతుని ముందు సాష్టాంగ ప్రణామం చేయడాన్ని 'దండవత్ ప్రణామం' అంటారు. 'దండం' అంటే కర్ర అని అర్థం. మనం సాష్టాంగ ప్రణామం చేసినప్పుడు మన శరీరం కర్ర లాగా భూమిని తాకాలి. ఆ సమయంలో మన దేహం కూడా కర్రను పోలి ఉంటుంది. కాబట్టి, దానికి 'దండవత్ ప్రణామం' అని పేరు.


తమిళ భాషలో 'దండం' అంటే నిరుపయోగం, వ్యర్థం అని అర్థం. నిజం చెప్పాలంటే, ప్రాణమున్నంత వరకే అందరికీ శరీరం మీద గౌరవం. ప్రాణం పోయాక అది వట్టి శవం. దాని మీద గౌరవం ఉండదు. కాబట్టి, శరీరం అశాశ్వతమైనదని గుర్తించాలి, దాని మీద ప్రీతి అన్నది వట్టి 'దండం' (అంటే తమిళంలో నిరుపయోగం) అని గ్రహించాలని పెద్దలు వ్యాఖ్యానిస్తుంటారు.

శరీరాన్ని వట్టి కట్టె లాగా నిరుపయోగమో, దురుపయోగమో చేయకుండా మంచి పనులకు ఉపయోగించాలి. భగవంతుని పాదపద్మాలకు సమర్పణ చేసుకోవాలి. భక్తులు ఈ విశ్వాసంతోనే భగవంతుడికి 'దండ సమర్పణం' అని చెబుతూ, సాష్టాంగపడతారు.

"గత జన్మల్లో చేసిన పుణ్యం వల్ల మనకు ఈ జన్మలో మానవ శరీరం లభించింది. భగవత్ కృపతో సమకూరిన శక్తితో ఈ దేహాన్ని నిలుపుకోగలుగుతున్నాం. అదే శరీరం రోగగ్రస్థమైతే, మంచంలో పడి ఉండి, లేవడానికి శక్తిని కోల్పోతుంది. కాబట్టి, భగవంతుడి వల్లే మనం మన శరీరాన్ని శక్తిమంతంగా ఉంచుకోగలుగుతున్నామని గ్రహించాలి. దేవుడిచ్చిన ఆ శక్తే లేకపోతే, ఈ శరీరం వట్టి కర్రతో సమానం. ఆ విషయాన్ని గ్రహించి, ఆ భావాన్ని మనస్సులో ఉంచుకొని, దేవుడి ముందు ప్రణమిల్లాలి" అని కంచి కామకోటి పీఠాధిపతుల మాట. ❖

(మరిన్ని విశేషాలు... వచ్చే సంచికలో...)

మన హైందవ స్త్రీలకు పాతివ్రత్యం అంటే ఏమిటో తెలుసు. అది వారి వారసత్వం. ముఖ్యంగా ఈ ఆదర్శాన్ని బలపరచండి. దానివల్ల వాళ్ళ జీవితంలో శీల నిర్మాణం జరుగుతుంది. -స్వామి వివేకానంద



అమ్మ రూపాల్లోని అంతరార్థం

– స్వామి హర్షానంద

శక్తి పూజలో సాధారణంగా దుర్గాదేవిని కొలుస్తారు. 'దేవీ భాగవతం' దుర్గాదేవి కథలకే అంకితం. 'దేవీ మాహాత్మ్యం' అనే మరొక గ్రంథం ఉంది. ఆమె వైభవం సంక్షిప్తంగా ఇందులో ఉంటుంది. ఇదే 'దుర్గా సప్తశతి' లేదా 'చండీపాఠం'. మార్కండేయ పురాణంలో ఒక భాగంగా ఉన్న ఈ చండీ పాఠాన్ని పరమ భక్తితో పారాయణం చేస్తారు. ఇందులోని ప్రతి పదాన్నీ మంత్రంగా భావిస్తారు. ఈ పారాయణం వల్ల ఏ కోరిక అయినా సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం.

దుర్గ అనే పదానికి చొరడానికి శక్యం కానిదని అర్థం. తెలుసుకోవడానికి దుర్లభం అని కూడా అర్థం. సమస్త దేవతల శక్తుల నుండి ఈమె ఉద్భవించడం వల్ల, సమస్త దేవతల సారం కావడం వల్ల ఈమె దుర్లభమే. కానీ భక్తితో ఆరాధించే వారికి ఈమె సులభమే, దయామూర్తియే!

'దుర్గా సప్తశతి'లో దుర్గాదేవి ఇతర రూపాలు కూడా వర్ణితమయ్యాయి. వింధ్య పర్వతాలలో నివసించే 'వింధ్యావాసిని'గా; ఎర్రని దంతాలున్న 'రక్తదంత'గా; నూరు కన్నులున్న 'శతాక్షి'గా; భూమి నుండి పెకలించుకొని వచ్చే వృక్షాలకు అధిష్ఠాత్రి అయిన 'శాకంబరి'గా; దుర్గముణ్ణి సంహరించిన 'దుర్గ'గా; భయంకర రూపంతో 'భీమ'గా; తుమ్మెదల రూపంలో నున్న 'భ్రమరాంబ'గా, లేదా 'భ్రామరీశక్తి'గా అవతరించింది ఆమే!

ఇందులో ప్రధానంగా దేవి – మహాకాళిగా, మహాలక్ష్మిగా, మహాసరస్వతిగా సాక్షాత్కరిస్తుంది. ఈ మూడు నామాలను పురాణాలలోని పార్వతి, లక్ష్మి, సరస్వతులతో కలపకూడదు. దేవి ముగ్గురమ్మల మూలపుటమ్మ. వీరు మాత్రం సత్త్వ రజస్తమోగుణాలను అనుసరించి అవతరించారని గుర్తించాలి.

మహాకాళి పదిముఖాలు, పదిపాదాలతో ఇంద్రనీల వర్ణం కలిగి, ఆభరణాలతో అలంకృతమై ఉంటుంది. పది చేతులలో ఈ ఆయుధాలుంటాయి– ఖడ్గం, చక్రం, గద, బాణం, ధనుస్సు, ఇనుప గుదియ, బల్లెం, ఒడిసెల, మానవ శిరస్సు, శంఖం. తామసి అవడం వల్ల ఆమె యోగ నిద్రగా ఉండి ప్రళయాంతంలో విష్ణువుకు నిద్రనిచ్చి విశ్రాంతిని ప్రసాదించేదిగా ఉంటుంది. తన స్వరూపాన్ని ఉపసంహరించుకొని, మధు–కైటభులను సంహరించడానికి సమర్థుడైన విష్ణువును మేల్కొల్పవలసిందిగా బ్రహ్మ, ఈమెను ప్రార్థిస్తాడు.

విష్ణువు యొక్క మాయ, అంటే వైష్ణవీ మాయ ఈమే. ఈమె మన స్తోత్రాలతో తృప్తి పడి, తనంతట తాను ఉపసంహరించుకోకపోతే మనలోని విష్ణువు మేల్కొనడు. దుష్టశక్తులు మనల్ని పీడిస్తూనే ఉంటాయి. మధు, కైటభులను సంహరించడంలో బ్రహ్మ ఇలాంటి పనే చేశాడు. ఆ కథను మనకు అన్వయించుకోవాలి.

దేవి యొక్క రజోగుణానికి 'మహాలక్ష్మి' సంకేతం. ఎర్రని పగడపు రంగుతో ఉంటుంది. ఆమె పద్దెనిమిది చేతులలో అక్షమాల, గొడ్డలి, గద, బాణం, వజ్రాయుధం, పద్మం, ధనుస్సు, నీటి కలశం, దుడ్డుకర్ర, బల్లెం, ఖడ్గం, డాలు, శంఖం, ఘంట, పానపాత్ర, శూలం, పాశం, సుదర్శన చక్రాలు ఉంటాయి. సమస్త దేవతల కోపశక్తి నుండి ప్రభవించింది కనుక దుష్ట శక్తులను సంహరిస్తుంది. ఆ సంహార సంకల్పంతో కూడా ఉంటుంది. అందుకే ఆమె ఎరుపు రంగులో ఉన్నట్లు భావిస్తున్నాం. రక్తం ఎరుపే కదా! యుద్ధానికి అనుగుణమైన రంగు. ఈమే మహిషాసురుణ్ణి సంహరించింది. ఈ కథ అర్థధ్వనితో కూడి ఉంటుంది.

దున్నపోతు రూపంలో ఉన్న మహిషాసురుడు చేతిలో కర్ర ఉన్నవానిదే రాజ్యమనే ఒక ఆటవిక న్యాయానికి ప్రతినిధి. స్వార్థానికై ఎన్ని దుష్ట కార్యాలనైనా చేయడానికి వెనుకాడనివాడు. దేవతలనే జయించాడు. వారు విడివిడిగా ఉన్నప్పుడే ఈ జయం సిద్ధించిందని మరువవద్దు. దైవీశక్తులన్నీ కలిసినప్పుడు, జయించాలనే సంకల్పం కలిగినప్పుడు వచ్చిన అవతారమే మహిషాసుర మర్దిని.

ఆధ్యాత్మిక దృష్టితో చూస్తే మహిషాసురుడు, జీవుని అజ్ఞానానికీ, వట్టి దురహంకారానికీ ప్రతినిధి. సాధకుడికి తీవ్ర సంకల్పం, తీవ్ర నిశ్చయ జ్ఞానం ఉన్నప్పుడు మాత్రమే ఇలాంటి మనస్తత్త్వాలను లొంగదీసుకోగలడు. అట్టి స్థిర సంకల్పునకు పరమేశ్వరుని అనుగ్రహం తప్పక ఉంటుందని ఈ కథ సందేశమిస్తోంది.

దేవి యొక్క సాత్త్విక రూపమే మహా సరస్వతి. శరత్కాల చంద్రుని లాంటి కాంతితో, ఎనిమిది చేతులలో, ఘంట, శూలం, నాగలి (నాగేటి కర్ర), శంఖం, రోకలి, చక్రం, ధనుస్సు, బాణాలు ధరించి ఉంటుంది. పార్వతి యొక్క భౌతిక కోశం నుండి పుట్టినది కౌశికీ దుర్గ. మూర్తీభవించిన సమగ్ర భౌతిక సౌందర్యం ఒక నియతికీ, సక్రమ కార్య నిర్వహణకూ ప్రతినిధి. ఈమే ధూమ్రలోచన, చండ, ముండ, రక్తబీజ, నిశుంభ, శుంభులను ప్రధానంగా సంహరించింది. వీరందరూ మానవునిలోని దురహంకారానికి, మొత్తం అరిషడ్వర్గానికి ప్రతినిధులు. వీరందరూ భిన్న భిన్న దశలలో ఉన్న అహంకారాన్ని సూచిస్తారు. స్థూల అజ్ఞానాన్నీ, అహంకారాన్నీ సూచిస్తాడు ధూమ్రలోచనుడు. పొగలు కక్కే కన్నులతో ఉంటాడు. అహంకారం, రకరకాల వేషాలు ధరించినట్లు రక్తబీజుడూ చచ్చి బ్రతుకుతూ ఉంటాడు. అహంకార బీజం ఇతనిలో మహావృక్షమైనట్లు భావించాలి. అహంకారం యొక్క మంద రూపం ముండుడు. దాని భయంకర రూపం చండుడు. శుంభ నిశుంభులు తీవ్రమైన అహంకారానికి ప్రతినిధులు.

ఒక్క హూంకారంతోనే ధూమ్రలోచనుడు కను మరుగయ్యాడు. చండ ముండులను దేవి ప్రత్యక్షంగా ఎదుర్కొనాల్సి వచ్చింది. ఆమె ఆజ్ఞను అనుసరించి కాళి వారిని ఎదుర్కొంది. ఈ భయంకర రూపిణి, ఆ భయంకరులను ఢీ కొంది. రక్తబీజుణ్ణి సంహరించాలనుకొంటే కొన్ని యుక్తులు అవసరం. అతని అహంకారానికి మూలం అన్వేషించి మరీ మట్టుపెట్టాల్సి వచ్చింది. శుంభ నిశుంభులతో ప్రత్యక్ష యుద్ధమే సాగింది.

అధమ స్థితిలో నున్న అహంకార ప్రతినిధులైన ధూమ్రలోచన, చండ, ముండులను ఒక్కమాటు ఉవ్వెత్తుగా లేచి క్రోధాగ్నితో సంహరించవలసి వచ్చింది. రక్తబీజుణ్ణి సంహరించినా వెంటనే మొలకెత్తుతున్నాడు కదా! ఇక్కడ తెలివిని ఉపయోగించి మూలకారణాన్ని అన్వేషించి మరీ చంపాలి కనుక... కాళి నాలుకను చాచడం, రక్తాన్ని పానం చేయడం, తరువాత సంహరించడం జరిగింది. కనుక ఉత్తేజితమై, ఎల్లవేళలా ఉండే అహంకారాన్ని ఎదుర్కొనాలంటే తిన్నగా యుద్ధ రంగంలోకి దిగక తప్పదు. ఆ పోరు చాలాకాలం పట్టవచ్చు. దేవి అనుగ్రహం ఇక్కడ తప్పనిసరి.

పురాణాగమాలలో దేవి యొక్క భిన్న రూపాలు, అనంతంగా ఉన్నాయి. శైలపుత్రి, కూష్మాండ, కాత్యాయని, క్షేమంకరి, హరసిద్ధి, వనదుర్గ, వింధ్యవాసిని, జయదుర్గ, మొదలైన అనేక నామాలతో ఈమె విరాజిల్లుతోంది. ఈ అన్ని మూర్తులూ ఒక్కొక్క కోర్కెను ప్రత్యేకంగా తీర్చేవే. శిల్ప శాస్త్రాలు ఈ మూర్తులను ఎలా మలచాలో విపులంగా వర్ణించాయి.

దుర్గా మూర్తులు 4, 8, 10, 18, 20 చేతులతో రకరకాలుగా ఉంటాయి. సాధారణంగా మూడు కన్నులతో మలచబడి ఉంటాయి. ఒక కిరీటంలా మలచబడి ఉండే



జుట్టుముడిని 'కరండ మకుట'మని అంటారు. అనేక ఆభరణాలతో, ఎర్రని వస్త్రంతో ఉంటుంది. సాధారణంగా ఆమె చేతుల్లో ఉండే ఆయుధాలివి – శంఖం, చక్రం, శూలం, ధనుస్సు, బాణం, ఖడ్గం, బాకు, డాలు, అక్షమాల, పానపాత్ర, ఘంటాదులు. ఆమె పద్మంపై ఉన్నట్లు గానీ, మహిష శిరస్సుపై అధివసించినట్లుగానీ, లేదా సింహవాహినిగా గానీ విగ్రహం రూపొందించబడుతుంది.

సింహం మృగరాజు కదా! ఆహారం తినాలనే కోరికకూ, భోగాలను అనుభవించాలనే వాంఛకూ ఆ సింహం ప్రతినిధి. అది మోహానికి దారి తీస్తుంది. మానవులలో వీటిని అణచాలని గుర్తు చేయడం కోసం దేవి సింహవాహనం అధిరోహించి ఉంటుంది; ఇదే సింహవాహిని సందేశం. ❖

'జీవులందరిలో ఉన్నది ఒకే ఆత్మ'అని వేదాంతం చెబుతుంటే, మన దేశంలో స్త్రీ పురుషుల మధ్య తారతమ్యం ఎందుకు? జగజ్జనని ప్రతిరూపాలైన స్త్రీలను ఉద్ధరించకపోతే ప్రగతి సాధ్యం కాదు. -స్వామి వివేకానంద



ఆనందం మీలోనే ఉంది

– స్వామి అర్చనానంద

'The more Bliss is within, the more spiritual you are' – 'నీ అంతరంగంలోపల ఎంత అధికంగా ఆనందమున్నదో, అంత అధికంగా నీవు ఆధ్యాత్మపరుడవు, ఆత్మనిష్ఠలో నెలకొన్నవాడవు' అన్నది వివేకానంద అమృత వాణి. సకల చరాచర సృష్టిలో ప్రతి జీవీ కాంక్షించేదీ 'ఆనందమే'. రెక్కలు ముక్కలు చేసుకొని మండుటెండల్లో కష్టించి పనిచేసే కూలీ అయినా, ఏ.సి. లగ్జరీ హైటెక్ ఆఫీసుల్లో అతి మెత్తని సోఫాల్లో ఆసీనులై 'స్మార్ట్'గా పనిచేసే సాఫ్ట్‌వేర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరైనా – మానవులందరి లక్ష్యం ఒక్కటే! 'ఆనందం'గా ఉండడం, జీవించడం.

మరి ఈ'ఆనందం' అంటే ఏమిటి? ఆనందం అసలు ఎక్కడ లభిస్తుంది? దాని విలువ ఎంత? బాహ్య పరిస్థితులకూ, ప్రలోభాలకూ, ఇంద్రియ ఆకర్షణలకూ ఏ మాత్రం లోను కాకుండా మన నిజస్వరూపమైన ఆత్మచైతన్యం – సత్ చిత్ ఆనందమయ పరమాత్మ తత్త్వంలో తాదాత్మ్యం చెందే స్థితే 'ఆనందం'. ఆత్మనిష్ఠలో నెలకొనడమే 'ఆనందం'. ఈ ఆనందం ఆత్మలో, అంతరాత్మలో, పరమాత్మలో లభిస్తుంది. ఆనందం విలువ ఆనందమే!

ఈ ఆనందం బయట ఏదో వస్తువులోనో, వ్యక్తిలోనో, ప్రాంతంలోనో, ఆస్తీ, అంతస్తూ, అధికారంలోనో – ఇలా ఇంకా ఎక్కడెక్కడో 'బయట' నుండి లభిస్తుందని అనుకొని మనిషి భ్రాంతిలో పడి కొట్టుమిట్టాడుతున్నాడు. ఓ చమత్కార కవి అన్నాడు – 'మనిషి చెడిపోయాడెందుకు? – 'మని' అండ్ 'షి' (ధనం & స్త్రీ వ్యామోహం – కామినీ కాంచనాసక్తి)లో పడిపోయాడు! అందుకు! 'So long as we need somebody to make us happy, we are slaves only – మనం ఆనందంగా ఉండడానికి ఇంకొకరిపై ఆధారపడి ఉన్నంత కాలం మనం బానిసలమే!' అని అన్నారు స్వామీజీ.

'ఏమండీ, బాగున్నారా?' అని అందరూ అడిగే ప్రశ్నే! 'ఆ... బాగున్నాం' అని అందరూ ఇచ్చే సమాధానమే! ఎవ్వరూ లేని ఏకాంతంలో కూర్చుని మీ మనస్సునూ, మీ హృదయాన్నీ, మీ అంతరాత్మనూ మీరే అడగండి – 'బాగున్నారా?' అని. 'ఎంత' బాగున్నారో మీకే తెలుస్తుంది! 'బాగున్నారా?' అంటే 'ఆత్మలో, పరమాత్మలో 'బాగా' ప్రతిష్ఠితులై ఉన్నారా' అని అసలు అర్థం. అందుకే హిందీలో కుశలప్రశ్నలు వేసేటప్పుడు – 'ఆప్ స్వస్థ్ హై?' (మీరు స్వ-నిజాత్మ స్థితిలో స్థ-స్థితులై, నెలకొని ఉన్నారా?) అని అడుగుతారు.

యువ నరేంద్రుణ్ణి చూడగానే శ్రీరామకృష్ణులు – 'ఈ కుర్రవాడెవరు? ఇతను ధ్యానసిద్ధుడు, నిత్య సిద్ధుడు. బయటకు ఎలా కనిపించినా ఈతని మనస్సు మహోన్నతమైన అఖండ సచ్చిదానంద పరబ్రహ్మంలో ప్రతిష్ఠితమై ఉంది. నరేంద్రుడు మాయలో ఎన్నడూ చిక్కువడడు. మాయా మోహ పాశాల్ని తీవ్ర వైరాగ్య ఖడ్గంతో ఖండఖండాలుగా నరికి పారేస్తాడు! సప్తర్షి మండలం నుండి భూలోకవాసులకు జ్ఞానబోధ చేయడానికి ఏతెంచిన మహర్షి' అని వేనోళ్ళ కొనియాడారు. ఎవరు పడితే వారి చేతి నుండి, ఇంటి నుండి తమ శిష్యులు భోజనం చేయడానికి అభ్యంతరం చెప్పేవారు శ్రీరామకృష్ణులు.

కానీ నరేంద్రుడు అలా చేసినప్పుడు ఇతరులు ఫిర్యాదు చేస్తే – 'నరేన్ ఎవరనుకున్నారు? నిత్య సిద్ధుడు, ధ్యానసిద్ధుడు.

(మిగతా 30వ పేజీలో...)

సమ్మోహం వదలండి!

మిత్రులారా! ఇప్పుడు మీకు అప్రియంగా తోచే కొన్ని యథార్థ విషయాలు చెప్పవలసి ఉంది. మన దీనదరిద్ర సోదరులలో ఎవడైనా ఒక ఆంగ్లేయునిచే అవమానించ బడినప్పుడు గాని, హత్య చేయబడినప్పుడు గాని దేశమంతా ఎలా గగ్గోలు పెడుతుందో వార్తాపత్రికల్లో నేను చదువుతుంటాను. దుఃఖిస్తాను. మరుక్షణమే దీని కంతకూ బాధ్యులెవరు? అనే ప్రశ్న నా మనస్సుకు తడుతుంది. వేదాంతిని కావడం వల్ల ఆ ప్రశ్నను నాకు నేను వేసుకోక తప్పదు. హిందువు అంతర్దృష్టి కలవాడు. అతడు అన్ని విషయాలనూ తనలోనే, తన ద్వారానే సాక్షి దృష్టితో చూడగోరుతాడు. కాబట్టి బాధ్యులెవరు అని నన్ను నేను ప్రశ్నించుకొంటాను. 'ఆంగ్లేయులు కారు' అనే సమాధానమే ప్రతిసారి అంతర్వాణి చెబుతూ ఉంటుంది! నిజం! వారు బాధ్యులు కారు! మన దౌర్భాగ్యానికి అంతటికీ, మన పతనానికి అంతటికీ బాధ్యత మనదే. అన్నిటికీ మనమే బాధ్యులం.

మన పూర్వులలో ఉత్తమ కులీనులు ఇతర సామాన్య జనులను కాలద్రొక్కి నేలరాశారు; వారిని దిక్కులేని వారిని చేశారు. ఈ హింసల వల్ల ఆ నిర్భాగ్యులు తాము మనుష్యులమనే మాటే దాదాపుగా మరచారు. ఇలా అనేక శతాబ్దాల కాలం గతి లేక వారు కట్టెలు కొట్టి, నీళ్ళు మోసి, చెప్పులు కుట్టి, కూలీనాలీ చేసుకొని ఎలాగో బ్రతుకులు కొనసాగించారు. తాము సేవకులుగా, బానిసలుగా జన్మించామని భావించి వారు అలాగే దుర్భర దారిద్ర్యాన్నీ, అవమానాల్నీ భరిస్తూ కాలం వెళ్ళబుచ్చారు. ఈ కాలపు విద్యాధికతను మనమేదో గొప్పగా చెప్పుకొంటున్నాం. కానీ ఈ దౌర్భాగ్య జీవులపై దాక్షిణ్యం వహించి ఎవడైనా వారిని ఉద్ధరించాలని ప్రయత్నించేటప్పుడైనా ఈ విద్యాధికులు ముందుకు వచ్చి అలాంటి వారికి సహకరించరు.

ఈ దీనజనులు, ఈ పీడిత సోదరులు, ఈ ఆజన్మదరిద్రులు తమ యథార్థతత్త్వాన్ని తెలుసుకోవాల్సి ఉంది. బలవంతులకూ, బలహీనులకూ అందయై ఉత్తములకూ, నీచులకూ ఆధారమై ప్రతివానిలోను ఒక్క అఖండాత్మే ప్రకాశిస్తోంది. యోగులు, మహర్షులు కావడానికి తగిన అనంతావకాశం, అఖండశక్తి, అందరిలో ఉంది. ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడు, ప్రతి బాలిక - ప్రతి బాలుడు, జాతి భేదం లేక, జన్మ భేదం లేక సబల దుర్బల, తారతమ్య విచారణ లేక విశ్వమానవకోటి అంతా దీనిని ఆలకించి యోచన చేయును గాక!

"ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్నిబోధిత!" - "లేవండి మేల్కొనండి! దుర్బలత నుండి, సమ్మోహనం నుండి తెప్పరిల్లండి" నిజంగా ఎవడూ దుర్బలుడు కాడు! ఆత్మ అఖండం. సర్వశక్తిమంతం! సర్వజ్ఞం; లేచి నిలబడండి! మీ స్వస్వరూపాన్ని ప్రకటించండి; మీలో ఉన్న బ్రహ్మాన్ని ప్రకాశింపచేయండి! వానిని నిర్లక్ష్యం చేయకండి!

మితిమీరిన సోమరితనం, మితిమీరిన దౌర్బల్యం, మితిమీరిన మోహజాలం శనిదేవతలా మన నెత్తి పైకెక్కి చిందులు తొక్కుతున్నాయి. ఓహో! నవభారత పుత్రులారా! సమ్మోహం వదలండి. మీ సత్య స్వరూపాన్ని మీరు తెలుసుకోండి. ప్రతి ఒక్కరికీ వాని స్వస్వరూపం బోధించండి! నిద్రాణమై ఉన్న జీవుని ఎలుగెత్తి పిలవండి! ఓహో! అతడెలా మేల్కొంటాడో, మీరే చూడగలరు. ఆ సుప్తజీవి మేల్కొని స్వస్వరూప జ్ఞానంతో కార్యపరుడైనప్పుడు అతనికి శక్తి వస్తుంది. తేజస్సు వస్తుంది; శుభం కలుగుతుంది. పవిత్రత కలుగుతుంది. ఉత్కృష్టమైనదంతా అతణ్ణి వరిస్తుంది. ❖



ఒక స్త్రీకి జ్ఞానం కలిగితే ఆమె ప్రభావం వల్ల ఆ కుటుంబం మొత్తానికి జ్ఞానం, సత్యాన్ని గురించిన ప్రబోధం కలుగుతుంది. దేశానికి మహత్తరమైన శ్రేయస్సు కలుగుతుంది. - స్వామి వివేకానంద



చికాగో ప్రసంగాల చిరస్థాయి ప్రభావం

– స్వామి శశికాంతానంద

మన మధ్య విభేదాలెందుకు?: వేలాది సంవత్సరాల నుండి మానవజాతిని పీడిస్తున్న మత విభేదాలనూ, వాటి వల్ల సంభవించే అరాచకాలనూ నిర్మూలించాలంటే వాటి మూల కారణాన్ని తెలుసుకోవాలి. 'మన మధ్య విభేదాలెందుకు?' అన్న తమ రెండో ప్రసంగంలో – తన నుయ్యే సర్వస్వమనీ, సముద్రం కన్నా తన నుయ్యే పెద్దదనీ భావించే నూతి కప్పలా, ప్రతి ఒక్కరూ తమ మతమే సర్వస్వమూ, అన్ని మతాల కన్నా తమ మతమే గొప్పది అన్న భావంతో ఇతర మతాలను కించపరచి, తూలనాడడం సమంజసం కాదు. ప్రతీ మతం వారూ తమ తమ సంకుచిత భావాలను వీడి, తమ చిన్న నూతి నుండి బయటకు వచ్చినప్పుడే విశాల ప్రపంచం మనదవుతుంది. మనస్సు విశాలత నొంది, సమ్యగవగాహనకూ, పరస్పర స్నేహ సహకారాలకూ దారి తీస్తుంది. అప్పుడే ప్రజలంతా ఆనందంగా, శాంతియుతంగా కలిసి మనుగడ సాగించగలరు' అని స్వామి వివేకానంద పేర్కొన్నారు.

భిన్నత్వంలో ఏకత్వం: సనాతన ధర్మ ప్రకాశిని Paper on Hinduism స్వామీజీ చేసిన మూడో ప్రసంగం. హిందూ మతపు వివిధ సంప్రదాయాలలో ఉన్న విభిన్న భావాలను సమన్వయ పరచి సమగ్ర హిందూ మత స్వరూపాన్ని అందరికీ ఆమోదయోగ్యంగా, వివిధ రకాల పుష్పాలతో చేసిన అందమైన పుష్పగుచ్ఛంలా తయారుచేసి అందించారు స్వామీజీ. 'అతి ప్రాచీన మతమైనప్పటికీ, హిందూమతం దినదినాభివృద్ధి చెందుతూ పటిష్ఠమవడానికి ముఖ్య కారణాలు – ఆ మతంలో ఉండే విశ్వజనీనత, ఇతరుల భావాలను తనలో కలుపుకొనే ఔదార్యం, ఇతర మతాల్లోని మంచిని గ్రహించి జీర్ణించుకునే శక్తి!

భిన్నత్వంలో ఏకత్వం హిందూమత ప్రత్యేకత. 'పాపి' అన్న పదానికి తావే లేదు. 'అమృతస్య పుత్రాః' – 'మీరంతా అమృత పుత్రులు' అని వేదాలు ఘోషిస్తున్నాయి. హిందూ మత విశ్వజనీనతకు మూల సూత్రాలు, హిందూ మతానికి సుస్థిర పునాదులైన సిద్ధాంతాలు ఇవీ – 'ప్రతీ ఒక్కరూ దైవ స్వరూపులే; జీవిత పరమావధి పరమశాంతి ప్రదాయకమైన మోక్షమే' అని పలికారు.

కాలే కడుపుకు కావలసింది: ఇక నాలుగో ప్రసంగం. "Religion-not the crying need of India" 'భారతీయులకు తక్షణం కావలసినది మతం కాదు' అన్న అంశం. 'అన్నమో రామచంద్రా!' అని అలమటించే నిరుపేదలకు కావలసింది పట్టెడన్నం మాత్రమే! క్రైస్తవ దేశాలు ఈ బీదలకు మతబోధలు చేసి, మత మార్పిళ్ళకు ప్రోత్సహిస్తున్న సమయం అది. స్వామీజీ ఆగ్రహంతో కాక, ఆవేదనతో చేసిన ప్రసంగమిది.

స్వామీజీ ప్రసంగం విన్న తరువాత ఒక విదేశీ క్రైస్తవుడు చేసిన వ్యాఖ్య ఇది: "వీరినా మనం మూర్ఖులుగా

పరిగణిస్తున్నది? ఇలాంటి విజ్ఞులకూ, ఉత్తమ సంస్కృతికీ ఆలవాలమైన దేశానికా మనం మత బోధకులను పంపించడం? వారి మతాచార్యులు మన దేశం వచ్చి మనకు ప్రబోధించడం సమంజసం."

ఇక, స్వామి వివేకానంద తమ అయిదో ప్రసంగంలో బుద్ధుని గురించి, బుద్ధుని అవతార విశిష్టత గురించి తెలుపుతూ ప్రస్తుత సమాజానికి బుద్ధుని హృదయం - శంకరుని మేధ అత్యంత ఆవశ్యకాలని తెలిపారు.

సమన్వయం - సామరస్యం: విశ్వమత మహాసభల చివరి సమావేశం 1893 సెప్టెంబర్ 27వ తేదీన జరిగింది. ఆరవదీ, ఆఖరుదీ అయిన తన ప్రసంగాన్ని స్వామి వివేకానంద చాలా సంగ్రహంగా చేసినప్పటికీ, ఆయన తొలి ప్రసంగంలో లాగానే అదే విశాల భావాలు, విశ్వజనీనత ఉట్టిపడ్డాయి. 'ఇతర మతాల్ని అణగద్రొక్కి, ఏ ఒక్క మతమూ పైకెదగలేదనీ, ఇతర మతాల వినాశనాన్ని కోరే ఏ మతమూ బ్రతికి బట్టకట్టలేదనీ నిర్ద్వంద్వంగా నొక్కి చెప్పారు వివేకానంద.

ఏ ఒక్కరూ తమ తమ మతాలను మార్చుకోనక్కరలేదనీ, ఇతర మతాల్లోని మంచిని గ్రహించి, ఎవరి మతాన్ని వారు చిత్తశుద్ధితో అవలంబిస్తే గమ్యాన్ని చేరవచ్చుననీ బోధించారు.

పవిత్రత, పరిశుద్ధత అనేవి ఏ ఒక్కరి సొంతమూ కాదనీ, ప్రతీ మతమూ ఆధ్యాత్మిక ఉన్నతి నొందిన మహాత్ములను తయారు చేసిందనీ నిష్కర్షగా చెప్పారు వివేకానంద. పరస్పర సహకారంతో, ఇతర మతాలలోని మంచిని గ్రహించి, ఆకళింపు చేసుకొని సమత, సమభావాలతో శాంతియుతంగా కలిసి జీవించడమెలా? అన్నదే విశ్వమత మహాసభలలో వారి అంతిమ ప్రసంగ సారాంశం.

వివేకానందునికోసమే విశ్వమత మహాసభలు నిర్వహించారా? లేక విశ్వమత మహాసభల కోసమే వివేకానందుడు వెలిశాడా? అన్నంత వైభవంగా జరిగాయి ఆ సభలు.

సంకట కాలంలో సంస్మరణీయుడు: ఇవాళ సాంకేతిక పరిజ్ఞానం పెరిగింది. ప్రపంచ దేశాల మధ్య, మనుష్యుల మధ్య భౌతికంగా దూరాలు తగ్గుతున్నా, హృదయాల మధ్య అగాధాలు పెరుగుతున్నాయి. సుఖ సాధనాలు పెరుగుతున్నా, సుఖ శాంతులు కరవవుతున్నాయి. ఇది ప్రస్తుత సమాజ దయనీయ దుఃస్థితి. వివిధ ఆదర్శాలు, భావాల మధ్య ఉన్న విభేదాలే ప్రపంచ విచ్ఛిన్నతకూ, అశాంతికీ ముఖ్య కారణాలుగా పరిణమిస్తున్నాయి. ఇలాంటి విషమ పరిస్థితుల నుండి మనం బయట పడాలంటే వివేకానందుడు ఒసగిన విశ్వజనీనమైన సమత, సమన్వయ, సామరస్య భావాలు, సర్వమానవ సౌభ్రాతృత్వమే శరణ్యం. ఈ సంకటకాలంలో వివేకానందుని సందేశం అవశ్యం స్మరణీయం.

ముగింపు: గతానికి చెందిన చారిత్రక వ్యక్తి కాదు వివేకానంద స్వామి. నేటికీ మానవాళి సర్వోన్ముఖ సౌభాగ్యానికీ చైతన్యంతో, సజీవంగా కృషి చేస్తూ ఉన్న ఒక అదృశ్య శక్తి ఆయన. 'జీర్ణస్థితికి చేరిన వస్త్రంలా నేను ఈ శరీరాన్ని వదిలిపెట్టినా, ఎల్లెడలా మానవాళిని ఉత్తేజపరుస్తూ, వారంతా తాము భగవంతుని స్వరూపాలమే అని తెలుసుకునేంత వరకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటాను' అని ఆయనే స్వయంగా పేర్కొన్నారు.

భారతజాతి గర్వించదగ్గ విశిష్ట వ్యక్తులలో వివేకానంద స్వామి అగ్రగణ్యులు. స్వామీజీ ఒసగిన ఈ అమూల్య సందేశాల స్ఫూర్తిని ఆకళింపు చేసుకొని, మన జీవితాలలో వాటిని చిత్తశుద్ధితో ఆచరించడమే మన కర్తవ్యం. ఇదే మనం వివేకానందునికి అర్పించే ఘన నివాళి! ❖

సమాజంపై చికాగో ప్రసంగాల ప్రభావం:

స్వామి వివేకానందుని చికాగో ఉపన్యాసాలు సమాజాన్నెంతగా ప్రభావితం చేశాయి? సమాజంలో ఏ కొంత పరిణతి అయినా కలిగిందా? అని ప్రశ్నించుకుంటే మనకు లభించే సమాధానాలు ఇవి:

1. ప్రపంచ దేశాలలో భారతీయ సంస్కృతిపై అంత వరకూ ఉన్న అనాదరణ, అపోహలు తొలగి పోయాయి. సాటి దేశాలలో భారతదేశానికి విశిష్టస్థానం కలిగింది.
2. భారతదేశం ఆధ్యాత్మికంగా ఇంతటి సుసంపన్న దేశమా? అని పాశ్చాత్యులంతా నివ్వెరపోయారు.
3. భారతదేశం తనకు తాను విధించుకున్న అడ్డుగోడలను అధిగమించి, ఒంటరితనాన్ని విడిచి, ప్రపంచ దేశాలలో తన ఉనికిని చాటుకోవడానికి ఈ సభలు దోహదం చేశాయి.
4. అంతవరకూ అంతఃకలహాలతో సతమతమవుతున్న హిందూ మతానికి ఒక సమగ్ర స్వరూపాన్ని ప్రసాదించాయి.
5. మతమనే మాటకు గౌరవప్రదమైన స్థానాన్ని కల్పించి, మత సమన్వయానికి పటిష్ఠమైన పునాదులు వేయడం జరిగింది.
6. మతమంటే ఆధ్యాత్మిక అనుభూతి అనీ, మనిషిలో గర్భితంగా ఉన్న దివ్యత్వాన్ని వెలికి తీయడమే మతమనీ చేసిన నిర్వచనం పాశ్చాత్యుల మతాభిప్రాయాలపై నూతన వెలుగును ప్రసరించింది.

గార్గి, మైత్రేయి వంటి వారికి వేదాలను అధ్యయనం చేయడానికి అర్హత ఉన్నప్పుడు, నేటి స్త్రీలకు కూడా అటువంటి అర్హత ఎందుకు ఉండకూడదు? చరిత్ర పునరావృతమవుతుంది. - స్వామి వివేకానంద



– స్వామి శితికంఠానంద

చట్టాలా?... సంస్కారాలా?

సెప్టెంబర్ మాసాంతం. ముందుగా నిర్ణయించుకున్న ప్రకారం మిత్రద్వయం వినీత్, వికాస్‌లు కలుసుకున్నారు. స్వామి వివేకానంద భావామృత ధారను గ్రోలుతున్న యువ స్నేహితులకు ప్రపంచం ఒక కొత్త రీతిన కనిపించడం మొదలైంది. ఇంకా తెలుసు కోవాలన్న కుతూహలం, ఆలోచనలను పంచు కొని అవగాహనను పెంచుకోవాలన్న తపన మళ్ళీ ఈ సంభాషణగా రూపొందింది.

వినీత్: నాదొక సందేహం వికాస్! మనదేశంలో రోజురోజుకూ చట్టాల సంఖ్య పెరిగిపోతూనే ఉంది. ఎన్ని చట్టాలంటే ప్రజలు వాటి చట్రాలలో ఇరుక్కొని నలిగిపోతున్నారు. దానితో వాటి ఉల్లంఘనే నిత్యకృత్యమవుతోంది. ఎవరూ చట్టాలను అనుసరిస్తు న్నట్లు కనపడడం లేదు. ఎవరూ చట్టాల పట్ల విధేయతను కనపరుస్తున్నట్లు చూడం. యుగాచార్య వివేకానందుడు ఇలాంటి పరిస్థితులలో మనకు ఎలాంటి సందేశ మిచ్చేవారో! స్వామీజీ రోజుల్లో ఇలాంటి పరిణామం లేదు కదా! ఆయన తన మహా సాహిత్యంలో ఈ విషయాన్ని చర్చించడం చూశావా?

వికాస్: స్వామీజీ చర్చించని, స్పృశించని విషయాలు ఏమన్నా ఉన్నాయా వినీత్? సూర్యుడి కింద, పైన ఉన్న సమస్త విషయాలపై తన బుద్ధి దివిటీని ప్రసరింపజేసి, మానవాళి ప్రతి విషయాన్నీ సరికొత్త వెలుగులో చూడడానికి దోహదపడిన ప్రజ్ఞా ధురంధరుడు కదా వివేకానందుడు. చట్టాలను పెంచడం వల్ల ప్రయోజనం లేదు. స్వామీజీ మన దేశం గురించి 'No country on earth has so many laws, and in no country are they so less regarded. – ప్రపంచంలో ఏ దేశంలోనూ ఇన్ని చట్టాలు లేవు; మరి ఏ దేశంలోనూ చట్టాలు ఇంతగా ఉల్లంఘింపబడవు' అని అన్నారు.

ఇంకొకచోట స్వామీజీ ఇలా పేర్కొన్నారు: 'I think the great need of the hour is less law, and more godly men and women–'కొద్దిపాటి చట్టాలతో ఎక్కువ మంది దైవీ సంస్కారాలతో కూడుకున్న స్త్రీ పురుషులు మనకు ప్రస్తుతం అవసరమై ఉన్నారు'.

ఇన్ని చట్టాలు, శాసనాలు, నియమాలు, నిబంధనలు... వీటితో విసిగి, చట్ట అతిక్రమణ నిత్య ప్రక్రియ అవుతుంది. అంటే ప్రజలు స్వకీయ ధృతితో నైతిక మార్గంలో ప్రయాణించడానికి సిద్ధపడాలి. బలవంతంగా శాసనాల ద్వారా మనం వ్యక్తుల్ని ఋజువర్తనుల్ని చేయలేం. లోపల ఆధ్యాత్మిక సంస్కారం ఉంటే వారు స్వభావరీత్యానే ధర్మవర్తనులుగా ఉంటారు. అందుకనే మనకు ఎన్ని చట్టాలున్నా అవినీతి, లంచగొండితనం, దోపిడీలను అరికట్ట లేకపోతున్నాం. స్వామీజీ అన్నట్లు, 'Too many laws are a sign of death and decay of society... అధిక సంఖ్యలో చట్టాలు సమాజం పతనమైందనడానికి సూచన'.

వినీత్: అధిక సంఖ్యలో చట్టాలుండడమే కాదు. వాటిని అమలు పరచవలసిన వాళ్ళు నైతిక వర్తనులుగా లేరు. దానితో అధర్మవర్తనుల చేతిలో ఆ చట్టం ఒక అధికారంగా మారింది. తద్వారా సమాజంలో ఈ చట్టాలు ఇంకా ఎక్కువ దోపిడీకీ, పెత్తందారీ వ్యవస్థకు ఉపకరిస్తున్నాయి. ప్రజలు దానితో ఇంకా ఇక్కట్లకు గురవుతున్నారు. పాలన పరోక్షంగా పీడనకు దారి తీస్తోంది.

వికాస్: పరోక్షంగా ఏమిటి? ప్రస్తుతం పాలన అంటే ప్రత్యక్ష ప్రజాపీడనే. అందువల్ల ప్రజలకు సుఖసంతోషాలను ప్రసాదించాల్సిన శాసనాలను అధర్మవర్తనులు అమలు పరచాల్సి రావడంతో వాటి ప్రయోజనం నెరవేరడం లేదు. కంచె చేనును మేస్తే ఎవరైనా ఏం చేయగలరు? కంచె చేనును మేస్తుందని ఇప్పుడు ఇంకొక కంచెను వేయడం జరుగుతోంది. ఇలాంటి చర్యల వల్ల నిజమైన ప్రయోజనం ఒనగూరుతుందా? మనిషి అవివేకానికి ఇది పరాకాష్ఠ కాదా?

వ్యక్తి నిర్మాణం జరగకుండా జాతి నిర్మాణం జరగదని స్వామీజీ అన్నారు కదా! త్యాగం, సేవ.. తద్వారా పరమ సౌఖ్యమైన మోక్షాన్ని పొందడం ...ఈ ఆదర్శాల ద్వారా వ్యక్తినిర్మాణం చేయడానికి మనం పూనుకోవాలి. వ్యవస్థను అందుకు అనువుగా మలుచుకోవాలి. తీర్చిదిద్దుకోవాలి. రామరాజ్య భావనను విస్తరింపజేయాలి.

వినీత్: రామరాజ్యం అని చాలాసార్లు విన్నాను గానీ నాకు అదేమిటో సరిగ్గా తెలియలేదు. కాస్త వివరించి చెప్పు మిత్రమా!

వికాస్: ఏమీ లేదు. మనం ముందు చర్చించుకున్నట్లు వ్యక్తి నిర్మాణం చేసుకోగలిగితే ఆదర్శ వ్యక్తులు, దేశభక్తి కలిగిన వ్యక్తులు సమాజంలో ఉన్నత స్థానాలను అధిరోహిస్తే, వాళ్ళను అనుసరిస్తూ మిగతావాళ్ళు తమ జీవితాలను తీర్చిదిద్దుకుంటారు. రామరాజ్యం అంటే అయోధ్యను శ్రీరాముడు పరిపాలించే రోజులలో ఆయన ఆదర్శ రాజు కనుక ఆయన నడచుకున్నట్లే ప్రజలూ నడచుకొనేవారు. ఈతి బాధలు, భయంకర రోగాలు, అకాల మరణాలు ఆ రోజుల్లో లేవు. చట్టాల అవసరం లేకుండానే ప్రజలందరూ ధర్మమార్గంలో నడచుకునేవారు. శిక్షలు, చెరసాలలూ అప్పుడు లేవు. వారందరూ కూడా ఉన్నత సంస్కారం కలిగి ఉండి, ఉత్తమ నడవడికను ప్రదర్శించారు.

వినీత్: అలాంటి వ్యక్తులను ఈ కలియుగంలో మనం చూడగలుగుతామా? అసలు సాధ్యమా?

వికాస్: ఎందుకు సాధ్యపడదు? తప్పకుండా సాధ్యపడుతుంది. మనం ఆ ఆదర్శాన్ని తీసుకొని ముందుకు నడవాలి. ఈ రోజు కూడా మన సమాజంలో ఎంతో మంది వ్యక్తులు అద్భుతమైన శీలసంపదతో ఆదర్శ జీవితాన్ని గడుపుతున్నారు. వారు లేకుంటే ప్రపంచం ఈ పాటికి నాశనమై ఉండేది. భారతావనిలో అలాంటి సచ్ఛీలురు, సాధువర్తనులైన స్త్రీ పురుషులు లేని యుగం లేదు. వారి వల్లనే భూమి ధరింపబడుతోంది. లేకపోతే ఈ ప్రపంచం ఈ పాటికి పూర్తి చీకటిలోకి వెళ్ళిపోయి ఉండేది. మహాభారతంలో మహాసాధ్వి సావిత్రి అన్న మాటలు నాకు ఇక్కడ గుర్తుకు వస్తున్నాయి. ఆ పతివ్రతా శిరోమణి అంటుంది,

'సన్తో హి సత్యేన నయన్తి సూర్యం, సన్తో భూమిం తపసా ధారయన్తి సన్తో గతిర్భూత భవ్యస్య రాజన్, సతాం మధ్యే నావసీదన్తి సన్తః !!'

సత్యపథాన పయనిస్తున్న వారి సత్యనిష్ఠ సూర్యుడికి తన భ్రమణానికి శక్తినిస్తుంది. సాధువులు వారి తపస్సు ద్వారా భూమిని ధరిస్తారు.



నిలబెడతారు. గతంలోనూ, భవిష్యత్తులోనూ సత్పురుషులే లోకానికి గతి. సత్పురుషులు సత్యపథంలో ఎదురయ్యే కష్టాలకు చలించరు.

వినీత్: 'సమాజం చాలా పతనమైంది. ఎంతవరకూ అంటే మనం ఈ ప్రపంచాన్ని ఉద్ధరించలేం. ప్రళయంలో లయమై మళ్ళీ కొత్త సృష్టి జరగాలి,' అన్న అభిప్రాయానికి వచ్చిన కొంతమంది వ్యక్తులు నాకు ఈ మధ్య తారసపడుతున్నారు. వారికి ఏం సమాధానం చెప్పాలి?

వికాస్: వారు అలా కంగారు పడవలసిన అవసరం ఏమీ లేదు? ప్రపంచం భగవంతుడి చేతిలో క్షేమంగా ఉంది. విధాతకు ఎప్పుడు, ఎలా ఈ ప్రపంచాన్ని నడిపించాలో తెలుసు. మనం ఆ బాధ్యతను మన మీద వేసుకోనక్కర్లేదు. వేసుకోలేము కూడా. సృష్టి ఎంతకాలం కొనసాగాలి, ఎలా కొనసాగాలి అన్నది ఆయన చేతుల్లో ఉంటుంది. మనం చేయాల్సిందల్లా మన నుంచి ప్రపంచానికి కొంచెం మంచి జరగాలని ప్రయత్నించడమే. 'నా వల్ల ఏమవుతుంది? ఈ ప్రపంచం పూర్తిగా పతనమైంది' అనుకునే వారు నిరాశావాదులు. మనం చేయగలిగేదంతా వ్యష్టిలోనే. సమష్టి ఎలా ఉంటుందో, ఏమవుతుందో అన్నది భగవంతుడు చూసుకుంటాడు. కాబట్టి ప్రతి మనిషీ ఎలాంటి ఆర్భాటమూ లేకుండా తాను చేయగలిగిన మంచిని చేయడమే ప్రస్తుత కర్తవ్యం.

వినీత్: అవును, అందులోనే నిజమైన గొప్పతనం ఉంది అంటారు స్వామీజీ. మొన్ననే స్వామీజీకి బాగా నచ్చిన ఈ భావనను చదవడం జరిగింది. ఆయన అంటారు – 'More and more the true greatness seems to me that of the worm doing its duty silently, steadily from moment to moment and from hour to hour.. సదా వర్తమానంలో ఉంటూ తన పనిని తాను నిశ్శబ్దంగా, నిశ్చలంగా చేస్తూ ఉండే పురుగుదే (మనం అల్పజీవి అని భావించే) నిజమైన గొప్పతనం అని నాకు అనిపిస్తోంది.' మనమందరం భగవంతుణ్ణి పూజించడానికే పుట్టాం. మనం మన కర్తవ్యాన్ని సరిగ్గా ప్రశాంతంగా, నిశ్శబ్దంగా చేసుకుపోతే అదే మనం భగవంతుడికి చేసే అత్యున్నతమైన పూజ. విధ్యుక్త ధర్మాలను సరిగ్గా అనుష్ఠించకుండా చేసే బాహ్యాడంబరాలు, పూజలు భగవంతుడిని సంతుష్ట పరచలేవు.

వికాస్: అవును. మనం ప్రపంచం గురించి ఎక్కువగా ఆలోచించకుండా మన కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వర్తిస్తే చాలు. ఈ రోజుల్లో 'వ్యవస్థ భ్రష్టు పట్టిపోయింది. ఇప్పుడు మనం ఏమీ చేయలేము' అంటూ నిరాశావాద మనస్తత్వాన్ని పెంచుకుంటున్న వారందరూ స్వామీజీ చెప్పిన పై వాక్యాన్ని తప్పకుండా తెలుసుకోవాలి. వ్యవస్థను మార్చేది వ్యక్తులే కాబట్టి వ్యక్తి మారితే వ్యవస్థ మెరుగవుతుంది. అందరం 'చీకటి.... చీకటి' అంటున్నాం కానీ ఒక జ్యోతిని వెలిగించడానికి పూనుకోవడం లేదు. ఒక జ్యోతిని వెలిగిస్తే అది ఇంకా పది జ్యోతులను వెలిగిస్తుంది. భగవంతుడు మనకీ అవకాశాన్ని ఎప్పుడూ ఇచ్చాడు. కాబట్టి మనం ఎలాంటి నైరాశ్యానికీ గురి కావాల్సిన అవసరం లేదు. సత్సంకల్పాలను కలిగివుండి, మన ద్వారా నలుగురికీ ఉపయోగపడే కార్యం ఏమన్నా జరిగితే మనల్ని మనం అదృష్టవంతులుగా భావించుకోవచ్చు.

వినీత్: చట్టాలు, శాసనాలు, శిక్షలు వ్యక్తిని మార్చలేవు. ఉన్నతా దర్శాలు, ఉన్నత భావనలు ఇచ్చి వ్యక్తులను సరియైన పథంలో ప్రవేశపెట్టాలి. ప్రాచీన గ్రంథాలలో ప్రతి పుటలోనూ మనకు వ్యక్తమైన సందేశాలు, 'సత్యమేవ జయతే నానృతం.. సత్యమే జయిస్తుంది. అసత్యం కాదు. ధర్మోరక్షతి రక్షితః.. ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనల్ని కాపాడుతుంది' లాంటి వాక్యాల స్ఫూర్తిని మనం పురాణాలలో, ఇతిహాసాలలో పేర్కొన్న పాత్రల ద్వారా నిత్యం యువతకు అందిస్తే ధర్మం కోసం నిలబడే వ్యక్తులు తయారవుతారు. అలాంటి వారి సంఖ్యను పెంచుతూ, చట్టాల ఆవశ్యకతను మనం తగ్గించుకుంటూ పోవచ్చు. అప్పుడు అందరికీ సుఖ శాంతులు కలుగుతాయి. అలాకాకపోతే ప్రభుత్వాలు ఏ చట్టాలు, శాసనాల ద్వారా ప్రజలకు సౌఖ్యాన్నీ, శాంతినీ ప్రసాదించాలని అనుకుంటాయో అవే ప్రజలకు ఇతోధిక దుఃఖాన్ని కలిగిస్తాయి.

వికాస్: దేశజనాభాలో అరవై శాతం ఉన్న యువత అంతా స్వామీజీని ఆదర్శంగా తీసుకొని ముందుకు వస్తే తప్పకుండా గొప్ప దేశాన్ని నిర్మించగలుగుతాం. భవిష్యద్భారతావనిని బంగారు భారతావనిగా ప్రకాశింపజేయగలుగుతాం. నీవేమంటావు వినీత్?

వినీత్: నీ భావాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఇప్పటికిక సెలవు. మళ్ళీ వచ్చే మాసాంతంలో కలుద్దాం మిత్రమా! ❖

ఇప్పుడు ఆధ్యాత్మికతను ఆధారం చేసుకొని స్త్రీ విద్యను వ్యాప్తి చేయాలి. ఆధ్యాత్మికత, శీలనిర్మాణం, బ్రహ్మచర్య వ్రతపాలన మొదలైన సద్గుణాలను పాటించేలా స్త్రీలకు శిక్షణ ఇవ్వాలి. -స్వామి వివేకానంద



ఆత్మీయమైన అంతరంగాన్ని ఆవిష్కరించే అద్భుత అక్షర గవాక్షాలు లేఖలు. మహనీయుల మనోలేఖిని రచించిన ఉత్తరాలు ఏ ఇద్దరి అనుబంధానికో, అనుభూతులకో పరిమితం కావు. అవి యావత్ మానవాళి హృదంతరాలను మీటి, ఆ భావాలు దిగంతాల వరకూ వ్యాపిస్తాయి; జాతిని జాగృతం చేస్తాయి. అలాంటి విశ్వవ్యాప్తమైన వెలుగు రేఖలే... ***స్వామి వివేకానంద లేఖలు***.

ప్రియ మిత్రులకు...

– స్వామి రఘునాయకానంద

ఉత్తరాలు రాయడం ఒక కళ. అది వ్యక్తి హృదయానికి అద్దం పడుతుంది. రాసే వ్యక్తి తన భావాలనూ, ఉద్వేగాలనూ అరమరికలు లేకుండా తెలియజేసే సాధనం ఉత్తరం. చరిత్రకారులు చరిత్రను ఆధారంగా చేసుకొని జీవిత చరిత్రలు రాయగలుగుతారే తప్ప; కథానాయకుని మనస్సులోని ప్రగాఢ భావాలను అర్థం చేసుకోలేరు కదా! అయితే సాధారణ వ్యక్తులు రాసిన ఉత్తరాలకూ, మహాత్ములు రాసిన ఉత్తరాలకూ ఎంతో తారతమ్యం ఉంటుంది. సూర్యుడు వెలుగు నిచ్చినట్లే దివిటీ కూడా వెలుగునిస్తుంది. కానీ ఈ ఒక్క ధర్మం చేత సూర్యుడూ, దివిటీ సమానమని తలచలేం కదా!

స్వామి వివేకానంద తన మద్రాసు శిష్యులనూ, ఇతర ప్రాంతాలలోని శిష్యులనూ, మిత్రులనూ ఉత్తేజపరుస్తూ సుమారుగా 750కి పైగా ఉత్తరాలు రాశారు. వారి ఉత్తరాల గురించి వారి మాటలలోనే: **"ప్రేమ, కృతజ్ఞత, విశ్వాసం నిండిన హృదయంతో మీ కోసం ఈ మాటలు రాసేందుకు నా కలాన్ని తీసుకొంటున్నాను. దీన్ని మొదట మీకు చెప్పనివ్వండి. నా జీవితంలో నేను కలిసిన, ఉత్తమ విశ్వాసాలను కలిగి ఉన్న కొద్దిమందిలో మీరూ ఒకరు. స్పందించే శక్తి, జ్ఞానాల అద్భుత మేళవింపు సంపూర్ణంగా మీ సొంతం. ఆలోచనల్ని కార్యరూపం లోకి తేగల వ్యవహార దక్షత కూడా మీకుంది. అన్నిటినీ మించి మీరు శ్రద్ధాళువులు. అందుకే నా భావనల్లో కొన్నింటిని మీకు తెలియపరుస్తాను."**

స్వామి వివేకానంద రాసిన ఉత్తరాలలోని భావాలు వారి జీవనశైలికీ, వారి ఆత్మసమర్పణ భావానికీ, మానవాళి పట్ల వారికున్న ప్రేమకూ, వారికున్న దేశభక్తికీ అద్దం పడతాయి. చదివిన వారి మనస్సుల్లో అవి ఉత్తేజాన్ని నింపుతాయి.

The word that is heard perishes, but the letter that is written remains.– విన్నది కొంతకాలానికి మది నుంచి తొలగిపోవచ్చు. కానీ రాసిన ఉత్తరం మాత్రం చిరస్థాయిగా ఉంటుంది. స్వామి వివేకానంద 1894వ సంవత్సరంలో తన సోదర సన్న్యాస శిష్యులకు ఇలా రాశారు: '... whoever reads this letter will imbibe my spirit! Have faith!... I feel as if somebody is moving my hand to write in this way.... **- ఈ ఉత్తరాన్ని ఎవరు చదువుతారో వారికి నా శక్తి సంక్రమిస్తుంది! నా మాట నమ్మండి.... ఎవరో నా చెయ్యి పట్టుకొని నాతో ఈ విధంగా రాయిస్తున్నట్లుంది!'** ఇతరులకు మంచి చేయాలన్న తపనను స్వామీజీ తన భావాలలో తెలిపారు. ప్రమదాదాస మిత్రాకు 1890 మార్చి3న ఘాజీపూర్ నుండి రాసిన ఉత్తరంలో ఇలా తెలియజేశారు: **'నా క్షేమం గురించి నేనెంత ప్రయత్నించినా, చివరకు వివశుడనై ఇతరుల క్షేమాన్నే తలస్తుంటాను.'**

సర్వమత మహాసభ గురించి కళ్ళకు కట్టినట్లు వివరిస్తూ తన శిష్యుడైన అలసింగ పెరుమాళ్‌కు 1893 నవంబర్ 2న స్వామీజీ ఉత్తరం రాశారు. తాను ఇచ్చిన మొదటి ఉపన్యాసానికి లభించిన స్పందనను వర్ణించి, మరుసటి రోజు వార్తాపత్రికల ద్వారా అమెరికా అంతా నా పేరు మారు మ్రోగిపోయిందన్నారు. భగవంతుడు మూగవాడిని సైతం అనర్గళంగా మాట్లాడేలా చేస్తాడని భాష్యకారుడు చక్కగా పలికారని అన్నారు. అంతేకాదు... అమెరికాను భారతదేశంతో పోల్చి చూసి మనం ఏ విధంగా పతనావస్థకు చేరుకొన్నామో తెలియజేశారు. మన సంస్కర్తలు చేసిన తప్పిదాన్ని సున్నితంగా ఎత్తి చూపారు. హిందువులు మతాన్ని (ఆధ్యాత్మికతను) విడనాడకూడదనీ, అలా జరిగిననాడు భారతజాతి కుప్పకూలిపోతుందనీ హెచ్చరించారు.

అమెరికా దేశ మహిళల్లో అత్యధికులు విద్యాధికులు. అలా భారతదేశంలో సాధ్యం కాదు. (ఆనాడు భారతదేశంలో స్త్రీలు చదువుకోవడాన్ని ఒక సాంఘిక నేరంగా పరిగణించే వారు. స్వామీజీ స్త్రీలు చదువుకోవాల్సిన ఆవశ్యకతను గుర్తించారు. ఇది వారి దూరదృష్టికి తార్కాణం) అయితే భారతీయవ్యవస్థను చక్కదిద్దే క్రమంలో స్త్రీలు ఆధునిక విద్యను అభ్యసించడంతో పాటు పరమసాధ్వి సీత అడుగుజాడలలో నడవాలన్నారు. పవిత్రతకు వన్నె తెచ్చేలా, కష్టజీవిగా, సహనశీలిగా, అసంతృప్తికి లోను కాకుండా మాతృమూర్తిగా జీవించాలని తెలియజేశారు.

అమెరికాలో గమనించిన సంఘటిత శక్తిని ప్రశంసిస్తూ, 1894 జనవరి 29 నాడు చికాగో నుంచి స్వామీజీ రాస్తూ, **‘అద్భుతమైన మేధాసంపత్తి ఉన్న భారతదేశం ఎందుకు ముక్కచెక్కలై పోయింది? నా సమాధానం ఇదే. ‘అత్యంత నికృష్టమైన అసూయ గలవారూ, ఇతరుల పేరు ప్రతిష్ఠలను చూచి ఓర్వలేనివారూ ఈ హైందవ జాతిలో ఉన్నంతగా వేరొక జాతిలో లేరు. ఈ పాశ్చాత్య దేశాలకు వచ్చి చూస్తే మీకు కొట్టొచ్చినట్లుగా కనిపించేది ఈ అసూయా రాహిత్యమే!’**

మరొక ఉత్తరంలో ‘గడ్డిపోచలు కలసికట్టుగా ఉండి, మదపుటేనుగును సైతం బంధించి వేస్తున్నా’యని పేర్కొన్నారు. ‘విధేయత, విశ్వాసం, సహకారం మొదలైనవి సంఘటితంగా పనిచేయడానికి కీలకాంశా’లని తెలియజేస్తూ, మద్రాసు శిష్యులను ప్రోత్సహించారు.

1896 జూన్ 7న లండన్ నుండి సోదరి నివేదితకు లేఖ రాస్తూ, ‘వ్యక్తి ఆచరించే మతానుష్ఠానం ఆ వ్యక్తి నడవడికలో కనిపించకపోతే మతాన్ని పరిహసిస్తున్నట్లే లెక్క. మతానుష్ఠానం సమాజంలో ప్రేమయుత సమాజానికి దోహదం చేయకపోతే అది కేవలం వట్టి బూటకమే’ అని స్వామీజీ పేర్కొన్నారు. **‘లోకానికి కావల్సింది మంచి నడవడిక (సౌశీల్యం), ఎవరి జీవితం ఉజ్జ్వల ప్రేమయుతమై, నిస్వార్థమై ఉంటుందో, అలాంటివారే లోకానికి అవసరం. అలాంటి ప్రేమతో కూడిన ప్రతీ మాటా పిడుగు లాంటి శక్తిని కలిగి ఉంటుంది.’**

ఆనాటి యువకులలోని శక్తి నిర్వీర్యం కాకూడదంటూ, స్వామి వివేకానంద తన మద్రాస్ శిష్యులకు ఇలా రాశారు: “విద్యావంతులైన యువకులను చేరదీసి, వారిలో దేశభక్తిని రగిలించి, వారిని సంఘటితంగా పనిచేసేలా ప్రబోధించండి. మహోన్నత త్యాగాల వల్లనే మహాకార్యాలు సాధింపబడతాయి. పేరు, ధనసంపాదన, ప్రతిష్ఠ, మరిదేనికైనా అర్థరహితంగా పరుగులు తీయకండి. దైవానుగ్రహం మీ అందరిపై ఉంది. భగవంతుని శక్తి మీ అందరిలో ఉంది. ధైర్యంగా ఉండండి. నిస్వార్థంగా పనిచేయండి.”

దేశానికి మంచి చేయాలన్న ఉద్వేగంతో 1894లో అమెరికా నుండి స్వామీజీ ఇలా రాశారు: **‘నిజంగా మీరు నా బిడ్డలైతే దేనికీ భయపడరు. ఎక్కడా ఆగిపోరు. సింహసదృశులుగా ఉంటారు. మనం భారతదేశాన్నే గాక, సమస్త ప్రపంచాన్నీ జాగృతం చేయాల్సి ఉంటుంది. పిరికితనం పనికిరాదు. ‘చేత కాదు’ అంటే నేను ఒప్పుకోను.....మీరు వేసిన ప్రతీ అడుగులో నా ప్రార్థనలు, ఆశీస్సులు మీ వెన్నంటి వస్తాయి.’**

విద్య గురించి 1900 డిసెంబర్ 23న స్వామీజీ ఇలా రాశారు: “విద్య అంటే మనిషిని యంత్రంగా మార్చేది కాదు. ప్రస్తుతం విద్యను అభ్యసించిన వారు సమాజంలో మట్టిముద్దల లాగానో, నిర్జీవాలైన యంత్రాల లాగానో, పేర్చిపెట్టిన గులకరాళ్ళ లాగానో ఉంటే దాన్ని సమాజం అనవచ్చా? దాని వల్ల అభ్యుదయమనేది సాధ్యమైతే శతాబ్దాల నుండి బానిసలుగా, స్వార్థపరులుగా, మూఢులుగా ఉండకుండా ఈ భారతభూమి శాశ్వత విద్యానిధియై ఉండేది. త్యాగమనే ఆశయంతో, ఔదార్యం, సదాశయం కలిగి జీవించే విద్యావంతులు సమాజానికి అవసరం. అదే నిజమైన విద్య. వారే నిజమైన విద్యాధికులు.”

ఏ కోణం నుంచి ఆలోచించి చూసినా స్వామీజీ తన ఉత్తరాల్లో రాసిన భావాలు, ఆదర్శాలు వ్యక్తిగతంగా, సామాజికంగా మేలు చేసే విధంగా ఉంటాయి. అదే మహాత్ముల అవతరణ అంతరార్థం. వారు మానవాళిని జాగృత పరచే మహనీయులు. వారి నుండి ప్రేరణ పొంది వ్యక్తిగతంగా వికాసాన్ని సాధించి, సమాజ అభ్యున్నతికి అంకితమవుదాం! ❖



సీత, సావిత్రి, దమయంతి, లీలావతి, మీరాబాయి మొదలైన ఆదర్శ నారీమణుల జీవితాలను మన బాలికలకు బోధించాలి. అప్పుడు వారిలో ఉత్తమాశయాల పట్ల శ్రద్ధ ఏర్పడుతుంది. -స్వామి వివేకానంద

అభిరుచులు

– బి. సైదులు

పన్నెండేళ్ళ ఆ కుర్రాడికి ఊహ తెలిసినప్పటి నుంచి పుస్తకాలంటే ప్రాణం. ఏ కాస్త వీలు దొరికినా, ఏదో ఒక పుస్తకం పట్టుకొని తన గదిలోకి వెళ్ళిపోయేవాడు. ఆ అభిరుచి ఆయనకు ఓ కొత్త ప్రపంచాన్ని పరిచయం చేసింది.

ఆ కుర్రాడి పుస్తక పఠనాభిలాషను వాళ్ళ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు గమనించారు. ఒకానొక రోజు ఆ కుర్రాడిని తన గదిలోకి పిలిచి, రేఖాగణితం మీద మార్కెట్‌లోకి కొత్తగా వచ్చిన ఓ పుస్తకాన్ని బహూకరించారు. ఆ పుస్తకం ఆ విద్యార్థిని అద్భుత ప్రపంచంలోకి తీసుకువెళ్ళింది. ఆ పుస్తకం ద్వారా అతడు శుద్ధ వివేచనాత్మక భావనలు, మౌలిక తత్త్వసీమల్లోకి అడుగుపెట్టాడు. ప్రయోగశాలలు, ప్రయోగసామగ్రితో సంబంధం లేకుండా కేవలం భావనాబలంతో సార్వత్రిక సత్యాలను సంశోధించడమెలాగో అర్థం చేసుకున్నాడు. అదే అభిరుచితో భవిష్యత్తులో వైజ్ఞానిక, పరిశోధనా రంగాలనే మలుపు తిప్పిన శాస్త్రవేత్తగా ఎదిగాడు. అనుపమానమైన ఖ్యాతిని ఆర్జించాడు. అతడే – ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.



గురువు మాక్స్‌టాల్మడ్ యూక్లిడ్ కానుకగా ఇచ్చిన ఆ చిన్న రేఖాగణితం పుస్తకం ఐన్‌స్టీన్ ఆలోచనలను వైజ్ఞానిక వినీలాకాశంలో విహరింపజేసింది. అలా చిన్నతనంలో అంకురించిన పఠనాసక్తి అతణ్ణి మేధావులకే మేధావిగా నిలబెట్టింది. ఇలాంటి అభిరుచులు మన ఆంతరంగిక ప్రతిభను జీవన చిత్రికపై అందంగా ఆవిష్కరింపజేస్తాయి. మన అస్తిత్వానికి అర్థాన్నిస్తాయి. ఏ ప్రయోజనం వైపు జీవితం పయనిస్తోందో, ఆ ధ్యేయానికి మనల్ని మరింత సమర్థంగా సమీపింప జేస్తాయి.

అభిరుచులు...ఆత్మవికాసం

సంగీతమే కావచ్చు, సాహిత్యాభిలాషే కావచ్చు. బొమ్మలు గీయడమే కావచ్చు, భరతనాట్యమే కావచ్చు. ఇలా ఏ అభిరుచి అయినా మనలో తెలియని ఆత్మవిశ్వాసాన్ని రగిలిస్తాయి. మనస్సును ఏకాగ్రపరుస్తాయి. నిర్విరామంగా ప్రాపంచిక ప్రయోజనాల వైపు పరుగులు తీస్తున్న మనకు అభిరుచులు స్వచ్ఛంగా సేద తీరుస్తాయి.

ఈ రోజుల్లో చాలా మంది జీవితంలో అలజడులకు ప్రధాన కారణం ఇలాంటి చక్కని వ్యాపకాల పైన అంతగా ఆసక్తి లేకపోవడమే. ఫలితంగా మానసిక సాంత్వన కోసం నిరంతరం ఇతరుల పైనో, చౌకబారు వ్యసనాల పైనో ఆధారపడే అనివార్యమైన పరిస్థితులు దాపురిస్తున్నాయి. మనతో మనం ఆత్మీయంగా, ఆనందంగా గడపడానికి అభిరుచిని మించిన ఆశ్రయం మరొకటి లేదు.

స్వామి వివేకానంద యుక్తవయస్సులోనే సంగీతంలో, సాహిత్యంలో, వాద్యవిన్యాసాల్లో, వక్తృత్వంలో, వ్యాయామాల్లో, క్రీడల్లో అభినివేశాన్ని పెంచుకున్నారు. కళాశాల స్థాయిలోనే బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందారు. ఇలా బంగారానికి తావి అబ్బినట్లు మన చదువుకూ, సంస్కారానికీ, వ్యక్తిత్వానికీ ఇలాంటి అభిరుచులు, కళలు నిండుదనాన్నిస్తాయి. ఆత్మవికాసానికి దోహదపడతాయి. "మనస్సుకు ఏకాగ్రతను కలిగించే ఏ కళ అయినా మంచిదే. కానీ, అభ్యాసంతో ఆ కళలో పరిపూర్ణస్థితికి చేరుకోవాలి" అంటారు భగవాన్ రమణ మహర్షి.

అభిరుచులు...అలవాట్లు: మనలో చాలామంది ఉన్నత విద్యాభ్యాస ప్రవేశపరీక్షలకో, ఉద్యోగ ప్రవేశ పరీక్షలకో పత్రాలు భర్తీ చేసేప్పుడు, 'హాబీస్' అన్నచోట ఏదో యథాలాపంగా పత్రికా పఠనం, క్రికెట్ వీక్షణం తదితరమైనవి రాసేస్తూ ఉంటారు. నిజానికి అవి అభిరుచులు కాదు; అలవాట్లు. మనకు hobbiesకీ, habitsకీ తేడా తెలియకపోవడం బాధాకరం.

ఏదో కాలక్షేపం కోసం, పొద్దుపోక అలవరచుకునేవి అలవాట్లు. అందులో మన ప్రతిభను ప్రదర్శించి, ప్రత్యేకతను నిరూపించుకునే అవకాశమేమీ ఉండదు. కబుర్లు చెప్పుకోవడం, కన్నీరొలికే ధారావాహికలు చూడడం, విడుదలైన సినిమాకల్లా ఎగబడిపోవడం – ఇవన్నీ తాత్కాలికంగా మనస్సును కొంత రంజింపజేయగలవేమో! కానీ, మన మానసిక వికాసానికి పెద్దగా ఉపయోగపడవు. అభిరుచుల విషయం అలా కాదు; అవి మనలో వికసిత వ్యక్తిత్వాన్ని పాదుకొల్పుతాయి; మనలో నిబిడీకృతమైన ఆత్మశక్తిని జాగృతం చేస్తాయి. మనలోని సృజనాత్మకతను చిగురింపజేస్తాయి. సంపూర్ణంగా మన వ్యక్తిత్వానికే శోభనిస్తాయి. అందుకే ఒక వయస్సు నుంచే మన జీవితంలో ఇలాంటి అంశాలకు కొంత సమయాన్ని కేటాయించుకోవాలి. పెద్దవారు కూడా నిరంతరం పాఠ్యపుస్తకాలు చదవమని పోరుపెట్టకుండా, పిల్లల చిన్నతనం నుంచే వారిలోని ఆసక్తిని గమనించి ఏదో ఒక అభిరుచి వైపు మనస్సును మళ్ళించాలి. దీనివల్ల వాళ్ళు మానసికంగా పరాధీనులు కాకుండా, దారి తప్పకుండా స్వతంత్ర వ్యక్తులుగా నిలబడగలరు.

జీవితానికి అభి'రుచి'... : 'మన అలసటలో చాలా భాగం మనస్సులో నుంచి పుట్టేదే; నిజానికి పూర్తిగా శారీరక శ్రమ వల్లే అలసిపోవడం అనేది చాలా అరుదు' అంటారు ఇంగ్లండ్‌కు చెందిన మానసిక వైద్య నిపుణుడు జె.ఎ. హాడ్‌ఫీల్డ్. మనం చాలా సందర్భాల్లో పని వల్ల అలసిపోతున్నామని అనుకుంటూ ఉంటాం; కానీ మనస్సు పెట్టి పని చేయకపోవడం వల్లే అలసిపోతున్నామని తెలుసుకోం. పైగా తెచ్చిపెట్టుకున్న హడావిడితో, అనవసరపు పనులతో మన కాలం మన చేతుల్లోనే లేకుండా పోయి, మన జీవనలయ (rhythm of life)కి భంగం వాటిల్లుతోందని గుర్తించ లేకపోతున్నాం. హృదయ లాలిత్యాన్ని కోల్పోతూ ఉన్నాం. ఇలాంటి పరిస్థితుల్లో మనస్సును మృదువుగా మలచే శక్తి చక్కని అభిరుచులకు ఉంటుంది. ఎంత చదువుకున్నా, ఎన్ని పెద్ద పెద్ద ఉద్యోగాలు చేసినా రసదృష్టి (ecstatic sense) లేకపోతే బతుకంతా బరువుగానే తోస్తుంది. రోజులో ఎంతో కొంతసేపు ఆటో, పాటో, దానమో, ధ్యానమో లేకపోతే మన పరుగుకు అందం లేదు; అర్థమూ లేదు. అందుకే భాస్కర శతకకర్త...

చదువది యెంత గల్గిన రసజ్ఞత యించుక చాలకున్న నా
చదువు నిరర్థకంబు గుణసంయుతు లెవ్వరు మెచ్చ రెచ్చటం
పదునుగ మంచికూర నలపాకము చేసిననైన నందు నిం
పొదవెడు నుప్పులేక రుచిపుట్టగ నేర్చునటయ్య భాస్కరా!

అంటారు. నిజమే! మంచికూరను నలచక్రవర్తిలా వండినా అందులో తగినంత ఉప్పు వేయకపోతే ఆ కూర రుచిగా ఉండదు. ఆ విధంగానే మనిషి ఎంత చదువుకున్నా కొంచెమైనా రసహృదయం, స్పందించే మనస్సు లేకపోతే ఆ జీవితం శోభించదు, అలాంటివారు ఆనందంగానూ ఉండలేరు. సమాజంలో ఆ యా రంగాల్లో అత్యున్నతస్థాయికి చేరుకున్న వారందరూ కళాభిమానులో, క్రీడాభిమానులో అయినవారేనని మరచిపోకూడదు.

హార్దిక, ఆర్థిక స్వావలంబన...: కళాభిరుచి మనను హార్దికం గానే కాదు, కొన్నిసార్లు ఆర్థికంగా కూడా ఆదుకుంటుంది. నేటి తరంలో చాలా మంది యువతీ యువకులకు వారి అభిరుచులే జీవనోపాధిగా కూడా సాయపడుతూ ఉండడం విశేషం. వారు చిన్నప్పుడు సరదాగా నేర్చుకున్న వాద్యమో, నైపుణ్యం పెంచుకున్న కళాంశమో భవిష్యత్తులో ఆర్థికంగా ఆలంబననిస్తోంది. ఇలా తమ విద్యార్హతల కన్నా కళాభిరుచితో పేరుప్రఖ్యాతులు సంపాదించిన యువ కళాకారులు ఎంతో మంది ఉన్నారు.

అదే విధంగా వైద్య, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నతస్థానాల్లో బాధ్యతలు నిర్వర్తిస్తూ కూడా అభిరుచుల కోసం సమయం కేటాయిస్తున్న వారు ఎందరో! ఉదాహరణకు 'భారతరత్న' అబ్దుల్ కలామ్ శాస్త్రవేత్తగా, రాష్ట్రపతిగా క్షణం తీరిక లేని సమయంలో కూడా ప్రత్యేకంగా వీణ నేర్చుకునేవారు. ఎనభయ్యో ఏట ఈ రోజుకూ ఏదో ఒక పుస్తకంలో కొన్ని పేజీలు చదవనిదే నిద్రకు ఉపక్రమించరు. అందుకే వారు ఓ సందర్భంలో 'అందమైన అభిరుచులు మనల్ని అలౌకిక మనఃస్థితిలోకి తీసుకువెళతాయి. అప్పుడు మనపై శాంతి సంతోషాల కమ్మతెమ్మెర కమ్ముకుంటుంది' అంటారు. కళాకారులు, కళాభిరుచి, క్రీడాభిరుచి కలిగినవారు శారీరకంగా, మానసికంగా పరిపుష్టంగా ఉండగలరనీ, అనారోగ్యం బాధలు వారికి తక్కువగా ఉంటాయనీ ఆధునిక వైద్యరంగం కూడా అభిప్రాయపడుతోంది.

'పట్టా' లేని ప్రతిభ : మరికొందరు తమ వృత్తితో సంబంధం లేకుండా కళాభిమానంతో ప్రఖ్యాతిని పొందుతారు. ఇటీవల దివంగతులైన ప్రసిద్ధ రచయిత్రి - కాలమిస్టు శ్రీమతి మాలతీ చందూర్‌గారు పదో తరగతి మించి చదువుకోలేదు. కానీ



అభిరుచులు జీవన సౌందర్యాన్ని అభివ్యక్తీకరిస్తాయి. మనస్సులో గూడు కట్టుకొని ఉన్న ఉదాసీనతను పారదోలి కొత్త ఉత్సాహాన్నిస్తాయి. అదే విధంగా లలిత కళలు ఉన్నతమైన మానవీయ విలువలకు పునాది వేసి, మన అస్తిత్వానికి అర్థాన్నీ, నిగూఢత్వాన్నీ ప్రసాదిస్తాయి. - 'భారతరత్న' అబ్దుల్ కలామ్

చిన్నతనం నుంచి పెంచుకున్న పుస్తకపఠనాభిలాషతో ప్రపంచ సాహిత్యాన్ని ఆపోశన పట్టారు; తన రచనలతో, సలహాలతో పాఠకుల 'హృదయనేత్రి'గా తెలుగు సాహితీలోకంలో చిరకీర్తిని సముపార్జించారు.

వైద్యాన్ని వృత్తిగా చేపట్టినా, సంగీతాన్ని అభిరుచిగా ఎంచుకొని ఆ రంగంలో విశేషకృషి చేసిన సంగీత మూర్ధన్యులు 'పద్మభూషణ్' శ్రీపాద పినాకపాణి గారు. శాస్త్రీయ సంగీతంపై పలు గ్రంథాలు రచించడమే కాకుండా పట్టుదలతో సంగీత సాహిత్యాలతో సమంగా స్వరాలు కూర్చారు. దాదాపు శత వత్సరాలు జీవించి ఇటీవలే దివంగతులైన వారు ఓ సందర్భంలో 'నాకున్నదంతా, నాకు తెలిసినదంతా నలుగురికి పంచి పెట్టేసి, పిండేసిన గుడ్డలాగా ఈ కట్టె కట్టెల మీదకు పోవాలి' అని అభిల షించారు. ఆ అభిలాష మేరకే తమ చివరి క్షణం వరకు సంగీత సేవ చేస్తూనే కన్నుమూశారు. అలాంటి మహనీయుల అడుగు జాడల్లో కళా పిపాసను పెంచుకునేందుకు ప్రయత్నించాలి. యుక్త వయస్సులో ఏదో ఒక అభిరుచి అంకురిస్తే, అది మన జీవితాన్ని మల్లెతీగలా అల్లుకుపోతుంది. మధుర పరిమళాలనిస్తుంది. ❖

మన బాలికలకు వంటలు, కుట్టుపని, చిత్రలేఖనం, ఛాయాచిత్రగ్రహణం మొదలైన కళలు నేర్పండి. ప్రతీ బాలిక తన జీవనోపాధి నిమిత్తం ఏదో ఒక విద్యను నేర్చుకొనేటట్లు చేయండి. -స్వామి వివేకానంద

కళ్ళు తెరిపించిన కూతురు

- శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

నా కుమార్తె అక్షత పదో తరగతి చదువుతున్న రోజులవి. అప్పుడు తీరిక వేళల్లో తను 'రమణమహర్షి అంధుల విద్యాలయం'లో విద్యార్థులకు ఉచితంగా పాఠాలు చెప్పేది. కళ్ళు కనిపించని వాళ్ళ ప్రపంచం గురించి ఎన్నో ఆసక్తికరమైన విషయాలను ఇంటికొచ్చి వివరిస్తూ ఉండేది.

ఓ రోజు నేను మా కళాశాలకు సంబంధించి పరీక్షల కమిటీ సమావేశానికి వెళుతూ ఉన్నాను. అప్పుడు నేను కంప్యూటర్‌సైన్స్ విభాగానికి అధిపతిని. పాత ప్రశ్నపత్రాలు, ఇతర కాగితాలు, పుస్తకాలను వెతికే పనిలో ఉన్నాను. ఇంతలో నా గదిలోకి వచ్చింది అక్షత. ఏదో బాధగా, అలసిపోయినట్లుగా కనిపించింది.



పదో తరగతి కదా! ఆ ఒత్తిడిలో అలా ఉందనుకున్నాను. 'పరీక్షల గురించి ఆందోళన పడవద్దమ్మా! ప్రయత్నం మాత్రం చేయగలం. ఫలితం మన చేతుల్లో ఉండదు' అన్నాను.

'అమ్మా! నేను పరీక్షల గురించి ఆలోచించడం లేదు. నా సమస్య అది కాదు. అంధుల పాఠశాలలో ఆనందశర్మ నీకు తెలుసు కదా! అతడు చాలా తెలివి గలవాడు. పై చదువులు చదవాలని కోరిక. ఢిల్లీలోని మంచి పాఠశాలలో చదవాలని ఉత్సాహపడుతున్నాడు. కానీ పాపం! అతనికెవ్వరూ లేరు. పేదవాడు. ఇప్పుడు అతనిని ఎవరు ఆదుకుంటారు? అదే నా బాధంతా!' అంది అక్షత.

'అక్షతా! అతన్ని నువ్వే ఎందుకు ఆదుకోకూడదు. నీ పుట్టినరోజు పండగ మానుకొని ఆ డబ్బుతో అతనికి సహాయం చేయవచ్చు కదా!' అన్నాను. కానీ ఆ కాస్త డబ్బుతో అతని సమస్యకు శాశ్వత పరిష్కారం లభించదని నాకు తెలుసు.

అప్పుడు అక్షత...'అది నా స్థాయికి మించిన సాయం. మీ లాంటి పెద్దలు చేయాల్సింది. అమ్మా! పెద్ద చదువులు చదివావు. ఎన్నో మంచి ఉద్యోగాలు చేశావు. ఎన్నో దేశాలు చూశావు. డబ్బంటే పెద్దగా ప్రేమ లేదు. నీ లాంటి వాళ్ళే పేదవాళ్ళను పట్టించుకోకపోతే మరెవరు పట్టించుకుంటారమ్మా? ఈ దుర దృష్టవంతులకు చేయూతనివ్వాల్సిన బాధ్యత మీకు లేదా? జీవితంలో నీ అన్వేషణ దేని కోసం! కీర్తి కావాలని కోరు తున్నావా? ఇంకా సంపాదించాలని ఆశిస్తున్నావా? మీ నాన్న డాక్టరు. ఒక బడిపంతులు మనుమరాలివి. పేదవాళ్ళకు నువ్వే సహాయపడకపోతే మరెవరు సహాయపడతారమ్మా! ఎవరో చేస్తారని ఎదురుచూడకూడదు!' అంటూ కన్నీళ్ళతో బయటకు వెళ్ళిపోయింది.

ఆ మాటలతో నా అన్వేషణ ఆగిపోయింది. ఒక అంధ విద్యార్థి భవిష్యత్తు కోసం నా బిడ్డ పడుతున్న తపన చూసి చలించిపోయాను. అక్షత అప్పుడు నాకు కుమార్తెగా కనిపించలేదు... నా బాధ్యతను గుర్తుచేసిన సమాజ ప్రతినిధి ఆమెలో కనిపించింది. నేను ఆలోచనలో పడ్డాను.

నిజమే! ఈ దేశం, సమాజం నాకెంతో ఇచ్చాయి. నేను ఏ విధంగా ఋణం తీర్చుకుంటున్నాను? ఒక్క నిమిషం నా శరీరం మొద్దుబారిపోయింది. అప్పుడు నా వయస్సు నలభై అయిదు సంవత్సరాలు. ఇన్నాళ్ళూ నా కోసమే నేను జీవించాను. చదువులో అందరికన్నా ముందున్నాను. తరువాత నా కుటుంబానికీ, ఇన్ఫోసిస్‌కీ అంకితమయ్యాను. ఇక జీవితంలో శేషభాగాన్ని దుర్భర జీవితాలను అనుభవిస్తున్న అభాగ్యుల కోసం పని చేసేందుకు వినియోగించాలని నిర్ణయించుకున్నాను. జేఆర్‌డి టాటా గారి 'సమాజం ఋణం తీర్చుకో!' అన్న మాటలు అకస్మాత్తుగా గుర్తొచ్చాయి. మిగిలిన జీవితాన్నంతా అలాగే గడపాలని నిశ్చయించుకున్నాను. ఆ ఆలోచన హాయిగా అనిపించింది. పోయిన యౌవనం తిరిగి వచ్చినట్లనిపించింది. వారం తరువాత నా పదవికి రాజీనామా చేశాను. సంస్థాపక ధర్మకర్తగా ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ప్రారంభించాం. భారతదేశంలో అనేక రాష్ట్రాల్లో పేదల ప్రయోజనాల కోసం వీలైనంత మేరకు శ్రమిస్తున్నాను. అనాథల కళ్ళలో ఆశాజ్యోతులు ప్రకాశించి నప్పుడు, నిస్సహాయుల వదనాల్లో వెచ్చటి చిరునవ్వు చూసినప్పుడు నాకు కలిగే తృప్తి ఉన్నత శ్రేణి జీవనంలో, సంపదలో కూడా నాకెన్నడూ కనిపించలేదు.

ఆ సేవా కార్యక్రమాల పరంపరలో ఎన్నో పురస్కారాలు అందుకున్నాను. అందులో ఒకటి ఎకనామిక్ టైమ్స్ వారు మా ఫౌండేషన్‌కు ప్రదానం చేసింది. ఆ పురస్కారాన్ని అందుకునేందుకు ధర్మకర్తగా నన్ను ఆహ్వానించారు. అప్పుడు నా గురువు అక్షత గుర్తుకొచ్చి 'నీ సమక్షంలోనే ఆ అవార్డును అందుకుంటాను. నువ్వు తప్పకుండా రావాలి' అని పిలిచాను. నా జీవనగమనాన్ని మలుపు తిప్పినందుకు, నా కళ్ళు తెరిపించినందుకు నా కుమార్తెకు ఆజన్మాంతం ఋణపడి ఉంటాను. ❖ సేకరణ: జి. సతీష్

సృజనాత్మక జీవనం



– స్వామి రంగనాథానంద
(రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

సృజనాత్మక జీవనమనేది అద్భుతమైన భావన. అయితే నిజంగా సృజనాత్మక జీవనమంటే ఏమిటి? అన్న ప్రశ్న తరచూ తలెత్తుతూ ఉంటుంది. కళాకారులు, రసహృదయులకే సృజనాత్మకంగా జీవించే అవకాశం ఉంటుందని అనుకోవడం పొరపాటు. మనిషిగా పుట్టిన ప్రతి ఒక్కరి లక్ష్యమూ సృజనాత్మకంగా జీవించడమే! మనం చేసే పనిలో, మన ప్రవర్తనలో సృజనాత్మకతను ప్రదర్శించవచ్చు.

అయితే పనిలో నవ్యత్వాన్ని చూపించాలంటే, సృజనాత్మకత ప్రతిఫలించాలంటే ముందు ఉత్సాహం అవసరం. మన వృత్తిని యథాలాపంగా చేసుకుంటూ పోతే, అది సృజనాత్మకత అనిపించుకోదు. పైగా అది మన బుద్ధిని స్తబ్ధంగా, పాచి పట్టిన కొలనులా మార్చేస్తుంది. అందుకే నిరంతరం మనస్సును ఉత్సాహపరుచుకుంటూ ఉండాలి. అయితే బాహ్యంగా అలంకరణల్లో, ఆహార్యంలో, ఆడంబరాల్లో నవనాగరకంగా కనిపిస్తూ ఉంటే చాలు, అది సృజనాత్మక జీవనమని మనలో చాలా మంది భ్రమపడుతూ ఉంటారు. కానీ అది వారి భ్రాంతి మాత్రమే!

అందుకే ఆధునికతను రెండు విభాగాలుగా విభజిస్తారు. మొదటి రకంలో మనుష్యులు కేవలం బాహ్యపరమైన తళుకుబెళుకులతో ఆధునికులమని అనిపించుకుంటూ ఉంటారు. ఇది ఆధునికతకు సాధారణమైన నిర్వచనం. కానీ రెండో రకమైన ఆధునికతలో మనిషి మానసికంగా విశాలమైన దృక్పథంతో, వికసిత వ్యక్తిత్వం, సమాజశ్రేయస్సుకు ఉపయోగపడే సాహసకృత్యాలతో విరాజిల్లుతూ ఉంటాడు. ఇలాంటి జీవనానికి తోడ్పడేదే నిజమైన సృజనాత్మకత.

ఏకాంతమే ప్రధానం: ఏ మాత్రం ప్రత్యేకత లేకుండా, గుంపులో గోవిందయ్యలా పని చేసే వ్యక్తిలో సృజనాత్మకత మచ్చుకైనా కనిపించదు. ఆతని పనిలో అది ప్రతిఫలించదు. అందుకే నిరంతరం జనసమూహం మధ్యనే కాలం గడపడం తగ్గించుకోవాలి. No creativity can come in a crowd, but only when you are alone. When you speak very little and are calm, then only can the creative mind find expression. One should not become stagnant at a particular level. మందలో ఒక్కడిగా ముందుకు పోతున్నంత కాలం మనమేంటో మనకు అర్థం కాదు. ఏకాంతంగా, మౌనంగా, స్థిరచిత్తంతో ఉండేవారే కొత్త కొత్త ఆలోచనలతో ప్రపంచాన్ని ముందుకు నడిపించగలరు. అప్పుడు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస చెప్పినట్లు 'ఇది కాదు; ఇది కాదు; ఇంకా ముందుకు సాగిపోవాలి' అనిపిస్తుంది.

అన్వేషణ మునుముందుకు సాగితే బొగ్గు గనుల నుంచి వెండిగనులు, బంగారు గనులు, వజ్రాల గనుల లాంటివి చేజిక్కుతాయి. అంటే అల్పమైన లక్ష్యాలకే పరిమితం కాకుండా అద్భుతమైన విజయాలు లభిస్తాయి. అలా ఎందరో శాస్త్రవేత్తలు మేధామథనం చేయడం వల్లనే నేడు ఎన్నో శాస్త్రపరిశోధనా ప్రయోగాలు ఫలించి, సాంకేతిక సౌలభ్యాలు మనకు లభిస్తున్నాయి.

సాహసం నుంచే సృజనాత్మకత!: ఆదిశంకరాచార్య, గౌతమబుద్ధుడు, స్వామి వివేకానంద – వీరంతా ధర్మసంస్థాపనార్థం సాహసంగా జీవించినవారే! భౌతికమైన పరిమితులను దాటుకొని తమ ఆత్మశక్తితో మానవాళిని మేల్కొలిపిన వారే! ప్రతి మనిషి కూడా తన పరిధిలో వారిని ఆదర్శంగా తీసుకొని విజయవంతమైన జీవితం కోసం అలా సాహసోపేతమైన నిర్ణయాలతో ముందుకు సాగిపోవాలి. సంకుచితమైన పరిధుల్లో తమను, తాము బందీలుగా చేసుకోకుండా, స్తబ్ధజీవనం గడపకుండా చైతన్యమూర్తులుగా ముందడుగు వేస్తూ ఉండాలి.

ఒక్కమాటలో చెప్పాలంటే, Man is specially fitted for this great adventure. మనం ఈ శరీర పరిమితులను దాటుకొని, ఆత్మను ఆవిష్కరించుకునే సాహసవంతమైన కార్యం కోసమే జన్మించాం. పశుపక్ష్యాదులుగా సాధారణమైన శారీరక విధుల నిర్వహణ కోసమో, సుఖసౌకర్యాల కోసమో ఈ లోకంలోకి రాలేదు. మన ఉపనిషత్తులు ఈ పరమసత్యాన్నే ఘోషిస్తూ ఉన్నాయి. 'సృజనాత్మక జీవనం' అన్నదానికి అర్థం ఇదే! ❖

సేకరణ: ఆర్. కృష్ణ

దేశాన్ని పాలించడంలోనూ, సరిహద్దు రక్షణలోనూ, యుద్ధం చేయడంలోనూ మన స్త్రీలు, పురుషులతో సమానమనీ, ఇంకా వాళ్ళకన్నా మిన్న అనీ నిరూపించారు. - స్వామి వివేకానంద

(...18వ పేజీ తరువాయి)

వానిలో జ్ఞానాగ్ని సదా ప్రజ్వలిస్తూ ఉంటుంది. ఏమి తిన్నా, సర్వం భస్మమైపోతుంది. అతనికి ఏ హానీ జరుగదు' వాడితో ఎవరికీ పోలిక లేదు. ఒర నుండి దూసిన కత్తి లాంటి వాడు. 'అఖండేర్ ఘర్'– అఖండ నిరాకార చైతన్యం నుండి జన్మించిన యోగి' అనేవారు.

'వివేకానంద' నామమే వివేకానంద సందేశం. 'మంచి ఏది, చెడు ఏది, శ్రేయస్సు ఏది, ప్రేయస్సు ఏది' అన్న వివేక బుద్ధి ఉంటేనే 'ఆనందం' మనదవుతుంది. ఆ 'వివేకం' లేకపోతే, మన జీవితం దుఃఖమయం అవుతుంది. ఆనందం అదృశ్యమవుతుంది.



కాశీపూర్ ఉద్యానంలో నరేంద్రుడు ఓ చెట్టు క్రింద గాఢంగా ధ్యానంలో లీనమై ఉంటే గిరీష్ చంద్రఘోష్ చూసి ఆశ్చర్యపోయాడు! 'నరేంద్రుని ఒంటి నిండా నల్లటి దుప్పటి లాంటిదేదో కప్పుకొని ధ్యానం చేస్తున్నాడు' అనుకున్నాడు. కానీ కాస్త దగ్గరగా వెళ్ళి పరిశీలనగా చూస్తే అది దుప్పటి కాదు. నరేంద్రుని ఒంటి నిండా నల్లటి పెద్దపెద్ద దోమలు దట్టంగా (దుప్పటిలాగా) కప్పేసి కుదుతున్నాయి! కానీ నరేంద్రునికి శరీర స్పృహే లేదు! సర్వం మరచి అనంత దివ్యానందంలో, ఆత్మానందంలో లీనమై ఉన్నాడు!

'రాజయోగం' (పతంజలి యోగసూత్రాలు)పై స్వామీజీ ప్రవచనాలిస్తూ 'అష్టాంగయోగా'న్ని వివరిస్తున్నారు. యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహారాలను విశ్లేషించి ధ్యానం గురించి వివరిస్తూ, స్వయంగా తామే గాఢ, దీర్ఘ ధ్యాన సాగరంలో లీనమైపోయారు స్వామి వివేకానంద. అలా ఆ అద్భుత ధ్యాన స్థితిని వెంటనే శిష్యులు ఛాయాచిత్రం తీశారు. మనందరికీ ఎనలేని సేవ చేశారు! అతి గాఢమైన, సంపూర్ణ అంతర్ముఖమైన ఆ వివేకానంద ధ్యానమూర్తి ఈనాడు ప్రపంచమంతటా పూజింపబడుతోంది. పరమశివునిలా, అపర బుద్ధునిలా స్వామీజీ 'ధ్యానానందం'లో లీనమై ఓలలాడుతుండడం – ఆ చిత్రంలో అతి స్పష్టంగా దర్శించవచ్చు. ఈ ఛాయాచిత్రాన్ని తదేకంగా చూస్తూ మనస్సును ఏకాగ్రం చేస్తే మనం కూడా ధ్యానావస్థను పొంది ఆత్మానందం అనుభూతి చెందవచ్చు.

అమెరికాలోని Thousand Island park 'సహస్ర ద్వీప ఉద్యానంలో సాధకులైన కొద్దిమందికి స్వామీజీ కొన్ని వారాలు అక్కడే నివసిస్తూ ఆధ్యాత్మ బోధనలు, అనుభూతులు వివరించారు. అప్పుడు ఆయన శిష్యులు స్వామీజీని 'At His best' అని వర్ణించారు. ఆ ఆధ్యాత్మిక అమృత భాండాగారమే Inspired Talks (ప్రబోధ రత్నాకరం).

ఈ సమయంలో ఒకరోజు స్వామీజీ శిష్యులతో అడవుల లోపలికి వాహ్యాళికి వెళ్ళి ధ్యానంలో కూర్చుని ఉండగా హఠాత్తుగా కుంభవృష్టి కురవడం ప్రారంభమైంది. అందరూ అటూ ఇటూ పరుగులెడుతూ స్వామీజీ కోసం వెతికారు; గొడుగులతో పరుగెత్తారు. చాలాసేపు వెతకగా వివేకానందులు ఆ వర్షంలో, అడవి మధ్యలో ఓ పెద్ద వృక్షం క్రింద బుద్ధునిలా ధ్యానంలో, బ్రహ్మానందంలో లీనమై ఉన్నారు. కుండపోత వర్షం వారి దీర్ఘ, గాఢ ధ్యానాన్ని కించిత్తయినా చలింపజేయలేదు! శిష్యులు విస్మయంతో స్వామీజీపై గొడుగు ఉంచి వేచి ఉన్నారు. చాలా సేపటికి స్వామీజీ బాహ్యస్పృహలోకి వచ్చి, 'ఆహా! ఏం ఆనందం! ఎంత ఆనందం! 'మళ్ళీ నేను నా గురుదేవుల సన్నిధిలో కలకత్తాలో దక్షిణేశ్వర కాళీ ఆలయ ఉద్యానంలోకి వెళ్ళిపోయాను. వేదాంత గుహలలోకి వెళ్ళిపోయాను. ఎంత మధురం, ఎంత ఆనందం!' అంటూ పరవశించిపోయారు. స్వామీజీ యొక్క ఆ ధ్యానమూర్తిని, ఆనందమూర్తిని చూసి శిష్యులు పులకరించిపోయారు.

"Religion is not in doctrines, in dogmas, nor in talks; it is being and becoming; it is Realization...... God alone lives; The soul alone lives. Spirituality alone lives. Hold on to that. మతం, ఆధ్యాత్మికత, ధర్మం – సిద్ధాంతాలు, నమ్మకాలు, శుష్క ఉపన్యాసాలు, వాద వివాదాలలో లేదు. అది సంపూర్ణ జీవనంలో, పరిపూర్ణ పరివర్తనంలో ఉన్నది. ప్రత్యక్ష అనుభూతి, సాక్షాత్కారమే నిజమైన ధర్మం!.... భగవంతుడొక్కడే, దైవమొక్కటే శాశ్వతం, ఆత్మ ఒక్కటే శాశ్వతం, ఆధ్యాత్మికత ఒక్కటే శాశ్వతం. దాన్నే పట్టు వదలకుండా అంటిపెట్టుకో!" – ఈ వేదాంత కేసరి వివేకానంద సింహగర్జన మన హృదయ కుహరాలలో నినదించు గాక! సకల షడ్రిపులు, కువాసనలనే జంతుజాలం పరుగులెత్తి అదృశ్యమవు గాక! ఆత్మానందంలో అందరం ప్రతిష్ఠితులమగుదుము గాక! ❖



(1884 – 1967)

ముందుకు సాగిపో !

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

నారాయణగంజ్,
4–10–1940

ప్రియమైన విపత్ భంజన్!*

మనం మన చుట్టూ ఉన్న జ్ఞానభారాన్ని వీపున మోస్తూ కేవలం గాడిదల లాగా బ్రతకడం వల్ల ప్రయోజనం ఏముంది? నీకు ఆనందం ఇవ్వని దాని భారాన్ని మోసి ప్రయోజనం ఏమిటి? కనుక జాగ్రత్త వహించు. ఒక వ్యక్తి తన శక్తికి మించిన పనుల్లో నిమగ్నమవడం వల్ల ఫలితం ఉండకపోగా, లభించే కొద్దిపాటి ఇతర అవకాశాలను కూడా వదులుకోవాల్సి ఉంటుంది.

రజోగుణంలో ఒక అంతర్గతశక్తి ఉంటుంది. అది మనిషిని దాని ఇష్టమొచ్చినట్లు నడిపిస్తుంది. మొదట్లో ఫలితాలు బాగానే కనిపించినా, తర్వాత అవి విషతుల్యమవుతాయి. తపస్సాధనలు చేసే రావణుడు అద్భుతంగా కనిపిస్తాడు. బ్రాహ్మణుడుగా, వేదవిదుడుగా, ఒక యోగిగా బాగానే అనిపిస్తాడు. కానీ మనం అతణ్ణి రాక్షసుడిగానే చూస్తాం. అగ్ని మన జీవనానికి చాలా ఆవశ్యకమే. కానీ దాన్ని వినియోగించుకోవడం తెలియకపోతే సర్వనాశనమే కదా!

భారతదేశమంతటా అవినీతి, వ్యామోహాలు తాండవమాడుతున్నాయి. ఎవరినీ ఎవరూ నమ్మరు. ఒక శాశ్వతమైన లక్ష్యంతో ఒకే మార్గాన్ని అనుసరించేవారు అరుదు. వ్యక్తి ఒక మార్గంలో పోతూనే మరో దారికి మళ్ళుతాడు. అందుచేతనే మన శ్రమ అంతా వృథా అయిపోతోంది. వెనుకటి తరాల వారి సౌశీల్యాన్ని చూసి, నేటి తరాల వారు మంచి లక్ష్యాన్ని గురించి ఎలా ఉపన్యసించవచ్చో బాగా నేర్చుకున్నారు. కానీ ఆచరణ మాత్రం అందుకు విరుద్ధం. ఆధ్యాత్మిక రంగంతో సహా అన్ని రంగాలలోనూ దీన్ని మనం గమనించవచ్చు.

మరణపర్యంతం ఒకే ఆదర్శానికి కట్టుబడి ఉండే శక్తిని నువ్వు అలవర్చుకోవాలి. మనస్సునూ, శరీరబలాన్నీ కార్యాచరణలో నియంత్రించగల సామర్థ్యం లేనివారి ఇంద్రియాలు కోరికల వెంట పరుగెత్తుతాయి. సాత్త్విక గుణం వ్యక్తమవుతున్న మొదటి క్షణాల్లో సుఖసౌఖ్యాల ఆలోచనల వైపు మనస్సు మొగ్గుచూపుతుంది. అప్పుడది మరింత హానికరమవుతుంది.

స్వామి వివేకానందుల వ్యక్తిత్వం అద్భుతమైన శక్తి, నిర్నిరోధమైన రాజసాల సమ్మేళనం. అలాంటి వ్యక్తిత్వం మనకు ఆదర్శం కావాలి. కార్యాచరణ శక్తి, మానసిక శక్తులు అడుగంటుతున్నప్పుడు మనం ఆధ్యాత్మిక రంగంలో అధోగతికి పోతాం. అమ్మ శారదమాత జీవిత చరిత్ర నీకు తెలుసు కదా! నిస్సంగత్వంతో నిరంతరం పనిలో నిమగ్నమైన శారదమ్మ జీవితం మనకు ఆదర్శం కావాలి. 'కార్యాచరణ శక్తి' అంటే ఒక ఆదర్శాన్ని నిబద్ధతతో కూడిన నియంత్రిత విధానంతో అనుసరించడం. కార్యాచరణ శక్తిని కలిగి ఉండడమే ఆధ్యాత్మికోన్నతికి ఒక గుర్తు.

మనస్సు, బుద్ధి, శరీరాలతో కూడిన ఈ యంత్రాన్ని మన ఇచ్ఛకు అనుగుణంగా నడపడమే ఆత్మ వికాసం. పరిపూర్ణ స్వేచ్ఛను పొందాలంటే మరణపర్యంతం పోరాడాల్సిందే!

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత: *కె. త్రివిక్రమరావు*

(*విపత్ భంజన్, కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో సన్న్యాసం స్వీకరించి స్వామి స్వాహానందగా ప్రసిద్ధులయ్యారు.)

మన స్త్రీలు మిగతా విద్యలతో పాటు తమ ఆత్మరక్షణ కోసం శక్తి, సామర్థ్యాలను ప్రదర్శించే విద్యలలో కూడా శిక్షణ పొందాలి. ధైర్యసాహసాల్లో నేటి స్త్రీలకు ఝాన్సీరాణి ఆదర్శం కావాలి. - *స్వామి వివేకానంద*

(...13వ పేజీ తరువాయి)

అదె వేంకటాచల మఖిలోన్నతము
అదివో బ్రహ్మాదుల కపురూపము
అదివో నిత్యనివాస మఖిల మునులకు
అదె చూడుడదె మొక్కు డానందమయము...

అంటున్నాడు. నిజమైన భక్తుడు ఇలా ఒక్కమారు తన ఇష్టదైవం కొలువు తీరిన క్షేత్రాన్ని వీక్షిస్తే చాలు, పొంగిపోతాడు. అది తన నిజస్థానమని తెలుసుకుంటాడు. భద్రాచలంపై అడుగుపెట్టగానే భక్త రామదాసు కూడా అదే విధంగా పులకాంకిత గాత్రుడయ్యాడు. శ్రీరామచంద్రుడు వెలసిన భద్రాద్రిని పరిపరి విధాల కీర్తించాడు.

ఇదిగో భద్రాద్రి...గౌతమి అదిగో చూడండి!
ముదముతో సీతా ముదిత లక్ష్మణులు
కలసి కొలువగ రఘుపతి యుండెడి,
చారు స్వర్ణ ప్రాకార గోపుర
ద్వారములతో సుందరమై యుండెడి...


ఇదిగో భద్రాద్రి...గౌతమి అదిగో చూడండి! అని ఆనందపరవశుడయ్యాడు. సీతారాములు లక్ష్మణస్వామి సమేతులై, బంగారు ప్రాకారాలు, గోపురాలు, ద్వారాలతో సుందరంగా గౌతమీ నదీ తీరంలో అలరారుతున్న భద్రాద్రిపై దర్శనమిస్తున్నారు; అదిగో చూసి తరించమన్నాడు. ఇలాంటి భక్త పుంగవుల ఆవాస ఫలితంగా, సాధనా ఫలంగా ఆ యా పుణ్యక్షేత్రాల మాహాత్మ్యం మరింత ఇనుమడిస్తుంది. భగవంతుడి శక్తి ప్రస్ఫుటంగా ప్రదర్శితమవుతుంది. ఎన్నిసార్లు తీర్థ యాత్రలు చేశామన్నది ముఖ్యం కాదు; ఎంత భక్తిని, ఎంత విశ్వాసాన్ని పెంచుకున్నామన్నదే ప్రధానం. అలా భక్తి పరిపాకం చెందాక, ఇంటి నుండి కదలకుండా కూడా ఇష్టదైవాన్ని ప్రాప్తించుకోవచ్చు.

అదే బహుబ్రహ్మమయము!

ఎందరో భావిస్తున్నట్లు తిరుపతి కొండలు సాధారణమైనవి కావు. ఒక్కొక్కటి ఓ దేవతాస్వరూపానికి ప్రతీక. ఆ శ్రీనివాసుడు నెలకొన్న శేషాచలం సమస్త దేవతలకు నిజవాసం. ఇక మూలతత్త్వమైన వేంకటేశ్వరుని దివ్యస్వరూపం మనందరి పాలిట మోక్షమనే మూలధనం. సంపూర్ణంగా ఆ సహస్ర నాముడి కోవెల స్వర్ణశిఖరాల బహుబ్రహ్మమయం. అదే భావంతో...

చెంగట నల్లదివో శేషాచలము
నింగినున్న దేవతల నిజవాసము
ముంగిట నల్లదివో మూలనున్న ధనము

బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము...అంటున్నాడు అన్నమయ్య. 'చెంగట'అంటే సమీపాన అని అర్థం. భగవంతుడి భావనలో ఓలలాడే భక్తుడికి స్వర్గం, మోక్షం అంటే కూడా అంతగా ఆసక్తి ఉండదు. అందుకే సద్గుణ సాకారంగా దైవాన్ని సాక్షాత్కరించుకొని సంబరపడిపోవాలను కుంటాడు. ఆయన కొలువున్న కోవెలనే కోటి స్వర్గాల సమానంగా భావించు కుంటాడు. అలాంటి తన్మయంతో పరమ భక్తులు శ్రీవేంకటేశ్వరుణ్ణి మేల్కొలుపుతూ...



పదివేల శేషుల పడగలమయము

త్వద్గోపురాగ్ర శిఖరాణి నిరీక్షమాణాః
స్వర్గాపవర్గ పదవీం పరమాం శ్రయంతః,
మర్త్యా మనుష్య భువనే మతి మాశ్రయంతే
శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్...

"స్వర్గ మోక్షాలకు పోయేవారు కూడా దోవలో నీ దేవాలయ గోపుర శిఖరాలను చూసి ఆనంద పారవశ్యంతో స్వర్గమోక్షాలను వద్దని, ఈ మానవలోకంలోనే నిన్ను సేవించే భాగ్యం కలుగుతుందని, ఇక్కడే జన్మించాలని కోరుకుంటారు. అలాంటి ఓ వేంకటాచలపతీ! నీకు సుప్రభాతమగుగాక!" అని ఆ మంగళాకారుణ్ణి మేల్కొలుపుతారు. అలాంటి భక్తకోటి కోసమే శ్రీవేంకటేశ్వరుడు వైకుంఠానికి వేంచేయకుండా ఇంకా తిరుమల పైనే తన కరుణాకటాక్షాలను కురిపిస్తున్నాడు.

అదే పావనమయము!

మన అహంకారాలనూ, ఆడంబరాలనూ, అధికారాలనూ వదలుకొని సంపూర్ణ శరణాగతితో దిక్కు నీవేనని వినయంతో, ఆయన గుణగానాన్ని చేసుకుంటూ దేవాలయానికి వెళ్ళినప్పుడే ఫలం సిద్ధిస్తుంది. అందుకే శ్రీమద్భాగవతం...

నీ గృహాంగణ భూమి నిటలంబు మోవంగ మోదించి నిత్యంబు మ్రొక్కడేని, నీ మంగళ స్తవ నికర వర్ణంబులు పలుమారు నాలుక పలుకడేని.... బ్రహ్మంబు చెందగలడె?
యోగియైన, తపోవ్రత యోగియైన వేదియైన మహాతత్త్వ వేదియైన!

అంటోంది. నీ ఆలయ ప్రాంగణంలో నిన్ను చూసి నిత్యం తల వంచి మొక్కనివాడు, మంగళకరాలైన నీ వర్ణాలు పలుమార్లు నాలుకతో పలుకలేని వాడు యోగి అయినా తపశ్శాలి అయినా, పండితుడైనా తత్త్వవేత్త అయినా ఎన్నటికీ పరమపదాన్ని అందుకోలేడని విస్పష్టం చేసింది. ఆ దాస్యభావంతోనే అన్నమాచార్యులు ధర్మసంస్థాపకుణ్ణి నమ్ముకున్నాడు...

కైవల్యపదము వెంకట నగమదివో
శ్రీవేంకటపతికి సిరులైనది
భావింప సకల సంపద రూపమదివో

పావనములకెల్ల పావనమయము... అంటూ సకల సంపదలు శ్రీనివాసుడేనని శరణన్నాడు. కొండలరాయడి కొలువునే కైవల్యంగా సంప్రాప్తించుకున్నాడు. ❖

(అక్టోబరు 5 నుంచి 13 వరకు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు)



మహర్షి మనస్సులో మహాత్ముడు

– సి. హెచ్. శివకృష్ణ



భగవాన్ రమణమహర్షి మనస్సులో మహాత్మా గాంధీపై అపారమైన ఆదరాభిమానాలు పొడసూపేవి. గాంధీజీలోని ఆధ్యాత్మిక కోణాన్ని అర్థం చేసుకున్న రమణులు, వారిని కర్మయోగిగా అభివర్ణించేవారు. ప్రత్యక్షంగా మహాత్ముడు తమను సందర్శించకపోయినా, మహర్షి తరచూ గాంధీజీ గురించి భక్తుల ముందు ప్రస్తావించేవారు. మహాత్మాగాంధీ, భగవాన్ రమణులను దర్శించుకునేందుకు మూడుసార్లు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ పని ఒత్తిడి, జనసందోహం వల్ల కుదరలేదు. డా॥ బాబూ రాజేంద్రప్రసాద్, జమన్‌లాల్ బజాజ్ వంటి ప్రముఖులను రమణులను దర్శించుకోమని చెప్పి పంపారు.

బాబూ రాజేంద్రప్రసాద్ ఒకసారి భగవాన్ రమణమహర్షిని దర్శించుకొని వెళుతూ, 'భగవాన్! మీరు గాంధీజీకి ఏం సందేశం ఇమ్మంటారు?' అని అడిగారు. అప్పుడు రమణులు నర్మగర్భంగా 'ఇక్కడా, అక్కడా పనిచేస్తున్న మౌనం ఒక్కటే. Real talking is silence. ఇక మాటలతో అవసరం ఏమిటి?' అన్నారు.

కె. అరుణాచలం అనే గాంధేయవాది, భగవాన్ రమణ మహర్షిని కలసి ఓ మారు – 'భగవాన్! అందరినీ ఊరకే ఉండమంటారు; మీరూ ఉండి చూపిస్తారు. కానీ మహాత్మాగాంధీ అందరినీ కార్యనిమగ్నులవమంటారు; ఆయన కూడా ఎప్పుడూ ఏదో ఒకటి చేస్తూనే ఉంటారు. ఎందుకు ఈ తేడా?' అని ప్రశ్నించారు. అప్పుడు అనన్యసామాన్యమైన మందహాసం రమణ మహర్షి ముఖంపై తాండవించింది. 'నేను ఊరకే కూర్చుంటున్నానని నీకెవరు చెప్పారు?; ఆ మహాత్ముడు పనిలోనే నిమగ్నమయ్యాడని ఎందుకనుకుంటున్నావు?' అని ఎదురు ప్రశ్న వేశారు. 'కర్మలో అకర్మనూ, అకర్మలో కర్మనూ ఎవడు దర్శిస్తాడో, వాడు బుద్ధిమంతుడు; అతడే యోగి' అన్న శ్రీకృష్ణభగవానుడి గీతామృత భావాన్ని స్ఫురింపచేశారు.

రమణమహర్షిని గాంధీజీ కలుసుకుంటే బాగుండేదని శంకర్‌లాల్ అనే భక్తుడు అనుకున్నాడు. ఆ భావననే మహర్షి ముందు ఉంచాడు. అప్పుడు వారు 'ఇద్దరికీ ఎడమంటూ ఏమీ లేదు' అన్నారు. శంకర్‌లాల్ తిరిగి వార్ధా వెళ్ళి, తమ సంభాషణను గాంధీజీకి చెప్పాడు. వారు 'అవును! నీకర్థం కాలేదా? మనమనుకున్నట్లు దూరమంటూ ఏమీ లేదు' అన్నారు.

మహాత్ముడి మరణవేళ... : 1948, జనవరి 30... మహాత్ముని నిర్యాణవార్త దావానలంలా వ్యాపించింది. రమణమహర్షి ఆశ్రమంలో కూడా విషాదఛాయలు అలముకున్నాయి. మహాత్ముని మరణవార్త విన్న వెంటనే మహర్షి కళ్ళ వెంట నీళ్ళు రాలుతూనే ఉన్నాయి. ఆ రోజు సాయంత్రం భక్తులందరూ కలసి, 'రఘుపతి రాఘవ రాజారాం' భజన ఆలపించసాగారు. భగవాన్ 'కొనసాగించండి' అన్నట్లు కన్నీళ్ళతో సైగ చేశారు. ఆశ్రమంలో అయిదింటికి శంఖం పూరించారు. మహాత్మునికి నివాళిగా మాతృభూతేశ్వరాలయంలో కర్పూరహారతి ఇచ్చి, భగవాన్ సన్నిధికి తెస్తే విభూతి, కుంకుమను స్వీకరించారు.

మరుసటి రోజు వార్తాపత్రికలను తిరగేస్తూ, గాంధీజీ హత్యకు సంబంధించి పత్రికలో ప్రచురించిన ఓ ఉదంతం గురించి భగవాన్ రమణులు ఆసక్తికరంగా చర్చించారు. "ఇదుగోనోయ్! గుండు పేల్చినవాడు ప్రార్థనకు వచ్చే మహాత్మునికి ఎదురుగా వచ్చి, నమస్కరించి, 'ఇవాళ ఇంత ఆలస్యంగా దయ చేశారేమీ?' అని అడిగాడట; ఏదో జాగయిందని వారన్నారనీ, వెంటనే గుండు పేల్చాడనీ ఉన్నదోయ్! రాముడు, రావణ సంహారకార్యం ముగిసిన తరువాత, తిరిగి వైకుంఠానికి వెళ్ళాలన్న మాట మరచి ఉంటే, దేవతలంతా యోచించి, యముణ్ణి పంపారట. ఆయన ముని వేషంలో వచ్చి, 'వచ్చిన పని ముగిసింది; వైకుంఠానికి దయచేయండి' అని అన్నారట వినయంగా! ఇదీ అట్లాగే ఉంది. స్వరాజ్యం వచ్చింది కదా! నువ్వు వచ్చిన పని అయిపోయింది. ఇంకెందుకున్నావు? వెళ్ళవద్దా? ఇంత ఆలస్యమైందే అని ప్రార్థించి పంపినట్లుంది" అని సెలవిచ్చారు భగవాన్.

గాంధీజీ శరీరయాత్ర చాలించే నాటికి ముందురోజే ఏదో స్వప్నం వచ్చిందనీ, అందువల్ల ఆనాటి మరణం వారికి స్ఫురించి అత్యవసరమైన పనులన్నీ త్వరత్వరగా ముగించుకున్నారనీ, అందుకే ప్రార్థనకు రావడం ఆలస్యమైందనీ పత్రికలో చదివిన మహర్షి 'అవును. విజ్ఞానం కలవారికి ఆ మాత్రం స్ఫురించదా? తప్పక తెలుస్తుంది. కానీ ఎవరికీ చెప్పరు' అన్నారు. ❖

(అక్టోబర్ 2న – మహాత్మా గాంధీ జయంతి)


స్త్రీ, పురుషులు సమాన భాగస్వాములుగా ఉండేవారనీ, వారి మధ్య భేదం ఉండేది కాదనీ ప్రపంచ సాహిత్యంలో మరెక్కడా లేనిది ఆర్యుల సాహిత్యంలో మాత్రమే తెలుసుకుంటాం. - స్వామి వివేకానంద

భగవద్గీత - సద్గుణ సుధ

- స్వామి విశారదానంద

బెంగుళూరులోని వివేకానంద యోగ అనుసంధాన మహా విద్యాపీఠానికి చెందిన స్వామి విశారదానంద భగవద్గీత పదమూడో అధ్యాయంలో 7-11 శ్లోకాల్లోని భగవానుడి బోధామృతాన్ని వివరిస్తూ 'భగవద్గీత - మానవీయ విలువలు' అనే శీర్షికతో ప్రసంగాలు ఇచ్చారు. చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠ ఆంగ్ల మాసపత్రిక 'వేదాంత కేసరి'లో ప్రచురితమైన ఆ ప్రసంగాల సారాన్ని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

నిశ్చల భక్తి



మయి చానన్య యోగేన భక్తి రవ్యభిచారిణీ - నా (భగవంతుని) యందు అనన్య యోగంతో నిశ్చల భక్తి కలిగి ఉండుట.

పై శ్లోక పాదములో 'భగవద్భక్తి' గురించి రెండు విశేషణాలను ఉపయోగించారు. మొదటిది - 'అనన్యయోగేన' రెండోది - 'అవ్యభిచారిణీ'. ఈ రెండు మాటలనూ అర్థం చేసుకుందాం.

భక్తుడు - ఒక సాత్త్విక భోక్త: జీవులమైన మనం ప్రాపంచిక వస్తువుల పట్ల గాఢమైన వాంఛతో, వాటితో సుఖించాలన్న దృఢమైన కోరిక (భోక్తృత్వభావం) కలిగి ఉంటాం. కానీ, ఆధ్యాత్మిక సాధకులుగా జీవితం పట్ల మన దృక్పథాన్ని మార్చుకోవాలి. ఆ విధంగా 'సుఖించేవాడు' (భోక్త) తన ప్రాపంచిక దృష్టిని 'భగవంతుని యందు ఆనందము పొందేవానిగా మలచుకోవాలి. భక్తుడైన వానికి ఇంద్రియ సుఖాల్లో భోక్తృత్వభావం, వాటి పట్ల గాఢమైన తృష్ణ బలహీనపడి, కోరికల నుండి విముక్తుడవడానికి ఉద్యుక్తుడవుతాడు. ఈ అంతర్గతమైన మలుపు పొందడమే మన సంస్కారాలను మార్చుకోవడానికి శ్రేష్ఠమైన పద్ధతి.

చాలామంది ఇంద్రియ సుఖాలను పొందుదామని అనుకుంటారు. తమకు లభించినవన్నీ తమ స్వార్థ ప్రయోజనాలకే ఉపయోగించుకుందామని అనుకుంటారు. భక్తుడైన వాని దృక్పథం మాత్రం ఇందుకు పూర్తి భిన్నంగా ఉంటుంది. అతడు తన కోసం ఏమీ ఉపయోగించుకోవాలని అనుకోడు. భగవంతుణ్ణీ, భక్తులనూ సేవించడంలో అతను అమితానందం పొందుతాడు. ఇతరులకు సహాయం చేయగలిగితే చాలా సంతోషం పొందుతాడు. సేవింపబడడం కన్నా సేవించడంలో ఆనందిస్తాడు. ఇది కూడా ఆనందం పొందడమే. కానీ, ఇది సాత్త్విక ఆనందం. ఈ విధంగా 'స్థూలమైన భక్తుడు' సాత్త్విక భక్తునిగా తయారవుతాడు.

ఇంద్రియ సుఖాలకు (భోక్తృత్వ భావానికి) ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం వల్ల దుఃఖమే కలుగుతుందని తెలుసుకోవాలి. ఆధిపత్యం, అధికారం, పెత్తనం చలాయించే యజమానితో ఎవరైనా సంతోషంగా ఉండగలరా? భోక్తృత్వం అలాంటి యజమాని లాంటిది. అది చాలా తీవ్రమైన కోరికలు కోరుతుంది. మనస్సుపై ఆధిపత్యం చలాయిస్తుంది. సుఖాలను కోరే మనస్సెన్నడూ హాయిగా ఉండలేదు. దానివల్ల నిరుత్సాహం కలుగుతుంది.

మనం ఆశగా ఎదురుచూసే విషయాలు, నిరుత్సాహాలు పరస్పర సంబంధం కలిగి ఉంటాయి. మనస్సు ఎక్కువ విషయాలను ఆశిస్తే, నిరుత్సాహం కూడా ఎక్కువే అవుతుంది. మొరటుగా ఉండే భక్తుడు ప్రజల నుంచి చాలా ఎక్కువ ఆశిస్తాడు. అందుచేత ఎక్కువ దుఃఖాన్ని గూడా పొందుతాడు. అతను 'బాగా కుంగిపోవుట' లేక ఉప్పొంగిపోవుట'ల మధ్య ఊగిసలాడతాడు. 'ఊగిసలాట' నెమ్మదిగా ఉన్నంతసేపు ఆనందంగానే ఉంటుంది. కానీ ఆ ఉయ్యాల చాలా పైకి వెళితే, కడుపులో త్రిప్పి, దాని ఫలితంగా అనారోగ్యం కలుగుతుంది. ఉయ్యాల నెమ్మదిగా ఊగినప్పుడే ఆనందాన్ని పొందగలుగుతాం. కానీ ఆ ఉయ్యాల మరీ నెమ్మదిగా ఊగితే కూడా ఆనందాన్నివ్వదు. మన మనస్సు ఒక ఊయల లాంటిది. ఆ ఊయలకు తగిలించిన గొలుసుల లాంటివి మన జీవితాలు. అందుచేత అవి కూడా ఊయల లాగా పైకీ, క్రిందకీ ఊగుతూనే ఉంటాయి.

దృఢమైన ఇష్టాలు, అనిష్టాలకు కట్టుబడి ఉండడం లేక దృఢమైన అభిప్రాయాలు కలిగిఉండడం - ఇవి ఒక ఊయలకు ఉండే కదలికల లాంటివి. ఒక్కొక్కసారి అవి పై పైకి వెళ్ళి ఇంటి కప్పును తాకవచ్చు. ఆ వెంటనే బాగా క్రిందికి వచ్చి నేలను తాకవచ్చు. భగవంతుని యందు భక్తి పెంపొందే కొద్దీ, సమంగా ఊగడం చేతనవుతుంది. అప్పుడిక బలమైన ఇష్టాలు, బలమైన అనిష్టాల ప్రభావం మన మీద ఏమీ ఉండదు. ప్రశాంతంగా ఉండగలుగుతాం. ❖

తెలుగుసేత: డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి

(వచ్చే సంచికలో - 'భక్తిని అలవరచుకోవడం')

సోదరప్రేమే సంఘశక్తి

– స్వామి భాస్కరానంద



సర్వసంగ పరిత్యాగులైన సన్న్యాసులు ప్రేమాభిమానాలకు దూరంగా, స్పందనారాహిత్యంతో ఉంటారని చాలామంది పొరపాటుపడుతూ ఉంటారు. కానీ సన్న్యాస ధర్మంలో కూడా మానవీయసంబంధాలు వెల్లివిరుస్తాయనటానికి ఎందరో రామకృష్ణసంఘ వరిష్ఠ సాధువులే సాక్ష్యం. భగవాన్ శ్రీరామకృష్ణుల కుటుంబంలోని సాధువుల మధ్య అల్లుకునే సోదరప్రేమ సంఘశక్తిని ఇనుమడింపచేస్తుందనడంలో సందేహం లేదు. ఈ సంఘసభ్యుడిగా అలాంటి ఎన్నో అనుభవాలు నా (స్వామి భాస్కరానంద) హృదయాన్ని కదిలించివేశాయి.

నేను అప్పటి వరకు దాదాపు పదకొండేళ్ళుగా బేలూరుమఠం లోని ప్రధాన కార్యాలయంలోనే వివిధ బాధ్యతలు నిర్వర్తిస్తూ ఉన్నాను. 1974లో అమెరికాలోని సీయటల్ రామకృష్ణ ఆశ్రమంలో స్వామి వివిధిశానంద మహరాజ్‌కి సహాయకుడిగా పనిచేసేందుకు నన్ను ఎంపికచేశారు. ఆ నేపథ్యంలో విదేశాలకు ప్రయాణమయ్యేందుకు సిద్ధమయ్యాను. ఆకాశయానానికి ముందు రోజు మఠంలోని సోదర సన్న్యాసులనందరినీ కలసి ఆశీస్సులు తీసుకున్నాను. అప్పుడు స్వామి వీరేశ్వరానంద మహరాజ్ రామకృష్ణ సంఘ 10వ సర్వాధ్యక్షులు. రోజంతా వారు అనేక పనుల్లో నిమగ్నమై ఉండటం వలన నేను దర్శించుకునే అవకాశం కలగలేదు. చివరకు రాత్రి పదిన్నర సమయంలో మహరాజ్‌ని కలుసుకునే అదృష్టం కలిగింది. అప్పుడు స్వామి వీరేశ్వరానంద మహరాజ్ వయస్సు దాదాపు ఎనభై ఏళ్ళు; చూపు కూడా కాస్త మసకబారింది. నేను వారిని దర్శించుకొని ప్రణామాలు చేయగానే, నన్ను గుర్తుపట్టి పేరుతో పిలిచి ఎంతో అభిమానంగా ఆశీర్వదించారు. విదేశాల్లో నేను నిర్వర్తించాల్సిన బాధ్యతలకు సంబంధించి ఎన్నో విలువైన సూచనలిచ్చారు. చివరగా 'నీవు బేలూరుమఠం నుంచి విమానాశ్రయానికి బయలుదేరేముందు కలుస్తాను' అన్నారు.

నా విమానప్రయాణం ఉదయమే కావడంతో, బేలూరుమఠం నుంచి దాదాపు నాలుగున్నరకే విమానాశ్రయానికి బయలు దేరాల్సి ఉంటుంది. అందుకే "మహరాజ్! దయచేసి అంత ఉదయం మీరు ఇబ్బందిపడకండి. పైగా తెల్లవారుఝామున చాలా చీకటిగా కూడా ఉంటుంది. మీరు నడవలేరు. నా కోసం అంత శ్రమ తీసుకోకండి" అన్నాను. వారు నిద్దరపోయేసరికే రాత్రి దాదాపు పన్నెండవుతుంది. అంత వయస్సులో మళ్ళీ తెల్లవారుఝామునే నిద్ర లేవాలంటే, వారికి చాలా అసౌకర్యంగా ఉంటుందని నాకు తెలుసు. నాకు వీడ్కోలు చెప్పాలంటే, వారు నిద్దరపోకుండా మేల్కొనే ఉండాలి.

ఉదయమే నేను అమెరికా వెళ్ళేందుకు బేలూరుమఠం నుంచి బయలుదేరుతున్నాను. అన్నీ సర్దుకొని కారులో కూర్చో బోతుండగా, సోదరసాధువు ఒకరు వచ్చి 'ఆగు! అధ్యక్షమహరాజ్ వస్తున్నారు' అన్నారు. నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. దూరం నుంచి స్వామి వీరేశ్వరానంద మహరాజ్ చేతికర్రను పట్టుకొని మెల్లిగా నడుచుకుంటూ వస్తున్నారు. మరో సోదరసాధువు కాంతివంతమైన పెద్ద ఫ్లాష్‌లైట్ పట్టుకొని ముందు నడుస్తూ ఉండగా మహరాజ్ ఓపిక చేసుకొని వస్తుంటే, నాకు ఆనందాశ్చర్యాలు కలిగాయి. ఇంత పెద్ద రామకృష్ణ సంఘంలో నేనొక సాధారణ సాధువుని. వారేమో సంఘ సర్వాధ్యక్షులు. అంత వృద్ధాప్యంలోనూ, శరీరం ఏ మాత్రం సహకరించకపోయినా నాపై ప్రేమ, ఆదరణలతో వీడ్కోలు పలకడానికి వచ్చేసరికి నా కళ్ళు చెమ్మగిల్లాయి. ఒక్కసారిగా ఉద్వేగంతో స్వామి వీరేశ్వరానంద మహరాజ్ పాదాలకు సాష్టాంగప్రణామం చేసి ఆశీస్సులు తీసుకున్నాను. వారు వీడ్కోలు పలుకుతూ తలపై చేయి ఉంచి ఆశీస్సులు అందించారు. ఆనందాతిశయం నిండిన హృదయంతో విమానాశ్రయానికి బయలుదేరాను. ఆ రోజు నా జీవితంలో మరచిపోలేని రోజు. ఎలాంటి భేషజాలు లేని సోదరప్రేమ, నిస్వార్థ బంధమే రామకృష్ణ సంఘ సాధువులను ఒక్కటిగా కలిపి ముందుకు నడిపిస్తున్నాయని నాకు అర్థమైంది. ❖




స్వామి వీరేశ్వరానంద


ఓ మహిళా! తల్లి అనే మాట నాటికీ నేటికీ పరమ పూజ్యమైనది. వేరే ఏ మాటా అలా దురాశను తొలగించ లేదు. దుష్కామాలను అణచలేదు. భారతదేశంలో ఆదర్శస్త్రీ అంటే మాతృమూర్తే - స్వామి వివేకానంద





పొంగిపొరలి వచ్చిన గంగ!

కథ: ఎం. భైరవ్ సుబ్రహ్మణ్యం చిత్రాలు: శివరామ్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద





6
గంగా తివారీ ఆహ్వాన తాళపత్రాన్ని గంగా నదీమతల్లికి చదివి వినిపిస్తుండగానే ఒక అల లేచి ఆ తాళపత్రాన్ని ప్రవాహంలో కొట్టుకుపోయేలా చేసింది.
ఆహా! తల్లి మన ఆహ్వానాన్ని స్వీకరించింది. రండి! బాబా వద్దకు పోయి ఈ విషయం చెబుదాం.
7
కొందరు తివారీని పరిహసించారు. కానీ, బాబాను ప్రత్యక్ష దైవంగా విశ్వసించడం వల్ల ఆ పరిహాసాలను అతడు పట్టించుకోలేదు. సాధు సమ్మేళన ఏర్పాట్లలో అతడు లీనమైపోయాడు. కానీ, రోజులు దగ్గరయ్యే కొద్దీ అతడిలో దిగులు గూడుకట్టుకోసాగింది.
8
బాబా! ఇక మూడు రోజుల్లో సాధువులు తరలి రానున్నారు. తక్కినదంతా సిద్ధం. కానీ నీటి సౌకర్యం పెద్ద సమస్యగానే ఉంది.
దిగులుపడకు! గంగాదేవి మనల్ని వదిలిపెట్టదు. ఆమె కచ్చితంగా వస్తుంది.
9
అది వేసవి కాలం. ఆశ్రమానికి సమీపంలోని పంట కాలువలోకి వర్షాకాలంలో మాత్రం నీరు వస్తుంది; తక్కిన కాలాల్లో అది ఎండిపోయి ఉంటుంది.
సాధువుల రాక మొదలైంది. ఆహార పదార్థాలు సిద్ధంగా ఉన్నాయి. కానీ, నీళ్ళు లేవే! గంగామాతా! రక్షించు తల్లీ.
పుట్టెడు దిగులుతో తివారీ రాత్రి నిద్రించడానికి వెళ్ళాడు.



10 మరునాడు తెల్లవారుజామున ఒక అద్భుతం జరిగింది. పంట కాలువలో నురుగులతో గంగానది నీరు పొంగిపొరలి వస్తోంది.
గంగా మాతాకీ జై!
కారుణ్యానికి మారుపేరు నువ్వే తల్లీ!
11 ఓ మాతా! సన్న్యాసులకు నాయకుడైన పరమశివుని అనుగ్రహం పొందడానికి తపస్సు చేసే సన్న్యాసులను చూడడానికి పరుగున వచ్చావా తల్లీ!
12 బాబా మీరు అన్నట్లుగానే గంగా నదీమతల్లి ఆశ్రమం వైపుగా వచ్చేసింది.
ఇంతమంది సాధువులను చూడడానికి గంగా మాత రాకపోతుందా? దక్షిణ దేశంలో శ్రీధర అయ్యావాల్ అనే భక్తుడి అచంచల భక్తికి మెచ్చి గంగాదేవి ఆతడి బావిలో ఉద్భవించిన వైనం ఉంది కదా!
13 స్వాముల్లారా! గంగా స్నానం ఆశ్రమంలోనే సాధ్యమవుతుందని నేను కలలో కూడా ఊహించలేదు. ఆహా, ఎంత అద్భుతం! గంగామాతాకీ జై!
ఈ అద్భుతం జరగడానికి పవహారీ బాబా అత్యున్నత ఆధ్యాత్మిక స్థితే కారణం. బాబాజీకి జై!











భగవంతుని అనుగ్రహం పొందదలిస్తే, నువ్వు ఏ కర్మనైనా మనస్ఫూర్తిగా నిర్వర్తించు. భగవంతుణ్ణి పొందాలనే పరితాపంతో నిర్వర్తించు. ఆయన కృపతో పరిస్థితులన్నీ నీకు అనుకూలంగా మారతాయి.

- భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస

గ్రంథపరిచయం




శ్రీలలితా త్రిశతి స్తోత్ర నామార్థ మాలిక

వ్యాఖ్యాత: శ్రీమతి కురుగంటి శ్యామలాదేవి
వెల: రూ.140/- పుటలు: 278
ప్రతులకు: శ్రీమతి కురుగంటి శ్యామలాదేవి, శ్రీలలితా ధ్యానమండలి, 2వలైను, భాగ్య నగర్, ఒంగోలు. సెల్: 94902 27727

అందరూ అనుష్ఠానపూర్వకంగా శ్రీమాత మూలమంత్రాన్ని జపించి సాధనలు చేయలేరు. జపసాధనలు చేయలేని సామాన్య భక్తుల కోసం అవతరించినవే నామస్తోత్రాలు. అలాంటి స్తోత్రాలలో ఉత్తమోత్తమమైనది శ్రీలలితా త్రిశతి స్తోత్రం. లలితా సహస్రనామ పారాయణంలో పరిణతి, పరిపూర్ణతలను సాధించిన సాధకుడు తరువాత మెట్టుగా త్రిశతి పారాయణం ప్రారంభిస్తాడని పెద్దల మాట.

సాధకుడు సగుణోపాసనను అధిగమించి, నిర్గుణోపాసన వైపునకు పయనించే క్రమంలో, కుండలినీ శక్తిని స్థిరం చేయడానికి త్రిశతిని ఉపాసిస్తారని గురువచనం. ఇంత మహిమాన్వితమైన త్రిశతి స్తోత్రానికి పారిభాషికపదాల పోహళింపులు లేకుండా సరళంగా, స్పష్టంగా చదవగానే అర్థమయ్యేవిధంగా వ్యాఖ్యానించిన శ్యామలాదేవి గారు అభినందనీయురాలు. సాధకులందరూ తప్పక చదవవలసిన ఉత్తమ గ్రంథమిది. – ఎం.వి. నాగప్రసాద్



శ్రీనవనీతము

రచయిత: క్రమధాటి వేంకట రాధాకృష్ణ
వెల: రూ. 200/- పుటలు: 366
ప్రతులకు: కె.వి. రాధాకృష్ణ, ఇం.నెం. 6/723-3, మిద్దె పైన, శంకరాపురం, కడప. సెల్: 99857 23765

నాటి 'సౌభాగ్య భాస్కరం' మొదలు నేటి 'శ్రీనవనీతము' వరకు శ్రీలలితా సహస్రనామాలకు ఎన్నో వ్యాఖ్యానాలు. ప్రతి వ్యాఖ్యానమూ సాధకుని సాధనాధారంగా ప్రత్యేకతను సంతరించుకుంటుంది. 'శ్రీనవనీతము'ను చదివితే వ్యాఖ్యాత శ్రీమాత పాదాలను అన్యథా శరణం నాస్తి అని ఆశ్రయించినట్లుగా కనిపిస్తుంది. ఈ వ్యాఖ్యానంలో పదకోశాలు, వ్యుత్పత్త్యర్థాలు, ధాతురూపాల జోలికి పోకుండా తన హృదయ దర్పణం మీద అమ్మ చూపించిన భావాలను సామాన్య జనులకు సైతం సులభంగా అర్థమయ్యే విధంగా రచించడం అభినందించ వలసిన విషయం. శ్రీలలితా సహస్రనామావళికి ఈ మధ్య కాలంలో వచ్చిన మంచి వ్యాఖ్యానాలలో 'శ్రీనవనీతము' ఒకటి. సాధకులందరూ తప్పక చదవవలసిన పుస్తకమిది.

– ఎం.వి. నాగప్రసాద్

ఆవాసీయ అంతర్యోగ కార్యక్రమం: భగవాన్ శ్రీరామకృష్ణ దేవాలయ సంప్రోక్షణ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా **కడప రామకృష్ణ మిషన్** ఆశ్రమ ప్రాంగణంలో 2013 నవంబర్ 22, 23, 24 తేదీల్లో ఆవాసీయ అంతర్యోగ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమంలో పాల్గొనదలచిన భక్తులు అక్టోబర్ 31వ తేదీ లోపుగా రూ.300/-లు చెల్లించి, పేర్లను నమోదు చేయించుకోవాల్సిందిగా మనవి. భక్తులు తమ పూర్తి చిరునామాను ఎస్.ఎమ్.ఎస్ ద్వారా సెల్ నంబర్ 94415 22259కు తెలియజేయగలరు. – కార్యదర్శి, రామకృష్ణ మిషన్, పుట్లంపల్లి, కడప

స్వామి వివేకానంద క్విజ్ - జవాబులు

(1) "ఆహా! శ్రీరామకృష్ణులు వివేకానందను మహనీయునిగా తీర్చిదిద్దారు. వివేకానంద నూతన భారతదేశ రూపశిల్పులలో ప్రథమ శ్రేణికి చెందినవారు".
(2) సీత, శారదాదేవి
(3) హనుమంతుడు
(4) కఠోపనిషత్తు
(5) నచికేతుడు
(6) వేదకాలం నాటి స్త్రీలు గార్గి, మైత్రేయి
(7) శ్రీమద్భగవద్గీత
(8) హెర్బర్ట్ స్పెన్సర్
(9) నెపోలియన్ చక్రవర్తి
(10) జాన్ మిల్టన్ రచించిన ప్యారడైజ్ లాస్ట్
(11) మూడు సార్లు. మొదట చికాగో మిచిగన్ సరస్సు తీరంలో, రెండో సారి పెర్సీ మకాంలో, మూడోసారి సహస్ర ద్వీపవనంలో.
(12) కఠోపనిషత్తు ('ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్ నిబోధత' అన్న మంత్రానికి స్వేచ్ఛానువాదం).
(13) 1894 జూన్ 23వ తేదీన చికాగో నుండి మైసూరు మహారాజైన చామరాజేంద్ర వడయార్‌కు.
(14) స్వామి అఖండానంద
(15) స్వామి తురీయానంద, స్వామి అభేదానంద, స్వామి త్రిగుణాతీతానంద, స్వామి శారదానంద.

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

వివేకానంద రథయాత్ర

(2013 జూన్ 20వ తేదీ నుండి ఆగష్టు 31వ తేదీ వరకు)













స్వామి వివేకానంద 150వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్ రామకృష్ణ మఠం 2012 సెప్టెంబర్ 11వ తేదీ నుండి 'వివేకానంద రథయాత్ర'ను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తోంది.

కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 2013 జూన్ 20వ తేదీ నుండి ఆగస్టు 31వ తేదీ వరకు రథయాత్ర కొనసాగింది. ఆయా జిల్లాల్లోని శ్రీరామకృష్ణ సేవాసమితుల సహకారంతో కడప రామకృష్ణ మఠం పర్యవేక్షణలో సుమారు 120 పట్టణ, గ్రామాల్లో వివేకానంద రథం పర్యటించింది. సుమారు లక్షా యాభై వేల మంది పుర ప్రజలు, విద్యార్థులు రథాన్ని దర్శించుకున్నారు. రథయాత్రలో సుమారు రూ.12 లక్షల విలువైన వివేకానంద సాహిత్యాన్ని కొనుగోలు చేశారు. ❖
















Vol.70-10, Sri Ramakrishna Prabha (Telugu Monthly) October 2013, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57.
Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18th of every month.

ఓ జగన్మాతా! దారి చూపు తల్లీ!



అమెరికా చికాగో నగరంలో జరిగిన విశ్వమత మహాసభల్లో స్వామి వివేకానంద మొదటి ఉపన్యాసంతోనే విఖ్యాతుడయ్యారు. మొదటిరోజు సమావేశం ముగిసిన వెంటనే ఒక కోటీశ్వరుడు స్వామీజీకి తన ఇంటిలో ఆతిథ్యం ఇచ్చాడు. అతడు స్వామీజీ సౌకర్యంగా ఉండడానికి అవసరమైన వసతులన్నీ సమకూర్చాడు. కానీ స్వామీజీ ఆ రాత్రంతా నేలపై పడుకొని భారతీయుల బాధలను తలచుకొని విలపిస్తూ జగన్మాతను ఇలా ప్రార్థించారు:

“అమ్మా! జగజ్జననీ! నా దేశ ప్రజలు పేదరికంలో మగ్గుతుంటే ఈ పేరు ప్రతిష్ఠలు నాకెందుకు? నా భారతీయులు ఆకలితో అలమటిస్తుంటే నాకీ భోగభాగ్యాలెందుకు? అమ్మా! నేను వారికి ఎలా సేవ చేయగలనో చెప్పమ్మా! నాకు సరైన దారి చూపు తల్లీ!”.



మహబూబ్‌నగర్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ‘వివేకానంద రథం’ పర్యటన వివరాలు:

2013 అక్టోబర్ 1,2 మహబూబ్‌నగర్; 3–కొత్తకోట, వనపర్తి; 4–పెబ్బేరు, శాంతినగర్; 5–ఐజ, గద్వాల్; 6–ఆత్మకూరు, అమరచింత; 7–సి.సి.కుంట, మరికల; 8– మక్తల్, మగ్నూర్; 9–ఉత్కూర్, జాజాపూర్, నారాయణపేట్; 10–దామరగిద్ద, మద్దూర్, దౌలతాబాద్; 11– కొడంగల్; 12–గండేడ్, హన్వాడ, కోసిగి; 13– దేవరకద్ర; 14– భూత్పూర్; 15–జడ్చర్ల, బాలానగర్; 16–18 షాద్‌నగర్, కొందుర్గ్, పద్మశాలిపురం; 19,20 చేవెళ్ళ, పరిగి; 21–తాండూరు; 22–ధరూర్, వికారాబాద్; 23,24 శంకరపల్లి, సంగారెడ్డి, సదాశివపేట్; 25–జహీరాబాద్, నారాయణఖేడ్; 26–మెదక్; 27–గజ్వేల్.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

నవంబర్ 2013

₹10



సుబోధ



భక్తుడు: సృష్టి, స్థితి, లయలనే లీలలను జగన్మాత నిర్వహిస్తోంది. ఇదంతా ఆమె ఇష్టం. కానీ పిల్లికి చెలగాటం, ఎలుకకు ప్రాణసంకటం. ఇందులో మా ప్రాణాలే పోతున్నాయి.

శ్రీరామకృష్ణులు : నువ్వు ఎవరివి? అమ్మే సర్వమూ అయి ఉంది. ఆమెను తెలుసుకోనంత వరకే 'నేను, నేను' అంటూ ఉంటావు. 'నేను ఎవర్ని' అంటూ ఈ 'నేను'ను అన్వేషించు. 'నేను' అనేది ఎముకలా? లేక మాంసమా? లేక రక్తమా? లేక ప్రేవులా? 'నేను'ను వెదకుతూపోయినప్పుడు 'నేను'ను కనుగొంటావు. అంటే, లోపల భగవంతుడి శక్తి కంటే వేరుగా మరేమీ లేదు. ఉన్నది 'నేను' కాదు, 'ఆయనే'. ఈ 'నేను'ను పూర్తిగా త్యజించలేం. కాబట్టి ఈ 'నేను'ను భగవంతుడి దాసుడిగా పడి ఉండనివ్వు. 'నేను భగవంతుడి భక్తుడను, భగవంతుడి బిడ్డను, భగవంతుడి దాసుడను' అనేటటువంటి అహం మంచిది. కామినీ కాంచనాలలో అనురక్తమై ఉన్న 'నేను'– అపరిపక్వమైన 'నేను'. అలాంటి 'నేను'ను పరిత్యజించాలి.

కామినీ కాంచనాలు ఒక విధమైన మద్యం లాంటివి. మద్యపానం చేసేవారు చిన్న, పెద్ద అనే వ్యత్యాసం లేకుండా మాట్లాడతారు.

భక్తుడు: మహాశయా! సూర్యలోకం, చంద్రలోకం, నక్షత్రలోకం ఇవన్నీ నిజంగానే ఉన్నాయంటారా?

శ్రీరామకృష్ణులు: వాటి గురించి అంతగా తల పగలగొట్టుకోవడం ఎందుకు? మామిడి తోటకు పళ్ళు తినడానికి వచ్చావు. అంతేకాని, తోటలో ఎన్ని మామిడి చెట్లు ఉన్నాయి, ఎన్ని లక్షల కొమ్మలు ఉన్నాయి. ఎన్ని కోట్ల ఆకులు ఉన్నాయి అంటూ లెక్కించడం వల్ల ప్రయోజనం ఏమిటి? నేను తోటకు మామిడి పళ్ళను తినడానికి వచ్చాను, పళ్ళు తిని పోతాను.

అయితే చైతన్యం కనుక ఒకసారి జాగృతమైనట్లయితే, భగవంతుణ్ణి ఒకసారి తెలుసుకోగలిగినట్లయితే, నిరర్థక విషయాలను తెలుసుకోవాలన్న ఇచ్ఛ జనించదు.

భగవంతుడిపై మనస్సును నిలుపు. చైతన్యం జాగృతమవుతుంది. భగవంతుణ్ణి హృదయాంతరాళాల నుండి ప్రార్థించినట్లయితే ఆయన పట్ల మనస్సు నిలుస్తుంది. ఆయన పాదపద్మాల పట్ల శుద్ధభక్తి కలుగుతుంది. ❖

శ్రీరామకృష్ణ ప్రభ

రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040–27667799, మొబైల్: 8801849494
E-mail: sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద** సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

సంపుటం: 70 సంచిక: 11 నవంబర్ 2013




యత్కటాక్ష సముపాసనా విధిః
సేవకస్య సకలార్థ సంపదః ।
సంతనోతి వచనాంగ మానసైః
త్వాం మురారి హృదయేశ్వరీం భజే ॥

ఏ దేవి కటాక్ష వీక్షణమున సేవకులకు సకలార్థ సంపదలు లభించునో, అట్టి మురారి హృదయేశ్వరి అయిన లక్ష్మీదేవిని మనోవాక్కాయములచే త్రికరణశుద్ధిగా సేవించెదను.

– *శ్రీకనకధారాస్తోత్రమ్*

స్మృతిపథంలో స్ఫూర్తిప్రదాత



స్వామి వివేకానంద భారతదేశ సనాతనత్వానికీ, అధునాతనత్వానికీ అనుసంధాన కర్త. ఆయనలోని సమతుల్యత, ఠీవి నిరుపమానం. అసమానమైన ఆత్మవిశ్వాసం, కార్యదక్షత, నిర్విరామ క్రియాశీలత కలిగియున్న ఈ మహనీయుడు భారతదేశాన్ని పురోగమనగతిలో పయనింపజేయగల ధీరుడు.


మనకు సంక్రమించిన ప్రాచీన సంస్కార సంపదను తలచుకొని మనం గర్వపడే అవకాశాన్ని వివేకానంద మనకు సంప్రాప్తింపజేశారు. ఆయన మన బలహీనతల్నీ, లోపాల్నీ మరుగుపరచకుండా తేటతెల్లంగా బహిర్గతం చేశారు. మనం మన లోపాలను సవరించుకోవాలనే ఉద్దేశంతోనే ఆయన వాటిని ఎత్తి చూపించారు.

స్వామీజీ రచనలు, ప్రవచనాలు మనందరినీ ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆధునిక జాతీయ ఉద్యమ వ్యవస్థాపకుడు, సారథిగా కూడా పరిగణింపదగినవారు స్వామీజీ. జాతీయ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న నేతలందరూ స్వామీజీ నుండి స్ఫూర్తిని పొందినవారే.


స్వామీజీ రచనల్లో, భాషణలలో భారతదేశం, ప్రపంచ దేశాల సమస్యల గురించి సమగ్రమైన వివరణలున్నాయి. కాబట్టి ఆయన బోధనలు ఈనాటికీ నూతనత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి.

ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ స్వామీజీ సమస్త భారతజాతిని ప్రభావితం చేశారు. నేటి యువత స్వామీజీ ఇచ్చిన అమూల్యమైన విజ్ఞాన, వివేక సంపదల నుండీ, ఉత్సాహ ఉద్దీపనల నుండీ ప్రయోజనం పొందగలరని నా విశ్వాసం. ❖

– పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ



శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి





ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు...... రూ. 10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు........... రూ. 5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................ రూ. 1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు / చిరునామా	రూ.
మహారాజ పోషకులు	శ్రీ డి. ఆనంద మోహనరావు & శ్రీమతి ఇందిర, రామారావుపేట, కాకినాడ (కీ॥శే॥ దాసరి వేంకట రామారావు గారి జ్ఞాపకార్థం)	10,000
పోషకులు	డాక్టర్ విమల్‌చంద్ పహడె, రామ్‌కోఠి, హైదరాబాద్ (కీ॥శే॥ రజని పహడె గారి జ్ఞాపకార్థం)	2,000
పోషకులు	శ్రీ బెజవాడ ధర్మరాజు, గొల్లప్రోలు, కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా - 533 445	1,116
పోషకులు	శ్రీమతి పాశం శైలజ, విఠల్‌నగర్, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా (కీ॥శే॥ పాశం సంతోష్ నిశ్చల్ జ్ఞాపకార్థం)	1,116
పోషకులు	శ్రీ మహేశ్వరం సుభాష్ రెడ్డి, దమ్మన్నపేట, వరంగల్ జిల్లా (కీ॥శే॥ కాంతమ్మ గారి జ్ఞాపకార్థం)	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' కానుక పథకం

యువతరానికి 'శ్రీరామకృష్ణ ప్రభ'ను మరింత చేరువ చేయాలని సంకల్పించాం. రాష్ట్రంలోని వివిధ పాఠశాలలు/ కళాశాలలు/ గ్రంథాలయాలకు పత్రికను పంపించడానికి మీ సహాయాన్ని కోరుతున్నాం. ఈ కానుక పథకం క్రింద చందా చెల్లించిన దాత పేరున (మీరు సూచించిన లేదా మేము ఎంపిక చేసిన) విద్యాసంస్థకు పత్రికను పంపుతాం. కానుక చందా రూ.1500/-, అంతకన్నా ఎక్కువ ఇచ్చిన దాత పేరు, విద్యాసంస్థ పేరు పత్రికలో ప్రచురిస్తాం.

దాత పేరు	విద్యాసంస్థ
శ్రీ కూచిభొట్ల నగేశ్, రెడ్‌హిల్స్, హైదరాబాద్	జె.కె.సి. డిగ్రీ కళాశాల, గుంటూరు
శ్రీమతి గుళ్ళపల్లి లైల, కామయ్యతోపు, విజయవాడ	జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, యలమంచిలి, విశాఖపట్నం జిల్లా
శ్రీ కె. సోమరాజు, రాజమండ్రి, తూర్పు గోదావరి జిల్లా	తూర్పు గోదావరి జిల్లాలోని 4 పాఠశాలలకు జీవిత చందా స్పాన్సర్ చేశారు.
శ్రీ జి. రాఘవ రెడ్డి, పేట్ బషీరాబాద్, హైదరాబాద్	జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, భీమవరం, వత్సవాయి, కృష్ణా జిల్లా
శ్రీ డబ్ల్యు. కృష్ణస్వామి, న్యూ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్	శ్రీ సాయి గ్రామర్ ఉన్నత పాఠశాల, న్యూ బోయిన్‌పల్లి, సికింద్రాబాద్
శ్రీ ఆనంద మోహన రావు, రామారావుపేట, కాకినాడ (కీ॥శే॥ డి.లలితేశ్వరమ్మ జ్ఞాపకార్థం)	మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల, సీతారాంపల్లి తండ, మెదక్ జిల్లా



దీపావళి శుభాకాంక్షలు

'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు, రచయితలకు, రచయిత్రులకు, ఏజెంట్లకు, ప్రకటనకర్తలకు, దాతలకు, శ్రేయోభిలాషులకు మా హృదయపూర్వక దీపావళి శుభాకాంక్షలు. *- సంపాదకులు*

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలలో
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	$ 25
మూడు సంవత్సరాలకు	:	₹ 280	$ 55
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	$ 85
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1500	$ 365

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.

పంపవలసిన చిరునామా:
Sri Ramakrishna Prabha, Ramakrishna Math,
Domalguda, Hyderabad - 500 029.

లోపలి పేజీల్లో...

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారితే (పోస్టల్ పిన్‌కోడ్‌తో సహా) వెంటనే మాకు తెలియపరచి, సహకరించ మనవి.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... – సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
DOMALGUDA, HYDERABAD - 500 029. Andhra Pradesh
Phone No: 040- 27667799, 8801849494 E-mail : sriramakrishnaprabha@gmail.com

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ **http://kinige.com/srkp** ద్వారా చెల్లించవచ్చును.

భారతావని బంగారు కిరణాలు

శర్వరీ దీపక శ్చంద్రః ప్రభాతో దీపకో రవిః ।
త్రైలోక్య దీపకో ధర్మః సుపుత్రః కుల దీపకః ॥

'రాత్రికి వెలుగు చంద్రుడు. పగటికి వెలుగు సూర్యుడు. ముల్లోకాలకూ వెలుగు ధర్మం. వంశానికి వెలుగు సుపుత్రుడు'.

లోకానికి వెలుగునిచ్చేది ధర్మమని సుభాషితం చెబుతోంది. మరి నేడు అవినీతి, అన్యాయాలనే అంధకారంతో అలముకొన్న ఈ లోకానికి ధర్మమనే వెలుగునిచ్చేది ఎవరు?

రామకృష్ణ మిషన్ నిర్వహించిన ఉన్నత పాఠశాల విద్యార్థుల సమావేశంలో భారతరత్న అబ్దుల్ కలాం మాట్లాడుతూ... "మన దేశంలో అవినీతి పెచ్చుమీరిపోతోంది. ఎక్కడ చూసినా అన్యాయాలు, అక్రమాలు, అవినీతి స్వైరవిహారం చేస్తున్నాయి. ఈ అధర్మాలను అణచడానికి ఏం చేయాలి?" అని విద్యార్థులను ప్రశ్నించారు. అందుకు విద్యార్థులు ఒక్కొక్కరూ లేచి 'ప్రజా శ్రేయస్సును కాంక్షించే నిస్వార్థపరులైన నాయకులు కావాలనీ; నిజాయతీపరులైన ప్రజాప్రతినిధులు అవసరమనీ; ప్రతీ ఉద్యోగి తమ విధులను నిబద్ధతతో నిర్వర్తించాలనీ; ప్రతీ పౌరుడు సామాజిక స్పృహతో వ్యవహరించాలనీ...' ఇలా తమ తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు.

ఆలోచనాత్మకమైన విద్యార్థుల సమాధానాలను విని డాక్టర్ కలాం చాలా సంతోషించారు. అయితే ఆయన తన అభిప్రాయం చెబుతూ.. "ఈ సమాజంలో అవినీతి, అధర్మాలను అరికట్టడానికి మీరిచ్చిన సూచనలు సరైనవే. కానీ అన్నింటి కన్నా ముందు అవినీతి నిర్మూలన మీ ఇంటి నుండే మొదలవ్వాలి. అందుకు సరైన ఆయుధాలు మీరే. అది ఎలా అంటే ఉదాహరణకు మీ తండ్రి లంచం తీసుకొని, ఆ డబ్బుతో మీకు మంచి బట్టలు, ఆటవస్తువులు, ఖరీదైన సెల్‌ఫోన్‌లు కొంటే 'ఆ అవినీతి సొమ్ముతో కొన్న వస్తువులను మేము వాడబోమ'ని మీరు చెప్పగలగాలి; అలాగే 'ఇతరులను మోసం చేసి సంపాదించిన సొమ్ముతో పంచభక్ష్య పరమాన్నాలైనా సరే అవి మాకు వద్ద'ని మీరు ధైర్యంగా నిరాకరించగలగాలి; 'కుటిలబుద్ధితో కోట్లను సంపాదించి నిర్మించిన ఇంద్రభవనాల్లో అశాంతితో జీవించడం కన్నా, శాంతిగా పూరింటిలో జీవించడం మేల'ని మీరు నిర్భయంగా చెప్పగలగాలి; 'అక్రమార్జనతో విలాసవంతమైన జీవితం గడపడం కన్నా సాధారణ జీవన విధానమే ఉత్తమమ'ని మీరు కృతనిశ్చయంతో చెప్పగలగాలి... ఇలా మీరు ఎప్పుడైతే అధర్మ మార్గంలో నడుస్తున్న తల్లితండ్రులపై నైతిక బలాన్ని ప్రదర్శిస్తారో అప్పుడు మాత్రమే సమాజంలో సంపూర్ణంగా అవినీతి ద్వారాలు మూతబడతాయి".

"అయితే, మీలో ఎంతమంది మీ తల్లితండ్రులను అలా అడగగలరు?" అని డాక్టర్ కలాం ప్రశ్నించగానే ఆ సమావేశంలో ఉన్న సుమారు వెయ్యి మంది బాలబాలికలూ తమ సుముఖతను తెలుపుతూ చేతులెత్తారు. అప్పుడు వారితో 'అవినీతిని నిర్మూలించడానికి మేమంతా కృషి చేస్తామ'ని ప్రతిజ్ఞ చేయించారు కలాం. అలా భారతరత్న కలాం కలకాలం చెరిగిపోని రత్నాల్లాంటి మాటలతో ఆ పసిహృదయాలను స్పందింపజేశారు. నిజంగా దేశంలోని విద్యార్థులంతా డాక్టర్ కలాం సూచనలను ఆచరణలో పెట్టగలిగితే మరో రామరాజ్యం ఆవిర్భవిస్తుంది.

అయితే, పసిహృదయాలలో ఆ స్ఫూర్తిజ్వాల నిరంతరం జ్వలించాలంటే మహాత్ముల జీవితాలే వారికి ఆదర్శం కావాలి. అందుకు బాల్యంలోనే ఆత్మశ్రద్ధ, ఆత్మశక్తి, ఆత్మవిశ్వాసం ప్రదర్శించిన కఠోపనిషత్తులోని నచికేతుడు, భాగవతంలోని ప్రహ్లాదుడు, నేటి నరేంద్రుడు లాంటి ఆదర్శ బాలురు చూపిన వెలుగుబాటలో పయనించాలి.

తండ్రి వక్రబుద్ధిని సవరించిన తనయుడు: నచికేతుని తండ్రి అయిన వాజశ్రవసుడు విశ్వజిత్‌యాగం చేశాడు. ఆ యాగం పూర్తయిన తరువాత తనకున్న సమస్త సంపదనూ దానం చేయాలన్నది నియమం. కానీ లోభవశుడైన వాజశ్రవసుడి బుద్ధి వక్రీకరించింది. తన వద్ద ఉన్న బక్కచిక్కిన, వట్టిపోయిన, ఎందుకూ పనికిరాని ముసలి ఆవులను దానం చేస్తున్నాడు. తండ్రి చేస్తున్న అన్యాయాన్ని చూసిన నచికేతుడు, 'తండ్రీ! నేను కూడా మీకు సంపదనే. మరి నన్ను ఎవరికి దానం చేస్తారు. మన పూర్వీకులు ధర్మ మార్గాన్ని అనుసరించి ఎన్నో దానధర్మాలు చేశారు. చెట్టూ చేమల లాగా పుట్టి గిట్టడం కన్నా మనిషిగా ధర్మవర్తనులై ప్రవర్తించాలి' అని తండ్రి తప్పును పరోక్షంగా ఎత్తిచూపాడు. అంతేకాదు 'నిన్ను ఆ యమునికి దానం ఇస్తున్నాను' అన్న తండ్రి మాటను నిజం చేయకపోతే తండ్రికి అపకీర్తి కలుగుతుందని నచికేతుడు, సాక్షాత్తూ యముని దగ్గరకు వెళ్ళాడు. నచికేతుడు తన శ్రద్ధ విశ్వాసాలతో, వివేక వైరాగ్యాలతో యముణ్ణి మెప్పించి, ఆత్మజ్ఞానం పొందడంతో పాటు, వంశానికి ఘనకీర్తిని సంపాదించిన సుపుత్రుడు.



ధర్మం పట్ల ఉన్న శ్రద్ధ వల్ల నచికేతుడు, తన తండ్రిని సత్యపథంలో నడిపించగలిగాడు. అందుకే స్వామి వివేకానంద

నచికేతుణ్ణి శ్లాఘిస్తూ..."నచికేతునికి ఉన్నటువంటి శ్రద్ధను మనం అలవరచుకోవాలి. మనిషికీ, మనిషికీ మధ్య గల భేదం శ్రద్ధలో తారతమ్యమే గానీ వేరొకటి కాదు. మనలో శ్రద్ధ లోపించడమే నేటి మన ఈ దుఃస్థితికి కారణం. ఇప్పుడు మనందరికీ కావలసింది ఆత్మశ్రద్ధ. ఈ శ్రద్ధ వల్ల అఖండశక్తి వస్తుంది. అప్పుడే మహత్తర కార్యాలను సాధించగలం" అని సూచించారు.

తండ్రి అజ్ఞానం... తనయుని విజ్ఞానం: ప్రహ్లాదుని తండ్రి అయిన హిరణ్యకశిపుడు అజ్ఞాన, అహంకారాలకు నిలయం. ఈ లోకంలో తన కన్నా శక్తిమంతుడు వేరెవరూ లేరనీ, ప్రతి ఒక్కరూ తననే పూజించాలనీ, తన నామాన్నే స్మరించాలనీ శాసనాలు చేసిన శ్రీహరి ద్వేషి - హిరణ్యకశిపుడు. అజ్ఞానంతో తండ్రి, శ్రీహరిని దూషిస్తూ ఉంటే ప్రహ్లాదుడు, హిరణ్యకశిపునితో "ఓ తండ్రీ! అజ్ఞాన అహంకారాలకు లోనై అనంత శక్తిమంతుడైన ఆ శ్రీహరిని ద్వేషించడం తగదు. విష్ణుభక్తి లేనివాడి జీవితం తోలుతిత్తితో సమానం. గుడ్డివాడికి వెన్నెల లాంటిది, చెవిటి వాడికి శంఖధ్వని లాంటిది, లోభికి సంపద లాంటిది. పందికి పన్నీరు లాంటిది. అందువల్ల అజ్ఞానం వీడి శ్రీమన్నారాయణుని సేవించి తరించండి" అని హితవు పలికాడు.

కుమారుడి నీతివచనాలను సహించలేని హిరణ్యకశిపుడు కోపోద్రిక్తుడై ప్రహ్లాదుణ్ణి వధించమంటూ భటులను శాసించాడు. భటులు ప్రహ్లాదుణ్ణి క్రూరమృగాలతో తొక్కించారు, కత్తులతో పొడిచిహింసించారు, కొండపై నుండి తోయించారు. విషాన్ని త్రాగించారు. ఇలా భటులు ఎన్నో విధాలుగా హింసిస్తున్న



ప్పటికీ ఆ బాలుడు చలించ లేదు. తండ్రి అజ్ఞానాన్ని పార ద్రోలడానికి ప్రహ్లాదుడు కష్టాల న్నింటినీ ఆత్మశక్తితో, విష్ణు భక్తితో అధిగమించి బాల భక్తునిగా చిరకీర్తిని గాంచాడు.

నిర్భయమే ఆ బాలుని ఆయుధం: నరేంద్రుని తండ్రి విశ్వనాథ్ దత్తా ప్రఖ్యాత న్యాయవాది. వ్యాజ్యం విషయమై విభిన్న కులాల వారు ఆయన దగ్గరకు వస్తూండేవారు. ఆ రోజుల్లో ఇంటికి వచ్చే అతిథులకు పొగత్రాగడానికి హుక్కాను ఏర్పాటుచేసేవారు. అయితే ఆ కాలంలో కుల పట్టింపుల కారణంగా కులాలవారీగా వేరు వేరు హుక్కాలను ఏర్పాటు చేసేవారు. ఈ కుల పట్టింపులు బాలుడైన నరేంద్రుడికి ఎంతమాత్రమూ ఇష్టముండేవి కాదు. ఒక కులంవారు వాడిన హుక్కాతో ఇంకొక కులంవారు పొగత్రాగితే ఏమవుతుంది? ప్రాణాలు పోతాయా? అని అనుకున్నాడు.

ఒకరోజు నరేంద్రుడు విభిన్న కులాలవారు వాడిన ఒక్కొక్క హుక్కాతో తాను పొగత్రాగాడు. ఇంతలో అక్కడికి వచ్చిన తండ్రితో నరేంద్రుడు "నాన్నా! వివిధ కులాలవారు వాడిన ఈ హుక్కాలతో పొగత్రాగి చూశాను. అయినా నాకేమీ కాలేదు, నా ప్రాణాలేమీ పోలేదు" అని అన్నాడు. నరేంద్రుని విచక్షణా జ్ఞానానికీ, విశాలబుద్ధికీ విశ్వనాథ్ దత్తా ఎంతగానో సంతోషించాడు.

తరువాత కాలంలో స్వామీజీ "బాల్యం నుండీ నిర్భయత్వమే లేకపోతే, నా జేబులో చిల్లిగవ్వ కూడా లేకుండా ప్రపంచమంతా చుట్టి రావడానికి సాహసించేవాడిని కాదు" అని అన్నారు.

నేటి బాలబాలికల్లో సత్యసంధత, శ్రద్ధ, విశ్వాసం, నిర్భయత్వం, నిస్స్వార్థం, దేశభక్తి, త్యాగం, సేవ లాంటి సుగుణాలు అలవడాలంటే పాఠ్యాంశాలలో మహనీయుల జీవితాల్లోని స్ఫూర్తిదాయకమైన సంఘటనలను పొందుపరచాలి. ఆ లేత మనస్సుల్లో ఉత్తేజకరమైన భావాలు అంకురించేలా బోధించాలి.

'స్త్రీలను తల్లిగా భావించేవాడు, పరుల సంపదను తృణంగా పరిగణించేవాడు, ప్రతి మనిషినీ తన ప్రతిరూపంగా భావించే వాడు మాత్రమే నిజమైన విద్యావంతుడు' అని తన బాల్యంలో ఉపాధ్యాయుడు చెప్పిన విషయాలు తనను ఎంతగానో ప్రభావితం చేశాయని స్వామీజీ జీవితాంతం గుర్తుచేసుకునేవారు.

మన దేశంలో అధర్మమనే అంధకారం అంతరించి, ధర్మమనే వెలుగు ప్రసరించాలంటే నేటి బాలబాలికలు నచికేతుని సత్యనిష్ఠ, ప్రహ్లాదుని భక్తిశ్రద్ధలు, నరేంద్రుని నిర్భయత్వం అలవరచుకోవాలి. భారతదేశం దివ్య ప్రభలతో ప్రకాశించాలన్న స్వామీజీ కలలను సాకారం చేయడానికి నవకోమల పుష్పాల్లాంటి భావిపౌరులు సన్నద్ధం కావాలి.

స్వామీజీ ఆశాజ్యోతుల్లారా! లేవండి! ధర్మపథంలో నడిచి దివ్య ప్రభలను దేశమంతా విరజిమ్మండి! మహోన్నత భారతదేశానికి నిజమైన వారసులమని నిరూపించండి! ❖



'శ్రద్ధ' - ఇది ఒక అద్భుత పదం. దురదృష్టవశాత్తు ఈ శ్రద్ధ భారతదేశం నుండి దాదాపుగా అదృశ్యమై పోయింది.నచికేతునికున్న శ్రద్ధ మనలో ప్రవేశించాలి. అప్పడే అన్నీ సమకూరుతాయి. - స్వామి వివేకానంద

- స్వామి సుప్రియానంద

సాంకేతిక సంకేతాలు

మన సాంకేతిక పరిజ్ఞానం బాగా పెరిగింది. పూర్వం సామెతలు చెప్పి మన పెద్దవాళ్ళు పిల్లలను హెచ్చరించేవారు, అదుపులో పెట్టేవారు. నేడు ఆ సామెతలు చెప్పే తాతమ్మలు కరవయ్యారు. 'టీవీ'కి దాసోహం అంటూ 'సాంకేతిక' సంకెళ్ళకు బందీలయ్యారు. ఇప్పుడు ఆ సామెత ఏమిటో చూద్దామా! చాలా సింపుల్. అదేనండీ... "పెరుగుట విరుగుట కొరకే". సాంకేతిక పరిజ్ఞానం మనిషి కంటే ఎత్తుగా పెరిగితే ఏమవుతుంది? ఏం విరుగుతుంది?



ఇది ఒక విదేశంలో ఉన్న రామకృష్ణ మిషన్ శాఖలో జరిగిన సంఘటన. అక్కడి ఆశ్రమాన్ని చూడడానికి భారతదేశం నుండి ఒక రామకృష్ణ మిషన్ స్వామీజీ విచ్చేశారు. ఆయన వయస్సు ఎనభై సంవత్సరాలు. ఒక భక్తుడు ఆ స్వామీజీని తన ఇంటికి భోజనానికి ఆహ్వానించాడు. స్వామీజీని డ్రాయింగ్ రూమ్‌లో కూర్చోపెట్టి అతడు, సతీమణికి సహాయం చేయడానికి డైనింగ్ హాల్‌కు వెళ్ళాడు.

ఇంతలో స్వామీజీకి దాహమేసింది. డ్రాయింగ్ రూమ్‌లో సోఫాలో కూర్చొని టీవీ చూస్తున్న ఓ ఆరేడేళ్ళ అమ్మాయిని చూశారు స్వామీజీ. ఆ అమ్మాయితో స్వామీజీ ఎంతో సున్నితంగా 'అమ్మాయీ! నాకు దాహమేస్తోంది. త్రాగడానికి కొంచెం మంచి నీళ్ళు ఇస్తావా?' అని అడిగారు. టీవీతో 'తాదాత్మ్యం' చెందిన ఆ అమ్మాయి కనీసం స్వామీజీ వైపు తన దృష్టినైనా సారించకుండా చిరాకుపడుతూ ఇంగ్లీష్‌లో ఇలా అంది: 'కాన్ట్ యూ సీ అయామ్ వాచింగ్ టీవీ? గో అండ్ టేక్ యువర్‌సెల్ఫ్ *(నేను టీవీ చూస్తున్నాను. కనబడడం లేదా? మీరే వెళ్ళి తీసుకోండి)'*

ఇంతలో ఆ భక్తుడి సతీమణి అక్కడకు వచ్చి "ఈ అమ్మాయి మా పక్కింటివాళ్ళ అమ్మాయి. తల్లితండ్రులకు ఇద్దరికీ ఉద్యోగాలు. మధ్యాహ్నం స్కూల్ అయిపోగానే వచ్చి సాయంకాలం వాళ్ళ అమ్మ వచ్చి తీసుకెళ్ళేవరకూ ఇక్కడే ఉంటుంది. ఈ అమ్మాయి 'బాల మేధావి' (child prodigy). ఏ విషయాన్నయినా ఇట్టే పట్టేసుకుంటుంది, కంప్యూటర్ పరిజ్ఞానం కూడా ఉంది" అని ఆ అమ్మాయిని, స్వామీజీకి పరిచయం చేసింది.

ఈ సందర్భంలో మనం ఒక్కసారి అత్యంత మేధావి, గొప్ప శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చెప్పిన మాటలను గుర్తుకు తెచ్చుకుందాం. "I fear the day that technology will surpass our human interaction. The world will have a generation of idiots."

సాంకేతిక పరికరాలతో సంబంధం పెంచుకొని మానవ సంబంధాలను విస్మరిస్తే మనం కూడా పరికరాల లాగా మారిపోతాం. అప్పుడు మనుషులమన్న సంగతే మరచిపోయే ప్రమాదముంది. కాబట్టి సాంకేతిక పరికరాల వాడకం మన పిల్లలకు వ్యసనంగా మారకుండా జాగ్రత్త వహించాలి.

....the land where humanity has attained its highest towards gentleness, towards generosity, towards purity, towards calmness, above all, the land of introspection and of spirituality - it is India.

- *Swami Vivekananda*

మృదుత్వం, దాతృత్వం, పవిత్రత, ప్రశాంతత, ఆత్మావలోకనం, ఆధ్యాత్మికతలకు పరాకాష్ఠ అయిన మన భారతజాతిలో నేడు మానవత్వం కొరవడుతోంది. మానవ సంబంధాలు పతనమవుతున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానం మన అభివృద్ధికి తోడ్పడాలే గానీ, మానవ సంబంధాలను త్రుంచకూడదు. పిల్లల్ని మరమనుషుల్లా తయారు చేయకుండా పెద్దలే బాధ్యత వహించాలి. ❖



అజ్ఞాన తిమిరనాశని! జ్ఞాన ప్రకాశని!!

– డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

దీపం అంటే – మనలోని సుదీర్ఘమైన అజ్ఞానాన్ని పోగొట్టేది, అహంకారాన్ని నిర్మూలింపజేసేది, పరతత్త్వాన్ని ప్రకాశింపజేసేది అని అర్థం. ఆశ్వయుజ బహుళ చతుర్దశిని 'నరకచతుర్దశి' అనీ, అమావాస్యను 'దీపావళి అమావాస్య' అనీ అంటాం.

కాళికాదేవి అనుగ్రహం పొందిన భూదేవి తనయుడు నరకాసురుడు వర గర్వంతో విర్రవీగుతూ, దేవతలను, ఋషులను, ప్రజలను హింసిస్తుంటే, నరకుని బారి నుండి లోకాన్ని రక్షించడానికి శ్రీకృష్ణుడు, తన భార్య అయిన సత్యభామను వెంటబెట్టుకొని వెళ్ళి, ఆమె సహాయంతో రాక్షసవధ గావించాడు.

అసలు ఈ నరకుడి పేరులోనే విచిత్ర లక్షణముంది, అది పాపాత్ములు వెళ్ళే నరకలోకానికి ప్రతీక. అంటే ఈ అసురుడు అంధకారలోకానికి ప్రతినిధిగా నిలిచే తమోగుణజీవుడు. ఈ తమోగుణరూపుడైన నరకుని వధకు సూర్యోపాసకుడైన సత్రాజిత్తు కుమార్తె సత్యభామ కారణం కావడం గమనార్హం.

చీకటిని వెలుతురు పారద్రోలినట్లుగా ఈ నరకాసుర వధ జరిగింది. ఆనాడు ఎంతో ఆనందోత్సాహాలతో ప్రజలంతా దీపాలను వెలిగించి ఈ పండుగను జరుపుకొన్నారు.

దీపావళినాడు, అభ్యంగనస్నానమొనర్చాక స్నానానంతరం యమునికి తర్పణం విడుస్తారు. యమునికి దేవత్వం, పితృత్వం రెండూ ఉండడంతో 'యమాయ తర్పయామి' అని మూడుసార్లు తిలాంజలులు (నువ్వులతో నీళ్ళు) వదిలే ఆచారం కొన్ని ప్రాంతాలలో ఉంది. సాయంకాలం ప్రదోష సమయంలో దీపాలను వెలిగించి, అందులో లక్ష్మిని ఆహ్వానించి, లక్ష్మీపూజ చేయడం పరిపాటి. ఈ విశ్వంలో ప్రతీదానికి ఒక లక్షణం ఉంటుంది. ఆ లక్షణమే ఐశ్వర్యం – కంటికి చూపు ఐశ్వర్యం, చెవికి వినికిడి ఐశ్వర్యం. ఇలా ఇంద్రియాలకు ఐశ్వర్యాన్నిచ్చేది ఆత్మచైతన్యమే. ఆ ఆత్మకు చైతన్యమే లక్షణం, ఆ చైతన్యమే లక్ష్మి. ఈ జగత్తు అంతటా వ్యాపించిన శక్తిని ఐశ్వర్యంగా దర్శిస్తే, లక్ష్మి అనే నామంతో ఆ మాత దర్శనమిస్తుంది. మనం వాడుకలో డబ్బును మాత్రమే లక్ష్మిగా భావించినా, ఆ తల్లికి ఉన్న అనంతానంత విభూతులలో ధనం లవలేశం మాత్రమే అని గ్రహించాలి. మోక్షలక్ష్మి కూడా ఆ అమ్మే కదా!

దీపావళి మరునాటి నుండి కార్తీక మాసారంభం జరుగుతుంది. మన సంప్రదాయంలో కార్తీక మాసానికి ఎంతో విశిష్టత ఉంది. స్నానాలు, దీపారాధనలు, భగవత్పూజలు, వ్రతాలు ఈ మాసంలో గొప్ప ఫలితాన్నిస్తాయి. ఈ నెలలో విష్ణువును 'దామోదర' నామంతో పూజిస్తారు. దేవతావృక్షమైన తులసి సన్నిధిలో దీపాలను వెలిగించడం సత్కర్మగా పరిగణిస్తారు. కార్తీక మాసారంభంలోనే పాడ్యమి నాడు, రాక్షసరాజైన బలిచక్రవర్తి పాతాళలోకం నుండి భూలోకానికి వచ్చేలా విష్ణువును వరం కోరినట్లుగా చెబుతారు. అందువల్ల ఆ పాడ్యమికి 'బలి పాడ్యమి' అని పేరు. ఇక ఈ మాసంలో రెండో రోజైన కార్తీక శుద్ధ విదియను 'యమ ద్వితీయ' అని అంటారు. ఈనాడు యముడు తన సోదరి అయిన యమున గృహంలో భోజనం చేసినట్లుగా చెబుతారు. దీన్నే 'భగినీ హస్త భోజనమ'ని కూడా అంటారు. ఈ రోజు సోదరుడు తన సోదరి ఇంట చేసే భోజనం వల్ల ఇరువురికీ శుభం చేకూరుతుందని పెద్దలు చెబుతారు.

ఈ మాసంలో వచ్చే శుద్ధ చవితి సుబ్రహ్మణ్యారాధనకు శ్రేష్ఠమైన రోజు. కార్తీక పౌర్ణమి నాడు చేసే స్నానం, దానం, ఉపవాసం, అర్చన – విశేష ఫలదాయకాలు. శివాలయాలలో ఈనాడు చేసే జ్వాలాతోరణాన్ని చూసిన జనుల పాపాలే కాక, అక్కడ ఉన్న పశు, పక్షి, కీటకాల పాపాలు సైతం నశిస్తాయని చెబుతారు. ఈ నెలలో దేవాలయాలలో, ఇళ్ళలో ఆకాశదీపాన్ని వెలిగించే సంప్రదాయముంది. హృదయాకాశంలో వెలిగే జ్యోతికి ప్రతీకగా ఈ ఆకాశదీపం నిలుస్తుంది. ఇలా అనేక విశేషాలతో ఉన్న కార్తీక మాసం సకల శుభదాయకం.

మన ఆచారాలు, సంప్రదాయాల వెనుక సచ్చిదానంద పరబ్రహ్మ స్వరూపమే నిలిచి ఉంటుంది అని అర్థం చేసుకోవాలి. బాహ్యంగా దీపాలను వెలిగించడమే కాక, జ్ఞానదీపాలను హృదయంలో వెలిగించే యత్నం చేసిననాడు మానవుడు ఆధ్యాత్మికంగా పురోగమిస్తాడు. ఈ దీపావళి పండుగను అటువంటి తిమిర నాశనానికి, జ్ఞానవికాసానికి చిహ్నంగా అందరూ భావించాలి. ❖

నవంబర్ 3వ తేదీ, ఆదివారం - 'దీపావళి'

మనం మహాపాతకులం. స్త్రీలను 'నికృష్ట జీవులనీ, నరక ద్వారాలనీ ఇంకా ఏమేమో అనడం చేతనే మనం అధఃపతితులమైనాం. స్త్రీలను గౌరవించని ఏ దేశమూ గొప్పది కాలేదు. - స్వామి వివేకానంద



భజ గోవిందమ్ భజ గోవిందమ్

భోగాల అంచునే బాధలు!

– స్వామి జ్ఞానదానంద

సుఖతః క్రియతే రామాభోగః
పశ్చాద్ధన్త శరీరే రోగః ।
యద్యపి లోకే మరణం శరణం
తదపి న ముంచతి పాపాచరణమ్ ॥



భక్త కబీర్ ఒక రోజు రామభజనలు పాడుకుంటూ, భుజాన జోలె కట్టుకొని వీధుల గుండా సాగిపోతూ ఉన్నాడు. ఇల్లిల్లూ తిరుగుతూ ఓ పెద్ద భవంతి ముందు నిలబడ్డాడు. అది అందమైన ఓ దేవదాసి ఆవాసం. కబీర్ 'భిక్షాం దేహీ' అనగానే, కాలి మువ్వల సవ్వడితో, కాటుక దిద్దిన కలువరేకుల లాంటి కనుదోయితో ఆ దేవదాసి ఇంటి బయటకు వచ్చింది. అందానికే అర్థం చెబుతున్నట్లున్న ఆమె, పాత్రలోని భిక్షను ఆయన జోలెలో వేసింది. కబీర్ ఆమె కళ్ళను అలా ఒక్కసారి చూసి, ఓ పసి బాలుడిలా చిరునవ్వుతో ఆశీర్వదిస్తూ ముందుకు సాగిపోయాడు.

కొన్ని నెలల తరువాత కబీర్‌దాసు మరలా అదే వీధికి భిక్షాటనకు వచ్చి, దేవదాసి ఇంటి ముందు ఆగాడు. రాజభోగాలతో రాజిల్లిన ఆ భవనం నేడు బూజుపట్టి బోసిపోయి కనిపించింది; ఎంత పిలిచినా ఎవ్వరూ బయటకు రాలేదు. అలా ముందుకు వెళుతూ ఆ రామభక్తుడు శ్మశానం ముందు నిలబడి దూరంగా కట్టెలపై సగం కాలి పడి ఉన్న ఓ శవాన్ని చూస్తూ ఉన్నాడు. అంతకు ముందు రోజే దీర్ఘవ్యాధితో కన్నుమూసిన దేవదాసి దేహమది అని ఎవరో చెప్పారు. క్షణాల్లో ఓ కాకి వచ్చి, ఆ దాసి కపాలంపై వాలింది. అప్పుడు కబీర్‌కు తను గతంలో చూసిన ఆమె కళ్ళు స్ఫురించాయి. 'అయ్యో! నాడు కాటుకతో కళకళలాడి, హొయలు కురిపించిన ఆ కళ్ళు ఏమయ్యాయి? కపాలంలో గుంటలుగా మారాయి. నేడు అదే కనుదోయిపై కాకులు వాలి కావ్ కావ్ మంటున్నాయి; భోగాలేవీ శాశ్వతం 'కావు కావు' అని హెచ్చరిస్తున్నాయి' అనుకుంటూ మరో ఊరికి పయనమయ్యాడు. జగద్గురువులు ఆదిశంకరాచార్యులు కూడా ఇదే భావంతో మథనపడ్డారు. 'భజ గోవిందం' ముగింపు శ్లోకాలను వల్లిస్తూ...

సుఖతః క్రియతే రామాభోగః పశ్చాద్ధన్త శరీరే రోగః ।
యద్యపి లోకే మరణం శరణం తదపి న ముంచతి పాపాచరణమ్॥

'సుఖాన్ని ఆశించి మానవులు ఇంద్రియలోలురవుతారు. దానివల్ల శరీరం రోగాలతో నిండి పోతుంది. లోకంలో మానవులకు మరణమే చివరకు శరణమైనా పాపాలు చేయడం మాత్రం మానర'ని ఆందోళనపడ్డారు.

అనుభవాలకు అద్దెలు: ఈ లోకంలో ఏ భోగాన్ని అనుభవించినా దాని విలువను ఏదో ఒక రుగ్మత రూపంలో చెల్లించాల్సిందే! ఇంద్రియాలను ఇష్టారాజ్యంగా సంతృప్తిపరచుకుంటూ పోతే పర్యవసాన ఫలితాలను భరించాల్సిందే! అగ్నికి ఆజ్యం పోసి ఆర్పాలనుకోవటం ఎంత అవివేకమో, కోరిందల్లా ఇచ్చి మనస్సును సంతృప్తి పరచాలనుకోవటం కూడా అంతే అవివేకం. అయితే నేడు నయనాల నుంచి నాలుక వరకు ఏ ఒక్క ఇంద్రియాన్ని కూడా నియంత్రించుకోలేని నిస్సహాయస్థితికి వచ్చేశాం. అందుకే అవసరం లేకపోయినా కంటికి కావాలని అనిపించిందల్లా తెచ్చి, ఇంట్లో పడేస్తున్నాం; తిని అరిగించుకొనే శక్తి లేకపోయినా జిహ్వాచాపల్యంతో పళ్ళెంలోని పదార్థాలన్నింటినీ కడుపులోకి తోసేస్తున్నాం. చివరకు అప్పుల పాలే కాకుండా ఆసుపత్రుల పాలూ అవుతున్నాం. అందుకే ప్రహ్లాదుడు తన మిత్రులతో...

...కాముకులు కరద్వయ కండూతి చేతం తనియని చందంబున తుచ్ఛంబయి పశుపక్షి క్రిమికీట సామాన్యం బయిన మైథునాది గృహమేధి సుఖంబులం తనియక కడపట అతి దుఃఖవంతులగుదురు... 'రెండు చేతులతోటి గోకుకొని కూడా తృప్తి చెందనట్లు కాముకులు తుచ్ఛమైన పశుపక్ష్యాదులకూ, క్రిమి కీటకాదులకూ సామాన్యమైన మైథునాది గృహస్థ సుఖాలలో మునిగి సంతృప్తి చెందక చివరకు దుఃఖభాగులవుతార'ని స్పష్టం చేస్తాడు.

అప్పుడప్పుడు ఆసుపత్రులను సందర్శించి, రోగాలతో మంచాల్లో అవస్థలు పడుతున్న వారిని చూసి వస్తూ ఉండాలి. ఈ శరీరాన్ని అదుపులో పెట్టుకోకపోతే ఎన్ని అవస్థలు పడాల్సి వస్తుందో అప్పుడు అర్థమవుతుంది.

శరీరమే సాధనం: ఈ ప్రపంచంలో మనం ఏం సాధించడానికైనా ఆరోగ్యకరమైన శరీరమే ప్రధానసాధనం. అందుకే '*శరీరమాద్యం ఖలు ధర్మసాధనం*' అంటారు. అలాంటి దేహాన్ని భోగాలకే పరిమితం చేసి, పాపాలపుట్టగా మార్చేస్తే, అదే మన పురోగతికి ప్రతిబంధకమవుతుంది. భౌతికపరమైన వాంఛలను మనం ఎంత తగ్గించుకుంటే, బుద్ధికి అంత శక్తి, సంకల్పబలం పెరుగుతాయి. కేవలం దేహపరమైన సంరక్షణకూ, కాంక్షలకే మన మనస్సును పరిమితం చేస్తూ పోతే, ఉన్నతమైన విషయాల వైపు దృష్టి మరలదు. అయితే ఆధునిక జీవనంలో మనిషి తాపత్రయానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది; తనువుకు ఇచ్చే ప్రాధాన్యాన్ని చూస్తూ ఉంటే ఆశ్చర్యమేస్తోంది. అలా అని దాన్ని శుష్కింపచేసి, కళ్ళను, కాళ్ళను నిర్బంధంగా కట్టడి చేయమని శంకరాచార్యులు కోరడం లేదు. కానీ వాటికి ఎంత అవసరమో, అంత సంతృప్తిపరిస్తే చాలన్నదే వారి ఉద్దేశం. అందుకే గౌతమ బుద్ధుడు కూడా లౌకికులతో 'పూర్తి వైరాగ్యమూ వద్దు, పూర్తి లోలత్వమూ వద్దు. ఇంద్రియాలు చెప్పిందంతా వినకండి. అలాగని అడిగినదేదీ ఇవ్వకుండా వాటిని ఆకలితో మాడ్చకండి. మీ స్నేహితులుగా, సహచరులుగా మెలిగేలా వాటికి శిక్షణనివ్వండి; ఇదే మధ్యే మార్గం' అంటారు. ఇంద్రియసుఖాలను ఎంత పెంచుకుంటే ఈ ప్రపంచానికి మనం అంత దాస్యం చేయాల్సి ఉంటుంది. బానిసగా అష్టైశ్వర్యాలు అనుభవించే కన్నా, స్వతంత్రంగా బిచ్చమెత్తుకొని జీవించినా చాలు! కానీ ఈ రోజుల్లో భోగభాగ్యాల వ్యామోహంలో ఆధునిక మానవుడి బతుకు బానిసల కన్నా హీనంగా మారిపోయింది.

> **ప్రకృతిలోని భోగాలన్నింటినీ అనుభవించాలని తాపత్రయపడుతూ ఉంటాం, కానీ ఆ ప్రకృతే మన సర్వస్వాన్నీ సంగ్రహించి, శక్తిని సంపూర్ణంగా హరించి పక్కన పారేస్తుందని చివరికి తెలుస్తుంది.**
> **- స్వామి వివేకానంద**

సరళజీవనం...: మనకు ఎన్ని భోగవస్తువులు ఉంటే అంత ఆధునికులం, నాగరికులమనుకునే భ్రమల్లో ఉన్నాం. అందుకే మన నిత్యావసర వస్తువుల జాబితా నానాటికీ పెరిగిపోతోంది. ముఖ్యంగా మన ఉనికిని మనం సముపార్జించుకున్న విషయవస్తువులే విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయి. అవి లేకపోతే మన ప్రాణాలు పోతాయేమో అనిపించేంతగా మనం వాటికి అలవాటు పడిపోయాం. 'చుట్టూ భోగవస్తువుల మధ్య జీవించినప్పుడు వాటిని అనుభవించటానికి అనువైన మార్గాలూ ఉత్పన్నమవుతాయి' అంటారు దివ్యజనని శ్రీశారదామాత. అందుకే ఆ అమ్మ మనం ఊహించనైనా ఊహించలేనన్ని అతి తక్కువ అవసరాలతో భౌతిక జీవనాన్ని గడిపి తన అవతారాన్ని చాలించారు. వస్త్రాల నుంచి విహారాల వరకు వీలైనంత మేరకు అలా నిరాడంబరతకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడు అవసరాల పేరుతో అతిగా ఆర్జించాల్సిన... అడ్డదారులు తొక్కాల్సిన అవసరం రాదు. దాంబికమైన జీవనశైలే చాలామంది అవినీతి కార్యకలాపాలకు పాల్పడడానికి ప్రధాన కారణం. అదే భావంతో వేమన...

నీళ్ళలోని మీను నెరిమాంస మాశించి
గాలమందు చిక్కు కరణి భువిని
ఆశ తగిలి నరుడు నాలాగు చెడిపోవు
విశ్వదాభిరామ వినుర వేమ...

'నీటిలోని చేప ఎరగా వేసిన మాంసపు ముక్క కోసం ఆశతో గాలంలో చిక్కుకుంటుంది. అదే విధంగా భోగాలను ఆశించిన మానవుడు ఆశల గాలానికి చిక్కుకొని దానిలోనే జీవితాన్ని వెళ్ళబుచ్చుతూ కష్టాల పాలవుతున్నాడ'ని హెచ్చరిస్తారు.

మరణమే శరణం..: మనకు నిరంతరం ఆ సర్వేశ్వరుడి రూపంతో పాటు శ్మశానం కూడా మనస్సులో మెదులుతూ ఉండాలి. క్షణం తీరిక లేకుండా కార్లలో తిరిగి... కడుపులు కొట్టి కోట్లకు కోట్లు సంపాదించి... కీర్తిప్రతిష్ఠలతో కళ్ళు తలకెక్కి... ఎంత మిడిసిపడ్డా మనమందరమూ చేరుకునేది ఆ మరుభూమికేనని మరచిపోవద్దు. అందుకే 'శ్మశానవాటిక' కవితాఖండికలో...

ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మనికలము నిప్పులలోనే కరగిపోయె
ఇచ్చోటనే భూములేలు రాజన్యుల యధికారముద్రిక లంతరించె
ఇచ్చోటనే లేత యిల్లాలి నల్లపూసల సౌరు గంగలో కలసిపోయె
ఇచ్చోటనే యెట్టి పేరెన్నికం గన్న చిత్రలేఖకుని కుంచెయు నశించె
యిది పిశాచులతో నిటాలేక్షణుండు
గజ్జె కదలించి యాడు రంగస్థలంబు
ఇది మరణదూత తీక్ష్ణమౌ దృష్టులొలయ
నవని పాలించు భస్మ సింహాసనంబు...అంటారు మహాకవి గుర్రం జాషువా గారు. అయితే మాధవుడి మాయ ఏమిటో గాని మనమందరమూ, మరణమంటే మనకు సంబంధం లేని విషయమన్నట్లుగా ప్రవర్తిస్తూ ఉంటాం. పక్క ఇంట్లో దొంగలు పడితే, మన ఇంట్లో కూడా పడతారేమోనని, ముందు జాగ్రత్తగా తుప్పుపట్టిన తాళాలను బాగు చేసుకొని, పకడ్బందీ ఏర్పాట్లన్నీ చేసుకుంటాం. కానీ పక్క ఇంట్లో ప్రాణాలు పోతే, మనవి కూడా ఎప్పుడో ఒకప్పుడు పోతాయనీ, పాపపు పనులు మానుకొని, తప్పులు సరిదిద్దుకొని, పుణ్యకార్యాల కోసం ప్రయత్నించం. పైగా అంతిమ ఘడియల గురించి ఆలోచిస్తే అపచారం అన్నట్లుగా, ఆ విషయాన్ని దాటవేస్తూ ఉంటాం. కానీ మరణాన్ని మననం చేసుకుంటూ ఉంటే మన నడక తడబడదు; అహంకారం అంకురించదు. అందుకే కొన్ని మతసంప్రదాయాల్లో ఏటా శ్మశానానికి వెళ్ళి, అక్కడ తమ ఆత్మీయుల సమాధులను అలంకరించి, సమీపంలో బీదసాదలకు దానధర్మాలు చేసి పెద్ద ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అలా మనందరి ఏకైక గమ్యస్థానం కూడా అదేనని మరచిపోకుండా మసలుకోవాలి. ❖

పశుపక్ష్యాదులను, మొక్కలను సైతం తనలో ఇముడ్చుకోగలిగినంతగా మానవ హృదయం విస్తృతించింది ఈ దేశంలోనే. విశ్వానికున్న ఏకత్వాన్ని మానవాత్మ శోధించింది ఈ దేశంలోనే. - స్వామి వివేకానంద



వివేకానంద సూక్తి సుధ

గణ్యతే కర్తృబాహుళ్యం నైవ కార్యస్య సాధనే ।
మహతా జనసంఘేన శతాబ్ద్యాం యద్విధీయతే ॥
కార్యశూరాస్తథా నీతిమంతః కతిపయే జనాః ।
వర్షేణైకేన తత్కర్మ విధాతుం ప్రభవన్తి వై ॥

కార్యసాధనలో కర్తల సంఖ్యాబాహుళ్యం లెక్కలోకి రాదు. ఒక గొప్ప జనసంఘం ఒక శతాబ్దికాలంలో చేసే పనిని కార్యశూరులు, నీతిమంతులైన కొద్దిమంది జనులు ఒక సంవత్సరకాలంలోనే చేయగలరు.

విశ్వం సర్వమవాప్నోతి పరిణామం క్రమేణ హి ।
పరిణామం వినా యోఽస్తి స దేవ ఇతి కీర్త్యతే ॥

విశ్వమంతా క్రమంగా మార్పు చెందుతున్నది. మార్పులేని వాడే దేవుడు అని కీర్తింపబడుతున్నాడు.

మాఽస్తు దీనా దశా యస్య కస్యాపీత్యేవ మే మతిః ।
కిన్త్వస్మజ్జీవితానాం యద్రహస్యం తస్య బోధకః ॥
వివేకో లభ్యతే దీనదశయైవ న చాన్యథా ।
సంక్షోభసమయేష్వేవ ఛన్నానాం దీర్ఘకాలతః ॥
హృదయస్య కవాటానాం భేదనం జాయతే హఠాత్ ।
కాంతిప్రవాహో బహవః ప్రసరన్తి తదా హృదః ॥

ఏ ఒక్కరికీ దీనావస్థ కలుగకుండా ఉండాలన్నదే నా కోరిక. అయితే మన జీవితాలలో నిగూఢ రహస్యాన్ని తెలిపే వివేకం దీన దశవల్లనే కల్గుతుంది. మరొక విధంగా కల్గడం లేదు. సంక్షోభ సమయంలోనే దీర్ఘకాలం నుండీ మూసివేయబడివుండిన హృదయకవాటాలు ఒక్కసారిగా తెరుచుకుంటాయి. అప్పుడే హృదయం నుండి అనేక కాంతి ప్రవాహాలు ప్రసరిస్తాయి.

భీరుత్వాదధికం పాపమన్యత్కించిన్న విద్యతే ।
నాస్తి భీరుస్వభావానాం కదాఽపి పరిరక్షణమ్ ।
సహేఽన్యత్సర్వమేవాహం న సహే భీరుతాం పరమ్ ॥

పిరికితనాన్ని మించిన పాపం మరొకటి లేదు. పిరికివారికి ఎప్పుడూ రక్షణ ఉండదు. నేను అన్నిటినీ సహిస్తాను గాని పిరికితనాన్ని మాత్రం సహించను. ❖

రచన: డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య

స్వామి వివేకానంద క్విజ్

1. రష్యన్ చింతనాశీలి ఇ.వి.చెలిషేవ్ స్వామీజీని గురించి ఏమన్నారు?
2. 'హిందూమతంలోని ఆశయాలను గురించి స్వామి వివేకానంద ప్రసంగింపనారంభించారు. ఆయన ముగించినప్పుడు హిందూమతం సృజింపబడింది' అని ఎవరన్నారు?
3. మిసెస్ హాన్స్‌బరో ఒకసారి 'స్వామీజీ! మీ పని గురించి మీరు ఏమనుకుంటున్నారు?' అని అడిగినప్పుడు స్వామీజీ ఏమని సమాధానమిచ్చారు?
4. 'చదువురాని వారికి వెలుగును ఇవ్వండి, చదువుకున్న వారికి మరింత వెలుగును ఇవ్వండి. ఎందుకంటే ఈనాటి చదువుల వల్ల కలిగే దురభిమానాలు అపారం' అని స్వామీజీ ఏ ప్రసంగంలో అన్నారు?
5. 'లేచి నిలబడండి! బాధ్యతనంతా మీ భుజస్కంధాలపైనే వేసుకోండి. మీ భవిష్యత్తుకు (భవితకు) మీరే సృష్టికర్తలని (విధాతలని) తెలుసుకోండి' అని స్వామీజీ ఎప్పుడు, ఎక్కడ, ఏ ఉపన్యాసంలో పేర్కొన్నారు?
6. అమెరికాలోని సహస్రద్వీపవనంలో స్వామీజీ ప్రసంగాలను వ్రాసుకున్న వారెవరు? అవి ఏపేరిట ప్రచురింపబడ్డాయి?
7. నేటి ప్రపంచానికి 'స్వామీజీ ఉపన్యాసాల'నే మహోన్నత సాహిత్యం లభించడానికి కారణభూతుడెవరు?
8. స్వామీజీ రచించిన పూర్తి పుస్తకం ఏది? దానిని ఎప్పుడు రచించారు?
9. స్వామీజీ మోటార్ బైక్ నడపడం ఎక్కడ నేర్చుకున్నారు?
10. 'వేదాలకు తాను వ్రాసిన భాష్యాన్ని పునరుద్ధరించడానికి సాయనాచార్యుడే మళ్ళీ ఇలా అవతరించాడు' అని స్వామీజీ ఎవరిని ఉద్దేశించి అన్నారు?
11. స్వామీజీ తమ జీవితంలో దాదాపుగా ఎన్ని సంవత్సరాలు పాశ్చాత్య దేశాలలో గడిపారు?
12. స్వామీజీ రెండుసార్లు పాశ్చాత్య దేశాలలో పయనించిన మొత్తం దూరం ఎంత? చేసిన ప్రసంగాలు ఎన్ని?
13. స్వామీజీ తమ కార్యకలాపాల ద్వారా పాశ్చాత్యదేశాలకు అందించిన మూడు ముఖ్య కానుకలు ఏవి?

(జవాబుల కోసం 30వ పేజీ చూడండి)

వేదాలకు పుట్టినిల్లైన మనదేశంలో వాళ్ళను తాకితే మైల సోకుతుంది; వాళ్ళతో కలిసి కూర్చుంటే అశుచి పైన పడుతుంది- ఇలాంటి భావాల వల్ల మనం అధఃపతితులమవుతున్నాం. - స్వామి వివేకానంద

ఇంటికి దీపం

– హేమంత్ కుమార్



భవనాన్ని నిలబెట్టే పునాది ఎప్పుడూ భూమిలోనే ఉంటుంది. స్త్రీ కూడా అంతే. ఈ సమాజ భవనానికి – కాదు కాదు – ఈ సృష్టి భవనానికే పునాది ఆమె. పునాది మరుగునే ఉంటుంది. మట్టి కొట్టుకునే ఉంటుంది. పైకి కనిపించాలని అనుకోదు. ప్రశంసలూ, ప్రదర్శనా కోరుకోదు. కానీ, లోకం ఆమెను గౌరవించాలి, పూజించాలి. అది లోకం ఔదార్యం కాదు. ఆమెను జాలితో ఉద్ధరించడమూ కాదు. వజ్రాన్ని కిరీటంలో పొదగడం కిరీటం గొప్పతనం కాదు. స్వర్ణకారుడి పనితనం అంతకంటే కాదు. అది అంతటి వజ్రాన్ని పొదిగించుకునే కిరీటం అదృష్టం. దాన్ని శిరస్సున అలంకరించుకునే ఆ వ్యక్తి సౌభాగ్యం. స్త్రీని గౌరవించడం, పూజించడం కూడా అంతే.

భారతదేశం దేవుని ప్రతిరూపంగా స్త్రీని కొలుచుకుంటుంది. ఇంట్లో ఒక స్త్రీ ఉంటే, ఆ ఇంట్లో నడయాడే దేవుడున్నట్లే. ఎంత సంపన్న గృహమైనా ఇల్లాలు లేని ఇల్లు మూల విరాట్టు లేని ఆలయం వంటిదే. ఇల్లాలే కాదు. ప్రతి ఇంట్లో స్త్రీ ఉండాలి. ప్రేమ, సేవ, ఆప్యాయత, అనురాగం... ఏది కాదు, ఏది లేదు ఆమె ఉంటే? ఒక ఇంట్లో పురుషుడున్నాడా? లేదా? అన్నది మనకు అర్థం కాదు. ఎందుకంటే ఆ ఇంట్లోని స్త్రీ... స్త్రీ, పురుషులిద్దరి బాధ్యతల్ని నిర్వహిస్తుంది. ఇరువురి ప్రేమనూ పంచుతుంది. ఆ సత్తా ఆమెకుంది. అదే స్త్రీ లేని ఇంట్లోకి వెళితే కళ తప్పిన ఆ ఇల్లు స్త్రీ లేని విషయాన్ని చెప్పకనే చెబుతుంది.

మనం లోతుగా చూస్తే తప్ప ఒక స్త్రీలోని ఆలికీ, అమ్మకూ పెద్దగా తేడా తెలియదు. ఆలి 'భోజ్యేషు మాత' మాత్రమే కాదు. సదా సర్వదా తల్లి పాత్ర వహిస్తుంది. పంచభూత నిర్మితమైన స్త్రీలో భూమితత్త్వాన్ని భగవంతుడు ప్రేమగా ఎక్కువపాళ్ళే పెట్టాడు. భూమికి భరించే శక్తి తప్ప కాల్చే, ముంచే, పడదోసే తత్త్వం లేదు. అమ్మ ఆమె. భగవంతుడు కూడా అమ్మ కోసం అలమటించాడు. కావాలని కోరుకున్నాడు.

పూజా గృహంలో పీఠం మీద మాత్రమే ఉండి నీరాజనాలను అందుకోదు ఈ దేవత. మనకే అభిషేకాలు చేస్తుంది. పూజ చేస్తుంది. నైవేద్యాలు పెడుతుంది. జీవితాన్నే పూజా సదృశం చేస్తుంది. మరి ఎందుకని ప్రస్తుత సమాజం ఆమెను ఆగర్భశత్రువులా చూస్తుంది? మానసిక, శారీరక హింసతో అరాచకం చేస్తుంది? స్త్రీ పంచదార చిలక కాదు. పంచాయతనం మీద ప్రతిష్ఠించి పూజించుకోవాల్సిన దేవీమూర్తి. సాక్షాత్ భగవంతుడిగా పూజలందుకుంటున్న శ్రీరామకృష్ణులు కూడా ధర్మపత్ని శారదాదేవిని అక్షరాలా పూజాపీఠం మీదే ప్రతిష్ఠించి అర్చించారు.

పారమార్థిక పరంగా సృష్టి, స్థితి, లయాలకు బ్రహ్మ విష్ణు మహేశ్వరులనే ప్రత్యేక దేవతలు ఉండవచ్చు. కానీ ప్రాపంచికంగా మాత్రం ఈ మూడింట్లో మొదటి రెండు కర్తవ్యాలను స్త్రీయే దిగ్విజయంగా నెరవేరుస్తోంది. అయితే లోకం కట్టుతప్పి పశువులా ప్రవర్తించినప్పుడు మాత్రం ఆ మూడో కర్తవ్యాన్ని కూడా సంహారిణిగా, ప్రళయకారిణిగా నెరవేర్చేందుకు అమ్మ వెనకాడదు. ఇందుకు మహిషాసుర మర్దిని, కాళీమాత, సత్యభామ లాంటి దేవీమూర్తులు ఉదాహరణలు. రుద్రమదేవి, ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి చారిత్రక స్త్రీలు ఉండనే ఉన్నారు.

ఈ దేశం కాలకూట విషాన్ని చిమ్మే సర్పాలను పూజిస్తుంది. శునకం, వరాహం లాంటి హీనజాతి జంతువుల్ని ఆరాధిస్తుంది. అన్ని విధాలా అత్యున్నత స్థాయిలో ఉన్న మన భాగ్యప్రదాత 'సు'జాతను, శ్రీమాతను గౌరవించడానికేం? ఆమె సహనం సబలత్వాన్ని ఆపిందే గానీ బలం లేక కాదు. భర్త వెనుక మేలిముసుగులో చరించే ఆ అర్భక బాలిక అవసరమైనప్పుడు పులిని కూడా ఎదుర్కోగలదనేది మనకు తెలియని విషయం కాదు.

స్త్రీని భయభ్రాంతను చేసి, 'నిర్భయ' అంటూ పేరు పెడితే సరిపోదు. మన ప్రవర్తనలో ఆ 'అభయం' ఉండాలి. ఆ అమృత తత్త్వాన్ని పెంచుకుందాం. ఆమెతో పంచుకుందాం. ❖



ఇతరములన్నియు నడమంత్రములే...

– శ్రీమతి బి.కృష్ణకుమారి

అన్నమయ్య పదామృతం

ఇతరములన్నియు నడమంత్రములే యెంచిచూచినను యింతాను
హితవగు బంధువుడు ఈశ్వరుడొక్కడే ఈతనిమరువకుమీ జీవాత్మా

భవకూపంబుల బడలెడినాడు పాయని బంధువుడు ఇతడొకడే
దివిస్స్వర్గంబున తేలెడినాడు తిరుగబాయకెపు డితడొకడే
నవనరకంబుల నలగెడినాడు నటనల బాయడితడొకడే
యివలనవల హృదయేశుడు విష్ణుడుఈతని మరువకుమీ జీవాత్మా

పశుమృగాదుల వొడలెత్తినప్పుడు పాయని బంధుగుడితడొకడే
విశదపు దుఃఖపు వేళలనైనా విడువని బంధువుడితడొకడే
శిశువైనప్పుడు వృద్ధైనప్పుడు చిత్తపుబంధుగుడితడొకడే
దశావతారపు విష్ణుడొక్కడే ఈతని తలచుమీ జీవాత్మా

భావజకేలిని జొక్కినప్పుడు ప్రాణబంధువుడు ఇతడొకడే
యీవల నావల యిహపరములలో నిన్నిటి బంధువుడితడొకడే
దైవము తానని శరణనియెడు నను దగ్గరికాచెను ఇతడొకడే
శ్రీవేంకటగిరి నాయకుడితడే చేరి భజించుము జీవాత్మా

ప్రాపంచిక ప్రేమానురాగాలు...సాన్నిహిత్య సంబంధాలు మన చిరకాల చింతనలను తీర్చలేవు. జన్మనిచ్చినవాడే జీవితాల్ని ఉద్ధరించగలడు; నడుమ వచ్చినవారంతా నాటకాల్లోని పాత్రల్లా, పక్కన ఉంటారే కానీ, పరమార్థాన్ని చూపలేరు. అందుకే మనతో ఆడుకునేవాడు.. మనల్ని ఆదుకునేవాడు ఆ భగవంతుడు ఒక్కడే. అలాంటి పరమాత్ముడే పరమ ఆప్తుడని పదకవితా పితామహుడు అన్నమాచార్యులు కూడా తన అనుభూతిని అక్షరీకరించాడు. **'ఇతరములన్నియు నడమంత్రములే...హితవగు బంధువుడు ఈశ్వరుడొక్కడే'**నని విస్పష్టం చేశాడు. ఆ శాశ్వత సత్యాన్ని తెలుసుకొని, ఆతనిని శరణు వేడమని హితవు పలుకుతున్నాడు. కష్టనష్టాల్లో, కన్నీటి క్షణాల్లో మనల్ని కన్నబిడ్డల్లా కాపాడుకునే కారుణ్యమూర్తి ఆ పరంధాముడు ఒక్కడే! మన ప్రారబ్ధ ఫలంగా భరించాల్సిన బాధల్లో ఎన్నో రెట్లు తగ్గించి, మనపై తేలికైన భారాన్నే మోపుతున్నాడు. అయినా ఆ మాత్రం దుఃఖాల్ని కూడా ఓర్చుకోలేక, చాలాసార్లు ఆయననే నిందిస్తూ ఉంటాం. అప్పుడప్పుడు అలకబూనుతూ ఉంటాం.

కానీ మనం మరచిపోయినా, తను మాత్రం మనల్ని మరచిపోకుండా, విడువక వెన్నంటే ఉంటున్నాడని...వేవేల రక్షించుకుంటున్నాడని ఈ వేంకటేశ్వర భక్తాగ్రేసరుడు వినుతిస్తూ ఉన్నాడు. ఆర్తితో ఆయనను అర్థిస్తే చాలు, చేసిన పాపాలన్నింటినీ తోసిరాజని మన మొరలాలకించే మనస్వి ఆయన! అందుకే "మనోవ్యాకులతతో ఆయనను ప్రార్థించాలి. ప్రార్థన మన హృదయాంతరాళం నుంచి వచ్చినట్లయితే ఆయన దాన్ని తప్పక వింటాడు. అందులో ఎటువంటి సందేహమూ లేదు" అంటారు భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస.

హితవగు బంధువుడు ఈశ్వరుడే!

మన సన్నిహితుడు, శ్రేయోభిలాషి– జగత్తును పాలించే ఆ ఈశ్వరుడు ఒక్కడేనని అనుకోవటానికి ఎంతో విశ్వాసం ఉండాలి. సద్గుణ సాకారుడు, నిర్గుణ నిరాకారుడు అయిన ఆయన ఎవరు ఏ రూపంలో ప్రార్థించినా పలుకుతాడు. అయితే దురదృష్టవశాత్తూ నేడు ఉండి, రేపు వెళ్ళిపోయే వ్యక్తులపై ఉన్న నమ్మకం, ఆద్యంత రహితుడైన ఆ అనాథ రక్షకుడిపై ఉండదు. 'అయినవారు, ఆత్మీయులు ఉన్నారు; ఆస్తులు, అంతస్తులు ఉన్నాయి. మాకు ఏమీ కాదనుకునే భ్రమల్లోంచి బయటపడ'మంటున్నాడు అన్నమయ్య. ఒక్కసారి ఆలోచించి చూస్తే, ఇతరమైనవన్నీ మధ్యలో వచ్చి, మధ్యలో వెళ్ళిపోయేవే; చిరకాలం చెలిమి చేయాల్సిన చిన్మయమూర్తి ఆయన ఒక్కడేనన్న భావనతో...
ఇతరములన్నియు నడమంత్రములే యెంచిచూచినను యింతాను హితవగు బంధువుడు ఈశ్వరుడొక్కడే ఈతనిమరువకుమీ జీవాత్మా... అని హితవు పలుకుతున్నాడు.

కాళహస్తీశ్వరుడి ఆత్మీయ భక్తుడు మహాకవి ధూర్జటి కూడా ఆ పరమశివుడితో ఎంతో చనువు పెంచుకున్నాడు.

నిన్ను నమ్మినరీతి నమ్మనొరులన్, నీ కన్న నాకెన్న లే
రన్నల్దమ్ములు తల్లితండ్రులు గురుండాపత్సహాయుండు నా
యన్నా! యెన్నడు నన్ను సంస్కృతి విషాదంభోధి దాటించియ
చ్ఛిన్నానంద సుఖాబ్ధిన్ దేల్చెదొ కదే శ్రీకాళహస్తీశ్వరా!

'నిన్ను నమ్మినట్లుగా నేను ఇతరులను ఎవ్వరినీ నమ్మను. నిజానికి నీ కంటే నాకు అన్నలు, తమ్ములు, తల్లి, తండ్రి, గురువు, ఇంకెవ్వరూ సహాయపడేవారు లేరు. నాకు అన్నీ నీవే! ఎప్పుడు నన్ను ఈ సంసారమనే దుఃఖసాగరం దాటించి, అవిచ్ఛిన్నమైన ఆనంద సంద్రంలో తేలుస్తావో'నని వేడుకొంటాడు.

(మిగతా 32వ పేజీలో...)

భారతదేశానికి వచ్చి తినడం, త్రాగడం, వినోదాలతో కాలక్షేపం చేయడం మాత్రమే బోధించాలనుకున్నవాళ్ళు వట్టి మోసగాళ్ళు. అలాంటి వారికి ఈ పుణ్యభూమిలో చోటులేదు. - స్వామి వివేకానంద



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద

(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: రోజులు గడిచిపోతున్నాయి కానీ ఆధ్యాత్మికంగా అభివృద్ధి సాధించలేదనే భావన నాలో కలుగుతోంది. ఈ భావన నన్ను మనోవేదనకు గురి చేస్తోంది. నా మనోవేదన పోవాలంటే ఏం చేయాలి?

స్వామీజీ: 'రోజులు గడిచిపోతున్నాయి. కానీ, ఆధ్యాత్మికంగా పురోగమించలేదు' అన్న భావన కలగడం చాలా మంచిది. శ్రీరామకృష్ణులు కూడా మూడు రోజులు గడిచిపోయాయి. ఇంకా నాకు కాళీమాత దర్శనం కాలేదని దక్షిణేశ్వర ఆలయ ప్రాంగణంలో నేలపై పడి పొర్లి పొర్లి విలపించారు. శ్రీరామకృష్ణుణ్ణి ఆ స్థితిలో చూసినవారు ఇతడు ఏదో వ్యాధితో బాధపడుతున్నాడని అనుకునేవారు. దీన్ని బట్టి శ్రీరామకృష్ణులు, జగన్మాత దర్శనం కోసం తన ప్రాణాలు పోయేటంత వ్యాకులతతో పరితపించారని మనకు అర్థమవుతుంది.



'భగవద్దర్శనం లభించాలంటే ఏం చేయాలి?' అని ఒక శిష్యుడు ప్రశ్నించాడు. వెంటనే గురువు ఆ శిష్యుణ్ణి గంగానదికి తీసుకువెళ్ళి నదిలో తలను ముంచి గట్టిగా అణచిపట్టుకొన్నాడు. శిష్యుడు భయంతో 'గురువుగారూ! నా ప్రాణాలు పోతున్నాయి' అని కేకలు వేశాడు. అప్పుడు గురువు 'నీ ప్రాణాల కోసం ఎలా విలవిలలాడావో అలా నువ్వు భగవంతుని కోసం తపించినప్పుడు తప్పక భగవంతుని దర్శనం లభిస్తుంది' అని బదులిచ్చాడు.

శ్రీరామకృష్ణులు నిరంజనుడనే శిష్యుడితో 'ఓ నిరంజన్! ఈ జీవితం అల్పమైనది. నీ సమయాన్ని ఇప్పుడు వృథా చేస్తే భగవంతుణ్ణి ఇంకెప్పుడు దర్శించగలుగుతావు' అని హెచ్చరించి, భగవత్ సాక్షాత్కారానికి ప్రయత్నించమని సూచించారు.

ఆకాశంలో వెదజల్లే అరుణ కాంతులు సూర్యోదయాన్ని సూచించినట్లు, భగవంతుణ్ణి ఇంకా దర్శించలేదనే వేదన, సమయం వృథా అవుతుందనే భావన మనల్ని భగవద్దర్శనానికి చేరువ చేస్తుందని అర్థం. అందువల్ల నిరుత్సాహం చెందకుండా సమయాన్ని సాధనలో సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నించడం ఉత్తమం.

భక్తుడు: 'కలియుగంలో మానవులు జప, ధ్యానాలను అభ్యసించడంలో ఆసక్తి చూపించరు' అని శ్రీరామకృష్ణులు ఎందుకు అన్నారు?

స్వామీజీ: కలియుగంలోని మానవుల స్వభావం గురించి శ్రీమద్భాగవతం (1.1.10) ఇలా వివరిస్తోంది:

ప్రాయేణ అల్పాయుషః సభ్య
కలావస్మిన్ యుగే జనాః ।
మందాః సుమన్ద మతయో
మందభాగ్యా హ్యుపద్రుతాః ॥

'ఈ కలియుగంలో మానవులు అల్పాయుష్కులు. వారు సోమరులు, మందబుద్ధులు, మందభాగ్యులు, రోగపీడితులు అవడం వల్ల పారమార్థిక విషయాల పట్ల ఆసక్తి చూపరు'.

కలియుగంలో మనుషులు బలహీన మనస్కులు, చంచల స్వభావులు. అస్థిరమైన మనస్సుతో ఒకచోట స్థిరంగా కూర్చొని జప, ధ్యానాలు చేయడం సాధ్యం కాదు. అందువల్ల సాధారణంగా అధికశాతం జనులు జప, ధ్యానాలు చేయడానికి సుముఖత చూపరనే సందర్భంలో శ్రీరామకృష్ణులు అన్న మాటలవి. నిజానికి శ్రీరామకృష్ణులు జప, ధ్యానాలను అభ్యసించవద్దని ఎవరినీ నిరుత్సాహపరచలేదు. ఎవరి శక్త్యానుసారం వారు తప్పక జప, ధ్యానాలను అభ్యసించమని సూచించేవారు. ❖

పండుగలు - పర్వదినాలు

నవంబర్ - 2013

03	ఆదివారం	: దీపావళి - కాళీపూజ
13	బుధవారం	: ఏకాదశి
14	గురువారం	: స్వామి సుబోధానంద జయంతి
16	శనివారం	: స్వామి విజ్ఞానానంద జయంతి
29	శుక్రవారం	: ఏకాదశి

డిసెంబర్ - 2013

11	బుధవారం	: స్వామి ప్రేమానంద జయంతి
13	శుక్రవారం	: ఏకాదశి
24	మంగళవారం	: దివ్యజనని శ్రీశారదాదేవి జయంతి
28	శనివారం	: స్వామి శివానంద జయంతి, ఏకాదశి

- డాక్టర్ రెంటాల జయదేవ

సాష్టాంగమంటే...



దేహాన్ని సహజమైన స్థితిలో భూమిపై తాకుతూ పడి ఉండేలా చేయడమే సరైన నమస్కారం. 'సాష్టాంగ నమస్కారం' అంటే, 'స - అష్ట - అంగ నమస్కారం'. శరీరంలోని ఎనిమిది అంగాలతో (అవయవాలతో) కూడి, చేసే నమస్కారమన్న మాట.

దోర్భ్యాం పద్భ్యాం చ జానుభ్యా మురసా శిరసా దృశా ।
మనసా వచసా చేతి ప్రణామోఽ ష్టాంగ ఉచ్యతే ॥

అని 'గురు గీత'లో శివుడు చెప్పాడు. *"1) చేతులు, 2) పాదాలు, 3) మోకాళ్ళు, 4) వక్షస్థలం, 5) శిరస్సు, 6) నేత్రాలు, 7) మనస్సు, 8) వాక్కు - ఈ ఎనిమిదింటితో చేసిన నమస్కారాన్ని 'సాష్టాంగ నమస్కారం' అంటారు."*

కాగా, 'నారాయణ సంహిత'లో...

శిరో హస్తౌ చ కర్ణౌ చ చుబుకం బాహుయుగ్మకం ।
అష్టాంగం చ నమస్కారం పంచాంగం చ తత శృణు ॥

"శిరస్సు, రెండు చేతులు, రెండు చెవులు, గడ్డం, రెండు భుజాలు - ఈ ఎనిమిదింటితో చేసేది 'సాష్టాంగ నమస్కారం'. ఆ తరువాత పంచాంగ నమస్కార విధమెలాగో వినండి" అని 'సాష్టాంగ నమస్కారా'న్ని విష్ణువు అభివర్ణించారు.

సాష్టాంగ ప్రణామం చేస్తున్నప్పుడు రెండు కాళ్ళతో సహా పై ఎనిమిది దేహావయవాలనూ నేలకు తాకించాలని చెబుతారు. నమస్కారాలలోకెల్లా సాష్టాంగ నమస్కారం ఉత్తమమైనది, ముఖ్యమైనది, తప్పనిసరిగా ఆచరించాల్సినది. దేవతలకూ, గురువులకూ, పెద్దలకూ ఈ విధమైన నమస్కారం చేయాలి. అయితే, ఈ 'సాష్టాంగ నమస్కారా'న్ని పురుషులు మాత్రమే చేయాలి. స్త్రీలకు ఇది నిషిద్ధం.

ఇతర నమస్కార విధులు

1. పంచాంగ నమస్కారం: స్త్రీలు కేవలం 'పంచాంగ నమస్కారం' చేస్తే చాలని శాస్త్రం చెబుతోంది. స్త్రీలు తమ నడుమును, వక్షస్థల భాగాలనూ నేలకు తాకనివ్వరాదు. కాబట్టి, ఈ విధమైన నమస్కారం స్త్రీలకు ఉత్తమమైనది.

శిరో హస్తౌ చ బాహూ చ కృత్వా జానుని సంస్థితౌ ।
ఇదం పంచాంగ మేవోక్తం త్రయ్యంగం చ తత శృణు ॥

(నారాయణ సంహిత)

"శిరస్సు, రెండు హస్తాలు, రెండు భుజాలను మోకాళ్ళ యందు ఉంచి (అంటే, మోకాళ్ళపై వంగి) చేసే దాన్ని 'పంచాంగ' (అయిదు అంగములతో కూడిన) నమస్కారం అంటారు. ఆ పిమ్మట మూడు అంగాలతో చేసే నమస్కార విధానాన్ని వినుము."

2. త్ర్యంగ (త్రయ్యంగ) నమస్కారం: శరీరంలోని మూడే అవయవాలతో చేసే నమస్కారం - త్ర్యంగ (లేదా త్రయ్యంగ) నమస్కారం.

హస్తౌ బద్ధ్వాతు ముకుళ వన్మూర్ధ్ని దేశే నియోజ యేత్ ।

(నారాయణ సంహిత)

"రెండు చేతులనూ ముకుళించి (జోడించి), శిరస్సు నందు ఉంచి నమస్కరించడాన్ని మూడు అంగాలతో చేసిన నమస్కారం, అంటే 'త్ర్యంగ (లేదా త్రయ్యంగ) నమస్కారం' అని అంటారు."

3. ఏకాంగ నమస్కారం: ***ఏకాంగం తు నమస్కారం శిరస్యైవ కృతా భవేత్ ।*** (నారాయణ సంహిత)

"శిరస్సును మాత్రం వంచి నమస్కరించడాన్ని 'ఏకాంగ నమస్కారం' అని అంటారు." చేతులను జోడించి నమస్కరించలేని తప్పనిసరి పరిస్థితుల్లో ఈ పద్ధతిలో నమస్కరించాలి.

ఎవరికి, ఏ నమస్కారం?

దేవతలకు కానీ, పెద్దలకు కానీ పురుషులు మాత్రం సాష్టాంగ నమస్కారం చేయాలి. స్త్రీలు పంచాంగ, త్ర్యంగ, ఏకాంగ నమస్కారాలు చేయవచ్చు.

గురువుకు నమస్కరిస్తున్నప్పుడు...

వ్యత్యస్త పాణినా కార్య ముప సంగ్రహణం గురోః ।
సవ్యేన సవ్యః స్పృష్టవ్యో దక్షిణేన చ దక్షిణః ॥

"గురువుకు నమస్కరిస్తున్నప్పుడు రెండు చేతులనూ మార్చి పట్టుకోవాలి. అంటే, మన కుడి చేతితో గురువు గారి కుడి పాదాన్నీ, మన ఎడమ చేతితో వారి ఎడమ పాదాన్నీ పట్టుకొని నమస్కరించాలి." అంటే, 'ఓ గురుదేవా! మీ పాదపద్మాలే నాకు శరణ్యం' అనే భావనతో నమస్కరించడమన్న మాట. గురువును అలా నమస్కరించడం శ్రేయస్కరమని శాస్త్ర వచనం. ❖

(మరిన్ని విశేషాలు... వచ్చే సంచికలో...)

వేదాంత ధర్మంలోని మహోన్నతమైన రహస్యాలను పాశ్చాత్యులకు బోధించడం ద్వారా వారి మన్ననలను పొందడమేకాక, ఆధ్యాత్మిక విషయాల్లో వారికి మనం ఎల్లకాలం గురుస్థానంలో ఉంటాం. -స్వామి వివేకానంద



దయాసాగరి జగద్ధాత్రి

దీపావళి అమావాస్య తర్వాత వచ్చే శుద్ధ నవమి నాడు బెంగాలీలు జగద్ధాత్రి పూజ చేస్తారు. దుర్గాదేవి మరొక రూపం – జగద్ధాత్రి. ఈ పూజ సూర్యోదయం నుండి సూర్యాస్తమం వరకు జరుగుతుంది. సప్తమి నుండి మూడు రోజులు జరిపే దుర్గాపూజ ఈనాడు ఒకే దివసంలో సంక్షిప్తంగా జరుగుతుంది. ప్రాతఃకాలంలో సాత్త్విక, మధ్యాహ్నం రాజసి, సాయంకాలం తామసిగా అమ్మ పూజింప బడుతుంది.

జగద్ధాత్రి శరీరఛాయ సూర్యోదయ కాంతి వర్ణంతో శోభిల్లుతుంది. నాలుగు చేతులలో శంఖు చక్ర ధనుర్బాణాలు ధరించి, సింహారూఢియై ఉంటుంది. ఆమె చరణతలం వద్ద ఒక ఏనుగు తల పడి ఉంటుంది. అది గజేంద్రాసురుని శిరస్సు. 'ఎవరు మనోగజాన్ని వశపరచుకొంటారో, వారి హృదయంలోనే జగద్ధాత్రి ఆవిర్భవిస్తుంది' అన్నారు శ్రీరామకృష్ణ.

దుర్గాదేవి మహిషాసురుని వధింపగా, ఆమె జగద్ధాత్రిగా దుర్గమాసురుని వధించింది. దుర్గలీలా క్షేత్రం హిమాలయ పర్వతం కాగా జగద్ధాత్రి వింధ్యాచల విహారిణి. రురు అనబడే దానవుని కుమారుడు దుర్గముడు. చతుర్వేదాల జ్ఞానమే సుర, భూసురుల శక్తికి మూలం అని స్థిరపరచుకొన్నాడు. ఆ జ్ఞానంతో బ్రాహ్మణులు యజ్ఞ యాగాదులు నిర్వహించి, దేవతలకు హవిస్సు సమర్పిస్తారు. హవిస్సే దేవతల ఆహారం. కనుక దేవతల కడుపు మాడ్చాలంటే బ్రాహ్మణుల వేదజ్ఞానం తస్కరించాలి. దుర్గముడు చాలా సంవత్సరాల పాటు కఠోర తపస్సు ఆచరించాడు. సంతసించిన చతుర్ముఖ బ్రహ్మ అతడికి వరమిచ్చాడు. వేదాలు

(నవంబర్ 11న 'జగద్ధాత్రి పూజ)

మాయమైనాయి. బ్రాహ్మణుల మానసం నుండి వెడలిపోయాయి. యాగ యజ్ఞాలు నిలిచిపోయాయి. దేవతలు ఆహారం లేక కృశించి, శక్తి హీనులయ్యారు.

అప్పుడు దుర్గమాసురుడు అమరావతి నగరాన్ని చేజిక్కించుకొని, దేవతలను తరిమివేశాడు. వారు భూలోకంలో పర్వత గుహలలో జగన్మాతను ధ్యానిస్తూ తపస్సు చేశారు. భూమిపై వర్షాలు లేకపోవడంతో మనుష్యులు, పశువులు ఆహారం లేక మరణిస్తున్నారు. బ్రాహ్మణుల ఆర్తిభరితమైన స్తోత్రగానం విని, జగన్మాత తన శరీరంపై అనేక నయనాలు సృష్టించుకొని, ఒక అపూర్వ రూపంతో దర్శనమిచ్చినదట. ఆమె ముదురు నీలపు శరీరంపై నల్ల కలువల వంటి విశాల నేత్రాలు. ఆమె దక్షిణ హస్తాలు రెంటిలో కమలం, బాణాలు. ఒక వామ హస్తంలో పళ్ళు, పూలు, కందమూలాలు. రెండో దానిలో ధనుస్సు ధరించింది. శరీరం కోటి సూర్య లావణ్యకాంతితో మెరిసిపోతోంది. కరుణారసమూర్తి అయిన ఆమె అనంత నేత్రాల నుండి అశ్రువులు, తొమ్మిది రాత్రులు జాలువారి, విశ్వమంతా నీటితో నిండిపోయింది.

జీవులన్నీ సంతృప్తి చెందాయి. నదులు, వాగులు నిండుగా ప్రవహించాయి. గుహలలో తలదాచుకొన్న దేవతలు, బ్రాహ్మణులతో సహా వెలుపలకు వచ్చి జగదంబను స్తుతించారు. 'నీవు అనేక నయనాలను ధరించావు కాబట్టి, 'శతాక్షి'గా స్తుతింపబడతావు' అన్నారు. 'ఆహారం లేని మాకు నిన్ను స్తుతించే శక్తి లేదు. నీవు వేదాలను ఉద్ధరింపుము' అన్నారు.

వారి దీనస్థితి చూసి, ఆమె తన చేతిలోని ఫలశాఖ మూలాలను దేవతలకు, మనుష్యులకు ఇచ్చింది. పశువులకు గ్రాసమిచ్చింది. కనుక, ఆమె 'శాకంభరి' అని పిలవబడుతోంది. ఈ విధంగా ఆమె జగత్తులో తిరిగి శాంతిని నెలకొల్పింది. చతుర్వేదాలను ఉద్ధరించింది. 'శాకంభరీ శతాక్షీ సా, సైవ దుర్గా ప్రకీర్తితా' అంటుంది దేవీ భాగవతం. శాకంభరీ, శతాక్షీ అయిన ఆమే దుర్గ అని కీర్తిని అందుకుంటోంది.

'అమ్మా! మా కష్టాలు చూసి నీవు శతసహస్ర నేత్రాల నుండి అశ్రుధారలు కురిపించావు. ఎవరైనా ఈశ్వరుడు కావచ్చు, కానీ నీవు తప్పించి వేరెవ్వరూ కన్నీరు కార్చరు' అన్నారు సురభూసురులు.

దయారూపే దయాదృష్టే దయార్ద్రే దుఃఖమోచని ।
సర్వాపత్తారికే దుర్గే జగద్ధాత్రి నమోస్తుతే ॥

జగద్ధాత్రి పూజ నాడు ఆ దయాసాగరిని పై శ్లోకం పఠించి వేడుకొనడం శ్రేయోదాయకం. ❖

సేకరణ : డాక్టర్ కమల జయరావు



మూగజీవాలకూ ప్రేమమూర్తే!

– స్వామి భాస్కరానంద

మహాత్ములైనవారు మామూలు మనుష్యులనే కాదు మూగ జీవాలను కూడా ప్రేమమూర్తులుగా అక్కున చేర్చుకుంటారు. స్వామి వివేకానంద కూడా ఆ కోవకే చెందిన మహనీయులు. కలకత్తాలోని బేలూరు మఠంలో ఉన్నప్పుడు స్వామీజీకి కుక్కలు, జింకలు, కొంగలు, బాతులు పెంపుడు జంతువులుగా ఉండేవి. వారు వాటిని ముద్దుపేర్లతో పిలుచుకునేవారు. ముఖ్యంగా భాగ్ అనే పెంపుడు కుక్క స్వామీజీతో ఎంతో చనువుగా తిరుగుతూ ఉండేది. భాగ్ అంటే స్వామీజీకే కాదు, ఇతర సన్న్యాసులకు కూడా ఎంతో ప్రీతి.

ఒకరోజు భాగ్ యథేచ్ఛగా తిరుగుతూ ఆలయ ప్రాంగణాన్ని అపరిశుభ్రం చేసింది. దీంతో ఇతర సన్న్యాస సోదరులు, సిబ్బంది అసహనానికి లోనై, దానిని మఠం నుంచి ఎక్కడికైనా పంపేయాలనుకున్నారు. అందుకే ఒకరిద్దరు సన్న్యాసులు, గంగానదికి ఈవల ఉన్న బేలూరుమఠం నుంచి బాఘూను పడవలో తీసుకువెళ్ళి ఆవలి వైపున వదిలివేశారు. కానీ వెంటనే భాగ్ తిరిగి పడవలోకే దూకింది. పడవ నడిపే వ్యక్తి ఎంత దించినా దిగకుండా, మళ్ళీ బేలూరుమఠానికి వచ్చే వరకు కూడా అది పడవను వదలలేదు. ఇక చేసేదేమీ లేక, భాగ్‌ను తిరిగి మఠానికి తీసుకురాక తప్పలేదు. ఆ రోజంతా అది అలిగి, సన్న్యాసుల వసతిగృహం నుంచి బయటకే రాలేదు.



స్వామి వివేకానంద గది ఆశ్రమభవనంలోని రెండో అంతస్తులో ఉండేది. వారి స్నానాలగది పక్కనే ఉండేది. వాటిని ఆనుకునే మెట్లు కూడా ఉండేవి. భాగ్‌ను తిరిగి బేలూరు మఠానికి తీసుకువచ్చిన మరుసటి రోజు తెల్లవారుజామునే స్వామీజీ లేచారు. పక్కనే ఉన్న స్నానాలగదిలోకి వెళ్ళబోతుండగా, ఇంతలో కాళ్ళకు ఏదో తగిలినట్లయింది. అది తన ప్రియమైన భాగ్! అప్పటికే అది మరోవైపు మెట్ల నుంచి వచ్చి, ఆ గది ఎదురుగానే కూర్చుంది. స్వామీజీ ఆ గదిలోకి వెళ్ళడానికి ప్రయత్నిస్తుండగానే, అది మూలుగుతూ, వారి పాదాలపై తలను రుద్దసాగింది. ముందురోజు జరిగిన విషయమై ఏదో ఫిర్యాదు చేస్తున్నట్లుగా వారి ముఖం వైపు చూస్తూ, చిన్నగా గొణగసాగింది. అన్ని రోజుల్లో భాగ్ ఎప్పుడూ మేడ మెట్లు ఎక్కలేదు. ఆశ్చర్యకరంగా ఆ రోజు తరువాత కూడా అది ఆ మెట్లపై కాలుపెట్టలేదు. ఆ ఒక్కసారే అలా మేడ మెట్లెక్కి స్వామీజీ గది ముందు కూర్చుంది.

మరుసటి రోజు ఉదయమే స్వామి వివేకానంద ఇతర సోదరసన్న్యాసులతో 'చూడండి! భాగ్ నేను ఇక్కడ యజమానిని అనుకుంటోంది. అందుకే మీరు అలా ప్రవర్తించినందుకు, అంత ఉదయమే వచ్చి నాకు ఫిర్యాదు చేసింది. దాన్ని ఇక మీరు శిక్షించకండి' అంటూ స్వామీజీ భాగ్‌ను దగ్గరకు తీసుకున్నారు. సాధారణంగా శునకాలు వాటి ముందు ఏదైనా ఆహారం వేయగానే పోటీపడి తింటాయి. కానీ భాగ్ మాత్రం మఠంలోని జంతువులన్నీ తిన్నాకే, అటువైపునకు వెళ్ళేది.

బేలూరు మఠంలో అప్పట్లో ఇంకా భవనాలు నిర్మితం కాకపోవడం వల్ల ఆ చుట్టుపక్కల విషసర్పాలు ఎక్కువగా తిరుగుతూ ఉండేవి. సన్న్యాసులు వాటి బారిన పడకుండా భాగ్ వారు ఎక్కడికి వెళ్ళినా, వారికి ముందు నడుస్తూ, సర్పాలు దూరం పారిపోయేలా శబ్దం చేస్తూ ఉండేది. మఠం మొత్తానికీ, భక్తులకూ అది కాపలా ఉండేది.

స్వామీజీ మహాభినిష్క్రమణ వేళ..: స్వామి వివేకానంద మహాసమాధి అయిన రోజు భాగ్ ప్రవర్తన, అచంచల విశ్వాసం అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది. స్వామీజీ పార్థివదేహం గంగాతీరంలో అగ్నికీలలకు ఆహుతి అవుతున్న వేళ, సమీపంలో భాగ్ ధారాపాతంగా కన్నీరు కారుస్తూ కూర్చున్న తీరు అక్కడి వారందరినీ కదిలించివేసింది. స్వామీజీ దేహం బూడిదయ్యాక కూడా చాలా సేపటి వరకు అది, అక్కడి నుంచి కదలలేదు. ఆ రోజంతా భాగ్ పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేదు. ఆ రోజు నుంచి భాగ్ ఏదో కోల్పోయినట్లు విషాదంగానే ఉండేది.

స్వామీజీ లేరన్న దిగులుతో కొన్నాళ్ళకు భాగ్ కూడా మరణించింది. మఠం సిబ్బంది దాని కళేబరాన్ని గంగానదిలో వదిలేశారు. కానీ ఆశ్చర్యంగా అది మళ్ళీ బేలూరు మఠం తీరానికే వచ్చి చేరింది. దాంతో భాగ్‌ను మఠం ప్రాంగణంలోనే గంధపు చెక్కలతో దహనం చేశారు. అలా ప్రేమమూర్తి అయిన స్వామి వివేకానంద సమక్షంలో మూగజీవాలు కూడా మహోన్నతమైన చరితను మిగుల్చుకున్నాయి. ❖

ప్రతి పురుషుని, స్త్రీని, ప్రాణిని భగవత్ స్వరూపంగా వీక్షించి, సేవించాలి. అలా సేవ చేయగల శక్తి భగవంతుడు నీకు ప్రసాదించినచో నిజంగా నువ్వు అదృష్టవంతుడవని తెలుసుకో! -స్వామి వివేకానంద

నా విజయ రహస్యం

- స్వామి అర్చనానంద

"విశ్వమత మహాసభల సమావేశ జన సమూహాన్ని 'అమెరికా సోదరీ, సోదరులారా!'అని సంబోధించాను! అంతే! చెవులు చిల్లులు పడేలా రెండు నిమిషాల పాటు కరతాళ ధ్వనులతో ఆ భవ్య భవనం మారుమ్రోగింది. ఆ తరువాతనే నేను ప్రసంగించడం ప్రారంభించాను. అది ముగియగానే ప్రగాఢ భావావేశంతో దాదాపు అలసిపోయి నా స్థానంలో అలాగే కూర్చుండి పోయాను. మరుసటి రోజు వార్తాపత్రికలన్నీ నా ప్రసంగమే సర్వశ్రేష్ఠమైనదని ఘోషించాయి, నా గురించి అమెరికా అంతటా తెలిసిపోయింది. 'వారందరూ అలా స్పందించ డానికి కారణమేమిటా?' అని నీవు ఆశ్చర్య పడవచ్చు! నాకేదయినా అద్భుత శక్తి, సిద్ధి ఉండినవా? అని నీవు అబ్బుర పడవచ్చు! ...ఔను! నీకు ఆ రహస్యం చెప్పేస్తున్నాను. - నాలో ఆ 'అద్భుత శక్తి' ఉండినదీ, ఉన్నదీ. అదేమిటంటే - నా జీవితంలో ఒక్కసారి కూడా కనీసం ఒక్క లైంగిక తలంపును, చెడు ఆలోచనను కూడా నా మనస్సులో ప్రవేశింపనీయలేదు. నా మనస్సుకు, నా ఆలోచనా శైలికి నేనే ప్రశిక్షణ ఇచ్చాను; మనిషి సాధారణంగా కామ చింతన, చెడు సంపర్కంతో వృథా చేసుకొనే మానసిక శక్తుల్ని నేను ఊర్ధ్వముఖంగా ఉన్నత దిశలో ప్రవహింపజేశాను. తత్ఫలితంగా నా మనస్సు, మేధ, సంకల్పం - ఎవ్వరూ, ఏదీ ఆపలేని, ప్రతిఘటించలేని ఒక ప్రచండ ఆత్మశక్తి, ఆధ్యాత్మికశక్తిని సంతరించుకొన్నాయి".



1893 సెప్టెంబర్ 11న అమెరికాలోని చికాగో మహానగరంలో ప్రారంభమైన 'విశ్వమత మహాసభల'లో భారత దేశపు సనాతన హిందూ ధర్మ ప్రతినిధిగా వేదాంత సింహగర్జన చేసి, మూఢ మతాంధుల నక్కజిత్తులను చిత్తుచేసిన భారతమాత భవ్యపుత్రుడు, ఆధ్యాత్మ జ్ఞాన భాస్కరుడు, భారత యువతకు భవితను చూపిన యువనేత - వివేకానంద స్వామీజీ ఆ మహాసభల తదనంతరం తన మద్రాసు శిష్యులకు వ్రాసిన అతి విలువైన లేఖలోని అగ్నిశిఖలు ఇవి. పాశ్చాత్య భోగవాదంలో అస్తిత్వమే కోల్పోతున్న జాతికి శాంతి కాంతి రేఖలు ఇవి!

మానవజాతి శ్రేయస్సును, యువకుల ఉజ్జ్వల భవిష్యత్తును మనసారా ఆకాంక్షించి స్వామీజీ ఇలాంటి 'సాధనా రహస్యాలను' ఎన్నింటినో మనందరికీ అందించారు. ఉపనిషత్తులు, భగవద్గీత, భారత, భాగవత, రామాయణాది మహోన్నత శాస్త్రాలలో ఉన్న శక్తిదాయక, స్ఫూర్తిప్రేరక మహ సంస్కృత మంత్రాలను సులభం, సరళమైన ఆంగ్లభాషలో ఉద్బోధించారు. 'మరణం బిందు పాతేన, జీవనం బిందు ధారణాత్' - 'అత్యంత విలువైన రేతస్సు(వీర్యము)ను వృథా చేసిన మనిషి మరణానికి చేరువవుతాడు. త్యాగం, వైరాగ్యంతో నిండిన తపోశక్తితో పవిత్ర జీవనంతో ఈ రేతస్సును, తనలోనే నిలుపుకొని, ఆత్మ వినిగ్రహం, ఆత్మధ్యాన సాధనలతో రేతస్సును 'ఓజస్సు'గా, ఆధ్యాత్మిక శక్తిగా పరివర్తనం చేసిన సాధకుడు శాశ్వత జీవనం, అమృతత్వం (ఆనందమయమోక్షం) చేరుకొంటాడు' - అంటోంది 'అమృత బిందు ఉపనిషత్తు'.

'తనను తాను పరిపూర్ణంగా పవిత్రునిగా మలచుకున్న ఒక్క వ్యక్తి, పెద్ద మత ప్రచారకుల మహాసమూహం కన్నా అధికంగా విజయాలు సాధిస్తాడు. పవిత్రత, ప్రశాంతత - వీటి సాధనా ఫలంగానే దివ్యశక్తి, స్ఫూర్తితో నిండిన వాణి ఉద్భవిస్తుంది' అని స్వామీజీ బోధించారు.

స్వామి వివేకానంద ఏకసంథాగ్రాహి. Encyclopedia of Britanica 'విశ్వవిజ్ఞాన సర్వస్వం' గ్రంథాలను చూసి వారి శిష్యుడు, 'స్వామీజీ! ఒక జీవితకాలంలో ఈ బృహత్ గ్రంథాలను చదివిముగించడం అసాధ్యం కదా!' అన్నారు.

అందుకు స్వామీజీ - 'ఏమంటున్నావు? ఈ 25 సంపుటాల్లో 10 సంపుటాల్ని నేను ఇప్పటికే చదివాను. నీకు ఋజువు కావాలంటే వీటిలో ఏ ప్రశ్నయినా అడుగు' అన్నారు. శిష్యుడు ఆ గ్రంథాల నుండి అడిగిన ప్రతి ప్రశ్నకూ సరైన సమాధానాన్ని కచ్చితమైన పదజాలంతో పేజీ నెంబర్‌తో సహా స్వామీజీ చెప్పేశారు.

ఆశ్చర్యంలో తలమునకలవుతున్న శిష్యునితో స్వామీజీ ఇలా అన్నారు - "పన్నెండేళ్ళు ఎవరైనా సరే కచ్చితమైన అస్ఖలిత బ్రహ్మచర్యం పాటిస్తే ఇటువంటి జ్ఞాపకశక్తి సాధ్యమే. అలాంటి వ్యక్తి ఏ విషయమైనా ఒకే ఒక్కసారి విన్నా, చదివినా అలాగే గుర్తుండి పోతుంది. నేను స్వయంగా ఈ సాధన చేశాను. ఎవరైనా ఈ సాధన చేసి ఈ శక్తిని పొందవచ్చు. నీవూ సాధించవచ్చు" 'Is there a greater power than that of purity of Brahmacharya, my boy?' - 'పవిత్రతాశక్తి కన్నా, బ్రహ్మచర్యశక్తి కన్నా గొప్పశక్తి ఏమైనా ఉన్నదా నాయనా?' అని తన శిష్యులకో లేఖలో స్వామీజీ వ్రాశారు.

నరేంద్రుడు కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నప్పుడు చదువుకోవడానికి ప్రశాంత వాతావరణం కోసం రాత్రిపూట తమ

(మిగతా 30వ పేజీలో...)

ధీరవాణి

– స్వామి వివేకానంద

వ్యక్తిత్వమే అత్యంత కీలకం

మన శరీరాలు – మన గుణాలు – మేధ – ఆధ్యాత్మిక సంపత్తి – ఇవన్నీ అనవరతం ఇతరుల మీద తమ ప్రభావాన్ని ప్రసరింపజేస్తూనే ఉన్నాయి. ఫలితంగా మనం కూడా ఇతరుల ప్రభావానికి లోనవుతున్నాం. మన చుట్టూ నిరంతరం జరుగుతూ ఉన్న స్థితి ఇది.

ఉదాహరణకు ఒక వ్యక్తి మన ముందుకు వచ్చాడనుకుందాం. అతను బాగా చదువుకున్నాడు. చక్కని భాష మాట్లాడతాడు. సందర్భోచితంగా మాట్లాడతాడు. అయితే అతను మనకు ఏ మాత్రం నచ్చుడు. మరొక వ్యక్తి వస్తాడు. ఏదో కాస్త మాట్లాడతాడు. ఆ మాటల్లో తప్పులు కూడా ఉండవచ్చు. వ్యాకరణ దోషాలుండవచ్చు. ఐనా అతను మనకు బాగా నచ్చుతాడు. అంటే ఏమిటి? మనల్ని మెప్పించేవి వట్టి మాటలే కావు! మాటలు ఒకర్ని ఆకట్టుకోవడంలో మూడింట ఒక వంతు మాత్రమే పనిచేస్తాయి. మనిషి వ్యక్తిత్వం మాత్రమే మనల్ని ఆకట్టుకోవడంలో ప్రధానపాత్ర వహిస్తుంది.

మానవజాతిని నడిపించిన మహానాయకుల విషయానికి వస్తే, నాయకత్వం వహించడంలో గణనకు వచ్చేది వారి వ్యక్తిత్వ విశేషమని మనకు తెలుస్తుంది. ప్రాచీన మహాకవుల్ని – శాస్త్రవేత్తల్ని పరిశీలిస్తే నిజానికి వారి భావాలన్నీ కలిసి ఎన్నుంటాయి? ప్రపంచం పుట్టినప్పటి నుండీ ఇప్పటివరకూ మహానుభావులంతా రాసిన గ్రంథాలను పరిశీలిస్తే పునరుక్తి లేకుండా అచ్చమైన భావాలన్నీ గుప్పెడు కన్నా ఎక్కువ ఉండవు.

మరి, వారు అంతటి మహానుభావులు కావడానికి కారణమేమిటి? వారు భావించిన భావాలు మాత్రం కావు; వారు రాసిన పుస్తకాలు కావు; వారు చేసిన ఉపన్యాసాలూ కావు. వారికి చెందినదేదీకాదు. ఆ హేతువు వారి వ్యక్తిత్వ విశేషమే. మూడింట రెండు వంతులు వ్యక్తిత్వం – మిగతా ఒక వంతు ప్రతిభా, వాక్ వైఖరులు. మనిషి వ్యక్తిత్వమే ప్రధానమైనది.

విద్యా విధానానికి అంతా, శిక్షణకు అంతా వ్యక్తిత్వాభివృద్ధే లక్ష్యంగా ఉండాలి. అయితే వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేయడానికి బదులుగా, మనం పై పై మెరుగులు దిద్దడానికై ప్రయత్నిస్తున్నాం. పైన పటారం – లోన లొటారం వల్ల లాభమేమిటి? శిక్షణకంతా లక్ష్యం మనిషి వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేయడమే! సహచరుల మీద తన ప్రభావాన్ని వ్యాపింపచేసేవాడు నిజంగా ఎంతో శక్తిమంతుడు; విద్యుత్ యంత్రం లాంటివాడు. అతని వ్యక్తిత్వ ప్రభావం వల్ల అన్ని క్రియలూ సమకూరుతాయి. ❖



లోకానికి కావలసింది శీలమే. జాజ్వల్యమానమైన నిస్వార్థప్రేమ కలవారే లోకానికి అవసరం. అలాంటి వారు పలికిన ప్రతి మాటా పిడుగులాగ అత్యంత శక్తిమంతమై ప్రభావితం చేస్తుంది. -స్వామి వివేకానంద

సాటి లేని స్వామీజీ మానవతావాదం

– డాక్టర్ ఆత్మకూరు రమణయ్య

'మానవత్వం' – ఎంత అద్భుతమైన మాట!

ఈ దృష్టితో భారతీయ సనాతన ధర్మంలోని లోతుపాతులను, అందులో ప్రతిష్ఠితమైన సత్యాలను, సామాజిక వ్యవస్థను చక్కగా పరిశీలించి, పరిశోధించి ఆ మేరకు మానవజాతిని సంస్కరించ డానికి ఎందరో మహానుభావులు కృషి చేశారు. అలాంటి వాళ్ళలో ఆధునికయుగంలో వచ్చిన స్వామి వివేకానంద అగ్రగణ్యులు. 19వ శతాబ్దపు రెండవ భాగంలో వంగ దేశంలో ప్రభవించిన ఒక మహా ప్రభంజనమే స్వామి వివేకానంద. ఇది అతిశయోక్తి కాదు; అక్షరసత్యం.

స్వామీజీ "ఉత్తిష్ఠత! జాగ్రత! ప్రాప్యవరాన్నిబోధత –లేవండి, మేల్కోండి; గమ్యం చేరుకునేంత వరకు విశ్రమించవద్దు" అన్న వేదాంత జాగృతీ నినాదంతో ప్రాచ్య పాశ్చాత్య సమాజాలను ఒక కుదుపు కుదిపారు! సనాతన వైదిక సంస్కృతిని సుస్థిరం చేయడంలో, దాన్ని నేటి సమాజానికి అర్థమయ్యే విధంగా గంభీరవాణితో బోధించడంలో, తద్వారా విశ్వమానవాళిని జాగృతం చేయడంలో స్వామీజీ సాధించిన అఖండదీప్తికి 'వివేకానంద' అన్న ఆయన నామమే జయపతాక! 'వివేకం', 'ఆనందం' అనే రెండు పదాల సమాహారమే స్వామి వివేకానంద స్వరూప స్వభావాలు!

సమసమాజ నిర్మాణానికి, సర్వజన శ్రేయస్సుకు, మాతృదేశ అభ్యున్నతికి స్వామి వివేకానంద ఎన్నుకున్న మార్గం – మనుషులను తయారుచేయడం. మనిషి, మానవోన్నతి – ఇవే ఆయన జీవితాశయాలు. ఈ ఆశయాల సాధన కోసమే ఆయన తమ జీవిత సర్వస్వాన్నీ పరిత్యజించి, త్యాగానికి చక్కని భాష్యం చెప్పారు. వివేకానందుల దృష్టిలో మనిషే ప్రత్యక్షదైవం! మనిషిని ఉద్దేశించి ఆయన 'అమృతస్యపుత్రాః' అని ఎలుగెత్తి చాటారు. బహుశః మనిషికి ఇంతటి గొప్పస్థానాన్ని ఇతర మానవతా వాదులెవ్వరూ ఇచ్చి ఉండరేమో! కాబట్టే స్వామీజీ మానవతావాదుల్లో అగ్రస్థానాన్ని అందుకోగలిగారు.

మనిషికి రాజకీయ, సామాజిక తదితర రంగాల్లో స్వేచ్ఛా సమానత్వాలు కలిగించడం వరకే తక్కిన మానవతావాదులంతా పరిమితమయ్యారు. కానీ స్వామి వివేకానంద మనిషిలో నిక్షిప్తమై ఉండే అనంతమైన జ్ఞానాన్ని వెలికితీసి, తద్వారా మనిషిని పరిపూర్ణమైన వ్యక్తిగా తీర్చిదిద్దడంపైనే దృష్టిని కేంద్రీకరించారు. మనిషి పరిపూర్ణతను సంతరించుకోలేనంత వరకు అతడు నిజమైన స్వేచ్ఛావాయువులను ఆస్వాదించలేడు; ఆనందించనూ లేడన్నది స్వామివారి మానవతా దృక్పథంలోని విశేషం.

"మంచిగా ఉండు, మంచినే ఆశ్రయించు; ఇతరులు కూడా మంచిగా ఉండి, మంచి పనులు చేసేటట్లు ప్రోత్సహించు" అన్న ఆయన మాటలు మానవ సమాజాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి; చేస్తున్నాయి. స్వామీజీ సందేశాలకు ప్రభావితులైన వాళ్ళలో గాంధీజీ, సుభాష్ చంద్రబోస్, జవహర్‌లాల్ నెహ్రూ, రవీంద్రనాథ్ టాగూర్, తిలక్, రాజాజీ మొదలైన ప్రముఖ నాయకులు కూడా ఉండడం గమనార్హం.

స్వాతంత్ర్యోద్యమానికి ప్రథమశ్రేణి నాయకులుగా పేరుగాంచిన ప్రముఖులనే వివేకానంద వాణి అంతగా ప్రభావితం చేసిందంటే; ఇక అది నేటి తరంతో పాటు భవిష్యత్తు తరాలను కూడా మరింత ఉద్ధృతంగా ప్రభావితం చేస్తుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు! ఇటు స్వదేశీయులేగాక, అటు విదేశీయుల్లో కూడా అనేకులు స్వామి వివేకానంద వేదాంత వాగ్మందాకినీ పావన జలాలలో మునకలేసి మితిమీరిన తమ భౌతికవాద బురదను కడిగేసుకొని నిర్మలులయ్యారు. స్వామీజీ అమోఘమైన వ్యక్తిత్వం మాక్స్‌ముల్లర్, టాల్‌స్టాయ్, విలియమ్ జేమ్స్ తదితర పాశ్చాత్య ప్రముఖుల నెందరినో ఎంతగానో ఆకట్టుకుంది. "భారతదేశంలోనూ, అమెరికాలోనూ ఆయన వ్యక్తిత్వదీవికి తలవంచకుండా ఎవరూ ఆయనను సమీపించేవారు కారు" అని రోమారోలా ఉగ్గడించారు.

స్వామి వివేకానంద ఉద్దేశంలో వ్యక్తిత్వానికి అర్థం అంగబలమో, అర్థబలమో, లేక అధికార బలమో కాదు. ప్రతి ఒక్కరిలో సహజ సిద్ధంగా ఆవిష్కృతమై ఉండే ఆత్మబలం ఒక్కటే అసలైన వ్యక్తిత్వానికి విశిష్టతను చేకూరుస్తుందని ఆయన విశ్వసించారు. ఆ విశ్వాసమే ఆయనను విశ్వవేదికపై విలక్షణ వక్తగా నిలబెట్టింది.

స్వామి వివేకానంద జీవిత కాలం కేవలం ముప్పై తొమ్మిదిన్నరేండ్లు. మొదటి ముప్పయ్యేళ్ళ వరకు ఆయన ఎవరన్నది కొందరికే తెలుసు. తక్కిన తొమ్మిదిన్నరేండ్లలో ఆయన విశ్వజనీన వక్త స్థాయికి ఎదిగారు.

"మనిషై పుట్టినందుకు ఏదో ఒక కార్యాన్ని సాధించాలి. అలా కాని పక్షంలో ఉత్కృష్టమైన మానవ జన్మను పొంది ప్రయోజనం లేదు. కాబట్టి మనిషై పుట్టిన ప్రతి ఒక్కరూ ఏదో ఒక లక్ష్యాన్ని ఎన్నుకోవాలి. దాని కోసమే జీవించాలి, దాని

"కోసమే పరిశ్రమించాలి; అవసరమైతే దాని కోసమే మరణించాలి" అన్నది వివేకానంద ప్రతిపాదన. ఇలాంటి ఉన్నత ప్రమాణాల నేపథ్యంలో జీవించబట్టే ఆయన అతి తక్కువ కాలంలో ఉన్నత శిఖరాలను అధిరోహించగలిగారు.

అజ్ఞానాంధకారంలో చిక్కుకుని అలమటిస్తున్న యావత్ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టి, అమేయమైన తన జ్ఞాన సంపదతో జ్ఞానకాముకుల నెందరినో ఆకర్షించి జగద్గురు స్థానాన్ని అలంకరించిన భారతజాతి, దురదృష్టవశాత్తూ పరుల దురాక్రమణలకు, దురాగతాలకు లోనై, వాళ్ళ స్వార్థపూరిత



దుష్టపాలనలో మగ్గుతూ, తిండి లేక, గుడ్డ లేక, గూడు లేక నిస్తేజస్కమై జీవచ్ఛవంలా పడి ఉండటాన్ని చూసి భరించలేక స్వామీజీ "నా దేశంలో ఒక్క కుక్క కూడా ఆకలితో చావడాన్ని నేను సహించను. ఆకలితో అలమటిస్తున్నవాళ్ళ ఆకలి తీర్చడమే నా లక్ష్యం. అదే నా మతం" అని మహావేశపూరితులై ఉద్ఘాటించారు.

భరతమాత సంతానమంతా భౌతిక, మానసిక, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, మత, రాజకీయ, విద్య, వైద్య, వైజ్ఞానిక, ఆధ్యాత్మిక తదితరమైన అన్ని రంగాల్లో సమాన ప్రతిపత్తిని కలిగి సుఖశాంతులతో వర్ధిల్లాలని స్వామీజీ ఆకాంక్షించారు. "నా సోదర భారతీయుల అభ్యుదయ- శ్రేయస్సుల కోసం ఆజన్మాంతం కృషిచేస్తాను. అవసరమైతే అందుకోసం ఎన్ని జన్మలనైనా ఆహ్వానిస్తాను; ఎంతటి నరకాన్నైనా ఆస్వాదిస్తాను" అని స్వామీజీ సహజ గంభీరవదనులై పలికారు. అంతేకాక, "పరుల కోసం జీవించేవాళ్ళే నిజమైన మనుషులు; తక్కినవాళ్ళంతా నడిచే శవాలు" అని పేర్కొని, తమ జీవితాన్ని పరుల బాగు కోసం అంకితమిచ్చి "పరోపకారార్థం ఇదం శరీరం" అన్న వేద ప్రమాణాన్ని సార్థకం చేశారు స్వామీజీ! ఆయనలో పెల్లుబికిన ఇలాంటి సుహృద్భావ పరంపర ఆయన్ను అసాధారణ మానవతావాదిని చేసింది.

మతం పట్ల వివేకానంద అభిమతం విలక్షణమైనది. "ఏ మతమైతే మనిషిని మనీషిని చేసి, మహోన్నత స్థాయికి తీసుకెళుతుందో అదే ఆయన దృష్టిలో నిజమైన మతం. కాలే కడుపులకు మతబోధనలు అక్కర్లేదు; మొదట వాళ్ళ ఆకలి తీర్చి ఆదరించే మతం ఏదైనా సరే అదే తమకు సమ్మతమైన మతమ"ని స్వామీజీ విడమరచి చెప్పారు.

భరతమాతను తమ ఇష్టదేవతలా ధ్యానించిన సమున్నత దేశభక్తులు స్వామి వివేకానంద. భారతదేశ దక్షిణాగ్రాన గల కన్యాకుమారిలో మూడు మహాసముద్రాలు కలిసేచోట, ఎముకలు కొరికే చలిలో, అన్నపానీయాలు సైతం మాని, మాతృదేశ త్రికాలజ్ఞతపై దృష్టి నిలిపి మూడు రోజులు సుదీర్ఘంగా ధ్యానించి సత్యాన్ని కనుగొన్నారు. ఆ సత్యమేమిటంటే – మాతృదేశ గత వైభవం, ప్రస్తుత అధోగతి, భవిష్యత్తులో దాని సమున్నత స్థితి!

ఈ భూమిపై మానవావిర్భావం జరిగి విభిన్న సంస్కృతులు పరిఢవిల్లినది మొదలు నేటి వరకు గల చరిత్రను, దాని పరిణామ దశలను తరచిచూస్తే అందులో మాతృదేశాన్ని ధ్యేయంగా ఎన్నుకుని, అందుకోసం ప్రాణాలను పణంగా పెట్టి ధ్యానించిన వారు స్వామి వివేకానంద ఒక్కరు తప్ప మరొకరు కనిపించరన్నది పలువురి అభిప్రాయం.

ఆ సుదీర్ఘ ధ్యానానంతరం స్వామివారు లేచి నిలబడి ముందున్న సాగరంపై దృష్టి సారించి, "నా హైందవ దీన నారాయణుల కోసం ఈ సముద్రాన్ని దాటి పశ్చిమ ఖండానికి వెళతాను. అక్కడ నా ధీశక్తితో కావలసినంత ధనం సంపాదించి మాతృదేశానికి తిరిగి వచ్చి భారతజాతి పునరుద్ధరణలో నిమగ్న మవుతాను. కాకుంటే ఆ ప్రయత్నంలో ప్రాణాలు ధారపోస్తాను" అని వెలువరించిన ఈ ధీరవాక్కులు మూర్తీభవించిన ఆయన మానవీయ విలువలకు అద్దం పడుతున్నాయి.

వ్యక్తిగత సంస్కరణ ద్వారా నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక విలువలతో మానవ సముదాయం పరిఢవిల్లినప్పుడే ప్రపంచం అన్ని రంగాల్లో సర్వతోముఖాభివృద్ధిని సాధించగలదు. ఆ దిశగా పరిపూర్ణమైన మనుషులను రూపొందించే ఉన్నత నైతిక ప్రమాణాలు వివేకానంద వేదాంత వాఙ్మయంలోనే పుష్కలంగా లభిస్తాయనడం నిర్వివాదాంశం. ❖

నా ధీశక్తితో కావలసినంత ధనం సంపాదించి, మాతృదేశానికి తిరిగి వచ్చి భారతజాతి పునరుద్ధరణలో నిమగ్నమవుతాను. కాకుంటే ఆ ప్రయత్నంలో ప్రాణాలు ధారపోస్తాను. -స్వామి వివేకానంద



వస్తు విజ్ఞానం నుంచి

స్వామీజీ భావాలను చదువుతూ తమ అవగాహనను పంచుకోవడానికి ప్రతి నెలా కలుసుకుంటున్న వినీత్, వికాస్‌లు మళ్ళీ కలుసుకున్నారు.

వినీత్: మిత్రమా! క్షేమమా? ఎప్పుడు నిన్ను కలుస్తానా, ఎప్పుడు నా భావాలను నీతో పంచుకొని వివేకదీప్తిని నాలో ప్రకాశింపజేసు కుంటానా అని నా మనసు తహతహలాడుతోంది.

వికాస్: ఈ క్షణం కోసం నేనూ చాలా ఆసక్తితో ఎదురు చూస్తున్నాను వినీత్! సామాజిక స్పృహ కలిగిన యువతగా సమకాలీన సమాజాన్ని చూస్తూ ఏ విధంగా మన సమస్యలను పరిష్కరించుకోవచ్చు, అందరికీ ఏ విధంగా సుఖశాంతులను ప్రసాదించవచ్చు, అసలు సుఖశాంతుల స్వభావం ఏమిటి? ఎందుకు మనం వాటికి రోజురోజుకూ దూరమవుతున్నాం, మొదటి నుంచి మానవ సమాజాలు ఇలానే ఉన్నాయా? మనిషి అంటే మనోదేహాలేనా? ఇంకా ఏమైనా విశిష్టమైన ఉనికి ఉన్నదా? మనస్సును ఎలా తీర్చిదిద్దుకోవాలి? నేడు ఏ వయస్సులోని వారూ, ఏ వర్గం వారూ శాంతితో ఉన్నట్లు కనిపించడం లేదు. అందరికీ ఏదో ఒక విధమైన అభద్రతా భావం, వెలితి, సమాధానాలు దొరకని ప్రశ్నలు ఉన్నాయి.

వినీత్: శ్రీరామచంద్రుడు 'యోగ వాసిష్ఠం'లో **'అతో అతుచ్ఛమ్ అనాయాసమ్ అనుపాదిగతభ్రమం! కింతత్ స్థితి పదం సాధో యత్ర శోకో న విద్యతే !!** ఐతే తుచ్ఛమైన ఈ ప్రపంచం కాక, ప్రయాస రహితమైన, ఉపాధి విహీనమైన దుఃఖ ఛాయలు కూడా లేని ఆ శాశ్వతానంద స్థితి ఏదో సెలవివ్వమ'ని వసిష్ఠ మహర్షిని అడుగుతాడు. అప్పుడు వసిష్ఠముని మనిషికి దుఃఖం, భయం చిత్త రాక్షసుడు ఉత్పన్నమైన నాటి నుండి మొదలైనాయనీ, మనో పిశాచాన్ని నిర్జించడమే మనిషికున్న ఏకైక కర్తవ్యమనీ బోధిస్తాడు. 'ఓ రామా! ఇదే సర్వ విద్యాసారమని ఎరుగుదువు గాక!' అని కూడా ఆ మహాముని ఉపదేశిస్తాడు.

వికాస్: స్వామీజీ సాహిత్యం అంతా జాగ్రత్తగా పరిశీలిస్తే, ఈ విషయానికి సంబంధించిన వివరణతో కూడుకున్నదే. ఆయన దేశభక్తి గురించి మాట్లాడినా, సత్ప్రవర్తన, శీల సంపద, త్యాగం, పరోపకారం గురించి మాట్లాడినా అంతా మనోనిగ్రహాన్ని సాధించి మానవ జీవన పయనం సుఖవంతమవడానికి అందించిన బోధే! అనాదిగా ప్రవక్తలు, మునులు, మహాపురుషులు ఇదే ఆశయాన్ని తమ మనసులో నింపుకొని మానవాళికి అందించిన సందేశాలే వివిధ మతాలుగా రూపుదిద్దుకున్నాయని నీవెరుగుదువు. ఐతే బలహీనులు... అంటే పూర్తిగా వస్తు ప్రపంచమే ప్రపంచం అనుకొని వ్యక్తి ప్రపంచాన్ని విస్మరించి మనోనిగ్రహాన్ని అసాధ్యం చేసుకున్నవారు మతానుష్ఠానానికి పూనుకున్నప్పుడు కేవలం పైపై ఆచారాలకే పరిమితమై, నిజమైన ధర్మాన్ని విస్మరిస్తారు. మిథ్యాచారులవుతారు. నిజమైన అనుష్ఠానానికి పూనుకోరు. అందుకే కాలానుగుణంగా భగవంతుడు అవతరించి, మట్టి నుంచి ఖనిజాన్ని వేరు చేసినట్లు ప్రధానమైన దానిని ప్రాధాన్యం లేని వాటి నుంచి వేరు చేసి, స్పష్టమైన ధర్మాన్ని మనిషి ముందుంచుతాడు. అలా ఈ కాలానికి నిజమైన వ్యక్తి విజ్ఞానశాస్త్రాన్ని అందించిన యతివరేణ్యుడు స్వామీజీ. నీవేమంటావు?

వినీత్: వ్యక్తి విజ్ఞానశాస్త్రం! బాగుంది. సరే. ఐతే మన చదువులన్నీ వస్తు విజ్ఞానశాస్త్రం చుట్టూ తిరుగుతున్నాయి కదా! మనిషిని ఆనందసాగరపు ఆవలి ఒడ్డుకు తీసుకువెళ్ళే జ్ఞానం స్వామీజీది. దీనికి భిన్నంగా మనిషిని దుఃఖవారధిలోకి ప్రవేశింప చేసేవి మన ప్రస్తుత చదువులు.

వికాస్: మనస్సు అనే తరంగం కోరికలనే ఝంఝూ మారుతాలను ఆసరాగా చేసుకొని ఉవ్వెత్తున ఎగసి పడుతోంది. స్వస్వరూప ఆనంద సాగరాన్ని అల్లకల్లోలం చేస్తోంది. ఈ సాగరం ప్రశాంత సాగరంగా మారాలంటే ముందు కోరికలు నిగ్రహింపబడాలి. దానికి విచక్షణ కావాలి. స్వామీజీ భావాలన్నీ ఇలా వ్యక్తిని సరియైన విచక్షణను పొందే దిశగా ప్రేరేపిస్తాయి.

వినీత్: విచక్షణ అంటే నీ దృష్టిలో నిత్యానిత్య వస్తు విచక్షణేనా?

వికాస్: **'అస్థిరాః సర్వ ఏవే మే సచరాచర చేష్టితాః ! ఆపదాం పతయః పాపా భావ విభవ భూమయః !!** స్థావర జంగమాలలో జీవుల ప్రయత్నాలచే కలిగిన భోగవిషయాలన్నీ అశాశ్వతాలు, ఆపదలకు ఆలవాలాలు, పాప కారణాలు' అని వసిష్ఠగీతలో శ్రీరాముడు, వసిష్ఠమహర్షితో పలుకుతాడు. ఇలాంటి అవగాహనే విచక్షణ.

ప్రస్తుతం మనం ఉన్న ప్రపంచంలో మనుషులకు కొరవడుతున్నదేమంటే తన అసలు ఉనికి మనోదేహాలకు అతీతంగా ఉన్న చైతన్యమన్న భావన. కల్లోలిత మనోతరంగాన్ని అధిగమించి దానికి ఆధారంగా ఉన్న చైతన్య సాగరాన్ని చేరుకోవడమే జీవిత లక్ష్యమని ఎరుగకపోవడం. అలా ఆ పరమానంద సాగరాన్ని చేరుకోవాలంటే మనోతరంగం ఉపశమించాలి. అందుకు ఆ తరంగాన్ని సదా కోరికల ప్రచండ మారుతం నుంచి విడదీసి క్రింద నున్న మహాసాగరంలో లయింపజేయాలి.

వినీత్: కానీ అది అంత సులభంగా సాధ్యమయ్యే విషయమేనా? పైగా, ప్రస్తుత ప్రపంచంలో? అసలు ఎవరికైనా ఈ విషయాలు అర్థమవుతున్నాయా? అందరినీ మనం సరియైన ఎరుకతో ఈ మహాప్రయాణంలో ప్రవేశ పెట్టగలమా? లేదా జీవితంలో అనేకానేక అనుభవాలను గడించిన తర్వాతనే మనిషి ఈ మార్గంలోకి ఎరుకతో ప్రయాణించగలుగుతాడా?

వికాస్: అలా మనిషికి నిజజీవిత ప్రయోజనాన్ని చెప్పి తన సర్వశక్తులను ఒడ్డి ఆనందాబ్ధి ఆవలి ఒడ్డును చేరుకోవడానికి ఉపకరిస్తే అది విద్య. లేకపోతే అవిద్య.

వినీత్: మనిషిని ఆ లక్ష్యం దాకా తీసుకు వెళ్ళలేకపోయినా

కనీసం తన కాళ్ళ మీద తాను నిలబడేలా చేయగలిగినా విద్య ప్రయోజనం కాస్తో కూస్తో నెరవేరినట్లే. కానీ ఈ కనీస ప్రయోజనం కూడా నెరవేరుతున్నట్లు కనపడదం లేదు. చదువుతున్నదానికీ, ఉపాధికీ కూడా సంబంధం లేకుండా పోతోంది. దానితో



వ్యక్తి విజ్ఞానానికి

చూస్తున్నాం కదా – మళ్ళీ ఉద్యోగం కోసం మనం ఎంత కష్టపడాల్సి వస్తోందో! ఎన్ని అగచాట్లు పడుతున్నామో! ఏదో విజ్ఞానం పేరుతో చదువుకుంటున్న దాంట్లో ఎనభై శాతం వాస్తవిక జీవితంలో దేనికీ ఉపయుక్తమవడం లేదు. అన్ని డిగ్రీలతోనూ ఇదే తంతు. పాఠ్య ప్రణాళికను తయారు చేసేటప్పుడు ఇలా ఆలోచించి మనకు వృత్తిపరమైన జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ఎప్పుడూ ఉపయోగపడని విషయాలన్నింటినీ తీసివేస్తే మన మెదళ్ళపై భారం తగ్గుతుంది. మూలసూత్రాలను సరళీకరించి క్లుప్తంగా వివరించి మిగతాదంతా ఆచరణ వినియుక్త జ్ఞానాన్ని మాత్రమే అందిస్తే మనకు ఎంతో సమయం, శక్తి ఆదా అవుతాయి. ఐనా ఎప్పటిదో పాత చింతకాయ పచ్చడి మన చదువుల్లో చాలా ఉంది. అలానే కొత్తగా కనుగొనబడినవని చెప్పి చాలా అనవసరమైన వాటిని చొప్పించడం కూడా జరుగుతోంది.

వికాస్ : నీవన్నట్లు సమాచార సేకరణ ప్రధానంగా మన విద్యా విధానం ఉన్నదన్నది వాస్తవమే. ఐనా నిజంగా విద్య అంటే ప్రపంచాన్ని చదవడంతో మొదలై మనిషి తనను తాను చదువుకోవడంతో పూర్తి అవ్వాలి. ప్రస్తుతం మన విద్యలో ఆలోచనల నియంత్రణ గురించి, భావోద్వేగాలను నిగ్రహించుకోవడం గురించి, అంటే మనిషి తనను తాను అదుపులో పెట్టుకొని సుఖప్రదమైన జీవితాన్ని గడపడానికి ఉపకరించే ప్రక్రియలు కానీ, జ్ఞానం కానీ ఏమీ లేదు. వ్యక్తి సమగ్ర వికాసానికి దోహదపడేది ఏమీ లేదు. వివేకానందుడు లాంటి మహాపురుషులు ఇలాంటి జ్ఞానానికి అగ్రతాంబూలం ఇచ్చారు. వారి దృష్టిలో ఇదే నిజమైన జ్ఞానం. మిగతాదంతా అజ్ఞానం. అందుకనేనేమో స్వామీజీ అంటారు Bring light to the illiterate and bring more light to the educated for the vanities of education of our time are tremendous – నిరక్షరాస్యులకు జ్ఞానాన్ని ఇవ్వండి. విద్యావంతులకు మరింత ఎక్కువ జ్ఞానాన్ని అందివ్వండి. ఎందుకంటే మన ప్రస్తుత విద్యావిధానం (సంస్కారాన్ని అందించలేనిది, వ్యక్తి నిర్మాణానికి దోహదపడనిది. తన కాళ్ళపై తను నిలబడేటట్లు చేయలేనిది. ప్రతి వ్యక్తిలో 'నేను చదువుకున్నవాడిని' అన్న దంభాన్ని పెంచేది) విడంబనార్థం.

వినీత్: స్వామీజీ ఈ వాక్కులు ఇవాళ్టి మన చదువులకు చక్కగా వర్తిస్తాయి. తీవ్ర ప్రయాస, ప్రయత్నం లేకుండా ఉపాధిని సమకూర్చుకునే చదువులు మనకు లభ్యమైతే ఎంత బాగుంటుందో కదా! మన యువ సోదరులు ఉన్న కొద్ది ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ అలసిపోతున్నారు. భవిష్యత్తు గురించి ఒక ప్రశ్న వాళ్ళ ముఖాల్లో సదా ద్యోతకమవుతుంది. అందుకనే పూర్వం కులవృత్తులు ఉండేవి. సమాజంలో ఒక్కొక్క సామాజిక వర్గం ఒక పని చేస్తూ, మిగతా వర్గాలకు సేవ చేస్తూ, పోటీలేని జీవన యానాన్ని సాగించింది. ఇలాంటి జీవన విధానం వల్ల వారికి ఎంతో విరామం దొరికింది. ప్రపంచ రహస్యాలను ఛేదించారు. మనోరహస్యాన్ని ఆవిష్కరించారు. పరమానందానికి రాచబాట వేశారు. నిజానికి మన ప్రాచీన ఆర్యసమాజాన్ని మించిన ఆదర్శ సమాజం లేదనిపిస్తుంది.

వికాస్: వాళ్ళకూ, మనకూ పోలికెక్కడ? మనం ఇంతకు ముందు చర్చించినట్లు వారు ఆధ్యాత్మిక శాస్త్రవేత్తలు. మానవ విజ్ఞానాన్ని సమగ్రంగా ఆవిష్కరించిన మహనీయ మూర్తులు. దేహమే ప్రయోగశాలగా, తపస్సే పరికరంగా, కొన్ని జన్మల కాలంగా గ్రహించి సత్యాన్ని కనుగొన్న ధీర మానవులు. ఉదాత్త హృదయులు. మరణ దుఃఖాన్ని తొలగించుకున్న మహా మహితాత్ములు. కాబట్టి వారికి జీవితం మనలాగా ఇంత సంక్లిష్ట మవలేదు. మనిషిని శాంతికీ, చిరసుఖానికీ దూరంగా తీసుకువెళ్ళే ప్రమాదముందని వారు ఈ విధమైన పట్టణీకరణాన్నీ, పారిశ్రామికీ కరణనూ ఆహ్వానించలేదనుకుంటా. వారు ప్రశాంత జీవితాన్ని కోరుకున్నారు. ప్రకృతితో సామరస్య సహజీవనం చేశారు. దీనికి భిన్నంగా మనం నేర్చుకుంటున్న జ్ఞానం అంతా మనల్ని కోరికలకు బానిసలుగా చేసి అంతః నియంత్రణ దుర్లభమయ్యేట్లు చేస్తున్నది. దానితో రకరకాల మానసిక సమస్యలతో ఆధునిక ప్రపంచం అతలాకుతలం అవుతోంది. విద్యా వ్యవస్థలో పెనుమార్పులు రావాలి. ఆధ్యాత్మిక సంస్కారం చదువులతోనే అందాలి.

వినీత్: అవును, ఇది చాలా ముఖ్యం. ప్రతి వ్యక్తి ప్రతిరోజూ కొంచెంసేపు ధ్యానంలో గడిపేటట్లు చేయాలి. లోకకల్యాణానికై ప్రార్థన చేసేటట్లు చూడాలి. 'పరోపకారార్థ మిదం శరీరం' అన్న భావన నిరంతరం మనస్సులో కదలాడేటట్లు చేయాలి. తద్వారా సర్వలోకైక భావం పెరిగి, ప్రపంచంలో సుస్థిర శాంతి నెలకొంటుంది.

వికాస్: నిజమే వినీత్! చాలా విషయాలు చర్చించాం. మళ్ళీ వచ్చే మాసాంతంలో కలుద్దాం. లోకాస్సమస్తాః సుఖినో భవన్తు. ❖

మీ జీవితాలు కేవలం స్వసుఖ సాధన కోసం, ధనార్జన కోసం కావని తెలుసుకోండి. భగవంతుని పట్ల పరిపూర్ణ విశ్వాసం కలిగివుండండి. అప్పుడే మీరు సరైన మార్గంలో పయనిస్తున్నట్లు! -స్వామి వివేకానంద

సంకల్పశక్తితో

స్వామి వివేకానంద 150వ జయంతి మహోత్సవాలు భారతదేశంలోనే కాక విదేశాల్లో కూడా ఘనంగా జరుగుతున్నాయి. ఆ మహనీయుని పేరిట ఎన్నెన్నో సేవాకార్యక్రమాలు, భారీయెత్తున శోభాయాత్రలు చేపట్టి బ్రహ్మరథం పడుతున్నారు. ఇవన్నీ ఒక రకంగా ప్రాముఖ్యం కలిగినవే! అయితే స్వామి వివేకానంద ఉత్సవాలను పండుగగా చేసుకోవడం ఇంకా విశాలత్వంతో కూడుకొన్నది. 1912లో స్వామి వివేకానంద సోదర సన్న్యాసి స్వామి శారదానంద ఒకసారి బేలూరు మఠంలో జరిగే స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి వచ్చారు.



ఆ ఉత్సవాల్లో పాల్గొన్న యువకులలో కొంతమంది, స్వామి శారదానందతో 'మేము స్వామి వివేకానంద అభిమానులం' అంటూ వారి అభిమానాన్ని చాటుకొన్నారు. వెంటనే స్వామి ప్రత్యుత్తరమిస్తూ 'నాకు అభిమానం అన్న పదానికి అర్థం తెలియడం లేదు. మీకు గల అభిమానం స్వామి చిత్రపటాన్ని పెట్టి పూజించడం వరకు మాత్రమే పరిమితం కాకూడదు. మీకు గల అభిమానాన్ని స్వామీజీ ఆదర్శాలను ఆచరణలో పెట్టడం ద్వారా చూపించాలి' అని అన్నారు.

మహాత్ములు బోధించిన ఆదర్శాలను ఆచరణలో పెట్టాలనుకొన్నప్పుడు మనల్ని వెనక్కు నెట్టేది ఏమిటి? ఆ లోపాలను ఎలా సవరించుకోవాలి? ఉదాహరణకు నైతిక జీవనం గడపడం లాభదాయకం అని తెలిసినప్పటికీ, మనం పాప కర్మలు చేస్తూనే ఉంటాం. చదువుపై అశ్రద్ధ చూపరాదని విద్యార్థికి తెలుసు. కానీ మనస్సును క్రికెట్, అంతర్జాలం నుంచి తప్పించలేడు. మనస్సు ఒకింత హెచ్చరిస్తున్నప్పటికీ 'చేవలేని తరగతులకై ఇంతటి చక్కని కార్యక్రమాలు వదులుకోవాలా?' అని దాన్ని మందలిస్తాడు. కొందరు ఆధ్యాత్మిక సాధకులు ప్రతీ రోజు ఉదయం లేచి ధ్యానం చేయాలనుకొంటారు; కానీ చేయలేక పోతున్నామని ఆవేదన చెందుతారు. మరి వీటికి సమాధానంగా స్వామి వివేకానంద ఇలా అంటారు. 'Every successful man must have behind him somewhere tremendous integrity, tremendous sincerity and this is cause of his success in life' - **పట్టినదంతా బంగారమవుతున్న ప్రతీ వ్యక్తిలోనూ ఎక్కడో సంకల్ప ఐక్యత, గంభీర శ్రద్ధ, విశ్వాసం ఉండి తీరాలి. ఇవే అతడి అద్భుత విజయానికి హేతువులు.** మనిషి తాను అనుకొన్న నిర్ధారిత వస్తువు కోసం మనస్సులో చేసే గాఢమైన ఆలోచననే సంకల్పం అంటారు. ఆ సంకల్పం కార్యరూపంలో పెట్టడానికి సకారాత్మక, సృజనాత్మక మానసిక శక్తిగా రూపాంతరం చెందడాన్నే 'సంకల్పశక్తి' అంటారు. ఆ ఆలోచనను కార్యరూపంలో పెట్టడానికి వ్యక్తి ఎంత తీవ్రంగా ఆలోచిస్తే అంత సంకల్పశక్తి వృద్ధి చెంది తనపై తనకు విశ్వాసాన్ని కలిగిస్తుంది. శ్రద్ధను పెంచుతుంది.

అయితే సంకల్పశక్తి ఏ విధంగా వృద్ధి చెందుతుంది? దానికి సమాధానంగా స్వామి వివేకానంద **'ఒక ఆదర్శాన్ని స్వీకరించండి. దాన్ని మీ జీవిత ధ్యేయంగా చేసుకోండి. దానినే మననం చేయండి, కలగనండి, ఆ ఆదర్శంలోనే లీనమై జీవించండి. మీ మెదడు, కండరాలు, నరాలు, శరీరంలోని ప్రతీ ఒక్క భాగం ఆ ఆదర్శంతో పూర్తిగా తాదాత్మ్యం కావాలి. తక్కిన అన్ని భావాలనూ తోసిపుచ్చండి'** అంటారు. ఎంచుకొన్న ఆదర్శాన్ని ధ్యేయంగా తీసుకొన్న నాడు మాటలలో నిజాయతీ, చేతలలో నిబద్ధత, నడవడిలో శ్రేష్ఠత ప్రదర్శిస్తాం. అప్పుడే సంకల్పశక్తి వృద్ధి చెందుతుంది. అప్పుడే జీవితమనే పుస్తకాన్ని నిర్లక్ష్యమనే పుటలతో నింపకుండా నిబద్ధతతో, అత్యున్నత ఆదర్శాలతో నింపగలుగుతాం. ప్రస్తుత సమకాలీన సమాజానికి, సంక్షోభంలో ఉన్న దేశపరిస్థితులను మెరుగు పరచడానికి ప్రతీ వ్యక్తీ మూడు ఆశయాలను సంకల్పించాలి. అవి:

1. నన్ను నేను ఎలా మలచుకోవాలి

2. నాయకులను ఎన్నుకోవడంలో నా పాత్ర

3. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో నా బాధ్యత.

ఈ మూడింటినే జీవితధ్యేయంగా ఎంచుకోవాలి. సంకల్పశక్తితో ఈ ఆశయాలను ఆచరణలోకి తీసుకువచ్చి నవభారత నిర్మాణానికి నడుం బిగించాలి. లేకపోతే ప్రతీ పౌరుడు తనకూ, తన దేశానికీ హాని తలపెట్టినట్లే. భరతమాత కడుపున చెడపుట్టినట్లే!

1. నన్ను నేను ఎలా మలచుకోవాలి: ప్రతి ఒక్కరూ కేవలం చదువు సంధ్యలు ప్రారంభించి ఏదో ఒక లక్ష్యం కోసం పరుగుపెట్టడమే కాకుండా తనను తాను సంస్కరించుకొనే ప్రయత్నం చేయాలి. దానికి చిన్నతనం నుండి సానుకూలమైన, ఉత్సాహకరమైన, బలప్రదమైన, ఆశాజనకమైన ఆలోచనలు కలిగి ఉండాలి. **'చదువుకోవడమే లక్ష్యం; పరీక్షల్లో ఉత్తీర్ణులు కావడమే ధ్యేయంగా ఉన్నంతమాత్రాన వ్యక్తిని విద్యావంతునిగా పరిగణించ కూడదు. శక్తిమంతమైన సౌశీల్యాన్నీ, లోకోపకారం చేసే బుద్ధినీ, సింహ సదృశమైన ధైర్యాన్నీ నింపగల విద్యను నేర్చుకొన్ననాడే వ్యక్తి సంస్కార వంతుడు కాగలడు'** అంటారు స్వామి వివేకానంద. ఆ దిశగా ప్రతీ ఒక్కరూ ప్రయత్నం చేయాలి. తల్లితండ్రులూ ఈ విధంగానే వారి పిల్లలను ప్రోత్సహించాలి.

ఒకసారి చాణక్యుడు తన విద్యార్థులతో ముళ్ళతో కూడిన చిన్న చిన్న మొక్కలున్న మార్గంలో పాదరక్షలు లేకుండా నడచిపోతున్నాడు. మార్గమధ్యంలో విద్యార్థి 'గురువర్యా! మీ కాలికి ముళ్ళు గుచ్చుకొని రక్తం కారుతోంది. వీటిని తొలగించకపోతే ఇతరులకు కూడా హాని కలిగిస్తాయి' అన్నాడు. విద్యార్థులలో ఒకరు వెంటనే స్పందించి మార్గమధ్యంలో మొక్కలకున్న ముళ్ళను కత్తిరించి రహదారికి ఇరువైపులా పారేశాడు. దీన్ని గమనించి చాణక్యుడు తన సంచీ నుంచి

సాధిద్దాం!

– స్వామి రఘునాయకానంద

తేనె సీసాను తీసి తేనెను మొక్కల అడుగు భాగాన చల్లాడు. శిష్యులు ఆశ్చర్యంతో గమనించారు.

చాణక్యుడు తన శిష్యులకు ఈ విధంగా వివరించాడు. 'ముళ్ళను కత్తిరించిన మూలంగా కలిగే ఫలితం కొన్ని రోజులే ఉంటుంది. కారణం కొన్ని రోజులలో మొక్కకు మళ్ళీ ముళ్ళు వస్తాయి. ఆ మొక్క వేళ్ళే కదా ఆ ముళ్ళు పెరగడానికి కారణం. అందుచేత వాటిని నాశనం చేయాలి. చల్లిన తేనెకు చీమలు చేరి అవి వేళ్ళను తినేస్తాయి. అప్పుడు వేళ్ళు లేవు... ముళ్ళు లేవు. అదే విధంగా దేశాన్ని సుభిక్షంగా చూడాలంటే దాని అభివృద్ధికి ప్రతిబంధకాలైన మూలాలను వెదకి, నాశనం చేసే ప్రయత్నం చేయాలి. ఆ మూలాలు మనిషిలో ఉన్న అనైతికత. ముళ్ళు రాకుండా ఏ విధంగా అయితే వేళ్ళను నాశనం చేశామో, అదే విధంగా దేశాన్ని సుపరిపాలన దిశగా నడిపించాలంటే మనిషి అనైతికతను విడిచి నైతిక మార్గంలో పయనించాలి. స్వార్థాన్ని త్యజించి సామాజిక స్పృహను కలిగివుండాలి.'

2. నాయకులను ఎన్నుకోవడంలో నా పాత్ర: మానవజాతిని నడిపించిన మహానాయకుల విషయానికి వస్తే నాయకత్వం వహించడంలో గణనకు వచ్చేది వారి వ్యక్తిత్వ విశేషమే తప్ప మరేదీ కాదు అని తెలుస్తుంది. **'చరిత్రలో చిరస్మరణీయులుగా నిలిచిన మహనీయులు తాము రాసిన పుస్తకాలు, ఇచ్చిన ఉపన్యాసాల ద్వారా మహానాయకులు కాలేదు. కేవలం వ్యక్తిత్వ విశేషం వల్లే వారికి అది సాధ్యమైంది'** అంటారు స్వామి వివేకానంద. మూడింట రెండు వంతులు వ్యక్తిత్వం – మిగతా ఒక వంతు ప్రతిభా, వాక్ వైఖరులు. మనిషి వ్యక్తిత్వ విశేషమే ప్రధానమైనది. దాన్ని బట్టే చేతలుంటాయి. కారణాన్ని బట్టే కార్యం ఎప్పుడూ నడుస్తుంది. నాయకుడనేవాడు నైతికవర్తన కలిగి, తన సహచరుల మీద ప్రభావాన్ని చూపగల ప్రతిభావంతుడై ఉండాలి. స్వాతంత్ర్య ఉద్యమంలో జాతి యావత్తునూ ఒక్క త్రాటి మీద నడిపించిన మహాత్మా గాంధీలో ఉన్న లక్షణం కేవలం పవిత్రత. అది తప్ప ఇంకేమీ లేవు. సర్వమత మహాసభలో చిరస్మరణీయ ప్రసంగం ద్వారా భారతజాతిలో ఉత్సాహాన్ని నింపిన స్వామి వివేకానందలో ఉన్నది – వ్యక్తిత్వ విశేష ప్రభావమే తప్ప మరేదీ కాదు.

అందుచేత నాయకులుగా తయారుకావాలనుకొన్న ప్రతీ ఒక్కరూ వ్యక్తిత్వ విశేషగుణాన్ని సంతరించుకోవాలి. బాధ్యత గల ప్రతీ పౌరుడు ఈ విషయంలో శ్రద్ధ వహించాలి. ప్రజల బాగు కన్నా తన మేలే ముందనుకొనే ప్రతీ నాయకుడూ సమాజానికి పై కథలో వివరించిన ముల్లే; అధికారాన్ని దుర్వినియోగం చేసి ప్రజలను ఇబ్బందికి గురిచేసే నాయకుడు సమాజానికి ముల్లే; ప్రజాధనాన్ని తన స్వప్రయోజనాలకు ఉపయోగించే నాయకుడు సమాజానికి ముల్లే. కాబట్టి ప్రజాప్రతినిధుల ఎన్నికలో ప్రతీ పౌరుడు వారి పాత్రను గుర్తించాలి.

3. దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంలో నా బాధ్యత: నవీన భారత నిర్మాణాన్ని కేవలం యువత మాత్రమే సాధించగలదు. వారే త్యాగానికి సంసిద్ధులు కాగలరు. పూర్వీకులనో, వారినో, వీరినో తప్పుబట్టడం మాని లోటుపాట్లను గుర్తించి, వాటిని సరిదిద్దుకోవాలి. దేశంలో మీరు నివసిస్తున్నారు, ప్రజా పరిపాలనలో భాగస్వాములు అవుతున్నారు. యువత అయిన మీ ద్వారానే దేశనిర్మాణం జరుగుతుంది. దాన్ని సరిగా నిర్మించకపోతే భావితరాలకు జరిగే నష్టాన్ని ఊహించండి. అందుచేత స్వామి వివేకానంద దేశ భవిష్యత్తులో యువకుల పాత్రను గుర్తు చేస్తూ ఇలా అన్నారు. My hope of the future lies in the youths of character, intelligent, renouncing all for the service of others, and obedient - who can sacrifice their lives in working out my ideas and thereby do good to themselves and the country at large. **' దేశ భవిష్యత్తుకై నా ఆశలన్నీ సౌశీల్యవంతులైన యువకుల మీదే ఉన్నాయి. వారు బుద్ధికుశలురు, తమ సర్వస్వాన్ని ఇతరుల సేవకై త్యాగం చేసే వాళ్ళయి ఉండాలి. నా ఉద్దేశాలను కార్యరూపంలోకి తేవడానికి తమ జీవితాలను త్యాగం చేసి, దాని వల్ల తమకూ, దేశానికీ సౌభాగ్యం చేకూర్చేది ఈ యువకులే!'** ❖

మీరందరూ వీరులుకండి. పర్వత స్థైర్యంతో నిలబడండి. జాతీయ రక్తనాళాలలో మహోన్నత శక్తిని ఉద్దీపింపజేయగల నూతన విద్యుత్తేజమే భారతదేశానికి ఇప్పుడు కావలసి ఉన్నది. -స్వామి వివేకానంద

మాటలు


స్వామి రామతీర్థ ఒకసారి అమెరికాలో ఆధ్యాత్మిక ప్రసంగాల నిమిత్తం పర్యటిస్తూ ఉన్నారు. అక్కడ ఓ సభలో వేదాంత ఉపన్యాసం ఇచ్చిన తరువాత స్థానికులు వారితో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ తమ సందేహాలు తీర్చుకుంటున్నారు. అందులో ఓ విదేశీ భక్తుడు, స్వామి రామతీర్థతో 'స్వామీ! మీ భారతదేశంలో ఇన్ని శాస్త్రాలు, ఇంత జ్ఞానం ఉండి కూడా, మీ వాళ్ళు ఎందుకు అంత దైన్యంలో ఉన్నారు?' అని ప్రశ్నించారట!

అప్పుడు స్వామీజీ 'మా భారతీయులు సాధారణంగా శాస్త్రాలు, నీతులు వల్లిస్తారే కాని ఆచరణలో పెట్టరు. మీరు వాటిని ఆచరిస్తారు. ఈ మీ అభ్యుదయానికి, మా వారి హైన్యానికి ఇదే కారణం' అన్నారట సరదాగా!

ఎన్నో ఏళ్ళ క్రితం స్వామి రామతీర్థ యాదృచ్ఛికంగా వెలిబుచ్చిన ఆ అభిప్రాయం ఈనాడు కూడా మన విషయంలో చాలా సందర్భాల్లో నిజమేననిపిస్తోంది. మనం చెప్పే మాటలకూ, ఉపదేశించే ధర్మాలకూ, మన ప్రవర్తనకూ పొంతనే ఉండడం లేదు. ఆదర్శాలు, ఆశయాలు కోటలు దాటుతూ ఉంటాయి; కానీ ఆచరణ మాత్రం అడుగు తీసి అడుగు కూడా ముందుకు వేయదు. అందుకే, నేడు చాలామంది మహామహులనుకుంటున్న వారి ప్రసంగాలు, ప్రవచనాలు, పుస్తకాలు కూడా కాలపరీక్షకు నిలబడలేకపోతున్నాయి. వారి భావాలకూ, జీవితానికీ సారూప్యం కొరవడడమే అందుకు ప్రధాన కారణం! ఇలా మన మాటలకు ప్రామాణికత చేతలేనన్న విషయాన్ని విస్మరించి, వ్యవహరించినంత కాలం మన ఉపదేశాలు, ఊకలా గాలిలో కలిసిపోతాయే కానీ గుండెలను తాకలేవు.

చెప్పేదొకటి...చేసేదొకటి!: నేడు చాలామంది తల్లితండ్రులు, ఉపాధ్యాయులు, గురువులు, నాయకులు తదితర పెద్దలు తమ మాటకు ఎవరూ విలువనివ్వడం లేదని ఉద్రేకపడిపోవడం సర్వసాధారణమైంది. కానీ తమ అభిప్రాయాలనూ, ఆలోచనలనూ ఎదుటివారు ఎందుకు ఆదరించకపోతున్నారో ఆత్మపరిశీలన చేసుకోవడం లేదు. చెప్పడంలో చూపుతున్న శ్రద్ధ, ఆసక్తి, ఆతురత చేతల్లో మచ్చుకైనా కనిపించడం లేదు. అందుకే పెద్దలనుకుంటున్నవారి మాటలన్నీ కంఠశోషంగానే మిగిలిపోతున్నాయి. 'వ్యక్తి బాహ్యస్వరూపం, వక్తృత్వపటిమ, వాగాడంబరం చూపే ప్రభావం తాత్కాలికమే; బోధించేవారి వ్యక్తిత్వమే వినేవారిపై, కాలంపై చెరగని ముద్రను వేస్తుంది' అంటారు స్వామి వివేకానంద. కొందరి పేరు పెద్దగా ప్రచారంలో లేకపోయినా, వారు సభికులను తమ గంభీరస్వరంతో సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తలేకపోయినా, వారి జీవితం, నడవడికే కొన్ని తరాల పాటు కరదీపికగా నలుగురికీ దారి చూపిస్తుంది. అలాంటి వారు ఈ ప్రపంచం దృష్టిలో ప్రముఖులు కాకపోవచ్చు. కానీ వారి ప్రాభవం సూర్యోదయంలా ప్రవర్ధమానమవుతుంది. ప్రవక్తలుగా పదుగురిలో పేరుప్రఖ్యాతులు ఆశించేవారు తమకు తాము అద్దాలమేడ కట్టుకుంటున్నామని తెలుసుకోవాలి. ఆ మేడలోని తమను ప్రపంచం ఎప్పటికప్పుడు పారదర్శకంగా గమనిస్తూనే ఉంటుందని గుర్తించాలి. మనం చెప్పేదొకటి, చేసేదొకటి అయినప్పుడు ఎప్పుడో ఒకప్పుడు నవ్వులపాలు కాకతప్పదని తెలుసుకోవాలి. నేడు సమాజంలో అలా అప్రతిష్ఠపాలవుతున్న వారు ఎందరో ఉన్నారు.

జీవితమే సందేశం: మంచి మంచి మాటలతో, ఉద్రూతలూగించే ఉపన్యాసాలతో ఎదుటివారిని మభ్యపెట్టాలని



అనుకోవడం మన అవివేకమే అవుతుంది. పంజరంలో చిలుకల్లా అక్కడివి, ఇక్కడివి నాలుగు పోగేసి, మాటలు వల్లిస్తూ, అప్పటికి ఏదో పబ్బం గడుపుకోవచ్చు. కానీ మనస్సు, మాట ఒక్కటైనప్పుడే మన పలుకుకు పటుత్వం! ఇంట్లో పిల్లలైనా, కార్యాలయంలో మన కింద పనిచేసే వారైనా మనమిచ్చే ఆదేశాల కన్నా, మన ఆచరణనే ఎక్కువ అనుసరిస్తారని మరచిపోకూడదు. నిస్సహాయ స్థితిలో మన ముందు వారు తలలు ఊపినా, తాత్కాలికంగా మనం చెప్పినట్లే చేసి చూపినా, అంతరంగంలో మాత్రం విశ్వసనీయత కనిపించదు; మన ప్రభావం వాళ్ళపై పనిచేయదు. మహాత్మాగాంధీ ఏ ఉపన్యాసాలతో ప్రజల్ని రంజింపచేశారు? ఎన్ని పుస్తకాలు రాసి జనంలోకి విడుదల చేశారు? కేవలం వారి జీవితమే సందేశమైంది. అందుకే వారి మౌనాన్ని కూడా లోకం ఓ పాఠంగా స్వీకరించింది. వారిని ప్రత్యక్షంగా చూడకపోయినా యావత్ భారతప్రజలంతా ఆయన మాటను శిరసా వహించారు. ఆయన నిలబడమంటే నిలబడ్డారు; కదలమంటే కదిలారు. అదీ వ్యక్తిత్వానికి ఉన్న మాహాత్మ్యం. అందుకే మన హితోపదేశం...

మనస్యన్యద్ వచస్యన్యత్ కర్మణ్యన్య ద్దురాత్మనామ్ ।
మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్ ॥

చేతలు

– బి. సైదులు

'దురాత్ములలో మనస్సుది ఒక దారి, మాటది ఇంకొక దారి, చేతది మరొక దారైతే; మహాత్ములలో మనో వాక్కాయ కర్మలన్నింటిదీ ఒకటే మార్గం'అని విస్పష్టం చేస్తోంది. ఎప్పుడు కూడా మన ప్రబోధాలతో కన్నా ప్రవర్తనతోనే ఎదుటివారిని ప్రభావితులను చేసేందుకు ప్రయత్నించాలి.

దాచాలంటే దాగవు: ఇంగువను ఎన్ని వస్త్రాల మాటున దాచినా దాని వాసనే తన ఉనికిని చాటి చెబుతుంది. అదే విధంగా మన నడతలో లొసుగులు పెట్టుకొని, ఎన్ని నీతులు వల్లించినా ఏనాటికైనా నిజరూపం బయటపడుతుంది. అపసవ్య మార్గాల్లో పడి, ప్రసార, ప్రచార సాధనాలను పట్టుకొని కొందరు అనతికాలంలోనే ధార్మికవేత్తలుగా కూడా చలామణి అవుతూ ఉంటారు. కానీ వాక్శుద్ధి కొరవడిన జీవనశైలి కొన్నాళ్ళకు వారికి మాయనిమచ్చగా మిగిలిపోతుంది; అసలు రంగేమిటో తేల్చేస్తుంది. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస 'గొప్ప గొప్ప మాటలు మాట్లాడే పండితులు, మేధావులు చాలా మందే ఉంటారు. వారిలో ఎక్కువమందివి వట్టి మాటలే. గద్దలు, రాబందులు ఎంతో ఎత్తులో ఎగురుతూ ఉంటాయి; కానీ వాటి దృష్టంతా నేలపై పడి ఉన్న పీనుగుల పైనే ఉంటుంది. ఆచరించకుండా కేవలం మాటలకే పరిమితమై, నీచంగా, హీనంగా ప్రవర్తించేవారు ఆ గద్దలు, రాబందుల్లాంటి వారే!' అంటారు. ఉదాహరణకు స్వర్ణ సింహాసనాలపై కూర్చొని వేదాంతం, వైరాగ్యం గురించి మాట్లాడే ఆధ్యాత్మికగురువు మాటలపై ఎవరికి మాత్రం గురి కుదురుతుంది. ప్రసంగీకులే కాదు, సాహితీవేత్తలు, వ్యక్తిత్వ వికాస వ్యాసాలు, పుస్తకాల రచయితలు కూడా ఈ సత్యాన్ని గుర్తించాలి. రచయిత అంతరాత్మ ధరించే విరాట్ స్వరూపమే రచన. అతని బతుకు వేరు, రచన వేరు అయితే అనిర్వచనీయమైన అపశ్రుతి ఏదో ఆ మధ్యలో వినిపిస్తుంది.



ద్వంద్వ ప్రమాణాలు ప్రమాదకరం: బాహ్యప్రపంచంలోనే కాదు వ్యక్తిగత జీవితంలో కూడా ద్వంద్వ ప్రమాణాలు (double standards) మన హుందాతనాన్ని దెబ్బతీస్తాయి. చాలామందిలో నమ్మినదాన్ని ఆచరించే స్థైర్యం, నిబద్ధతలు కొరవడుతూ ఉంటాయి. గతంలో మనిషి మాటకూ, ప్రవర్తనకూ ఓ ప్రామాణికత ఉండేది. కానీ నేడు రోజుకో రూపు దాల్చడం సర్వసాధారణమైపోయింది. పరిస్థితుల ప్రభావానికి ఎదురొడ్డి, దృఢమనస్కులుగా, స్థిరచిత్తులుగా నిలబడేందుకు మనం ప్రయత్నించడం లేదు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా కొన్ని విలువలకు కట్టుబడి ఉండడాన్ని జీవితంలో భాగంగా చేసుకోవాలి. కానీ మనలో చాలామంది అవసరాలకు అనుగుణంగా తమ విలువలనూ, ధర్మాలనూ మార్చుకుంటూ ఉంటారు. అందుకే ప్రముఖ భాషావేత్త, సాహితీ సద్విమర్శకులు దివంగత బూదరాజు రాధాకృష్ణ గారు 'మన దుఃస్థితికి బీజం ద్వంద్వ ప్రమాణాల్లో ఉంది. మనం చెప్పే ధర్మాలకూ, ఆచరించే పనులకూ పొంతన ఉండదు. ఈ రెండూ భిన్న ధ్రువాలను చూపిస్తూ ఉంటాయి' అని అనేవారు. ఫలితంగానే మానవ సంబంధాల్లో అపనమ్మకాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక వ్యక్తిని, మరో వ్యక్తి పూర్తిగా విశ్వసించే పరిస్థితి లేని ప్రమాదకరమైన కూడలిలో నేడు మనిషి నిలబడ్డాడు.

మంచినే తీసుకుందాం: అయితే శ్రోతలుగా, పాఠకులుగా స్ఫూర్తిమంతమైన విషయాలను ఆకళింపు చేసుకోవాలనేటప్పుడు మాత్రం మనం వక్తల, రచయితల, గురువుల వ్యక్తిగత విషయాలను విశ్లేషించేందుకు ప్రయత్నించకూడదు. వారిని అతి దగ్గర నుంచి చూడాలన్న అనవసర ప్రయాసలు పడకూడదు. వారు చెప్పే మాటల్లో మంచి ఉన్నప్పుడు మనస్ఫూర్తిగా స్వీకరించాలి. వాటితో మన జీవితాల్ని ఉద్ధరించుకోవాలి. రంధ్రాన్వేషణ చేసుకుంటూ పోతే, మన అంచనాలకు తగ్గట్లుగా ఎవరూ ఉండరు. అందుకే వ్యక్తి కన్నా వారి విలువైన మాటల్నే మన మనస్సులోకి తీసుకోవాలి. అందుకే రామకృష్ణ సంఘం వరిష్ఠ సాధువులు స్వామి హర్షానంద, 'The bee collects honey even from the neem flowers' అంటారు. నిజమే! వేపపూలు చేదుగా ఉంటాయని తుమ్మెద దానిలోని మాధుర్యాన్ని గ్రోలకుండా ఉండదు కదా! అలా చేదుపూల నుంచి కూడా తీపిని తేనెటీగ సేకరించినట్లు, ఎంత అయోగ్యుల నుంచైనా ఆచరణీయ అంశాలు ఉంటే ఎలాంటి భేషజాలూ లేకుండా స్వీకరించాలి. వారి మాటల్ని మన ఉన్నతికి సోపానాలుగా ఉపయోగించుకోవాలి. ❖

మాటలు తగ్గించి, హృదయాలను తెరచి ఉంచండి. భారతదేశ విముక్తికి మార్గాన్ని ఆలోచించండి. ఈ భారమంతా మన మీదనే ఉన్నదని ప్రతి ఒక్కరం తలచెదంగాక! -స్వామి వివేకానంద



కథే స్ఫూర్తిగా...

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

నా కారు చెడిపోయినప్పుడు బాగు చేయించుకునేందుకు బెంగుళూరులో మా ఇంటి దగ్గరలోని గ్యారేజీకి వెళ్ళేదాన్ని. ముఖ్యంగా వారాంతమైన శనివారం సాయంత్రం కారును తీసుకెళ్ళి అక్కడే కూర్చొని తీరిగ్గా మరమ్మతులు చేయించుకునేదాన్ని. గ్యారేజీలో రాము, గోపాల్ అనే అన్నదమ్ములు పనిచేస్తూ ఉండేవాళ్ళు. వయస్సు దాదాపు పద్నాలుగేళ్ళు ఉంటుంది. ఇద్దరూ చాలా ఉత్సాహంగా ఉండేవారు. కొద్దిరోజుల్లోనే నాకు వాళ్ళతో స్నేహం కుదిరింది. వాళ్ళకు తండ్రి లేడు; తల్లి ఊళ్ళో కూలీపని చేస్తుంది. వీళ్ళు ఇక్కడ వాళ్ళ మావయ్యతో కలసి ఉంటున్నారు. పేదరికం వల్ల నాలుగో తరగతి వరకే చదివి, ఆపైన చదువు ఆపేసి, గ్యారేజీలో పనిచేస్తూ ఉన్నారు.

వాళ్ళ పరిస్థితి చూసి, అప్పుడప్పుడు పాతచొక్కాలు, చిరుతిళ్ళు తీసుకుపోయేదాన్ని. వాళ్ళకవే పట్టువస్త్రాలు, పంచభక్ష్య పరమాన్నాలు. రాత్రిళ్ళు చదువుకుంటారని కథల పుస్తకాలు ఇచ్చేదాన్ని. 'మేడమ్! మాకు పుస్తకాలు చదివే అలవాటు లేదు. పైగా మేము ఉదయం ఎనిమిదింటికి వస్తే రాత్రి పదింటికి గాని ఇంటికి వెళ్ళడం కుదరదు. మీరే కథలు చెప్పండి' అని బతిమాలారు. వాళ్ళ ఉత్సాహం చూసి నాకు ముచ్చటేసింది. అందుకే వాళ్ళు కారు సర్వీసు చేస్తుంటే, నాకు వచ్చిన కథలు చెబుతూ ఉండేదాన్ని. వాళ్ళిద్దరినీ చూసినప్పుడల్లా, ఇంట్లో సాయంత్రం కాగానే నేను చెప్పే కథల కోసం ఎదురుచూసే నా ఇద్దరు పిల్లలే గుర్తొచ్చేవారు. అలా కారు పని లేకపోయినా, శనివారం వెళ్ళి వాళ్ళకు కథలు చెప్పడం అలవాటైపోయింది. రాము,గోపాల్ ఎంతో శ్రద్ధగా కథలు వినేవాళ్ళు. అలా కొన్ని నెలలు గడిచాయి. తరువాత నేను, పని ఒత్తిళ్ళ వల్ల ఆ గ్యారేజీకి వెళ్ళలేకపోయాను. గ్యారేజీకి డ్రైవర్‌ను పంపించేదాన్ని.

పదేళ్ళు కాలప్రవాహంలో కలసిపోయాయి. ఒకరోజు మా డ్రైవర్ వచ్చి 'కారు గ్యారేజీ యజమాని మిమ్మల్ని గుర్తుచేశాడు మేడమ్' అన్నాడు. కొత్తగా గ్యారేజీ పెట్టుకున్న యువకుడు నాకు ఎవరూ తెలియదే!' అన్నాను. మరోసారి కూడా ఆ యువకుడు నన్ను గుర్తుచేశాడని డ్రైవర్ చెప్పాడు. మరునాడు ఆ గ్యారేజీకి వెళ్ళాను. నేను లోపలికి వెళ్ళగానే, ఓ యువకుడు గౌరవంతో నన్ను ఆహ్వానించి 'మేడమ్! నేను రామూని. ఆ రోజుల్లో మీరు చేసిన సాయానికి, ఋణం తీర్చుకోలేను' అన్నాడు. అప్పుడు నాకు అతడెవరో గుర్తొచ్చింది. 'నేనేం చేశాను రాము! కొన్ని పాతచొక్కాలు ఇచ్చాను. చిరుతిళ్ళు పెట్టాను; ఏవో కథలు చెప్పాను. అంతే కదా!' అన్నాను.

'మేడమ్! మీ కథలు నా జీవితాన్నెలా మార్చాయో మీకు తెలీదు. అప్పట్లో మాకు అన్నీ కష్టాలే. మా సంపాదనంతా మావయ్యే తీసుకునేవాడు. ఆ బండచాకిరిలో మీ కథలే మాకు ఊరటగా ఉండేవి. మీ స్ఫూర్తితో బళ్ళో చేరాలనుకున్నాను. కానీ రాత్రి బళ్ళన్నీ మాకు చాలా దూరంలో ఉన్నాయి. అయినా మీరు చెప్పిన ఓ కథను గుర్తు చేసుకుంటూ చదువుకున్నాను' అన్నాడు.

'ఆ కథేంటో చెప్పు రాము, మరచిపోయాను' అన్నాను.

'ఒక ఊళ్ళో అందరూ నిరుపేదలే. ఆ ఊరిలో వాళ్ళకు ఎలాంటి పనీ దొరకడం లేదు. అందుకే ఆ పల్లె ప్రజలందరూ ఉపాధి కోసం మరో ఊరికి వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. కానీ పక్క ఊరు చేరుకోవాలంటే, పొలిమేరలోని ఎడారిని దాటుకొని వెళ్ళాలి. మధ్యలో మంచి రంగురాళ్ళు దొరుకుతాయి. వాటిని ఏరుకొని వెళ్ళి, అక్కడ అమ్మితే చాలా లాభం వస్తుంది. అయితే ప్రయాణం మాత్రం అతి కష్టంగా ఉంటుందని పెద్దలు చెప్పారు.

వారి మాట ప్రకారం మాధవ్, మహేశ్ అనే ఇద్దరు యువకులు పొరుగూరికి బయలు దేరారు. తెల్లవారే నడక ఆరంభించటంతో మొదట్లో ఎడారి గుండా సులువుగానే వారి ప్రయాణం సాగిపోయింది. మధ్యాహ్నానికి సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చాడు. ఇసుక వేడెక్కుతోంది. చాలా దూరం నడిచారు. రంగురాళ్ళు సేకరించడం మొదలుపెట్టారు. కొంతసేపటికి సంచులు రాళ్ళతో నిండాయి. చాలా బరువెక్కాయి. మహేశ్ ఓపిక లేక వెనుతిరిగిపోయాడు. కానీ మాధవ్, దుస్తరమైన ప్రయాణమైనా ఎలాంటి భయం లేకుండా, రాళ్ళను మోసుకుంటూ పక్క ఊరువెళ్ళి సంచీ విప్పేసరికి, అందులో ఉన్నవి రాళ్ళు కాదని, వజ్రాలని వ్యాపారులు చెప్పారు. వాటిని అమ్ముకొని మాధవ్ కోటీశ్వరుడయ్యాడు' అని రాము కథ ముగిస్తూ...


'మేడమ్! విద్యార్థి జీవితం కూడా ఆ ఎడారి ప్రయాణం లాంటిది. పరీక్షలు మండే సూర్యుడి లాంటివి; వేడి ఇసుకరేణువులు; కష్టనష్టాలు, ఆకలిదప్పులు చదువుకు కలిగే ఆటంకాల వంటివని, అయినా విద్యార్థి ఒంటరిగా కష్టపడాలని మీరు చెప్పారు. నైపుణ్యం, విజ్ఞానం సంపాదించుకోవాలి. మాధవ్ ప్రయాణానికి భయపడనట్లు, విద్యార్థి అయినవాడు చదవటానికి భయపడవద్దు. అప్పుడే వజ్రాలు లభించినట్లు, మీకు విజయాలు లభిస్తాయి. మహేశ్‌లా చిన్న కష్టానికి కూడా బాధపడితే, భయపడి వెనక్కి తగ్గితే ఆయనలాగే సాధారణ జీవితాన్నే గడపాల్సి వస్తుంది' అని చెప్పారు. దానినే మననం చేసుకుంటూ మెకానికల్ డిప్లొమా సంపాదించి, మీ చలవ వల్ల ఈ గ్యారేజీ యజమానినయ్యాను' అంటూ ఒక్కసారిగా నా కాళ్ళకు నమస్కరించాడు.

కన్నీళ్ళతో నిండిన నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను. ❖

సేకరణ: జి. సతీష్

మారాలి... మన రాజకీయ సంస్కృతి

– స్వామి రంగనాథానంద, (రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)



నేను అమెరికాలో ఉన్నప్పుడు ఒకసారి టీవీలో ఫుట్‌బాల్ మ్యాచ్ చూస్తూ ఉన్నాను. అక్కడి రెండు జట్ల మధ్య జరుగుతున్న హోరాహోరీ పోరును నిశితంగా పరిశీలించినప్పుడు నాకు ఓ ఆసక్తికరమైన విషయం అర్థమైంది. అందులో పాల్గొన్న రెండు జట్ల క్రీడాకారుల దృష్టంతా ఎక్కువగా బంతిపై కన్నా, ప్రత్యర్థి సభ్యులపైనే ఉండేది. ఒకరిపై మరొకరు దాడిచేసినట్లు ప్రవర్తించడం, ఢీకొట్టడం, కింద పడవేయడం జరుగుతూ ఉండేది. ఇరుజట్ల మధ్య అదొక ఆటలా కాకుండా, పోరాటంలా అనిపించేది. గోల్ చేయడం కన్నా ఒకరిపై మరొకరు పట్టు సాధించడమే ముఖ్యమన్నట్లుగా మైదానంలో వ్యవహరించేవారు.

ఆ ఫుట్‌బాల్ క్రీడాకారుల ఆట చూసినప్పుడల్లా, నాకు భారతదేశంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులే గుర్తొచ్చేవారు. వాళ్ళు కూడా ప్రధానమైన జాతీయ సమస్యలను వదలిపెట్టి, వ్యక్తిగత వైరంతో ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటూ విలువైన శక్తిని వృథా చేసుకుంటున్నారని అనిపించేది. జాతీయ జీవన విధానంలో ఇలాంటి వైఖరి దాదాపు అన్ని రంగాల్లోకి వ్యాపించిందనే చెప్పవచ్చు. అమూల్యమైన మానవ శక్తిని అనవసరమైన విషయాల వైపునకు మళ్ళించి వృథా చేసుకోవడం బాధాకరం. పర్యవసానంగా చాలా విషయాల్లో ప్రయోజనకర ఫలితాలేవీ కనిపించడం లేదు. ఇలాంటి మానవప్రవృత్తిని విశ్లేషిస్తూనే శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీత పద్నాలుగో అధ్యాయమైన గుణత్రయ విభాగయోగంలో త్రివిధాలైన సత్త్వ, తమో, రజో గుణ శక్తుల గురించి వివరించాడు.

ఈ రోజు మన రాజకీయ నాయకుల పరిస్థితిని చూస్తూ ఉంటే, తమస్సు అధీనంలోని రజోగుణ శక్తే వారిలో అధికంగా ప్రదర్శితమవుతున్నట్లుగా కనిపిస్తోంది. దీని వల్ల పూర్తిగా రాజకీయ సంస్కృతే కలుషితమవుతోంది; అధికార దాహానికే పరిమితమవుతోంది. ఈ పరిస్థితి మారాలి. సత్త్వగుణంతో ప్రేరేపితమైన రాజసిక శక్తితో రాజకీయ వ్యవస్థ రూపుదిద్దుకోవాలి. ఆ దిశలో రాజకీయ నాయకులు ఆత్మపరిశోధన చేసుకోవాలి.

అప్పుడే పరస్పర దూషణలతో, హింస ప్రతిహింసలతో, అధికార వ్యామోహాలతో కూడిన మన క్షుద్ర రాజకీయాలు, మానవసేవకు, జాతీయ నిర్మాణానికి పునరంకితమయ్యే సుసంపన్న రాజకీయాలుగా పరిణమిస్తాయి. ఇలాంటి ఉత్తమ రాజకీయ సంస్కృతి మన ప్రజాస్వామ్యవ్యవస్థను శక్తిమంతం చేయడమే కాకుండా, దానికి ఒక నిండుదనాన్ని ఇస్తుందనడంలో సందేహం లేదు.

మన రాజకీయ నేతలు చాలామంది కూడా లౌకిక (secular) అన్న పదాన్ని అర్థం చేసుకోవడంలో ఘోరమైన తప్పు చేస్తున్నారు. అందుకే లౌకికరాజ్యం అన్న దానిని 'ధర్మ నిరపేక్ష రాష్ట్రం' అన్న భావనలో అర్థం చేసుకొని అసలు ఏ ధర్మానికీ కట్టుబడకుండా ప్రవర్తిస్తున్నారు. యథేచ్ఛగా నడుచుకుంటున్నారు. స్వాతంత్ర్యానంతరం చాలా మంది రాజకీయ నాయకుల అవినీతికీ, లంచగొండితనానికీ, స్వార్థప్రయోజనాలకూ ఇదే కారణం.

'మతం' వేరు, 'ధర్మం' వేరు. మతాలు ఎన్నైనా ఉండవచ్చు, కానీ ధర్మం ఒక్కటే! మతం విషయంలో అటుఇటుగా ప్రవర్తించినా పట్టించుకోవలసిన పని లేదు. కానీ 'ధర్మం' విషయంలో అది చెల్లదు.

నాయకులు అయిన వారు ఏ ఒక్క మతానికో కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదు. కానీ ధర్మాన్ని మాత్రం విధిగా పాటించవలసిందేనన్న విషయాన్ని నేతలే మరచిపోవడం దురదృష్టకరం. నైతిక, మానవీయ విలువలన్నీ కూడా 'ధర్మం' కిందకే వస్తాయి. అందుకే మన నేతలు లౌకికరాజ్యం అన్న దానిని 'ధర్మ నిరపేక్ష రాష్ట్రం' అన్న భావంతో కాకుండా, 'మత నిరపేక్ష రాష్ట్రం'గా అర్థం చేసుకుంటే విశాల దృక్పథంతో తమ బాధ్యతలను నిర్వర్తించగలరు. ❖ **సేకరణ: ఆర్. కృష్ణ**

లక్షలాది జనులు విద్యలేక, తిండిలేక దుఃఖభూయిష్ఠమైన జీవితాలను గడుపుతుంటే, వారి కారణంగా విద్యావంతుడై, వారిని గురించి పట్టించుకోని ప్రతి వాడినీ 'ద్రోహి' అని నేనంటాను. -స్వామి వివేకానంద

(...18వ పేజీ తరువాయి)

నాయనమ్మ వారింటికి వెళ్ళేవాడు. అప్పుడప్పుడూ ఏకాంతంగా అతి మధురంగా పాటలు పాడేవాడు. అతని తేజోమయరూపం చూసి, గంధర్వగానం విని ఆ పక్క ఇంటిలో ఉన్న ఓ యువ వితంతువు మోహితురాలై, ఒకరోజు నరేంద్రుని గదిలోనికే వచ్చేసి తన మనస్సును వెల్లడించింది.



యువ నరేంద్రుడు, ఆమెతో ఇలా అన్నాడు – 'అమ్మా! నీవు నాకు తల్లితో సమానురాలివి. తుచ్ఛమైన ఈ పశువాంఛలను త్యాగం చేసి భగవంతుణ్ణి స్మరించు, పవిత్రంగా జీవించు! మృత్యువు ఏ క్షణంలోనైనా ఈ శరీరాన్ని కబళిస్తుంది. దానికి ఏ సాధనలు చేసి ఎదురు నిలుస్తావు? దానికి సిద్ధమయ్యావా? దైవచింతన చేయి, విషయ చింతన వదిలివేయి తల్లీ!' అని నమస్కరించాడు.

ముప్పై ఏళ్ళ వయస్సులోని నవ యువసన్న్యాసి, తేజోమయ దివ్య భవ్యమూర్తి స్వామి వివేకానంద దివ్యాకర్షణకు అమెరికాలో అందరూ శిరస్సు వంచారు. ఓ కోటీశ్వరురాలైన సుందర యువతి స్వామీజీ అపార జ్ఞాన సంపదకు, తేజస్సుకు మోహితురాలై 'స్వామీజీ! మిమ్మల్ని వివాహమాడాలని అనుకుంటున్నాను' అని అడిగింది. 'ఎందుకమ్మా నీకా ఆలోచన?' అన్నారు స్వామీజీ. 'మీ ధీశక్తి, మీ జ్ఞానసంపద, మీ వాగ్ధాటి, ధైర్యసాహసాలు, తేజస్సు అపారమైనవి. అనన్య సామాన్యమైనవి. కాబట్టి మిమ్మల్ని పెళ్ళాడితే మీ వంటి ఒక గొప్ప పుత్రునికి తల్లిని కావచ్చు. మీ లాంటి ఒక్క కొడుకు నాకు కావాలి స్వామీ!' అని ఆ సుందరీమణి సమాధానమిచ్చింది.

వెంటనే స్వామీజీ ఇలా అన్నారు – 'అమ్మా! నా వంటి మహాజ్ఞాని, మేధావికి జన్మనిచ్చి, అతడు నా అంతటి గొప్ప వాడు కావాలంటే నీవు ఇంకా 30 ఏళ్ళు వేచి ఉండవలసి వస్తుంది. ఈలోగా ఏమైనా జరిగితే నీ కోరిక తీరకనూ పోవచ్చు. అంత ప్రయాస ఎందుకమ్మా! నేనే నీ ఎదురుగా ఉన్నాను. ఇప్పుడే, ఇక్కడే నన్నే నీ పుత్రునిగా స్వీకరించు తల్లీ!' అని నిజంగా ఆమెకు కొడుకుగా నమస్కరించారు.

ఆ కోటీశ్వరురాలు ఈ పవిత్రతా మూర్తిని చూసి తన తప్పును మన్నించమని వేడుకొంటుంది. వివేకానందుని విజయ రహస్యమిదే!

మనమంతా గొప్పవాళ్ళం కావాలని కలలు కంటూ ఉంటాం. వివేకానంద స్వామీజీలా మనమూ ప్రపంచాన్ని ఉర్రూతలూగించాలనీ, ప్రతి ఒక్కరినీ ప్రభావితం చేయాలనీ, గౌరవ మన్ననలు పొందాలనీ ఆశిస్తాం, ఆకాంక్షిస్తాం. చరిత్ర పుటల్లో మన పేర్లు కూడా సువర్ణాక్షరాలతో లిఖించబడాలనీ, శాశ్వత కీర్తి ప్రతిష్ఠలు రావాలనీ మనసారా కోరుకొంటాం. సహజమే! కానీ, దానికి అత్యవసరమైన మూల్యం – పరిపూర్ణ పవిత్రత, కఠోరమైన సంపూర్ణ బ్రహ్మచర్యం, త్యాగం, వివేకం, వైరాగ్యం, మనోనిగ్రహం, సర్వమహిళామూర్తుల పట్ల మాతృభావం! ఈ మూల్యం చెల్లించడానికి మాత్రం మనం సుతరామూ సిద్ధంగా లేము!

'This life is a great chance! Do not go for glass beads leaving the mine of Diamonds!.... Life is short! Give it up to a great cause.' - 'ఈ జీవితం ఒక గొప్ప వరం, మహా అవకాశం! నీలో వజ్రాల గని (సాక్షాత్తు భగవంతుడే) నిక్షిప్తమై ఉండగా, దానిని వదలి బయటి గాజు పెంకుల (బాహ్య ఇంద్రియ సుఖాల) కోసం వెంపర్లాడవద్దు!... జీవితం అల్పమైనది? ఈ అల్ప జీవితాన్ని ఒక మహోన్నతమైన ఆదర్శం కోసం సమర్పించు!" ఈ వివేకానంద స్ఫూర్తి మంత్రం మనల్ని సన్మార్గంలో, పవిత్రతా పథంలో నడిపించు గాక! ❖

స్వామి వివేకానంద క్విజ్ – జవాబులు

(1) "సంవత్సరాలు అనేకం దొర్లిపోతాయి, అనేక తరాలు పుట్టి గిట్టుతాయి. వివేకానంద, ఆయన కాలమూ భూతకాలంలో కలిసిపోతాయి. కానీ ప్రజల మనోఫలకాలపై రూపుదిద్దుకొన్న వివేకానంద అనే ఆ మహనీయుని చిత్తరువు ఎన్నటికీ చెరిగిపోదు".

(2) సోదరి నివేదిత.

(3) "నేను మరణించిన పదేళ్ళలోపుగానే నన్ను దైవంగా ఆరాధిస్తారు".

(4) 'హైందవ జీవితం – భారతదేశం' అన్న ప్రసంగంలో.

(5) 1896 జనవరి 26వ తేదీన న్యూయార్క్‌లో ఇచ్చిన 'జ్ఞానయోగం' ఉపన్యాసంలో.

(6) మిస్‌వాల్డో, ప్రబోధరత్నాకరం (Inspired Talks).

(7) ఆంగ్ల యువకుడు జె.జె. గుడ్విన్, తదనంతర కాలంలో స్వామీజీ శిష్యుడు.

(8) 'నా ఐరోపా యాత్ర', రెండవసారి పాశ్చాత్యదేశాలకు వెళ్ళినప్పుడు.

(9) లండన్‌లో.

(10) ప్రొఫెసర్ మాక్స్ ముల్లర్.

(11) మొదటిసారి 1893 జూలై నుండి 1896 డిసెంబర్ వరకు – దాదాపు మూడున్నర సంవత్సరాలు; రెండవసారి 1899 జూన్ నుంచి 1900 నవంబర్ వరకు– దాదాపు ఒకటిన్నర సంవత్సరాలు; మొత్తం ఐదు సంవత్సరాలు పాశ్చాత్య దేశాలలో గడిపారు.

(12) పయనించిన మొత్తం దూరం 1,07,396 కి.మీ.; బహిరంగ ఉపన్యాసాలు – 317; తరగతి ప్రసంగాలు – 431; చర్చావేదికలు – 26.

(13) భారతీయ ఆధ్యాత్మికత; శ్రీరామకృష్ణులు; నిజమైన మతం



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్న్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్న్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

బరంపురం,
28-1-1940

ప్రియమైన విపత్ భంజన్!*

శ్రీరామకృష్ణుల ఆదర్శం ప్రకారం తన జీవితాన్ని మలుచుకోవాలనుకొనే ప్రతి వ్యక్తీ జ్ఞాన, కర్మ, భక్తి, రాజయోగాలనే నాలుగు మార్గాల్లోనూ అభివృద్ధి చెందించుకోవాలి. ఎవరి జీవితంలోనైనా ఈ నాల్గింటిలో మిగిలిన మూడింటి కంటె ఏ ఒక్క మార్గంలోనైనా అభివృద్ధి కుంటుపడితే, ఆ వ్యక్తి శ్రీరామకృష్ణుల విధానానికి పూర్తిగా అనుసంధానం కాలేదని గ్రహించాలి.

జ్ఞాన, భక్తి, యోగ, కర్మలంటే ఏమిటి?

జ్ఞానం: పరిశుద్ధమైన, సూక్ష్మమైన తెలివితేటలతో సత్యాన్ని కనుగొనాలి. అన్ని రకాల సంస్కారాల నుండి విడివడిన తెలివితేటలతో తన నిజతత్త్వాన్ని సాక్షాత్కరించుకోవాలి.

భక్తి: సత్యం ఎడల అపారమైన ప్రేమ, సత్యస్వరూపుడైన భగవంతుని ఎడల ప్రేమ కలిగి ఉండడం. వస్తువుల ఎడల ప్రేమ లేనప్పుడు వాటిని పొందాలనే కోరికే జనించదు కదా!

యోగం: సత్యాన్ని ఎల్లవేళలా తన ముందు నిలుపుకోవటం. భగవంతుడొక్కడే సత్యమని తెలుసుకున్నవారు భగవద్విచారణలోనే మునిగిపోయి, నిరంతరం సత్యాన్ని అనుభూతి చెందుతారు.

కర్మ: కర్మలను ఆచరించవలసి వచ్చినప్పుడు జ్ఞానార్జన ఉద్దేశంగా కర్మలు ఆచరించడం; శరీరం, మనస్సుల యొక్క పూర్వ సంస్కారాలను అనుసరించి కర్మలను ఆచరించేటప్పుడు తన ఎదుట సత్యాన్ని దర్శించటం; సత్యం ఎడల ప్రేమ భావాన్ని పెంపొందించుకోవడం జ్ఞాన, భక్తి, యోగాలకు పరీక్ష. ఆచరణ కర్మలోనే లభిస్తుంది.

స్పష్టమైన జ్ఞానం (జ్ఞానయోగం) ద్వారా దాని ఎడల గాఢమైన ఆకర్షణ కలుగుతుంది (భక్తియోగం). ఈ ఆకర్షణ వల్ల మనస్సు అత్యధికంగా ఒకే అంశంపై ఏకాగ్రమవుతుంది (రాజయోగం). మన జీవితంలో రోజువారీ పనుల్లో (కర్మ యోగం) ఆత్మ పరిశుద్ధమై ఆవిష్కృతమవుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదే "రామకృష్ణ విధానం". మన ఆధ్యాత్మిక సాధనకిది మూలం. ఈ కొద్ది మాటలు అర్థం చేసుకోవడానికి ప్రయత్నించు. అలా అర్థం చేసుకోగలిగితే నీ జీవితంలో వెలుగు లభించి, ఎక్కడా ఏ విధమైన అస్పష్టతకూ తావుండదు.

శారీరకంగానూ, మానసికంగానూ ఈ మార్గంలో ముందుకు పోయే వారి నైపుణ్యం ఎంతో అభివృద్ధి చెందుతుంది. ఆ వ్యక్తి చేసే పనులు ఎంతో యోగ్యంగా ఉంటాయి. ఉదాహరణకు ఒక కిరాణాషాపు వాడు బాగా తెలివైనవాడై (జ్ఞానయోగం), తన పనియెడల అత్యంత ప్రేమ కలిగి (భక్తియోగం), ఏకాగ్రతతో తన పనిలో మునిగిపోయి (రాజయోగం), అతని శరీరం మనస్సు ఆ పనికి అలవాటుపడిపోతే (కర్మయోగం) అతని వ్యాపారం అభివృద్ధి చెందకుండా ఉంటుందా? ఏ రంగంలోనైనా సరే! ఇదే విజయ రహస్యం. అలాంటి వ్యక్తులు అన్ని రకాల పనుల్లోనూ రాణిస్తారు. మానవ ఆదర్శం యొక్క పరిపూర్ణ ఆవిష్కరణను శ్రీరామకృష్ణుల వారిలో చూడబట్టే స్వామి వివేకానంద శ్రీరామకృష్ణులను అవతార వరిష్ఠులుగా అభివర్ణించారు. ఆయనకు పాదాక్రాంతుడయ్యారు.

మనం మన శరీరాల్లో పని చేసే శక్తిని అభివృద్ధి చేసుకొని (కర్మయోగం), అతి నీచమైన అసూయ, ద్వేషం, అసత్యం లాంటి వాటిని నశింపజేసేలా హృదయంలో ప్రేమను పెంచుకొని (భక్తియోగం), బుద్ధి ద్వారా జ్ఞానాన్ని పొందుతూ (జ్ఞానయోగం), సత్యంతో నిరంతరం అనుసంధానమై ఉండాలి (రాజయోగం). ఇదే జరగకపోతే జ్ఞానం దానంతట అదే ఆవిష్కృతం కాదు. ఏ అనుభవాలైనా సరే జ్ఞానాజ్ఞానాల సమ్మేళనమే. మిడిమిడి జ్ఞానం ప్రపంచానికి ఎంతో కీడు చేస్తుంది. అది అజ్ఞానంకంటే ఎక్కువ ప్రమాదకరమైనది. ఈ భావాలన్నీ స్వామీజీ సాహిత్యంలో, భగవద్గీతలో నీకు లభిస్తాయి. కానీ అవి చదివి వాటిని అర్థం చేసుకొని జీవితంలో ప్రతిబింబించు కోవడానికి చాలా కాలం పట్టవచ్చు. ప్రయత్నం మానరాదు.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత: కె. త్రివిక్రమరావు

(*విపత్ భంజన్, కాలాంతరంలో రామకృష్ణ సంఘంలో సన్న్యాసం స్వీకరించి స్వామి స్వాహానందగా ప్రసిద్ధులయ్యారు.)

సేవ అనే ఉన్నత ఆదర్శాన్ని అనుసరించి మీరు మీ జీవితాలను తీర్చిదిద్దుకోవాలి. ఈ ఆదర్శం ద్వారా మిగిలిన ఆదర్శాలన్నీ క్రమంగా మీ జీవితాల్లో ప్రకటితమవుతాయి. - స్వామి వివేకానంద

(...13వ పేజీ తరువాయి)

హృదయేశుడు విష్ణుడు!

సుఖసంతోషాల్లో, భోగభోగ్యాల్లో ఉన్నప్పుడు మన చుట్టూ ఉన్నవారి అసలు రూపం తెలియదు. దగ్గరి వారెవరో, దూరం జరిగే వారెవరో తెలిసేది కష్టసమయంలోనే! గజేంద్రుడు తీరంలో ఉండి, ఉల్లాసంగా గడిపినప్పుడు లెక్కకు మించిన భార్యలు ఆయన చుట్టూ మూగాయి. కానీ మొసలి నోట చిక్కి విలవిల్లాడినప్పుడు, ఏ ఒక్క ఆడ ఏనుగూ ఆ కరీంద్రుణ్ణి కాపాడలేక, ఒడ్డునే కూర్చొని, ప్రేక్షకపాత్ర పోషించాయి. 'నీవే తప్ప నాకెవరూ దిక్కు లేరని' గజరాజు ప్రార్థించగానే, ఆ దీనజన పోషకుడు హుటాహుటిన వచ్చి ఒడ్డుకు చేర్చాడు. అలా మనం కూడా సంసార కూపంలో, కష్టాల కారడవిలో చిక్కుకున్నప్పుడు, అక్కున చేర్చుకునే బంధువుడు ఇతడొక్కడేనని...



హితవగు బంధువుడు ఈశ్వరుడొక్కడే

భవకూపంబుల బడలెడినాడు పాయని బంధువుడు ఇతడొకడే
దివి స్వర్గంబున తేలెడినాడు తిరుగబాయకెపు డితడొకడే
నవ నరకంబుల నలగెడినాడు నటనల బాయడితడొకడే
యివలనవల హృదయేశుడు విష్ణుడుఈతని మరువకుమీ జీవాత్మా

'సంసార సాగరంలోనే కాదు, స్వర్గనరకాల్లో, పూర్తిగా ఇహపరాల్లో మనకు దిక్కైనవాడు ఆ దేవుడు ఒక్కడే! అలాంటి హృదయేశ్వరుడైన శ్రీమహావిష్ణువును విస్మరించవద్ద'ని విన్నవిస్తున్నాడు వేంకటాచలపతి విశేష భక్తుడు అన్నమయ్య. అందుకే దివ్యజనని శారదామాత "అవస్థలు పడుతున్నప్పుడు ఓదార్చడానికి ఓ తోడు అవసరం. ఆ తోడే భగవంతుడు. ఇతరుల కంటే, ఇతర సాధనల కంటే సేద తీర్చుకోవటానికి ఆ భగవంతుడే ఉత్కృష్టమైన వ్యక్తి. కన్నీటితో ఆయన సన్నిధిలో మన సమస్యలను ప్రార్థన రూపంలో వెలిబుచ్చినప్పుడు మనస్సులో ప్రశాంతతను నింపుతాడు. సమస్యలను పరిష్కరిస్తాడు. అందుకే ఆయనను మన దైనందిన జీవితంలో ఓ భాగంగా చేసుకోవాలి" అని ఓ భక్తురాలితో అంటారు.

దుఃఖపు వేళల దిక్కైనవాడు...

మానవుడిగానే కాదు మృగాది జాతులుగా మనం పుట్టినా ఆ పరమాత్ముడి ప్రేమలో మార్పు ఉండదు. సృష్టించిన ప్రతి జీవిపైనా తన కరుణావృష్టిని కురిపిస్తూనే ఉంటాడు. అలముకున్న విషాదం నుంచి ఆవలి తీరానికి చేర్చి అన్నీ తానై తోడుగా నిలుస్తాడు. పుట్టిన క్షణం నుంచి పాడెనెక్కే వరకు చిత్తానికి చెలిమై మెలగుతాడు. దశ అవతారాలెత్తిన ఆ దాక్షిణ్యమూర్తిని తలచుకొని తరించమని జీవాత్ముడికి సూచిస్తూ...

పశుమృగాదుల వొడలెత్తినపుడు పాయని బంధుగుడితడొకడే
విశదపు దుఃఖపు వేళలనైనా విడువని బంధువుడితడొకడే
శిశువైనపుడు వృద్ధైనప్పుడు చిత్తపుబంధుగుడితడొకడే
దశావతారపు విష్ణుడొక్కడే ఈతని తలచుమీ జీవాత్మా...అని

కోరుకుంటున్నాడు అన్నమయ్య. 'వొడలెత్తినప్పుడు' అంటే జన్మించినప్పుడని అర్థం. పురాణాల్లోనే కాదు ప్రత్యక్షంగా కూడా మనం భగవంతుడి లీలల్ని ఎన్నో చూస్తూనే ఉన్నాం. ప్రమాదాల నుంచి మామూలు మనుష్యులనే కాదు మూగజీవాలను కూడా ఆయన మృత్యుంజయులుగా దరి చేరుస్తున్నాడు. అలా ఆయన దయకు పాత్రులైన వారికి అన్నీ అనుకూలంగా మారిపోతాయి. అందుకే శ్రీమద్భాగవతం ధ్రువోపాఖ్యానంలో మాధవుడి మాహాత్మ్యాన్ని వర్ణిస్తూ...

...భగవంతుదెవ్వనిపై మైత్రి వాటించు, సత్కృపా నిరతి ప్రసన్ను దగుచునతనికి తమయంతననుకూలమై యుండు సర్వభూతంబులు సమతం బేర్చి; మహి తలపోయ నిమ్న ప్రదేశమునకు ననయంబు చేరు తోయముల పగిది...

'పల్లానికి నీరు ప్రవహించిన విధంగా భగవంతుని దయకు పాత్రుడైన వాని వద్దకు తమంత తాము అందరూ అనుకూల భావంతో చేరుకుంటార'ని వివరిస్తారు పోతనామాత్యులు.

శ్రీవేంకటగిరి నాయకుడితడే..!

శరీరవాంఛలతో సతమతమవుతున్న వేళలో ప్రాణబంధువుగా నిలిచేవాడు, ఈ లోకంలోనే కాదు పరలోకంలోనూ పరిరక్షకుడుగా మెలగేవాడు, తానే దైవమని శరణంటే గుండెలకు హత్తుకునే ఆ విశ్వాత్ముడు, ఈ వేంకటగిరి నాయకుడు ఒక్కరేనని, ఆతని భజించి తరించమని జీవాత్మకు బోధిస్తూ...

భావజకేలిని జొక్కినప్పుడు ప్రాణబంధువుడు ఇతడొకడే
యీవల నావల యిహపరములలో నిన్నిటి బంధువుడితడొకడే
దైవము తానని శరణనియెడు నను దగ్గరికాచెను ఇతడొకడే
శ్రీవేంకటగిరి నాయకుడితడే చేరి భజించుము జీవాత్మా...

అంటున్నాడు అన్నమాచార్యులు. 'భావజకేలి' అంటే మన్మథకేళి అని, 'యీవల నావల' అంటే ఇహలోకంలో, పరలోకంలో అని భావం. సంగీతమే సాధనగా శ్రీరాముని స్మరించి తరించిన త్యాగరాజస్వామి కూడా మనస్సుకు మంచి మార్గాన్ని చూపుతూ, **'దారి తెలియలేని యజ్ఞులకు; భవనీరధి దాటి మోక్షమందుటకు తారకనామంతో వెలసిన వాడేరా దైవము! మనసా!'** అని చెప్పి, **'రామచంద్రుని భజన చేయవే మనసా!'** అని ఉద్బోధిస్తారు. ❖

చిన్నతనంలో జగత్తు రహస్యప్రపూర్ణంగా ఉండేదని అనిపిస్తుంది. పిడికిలి పట్టి 'ఇందులో ఏముందో చెప్పు?' అని ప్రకృతి అడుగుతున్నట్లు ఉంటుంది. తొలకరి జల్లుల్లాంటి ఆ చిన్ననాటి జ్ఞాపకాలు, నా జీవనక్షేత్రాన్ని సారవంతం చేశాయి. కలకత్తాలో కొత్తకొత్తగా నా 'పసి'డి ప్రపంచం ఊపిరిపోసుకుంది. కానీ ఈ రోజుల్లోలా ఆధునికత పేరుతో పూర్తిగా బాహ్య ఉపకరణాలపై, వస్తువులపై ఆధారపడుతూ, బాల్యాన్ని కూడా కృత్రిమ ప్రపంచంలో బందీ చేసే దయనీయ వాతావరణంలో నా చిరుప్రాయం ఛిద్రం కాలేదు. మట్టి, నీరు, చెట్టుచేమలు, ఆకాశం అన్నింటితోనూ మేము ఎంచక్కా మాట్లాడుకునేవాళ్ళం. ప్రకృతి ఊసులు మా మనస్సును ఉదాసీనంగా ఉండనిచ్చేవి కావు. అలా మా ఆలోచనలు చిన్ననాటి నుంచే సహజమైన ప్రకృతి అన్వేషణ వైపు పరుగులు తీసేవి. నేలను తవ్వుతున్న కొద్దీ అంతు లేకుండా పైకి వచ్చే మట్టి, ఆకాశం, దాని నీలికప్పు, దాని వెనక ఉన్న శూన్య రహస్యమూ – ఇవన్నీ మనస్సును కుదిపేసేవి. కానీ ప్రకృతి నుంచి పిల్లలను పెద్దలు ఎందుకు దూరం చేస్తారో నాకు అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ అర్థం కాదు.



నా చిన్నప్పుడు...

–రవీంద్రనాథ్ టాగూరు



మా అన్నయ్య కన్నా నేను పన్నెండేళ్ళు చిన్న. వయస్సులో ఇంత తేడా ఉన్నా, నేను ఆయనతో సరదాగానే ఉండేవాడిని. అతడు నా కంటే పెద్ద అని ఏనాడూ నా మాటకు అడ్డుతగిలేవాడు కాదు. అందుకే ఏం మాట్లాడాల్సి వచ్చినా నేను నిర్భయంగా, సంకోచం లేకుండా మాట్లాడేవాణ్ణి. ఒక వయస్సు వచ్చాక పిల్లల్ని ధైర్యంగా మాట్లాడనివ్వాలి. కానీ చాలామంది పెద్దవారే పిల్లల్లోని జిజ్ఞాసను ఇంకిపోయేలా చేస్తూంటారు. ఆ కాలంలో పెద్దలు మాట్లాడుతూ ఉంటే పిల్లలు మూగగా కూర్చునేవారు; ఆ కాలం పిల్లలందరూ అంతరంగాన్ని అణచుకొని, తలవంచుకొని గొణుగుకుంటూ ఉండేవారు. కానీ ఈతరం పిల్లలు ఎలాంటి బెరుకూ లేకుండా ప్రశ్నించగలుగుతున్నారు. ప్రశ్నలు వేసే సాహసం ఈ కాలం పిల్లలది. ఇది మంచి పరిణామం.

అయితే ఈ రోజు పిల్లలకు అడగకుండానే అన్నీ లభ్యమవుతున్నాయి. కానీ ఇంత సులువుగా మాకేదీ దొరికేది కాదు. ఎంత చిన్న వస్తువయినా సరే, మాకు దుర్లభంగానే ఉండేది. పెద్దవాళ్ళమయ్యాక ఎప్పుడో ఒకప్పుడు అవి లభించవా అన్న ఆశతో భవిష్యత్తును నమ్ముకొని మిన్నకుండేవాళ్ళం. దీని వల్ల సామాన్యమైంది ఏది దొరికినా, మాకు అపురూపంగా అనిపించేది. దానిని సంపూర్ణంగా ఆస్వాదించటం అలవాటుగా ఉండేది. ఈ రోజు శ్రీమంతుల పిల్లలను చూడండి! కోరిందల్లా క్షణాల్లో కళ్ళ ముందు ప్రత్యక్షం కావడం వల్ల, సహజంగానే వారికి వాటి విలువ తెలియడం లేదు. అందుకే ఏ ఒక్కదానితో కూడా పూర్తిగా ఆనందపడలేకపోతున్నారు, దేనినీ ఆసాంతమూ అనుభవించలేకపోతున్నారు.

అలాగే నా బాల్యంలో మనస్సెప్పుడూ బయటి ప్రపంచం వైపే లాగేది. నాకున్నది నలుగురు మిత్రులతో పంచుకోవాలని అనిపించేది. ఆనందమంతా అందులోనే ఉందనిపించేది. కఠోరశిక్షణ పేరుతో నాలుగు గదుల మధ్యే ఉండాలని నన్ను నిర్బంధించినప్పుడు మాత్రం కొంత బాధ కలిగేది! కిటికీలో నుంచి బాహ్యప్రకృతిని చూస్తూ ఊహల ప్రపంచంలో తేలిపోయేవాడిని. ఇప్పటిలా ఎక్కువ వస్తువులపై కూడా మాకు పెద్దగా మోజు ఉండకపోయేది. నిజంగా ఆ వయస్సులో ఉపకరణాలు ఎక్కువగా ఉంటే మనస్సు ముడుచుకొని పోతుంది; ఆలోచనలు ఆ వస్తువుల వరకే పరిమితమైపోతాయి. పసితనం నుంచే ఇలా ఆటబొమ్మలు ఏమీ లేకపోయినా, బాహ్యపరమైన ఆలంబనలేమీ అవసరం లేకుండా, ఆనందాన్ని అంతరంగంలోనే అన్వేషించుకోవడం అలవాటైపోయింది.

చదువు విషయంలో మాత్రం, ఈ పద్ధతులు నాకెప్పుడూ విచారకరంగానే అనిపిస్తూ ఉంటాయి. మన చదువుకూ, జీవితానికీ సంబంధం లేదనిపిస్తూ ఉంటుంది. విత్తనాలు ఓ చోట చల్లితే, వానలు మరోచోట కురుస్తున్నట్లు తోస్తుంది. అదృష్టవశాత్తూ మా గృహవాతావరణం నాకు విజ్ఞాన, సాహిత్య, సంగీత ప్రపంచంతో పరిచయం చేసింది. చక్కని అభిరుచులు, మానవ సంబంధాలు ఇనుమడించడానికి సాయపడింది. విలువలకూ, మంచి సంస్కారాలకూ నాలో బీజం పడింది ఆ చిన్నతనంలోనే! ❖

సేకరణ: ఎమ్.రాంబాబు

(నవంబరు 14, బాలల దినోత్సవం)

మీ కాళ్ళపైన మీరు నిలబడండి. ఒక జాతిగా జీవించాలంటే ఇతర దేశాల్లోని సాంఘిక యంత్రాంగం ఎలా పనిచేస్తుందో పరిశీలించండి. మీకు మేలు కలిగించేదాన్ని పరిగ్రహించండి. - స్వామి వివేకానంద

భగవద్గీత - సద్గుణ సుధ

- స్వామి విశారదానంద

బెంగుళూరులోని వివేకానంద యోగ అనుసంధాన మహా విద్యాపీఠానికి చెందిన స్వామి విశారదానంద భగవద్గీత పదమూడో అధ్యాయంలో 7-11 శ్లోకాల్లోని భగవానుడి బోధామృతాన్ని వివరిస్తూ 'భగవద్గీత - మానవీయ విలువలు' అనే శీర్షికతో ప్రసంగాలు ఇచ్చారు. చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠ ఆంగ్ల మాసపత్రిక 'వేదాంత కేసరి'లో ప్రచురితమైన ఆ ప్రసంగాల సారాన్ని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

భక్తిని అలవరచుకోవడం

నిజమైన భక్తుడు హృదయపూర్వకమైన భక్తిని కలిగి ఉంటాడు. నిజమైన భగవద్భక్తుడు స్వార్థరహితంగా ఉంటాడు. భక్తుని మనస్సులో భగవంతుని పట్ల ఏర్పడే అవినాభావ సంబంధమే 'భక్తి'. భక్తి ద్వారా మనస్సు మన భక్తికి లక్ష్యమైన వస్తువుకు లొంగి ఉండడం నేర్చుకుంటుంది. ప్రాపంచిక జీవితంలో ఇతరుల కన్నా మనం తక్కువగా ఉండడానికి మన అహంకారం అడ్డువస్తుంది. అంతేకాదు అది సారథిగా ముందరి ఆసనంలో కూర్చోవాలని అనుకుంటుంది. అది ఇతరులపై ఆధిపత్యం చలాయించి, స్వలాభం కోసం ఇతరులను ఉపయోగించుకోవాలని అనుకుంటుంది. నిజమైన భక్తునిలో 'అహంకారం' వెనుక 'సీటు'(ఆసనం)లో కూర్చొని, వినయ విధేయతలతో ఉండి, భగవంతునికి శరణాగతి పొందుతుంది. రాగ, ద్వేషాలను పక్కన పెట్టి, మనస్సును పవిత్రమైన ఆలోచనలతో నింపుతుంది.

మనందరికి మానసిక ఆవేశాలుంటాయి. ఈ ఆవేశాలను భగవంతుని వైపు మరల్చనట్లయితే, వాటిని కుటుంబం వైపుకూ, స్నేహితులవైపుకూ మరలుస్తాము. భక్తి అంటే మన భావాలను భగవంతుని వైపుకు తిప్పటమే! అది ఇతరులపై ఆధారపడడానికి బదులు భగవంతునిపై ఆధారపడడం.

భక్తుడు ఇతరుల యెడల గౌరవం చూపించడం అలవరచుకుంటాడు. ఇతరులను గౌరవించడం వల్ల తనలో కలిగే ఇష్టాలనూ, అనిష్టాలనూ వదులుకోగలుగుతాడు. ఇష్టానిష్టాలే మన వ్యతిరేక భావాలన్నిటికీ మూలకారణం. దృఢమైన ఇష్టానిష్టాలు కలిగి ఉండడమంటే మన లోపల ఒక భయంకరమైన తీవ్రవాది ఉన్నట్లే! అది మనకు 'నాకు అది కావాలి; ఇది నాకక్కరలేదు' అంటూ ఆజ్ఞలు జారీ చేస్తుంది. ఆ ఇష్టానిష్టాలకు బానిసలమైపోయి, మన లోపలి భయంకర తీవ్రవాది చెప్పినవి తు.చ. తప్పకుండా ఆచరిస్తాం. ఇంతకంటే బాధాకరమైన విషయం ఏముంటుంది? కానీ ఈ పరిస్థితిని మన మనస్సును భగవంతునివైపు మరల్చడం ద్వారా అధిగమించవచ్చు. భక్తి వల్ల వ్యక్తి 'సాత్త్వికభోక్తగా' తయారవుతాడు. సాత్త్విక భోక్త ధర్మాన్ని అతిక్రమించకుండా జీవితాన్ని ఉన్నదున్నట్లుగా అంగీకరిస్తాడు.

భక్తితో చేసిన ఏ చర్య అయినా ఆధ్యాత్మిక పురోభివృద్ధిని కలగజేస్తుంది. తాను చేసిన పనుల ఫలితాన్ని తరువాత ఎప్పుడో అనుభవిద్దామని భక్తుడు వేచి ఉండడు. ఆ పని చేస్తున్నప్పుడే ఆనందిస్తాడు. ఇతరులకు సేవ చేయగలిగే ఏ అవకాశమైనా ఒక మహద్భాగ్యంగా భావిస్తాడు తప్ప అది తాను ఏదో మొక్కుబడిగా చేయవలసిన పని అనుకోడు. దీనివల్ల అతనిలో సానుకూల భావాలు వెల్లివిరిసి, అన్ని రకాల కష్టాల నుండి, శ్రమల నుండి దూరంగా విడివడి, జీవితమంతా ఆనందమయమవుతుంది.

చాలాసార్లు మనం చేసే పని మనకు నచ్చదు. అయినా నిస్సహాయస్థితిలో చేయక తప్పదు. ఫలితంగా చివరకు అలసిసొలసి పోతాం. ఇంకొక విధంగా చెప్పాలంటే, ఇష్టం లేని పని చేస్తున్నప్పుడు మన మనస్సు పూర్తి వ్యతిరేక భావాలతో నిండి ఉంటుంది. అదే మన మనస్సు సానుకూల భావాలతో ఉంటే, మనకు అలసట రాదు. ఎప్పుడూ ఉత్సాహభరితంగా ఉంటాం. జీవితం, అప్పుడొక మధురమైన సంగీతంలా అవుతుంది. అపస్వరాలన్నీ అదృశ్యమవుతాయి. అప్పుడు మన దృక్పథం విస్తరించి, విశాలమై, ప్రతి చోటా భగవంతుణ్ణి దర్శించడం ప్రారంభిస్తాం.

ముక్తి మార్గం - సాధన: ముక్తిని చేరే మార్గం - ఆధ్యాత్మిక సాధన. మనకున్న సమయం చాలా పరిమితమైనది. మన మనస్సు సంపదల వెంటా, పేరు ప్రతిష్ఠల వెంటా పరిగెడుతుంటే, ఈ శరీరం వదలినప్పుడు అవన్నీ వదిలి వేయబడతాయన్న విషయం మనస్సుకు గుర్తు చేయాలి. దివ్యగుణాలను అలవరచుకోవడం ద్వారా మన మనస్సును మెరుగుపరచుకోవాలి.

ఎల్లప్పుడూ మన వద్ద లేని వస్తువుల గురించి ఫిర్యాదు చేస్తుండడం వల్ల భగవంతునికి మన కృతఘ్నతాభావాన్ని వ్యక్తపరుస్తున్నాం. అనంతమైన వస్తువుల జాబితాను భగవంతునికి సమర్పించి, అవి ఇవ్వమని అడుగుతాం. అయితే, ఏవైనా వస్తువులు ఇమ్మని అడగవలసి వస్తే, మానవుల్ని కాకుండా భగవంతుణ్ణే అడగాలి. మన అవసరాలన్నిటినీ తీర్చమని వేరెవరినీ కాకుండా భగవంతుణ్ణి మాత్రమే అభ్యర్థించడాన్నే 'అవ్యభిచారిణీ భక్తి' అని అంటారు. ఒక సంస్కృత 'సుభాషితం'లో

ఇలా చెప్పారు – "చాతక పక్షి చాలా ఆత్మాభిమానం కలది. అది వాన నీరు మాత్రమే త్రాగుతుంది. దాహంగా ఉన్నప్పుడు, అది మేఘాల నుండి మాత్రమే నేరుగా నీటిని త్రాగుతుంది కానీ ఇతర ప్రదేశాల నుండి త్రాగదు. ఆఖరికి దాహంతో చనిపోయినా సరే వేరే నీటిని స్వీకరించదు".

భక్తుడికి భగవంతుడే అన్నీ సమకూరుస్తాడన్నదే ఇక్కడ గమనించాల్సిన అంశం. అలాంటప్పుడు వేరే ఎవరినైనా, దేని కోసమైనా అడగవలసిన పని ఏముంది? తన అవసరాల కోసం ఇంకొక వ్యక్తి వద్దకు వెళ్ళి అడిగేవారెవరైనా, భగవంతుని పట్ల అచంచల భక్తి లేనివారే అవుతారు.

అచంచల భక్తి అంటే భగవంతుడొక్కణ్ణే మన అవసరాలను తీర్చాల్సిందిగా అడగడం. నాకు ఏ అవసరం ఉన్నా సరే భగవంతుణ్ణే అభ్యర్థిస్తానేదే భక్తుని దృక్పథం. అతను భగవంతుని పట్ల మాత్రమే భక్తి కలిగి ఉంటాడు. అలాంటి దృక్పథం సాధకుని ఆధ్యాత్మిక కృషిలో స్థిరత్వాన్ని కలగజేస్తుంది. ఆ విధంగా లేనట్లయితే, అన్ని పదార్థాల మీదా వాలి, మంచివాటినీ, చెడువాటినీ కూడా స్వీకరించే మామూలు ఈగ లాగా ఉంటాం. భక్తుడైనవాడు మాత్రం 'తేనేటీగ' లాగా పుష్పాల మీదనే వాలతాడు. దాన్ని 'ఏకాంతిక భక్తి' అంటారు.



అచంచల భక్తి ఉన్న భక్తుడు భగవంతుణ్ణే తన సమస్యల పరిష్కారం కోసం వేడుకుంటాడు. భగవంతుడు కూడా అలాంటి భక్తుణ్ణి ఆపదల నుండి రక్షిస్తాడు. అలాంటి భక్తుడు ఇతరుల నుంచి ఎలాంటి సహాయాన్నీ ఆశించడు. భర్తృహరి ఈ విధంగా ఉపదేశిస్తారు – "ఓ మిత్రమా! నేను చెప్పేది జాగ్రత్తగా విను. అనేక మేఘాలు ఆకాశంలో కనిపిస్తాయి. వాటిలో కొన్ని వర్షిస్తాయి. కొన్ని గర్జన చేసి వెళ్ళిపోతాయి. జనం కూడా అలాగే ఉంటారు. అందరూ మీ కోరికలను తీర్చలేరు.. మీ కోరికలను అందరూ తీర్చలేనప్పుడు, అందరికీ వాటిని చెప్పడం ఎందుకు? అడిగితే భగవంతుణ్ణే అడగాలి. ఆయనే వాటిని తీర్చలేకపోతే, ఇతరులెవరూ తీర్చలేరు. అందుచేత భగవంతుణ్ణే ఎందుకు అడగకూడదు. ఆయన నా కోరిక తీరిస్తే మంచిదే, తీర్చకపోయినా ఫరవాలేదు. దాన్ని సమ్మతిస్తాను" అనే భావంతో ఉండాలి.

ఆధ్యాత్మిక సాధనల ప్రయోజనం: మన ఆధ్యాత్మిక సాధనలన్నిటి ప్రయోజనం – మనలో కేంద్రీకృతమై ఉన్న స్వార్థపరత్వాన్ని తొలగించడమే! సుఖాలను అనుభవించేటప్పుడు ప్రతిదాన్నీ తమ ప్రయోజనం కోసమే ఉపయోగించడానికి ప్రయత్నిస్తారు. కానీ జీవితపు ఉన్నత ప్రయోజనం గురించి అవగాహన కలిగిన ఆధ్యాత్మిక సాధకుడు, ఇతరులను తన ప్రయోజనం కోసం ఉపయోగించుకోకుండా సేవాదృక్పథాన్ని పెంపొందించుకుంటాడు. మొట్టమొదట మనలో ఉన్న ప్రాపంచిక సంస్కారాల గురించి మనం తెలుసుకోవాలి. అప్పుడే మనల్ని మనం సరిదిద్దుకొని, ఆ సంస్కారాలకు ఒక ఆధ్యాత్మిక మలుపును ఇవ్వగలుగుతాం.

మన దృక్పథాన్ని మార్చుకోవడం ఎలా? : ఆత్మపరిశీలన ద్వారా మన దృక్పథాన్ని మార్చుకోవచ్చు. ఇతరులను ఏదో ఒక విధంగా మనకు పనికివచ్చేలా సర్దుబాటు చేసుకోవడం వల్ల సంతోషంగా ఉండలేమన్న విషయాన్ని మనం గ్రహించాలి. ఆ విధంగా చేయడం వల్ల ఇతరులకు దుఃఖాన్నే కలగజేస్తాం. అది ఏ విధంగానూ మనకు సంతోషాన్నివ్వదు. ఇతరులను సంతోషపెట్టడం ద్వారానే మనం సంతోషంగా ఉండగలం. ఇదొక విధమైన జ్ఞానంతో కూడిన స్వార్థపూరిత కోరిక. అంటే ఇతరుల ఆనందాన్వేషణలో మన ఆనందాన్ని వెతుక్కోవడం. ఇతరుల ఆనందంలోనే మన ఆనందం ఉందనుకోవడం.

మనకు లేని వస్తువుల గురించి ఎప్పుడూ ఫిర్యాదు చేస్తూనే ఉంటాం. మన భాగ్యవశాన మనకు ఉన్నది అమూల్యమైన మానవ శరీరం. లక్షలాది ఇతర జీవులుగా జన్మించడానికి బదులు అద్భుతమైన మానవ శరీరంలో జన్మించాం. కానీ ఈ మహద్భాగ్యం గురించి అసలు పట్టించుకోక, ఊరకనే అది లేదనీ, ఇది లేదనీ ఫిర్యాదులు చేస్తుంటాం. మనకు ఉన్న దాని మీద దృష్టి కేంద్రీకరిస్తే, ఎంతో కృతజ్ఞతాభావం మనకు కలుగుతుంది.

ఫిర్యాదు చేసే దృక్పథం మనకుంది కాబట్టి ఈ కృతజ్ఞతాభావం అంత సులువుగా కలగదు. ప్రతి ఒక్కరికీ వారు కోరుకున్న ప్రతి ఒక్కటీ లభించదన్న విషయం మనం గ్రహించాలి. జీవితంలో మనకు కొన్ని లభిస్తాయి. మరికొన్నిటిని కోల్పోతాం. ప్రతి ఒక్కరి జీవితం కొన్నిటిని 'పొందడం', కొన్నిటిని 'కోల్పోవడాల' మిశ్రమమే. వారి వారి పూర్వకర్మలను బట్టి ప్రతి ఒక్కరూ కొన్నిటిని పొందుతారు. మరికొన్నిటిని పొందరు. జీవితమంటే ఇలాగే ఉంటుంది! ❖

తెలుగుసేత: డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి

(మిగతా వచ్చే సంచికలో...)

మన బాధలను శాశ్వతంగా తొలగింపగలిగినది తత్త్వజ్ఞానం ఒక్కటే. ఇతరమైన జ్ఞానం మన బాధలను కొంత కాలం మాత్రమే తీర్చగలదు. వేదాంతానికి ఉన్న ప్రభావం మరి దేనికీ లేదు. - స్వామి వివేకానంద

చిదంబరేశుని పదార్చకుడు

కథ : టి.ఎమ్.సుందరరామన్ చిత్రాలు : శంకర్ అనుసృజన : స్వామి జ్ఞానదానంద


1 శివతత్త్వాన్ని లోకానికి ఉపదేశించిన గురువులు నలుగురు. వారు: పొయ్‌కణ్ణ శివం, అరుళ్‌నంది శివం, మరైజ్ఞాన సంబంధ శివం, ఉమాపతి శివం. చిదంబర ఆలయంలో కొలువైన నటరాజస్వామికి పూజార్చనలు చేసిన దీక్షితులలో ఉమాపతి శివం ఒకరు.




2 శాస్త్రచర్చలలో ఆరితేరి ఉండడం వల్ల ఉమాపతి శివం మర్యాద మన్ననలు పొందాడు. ఒకరోజు నాటి ఆచారం ప్రకారం ఆయన పల్లకీలో దేవాలయానికి వెళుతున్నాడు.



3 ఉమాపతి వెళుతున్న దారిలో మరైజ్ఞాన సంబంధర్ అనే యోగిపుంగవుడు వీధిలో నిలబడి శిష్యుడితో ఇలా అన్నాడు:





4 మరైజ్ఞాన సంబంధర్ అన్న మాటలు చెవిన పడగానే ఉమాపతి శివంలో అంతర్జ్యోతి ప్రకాశించింది. మరైజ్ఞాన సంబంధరే తనకు తగిన గురునాథులు అని అతడికి అర్థమైంది. వెంటనే పల్లకీ నుండి కిందకు దిగి, సంబంధర్‌కు ప్రణమిల్లి నిలబడ్డాడు శివం.




5 మరైజ్ఞాన సంబంధర్ జవాబివ్వకుండా అక్కడ నుంచి వేగంగా పరుగెత్తసాగాడు. ఉమాపతి శివమూ అతణ్ణి వెంబడించాడు. చివరికి సంబంధర్ నేతవారి వీధిలోకి వెళ్ళాడు.




6
అక్కడున్న ఒకరితో...
అయ్యా! ఆకలిగా ఉంది. ఏదైనా ఇవ్వండి.
స్వామీ! నేను పేదవాణ్ణి. నా వద్ద దారానికి పట్టించే గంజి మాత్రమే ఉంది.
ఆ, అది చాలు. నా దోసిట్లో పొయ్యండి.
7
ఆ నేత పనివాడు పోస్తూ ఉంటే, మరైజ్ఞాన సంబంధర్ గంజిని తాగసాగాడు. మోచేతి మీదుగా కారుతున్న గంజిని గురువు ప్రసాదంగా ఎంచి ఉమాపతి శివం త్రాగాడు.
8
ఈ చర్యతో గురువు, శిష్యుని పరిపక్వ స్థితిని గ్రహించి అతడికి శివతత్త్వాన్ని బోధించాడు.
9
ఈ సంఘటన చిదంబరంలోని దీక్షితుల వర్గంలో పెద్ద సంచలనాన్ని సృష్టించింది.
దీక్షితుడై ఉండి, ఉమాపతి శివం ఒక నేతగాడు ఇచ్చిన, మరొకరు పుచ్చుకొన్న ఉచ్ఛిష్టాన్ని (ఎంగిలిని) స్వీకరించవచ్చా?
చేయరాని ఈ పని చేసినందుకు ఉమాపతి శివాన్ని కులభ్రష్టుడిగా వెలివేయాలి. అతను ఆలయంలో ప్రవేశించకుండా నిషేధం విధించాలి.
అదే సరైన శిక్ష. అలాగే కానివ్వండి.
కులం నుండి వెలివేయబడ్డ ఉమాపతి శివం, మరైజ్ఞాన సంబంధర్ మార్గదర్శకత్వం మేరకు కోట్రవన్‌కుడి అనే చోట ఒక మఠాన్ని నెలకొల్పి భక్తులకు ఉపదేశాలు ఇస్తూ కాలం గడపసాగాడు.


10
ఆలయ ప్రవేశంపై నిషేధం ఉన్నప్పటికీ ఒకరోజు ఉమాపతి శివం తన మఠంలో మానసిక పూజలో లయించిపోయాడు.
దేవా! సదా సర్వవేళలో నా అంతరంగంలో కొలువుదీరి ఉన్నవాడివి గదా! నా ఈ మానసిక పూజను స్వీకరించు.
11
ఉమాపతి శివం మహత్వాన్ని లోకానికి చాటి చెప్పడానికి పరమశివుడు చిదంబరం ఆలయం నుండి అందమైన శివలింగాన్ని మాయం చేశాడు. దీక్షితులు లింగం కోసం ముమ్మరంగా వెతుకుతున్నప్పుడు అశరీర వాణి వినిపించింది.
ఉమాపతి శివం ఆరాధన మాత్రమే మాకు సంతృప్తినిస్తుంది. కనుక ఈ రోజు అతడి సమక్షంలోకి పోతున్నాం.
తమ తప్పును గ్రహించిన దీక్షితవర్గం వారు ఉమాపతి శివం వద్దకు పోయి మళ్ళీ ఆలయ పూజాదికాలను స్వీకరించమని వేడుకున్నారు.
12
మరొకసారి చిదంబరంలో ఆరుద్ర దర్శన ఉత్సవం నిమిత్తం దీక్షితులు ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించాలని నిశ్చయించారు. కానీ నాడు ఎంత ప్రయత్నించినప్పటికీ ధ్వజస్తంభాన పతాక ఆరోహణం జరగలేదు.
ఇదేమిటి? ముహూర్త కాలం దాటిపోయేట్లుంది. ధ్వజస్తంభాన పతాక ఆరోహణం మాత్రం జరగడం లేదు. ఈశ్వరా! ఏ దైవాపచారం జరిగిందో ఏమో తెలియడం లేదు.
13
అప్పుడు హఠాత్తుగా అశరీరవాణి వినవచ్చింది.
ఉమాపతి శివం వస్తేనే ధ్వజారోహణం జరుగుతుంది.


14
స్వామీ! మీ విషయంలో మేము అపచారం చేశాం. మీరు రాకుంటే ధ్వజారోహణం జరగదని సాక్షాత్తూ ఆ పరమేశ్వరుడే గ్రహింపజేశాడు. దయచేసి, మీరు వచ్చి ఉత్సవాన్ని జరిపించండి.
నా ప్రభువు ఆదేశాన్ని శిరసావహిస్తాను.
15
'కోటిక్కవి' అనే నాలుగు వెణ్‌పాక్కల్ (భక్తి గీతాలు) ఆలపించాడు. అంతే! వెంటనే పతాకం అప్రయత్నంగా పైకి వెళ్ళింది. అది చూసిన దీక్షితులు...
ఆహా! ఉమాపతి శివం ఎంతటి భక్తాగ్రేసరుడు. ఎంత ప్రయత్నించినప్పటికీ, పైకి కదలని పతాకం ఈయన భక్తిగీతాల వల్ల అప్రయత్నంగా పైకి వెళ్ళింది గదా! ఎంత అద్భుతం!





వార్తావాహిని

ధర్మసమ్మేళనం

విజయవాడ, రామకృష్ణ మిషన్ స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాల్లో భాగంగా 2013 సెప్టెంబర్ 16,17 తేదీల్లో ధర్మసమ్మేళనం నిర్వహించింది. 'భిన్నత్వంలో




ఏకత్వం' అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో స్వామి హర్షానందజీ, బెంగుళూరు; స్వామి శశాంకానందజీ, రాంచీ; స్వామి చిన్మయానందజీ, హరిద్వార్; స్వామి వేదాతీతానందజీ, శారదాపీఠ్, కోల్‌కతా; స్వామి స్వసంవేద్యానందజీ, స్వామి సేవ్యానందజీ, స్వామి సన్నివాసానందజీ, విజయవాడ; శ్రీ మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షులు; డాక్టర్ టి.జి.కె.మూర్తి, విశ్రాంత శాస్త్రవేత్త, ఇస్రో, బెంగుళూరు; డాక్టర్ జాబ్ సుదర్శన్, ఆంధ్ర లయోలా కళాశాల, విజయవాడ; డాక్టర్ యమ్.వి.రామ్‌కుమార్ రత్నం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు; శ్రీమహ్మద్ ముస్తాక్ అహ్మద్, కాకినాడ పాల్గొని స్ఫూర్తిదాయక ప్రసంగాలిచ్చారు.

ఈ కార్యక్రమంలో 1,250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ❖

రాజమండ్రి, శ్రీరామకృష్ణ మఠం స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని 2013 డిసెంబర్ 14,15,16 తేదీల్లో 'సనాతన ధర్మ సదస్సు'ను; 2013 డిసెంబర్ 18,19,20 తేదీల్లో 'యువసమ్మేళనం'ను నిర్వహిస్తుంది. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో పాల్గొనదలచినవారు నవంబర్ 30వ తేదీ లోపుగా ప్రతినిధి రుసుము రూ.50/- చెల్లించి పేర్లను నమోదు చేయించుకోవాలి. ఇతర ప్రాంతాల నుండి వచ్చి ధర్మ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించబడును. యువసమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు ప్రయాణ ఖర్చులు ఇవ్వబడును. పూర్తి వివరాల కోసం సంప్రతించండి - సెల్: 93966 73111, 93966 73112.

– అధ్యక్షులు, శ్రీరామకృష్ణ మఠం, రాజమండ్రి.



నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో 'వివేకానంద రథం' పర్యటన వివరాలు:

2013 నవంబర్ 1- మదునూరు; 2-జుక్కల్, కల్లాలి; 3,4 బాన్స్‌వాడ; 5- బిర్కూర్, కోటగిరి; 6,7 రుద్రూర్, బోధన్; 8- యడపల్లి, రేంజల్; 9-భైంసా; 10-బాసర; 11,12 నవీపేట్, నిజామాబాద్; 13 - ధర్మారం, డిచ్‌పల్లి; 14- భీమ్‌గల్; 15-కమ్మర్‌పల్లి; 16 - ఆర్మూరు; 17-బాల్కొండ; 18,19 నిర్మల్, బోథ్; 20-ఇచ్చోడ; 21,22 ఆదిలాబాద్; 23-ఉట్నూరు; 24-ఖానాపూర్, మామడ; 25 - మెట్‌పల్లి, కోరుట్ల; 26-జగిత్యాల, మల్యాల, నాచుపల్లి; 27-గంగాధర, వేములవాడ; 28-సిరిసిల్ల, కరీంనగర్; 29-నగ్నూరు, చామనపల్లి; 30 - చొప్పదండి.

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**

రామకృష్ణ - వివేకానంద భావ ప్రచార పరిషత్



22వ వార్షిక భక్త సమ్మేళనం, మారుటేరు, (ప.గో. జిల్లా) తేదీలు: 2014 జనవరి 3, 4, 5

సమ్మేళన ప్రాంగణం : రెడ్డి కల్యాణ మండపం, తాడేపల్లిగూడెం రోడ్, మారుటేరు.

పశ్చిమ గోదావరి జిల్లాలోని శ్రీరామకృష్ణ సేవాసమితుల ఆధ్వర్యంలో మారుటేరులో **2014 జనవరి 3,4,5** తేదీల్లో జరగబోయే 22వ వార్షిక భక్త సమ్మేళనానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

- ఈ సమ్మేళనంలో పాల్గొనదలచిన ప్రతినిధులు ఒక్కొక్కరు **రూ.200/-లు** ప్రతినిధి రుసుము చెల్లించవలెను. ఈ రుసుమును తేదీ **7-12-2013** లోగా **'శ్రీరామకృష్ణ సేవాసమితి, మారుటేరు'** పేరున మనియార్డర్/ డి.డి.ల ద్వారా క్రింద సూచించిన చిరునామాకు పంపవలెను. సంస్థలు రుసుము చెల్లించిన ప్రతినిధుల వివరాలను సంబంధిత పత్రములో పొందుపరచి క్రింది చిరునామాకు పంపవలెను.
- ప్రతినిధులకు భోజన, వసతి సౌకర్యాలు 2014 జనవరి 3వ తేదీ శుక్రవారం ఉదయం నుండి జనవరి 5వ తేదీ ఆదివారం సాయంత్రం వరకు ఏర్పాటు చేయబడును.
- ప్రతినిధులకు సాధారణ వసతి సౌకర్యములు మాత్రమే ఏర్పాటు చేయబడును. ప్రత్యేక సదుపాయాలు కావాల్సినవారు హోటల్ నందు గదులు స్వయముగా రిజర్వు చేసుకొనగలరు.
- **భక్తుల సేవ భగవంతుని సేవ** గనుక ఈ బృహత్ కార్యక్రమములో శ్రీరామకృష్ణ సేవాసమితి భక్తులు, శ్రేయోభిలాషులు, అభిమానులు, యావన్మందీ పాల్గొని ధన, వస్తు, సేవా రూపేణ తమవంతు సహాయ సహకారములు అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరు.
- ఈ భక్తసమ్మేళనం సందర్భంగా ఒక స్మారక సంచికను విడుదల చేయనున్నాము. ఆ సంచికలో ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిగా కోరుచున్నాము. ప్రకటన వివరాలతో కూడిన సి.డి.ని - డాక్టర్ పన్నాల శ్యామసుందరమూర్తి, ఇంటినెం. 13-3-20, గుంటూరువారి తోట, 2వ లైను, గుంటూరు - 522 001 చిరునామాకు పంపగలరు.

ప్రకటనల ట్యారిఫ్ వివరాలు :

	పూర్తి పేజీ	అర పేజీ	పావు పేజీ
కలర్	6,000	3,000	1,500
బ్లాక్ & వైట్	3,000	1,500	800
2,3 కవరు పేజీలు	15,000	-	-
4వ కవరు పేజీ	20,000	-	-

- పై కార్యక్రమాలకు విరాళములు, ప్రతినిధి రుసుములు, ప్రకటనల రుసుములను మనియార్డర్/ డి.డి.ల ద్వారా **మద్దుల వేంకటేశ్వరరావు, విజయలక్ష్మి జ్యూయలర్స్, టి.పి.గూడెం రోడ్డు, మారుటేరు - 534 122** చిరునామాకు పంపించవలెను. చెక్కులు స్వీకరించబడవు. బ్యాంక్ డి.డి.లను **శ్రీరామకృష్ణ సేవాసమితి, మారుటేరు అకౌంట్ నెం. 11289011477, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మారుటేరు** (IFSC-SBIN001737) పేరున తీసి, పంపగలరు.

మీ అమూల్య సహాయ, సహకారములతో ఈ మహత్తర కార్యక్రమమును విజయవంతం చేయ ప్రార్థన.

సంప్రతించవలసిన చిరునామా

శ్రీరామకృష్ణ సేవా సమితి, మారుటేరు
వి.ఎస్.ఎన్. మూర్తి, (నిర్వహణ కార్యదర్శి) **98663 69986**
చిర్ల సూర్యనారాయణ రెడ్డి - **94404 85495**
వి.ప్రకాశరావు (బాబ్జీ) - **94914 79831**
చిర్ల సత్యనారాయణ రెడ్డి - **97054 35559**


Vol.70-11, Sri Ramakrishna Prabha (Telugu Monthly) November 2013, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57.
Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18th of every month.

ఆధ్యాత్మిక అమృతవాహిని

శ్రీ రామకృష్ణ ప్రభ

డిసెంబర్ 2013

₹10




సుబోధ

శ్రీరామకృష్ణులు: భగవంతుని పట్ల సంసారుల ప్రేమ ఎలాంటిదంటే, ఎర్రగా కాలిన పెనంపై నీటి బిందువు పడితే 'సుయ్' అని పొంగి వెంటనే మాయమై పోతుందే – అలాంటిదన్నమాట. సంసారుల మనస్సు విషయసుఖాల వైపు మరలి ఉంటుంది. అందుచేతనే వారికి భగవంతుని పట్ల సంపూర్ణ ప్రేమ, వ్యాకులతలు జనించవు.

ఏకాదశిని మూడు రకాలుగా పాటిస్తారు. మొదటి రకం: నిర్జల ఏకాదశి – నీరు కూడా త్రాగకుండా ఉపవసించడం. అంటే అన్ని రకాల భోగాలనూ పూర్తిగా పరిత్యజించినవాడు. రెండవ రకం: పాలు, ఫలహారం పుచ్చుకోవడం. ఇటువంటి భక్తుడు సంసారంలోని సామాన్య సుఖాలను అనుభవిస్తాడు. మూడో రకం: పూరీ, బంగాళదుంప కూరతో కడుపు నిండా తింటూ ఏకాదశిని పాటిస్తాడు. పైగా వీలుపడితే రెండు రొట్టెలను పాలలో నానబెడతాడు – తరువాత వచ్చి ఒక పట్టు పట్టడానికి. ఈ కోవకు చెందిన భక్తులు సాధన, భజనలు చేస్తూ ఉంటారు. కానీ మనస్సేమో కామినీ కాంచనాలపైనే ఉంటుంది.

మనస్సు భోగాలను వాంఛించడం వల్లనే సాధన, భజనలు సత్ఫలితాలను ఇవ్వవు. కొందరు కొండ గుహలలో వసిస్తూ ఉంటారు, ఒంటికి విభూతి పూసుకొంటారు, ఉపవాసం చేస్తారు. పలు రకాల కఠోర తపస్సులు ఒనరిస్తారు. కానీ లోలోన మనస్సు విషయసుఖాలను వాంఛిస్తూ ఉంటుంది. కామినీ కాంచనాలను ఆకాంక్షిస్తూ ఉంటుంది. ఎవరైతే కామినీ కాంచనాలను ఆశించక, ఆనందంగా ఉంటారో వారే నిజంగా ధన్యులు. ❖



శ్రీరామకృష్ణ ప్రభ

రామకృష్ణ మఠం, దోమల్‌గూడ, హైదరాబాదు–500 029
ఫోన్: 040–27667799, మొబైల్: 8801849494
E-mail: sriramakrishnaprabha@gmail.com

నిర్వాహక సంపాదకులు: **స్వామి జ్ఞానదానంద** సంపాదకులు: **స్వామి పరిజ్ఞేయానంద**



ఆధ్యాత్మిక అమృతవాహిని
శ్రీ రామకృష్ణ ప్రభ
సంపుటం: 70 సంచిక: 12 డిసెంబర్ 2013

యా మాతా పరదోషదృష్టి విముఖీ దీనైస్సమం ఖేదినీ
యా శక్తిః శ్రిత పాపనాశనకరీ సద్బుద్ధి సంధాయినీ
యా శక్తిః భవపాశ ఛేదన కరీ కైవల్య సంధాయినీ
యా వై మానుష దివ్య సద్గుణవతీ సా శారదా పాతు నః

ఇతరుల దోషాలను చూడడానికి విముఖత చూపే తల్లి శారద. దీనుల దుఃఖాలను భరించే తల్లి శారద. ఆశ్రయించిన వారి పాపాలను నాశనముచేయు శక్తి శారద. సద్బుద్ధిని కలుగజేయు శక్తి శారద. సంసార పాశాలను ఛేదించు శక్తి శారద. కైవల్యాన్ని ప్రసాదించు శక్తి శారద. మానవ సద్గుణాలనూ, భగవంతుని అద్భుత గుణాలనూ కలబోసుకొన్న తల్లి శారద మనలను రక్షించుగాక! – *విష్ణుభట్ల విరచిత 'శ్రీశారదాష్టకం' నుండి*



స్మృతిపథంలో స్ఫూర్తిప్రదాత


స్వామి వివేకానంద ఒక గొప్ప యోగి మాత్రమే కాదు; ఒక మహోన్నత జాతీయవాది కూడా. ఆయన భారత జాతీయతను ఉన్నత పీఠానికి చేర్చారు. మనదేశ పూర్వవైభవాన్ని పునరుద్ధరించారు. స్వామీజీ చేపట్టిన జాతీయ ఉద్యమంలో ఉన్నత వర్గీయులు, తక్కువ స్థాయివారు, ధనవంతులు, బీదలు–ఇలా కోట్లాది ప్రజలు తమ తారతమ్యాలను విస్మరించి పాల్గొన్నారు. దేశ ప్రజల్లో జాతీయతా భావాన్ని మేల్కొలపడానికి తన జీవితాన్నే అంకితం చేశారు స్వామీజీ.


స్వామీజీ యోగిగా జీవించినా, దేశభక్తులకు దేశభక్తునిగా రాణించారు. దేశ ప్రజలలో పరిపుష్టతను పునరుద్ధరించి, తద్వారా భారతదేశ పవిత్ర ఘనతకు పూర్వస్థాయిని సమకూర్చాలన్న ఆలోచన ఆయన మనస్సులో ప్రథమ స్థానాన్ని ఆక్రమించింది.

శక్తి సామర్థ్యాలనూ, సౌష్ఠవాన్నీ సమకూర్చుకొని వ్యవహరించాలని స్వామీజీ భారత ప్రజలకు పిలుపునిచ్చారు. మన వేదాంతం ప్రబోధించినట్లు, 'అన్ని జీవులూ దైవాంశ సంభూతులే' అని పదే పదే గుర్తు చేశారు. ఆయన ధర్మసూక్తులు జాతీయ జీవిత ప్రవాహాన్ని ఉద్దీపింపజేసి, నూతన ఉత్తేజాన్ని కలిగించాయి.


స్వామీజీ బోధనల్ని విని ఉత్తేజితులై తీవ్రబాధల్ని సైతం సహనంతో, ప్రమోద హృదయంతో స్వీకరించిన మహాత్ములెందరో! చివరకు మరణాన్ని కూడా నిర్భయంగా ప్రశాంత చిత్తంతో స్వాగతించిన త్యాగధనులెందరో! ఈ నాటికీ స్వామీజీ నెలకొల్పిన జాతీయతా భావనలు ప్రజలను స్పందింప చేస్తూనే ఉన్నాయి. ❖

– *రమేశ్ చంద్ర మజుమ్‌దార్*
(ప్రసిద్ధ చరిత్రకారుడు, ప్రముఖ విద్యావేత్త)





శ్రీరామకృష్ణ ప్రభ శాశ్వత నిధి

ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచి పెట్టేందుకు 'శ్రీరామకృష్ణ ప్రభ' కృషి చేస్తోంది. నిధుల కొరత లేకుండా ఈ జ్ఞానయజ్ఞం నిరంతరాయంగా సాగేందుకు 'శ్రీ రామకృష్ణ ప్రభ శాశ్వతనిధి'కి ధన దానం చేసి ప్రోత్సహించాల్సిందిగా కోరుతున్నాం. దాతల పేర్లు పత్రికలో ప్రచురిస్తాం.

మహారాజ పోషకులు......	రూ.	10,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
రాజ పోషకులు...........	రూ.	5,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.
పోషకులు................	రూ.	1,000/-, అంతకన్నా ఎక్కువ విరాళం ఇచ్చేవారు.

	దాత పేరు చిరునామా	రూ.
మహారాజ పోషకులు	: శ్రీ డి. హనుమంతు, హిమాయత్ నగర్, హైదరాబాద్ (కీ।।శే। గురురాజచారి గారి జ్ఞాపకార్థం)	10,116
మహారాజ పోషకులు	: శ్రీ జి.కె. నారాయణ ఆచారి, పామిడిరోడ్, వజ్రకరూర్, అనంతపురం జిల్లా - 515 832	10,116
పోషకులు	: శ్రీమతి పాశం శైలజ, విఠల్ నగర్, గోదావరిఖని, కరీంనగర్ జిల్లా (కీ।।శే। గణపా సాయికుమారిగారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు	: శ్రీమతి పెట్ల లక్ష్మీరాజేశ్వరి, చందానగర్, హైదరాబాద్ (కీ।।శే। పెట్ల వీరభద్రరావు గారి జ్ఞాపకార్థం)	1,116
పోషకులు	: శ్రీ ఎమ్ చలమా రెడ్డి, కె.పి.హెచ్.బి. కాలనీ, హైదరాబాద్ (కీ।।శే। ఎమ్.సుబ్బరామిరెడ్డి, పార్వతమ్మ గార్ల జ్ఞాపకార్థం)	1,116
పోషకులు	: ఒక భక్తురాలు, హైదరాబాద్	1,000

'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక చందాను
ఆన్‌లైన్ **http://kinige.com/srkp** ద్వారా చెల్లించవచ్చును.

చందా వివరాలు		భారతదేశంలో	విదేశాలలో
విడి ప్రతి	:	₹ 10	-
సంవత్సర చందా	:	₹ 100	₹ 1,500
మూడు సంవత్సరాలకు	:	₹ 280	₹ 4,500
ఐదు సంవత్సరాలకు	:	₹ 450	₹ 7,500
ఇరవై సంవత్సరాలకు	:	₹ 1,500	₹ 22,000

గమనిక: డిమాండ్ డ్రాఫ్ట్, మనియార్డర్లలో Ramakrishna Math, Hyderabad అని వ్రాయాలి.
పంపవలసిన చిరునామా: Sri Ramakrishna Prabha, Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029.

చందాను ఆన్‌లైన్ http://kinige.com/srkp ద్వారాచెల్లించవచ్చు.

లోపలి పేజీల్లో...

శ్రీరామకృష్ణ ప్రభ చందాదారులకు విన్నపం

ప్రియ పాఠకులారా!

- 'శ్రీరామకృష్ణ ప్రభ' పత్రిక కవరు మీద చిరునామాకు పైన మీ చందా నంబరు, కుడి వైపున మీ చందా గడువు ముగిసే నెల ఉంటాయి. మీ చందా గడువు పూర్తయ్యే నెలకు ముందుగానే సొమ్మును చెల్లించి చందాను పునరుద్ధరించుకోండి.
- మీ ఉత్తర ప్రత్యుత్తరాలన్నింటిలో తప్పనిసరిగా చందా నంబరు పేర్కొనాల్సిందిగా మనవి.
- మీ చిరునామా మారిన పక్షంలో 7వ తేదీ లోగా మాకు తెలియపరచినట్లయితే, వచ్చే నెల సంచిక నుండి మీ కొత్త చిరునామాకు పంపబడును.
- ప్రతీ నెల 26 లేదా 27వ తేదీల్లో పత్రిక పోస్ట్ అవుతుంది. మీకు పత్రిక 15వ తేదీ లోపుగా చేరనట్లయితే, వెంటనే మాకు తెలియజేయగలరు.

శ్రీరామకృష్ణ ప్రభ ద్వారా అవిచ్ఛిన్నంగా సేవలు అందించాలన్నదే మా ఆకాంక్ష. అందుకు మీ సహకారం కోరుతూ.... - సర్క్యులేషన్ మేనేజర్

SRI RAMAKRISHNA PRABHA, RAMAKRISHNA MATH
DOMALGUDA, HYDERABAD - 500 029. Andhra Pradesh
Phone No: 040- 27667799, 8801849494 E-mail : sriramakrishnaprabha@gmail.com

సంఘజనని అద్భుతశక్తి



నేడు 'రామకృష్ణ సంఘం' అనే మహావృక్షం శాఖోపశాఖలుగా ప్రపంచమంతా విస్తరించింది. ఈ మహావృక్షాన్ని ఆశ్రయించి వేలాది జనులు ఆధ్యాత్మిక దాహార్తిని తీర్చుకొని సేద తీరుతున్నారు. సంసార తాపాన్ని చల్లార్చుకుంటున్నారు. ఈ మహావృక్షానికి బీజరూపం శ్రీరామకృష్ణుల శక్తి అయితే, ఆ బీజానికి ప్రేమ అనే నీరు పోసి, దయ అనే గాలి వీచి, సేవ అనే ఎరువు వేసి, త్యాగం అనే వెలుగునిచ్చి, క్షమ అనే కంచె వేసి దాన్ని అంకురింపజేసి ఓ మహావృక్షంగా తీర్చిదిద్దిన అద్భుతశక్తి – 'శ్రీశారదా దేవి'.

సంఘపోషిణి: అప్పుడే కళ్ళు తెరచి ప్రపంచాన్ని తిలకిస్తున్న పిల్లలను వదిలి తల్లి పక్షి ఎగిరి పోయినట్లు, ఆధ్యాత్మిక లోకానుభూతుల్ని అప్పుడప్పుడే ఆస్వాదిస్తున్న యువ శిష్యులను విడచి శ్రీరామకృష్ణులు వెళ్ళిపోయారు. అలాంటి తరుణంలో నిరాశ్రయులైన ఆ బాలుర సంరక్షణా బాధ్యతలను వహించి, వారికి మార్గనిర్దేశం చేస్తూ, వారిని ఆధ్యాత్మిక వినీలాకాశంలో విహరించడానికి పరిపుష్టుల్ని చేసిన మహాశక్తి స్వరూపిణి మాతృమూర్తి శ్రీశారదాదేవి.

శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం సోదర శిష్యులంతా పడిన కష్టాలనూ, ఆందోళనలనూ స్వామి వివేకానంద గుర్తు చేసుకుంటూ "మేమంతా కలసి శ్రీరామకృష్ణులు నిర్దేశించిన మార్గంలో జీవించాలనీ, గురుదేవుల సందేశాన్ని వ్యాప్తి చేయాలనీ సంకల్పించినప్పుడు అందరూ మమ్మల్ని పిచ్చివాళ్ళలా చూశారు. ఈ బాలురు ఏమి సాధించగలరని పరిహసించారు. ప్రతి ఒక్కరూ మమ్మల్ని నిరుత్సాహపరిచేవారే గానీ మాపై కనికరం చూపి ఆదరించేవారు ఒక్కరూ లేరు. అలాంటి క్లిష్ట పరిస్థితుల్లో మాకు అండగా నిలచి, మమ్మల్ని ఆదరించి, ఆదర్శ మార్గంలో నడిపించిన కరుణామూర్తి శ్రీశారదాదేవి. ఆ ప్రేమమూర్తి ఆదరణ మాలో అనంతశక్తిని నింపింది" అని మాతృదేవిని శ్లాఘించారు స్వామీజీ.

శ్రీరామకృష్ణుల సందేశాన్ని ప్రచారం చేసి, రామకృష్ణ సంఘాన్ని విశ్వవ్యాప్తం చేసింది స్వామి వివేకానందయే అన్నది నిర్వివాదాంశం. అలాంటి స్వామీజీయే శారదామాత ఔన్నత్యాన్ని ప్రస్తుతిస్తూ, 'అమ్మా! మీ అనుగ్రహం ఉంటే నా లాంటి వివేకానందులు వందల మంది ఆవిర్భవిస్తారు. కానీ మీ లాంటి మాతృమూర్తి మాత్రం వేరొకరుండరు' అని కీర్తించారు.

శ్రీరామకృష్ణుల శిష్యులను తల్లిలా సంరక్షించి, పోషించి, మార్గనిర్దేశం చేసిన అద్భుతశక్తి స్వరూపిణి – శ్రీశారదాదేవి. అందువల్లనే మాతృమూర్తిని 'సంఘజనని' అని స్వామీజీ ప్రకటించారు.

సంఘపాలిని: శ్రీరామకృష్ణుల మహాసమాధి అనంతరం నరేంద్రాది శిష్యులంతా చెట్టుకొకరు పుట్టకొకరుగా చెల్లాచెదురై దేశ సంచారం చేస్తుండడం మాతృమూర్తి మనస్సును కలవరపరిచింది. ఆ మాతృ హృదయం కరిగి కన్నీరై ప్రవహించింది.

కాలాంతరంలో మాతృదేవి సంఘ ఆవిర్భావ విషయంలో తాను గురుదేవుల్ని ఎలా ప్రార్థించానో ప్రస్తావిస్తూ ఇలా అన్నారు: "ఓ ప్రభూ! మీరు వచ్చి లీలావినోదం గావించి నిష్క్రమించారు. అంతటితో మీ అవతార లక్ష్యం పూర్తయిందా? మిమ్మల్ని నమ్ముకొని సర్వస్వమూ త్యజించిన నా బిడ్డలు బిచ్చమెత్తుకుంటూ చెట్ల క్రింద పడివుండడం నేను భరించలేను. ప్రాపంచిక బంధాలను, సుఖాలను త్యజించిన నా బిడ్డలకు కనీస అవసరాలను తీర్చి వారందరినీ ఒక చోట కలిసి జీవించేలా చేయి". ఆనాటి అమ్మ కన్నీటి ధారా ప్రవాహ ఫలితంగానే నేడు 'రామకృష్ణ సంఘం' పావన గంగై ప్రవహిస్తోంది.

శ్రీరామకృష్ణుల సందేశవ్యాప్తి తాను అనుకున్నంత వేగంగా, సంతృప్తికరంగా సాగడం లేదని స్వామీజీ కలత చెందినప్పుడు మాతృమూర్తి, "నాయనా! కలత చెందకు. నువ్వు చేస్తున్నవీ, ఇక ముందు చేయబోయేవీ శాశ్వతంగా నిలచిపోతాయి. నీ ఆశయాన్ని గురుదేవులు తప్పక నెరవేరుస్తారు. ఈ లోకం నిన్ను సద్గురువుగా ఆరాధిస్తుంది. ఇది తథ్యం" అని భవిష్యవాణిని పలికి స్వామీజీని ప్రోత్సహించారు. రామకృష్ణుల శిష్యులందరినీ ఒకచోట సంఘటితపరచి, వారికి మార్గదర్శినిగా నిలచి రామకృష్ణ సంఘ అభ్యుదయంలో కార్యదక్షతను ప్రదర్శించిన సంఘపాలిని మాతృమూర్తి.

సంఘ రక్షిణి: సొంత అన్నదమ్ములే కలసి ప్రశాంతంగా జీవించలేని నేటి పరిస్థితుల్లో, ఏ ఇద్దరూ కలసి ఒక్క రోజు కూడా పనిచేయలేని ఈ రోజుల్లో – రామకృష్ణ సంఘ

సన్యాసులు వివిధ ప్రాంతాలకూ, విభిన్న జాతులకూ, విభిన్న సంస్కృతీ సంప్రదాయాలకూ, వివిధ మతాలకూ చెందినవారైనప్పటికీ వారంతా ఒకేచోట కలసికట్టుగా జీవించడం ఓ అద్భుతం. అలాగే విభిన్న స్వభావాలు, మనస్తత్వాలు కలవారందరూ సంఘటితంగా పనిచేయడం మహాద్భుతం. ఇది ఎలా సాధ్యమైందని చాలామందికి ఆశ్చర్యం కలిగించే విషయం. 'ప్రేమానుబంధమే నా బిడ్డలందరినీ సంఘటితంగా ఉంచి, పని చేయిస్తుంది' అన్న శారదాదేవి మాటలే అందుకు సమాధానం.

అయితే శారదాదేవి రామకృష్ణ సంఘ సన్యాసుల్ని సంఘటితంగా నడిపించడానికి కేవలం ప్రేమ మంత్రాన్నే ప్రయోగించారా? కాదు. సన్యాస ఆదర్శాలను ఉల్లంఘించిన వారి పట్ల కాఠిన్యాన్ని కూడా ప్రదర్శించారు. ఒకసారి ఓ సన్యాసి సన్యాసాదర్శాలకు విరుద్ధంగా ప్రవర్తించాడు. శారదాదేవి అతణ్ణి సంఘం నుండి తొలగించాలని తీర్మానించారు. అప్పుడు అతడు 'మరెన్నడూ అలాంటి తప్పు చేయను. క్షమించమ'ని శారదమ్మను వేడుకున్నాడు. అందుకు శారదాదేవి 'నువ్వు చేసిన ఎన్నో తప్పుల్ని క్షమించాను. కానీ పవిత్ర సన్యాసాశ్రమానికి కళంకం తెచ్చే నీ అనుచిత ప్రవర్తన మన్నింపరానిది. నువ్వు ఇక ఈ సంఘంలో ఉండడానికి అనర్హుడవు' అని కాఠిన్యాన్ని ప్రదర్శించడంలో అమ్మ మృదు హృదయం వెనుకంజ వేయలేదు.



అలాగే రామకృష్ణ మిషన్ సంస్థ చాలా మంది యువకులను సంఘటిత పరచి, వారిని విప్లవకారులుగా తయారుచేస్తుందని బ్రిటీష్ ప్రభుత్వం అనుమానించి, దుష్ప్రచారం చేసినప్పుడు సంఘ ప్రతిష్ఠకు భంగం వాటిల్లుతుందని తలచిన శారదాదేవి, స్వామి శారదానందను పిలచి, "శ్రీరామకృష్ణులు సత్యస్వరూపులు. గురుదేవుల ఆదర్శాలకు అనుగుణంగా జీవితాలను గడుపుతున్న సన్యాసులు ఎట్టి పరిస్థితుల్లోనూ అసత్యం పలకరు. అవసరమైతే శ్రీరామకృష్ణుల బిడ్డలు ఎన్ని కష్టాలైనా అనుభవిస్తారు, కానీ ఎలాంటి పరిస్థితుల్లోనూ అవినీతికి పాల్పడరు" అని బ్రిటీష్ ప్రభుత్వాధికారికి వివరించాల్సిందిగా సూచించారు. మాతృమూర్తి సూచన మేరకు స్వామి శారదానంద బ్రిటీష్ ప్రభుత్వ అధికారి దగ్గరకు వెళ్ళి విషయాన్ని వివరంగా చెప్పారు. అప్పుడు ఆ బ్రిటీష్ ప్రభుత్వ అధికారికి రామకృష్ణ మిషన్ సంస్థ పట్ల ఉన్న అనుమానాలు, అపోహలు తొలగిపోయాయి. అంతేకాకుండా అతడు రామకృష్ణ మిషన్ మానవాళికి చేస్తున్న సేవలను ప్రశంసించాడు.

ఆ విధంగా రామకృష్ణ సంఘ ఆదర్శాలనూ, గౌరవ ప్రతిష్ఠలనూ పరిరక్షించడంలో శ్రీశారదాదేవి ప్రధాన పాత్రను పోషించారు.

అమ్మతో స్వామీజీ అనుబంధం: వేదాంత సింహగర్జనతో ప్రపంచాన్ని ఉర్రూతలూగించిన స్వామి వివేకానంద, శారదామాత సన్నిధిలో ఓ పసి బాలుడిలా మసలేవారు. మాతృమూర్తి పట్ల స్వామీజీకున్న ఆరాధనా భావాన్నీ, అనన్య భక్తిప్రపత్తులనూ చూసినవారు ఆశ్చర్యచకితులయ్యేవారు.

మాతృమూర్తికి ప్రణామాలర్పించినప్పుడు స్వామీజీ అంతటి పరమ పవిత్రులు కూడా ముందుగా గంగాజలాన్ని చల్లుకొని ఆ తరువాతే అమ్మకు ప్రణమిల్లేవారు. ఎవరైనా అమ్మ పాదాలను తాకితే వారితో స్వామీజీ "అమ్మ పరమపావని. అమ్మ పాదాలను తాకినప్పుడు కరుణామూర్తి అయిన అమ్మ మనలోని పాపాలను స్వీకరిస్తుంది. ఆ కారణంగా అమ్మ శారీరక బాధలను అనుభవించాల్సి వస్తుంది. కాబట్టి మనస్సులోనే అమ్మను ప్రార్థిస్తే చాలు, అమ్మ తప్పక మనల్ని ఆశీర్వదిస్తుంది" అని చెప్పేవారు.

ఒకసారి స్వామీజీ శారదామాతతో 'అమ్మా! నా నుండి అన్నీ ఎగిరిపోతున్నాయి' అని అన్నారు. అందుకు అమ్మ 'నరేన్! నేను నీ నుండి ఎగిరిపోకుండా జాగ్రత్తపడు నాయనా!' అని బదులిచ్చారు. అప్పుడు వెంటనే స్వామీజీ "అమ్మా! మీరు నా నుండి ఎగిరిపోతే ఇక నేను లేను. నాలో మీరు లేకపోయినట్లయితే నాకు జ్ఞానం ఎక్కడి నుండి ఉత్పన్నమవుతుంది?" అని అంటూ స్వామీజీ అమ్మ పట్ల తనకున్న అనుబంధాన్ని వ్యక్తపరిచారు.

'అమ్మ ఆశీస్సులతోనే ప్రపంచమంతా చుట్టి రాగలిగాననీ, నా ద్వారా అమ్మ అన్ని కార్యాలనూ చేయిస్తుందనీ, అమ్మ నాలో లేనినాడు నేను లేన'నీ మాతృమూర్తి మాహాత్మ్యాన్ని స్వామీజీ పదే పదే వక్కాణించేవారు.

రామకృష్ణ సంఘ ఆవిర్భావంలోనూ, మార్గదర్శనంలోనూ, పరిరక్షణలోనూ అనన్య సామాన్యమైన ప్రతిభను ప్రదర్శించి స్త్రీ శక్తిని ప్రపంచానికి చాటిన అద్భుతశక్తి స్వరూపిణి శ్రీశారదాదేవి.

భారతీయ మహిళలు ఆత్మగౌరవం, ఆత్మశక్తి, వివేకం, సహనం, సానుకూల దృక్పథం, కార్యదక్షతలు అలవరచుకోవాలని స్వామీజీ ఆశించారు. స్వామీజీ ఆశించిన సర్వశక్తులకూ ప్రతిరూపం శారదాదేవి. మనకు కూడా ఆ శక్తులను ప్రసాదించాల్సిందిగా సర్వశక్తి స్వరూపిణి అయిన శారదమ్మను ప్రార్థిద్దాం. ఆ పావన గంగా ప్రవాహంలో మునిగి పునీతులమవుదాం. ❖

అమ్మా! మీ కృపాశీస్సులతో నాలాంటి వివేకానందులు వేలాదిమంది ఉద్భవిస్తారు. కానీ మీ లాంటి 'అమ్మ' మాత్రం మరొక్కరు లేనే లేరు. మీరు నాలో లేనినాడు నేను లేను తల్లీ! -స్వామి వివేకానంద

గోరుముద్ద - స్వామి సుప్రియానంద



ఆలోచనలేని అనుకరణ

'సెంటిమెంట్ - ప్రబల విశ్వాసం, సున్నిత మనోభావం' అని అర్థం. ఇది హేతుబద్ధం కాదు. ఉద్వేగ పూరితమైనది. అందుకనే 'ఎవరికుండే సెంటిమెంట్స్ వారి కుంటాయి' అనుకొని సర్దుకుపోతుంటాం!

ఒక్కోసారి ఎవరి సెంటిమెంట్స్ మనకు నచ్చవో వారిని విమర్శిస్తూ కాలం గడుపుతాం. అశాంతికి లోనవుతాం. కొన్ని సార్లు మనకు నచ్చిన వాళ్ళ సెంటిమెంట్స్ మన సెంటిమెంట్స్ అవుతాయి. ఇక్కడ మనం కొంచెం జాగ్రత్త వహించకపోతే ఇబ్బందుల పాలవుతాం.

ఒక భక్తురాలు రామకృష్ణ మిషన్‌కు వెళుతూ ఉంటుంది. ఈ మధ్య తనతో పాటు తన పదహారేళ్ళ కూతురుని కూడా ఆశ్రమానికి తీసుకువెళుతోంది. ఆ అమ్మాయి రామకృష్ణ మఠం ప్రచురించిన పుస్తకాలు అనేకం చదివింది. ముఖ్యంగా గృహస్థ శిష్యులైన నాగమహాశయుని జీవితం చదివి ఆయన అచంచల భక్తికి ఆ అమ్మాయి బాగా ఆకర్షితురాలైంది. చదివిన దాన్ని ఆచరించాలనే ప్రబలమైన కోరిక ఆమెలో కలిగింది.

ఒకరోజు ఆశ్రమంలో ఇచ్చిన ప్రసాదంలో రాయి ఉంది. ఆ రాయిని తీయకుండా ప్రసాదంతో పాటు తినేసింది. ఇదంతా గమనించిన తల్లి 'రాయిని ఎందుకు తిన్నావే?' అని చీవాట్లు పెట్టింది. అప్పుడు ఆ అమ్మాయి 'అమ్మా! ఊరకనే పుస్తకాలు చదివి, దానిలో ఉన్నది పాటించకపోతే ఏం ప్రయోజనం?' అంటూ తల్లికి బోధ చేసింది. అంతటితో ఆగకుండా తాను చేసిన పనిని సమర్థించుకుంటూ శ్రీరామకృష్ణుల గృహస్థ శిష్యుడైన నాగమహాశయుని జీవితం నుండి ఒక సంఘటనను ఇలా ఉల్లేఖించింది:

"శ్రీరామకృష్ణులు దక్షిణేశ్వరంలో ఒక రోజున శశి మహరాజ్ (స్వామి రామకృష్ణానంద)తో నాగమహాశయను తీసుకెళ్ళి ప్రసాదం పెట్టించమని చెబుతారు. ఆ రోజు ఏకాదశి. ఉపవాసం ఉండడం వల్ల ప్రసాదం తిననని నాగమహాశయ మొండికేశారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీరామకృష్ణులు ప్రసాదాన్ని స్పృశించి నాగమహాశయను తినమంటారు. గురువు ఆజ్ఞను శిరసావహించిన నాగమహాశయుడు ప్రసాదంతో పాటు విస్తరాకును కూడా తినేశారు".

భక్తురాలి కూతురైన మన కథానాయకి రాయి తిని కడుపు నొప్పికి మాత్రమే లోనయ్యింది. మరి భక్త కన్నప్ప సెంటిమెంట్‌కు పోతే ఏమై ఉండేదో!

ఇక్కడ మనం అర్థం చేసుకోవాల్సింది ఏమిటంటే... మహాత్ముల సెంటిమెంట్స్‌కు లోపల ఉన్న పునాది రాళ్ళు- కంటికి కనపడని అచంచల భక్తి విశ్వాసాలు, నిర్మల మనస్సు, నిజాయతీ!

నాగమహాశయుడు భక్తి పారవశ్యంలో ప్రసాదంతో పాటు విస్తరాకును కూడా తిన్నాడన్న సంగతి ఇక్కడ మనం గుర్తుంచుకోవాల్సిన విషయం. మనలో కూడా అలాంటి భక్తి పారవశ్యం కలిగిననాడు మనం చేస్తున్నది ఇతరులు గమనిస్తున్నారా? లేదా? అనే ఆలోచనే కలగదు. అలాగే మన చేతలను సమర్థించుకోవాలనే ఆలోచనే రాదు.

అందువల్ల మహాత్ముల జీవితాలను చదివి ఆలోచనలేని అనుకరణతో ఇబ్బందుల పాలుకాకుండా జాగ్రత్తపడాలి. ముందుగా భగవంతుణ్ణి 'భక్తి విశ్వాసాలు, వివేక వైరాగ్యాలు, నిష్కాపట్యం, నిర్మలత్వం ప్రసాదించమ'ని మనసారా ప్రార్థించాలి. ❖



సర్వయోగ సమన్వయం - గీతా సారం

- స్వామి హర్షానంద

ప్రస్థానత్రయంలో ఒక భాగమే కాక, ఉపనిషత్సారంగా ప్రస్తుతినీ, వేదాంత గ్రంథంగా కీర్తినీ అందుకున్న భగవద్గీత, నవీన కాలంలోనూ ఎన్నో సరికొత్త కోణాలలో ఆవిష్కృత మవుతూ, పూజనీయమై, ఖ్యాతిని పొందుతోంది. ఈ గీత మానవ జీవితాన్ని తీర్చిదిద్దుకునేందుకు ఉపకరించే సర్వధర్మ సారమే అనడం అతిశయోక్తి కాదు. 'సర్వయోగ సమన్వయం, నిష్కామకర్మ అనే రెండు విశిష్టతలు భగవద్గీత ప్రముఖ లక్షణాల'ని స్వామి వివేకానంద పేర్కొన్నారు.







సర్వయోగ సమన్వయం: జీవుణ్ణి శివునితో ఐక్యం చేయడానికి సహాయపడే ప్రతీ క్రియా యోగమే. లోకంలో ఉన్న వివిధ మనస్తత్వాల వారికి అనుగుణంగా ఈ యోగాన్ని నాలుగు విధాలుగా పేర్కొన్నారు. క్రియాశీలమైన చిత్తమున్న వారికి కర్మయోగమనీ; భక్తి పారవశ్యం కలవారికి భక్తియోగమనీ; ఉపాసనా శీలం, ఆత్మసంయమనం కలవారికి రాజయోగ మనీ; తత్త్వవిచారణ, ధీశక్తి కలవారికి జ్ఞానయోగమనీ చెప్పారు. ఈ మార్గాలను గీతలోని వివిధ అధ్యాయాలలో వివరించారు. ఇందులో ఏ మార్గమూ మరొక దాని కన్నా అధికమైనది కాదు. వారి వారి సంస్కారాలకు అనుగుణమైన దాన్ని అనుసరించి సాగాలనీ, మోక్ష సౌధానికి కర్మ, భక్తి, రాజ, జ్ఞాన యోగాలనేవి నాలుగు ద్వారాలనీ, ఏ ద్వారం గుండా ప్రయాణం సాగించినా ముక్తి ప్రాసాదంలో అడుగిడుతారనీ గీతామాత మనకు ప్రబోధిస్తోంది. ఏ మార్గంలో పయనించినా, నదులన్నీ చివరకు సముద్రాన్నే చేరతాయి కదా!

ఈ యోగాలన్నింటి మధ్య చక్కటి పొందికనూ, సమత్వాన్నీ ఉంచి, ఎవరు ఏ యోగాన్ని అనుసరించినా, తక్కినవాటిని పరోక్షంగా బలపరిచినట్లే అవుతుందని గీతావాణి వివరిస్తోంది. వాస్తవంగా విచారిస్తే, ఏ యోగంలో అయినా, తక్కిన యోగాలన్నీ అంతర్భూతాలై గౌణంగా ఉంటాయి. ఈ సర్వయోగ సమన్వయ భావం కలిగి ఉన్నందునే, ఇది అన్ని సంప్రదాయాల వారికీ అనుగుణ్యమై, లోకవిఖ్యాతి గడించింది. సర్వయోగ సమ్మిశ్రణం (Yoga of synthesis) గీత అద్భుత చమత్కారాలలో ఒకటి.

నిష్కామ కర్మ యోగం: గీత ఆవిర్భావానికి ముందు లోకంలో రెండు రకాల వారు ఉండేవారు - కర్మలను చేస్తూ ఫలాలను ఆశించేవారు (ప్రాపంచికులు), కర్మలను పూర్తిగా విసర్జించినవారు (తాపసులు). కానీ భగవద్గీత సులభమైన, ఆచరణ యోగ్యమైన మార్గాన్ని చూపెట్టింది. ఆ మార్గం ఏమిటంటే, కర్మలను చేస్తూ, ఫలాన్ని అపేక్షించని నిష్కామ కర్మాచరణం.

కర్మ చెడ్డది కాదు, దాన్ని పరిత్యజించనవసరం లేదు. భావం పరిశుద్ధమై, చేసే కార్యం నిశ్శ్రేయసమైన ప్రతీ కర్మా మహాయజ్ఞమై భాసిస్తుంది అని భగవద్గీత ఎలుగెత్తి చాటుతోంది. కర్మను విడిచి పెట్టి సన్న్యాసం తీసుకుంటాననే ఒక క్షత్రియుని (అర్జునుని) కర్తవ్యోన్ముఖుణ్ణి చేసి, స్వధర్మ నిర్వహణను చేయించిన ఘనత గీతావాణిదే కదా!

కామ్యకర్మల ఫలితాలెప్పుడూ తక్కువ స్థాయివి గానే ఉంటాయి. మోక్షాన్ని చేకూర్చలేవు. ఇది దృష్టిలో ఉంచుకునే శ్రీకృష్ణ పరమాత్ముడు కర్తృత్వాన్ని వీడి చేసే ప్రతీ కార్యమూ ఒక మహాయజ్ఞమే అవుతుందని తెలిపి, నిష్కామ క్రియా ఫలితాన్ని వెల్లడి చేశాడు. స్వధర్మాచరణను కర్తృత్వరహితంగా, ఈశ్వరార్పణ బుద్ధితో చేస్తే అది కర్మబంధాన్ని త్రుంచి వేస్తుంది. దీన్ని అనుసరిస్తూ అర్జునుడు ఘోరసంగ్రామాన్ని కూడా సాత్త్విక యజ్ఞంగా మార్చివేశాడు. నిష్కామ కర్మ ద్వారా హృదయక్షేత్రం పునీతమై, జ్ఞానావిర్భావానికి దారి తీస్తుంది.


మహాత్మాగాంధీ భగవద్గీత గురించి ఇలా తెలిపారు: 'సంశయాలు నన్ను ఆవరించినప్పుడు, నిరాశా నిరుత్సాహాలు నాలో జనించినప్పుడు నేను భగవద్గీతను తెరిచి చూస్తాను. అందులో ఏదో ఒక శ్లోకం నన్ను ఊరడించి నా ముఖంపై చిరునవ్వును తీసుకువస్తుంది'. ❖

తెలుగు సేత: డాక్టర్ అపర్ణా శ్రీనివాస్

(డిసెంబర్ 13న 'గీతాజయంతి')



శ్రీకృష్ణుడు 'అధైర్యం చెందకు. పిరికితనం నీకు తగదు. ఈ మానసిక దుర్బలతను వదలి లెమ్ము' అని అర్జునునికి చేసిన ఈ బోధ భగవద్గీత అనే ధనాగారానికి తాళంచెవి లాంటిది. -స్వామి వివేకానంద



నియమనిష్ఠలు

– స్వామి జ్ఞానదానంద

ప్రాణాయామం ప్రత్యాహారం
నిత్యానిత్య వివేకవిచారం ।
జాప్యసమేత సమాధివిధానం
కుర్వవధానం మహదవధానం ॥

శ్రీవ్యాసాశ్రమ వ్యవస్థాపకులు, శుష్కవేదాంత తమోభాస్కరులు శ్రీమలయాళస్వామి వారు తమ శిష్యులకు విశేషరీతిలో శిక్షణనిచ్చేవారు. ఒకసారి వారి శిష్యులలో ఒకరు కొన్నాళ్ళు మౌనవ్రతం చేపట్టాలని సంకల్పించారు. దానికి స్వామి అంగీకరించి, ఆశ్రమంలో ఆ శిష్యుడికి అనువైన ఏర్పాట్లు చేశారు. రెండు మూడు రోజులు గడిచిపోయాయి. ఆ శిష్యుడు, మౌనవ్రతంలోనే ఉంటున్నారు; కానీ దినచర్యలో మార్పు రాలేదు. ఏదో ఒక రకంగా ఆశ్రమంలో తను నిత్యవ్యవహారాలు కొనసాగిస్తూనే ఉన్నారు. తను చెప్పాలనుకుంటున్న ప్రతి విషయాన్నీ కాగితం మీద రాసి చూపిస్తూ ఉన్నారు. మాట్లాడడం లేదనే కాని, యథావిధిగానే సైగలతోనో, కలంతోనో తన పనులతో హడావిడిగానే ఉన్నారు. ఆ శిష్యుడి వైఖరిని గమనిస్తూ అప్పుడు మలయాళస్వామి 'మౌనవ్రతమంటే ఇది కాదు; మాటలనే కాదు, మనస్సునూ కట్టడి చేయాలి. అదే మౌనదీక్ష. మనోశరీరాలను నిలకడగా ఉంచాలి. నియమనిష్ఠల విషయంలో సర్దుబాట్లు ఉండకూడదు; రాజీపడకూడదు' అని సూచించారు. స్వయంగా తానూ స్వానుష్ఠానంతో శిష్యులకు, భక్తులకు ఆదర్శంగా నిలిచారు. జగద్గురువులైన ఆదిశంకరాచార్యులూ ఆనాడు ఆధ్యాత్మిక జీవితంలో నియమనిష్ఠల ప్రాధాన్యాన్ని పునరుద్ఘాటిస్తూ, తమ 'భజగోవిందం' శ్లోకపరంపరను కొనసాగిస్తూ...

ప్రాణాయామం ప్రత్యాహారం నిత్యానిత్య వివేకవిచారం ।
జాప్యసమేత సమాధివిధానం కుర్వవధానం మహదవధానం ॥

'ప్రాణాయామం చేయాలి, ప్రత్యాహారాన్ని పాటించాలి. నిత్యానిత్య వస్తువిచారణ చేస్తూ, నామజపంతో పాటు ధ్యానం చేయాలి. సమాధిస్థితిని పొందే విధానాన్ని అతి మెలకువతో అభ్యసించడమే కాదు, జాగ్రత్తగా ఆచరించాల'ని హితవు పలికారు.

ప్రాణాయామం...ప్రత్యాహారం: ఆరోగ్యానికే కాదు ఆధ్యాత్మిక సాధనకూ తోడ్పడే శారీరక ప్రక్రియే ప్రాణాయామం. క్రమపద్ధతిలో సాగే ఉచ్ఛ్వాస నిశ్వాసలే ఇందులో ప్రధానాంశం. అయితే చాలా మంది లాంఛన ప్రాయంగా ముక్కువద్ద చేయి పెట్టుకొని గాలిపీలుస్తూ, వదిలేస్తూ ప్రాణాయామం చేస్తున్నట్లు కనిపిస్తూ ఉంటారు. మంత్రం లేకుండా చేసే ప్రాణాయామం కేవలం ఆరోగ్య సంబంధమైంది. కానీ మంత్రంతో చేసినప్పుడే, ప్రాణాయామ ప్రయోజనాలతో ఆరోగ్యమూ, ఆధ్యాత్మిక ప్రగతీ సాధించవచ్చని శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ పద్ధతులను గురుముఖతా నేర్చుకోవడం శ్రేయస్కరమని అనుభవజ్ఞుల అభిప్రాయం. జీవనవేగం, మాటల ఒరవడి, పనుల ఒత్తిడి, అనవసరమైన హడావిడి ఎంత తగ్గించుకుంటే శ్వాసకోశంపై అంత భారం తగ్గుతుంది. శ్వాసపై ధ్యాస పెరుగుతుంది. ఆరోగ్యంతో పాటు ఆనందమూ లభిస్తుంది. అదే విధంగా మనస్సును విషయవాసనల నుంచి మరల్చడమే ప్రత్యాహారం. సాధారణంగా ఎవరికైనా మనస్సును స్థిరంగా ఉంచడం సాధ్యపడదు. ప్రయత్న పూర్వకంగా అలా ఏదేని విషయం మీద నిలిపి ఉంచడం సాధన వల్ల సాధ్యమయ్యే ఒకానొక యోగక్రియ. పతంజలి తన యోగసూత్రాల సాధన పాదంలో చెప్పిన అష్టాంగాలలో అయిదవదయిన ప్రత్యాహారం గురించి ప్రస్తావిస్తూ, 'స్వవిషయా సంప్రయోగే చిత్తస్వరూపానుకార ఇవ ఇన్ద్రియాణామ్ ప్రత్యాహారః – ఇంద్రియాలు, విషయాలతో సంబంధం కోల్పోయి చిత్తస్వరూపాకారాన్ని

పొందడమే ప్రత్యాహారం. ఇంద్రియాలను విషయాల నుండి మరల్చడమే ప్రత్యాహారం' అని స్పష్టం చేశారు. అందుకే ముందు మన జీవనశైలిలో ఆరోగ్యకరమైన అలవాట్లను అలవరచుకోవాలి. ఒక వయస్సుకు వచ్చాక, నిర్బంధంగా దేహపరమైన కొన్ని నియమాలను పాటించాలి.

నిత్యానిత్య వివేకం... : మనిషి ఈ వస్తు ప్రపంచం వెనుక ఇంతగా వెర్రిపరుగులు తీయడానికి ప్రధాన కారణం వివేకరాహిత్యమే! ఏది నిత్యం, ఏది అనిత్యం అని సావధానంగా ఆలోచించుకోకపోవడమే! అందుకే మన సనాతనధర్మం సాధన చతుష్టయంలో ఇహాముత్ర ఫలభోగ విరాగం, శమదమాది షట్కసంపత్తి, ముముక్షత్వాని కన్నా ముందు నిత్యానిత్య వస్తు వివేకం గురించి చెప్పింది. సృష్టిలో ప్రతి వస్తువు ఎప్పుడో ఒకప్పుడు నశించేదే అని సులభంగా తెలుస్తుంది. అంటే, అవన్నీ అనిత్యాలని అర్థమవుతుంది. మరి అనిత్యాలు ఉన్నప్పుడు నిత్యమైనది ఏదో ఉండాలి కదా! అన్న జిజ్ఞాస కలగాలి. ఆ విధంగా విచారణ చేయడం, తెలుసుకోవడమే నిత్యానిత్య వస్తువివేకం. అయితే మనం అమృతం దొరకడం లేదు కదా! అని మురికినీళ్ళు తాగి సరిపెట్టుకుంటున్న అవివేకులుగా ప్రవర్తిస్తూ ఉన్నాం. మనలో చాలామంది చివరకు ఆధ్యాత్మిక వ్యవహారాలలోనూ నియమనిష్ఠలను పెద్దగా పట్టించుకోరు. జీవనవిధానంలో ఎలాంటి మార్పు లేకుండా, ఆచారవ్యవహారాలనూ కొనసాగిస్తూ ఉంటారు. అందుకే భగవాన్ షిరిడీ సాయిబాబా ఒక మారు భక్తులతో "మీరు బయట యజ్ఞవాటిక,యజ్ఞగుండం పెట్టి చేసేదంతా ఒక క్రతువే. కానీ లోపల మీ హృదయాన్ని గనక ధుని చేసి, దానిలో ఒక్కొక్క ఆలోచనా ఒక్కొక్క సమిధలా సమర్పించి, వివేకాన్నీ, విచక్షణనీ అగ్నిగా మార్చుకోగలిగినట్లయితే జ్ఞానమనే విభూతి మీకు లభిస్తుంది" అని వివరించారు.

> **ఏనుగును విడిచిపెడితే అది విచ్చలవిడిగా చెట్లపై విజృంభిస్తుంది. కానీ మావటి దాని తలమీద అంకుశాన్ని ప్రయోగించగానే అది దారిలోకి వస్తుంది. అలాగే మనస్సును యథేచ్ఛగా పోనిస్తే గొంతెమ్మ కోరికలలో విహరిస్తుంది. వివేకమనే అంకుశాన్ని ప్రయోగించగానే మనస్సు శాంతిస్తుంది.**
>
> *- భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస*

జపం...ధ్యానం : వివేక విచారణ అనంతరం ఏది శాశ్వతమో, ఏది అశాశ్వతమో స్పష్టమవుతుంది. మరీచికల్లాంటి ఈ ప్రాపంచిక భోగాల వెంట పరుగులెత్తడం మానివేయాలని పిస్తుంది. శాశ్వతుడైన ఆ భగవంతుడి వైపు దృష్టి మరలే సౌభాగ్యం కలుగుతుంది. ఆయనను ధ్యానిస్తూ, ఆయన నామాన్ని జపించేందుకు మనస్సు తపిస్తుంది. అందులో మాధుర్యం రుచిస్తుంది. అయితే సాధారణ సుఖాలకు అలవాటైన దేహం, మనస్సు జపధ్యానాదుల వైపు మరలాలంటే, భక్తి విశ్వాసాలతో పాటు నిరంతర సాధన కొనసాగాలి. ఆ భగవంతుడి నామాన్ని జపించడంలో మనస్సు రమించిపోవాలి. అందుకే శ్రీమద్భాగవతంలో అజామిళుడు...

ఏది జపియింప నమృతమై యెసగు చుండు
నేది సద్ధర్మపథమని యెరుగ దగిన
దదియె సద్భక్తి యోగంబు నలవరించు
మూర్తిమంతంబు దా హరికీర్తనంబు... 'ఏ నామాన్ని జపించినకొద్దీ, అమృతమై, అతిశయమై అలరారుతుందో, ఏది ఉత్తమమైన ధర్మమార్గమో, అదే హరినామ సంకీర్తనం. మూర్తీభవించిన భక్తియోగమే హరినామ సంకీర్తన'మని ఉద్ఘాటిస్తాడు. అయితే ఈ యాంత్రికజీవనంలో చాలా విషయాల్లోలాగే జపధ్యానాదులు కూడా దినచర్యలో ఒక భాగంగా మారిపోయాయి. ఆధ్యాత్మిక, ఆనందమయ జీవనానికి తోడ్పడేలా వాటిని ఆచరించడం లేదు. అందువల్లే చాలామంది గురువు ద్వారా మంత్రదీక్షను స్వీకరించి, దీర్ఘకాలంగా ధ్యానాదుల్లో శిక్షణను తీసుకున్నప్పటికీ సరైన ఫలితాన్ని సాధించలేకపోతున్నారు.

సమాధి....సావధానం : తను ధ్యానిస్తున్న ఆ భగవంతుడి రూపానికీ, తనకూ భిన్నత్వం నశించడం, ధ్యానవిషయంలో తాను లయం కావడమే సమాధి స్థితి అని మన శాస్త్రాలు చెబుతున్నాయి. ఈ స్థితికి చేరుకోవడానికి నిరంతర సాధన, భగవంతుడి అనుగ్రహం తప్ప మరో మార్గం లేదు. యోగవాసిష్ఠం ప్రకారం ఏకాగ్రాన్ని, నిత్యతృప్తమును, సత్యవస్తువును అవలోకించే, అబాధితమైన ఆత్మతత్త్వాన్ని దర్శించే పరాప్రజ్ఞయే సమాధి. క్షోభకు, అహంకారానికి, ద్వంద్వాలకు తావులేని నిశ్చలస్థితితో, మేరుపర్వతం కంటే స్థిరమైన ఆకృతి కలిగిన స్థితే సమాధి. మరోలా చెప్పాలంటే నిశ్చింతతో కూడి, పరిపూర్ణమైన మనోగతియే సమాధి. అయితే ఎప్పటి నుంచి మనస్సు సదా జ్ఞానయుక్తమై ఉంటుందో అప్పటి నుంచే సమాధిసిద్ధి.

భక్తి మార్గాన్ని ఎంచుకున్నా, జ్ఞానమార్గాన్ని ఎంచుకున్నా జగత్తు విషయంలో సామాన్యులకుండే భావనను పరిత్యజించాల్సి ఉంటుంది. అలాంటి భావనను త్యజించడం ద్వారా, మనిషి మనస్సు సర్వవృత్తి రహితమై, సమాధిస్థితిని పొందేందుకు యోగ్యమవుతుంది. అలాంటి సమాధినే మన శాస్త్రాలు 'నిర్వికల్పసమాధి' అంటున్నాయి. ఇలాంటి స్థితులన్నింటికీ ప్రధానంగా ముందు మనం అహంకారాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస 'సమాధిస్థితి కలగనిదే యథార్థ జ్ఞానలబ్ధి అసాధ్యం. అలాంటి స్థితి కలిగినప్పుడు ఆ వ్యక్తి భగవంతుడితో ఏకం అయిపోతాడు. ఆ తరువాత అతడికి అహం అనేది ఉండదు. మిట్టమధ్యాహ్న సమయంలో సూర్యుడు నడినెత్తి మీదకు వస్తాడు. అప్పుడు నువ్వు నలువైపులకూ తిరిగి చూసినా నీ నీడ కనిపించదు. అదే విధంగా యథార్థజ్ఞానం కలిగినప్పుడు, సమాధిస్థితి పొందినప్పుడు అహం అనేది ఉండదు' అంటారు. ❖

భయమే మృత్యువునకు హేతువు. ఈ భయానికి కారణం మనం ఆత్మస్వరూపులమనే సత్యాన్ని మరచిపోవడమే! ప్రతి ఒక్కరూ ఆత్మసామ్రాజ్యాధిపతికి వారసులమని మరువరాదు. -స్వామి వివేకానంద






రామకృష్ణ మఠం

'సౌత్ నాడ, అశోక పెట్రోల్ పంప్ ఎదురుగా, హరిపాడ్-690 514. అలెప్పి జిల్లా, కేరళ. ఫోన్: 09745325834;
E mail: srkmathharipad@gmail.com; viveka.vira@gmail.com; www.rkmathharipad.org

శ్రీరామకృష్ణ మఠ కేంద్ర పునర్నిర్మాణానికై విజ్ఞప్తి

కేరళ రాష్ట్రంలో శ్రీరామకృష్ణుల ఉద్యమాన్ని వ్యాప్తి చేసిన స్వామి నిర్మలానందజీ మహరాజ్, ప్రప్రథమంగా 1913లో దక్షిణ కేరళలోని హరిపాడ్‌లో రామకృష్ణ మఠ శాఖను ప్రారంభించారు. భగవాన్ శ్రీరామకృష్ణుల ప్రత్యక్ష సన్న్యాస శిష్యులైన స్వామి బ్రహ్మానందజీ మహరాజ్, రామకృష్ణ సంఘ వరిష్ఠ సన్న్యాసుల సందర్శనంతో ఈ ఆశ్రమం పునీతమైనది.



పూర్తిగా శిథిలమైన ఆశ్రమ భవనం

ఈ ఆశ్రమం స్థాపించి వందేళ్ళు గడిచాయి. కాలగతిలో ఆశ్రమంలోని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందువల్ల నూతన భవనాల నిర్మాణం అత్యంత ఆవశ్యకమైనది. ఈ నేపథ్యంలో విశ్వజనీన శ్రీరామకృష్ణ దేవాలయం, కార్యాలయం, సేవా కార్యక్రమాల నిర్వహణ భవనం, గ్రంథాలయం, సాధునివాస భవనాలను నిర్మించాలని సంకల్పించాం. ఈ పథకానికి ఐదు కోట్ల రూపాయల వ్యయం అవుతుందని అంచనా వేయడం జరిగింది.



ఈ పవిత్ర సేవాయజ్ఞంలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలన్న ఉద్దేశంతో ఐదు కోట్ల రూపాయలను ఉదార హృదయులైన భక్తులు, మిత్రులు, హితులైన 50,000 మంది నుండి రూ. 1,000/- చొప్పున విరాళాలను స్వీకరించదలచాం. రూ. 1,000/- కన్నా ఎక్కువ విరాళాలను కూడా ఇవ్వవచ్చును.

మీ విరాళాన్ని Ramakrishna Math, Haripad పేరున చెక్కు/ డి.డి తీసి Ramakrishna Math, South Nada, Opp.Asoka Petrol Pump, Haripad - 690514, Dist.Alleppey, Kerala చిరునామాకు పంపాల్సిందిగా మనవి. విరాళాలకు 80జి సెక్షన్ కింద ఆదాయపు పన్ను మినహాయింపు లభిస్తుంది.



రెండు గదులున్న పురాతన గోదాము - ప్రస్తుత సాధునివాసం

ఈ బృహత్ సేవా యజ్ఞానికి మీవంతు ఆర్థిక సహాయాన్ని అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరని ఆశిస్తున్నాం.

భగవత్సేవలో
స్వామి వీరభద్రానంద
అధ్యక్షులు

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా కూడా పంపవచ్చు :
NEFT Transfer: Account Number - 30642551603, State Bank of India, Haripad. RTGS/NEFT/IFSC code: SBIN0010596.

విరాళాలను ఆన్‌లైన్ ద్వారా పంపించిన దాతలు తమ పూర్తి పేరు, చిరునామా, పాన్ నెంబర్, ఫోన్ నెంబర్‌తో సహా పూర్తి విరాళ వివరాలను ఈమెయిల్ srkmathharipad@gmail.com కు తెలియజేయగలరు.

Foreign Donation: Kindly draw a Cheque / Draft in favour of "Ramakrishna Math" and send it to the General Secretary, Ramakrishna Math, Belur, Dt. Howrah (West Bengal), Pin - 711 202, India.

In the covering letter please mention that it is a donation for 'Haripad Centre Building Fund' and inform all the details of the donation to e-mail:srkmathharipad@gmail.com, viveka.vira@gmail.com

Advt.,

నిస్వార్థంగా, ప్రతిఫలాపేక్ష రహితంగా ఇతరులకు వారి అవసరంలో చేసే సహాయాన్ని స్థూలంగా 'సేవ' అంటారు. అది – కాయిక, మానసిక, వాచిక, ఆర్థిక... ఏదైనా కావచ్చు. ఆధ్యాత్మిక మార్గావలంబులు సాధనాంశంగా సేవను స్వీకరించినప్పుడు ఆ సేవ మరింత విశిష్టతనూ, విమలత్వాన్నీ ఆపాదించుకుంటుంది. పవిత్రతనూ, పరమార్థాన్నీ సంతరించు



సేవే సాధనగా...

– హేమంత్ కుమార్

కుంటుంది. సేవ పూజగా, యజ్ఞంగా, తపస్సుగా పరిణమిస్తుంది. ఎందుకంటే ఎనభై నాలుగు లక్షల జీవరాసుల్లో ఏ జీవికి సేవ చేసినా అది జగదేక ప్రభు సేవగానే పరిగణనలోకి వస్తుంది. ఎందుకంటే అన్నింటి, అందరి రూపంలోనూ ఉన్నది ఆయనే కాబట్టి.

అయితే అన్నింటి రూపంలో ఆయన ఉండడం వేరు. అది సహజం, సత్యం. ఆ విషయాన్ని గుర్తించి ఆ భావంతో సేవ చేయడం వేరు. ఆ భావన ఇచ్చే ఆనందం, తృప్తి అనిర్వచనీయం, అద్వితీయం. ఆ భావనలో స్థిరపడితే అదే సాధన. కీర్తి కోసం, గుర్తింపు కోసం, ఆటవిడుపు కోసం చేసే సేవ మన ఆత్మోన్నతికి ఎలాంటి సహకారాన్నీ ఇవ్వదు. ఆ ఫలితం యొక్క పరిధి చాలా స్వల్పం. అదే ఆధ్యాత్మిక భావంతో, పరమాత్మ సేవా దృక్పథంతో చేస్తే, చేసే భావంలో నిష్కామత్వం ఉన్నా ఫలితంలో మాత్రం అపరిమితత్వం ఉంటుంది. ఆర్తుల సేవలోనే ఎందరో అంతర్యామిని దర్శించారు. స్వామి వివేకానంద తమ జీవితంలో సాధనను సేవగా అన్వయించారు. సేవను సాధనగా ఆవిష్కరించారు. నిజానికి ఈ విషయం స్పష్టంగా ఎవరికీ అర్థం కానంత మమేక స్థితిలో ఉంటుంది. బహుశా ఈ సేవ అన్న ఉత్కృష్ట సంస్కృతిని వివేకానందులు దివ్యజనని శారదాదేవి స్ఫూర్తిగా ఆవాహన చేసుకుని ఉండవచ్చు. నేడు రామకృష్ణ సంస్థలు సేవా సంస్థలుగా, సేవా సమితులుగా ఆవిర్భవించాయంటే దానికి స్వామీజీయే కారణం. సేవనే సాధనగా ప్రాపంచిక, పారమార్థిక ప్రగతికి వారు పూలబాట వేశారు.

సేవ ఎప్పుడూ మన ఇష్టానిష్టాలతో, మన శక్తిసామర్థ్యాలతో ముడివడి ఉండదు. అది చేయించుకునేవారి అవసరాన్ని బట్టి ఉంటుంది. అది ఆకలి కావచ్చు. అనారోగ్యం కావచ్చు. ఆర్థిక దుఃస్థితి కావచ్చు. మన స్థితిగతులతో సంబంధం లేకుండా మన వెసులుబాటుతో ముడిపడకుండా అవతలివారి అవసరాలకు అనుగుణంగా మనం స్పందించవలసి ఉంటుంది. అదే సేవ.

భారతదేశం సేవకు ప్రథమ తాంబూలం ఇచ్చింది. పెద్దల సేవ, గురువుల సేవ, కుటుంబ సేవ, అతిథుల సేవ, సర్వభూత సేవ...! అవసరాన్ని బట్టి చాలాసార్లు తక్కువ స్థాయి పనులకు మనల్ని మనం నియమించుకోవలసిన అవసరం ఉన్నా సేవను ఉత్కృష్ట కార్యంగా భావించింది భారతదేశంలోనే!

సేవ ఒక మహోన్నత సాధన. దీనుల కష్టాన్ని పంచుకోవడం కంటే, వారికి ఉపశమనం కలిగించడం కంటే గొప్ప సేవ మరేముంటుంది? స్వామి వివేకానంద స్ఫూర్తితో ఐరిష్ యువతి అయిన మార్గరెట్ ఎలిజబెత్ నోబెల్ భారత దేశానికి వచ్చి దీనజనుల సేవకు, స్త్రీ విద్యా వ్యాప్తికి తన జీవితాన్ని నివేదించింది. 'సేవ' యొక్క మహోన్నతమైన అర్థాన్నీ, పరమార్థాన్నీ విస్తృత స్థాయిలో ఆవిష్కరించింది. భారతీయుల సేవకు తనను తాను నివేదించుకొని, స్వామి వివేకానంద ఇచ్చిన 'నివేదిత' అన్న పేరును సార్థకం చేసుకొన్న ధన్యజీవి మార్గరెట్ (సోదరి నివేదిత).

మనిషి నిరహంకారంతో, వినయంతో తల వంచినప్పుడే అతని ఔన్నత్యం పతాక సదృశంగా తలెత్తుతుంది. సేవ అహంకారాన్ని చిత్తు చేస్తుంది. హృదయంలోని కాఠిన్యాన్ని కరిగించి వేస్తుంది. అన్నింటి కన్నా ముఖ్యంగా సమాజంలోని వివిధ రకాల దీనత్వాన్ని పరస్పరం పంచుకుని ఆశ్వాసన కలిగించే ఒక గొప్ప సంప్రదాయాన్ని నెలకొల్పుతుంది. హృదయబద్ధం చేస్తుంది. దీనివల్ల సమాజం దీనత్వాన్ని పారద్రోలి 'ఒకరి కోసం అందరం. అందరి కోసం ఒకరం' అనే సర్వమానవ సౌభ్రాతృత్వానికి బీజం పడుతుంది. సమాజసేవే స్వామి సేవ. అప్పుడు సాధనకు సేవను మించిన సాధనోపకరణం మరొకటి ఉండదు. ❖

నిస్సంగుడవై పనిచేయి. ఇది నీ స్వస్థలం కానట్లు, నీవు ఇక్కడ కొంతకాలం మాత్రమే ఉండడానికి వచ్చినట్లు ప్రవర్తించు. నిరంతరం పనిచేయి కానీ బద్ధుడవు కావద్దు. -స్వామి వివేకానంద

స్వామి వివేకానంద క్విజ్

1. "క్రైస్తవుడు హిందువుగా గానీ, బౌద్ధుడుగా గానీ మారనక్కర్లేదు. అలాగే హిందువు బౌద్ధుడుగా గానీ, క్రైస్తవునిగా గానీ మారనక్కర్లేదు. కానీ ప్రతి వ్యక్తీ ఇతరుల భావాలను, ఇతర మతసారాన్ని గ్రహిస్తూ ఉండి తమ వ్యక్తిత్వాన్ని నిలుపుకొని, స్వీయ వికాస నియమానుసారం అభివృద్ధి చెందాలి." అని స్వామీజీ ఎక్కడ ప్రసంగించారు?
2. స్వామీజీ మొదటిసారిగా గోల్ఫ్ ఆట ఎక్కడ ఆడారు?
3. స్వామీజీ గాలితో నింపిన బెలూన్ సాయంతో ఆకాశంలో విహరించింది ఎక్కడ?
4. స్వామీజీ చిత్రలేఖనం ఎక్కడ, ఎవరి వద్ద నేర్చుకున్నారు?
5. స్వామీజీ మొదటిసారిగా తుపాకీ చేతబట్టి ప్రయోగించింది ఎక్కడ?
6. శ్రీరామకృష్ణుల పేరిట స్థాపించిన మఠం ఏ మూడు విషయాలలో శ్రద్ధ వహించాలని స్వామీజీ అభిలషించారు?
7. స్వామీజీ ఏ మూడు తాత్త్విక మార్గాలను వేదాంతానికి మూడు సోపానాలని, ఒక మనిషి ఆధ్యాత్మిక ప్రగతికి అవి అత్యంత ఆవశ్యకాలని, వాటిని ప్రపథమంగా సమన్వయపరచి లోకానికి చాటి చెప్పారు?
8. స్వామీజీ భారతీయులకు సూచించిన జాతీయ ఆదర్శాలేమిటి?
9. అమెరికాలో తొలిరోజుల్లో స్వామీజీకి ఆశ్రయమిచ్చిన హేల్ కుటుంబ యజమానిని, ఆయన భార్యను స్వామీజీ ఏమని సంబోధించేవారు?
10. యాంత్రిక తుపాకీ (machine gun)ని కనుగొన్న హిరాం మ్యాగ్జిమ్‌ను స్వామీజీ ఎక్కడ కలుసుకున్నారు?
11. చికాగో సర్వమత మహాసభల్లో ప్రసంగించిన స్వామీజీ ప్రసంగాలు ఎన్ని లభ్యమయ్యాయి?
12. నైనిటాల్ వాస్తవ్యుడు సర్ఫ్రాజ్ హుస్సేన్ స్వామీజీతో ఏమన్నాడు?
13. స్వామీజీ, శ్రీరామకృష్ణుల తరువాత ఏ యోగి పట్ల అత్యంత గౌరవాభిమానాలు చూపారు?
14. స్వామీజీకి ప్రాచ్యతత్త్వశాస్త్ర విభాగ అధ్యక్షపదవిని (Chair of Eastern Philosophy) సమర్పించడానికి ముందుకు వచ్చిన అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయం ఏది?

(జవాబుల కోసం 40వ పేజీ చూడండి)

రామకృష్ణ మిషన్

పి.ఓ. బేలూరు మఠం, హౌరా జిల్లా -711 202. ఫోన్ : 033-2654 1144, 1180, 5700

E-mail: rkmrelief@gmail.com website: www.belurmath.org

ఫైలిన్ తుపాను బాధితులకు సహాయక చర్యలు

విరాళాలకు విజ్ఞప్తి

2013 అక్టోబర్ మాసంలో ఫైలిన్ తుపాను కారణంగా ఆంధ్ర, ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో అనేక గ్రామాలు జలమయ మయ్యాయి. అపార ఆస్తి నష్టంతో పాటు వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

రామకృష్ణ మిషన్ - విశాఖపట్నం, భువనేశ్వర్, పూరి, తమ్‌లుక్, ఆంట్‌పూర్ శాఖల ద్వారా తుపాను బాధితులకు తక్షణ సహాయక చర్యలు చేపట్టింది. తుపాను బాధితులకు ఆహార పొట్లాలనూ, నిత్యావసర వస్తువులనూ, శిశు పోషకాహారాన్నీ, జాలర్లకు వలలూ పంపిణీ చేస్తోంది.





తుపాను బాధితుల సహాయ, సేవా కార్యక్రమాల నిమిత్తం ఉదార హృదయులైన భక్తులు, శ్రేయోభిలాషుల నుండి విరాళాలను కోరుతున్నాం.

మీ విరాళాల్ని Ramakrishna Mission, Kolkata పేరున చెక్కు/ డి.డి. తీసి The General Secretary, Ramakrishna Mission, (Relief Section) Belur Math, Howrah, West Bengal-711 202 చిరునామాకు పంపాల్సిందిగా మనవి.

వరద బాధితుల సహాయ కార్యక్రమాలకు ఇచ్చే విరాళాలకు ఆదాయపు పన్ను చట్టంలోని సెక్షన్ 80జి (5vi) కింద పన్ను మినహాయింపు లభిస్తుంది.

భగవత్సేవలో
స్వామి సుహితానంద
ప్రధాన కార్యదర్శి



అన్నమయ్య పదామృతం

మహినుద్యోగి గావలె మనుజుడైనవాడు
సహజివలె నుండేమీ సాధింపలేడు
వెదకి తలచుకొంటే విష్ణుడు గానవచ్చు
చెదరి మరచితే సృష్టి చీకటౌ
పాదలి నడచితేను భూమెల్లా మెట్టిరావచ్చు
నిదిరించితే కాలము నిమిషమై తోచు
వేడుకతో చదివితే వేదశాస్త్ర సంపన్నుడౌ
జాడతో నూరకుండితే జడుడౌను
ఓడక తపసియైతే ఉన్నతోన్నతుడౌ
కూడక సోమరియైతే గుణహీనుడౌను
మురహరు గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెరగ కుండితే వీరిడియౌను
శరణంటే శ్రీవేంకటేశ్వరుడు రక్షించును
పరగ సంశయించితే పాషండుడౌను

మనుజుడైనవాడు మహినుద్యోగి గావలె...

– శ్రీమతి బి.కృష్ణకుమారి

భక్తితత్త్వాన్నే కాదు బతుకుసత్యాలను ప్రబోధించటంలోనూ అన్నమాచార్యులది అందెవేసిన చేయి. పారమార్థిక జీవితమంటే పలాయనవాదంకాదనీ, భగవదన్వేషణ మార్గంలో భవిత నిరర్థకం కాబోదనీ వారు నిరూపించారు. శరణాగతితో పాటు స్వప్రయత్న ప్రాధాన్యాన్నీ తన పదావళిలో ప్రస్తావించారు. భగవంతుడిచ్చిన ఈ తనువును తమోగుణంతో, చిలుముపట్టిన పరికరంలా ప్రయోజనశూన్యం చేసుకుంటే, చరిత్రహీనుడవుతాడు. అందుకే **'మహినుద్యోగి గావలె మనుజుడైనవాడు...'** అన్నాడు అన్నమయ్య. మనిషిలోని మహత్కార్యాలు సాధించగలిగే శక్తిసామర్థ్యాలను గుర్తుచేస్తూ, ముందడుగు వేయలేని వ్యక్తికి మనుగడే మృగ్యమని హెచ్చరిస్తూ తన పదామృతాన్ని వర్షింపచేశాడు. అసలు మన శక్తిసంపత్తులేవో మనకే తెలియకపోవడం, అల్పులమన్న ఆత్మవిశ్వాసరాహిత్యంతో అలమటించిపోవడమే వైఫల్యాలకు మూలకారణం. అందుకే భగవాన్ శ్రీరామకృష్ణులు "నేను సాధించలేను' అనేవాడు నిజంగానే ఏమీ సాధించలేడు. దృఢచిత్తంతో 'నేను ముక్తుణ్ణి' అనేవాడు ముక్తుడే అయిపోతాడు. రాత్రింబవళ్ళు 'నేను బద్ధుణ్ణి, నేను బద్ధుణ్ణి' అని పలికేవాడు బద్ధుడిగానే మిగిలిపోతాడు" అనేవారు.

సహజి సాధించలేడు...

ప్రయత్నహీనుడికి ప్రపంచంలో ఏదీ సాధ్యపడదనీ, ఈ మహిలో అంటే భూలోకంలో మనిషి ప్రయత్నశీలుడు కావాలనీ ప్రవచిస్తూ...

మహినుద్యోగి గావలె మనుజుడైనవాడు

సహజివలె నుండేమీ సాధింపలేడు...అని తన కీర్తనకు శ్రీకారం చుడుతున్నాడు ఈ పదకవితాపితామహుడు. ఇక్కడ 'ఉద్యోగం' అంటే స్వప్రయత్నం అని, 'సహజి' అంటే ప్రయత్నహీనుడై ఆసక్తిరహితంగా జీవితాన్ని గడిపేవాడని అర్థం. ఎన్నో లక్షల జన్మల తరువాత లభించిన మానవజన్మ విలువ తెలియకపోవడం వలననే మనం బతుకును యథాలాపంగా గడిపేస్తూ ఉంటాం. ఆ ఆవేదనతోనే అన్నమాచార్యులు తన సంకీర్తనల శంఖారావంతో మనలోని ఆత్మశక్తిని మేల్కొలిపే ప్రయత్నం చేశారు. అనాదిగా మన మహర్షులు, మహాత్ములు కూడా తమ సాధనలతో, బోధనలతో మానవాళిని మేలుకొలుపుతూనే ఉన్నారు. ఆ పరంపరలోనే మన ఉపనిషత్తులు కూడా 'ఓ జీవుడా! నీవు ఆరడుగుల మనిషివి కావు. భూనభోంతరాలు పరివేష్టించిన విశ్వవ్యాపక దీర్ఘదేహుడవు. నీవు ప్రకృతి రథచక్రాల కింద పడి నశించే అల్పకీటకానివి కావు! ప్రకృతిని శాసించే పరమాత్మవు. నీవు బద్ధుడవు కావు; ముక్తుడవు. కర్మాధీనుడవు కావు; కర్మాతీతుడవు. మృత్యురూపుడవు కావు; మృత్యుంజయుడవు. భృత్యుడవు కావు; రాజాధిరాజువు. వేయేల నీవు జీవుడవు కావు; సాక్షాత్తూ శివుడవే' అని జాగృతం చేశాయి.

నిదిరిస్తే కాలం నిమిషమై తోచు...

'తనపై తనకు ఆత్మవిశ్వాసం ఉన్న మనిషికే పరమాత్మ ఆశీర్వాదమూ లభిస్తుంది. ఆ ఆత్మశక్తితో సాగించే అన్వేషణతో, ఆదిపురుషుడైన ఆ శ్రీమహావిష్ణువును కూడా సాక్షాత్కరించుకోవచ్చు, అలా కాకుండా ఆదమరచి ప్రవర్తిస్తే సృష్టే చీకటిగా తోస్తుంది, అడుగు వేయడం ఆరంభిస్తే ఈ భూమంతా చుట్టిరావచ్చు, నిస్తేజంతో నిదిరిస్తే ఎంత కాలమైనా నిమిషంగానే గడచిపోతుంది' అన్న భావంతో...

(మిగతా 32వ పేజీలో...)

మహత్తర ధైర్య స్థైర్యాలు, శక్తి సామర్థ్యాలు, దృఢ నిశ్చయము, పట్టుదల కలిగియుండు. కష్టపడి పనిచేయి. పట్టుదలతో సాధన చేస్తే తప్పక నీ గమ్యస్థానాన్ని చేరగలవు. -స్వామి వివేకానంద



పరిప్రశ్న

– స్వామి భూతేశానంద


(రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు)

రామకృష్ణ సంఘ 12వ సర్వాధ్యక్షులు - స్వామి భూతేశానందజీ మహరాజ్ (1901-1998) భక్తుల ఆధ్యాత్మిక సందేహాలకు సరళమైన రీతిలో ఇచ్చిన సమాధానాలను 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకుల ప్రయోజనార్థం 2013 జూలై సంచిక నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

భక్తుడు: భగవంతుణ్ణి చూడకుండా ఆయన ఉన్నాడని ఎలా నమ్మగలం?

స్వామీజీ: మీరు మీ ముత్తాతను చూశారా? లేదుకదా! అయినప్పటికీ మీ నాన్నగారు మీ ముత్తాత గురించి చెప్పినప్పుడు మీరు నమ్ముతారు. అలాగే ఓ ప్రభుత్వాధికారి మిమ్మల్ని ఉద్యోగంలో చేరమని ఉత్తర్వు జారీ చేసినప్పుడు, ఆ ప్రభుత్వాధికారి మీకు తెలియనప్పటికీ ఆ ఉత్తర్వుపై నమ్మకం ఉంచి ఉద్యోగంలో చేరడానికి వెళతారు. అంతేకానీ ఆ ప్రభుత్వాధికారిని నేను చూడలేదు, కాబట్టి నేను నమ్మను అని అనరుకదా!

అదే విధంగా భగవంతుణ్ణి మనం చూడలేకపోయినా ఆయన్ను దర్శించిన భక్తులూ, యోగులూ, మహాత్ములూ అనుభవపూర్వకంగా చెప్పిన మాటలపై విశ్వాసం ఉంచి సాధన చేస్తే మనమూ భగవంతుణ్ణి దర్శించగలం.



భక్తుడు: జపం చేయడం వల్ల ఏకాగ్రత, సంకల్పశక్తి పెరుగుతాయా?

స్వామీజీ: ఒక శాస్త్రజ్ఞుడు పరిశోధనలో పూర్తిగా నిమగ్నమై బాహ్యప్రపంచాన్నే మరిచిపోతాడు. అంతమాత్రాన ఆ శాస్త్రజ్ఞుడు జపం చేస్తున్నాడని అనగలమా?

భక్తుడు జపం చేయడంలోని ముఖ్య ఉద్దేశం భగవత్ సాక్షాత్కారం కోసమే గానీ సంకల్పశక్తిని పెంచుకోవడానికి కాదు. ఎందుకంటే భగవంతుడే తన సర్వస్వమని విశ్వసించి, సంపూర్ణ శరణాగత భావంతో జీవించే భక్తునిలో సంకల్పమంటూ ఏమీ ఉండదు. అంతా భగవంతుని ఇచ్ఛానుసారమే జరుగుతుందని విశ్వసిస్తాడు. మన సంకల్పబలంతోనే భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోగలుగుతాం అనుకోవడం అవివేకం. సంకల్పశక్తితో ప్రాపంచిక కార్యాలను సాధించవచ్చు గానీ భగవంతుని సాక్షాత్కారం మాత్రం ఆయన అనుగ్రహంతోనే సాధ్యమవుతుంది.

భక్తుడు: భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. కానీ మన ప్రార్థనల్ని ఆయన వింటున్నాడో లేదో ఎలా తెలుస్తుంది?

స్వామీజీ: 'చీమ చిటుక్కుమన్నా భగవంతునికి వినిపిస్తుంది' అని శ్రీరామకృష్ణులు అనేవారు. మన ప్రార్థనలను భగవంతుడు వింటాడు. కానీ మన ప్రార్థనలకు భగవంతుడు స్పందించకపోతే వాటిని ఆయన వినడం లేదని అనుకుంటాం.

పిల్లవాడు అడిగినవన్నీ తల్లి ఇవ్వదు. ఎందుకంటే పిల్లవానికి మంచి చేసేదేదో, హాని కలిగించేది ఏదో తల్లికి బాగా తెలుసు. అందువల్ల పిల్లవాడు ఎంత ఏడ్చినా అతడికి హాని కలిగించేదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వదు. అలాగే భగవంతుడు మనకు శ్రేయస్సును కలిగించేదాన్నే అనుగ్రహిస్తాడు. కానీ మనం ఎంత ప్రార్థించినా మనకు హాని కలిగించేదాన్ని మాత్రం ప్రసాదించడు. కాబట్టి మన ప్రార్థనలకు ఆయన స్పందించడం లేదంటే అది మన శ్రేయస్సుకోరే అని అర్థం చేసుకోవాలి. ❖

పండుగలు - పర్వదినాలు

డిసెంబర్ - 2013

11	బుధవారం	: స్వామి ప్రేమానంద జయంతి
13	శుక్రవారం	: గీతాజయంతి, ఏకాదశి
24	మంగళవారం	: దివ్యజనని శ్రీశారదాదేవి జయంతి
28	శనివారం	: స్వామి శివానంద జయంతి, ఏకాదశి

జనవరి - 2014

01	బుధవారం	: కల్పతరు దినోత్సవం
06	సోమవారం	: స్వామి శారదానంద జయంతి
11	శనివారం	: వైకుంఠ ఏకాదశి
12	ఆదివారం	: జాతీయ యువజన దినోత్సవం
14	మంగళవారం	: సంక్రాంతి, స్వామి తురీయానంద జయంతి
23	గురువారం	: స్వామి వివేకానంద జయంతి (తిథి ప్రకారం)
27	సోమవారం	: ఏకాదశి



ఎవరికి ఎన్ని సార్లు నమస్కారం?

ఎలా నమస్కారం చేయాలనే కాకుండా, ఎన్ని సార్లు చేయాలనే దానికి కూడా శాస్త్రాల్లో ఓ లెక్క ఉంది. పెద్దల ముందు, జ్యేష్ఠ సోదరుల ముందు, గృహస్థుల ముందు ఒకే పర్యాయం నమస్కారం చేయాలి. ఇక, సన్న్యాసులకూ, మఠాధిపతులకూ నమస్కరించాల్సి వచ్చినప్పుడు వారు చతుర్థాశ్రమానికి చెందిన వారు కాబట్టి నాలుగు నమస్కారాలు చేయాలని శాస్త్ర వచనం. (బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్న్యాస ఆశ్రమాలు - ఈ నాలుగూ చతురాశ్రమాలు). సన్న్యాసుల ముందు నాలుగు నమస్కారాలు చేసి, 'నమో నారాయణాయ' అని చెబితే, సన్న్యాసి కూడా 'నారాయణాయ' అని ప్రతివచనం పలికి దీవించడం సంప్రదాయం.

అలాగే, దేవాలయాల్లో ఈశ్వరుని ముందు మూడు నమస్కారాలు చేయాలనే నియమం ఉంది. మనలో ఉండే సత్వ రజస్తమో గుణాలు మూడింటికీ ప్రాతినిధ్యం వహించే త్రిమూర్తులకు ఒక్కొక్క మూర్తికి ఒక్కొక్క నమస్కారం చెందాలనేది దీని ఉద్దేశం. అందుకే, వినాయకుడికీ, సుబ్రహ్మణ్యేశ్వరుడికీ, విష్ణువుకూ, శివుడికీ, ఇంకా కొందరు దేవతలకూ మూడు నమస్కారాలు చేయాలనే నియమాన్ని పాటిస్తున్నారు. అమ్మవారి విషయంలో మాత్రం నాలుగు నమస్కారాలు చేయాలని పెద్దల మాట.

నమస్కార ఫలం: ఏది ఏమైనా, భక్తితో నమస్కరిస్తే, అది అనంత కోటి ఫలాలను ఇస్తుందని శాస్త్ర వచనం.

త్రీణి పంచ చ సప్తాని నవ ద్వాదశ సంఖ్యయా ।
భక్త్యా కుర్యా న్నమస్కార మశ్వమేధ ఫలం లభేత్ ॥

"భక్తితో మూడు, అయిదు, ఏడు, తొమ్మిది, పన్నెండు సంఖ్యల్లో నమస్కారాలు చేసినట్లయితే, అశ్వమేధ యాగం చేసినంత ఫలితం కలుగుతుంది."

ఎలా సాష్టాంగపడాలి? : పురుషులు సాష్టాంగ నమస్కారం చేయడానికి కూడా ఓ విధానం ఉంది. వక్షస్థలం నేలను తాకేలా శిరస్సును నేలపై ఉంచాలి. తరువాత కుడి చేతినీ, ఆ తరువాత ఎడమ చేతినీ ముందుకు చాచాలి. అటు పైన అదే రీతిలో చేతులను వెనుకకు ముడుచుకోవాలి. తరువాత కుడి, ఎడమ భుజాలను నేలను తాకేలా చేయాలి. ఆ పైన చేతులను వెనుకకు తీసి, నడుము వైపునకు మడవాలి. మొదట కుడి చెవినీ, ఆ తరువాత ఎడమ చెవినీ భూమిని తాకేలా చేయాలి. ఇదీ సాష్టాంగ నమస్కార విధానం. దేవుడికి నమస్కారం చేస్తున్నప్పుడు పురుషులు రొమ్ము మీద వస్త్రం ఉంచుకోరాదు. అందుకే, సాంప్రదాయికంగా భగవంతునికీ, మఠాధిపతులకూ ఇలా సాష్టాంగ నమస్కారం చేస్తున్నప్పుడు చొక్కా, బనియన్ లాంటివి ధరించకపోవడం జన వ్యవహారం.

గోత్ర నామాలు చెప్పాలా?: పెద్దలకు నమస్కారం చేస్తున్నప్పుడు పురుషులు తమ వంశ పరంపర, పేరు, గోత్రం చెప్పి అభివాదం చేయడం శాస్త్రం.

అభివాదా త్పరం విప్రో జ్యాయాంస మభివాదయన్ ।
అసౌ నామాహ మస్మీతి స్వంనామ పరికీర్తయేత్ ।

"నమస్కరిస్తున్నప్పుడు విప్రులు తమ వంశాన్నీ, గోత్రాన్నీ, నామాన్నీ చెప్పుకొని మరీ నమస్కరించాలి."

అయితే, స్త్రీలకు నమస్కరిస్తున్నప్పుడు మాత్రం వంశ పరంపర, గోత్ర నామాలు వల్లించాల్సిన పని లేదు. కేవలం నమస్కారం చేస్తే చాలు.


"కాషాయ దండ మాత్రేణ యతిః పూజ్యః" అని పెద్దల మాట. అంటే, కాషాయ వస్త్రాలు ధరించి, దండహస్తులైన వారిని నిస్సంకోచంగా పూజ్యభావంతో చూడాలని అర్థం. కాబట్టి, సన్న్యాసులనూ, మఠాధిపతులనూ తప్పకుండా గౌరవించాలన్న మాట. సన్న్యాసులకు నమస్కరిస్తున్నప్పుడు గోత్రనామాలు చెప్పాల్సిన పని లేదు. వారి ముందు "నారాయణాయ నమః" అని కానీ, కేవలం "నారాయణ" అని కానీ చెబితే చాలు. సన్న్యాసులు కూడా ప్రతివచనంగా "నారాయణ" అని అంటారు. సదా నారాయణ నామస్మరణే సన్న్యాసులకు విహితం కాబట్టి, వారు అలా చేస్తారు.

అలాగే, ఆలయాల్లో భగవంతుడి ముందు నమస్కారాలు అర్పించే సమయంలో గోత్ర నామాలు, వంశపరంపరలు వల్లించాల్సిన పని లేదు. స్తోత్రాలతో భగవంతుణ్ణి స్తుతించి, త్రికరణ శుద్ధిగా ప్రార్థించి, నమస్కారాలు అర్పించి, తెలిసో తెలియకో చేసిన తప్పులను క్షమించాల్సిందిగా క్షమాభిక్ష అర్థించాలి. ❖ (మరిన్ని విశేషాలు... వచ్చే సంచికలో...)

స్వార్థరాహిత్యమే, పరహితవాంఛయే ధర్మమయ జీవితానికి నిదర్శనం. నిజమైన మతానికి చిహ్నం. నిస్వార్థత ఎవరిలో అధికంగా ఉంటుందో వారే గొప్ప ఆధ్యాత్మిక సంపన్నులు. -స్వామి వివేకానంద

సీతను నేనే! రాధను నేనే!!

– డాక్టర్ రుద్రాణీ ముఖర్జీ



నరేంద్రుడు (స్వామి వివేకానంద), శ్రీరామకృష్ణుల అవతారాన్ని సందేహించినప్పుడు 'నేనే రాముణ్ణి, నేనే కృష్ణుణ్ణి' అని గురుదేవులు వెల్లడించారు. ఒకసారి శారదాదేవిని ఓ సన్న్యాసి 'శ్రీరామకృష్ణులు భగవత్ స్వరూపులు అయితే మరి మీరు ఎవరు' అని ప్రశ్నించాడు. వెంటనే మాతృమూర్తి 'నేను ఇంకెవరిని! దేవీ అవతారాన్నే!' అని బదులిచ్చారు.

త్రేతాయుగంలో అవతరించిన ఆ శ్రీరాముడు, ద్వాపర యుగంలో వెలసిన ఆ శ్రీకృష్ణుడు– ఇప్పుడు శ్రీరామకృష్ణులుగా అవతరించారు. కాబట్టి సీతామాత, రాధాదేవి అవతారమే శ్రీశారదాదేవి.

ఈ ఆధునిక యుగంలో సాధారణ గ్రామీణ స్త్రీగా జన్మించిన శారదాదేవి కొన్ని సందర్భాల్లో మాత్రమే తన అవతార రహస్యాన్ని వెల్లడించారు.

మాతృమూర్తి రామేశ్వరం దర్శించినప్పుడు అక్కడ వెలసిన శివలింగానికి అభిషేకం చేయాలని సంకల్పించారు. ఆ శివలింగంపై ఉన్న కవచాన్ని తొలగించినప్పుడు మాతృమూర్తి భావపారవశ్య స్థితిలో 'అప్పుడు నేను ఎలా ఉంచి వెళ్ళానో అలాగే ఉంది' అని అన్నారు. లంకలో యుద్ధం పూర్తయ్యాక సీతారాములు అయోధ్యకు తిరిగి వెళుతూ రామేశ్వర సముద్రతీరంలో సైకతలింగం తయారుచేసి పూజించారు. ఆ శివలింగాన్ని చూడగానే శారదాదేవికి గడచిన తమ అవతార జ్ఞాపకాలు స్మృతిపథంలో మెదిలాయి.

'నేను రాధను' – మాతృమూర్తి శారదాదేవి నోట అన్యాపదేశంగా వెలువడిన అవతార రహస్యం. అమ్మ బృందావనం సందర్శించినప్పుడు ఆమె సాక్షాత్తూ రాధాదేవి అనే సత్యాన్ని ప్రపంచం తెలుసుకోగలిగింది. బృందావనం వీధులలో అమ్మ నడిచి వెళుతుంటే మళ్ళీ రాధాదేవి తమ ముంగిటకు వచ్చిందని అక్కడి భక్త జనులు ఆ తల్లి పాదాల చెంత వాలారు. శారదాదేవి అక్కడ బసచేసిన రోజులన్నీ ఆమె స్వస్వరూపం ప్రతి కదలికలోనూ, ప్రతి నెలవులోనూ గుర్తుకు రావడం జరిగేది. యమునా నదిని దర్శించగానే శ్రీకృష్ణుని భావనలో రాధాదేవి తన్మయురాలైనట్లు మాతృమూర్తి కూడా యమునా తీరంలో భావపరవశురాలైన సందర్భాలు అనేకం చోటుచేసుకున్నాయి.

శారదాదేవి ముమ్మూర్తులా రాధాదేవినే పోలివుంటుందన డానికి నిదర్శనం ఉద్బోధన్‌లో శారదాదేవి చిత్రపటాన్ని చూసిన ప్రమదదత్తా అనే వైద్యురాలు 'ఈమె సాక్షాత్తూ రాధాదేవియే!' అని అన్నారు. మాతృమూర్తిని ప్రత్యక్షంగా దర్శించి, ఆమె పాదాలను స్పృశించిన తరువాత డాక్టర్ ప్రమదదత్తా 'నిస్సందేహంగా మాతృమూర్తి రాధాదేవియే' అని సంపూర్ణంగా విశ్వసించింది.

బృందావన యాత్రకు బయలుదేరు తున్న ఒక పూజారిని గౌరీమా అనే భక్తురాలు ముందుగా శ్రీశారదాదేవిని దర్శించాల్సిందిగా సూచించింది. ఆమె సూచన మేరకు ఆ పూజారి శారదమ్మను దర్శించడానికి వెళ్ళి, అమ్మకు ప్రణమిల్లి పైకి లేచి చూసేసరికి అక్కడ శారదాదేవి స్థానంలో రాధాదేవి ప్రత్యక్షమైంది. అప్పుడు అతడు భావపార వశ్యంలో 'ఆనందస్వరూపిణి అయిన రాధాదేవికి ప్రణమిల్లు తున్నాను' అంటూ స్తుతించాడు.

మాతృవియోగ దుఃఖంలో ఉన్న ఒక బాలుడు శ్రీశారదాదేవిని దర్శించాడు. అప్పుడు అమ్మ అతణ్ణి ప్రేమతో ఆలింగనం చేసుకోగానే ఆ బాలుడు మాతృమూర్తిలో రాధాదేవిని దర్శించాడు.

యతీంద్రనాథ్ మిత్రా అనే ప్రఖ్యాత గాయకుడు శ్రీరాధాదేవిని స్తుతిస్తూ మధురంగా కీర్తనలు పాడసాగాడు. మాతృదేవి ఆ కీర్తనలు వింటూ భావసమాధి మగ్నులయ్యారు. సాక్షాత్తూ రాధాదేవియే, శారదామాతగా ఆవిర్భవించినట్లు అక్కడున్నవారందరూ అనుభూతి చెందారు.

రాధాదేవికి లలిత, విశాఖ, చిత్ర, చంపకలత, తుంగవిద్య, ఇందులేఖ, బంగాదేవి, సుదేవి అనే అష్టసఖులుండేవారు. ఈ అష్టసఖులే భువి పైకి దిగివచ్చి కామార్పుకూర్‌లో

శారదాదేవి వెన్నంటే బాలికల రూపంలో ఉండేవారు. వీరు శారదాదేవికి మాత్రమే కనిపించే వారు. అమ్మ తెల్లవారుజామున చెరువులో స్నానానికి వెళుతుంటే ముందు నలుగురు, వెనుక నలుగురు తోడుగా వెళ్ళేవారు. ఈ విధంగా శారదాదేవి, రాధ ఇరువురూ ఒక్కటేనని వెల్లడైంది.



వాస్తవానికి తన జీవితమే తన సందేశం అనే విధంగా ఆదర్శ జీవితాన్ని గడిపారామె. జయరామ్‌బాటి, కామార్పుకూర్, దక్షిణేశ్వరం అనే మూడు ప్రదేశాలే ఆమెకు లోకమైంది. మాతృమూర్తికి అప్పుడప్పుడు గత అవతారానికి చెందిన జ్ఞాపకాలు స్ఫురణకు వచ్చినా తన స్వస్వరూపాన్ని బహిర్గతం చేయకుండా మరుగున పరచేవారు. ఇదే విషయాన్ని స్వామి అరూపానంద (మాతృమూర్తి శిష్యులు) అమ్మ వద్ద ప్రస్తావిస్తే, "నేనెవర్ని అని అప్పుడప్పుడు తలంపునకు రావడం కద్దు. ఆ సమయంలో నేనేమి చేస్తున్నాను? నేనేమి చేస్తున్నాను? అని అనుకుంటాను. కానీ నా చుట్టూ ఉండే పరిస్థితులు నన్ను సాధారణ స్థితికి తీసుకువస్తున్నాయ"ని తెలిపారు.

ఒకనాడు వివేకానంద స్వామికి ఓ కల వచ్చింది. ఆ కలలో 'నీకు రాధాకృష్ణులను చూపిస్తాను రా!' అంటూ రామకృష్ణులు, స్వామీజీని కొంతదూరం చేయిపట్టుకొని తీసుకువెళ్ళి, ఇదిగో చూడు అనగానే ఆయన దేహం నుండి ఓ సుందర దివ్య స్త్రీమూర్తి రూపం బయటకు వచ్చి దర్శన మిచ్చింది. ఆ దివ్యరూపాన్ని చూసిన మరుక్షణమే వివేకానంద స్వామి చేతులు జోడించి రాధాదేవిని స్తుతించారు.

రాధాకృష్ణుల ప్రేమ పవిత్రమైనది. ఆ ప్రేమలో భక్తి తప్ప మరొకటి లేనే లేదు. రాధకు స్నేహితుడు, హితుడు కూడా కృష్ణుడే. ఆ పరమాత్ముడి పాదపద్మాలకే రాధ దాసురాలు. నిత్యం సరళమైన, శాంత స్వభావంతో భాసిల్లే రాధాదేవి లాంటి ముఖవర్చస్సు ఈ ఆధునిక యుగంలో మనకు శారదాదేవిలోనే కనిపిస్తుంది. శ్రీశారదా రామకృష్ణులు ఇరువురూ మేలిముసుగులోనే తమ ద్విగుణీకృతమైన దివ్యత్వాన్ని మరుగుపరుచుకున్నారు.

రాధాదేవి ప్రేమలో భక్తి, పవిత్రత ఎంత ప్రగాఢంగా ఉండేవో నహబత్‌లో శారదాదేవి రామకృష్ణుల సహజీవనంలో అవే గోచరిస్తాయి. ఎన్నో అసౌకర్యాల మధ్య కూడా కించిత్తు బాధను వ్యక్తం చేయకుండా ఎంతో భక్తిభావంతో రామకృష్ణులకు సేవ చేశారు ఆమె. చిన్నపిల్లాడికి ఆహారం పెట్టినట్లే ఆయన ఉదరానికి తగ్గట్టు వండిపెట్టేవారు. శారదాదేవి చెంతనే ఉండి ప్రేమగా వడ్డిస్తుంటే మరింత తినేవారట. ఆయనకు ఆరోగ్యం సరిగా లేనప్పుడు పాలు ఎప్పటికప్పుడు వేడి చేసి, రుచి తగ్గకుండా కొద్ది కొద్దిగా తాగించేవారు.

రాధాదేవికి కృష్ణుడి పట్ల ఉన్న వాత్సల్యం, శారదాదేవికి రామకృష్ణుల పట్ల ఉన్న వాత్సల్యంతో సరిపోల్చవచ్చు. రామకృష్ణులు అనే స్నేహితుడి బోధనలతోనే శారదాదేవి తనను తాను మలుచుకున్నారు. మాతృమూర్తి విశాలమైన మాతృత్వ భావనలోనూ, ఆ ప్రేమలోని స్వచ్ఛత, పవిత్రత మధ్య ఆ అవతారమూర్తి ఓ పసిబాలుడి లాగా భాసిల్లారు. అందుకే వారి ఆదర్శ దాంపత్య జీవితం, రాధాకృష్ణుల ప్రేమ లాగా సామాన్య మానవులకు సాధ్యం కానిది.

రాధాదేవి చిత్తరువులను గమనిస్తే ఆమెలోని హుందాతనం, సహనగుణం, స్వయం సామర్థ్యం మొదలైన సుగుణాలు గోచరిస్తాయి. అలాగే శారదాదేవి కూడా ఆ సుగుణాలతో శోభిల్లారు.


రాధాదేవి ప్రేమ కృష్ణుడికే పరిమితం. కానీ శారదమ్మ తన ప్రేమను రామకృష్ణులతో పాటు అందరికీ పంచిపెట్టారు. రామకృష్ణుల మహాసమాధి తరువాత సన్న్యాసులకు మార్గనిర్దేశం చేశారు. స్వయం సామర్థ్యంగల స్త్రీ మూర్తిగా భాసిల్లారు మాతృమూర్తి శ్రీశారదాదేవి. ❖

అనుసృజన: శ్రీమతి టి. ఆశాలత

అద్భుత 'మాతృశక్తి'ని జాగృతం చేయడానికే శ్రీశారదాదేవి జన్మించారు. అమ్మను మూలాధారంగా చేసుకొని, గార్గి, మైత్రేయి లాంటి విదుషీమణులు మళ్ళీ ఈ పుడమిపై పుడతారు. -స్వామి వివేకానంద

స్వామి వివేకానంద తమ మిత్రుడూ, శిష్యుడూ అయిన మైసూరు మహారాజు చామరాజేంద్ర వడయార్‌కు అమెరికా నుండి వ్రాసిన లేఖలో ఇలా అన్నారు – "My dear prince, This life is short, the vanities of the world are transient, but they alone live who live for others, the rest are more dead than alive – ప్రియమైన యువరాజా! ఈ జీవితం అల్పమైనది, అశాశ్వతమైనది. ప్రాపంచిక సుఖభోగాలు క్షణికం. కానీ ఎవరైతే పరుల కోసమే జీవిస్తారో, వారే నిజంగా, శాశ్వతంగా జీవిస్తారు. మిగిలిన వారంతా బ్రతికి ఉన్నా చచ్చిన వారితో సమానం."

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, ఏసుక్రీస్తు, మహమ్మద్ ప్రవక్త, ఆది శంకరాచార్యులు, రామానుజాచార్యులు, గౌతమ బుద్ధుడు, శ్రీరామకృష్ణ పరమహంస, శ్రీశారదాదేవి, స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ, శ్రీరమణమహర్షి, నేతాజీ సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ టాగూర్, శ్రీఅరవింద యోగి,



అవనిలో అమరులమవుదాం!

– స్వామి అర్చనానంద

సోదరి నివేదిత, ఝాన్సీ లక్ష్మీబాయి, రాణి రుద్రమదేవి, మీరాబాయి – వీరందరూ తమ వ్యక్తిగత సుఖభోగాలు, పేరు ప్రతిష్ఠల కోసం జీవించలేదు, ప్రాకులాడలేదు. సమాజం, దేశంలోని ప్రజల కోసం, వారి సుఖసంతోషాల కోసం, వారి బంధ విముక్తి కోసం శ్రమించారు, జీవించారు. భౌతికంగా వారు ఈనాడు మన మధ్యన లేరు. కానీ వారి చైతన్యం, స్ఫూర్తి, త్యాగం, సేవ, సత్యనిష్ఠ, పవిత్రత, నిస్స్వార్థం, దైవప్రేమ, దేశప్రేమ మొదలైన దివ్యగుణాల మూలంగా వారు మన హృదయాలలో వందలాది సంవత్సరాలైనా జీవించే ఉన్నారు, కలకాలం జీవించే ఉంటారు.

ఒక పాఠశాలలో ఓ స్వామీజీ పిల్లలకు బోధిస్తూ 'మీ తాత, ముత్తాతలు, వాళ్ళ తల్లితండ్రుల పేర్లు తెలుసా?' అని అడిగారు.

అందరూ 'తెలీదు' అన్నారు.

స్వామి: 'బుద్ధుడు, శంకరాచార్యులు, శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానంద, మహాత్మాగాంధీ, రమణమహర్షి' – వీరి పేర్లు తెలుసా?

పిల్లలు: ఔను. బాగా తెలుసు.

స్వామి: వందలాది సంవత్సరాల పూర్వం పుట్టిన వీరందరి పేర్లూ మీకు తెలుసు. మరి మీకు 20, 30, 50 ఏళ్ళ క్రిందట మాత్రమే జీవించిన మీ సొంత తాతలు, ముత్తాతల పేర్లు ఎందుకు తెలియవు?

విద్యార్థిని: బుద్ధుడు, శంకరాచార్యులు, శ్రీరామకృష్ణులు, స్వామి వివేకానంద – వీరందరూ చాలా 'గొప్పవాళ్ళు'. మానవాళికి ఎంతో సేవ, మేలు చేసినవాళ్ళు. కనుకనే వారి పేర్లు మాకు బాగా తెలుసు. మరి మా తాత, ముత్తాతలు వాళ్ళ కోసం, వాళ్ళ కుటుంబం కోసం మాత్రమే పాటుపడ్డారు. కాబట్టి వారి పేర్లు ఎవరికి గుర్తుంటాయి?

స్వామి: భేష్! కానీ చిట్టితల్లీ! నీ మనుమలూ, ముని మనుమలూ నీ గురించి కూడా ఇలాగే చెప్పుకునే స్థితిని రానీయకమ్మా? కలకాలం నీ పేరు గుర్తుండి పోయేలా గొప్ప కార్యాలు సాధించు! భరత మాత సేవలో తరించు!

ఒక సద్గురువు వేల మందికి ప్రేరణ ఇవ్వవచ్చు. ఒక అవధూత లక్షమందికి ప్రేరణ ఇవ్వవచ్చు. కానీ సమస్త విశ్వ మానవాళికీ స్ఫూర్తీ, శక్తీ, శాంతీ, చైతన్య దీప్తీ, ఆధ్యాత్మిక జాగృతీ, దివ్య ప్రేరణ ఒసగి, విశ్వమానవ హృదయాంతరంగాలను ఉర్రూతలూగిస్తూనే ఉన్న 'వివేకానంద స్వామి'ని ఏమనాలి? ఏ కొలమానంతో కొలవాలి?

"మిగిలిన వారంతా నూనెదీపాలు, రాత్రి మిణుకు మిణుకుమనే చుక్కలూ అయితే నా నరేంద్రుడు విశ్వానికి వెలుగునిచ్చే జ్ఞాన సూర్యుడు" అని పిన్నవయసులోనే నరేంద్రునిలో భావి భారతనిర్మాతనూ, విశ్వ ఆధ్యాత్మ చైతన్య జాగృతిని చేసే విశ్వాచార్యునీ పసిగట్టిన శ్రీరామకృష్ణుల దివ్యవాణి ఎంత అక్షర సత్యమో కదా! (మిగతా 30వ పేజీలో...)

ధీరవాణి
- స్వామి వివేకానంద

ధీరులై చరించండి!



ఈ ప్రపంచాన్నీ, ఈ స్వప్నాన్నీ, ఈ భయానక పీడకలలనూ నేను ద్వేషిస్తాను. ఈ లోకం నైతికరాహిత్యంతో, సుందర వదనాలతో, కృత్రిమ హృదయాలతో నిండి ఉంది. ఉపరితలాన ధార్మికత గురించి కేకలు, లోలోపల కేవలం కాపట్యం.

ప్రజలు ఎప్పుడైతే నన్ను గౌరవింపనారంభించారో, అప్పుడే క్రైస్తవ ఫాదరీలు నా వెంటపడ్డారు. వార్తాపత్రికలలో నాపై అనేక అపనిందలు ప్రచురించి ప్రచారం చెయ్యసాగారు. ఈ అపనిందలను ఖండించాల్సిందిగా నన్నెంతోమంది అడిగారు. కానీ నేను వాటిని కించిత్తు కూడా పట్టించుకోలేదు. ఈ ప్రపంచంలో ఏ మహత్కార్యమైనా వంచన మూలంగా సాధ్యం కాదని నా దృఢ విశ్వాసం. అందువల్ల ఈ అపనిందలను లక్ష్యపెట్టకుండా నా ఉద్యమ కార్యాన్ని నిబ్బరంగా సాగించాను.

నాపై నీలాపనిందలు వేసిన వాళ్ళు తరువాత పశ్చాత్తాపం చెంది, వారంతట వారే ఆ అపనిందలను ఖండిస్తూ పత్రికలలో ప్రచురించి నాకు దాసోహమని క్షమాపణ చెప్పుకొనేవారు. ఎవరైనా నన్ను వారి ఇంటికి ఆహ్వానించారని తెలియవస్తే ఎవరో ఆ ఇంటి పెద్దకు ఈ నిందలను మోసేసేవారు. ఆ చెప్పుడు మాటలు విని ఆ పెద్దమనిషి ఇంటికి తాళం వేసి ఎటో వెళ్ళిపోయేవాడు. నేనక్కడికి వెళితే ఎవరూ ఉండేవారు కారు. మళ్ళీ కొన్నాళ్ళ తరువాత నిజానిజాలు తెలుసుకొని, వారు తాము చేసిన అకృత్యానికి పశ్చాత్తాపం చెందేవారు.

అసలు విషయం ఏమిటంటే, ఈ లోకమంతా నీచమైన ప్రాపంచికతతో నిండి ఉంది. కానీ నైతిక బలం, వివేచన గల వాళ్ళు వీటి వల్ల ఎన్నడూ మోసపోరు. లోకం దాని ఇష్టం వచ్చినట్లు మాట్లాడనీ, నేను ధర్మమార్గాన్నే అనుసరిస్తాను. ఇది ధీరుని కార్యాచరణ విధానమని తెలుసుకో! నడివీధిలో ఏనుగు పోతున్నప్పుడు, కుక్కపిల్లలు చుట్టుముడతాయి. కానీ ఏనుగు వాటిని లక్ష్యపెట్టదు. ఒక మహాపురుషుడు ఉద్భవించినప్పుడు ఆయనను చూసి మొరిగేవారు అనేకులు ఉంటారు. రేయింబవళ్ళు వీడేమి అన్నాడో, వాడేమి వ్రాశాడో అని చూస్తుంటే, ఈ లోకంలో ఏ మహత్కార్యమూ సాధ్యం కాదు... "నీతిశాస్త్ర కోవిదులు స్తుతించనీ లేదా దూషించనీ, సంపదలు రానీ లేదా పోనీ, మరణం ఈ రోజు వాటిల్లనీ లేదా వంద సంవత్సరాల తరువాత వాటిల్లనీ, ధీరులైన వారు న్యాయమార్గం నుంచి కించిత్తు కూడా వైదొలగరు."

"నీతిశాస్త్ర కోవిదులు స్తుతించనీ లేదా దూషించనీ, సంపదలు రానీ లేదా పోనీ, మరణం ఈ రోజు వాటిల్లనీ లేదా వంద సంవత్సరాల తరువాత వాటిల్లనీ, ధీరులైన వారు న్యాయమార్గం నుంచి కించిత్తు కూడా వైదొలగరు."

నాకు కావలసింది సత్యం. సత్యానికి ఎన్నడూ అసత్యంతో పొత్తు కుదరదు. ప్రపంచమంతా ఏకమై నన్ను ప్రతిఘటించినప్పటికీ సత్యమార్గం నుండి వైదొలగను. ఎప్పటికైనా సత్యమే జయిస్తుంది. అదే నా దృఢ విశ్వాసం. ❖

సత్యం, అసత్యం కన్నా ఎన్నోరెట్లు గురుతరమైనదని జ్ఞాపకముంచుకో. సత్యం, సౌజన్యం నీవు కలిగివున్నట్లయితే నీకు అపారశక్తి లభిస్తుంది. విజయం తప్పక చేకూరుతుంది. -స్వామి వివేకానంద



సర్వజ్ఞుడు

– సుదేశ్ గార్గ్

బ్రహ్మ విద్వరిష్ఠులు – బ్రహ్మవిదులలో శ్రేష్ఠులు. స్వామి వివేకానంద ఆ కోవకు చెందినవారు. ఒక స్పర్శ లేదా ఒక చూపుతో అవతలి వారికి ఆత్మసాక్షాత్కారం కలిగించే శక్తి ఆయనకు ఉండేది. స్వామీజీ సాన్నిధ్యంలో, భగవంతుడు ఉన్నాడన్న నమ్మకం గట్టిగా కలిగేది. ఆయన భావాలు అత్యంత శక్తిమంతాలు. స్వామీజీ మాటలు వింటున్న శ్రోతలు దేశ, కాల పరిస్థితులను మరచి అత్యున్నత భావవీధిలో విహరించేవారు. ఒక అవతార పురుషుని సమక్షంలో ఉన్నామనే భావం కలిగేది. "ఆ దివ్య పురుషుడు తన చుట్టూ శాంతిని ప్రసరింపజేసేవారు. స్వామీజీని ఎరిగిన వారు ఆయనను ప్రేమించకుండా ఉండలేక పోయేవారు. ఆయనను చూసే సౌభాగ్యం లభించిన వారు, ఒక భగవదవతారాన్ని చూస్తున్నామని గ్రహించారు" అని తన అనుభూతిని తెలిపారు డాక్టర్ లోగన్. 'స్వామీజీ సమక్షంలో ఉండడం, అనంతత్వం సమక్షంలో ఉండడమే' అన్నారు జోసెఫిన్ మెక్లాడ్. 'స్వామీజీని ఒకసారి చూసినవారు, ఒకసారి విన్నవారు ఆయన అడుగుజాడలలో నడవక ఉండగలరా? ఆయన ఒక అవతార పురుషుడు. మరచిన తన తత్త్వాన్ని వ్యక్తులు మళ్ళీ తెలుసుకునేందుకు తోడ్పడతారు' అన్నారు సోదరి క్రిస్టీనా.

స్వామీజీ స్వయంగా తన గురించి భావావేశంలో ఇలా అన్నారు: "నాకు రూపం లేదు, ఆద్యంతాలు లేని దేశకాలాతీత తత్త్వం నేను. నేను అన్నిటా ఉన్నాను, అన్ని చోట్లా ఉన్నాను. విశ్వానికి ఆధారం నేను. నేను శుద్ధ సచ్చిదానందాన్ని".

ఒక వ్యక్తిని చూడగానే, ఆ వ్యక్తిని గురించి సమస్తం తెలుసుకునే శక్తి ఉండేది స్వామీజీకి. ఆయన మనస్సు విశ్వాత్మలో లీనమై ఉండడమే దీనికి కారణం. శిష్యులు తమ సందేహం వెలిబుచ్చక ముందే దానికి సమాధానం, పరిష్కారం తెలిపేవారు.

స్వామీజీని కలవక ముందు గుడ్విన్ అతి సామాన్యమైన ప్రాపంచికుడు. తొలి పరిచయంతోనే ప్రాపంచిక బంధనాలన్నీ విడనాడి, స్వామీజీ ఉపన్యాసాలను లఘులిపి (షార్ట్‌హ్యాండు)లో వ్రాసే పనికి పూనుకున్నాడు. గుడ్విన్ గత జీవితాన్ని గురించి స్వామీజీ ఎన్నో సంగతులు సరిగ్గా చెప్పడంతో, ఆయన గొప్ప నైతిక పరివర్తనం చెంది, స్వామీజీకి అనుంగు శిష్యుడయ్యాడు.

మేడమ్ ఎమ్మా కాల్వే అనే సుప్రసిద్ధ గాయనీమణి ఒకసారి తీవ్రమైన కుంగుబాటుకు లోనయ్యారు. భారతదేశం నుండి ఒక యోగి వచ్చాడని విని, ఆయన దర్శనానికి వెళ్ళారు. ఆ సమయంలో ఆయన ధ్యానంలో ఉన్నారు. కళ్ళు తెరవకుండానే, 'తల్లీ! ఎంత ఆందోళనలో ఉన్నావమ్మా! శాంతించు' అని ఓదార్చారు.

కాలాంతరంలో ఆ సంగతిని మేడమ్ ఎమ్మా కాల్వే ఇలా నెమరు వేసుకున్నారు: "నా ఊరూ పేరూ తెలియని ఈ వ్యక్తి ప్రశాంతంగా, నా సమస్యలు, నా బెంగల గురించి చెప్పారు. నా అత్యంత సన్నిహిత మిత్రులకు సైతం తెలియని నా వ్యక్తిగత విషయాల గురించి మాట్లాడారు. అద్భుతం కదూ! మీకు ఈ సంగతులు ఎలా తెలుసు? ఎవరు చెప్పారు? అని నేను అడిగాను. అందుకు స్వామీజీ 'వేరొకరు చెప్పాలా? తెరచిన పుస్తకాన్ని చదివినట్లు నీ మనస్సును చదవగలను' అన్నారు. అది హిప్నాటిజం కాదు, సమ్మోహక శక్తి కాదు. స్వామీజీ ఇచ్ఛాశక్తి, పవిత్రత, సంకల్పబలం అంత గొప్పవి".

ఒక మద్రాసు శిష్యుడు స్వామీజీ గురించి ఇలా వ్రాశాడు: "పృచ్ఛకులు సందేహాలు వెలిబుచ్చక ముందే, సంతృప్తికరమైన సమాధానాలు చెప్పేవారు. పదిమందికి ఒక్కసారిగా సమాధానాలు చెప్పి, వారి నోళ్ళు మూయించేవారు."

శిష్యుల తలంపులన్నీ తెలిసిన సద్గురువు స్వామీజీ. లోపల దాగున్న ఆధ్యాత్మిక శక్తిని వెలికి తెచ్చే మార్గాన్ని శిష్యుడికి తెలిపేవారు. జోసెఫిన్ మెక్లాడ్ తన శక్తిని తెలుసుకొనగా, సోదరి నివేదిత మృదు స్వభావం వికసించింది. పేదసాదల పట్ల ఆర్ద్రత కలిగిన అమెరికన్ శిష్యుడు, స్వామి కృపానందను భక్తిమార్గం వైపు నడిపించారు. శిష్యులకు ఎవరికి తగిన ఆదర్శాన్నీ, ధ్యాన పద్ధతినీ వారికి తెలిపి, వారి ఆధ్యాత్మిక వికాసానికి తోడ్పడేవారు స్వామీజీ.

సహస్రద్వీపోద్యానంలో ఒకనాడు శ్రీమతి మేరీ ఫంకి, క్రిస్టీనాలు తొలిసారిగా స్వామీజీని కలిశారు. ఆయనకు వారి ఆధ్యాత్మిక శక్తి క్షణంలో తెలిసిపోయింది. ఆ ఇద్దరిలో ఒకరికి (క్రిస్టీనా) భారతదేశంతో అవిచ్ఛిన్నమైన సంబంధం ఏర్పడుతుందని కూడా తెలుసుకున్నారు.

స్వామీజీ ఆధ్యాత్మిక క్షేత్రానికే పరిమితం కాలేదు. ప్రజల సర్వతోముఖ వికాసానికీ పాటు పడ్డారు. మానవ జీవితంలోని

ప్రతి క్రియాశీలకరంగంలో, ప్రతి విజ్ఞానరంగంలో తగిన ఆసక్తి చూపించారు. అనేకంలో ఏకత్వం మూలంగానే విశ్వంలో సమరస మాధుర్యం నెలకొందని గ్రహించారు. స్వామీజీ ఇలా అన్నారు: 'భౌతికవాది వాదన సరైనదే. ఉన్నది ఒక్కటే. దాన్ని అతడు పదార్థం అంటాడు, నేను భగవంతుడు అంటాను'. ఆ నిత్యసత్యం తన సకల పార్శ్వాలనూ ఆయన ఎదుట ప్రదర్శించింది.

ప్రపంచ సర్వమత మహాసభలతో పాటు ఒక 'విద్యుత్తు మహాసభ' కూడా జరిగింది. విద్యుచ్ఛక్తి గురించి స్వామీజీ పరిజ్ఞానం ఆ శాస్త్రవేత్తలను విస్మయపరిచింది. వేదాంత సత్యాలు శాస్త్రీయమైనవనీ, ఆధునిక విజ్ఞానశాస్త్రం ఆవిష్కరణలన్నీ వేదాంత సత్యాల పునరావిష్కరణ మాత్రమేననీ స్వామీజీ నిరూపించారు.

విశ్వనిర్మాణశాస్త్రం (cosmology), జీవపరిణామక్రమం, భౌతికపదార్థ శక్తుల మధ్య సంబంధాన్ని విపులంగా వివరించారు. విజ్ఞానశాస్త్ర సిద్ధాంతాలకూ, వేదాంతానికీ ఏయే క్షేత్రాలలో సంధానం కాగలదో సూచించారు. శరీరనిర్మాణశాస్త్రం, నాడీ వ్యవస్థ, దానికి మెదడుతో ఉన్న సంబంధం, మనస్సుకు నాడీవ్యవస్థలోని మార్పులకు గల సంబంధాన్ని గురించి ఆయన ఇచ్చిన వివరణలను శాస్త్రవేత్తలు, వైద్యులు విని విస్మయం చెందారు. వేదాంతమే కాక పాశ్చాత్య తత్త్వశాస్త్రంలో కూడా స్వామీజీ నిష్ణాతులే.

ఒక శిష్యుడు ఇలా వ్రాశాడు: బహువిస్తారమైన స్వామీజీ మనోక్షేత్రం నన్ను ఆకట్టుకొంది. సంభ్రమాశ్చర్యాలకు గురి చేసింది. ఋగ్వేదం నుండి రఘువంశం వరకు; అత్యున్నత వేదాంత భావాల నుండి క్యాంటు, హెగెల్ లాంటి పాశ్చాత్యుల ఆధునిక తత్త్వశాస్త్రం వరకు; పురాణాలు, కావ్యాల నుండి, ఆధునిక సాహిత్యం, లలితకళలు, సంగీతం వరకు; యోగశాస్త్రం ఉత్కృష్టత, ఆధునిక ప్రయోగశాలల సంక్లిష్టత వరకు సమస్తం ఆయనకు స్పష్టంగా తెలుసు. పాశ్చాత్య పర్యటనలో స్వామీజీకి అనేక మేధావులు, రచయితలు, తత్త్వవేత్తలు, చిత్రకారులతో పరిచయం అయింది. తమ తమ క్షేత్రాలలో వారికి ఉన్న పరిజ్ఞానం కన్నా స్వామీజీకి ఎక్కువ తెలుసునని గ్రహించిన వారు ఆయన అనంత మేధాశక్తిని చూసి అబ్బురపడ్డారు.

వివిధ, విభిన్న ప్రపంచ సంస్కృతులు, మత ధర్మాలు ఒక విశ్వజనీన మతంగా రూపొందాలన్నది స్వామీజీ స్వప్నం. ఆ అమూల్య సంపద ఆ పవిత్రకార్యం భారతదేశం చేతుల మీదుగా సర్వ మానవాళికి అందాలన్నారు. ఆత్మ అమృతత్త్వం, మానవుని సహజ దివ్యత్వం, అన్ని జీవుల అస్తిత్వం విభిన్నం కాదనే తత్త్వమే ఆ సంపద; దాన్ని లోకానికి చాటి చెప్పడమే ఆ పవిత్రకార్యం.

మేడమ్ కాల్వే ఈజిప్టు దేశం పర్యటన సమకట్టి, స్వామీజీని మరికొందరు భక్తులను కూడా రావలసిందిగా ఆహ్వానించారు. వారందరూ రైలులో పయనించారు. ఆమె స్మృతులలో కాల్వే ఇలా అన్నారు: 'గ్రీసులోని పాడుబడ్డ పుణ్యక్షేత్రం ఇల్యూసిన్. స్వామి వివేకానంద మాకు దాని విశిష్టత వివరించారు. ఒక బలిపీఠం నుండి మరొకదానికి, ఒక ఆలయం నుండి మరొకదానికి మమ్మల్ని నడిపిస్తూ అచట చోటుచేసుకున్న ఊరేగింపులు, మంత్రోచ్చారణలు, పూజావిధానాలు మాకు వివరించారు.' 1896లో సేవియర్ దంపతులతో స్వామీజీ రోమ్ ప్రాంతం సందర్శించారు. గమ్యం చేరకముందే వారికి ఆ పురాతన నగర వైభవాన్ని వర్ణించారు. చరిత్ర, పురాతత్త్వశాస్త్రాల గురించి ఆయనకున్న పరిజ్ఞానం మూలంగా ఆ చారిత్రక కట్టడాల గురించి ఎన్నో నూతన విషయాలు వెల్లడి అయ్యాయి. రోమన్ సామ్రాజ్యం ఉత్థానపతనాలు, మూలాలు తెలియపరిస్తే, సహ పర్యాటకులు 'ఎంత అద్భుతం స్వామి! మీకు రోమ్ ప్రతి ధూళికణం తెలిసినట్లుందే!' అని వారంతా ఆశ్చర్యపోయారు.

అన్నిటినీ స్పష్టంగా అర్థం చేసుకునే ఆ జ్ఞానం, ఆ బలం స్వామీజీ నిశిత పరిశీలనా శక్తి, చరిత్రను ఆపోశన పట్టడం మూలంగా మాత్రమే వచ్చింది కాదు. మహాకారణాన్ని తరచి చూడగల సామర్థ్యం మూలంగా వచ్చిందది. ప్రతి వస్తువు, మానవ మానసం, జాతులు, సృష్టిలయల పుట్టుపూర్వోత్తరాలు, ఉనికి – అన్నీ స్వామీజీకి తెలుసు.

'జనన మరణాలు నా పాదాల వద్ద సాగిలపడి ఉంటాయ'న్నారు స్వామీజీ. 1890లో ఆయన, కొందరు సోదర శిష్యులతో ఋషీకేశ్ వెళ్ళి, అక్కడ తీవ్ర అనారోగ్యం పాలయ్యారు. ఆందోళన చెందుతున్న శిష్యులతో "ధైర్యంగా ఉండండి, నేను మరణించను. నేను ఒక ప్రత్యేక కార్యం చేపట్టవలసి ఉంది. అది పూర్తయ్యే వరకు మరణం నా దరి చేరదు" అని మృత్యువు చేతుల్లోకి దాదాపుగా వెళ్ళిన స్థితిలో స్వామీజీ అన్నమాటలివి.


అమిత దివ్యతేజస్సు మానవాకారంలో ఈ భువి మీదకు దిగి వచ్చింది. ఒక దివ్య శిశువు – శ్రీరామకృష్ణ అభ్యర్థనను మన్నించి అవతరించింది. ప్రపంచంలో లక్షలాది మానవులకు జ్ఞానోదయం కలిగించాలన్నది ఆ అభ్యర్థన. ఆ బృహత్తర కార్యం ముగిసిన తరువాత ఆ మహా ఆత్మ తన స్వస్థానానికి వెళ్ళిపోయింది. ❖ అనువాదం: డాక్టర్ కమల జయరావు

భారతదేశానికి స్వాతంత్ర్యం మరో 50 ఏళ్ళలో వస్తుందని స్వామి వివేకానంద 1897లో ప్రకటించారు. స్వామీజీ భవిష్యవాణి ప్రకారమే భారతదేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చింది.

నవశకాన్ని ఆవిష్కరించే పారిశ్రామిక విప్లవం రష్యా దేశంలో వస్తుందని ప్రప్రథమంగా లోకానికి చాటింది స్వామీజీయే!

ఐరోపా ఖండం ఒక అగ్నిపర్వత శిఖరంపై ఉందనీ, భవిష్యత్తులో పెనువిప్లవం సంభవించబోతుందనీ 1895లో స్వామీజీ హెచ్చరించారు. ఆయన ఊహించినట్లుగానే దాదాపు 20 ఏళ్ళ తరువాత ఈ భూభాగంపై మహా విస్ఫోటం 1914లో మొదటి ప్రపంచ యుద్ధమై విరుచుకుపడింది.

సదా సంతోష స్వభావాన్నే అలవరచుకోవాలి. అందరిలోవున్న సద్గుణాలను చూడడానికి ప్రయత్నించాలి. ప్రతికూల వాతావరణాన్ని ఎదిరించే ధీరగుణం మన ఆత్మోన్నతికి తోడ్పడుతుంది. -స్వామి వివేకానంద



పల్లె జీవితమా?



మిత్రద్వయం వినీత్, వికాస్‌లు నెల చివర్లో మళ్ళీ సమావేశమయ్యారు. వివేకానందుడిని నిరంతరం చదువుతూ ఆ జ్ఞానభాస్కరుడి తేజస్సుకు ఆశ్చర్య చకితులవుతున్నారు. మనసులలోని అజ్ఞానాంధ కారాన్ని ఆ కాంతి కిరణాలతో తొలగించుకోవడానికి పూనుకున్న స్నేహితులిరువురూ తమ చర్చా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఒకరి ద్వారా మరొకరు తమ ధీకుశలతను పెంచుకోవాలనుకొని ఆత్రంగా ఉన్నారు.

వినీత్: మిత్రమా! ఉభయకుశలోపరి. జీవన ప్రవాహం వేగవంతమైంది. లోకపోకడలు సక్రమమైనవా? కావా? అని విచారించే శక్తియుక్తులు, సమయం చాలామందికి లేవు. ఈ ప్రస్థానమెటో చాలామందికి తెలియదు. పల్లెలలోని ప్రజలు పట్టణాల వైపు చూస్తున్నారు. పట్టణాలలోని వారు నగరాల వైపు దృష్టి సారిస్తున్నారు. పట్టణీకరణను అభివృద్ధికి సూచికగా ప్రభుత్వాలు భావిస్తున్నాయి. ఇది మంచి పరిణామమేనా?

వికాస్: ఈ పరిణామం ఇప్పటిది కాదు. పల్లెవాసులు పట్టణాల వైపు దృష్టి సారించడమనేది రాచరిక వ్యవస్థ నాటి నుండే ప్రారంభమైంది. ఐతే అప్పటి పట్టణీకరణలో ఇప్పటి నగరాభివృద్ధి వలన కలుగుతున్న సమస్యలు ఉత్పన్న మవలేదు. ఆ రోజుల్లో నగరజీవనం ఇప్పటి నగరాలలాగా అధిక ఇంధన వ్యయం మీద ఆధారపడలేదు. జీవన వ్యయం ఇంతగా లేదు. ఆ రోజుల్లో నగరాలంటే అధిక జనసమూహంతో కూడుకున్న పల్లెలే. ప్రస్తుత గ్రామ-పట్టణ వ్యత్యాసాలు అప్పుడు లేవు.

వినీత్: ఇప్పుడు కూడా మళ్ళీ అదే వ్యత్యాసం లేని స్థితికి వస్తున్నామనుకుంటా. పట్టణాలలో ఉపయోగించే వస్తువులన్నిటినీ పల్లెల్లో కూడా వినియోగిస్తున్నారు. ఐనా పట్టణాలకు వలసలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. పట్టణాలలో జీవనవ్యయం రోజురోజుకూ అధికమవుతోంది. పట్టణవాసుల జీవితం అంతా విపరీతమైన ఒత్తిడి, ఆందోళన లాంటి మానసిక సమస్యలు.. కాలుష్యం, వాహనాల రద్దీ, అనారోగ్యం లాంటి భౌతిక సమస్యలతో కూడుకుంటున్నది. ప్రాణులకు ప్రాథమిక అవసరమైన ప్రాణవాయువు కూడా కరవవుతోంది. ఐనా ఈ పట్టణ వ్యామోహం ఎందుకు తగ్గడం లేదో తెలియడం లేదు.

వికాస్: పల్లెలలో విద్యావకాశాలు తక్కువ. వైద్య సదుపాయాలు కూడా అంతంత మాత్రమే. అన్ని వస్తువులూ లభ్యం కావు. వ్యవసాయం ఆధారంగానే జీవించాల్సి ఉంటుంది. ఉపాధి అవకాశాలు చాలా తక్కువ. అలాంటప్పుడు పల్లెల్లో ఉండడానికి ఎవరు ఇష్టపడతారు చెప్పు?

వినీత్: ఏమన్నావు? ఈ రోజు ఒక అరగంట ప్రయాణంతో సమీప పట్టణానికి చేరుకోలేని పల్లెలు ఎన్ని ఉన్నాయి? వ్యవసాయ ఆధారంగానే జీవించాల్సి ఉంటుందన్నావు. అంతకన్నా మించిన వృత్తి ఏదైనా ఉందా? అన్నదాతగా ఉండడానికి ప్రతి వ్యక్తీ ఇష్టపడాలి. ప్రతి రైతూ తాను దేశానికి ఆరోగ్య భద్రతను కల్పించడంలో విశిష్ట పాత్రను పోషిస్తున్నానని గర్వపడాలి. మనం నిజానికి 'రైతుగానే జీవించు, రైతునని గర్వించు' అనే నినాదంతో ఉద్యమాన్ని లేవదీయాలి. ప్రతి రైతూ తన సంతానం వ్యవసాయం చేయకూడదని కోరుకోకూడదు. భారతదేశం లాంటి దేశంలో కనీసం యాభైశాతం జనాభా వ్యవసాయ ఆధారంగా జీవించి వ్యవసాయ ఉత్పత్తులను అందించనట్లైతే పట్టణాలలో నివసించే వారి జీవితం దుర్భరం అవుతుంది. పల్లెలు ఆహార ఉత్పత్తులను పట్టణాలకు సరఫరా చేయాలి. వారికి కావలసిన విద్య వైద్య సేవలకు, ఇతర వస్తువులకు పట్టణాలపైన ఆధారపడాలి. పట్టణ మోహం ఎంత తగ్గితే దేశానికి అంత మంచిది.

వికాస్: ఈ వ్యామోహానికి ఇంకొక కారణం మన ప్రస్తుత పల్లెలు ఇంతకు ముందు పల్లెల లాగా లేవు. వర్గ కక్షలు, కుల తత్త్వం, రాజకీయాలు, ఇతరులు కాస్త పైకి వస్తే చూసి ఓర్వలేనితనం, ఎంతసేపూ ఇతరుల గురించి చెడుగా మాట్లాడుకోవడం లాంటి బలహీనతలకు మనుషులు లోనవు తున్నారు. పట్టణాలలోని వారికి ఇతరుల గురించి ఆలోచించే సమయం ఉండదు. గ్రామాలలోని కుళ్ళు, కుతంత్రాలు మొదలైనవాటికి దూరంగా ఉండవచ్చు అని కూడా కొద్దిశాతం మంది పట్టణాలకు తరలి వస్తున్నారు.

వినీత్: పట్టణ జీవితం పూర్తిగా కాగితపు నోటుపైనే ఆధారపడిన జీవితం. నిరంతర శ్రమతో కూడుకుంది. పోటీ వాతావరణం సదా అభద్రతా భావాన్ని కలగజేస్తూ ఉంటుంది. లేచిన దగ్గర నుంచి పరుగులు పెడుతూనే ఉండాలి. తన గురించి తాను ఆలోచించుకోవడానికి సమయం ఉండదు. ఐనా ఇన్ని బాధలను తట్టుకొని పట్టణాలలో ఉండడానికే ఇష్టపడుతున్నారు కానీ గ్రామ జీవితానికి ఇష్టపడడం లేదు.

కారణం నీవన్నట్టు గ్రామాలు ఇదివరకటి గ్రామాల్లాగా లేవు. పల్లెలలోని ప్రజలు సదా స్వచ్ఛమైన గాలి పీలుస్తూ, సూర్యోదయాన్నీ, సూర్యాస్తమయాన్నీ, పున్నమి వెలుగునీ, అమావాస్య చీకటినీ, పక్షుల కిలకిలారావాలనూ - ఇలా ఎన్నో విషయాలను ఎరుకతో ఆనందించవచ్చు. ప్రకృతిలో భగవంతుని ఉనికిని చూస్తూ జీవితాన్ని ఆనందడోలికలలో మునిగేటట్లు చేసుకోవచ్చు. కానీ నిరంతరం దృష్టి అంతా పట్టణాల వైపు ఉండడంతో వీరు ఈ సౌభాగ్యాన్ని అనుభవించలేకపోతున్నారు.

వికాస్: అవును. రోజూ చూస్తుంటారు కాబట్టి వారికి వీటిలో ఏమీ ఆనందం కనబడదు. పట్టణవాసులకు ఇలా ప్రకృతి సౌందర్యాన్ని చూసే అవకాశం, సమయం కూడా ఉండదు. ఇక నీవు చెప్పిన భావకాలుష్యం ఇప్పుడు పట్టణాలలో కన్నా పల్లెలలోనే ఎక్కువగా ఉంది. ఆధ్యాత్మికత లోపించడమే దీనికి కారణం. ఖాళీ

సమయాన్ని పనికిరాని విషయాలను మాట్లాడుకోవడంలో వృథా చేసుకునే బదులు ధార్మిక గ్రంథాలు చదువుతూ, ఆధ్యాత్మిక వికాసానికి రాచబాట వేసుకోవచ్చు. ప్రతి ఊరిలో ఒక గుడి ఉంటుంది. అక్కడ రోజూ కొద్దిసేపు భగవంతుడి నామస్మరణ చేస్తూ మనస్సులను పవిత్ర మొనర్చుకోవచ్చు.

ఇక పట్టణాలలో, పల్లెలలో ఉపాధి విషయానికి వస్తే సేవారంగం, నిర్మాణ రంగం, వ్యవసాయం.. అన్ని నౌకరీలు ఈ మూడింటిలో చేరిపోతాయి. సేవారంగం (services) 30 శాతం, వస్తు ఉత్పత్తి రంగం (manufacturing) 20 శాతం, వ్యవసాయం (agriculture) 50 శాతం జనులకు ఉపాధిని కల్పించాలి. అప్పుడు అదొక ఆరోగ్యకరమైన సమతుల్య నిష్పత్తి అవుతుందని అనుకుంటున్నాను.

అలానే గ్రామ-పట్టణ జనాభా నిష్పత్తిలో సమతూకం అవసరమవుతుంది. అందరూ పట్టణాలలో ఉండడం కాదు. అందరూ గ్రామాలలో ఉండవలసిన అవసరం లేదు. పాశ్చాత్య విధానాలను అనుసరిస్తూ, అనుకరిస్తూ అక్కడి లాగానే వ్యవసాయాన్ని పూర్తిగా యంత్రాధారితం చేసి అధికశాతం జనులను సేవారంగంలోకి, నిర్మాణ రంగంలోకి మళ్ళించడం వలన కొత్త సమస్యలు వస్తాయి. పట్టణాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగితే జీవితం పెనుభారం అవుతుంది. అలానే ఆ దేశాలలోని వ్యవసాయంలో లాగా అధిక దిగుబడుల కోసం పూర్తిగా కృత్రిమ పద్ధతులను అనుసరిస్తూ పోతూ రసాయనిక ఎరువులను వాడితే, భూసారం రానురానూ తగ్గిపోతూ పొలాలు వ్యవసాయానికి పనికిరాకుండా పోయే ప్రమాదం ఉంది. నేల ప్రకృతి మనిషికి ప్రసాదించిన అద్భుతమయిన వనరు. దానిని పరిరక్షించుకోవాలి. అందుకు సేంద్రియ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి.

పట్టణ వాసమా ?



అమెరికా లాంటి దేశాలలో సేద్యంలో ఉన్న భూమి విస్తీర్ణం చాలా ఎక్కువ కాబట్టి ఆ దేశాలలో ఇలాంటి సమస్యలు అంత తొందరగా ఉత్పన్నమవక పోవచ్చు. వారి ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుదల శాతం మనతో సమానంగా ఉండవలసిన అవసరం లేదు. అక్కడ జనాభా పెరుగుదల శాతం మనంత ఎక్కువగా లేదు. చిత్రమైన విషయమేమంటే పవిత్రతను పరిరక్షించుకోవడానికి మనమేర్పరచుకున్న స్థిర వివాహ వ్యవస్థ కూడా భారతదేశంలో జనాభా పెరుగుదలను వేగవంతం చేస్తోంది. అందుకని మనకు ఆహార ధాన్యాల ఉత్పత్తి ప్రతి సంవత్సరం పెరుగుతున్న జనాభాతో సమానంగా పెరగాలి. కాబట్టి మనం పాశ్చాత్య విధానాలను అనుకరించ కూడదు. అక్కడి లాగానే వారి స్థాయిలో జనులను సేవారంగంలోకి మళ్ళిస్తే కృత్రిమమైన పోటీ నెలకొని విలువలు క్షీణిస్తాయి. పట్టణాలలో ఇప్పటికే ఎంతమంది ఉద్యోగాల కోసం అన్వేషిస్తున్నారో చూస్తున్నావుగా! ఎంతోమంది వ్యాపారస్థులు వ్యాపారం లేక పెట్టుబడిని నష్టపోతున్నారు! ఒకరు కొత్తగా వ్యాపారాన్ని పెట్టుకొని కొంచెం లాభం పొందిన వెంటనే పదిమంది అందులో ప్రవేశించి వారి లాభాలను హరిస్తున్నారు. కానీ మన దేశం లాంటి అధిక జనాభా గల దేశంలో దేనికి డిమాండ్ ఉన్నా లేకపోయినా వ్యవసాయ ఉత్పత్తులకు సదా డిమాండ్ ఉంటుంది. మార్కెట్ పోకడలను గమనిస్తూ సరైన సమయంలో సరైన ఉత్పత్తిని మార్కెట్‌లోకి తీసుకు రాగలిగితే వ్యవసాయం ఎప్పుడూ లాభసాటిగా ఉంటుంది. నైతికంగా పతనమవకుండా, ఎవరినీ ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ దోచుకోకుండా గౌతమ బుద్ధుడు బోధించిన ఆదర్శ జీవిక (Right livelihood) ఒక్క రైతుకే సాధ్యమవుతుంది. ఐనా ఈ రోజు వ్యవసాయం జీవనోపాధి అంటే మనకు ఎంత చులకనో కదా!


వినీత్: అవును. పట్టణాలలోని ఉద్యోగాలలో, వ్యాపారంలో కృత్రిమమైన పోటీని తగ్గించాలంటే పల్లెలలోనే చిన్నతరహా వ్యవసాయాధారిత పరిశ్రమలను నెలకొల్పి వలసలను తగ్గించాలి. ఇక నగరాలలోని ఆగర్భ శ్రీమంతులు విందులు, చిందుల ద్వారా విపరీత ఆనందాలను వెతుక్కోవడంలో మునిగి ఉన్నారు. శరీరాన్ని హింసపెట్టడమే వినోదమైపోయింది. భగవంతుడు అందించిన మానవ శరీరమనే మహోపకరణాన్ని దుర్వినియోగం చేస్తూ అనాగరకతకు నాగరకత అని పేరు పెట్టుకుంటున్నారు. అధిక సంపదే వారి పాలిట శాపం అవుతోంది. తోటిమనిషి సేవలోనే అద్భుతమైన ఆనందం, వినోదం లభిస్తాయని ఈ వర్గంలోని చాలామందికి అర్థం కావడం లేదు. పట్టణాలలో ఉన్నవారు నాగరక జీవితం గడుపుతున్నారని పల్లెలలోని వారు అనుకుంటున్నారు. అదొక ఉన్నత స్థాయి జీవితం అని వారి భావన. తాము కూడా అలా నాగరకులుగా ఉండాలని వారి కోరిక.

కానీ స్వామి వివేకానంద ఇలా అంటారు: "True civilization does not mean congregating in cities and living a foolish life but going Godward controlling the senses and thus becoming the ruler of this house of the Self – నాగరకత అంటే పట్టణాలలో గుమిగూడి మూర్ఖపు జీవితం గడపడం కాదు. ఇంద్రియ నిగ్రహం ద్వారా మనస్సును భగవంతుడి వైపు మళ్ళించి ఆత్మసామ్రాజ్యపు సింహాసనాన్ని అధిష్ఠించడం".

ఈ విధమైన జీవనానికి పల్లెలలోని వారికే అవకాశం ఎక్కువ. తమదే ఉన్నతమైన జీవనమన్న ఆత్మవిశ్వాసం గ్రామీణ ప్రజలకు కలగాలి. పట్టణాల ఉనికి తమ మీదనే ఆధారపడి ఉందని తెలుసుకోవాలి.

వికాస్: అవును వినీత్. గ్రామజీవనం పట్టణ జీవనానికి ఏ మాత్రమూ తీసిపోదనీ, నిజానికి గ్రామాలే దేశప్రగతికి పట్టుగొమ్మలనీ పల్లెవాసులు గ్రహించి ఆత్మగౌరవంతో జీవించాలని ఆశిద్దాం. వచ్చే నెలలో మళ్ళీ కలుద్దాం. అప్పటి దాకా మరి సెలవు. ❖

నాగరకత అంటే పట్టణాలలో గుమిగూడి మూర్ఖపు జీవితం గడపడం కాదు. ఇంద్రియనిగ్రహం ద్వారా మనస్సును భగవంతుడి వైపు మళ్ళించి, ఆత్మసామ్రాజ్యపు సింహాసనాన్ని అధిష్ఠించడం. -స్వామి వివేకానంద



స్వామీజీ సందేశ స్ఫూర్తితో...

– స్వామి రఘునాయకానంద

స్వామి వివేకానంద మధురవాణీ మంజుల నాదాలు అసంఖ్యాక యువతరం హృదయాలను మీటుతున్నాయి. తమ వ్యక్తిత్వానికి రూపురేఖలు దిద్దుకోవాలని భావించే యువతకు వివేకానందుని చరిత్ర అవశ్య పఠనీయం. వివేకానందుని బోధామృతం అనుసరణీయం. అందువల్ల భారత ప్రభుత్వం యువతరానికి స్వామీజీ సాహిత్యాన్ని పరిచయం చేస్తూ ఇలా తెలియజెప్పింది: "It was felt that the philosophy of Swami Vivekananda and the ideals for which he lived and worked could be a great source of inspiration for the Indian Youth." "స్వామి వివేకానంద సందేశం, వారు ఏ ఆదర్శాలకు జీవితాన్ని అంకితం చేసారో, ఆ ఆదర్శాలు ఈనాటి భారతీయ యువతకు తప్పక ప్రేరణ కలిగిస్తాయి."

భారతదేశానికున్న యువశక్తి ప్రపంచంలో మరే దేశానికీ లేదు. ఈ యువతే భారతదేశాన్ని అగ్రదేశాల సరసన నిలుపుతుందని ఒక వర్గం వారు అంచనా వేస్తున్నారు. కాగా, మరొక వర్గం యువతలో రోజు రోజుకూ పెరుగుతున్న నేరప్రవృత్తిని అంచనా వేస్తూ, ఏ యువతను అయితే దేశ సంపద అని భావిస్తున్నామో వారే దేశ ద్రోహులు కాగలరని జోస్యం చెబుతోంది.

ఈ పరిస్థితుల్లో యువతరానికి స్వామి వివేకానంద సాహిత్యాన్ని పరిచయం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. స్వామి వివేకానంద సందేశ స్ఫూర్తితో ఆనాడు ఎందరో మహోన్నతులుగా ఎదిగారు. ఈనాడు కూడా స్వామి వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకొని తమ జీవితాలను అత్యున్నతంగా మలుచుకుంటున్నారు. యువతను స్ఫూర్తిమంతుల్ని చేయడానికి అలాంటి వారిలో కొంత మందిని ఇక్కడ పరిచయం చేస్తున్నాం.

మనకు కావల్సినవి మూడు - ప్రేమించే హృదయం, స్పందించే మనస్సు, పని చేసే చేతులు - **స్వామి వివేకానంద**



స్వామి వివేకానంద సందేశాన్ని ఆద్యంతం ఆచరణలో కనబరిచారు కేంద్ర నేర దర్యాప్తు సంస్థ (సి.బి.ఐ) మాజీ నిర్దేశకుడు కార్తికేయన్. 'సమకాలీన సమాజంలో శాంతి భద్రతలకు, సహజీవనానికి, సర్వసమస్యలకు పరిష్కారం కేవలం వివేకానందుని అడుగుజాడలలో నడవడమే' అని అంటారాయన.

ఈనాటి యువత పోకడలను గమనించిన ఆయన 'సాటి మనిషి పట్ల ప్రేమ, కుటుంబాలలో శాంతి సామరస్యాలు, దేశ ప్రగతి – వీటిని సాధించాలంటే పాఠశాల విద్య నుంచి చిన్నారులకు స్వామి వివేకానందుని భావాలను అందించాలి. ఈ విధంగా చేయకుంటే రానున్న రోజులు మరింత సంక్లిష్టంగా మారనున్నాయ'ని అంటారు **కార్తికేయన్.**

స్వీయ లక్ష్యాన్ని సాధించే వరకూ ప్రయత్నించడమే పురోగతికి కచ్చితమైన మార్గం. - **స్వామి వివేకానంద**



ఏదైనా రంగంలో రాణించాలంటే సంకల్పం తోడవ్వాలి. కష్టపడి పనిచేయాలంటూ దృఢసంకల్పులం కావాలి. వ్యాపార రంగాన్ని స్వామి వివేకానంద భావాలతో నడిపి, ఉన్నత లక్ష్యాలను చేరుకున్న పోలీహైడ్రాన్ సంస్థాపకులు ఎస్.బి.హుండ్రే. 'స్వామీజీ ఆశయాలను అన్నింటినీ ఆచరించలేకపోవచ్చు. కానీ వారి భావాలలో కొన్నిటిని అవగతం చేసుకొన్నాను. వాటికి బద్ధుడనై, న్యాయంగా నా వ్యాపారాన్ని విస్తరించి విజయం సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహించాను. మా సంస్థలో ప్రతీ ఒక్కరికీ స్వామి వివేకానంద భావాలను పరిచయం చేస్తున్నాను' అంటారు **హుండ్రే.**

మాటలను ప్రోగు చేసేది విద్య కాదు. ప్రజ్ఞను పెంపొందించేదే విద్య. సంకల్ప శక్తిని సరైన రీతిలో, నైపుణ్యంగా ఉపయోగించేలా, వ్యక్తులకు ఇచ్చే శిక్షణే నిజమైన విద్య. - **స్వామి వివేకానంద**



ముంబయి ఐ.ఐ.టి.లో ఇంజనీరింగ్ పూర్తిచేసి, అహ్మదాబాద్ ఐ.ఐ.ఎమ్.లో పి.జి.డి.ఎమ్ పూర్తిచేశారు – **వి.శ్రీనివాస్.** ప్రస్తుత విద్యావిధానాన్ని సమగ్రంగా పరిశీలించి; దానిని స్వామి వివేకానంద భావాలతో జోడించే విధంగా ప్రణాళికను రూపొందించి ఢిల్లీలో 'ఇల్యూమిన్ నాలెడ్జ్ రిసోర్స్' అనే సంస్థను స్థాపించారు. విద్య అంటే ఎలా ఉండాలన్న దానిపై స్వామి వివేకానంద చెప్పిన భావాలను అనుసంధానించి, విశ్వవిద్యాలయాలలో, కార్పొరేట్ సంస్థల్లో విలువలతో కూడిన విద్యను ప్రవేశపెట్టే విధంగా కొత్త తరహాలో పాఠ్యాంశాలు తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలు యువతలో మార్పుకు కారణమవుతున్నాయని గుజరాత్ సాంకేతిక విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ అక్షయ్ అగర్వాల్ వారి అభిప్రాయాన్ని తెలియజేశారు.


మీకు కావలసినన్ని సలహాలిచ్చాను. వాటిలో కొన్నైనా ఇప్పుడు ఆచరణలో పెట్టండి. నా మాటలు వినడం ఉపయోగకరమని లోకానికి తెలియజేయండి. - స్వామి వివేకానంద



శ్రీకాకుళం జిల్లాలో ఓ మారుమూల గ్రామంలో పుట్టి, ఏ విధమైన అధునాతన సౌకర్యాలూ లేకుండా విద్యను అభ్యసించారు. పదో తరగతిలో పలుమార్లు పరాజయాన్ని చవిచూసినప్పటికీ, క్రమంగా కష్టపడి జాయింట్ కమీషనర్ ఆఫ్ ఇన్‌కమ్‌టాక్స్ పదవిని అలంకరించారు – **సత్యనారాయణ రాజు.** 'స్వామి వివేకానంద స్ఫూర్తిని పొందడానికి పెద్ద పెద్ద పుస్తకాలే చదవక్కర్లేదు. స్వామీజీ చిన్న పుస్తకాలను నా జేబులో ఉంచుకొని నిరాశా నిస్పృహలు కలిగినప్పుడల్లా చదువుతూ ఉండేవాణ్ణి. స్వామీజీ సందేశాన్ని ఆచరణలో పెడితే మనలో పెనుమార్పు కలగడం ఖాయం. అదే నా జీవితంలో జరిగింది' అంటారు రాజు.

సమస్త శక్తీ నీలోనే ఉంది. దాన్ని గుర్తించిన మరుక్షణమే నువ్వు ఏదైనా సాధించగలవు. - స్వామి వివేకానంద

పెడదోవలు పడుతున్న ఈనాటి యువతను చూసి పదకొండేళ్ళ శబరి వెంకట్ మనస్సు కలత చెందింది. వారిని ఎలా మార్చాలో ఆలోచిస్తూ, స్వామి వివేకానంద సాహిత్యానికి పరిచితుడయ్యాడు. స్వామీజీ సాహిత్యాన్ని పదిమందికీ పరిచయం చేయాలన్న సంకల్పంతో తనకు తోచిన రీతిలో కొన్ని సూక్తులను కంఠస్థం చేసుకొని అర్థం చేసుకొన్నాడు. వేదికలపై స్వామీజీ గురించి చెబుతూ పలువురి ప్రశంసలను అందుకొంటున్నాడు. అంతేకాదు. డా॥ అబ్దుల్ కలాం, తమిళనాడు ముఖ్యమంత్రి జయలలితల ప్రశంసలు సైతం అందుకున్నాడు. భగవద్గీతలో కొన్ని అధ్యాయాలు వెంకట్‌కి కంఠోపాఠం. 'భగవంతుడు నాకు చూపు లేకుండా చేసినా, ఆత్మవిశ్వాసాన్ని మాత్రం పుష్టిగా ఇచ్చాడు' అంటూ స్వామి వివేకానంద చెప్పిన పై సూక్తిని ఒంట బట్టించుకొన్నాడు. కలెక్టర్ అయి దేశానికి సేవ చేయాలనుకొంటున్నాడు కోయంబత్తూరుకు చెందిన **శబరి వెంకట్.**



ఇతరుల కోసం జీవించేవారు ధన్యాత్ములు. తక్కినవారందరూ జీవన్మృతులే. - స్వామి వివేకానంద

రామచంద్ర శరత్ రైల్వే ఉద్యోగి. రైల్లో, రైల్వేస్టేషన్లలో అనాథలై తిరుగుతున్న చిన్నారులను చూసి అతని హృదయం కలత చెందింది. వారి కోసం ఏదైనా చేయాలన్న తపనతో తన ఉద్యోగానికి స్వస్తి చెప్పి, నెల్లూరు దగ్గర్లో ఉన్న ఒక గ్రామంలో బాలబాలికలకు 'చైల్డ్' అనే ఆశ్రమాన్ని స్థాపించారు. అనాథలైన వారందరికీ వసతి, భోజన సౌకర్యాలు కల్పించి పాఠశాలలో చేర్పించే బాధ్యతను చేపట్టారు. అక్కడ చదివిన విద్యార్థులు చాలా మంది ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. 'స్వామి వివేకానంద సందేశమే నన్ను ఇలా మార్చింది. ఈ చిన్నారుల సేవలో ఇరవై ఏళ్ళుగా తరిస్తున్నాన'ని ఆనందంగా చెప్పారు **రామచంద్ర శరత్.**



నిస్వార్థంగా, అర్థవంతంగా జీవించాలని స్వామి వివేకానంద సందేశం ద్వారా తెలుసుకొన్నాను. అలా జీవించడానికి నేను ప్రయత్నిస్తున్నాను.

– ప్రియంవద, మెడికల్ విద్యార్థిని , హైదరాబాద్

నిరంతరం భయం గుప్పెట్లో ఉంటూ, స్వార్థంతో జీవనం సాగించే నన్ను స్వామీజీ ధీరవాక్కులు నిర్భయుడిగా మార్చి, నిస్వార్థంగా పని చేయగల ధైర్యాన్ని ఇచ్చాయి. వివేకానందుని పేరు వింటేనే నాలో ఎనలేని ఉత్సాహం, ధైర్యం కలుగుతాయి. స్వామీజీ సందేశంతో దేశానికి ఘనత చేకూరుస్తాను.

– శ్రవణ్ కుమార్, బి.టెక్. (ఎలక్ట్రికల్), కర్నూల్

జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనే బలాన్ని స్వామి వివేకానంద సందేశం నాకు ఇచ్చింది.

– ఫణి చైతన్య, బి.టెక్. (మెకానికల్), హైదరాబాద్

స్వామి వివేకానంద తరచూ యువతను సింహాల్లాగా ఉండండి అంటారు. ఈ సందేశం నాలో ధైర్యాన్ని నింపి, నన్ను సన్మార్గంలో నడిచేలా చేసింది. ధైర్యంతో దేనినైనా సాధించగలనన్న నమ్మకం నాకు కలిగింది. స్వామీజీ సందేశాన్ని పదిమందికీ చేరవేయాలన్నది నా తపన.

– వై. సాయికుమార్, బి.ఎస్‌సి., గుంటూరు

స్వామి వివేకానంద చెప్పిన సేవాదృక్పథం నన్ను బాగా ఆకర్షించింది. తోటివారిని సేవించడంలోనే మన ఉన్నతి ఆధారపడి ఉందని అవగతమైంది. స్వామీజీ స్ఫూర్తితో ప్రపంచమంతా వసుధైక కుటుంబం అన్న భావన స్ఫురించింది.

– వేణు, లెక్చరర్, మెదక్

నా ఈ శరీరాన్ని ఓ జీర్ణమైన వస్త్రంలా త్యజింతునుగాక! కానీ విశ్వమానవాళి అంతా తాము భగవత్స్వరూపులమే అని గ్రహించేవరకు వారిని మేల్కొలుపుతూనే ఉంటాను. -స్వామి వివేకానంద



వైకల్యమూ వరమే!

– బి. సైదులు

'భారతరత్న' అబ్దుల్ కలామ్ రాష్ట్రపతిగా ఉన్నరోజుల్లో ఢిల్లీలో వికలాంగుల క్రీడోత్సవాలు జరిగాయి. ఆ పోటీల్లో పాల్గొన్న చిన్నారులను కలామ్ ఓ రోజు రాష్ట్రపతి భవనానికి ఆహ్వానించారు. దేశవిదేశాల నుంచి వచ్చిన ఆ బాలబాలికలు తమ వైకల్యాన్ని కాసేపు మరచిపోయేలా, ఆయన స్ఫూర్తిమంతమైన కథలు, కవితలు చెబుతూ ఉల్లాసంగా గడిపారు. దేశాధ్యక్షుడు అలా తమతో సరదాగా కలసిపోతూ ఉంటే, ఆ పిల్లలు ఉప్పొంగిపోయారు. ఇంతలో చిన్నారుల సమూహం నుంచి ఇరాన్‌కు చెందిన ముస్తఫా అనే చిన్నకుర్రాడు అబ్దుల్‌కలామ్ దగ్గరకు వచ్చాడు. అతడికి కాళ్ళు లేవు; కృత్రిమకాళ్ళు అమర్చారు. అయినా వడివడిగా నడుచుకుంటూ వచ్చి, మెల్లిగా తన జేబులోంచి ఓ కాగితం ముక్కను తీసి కలామ్ చేతిలో పెట్టాడు. అది ఆ కుర్రాడు పారశీక భాషలో రాసిన 'సాహసం' అనే కవిత. అందులో ముస్తఫా...

'నాకు కాళ్ళు లేవు, కానీ నా మనస్సు చెబుతోంది అందుకు కన్నీళ్ళతో కలత పడవలదని; కారణం నేనిప్పుడొక చక్రవర్తి ముందు కూడా మోకరిల్లనక్కర లేదు...' అంటూ సాగిన ఆ బాలుడి ఆశావహ భావధారకు అబ్దుల్‌కలామ్ కదిలి పోయి, ఆత్మీయంగా అక్కున చేర్చుకున్నారు. అనంతరం ఆ అబ్బాయి ఆత్మవిశ్వాసానికి సంబంధించిన అనుభూతిని ఆయన ఎందరి ముందో ప్రస్తుతించారు. వైకల్యాన్ని కూడా వరంగా భావించిన ముస్తఫా వంటివారు కరచరణహీనులకే కాదు, కాళ్ళూ చేతులు సక్రమంగా ఉండీ నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయే ఎందరికో ఆదర్శం. నిజానికి మానసిక దౌర్బల్యం, ఆత్మవిశ్వాస రాహిత్యం, హృదయకాఠిన్యం, ప్రయత్నలోపం, అమానుష మనస్తత్వాలతో పోలిస్తే శారీరక వైకల్యం పెనుశాపమేమీ కాదు. శారీరకంగా ఎన్నో వైకల్యాలతో బాధపడుతూ కూడా ఏమాత్రం ఆత్మన్యూనతతో కుంగిపోకుండా జీవితాన్ని పండించుకుంటున్న వారు మాన్యులు. నిజానికి జీవితంపై మనకు సరైన దృక్పథం లేకపోవడమే పెద్ద వైకల్యం. అందుకే ఆంగ్లమేధావి స్కాట్ హామిల్టన్ 'The only disability in life is a bad attitude' అంటారు.

ఆ లోపాలు లోకానికి కనిపించేవే...: కళ్ళు కనిపించక పోవడం, కాళ్ళు పనిచేయకపోవడం వంటివి లోకం దృష్టిలో శారీరక లోపాలే కావచ్చు. కానీ భౌతికపరమైన ఈ లోటును భగవంతుడు వారికి మరో రూపంలో అనూహ్యమైన ప్రజ్ఞాపాటవాలను ప్రసాదించి భర్తీ చేస్తాడు. అందుకే చాలా మంది వికలాంగులలో అమేయమైన ప్రతిభాపాటవాలు ప్రస్ఫుటమవుతూ ఉంటాయి; వారి సాహసకృత్యాలు ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతూ ఉంటాయి. మిల్టన్ అంధుడవడం వల్లనే అంతమంచి కవిత్వం రాయగలిగి ఉండవచ్చు; వినికిడి లోపం ఉండడం వల్లనే బీథోవెన్ సుమధురమైన సంగీతాన్ని స్వరపరచి ఉండవచ్చు; మేధస్సు తప్ప దేహమంతా అచేతనంగా మారిపోవడం వల్లనే స్టీఫెన్ హాకింగ్ విశ్వరహస్యాలను ఆవిష్కరించి ఉండవచ్చు. అందుకే భగవాన్ రమణమహర్షి అంధుల ప్రత్యేకతను ప్రస్తావిస్తూ 'కళ్ళు లేని వాళ్ళకు మనస్సే కన్ను; ఒకే చూపు. ఇన్ని చూపులుండవు. ఆ మనస్సు కుదరాలి గాని, కుదిరితే మన కన్నా వాళ్ళ పనే మెరుగు' అంటారు. భగవంతుడు ఒకరికి అంధత్వాన్ని ప్రసాదించాడంటే, జీవితాంతమూ ధ్యానం చేసుకునే అవకాశాన్ని కల్పించాడని అర్థం చేసుకోవాలి. పాదాలకు పయనించే పటుత్వాన్ని పెట్టలేదంటే, లౌకిక ప్రపంచంలో అలుపు లేకుండా పరుగు తీయాల్సిన అనవసరపు ప్రయాస నుంచి రక్షించాడని అనుకోవాలి.

ప్రారబ్ధం...పట్టుదల : ప్రారబ్ధం కారణంగా ప్రాప్తించిన దేహపరమైన అసౌకర్యాన్ని సవాలుగా తీసుకొని ముందుకు సాగేవారు ఇతరుల కన్నా మానసికంగా ఉన్నతంగా మనగలుగుతారు. అలాంటివారు అంతర్ముఖులుగా సహచరుల మనస్తత్వాలను, మానవసంబంధాలను విపులంగా విశ్లేషించు కోగలరు. వారిలో సహజంగానే పోరాటపటిమ ఎక్కువగా ఉంటుంది. ఆ ప్రజ్ఞ వల్లనే బ్రెయిలీ, హెలెన్ కెల్లర్ వంటి వారు ఆత్మవిశ్వాసంతో తమ అంతఃశక్తిని ఆవిష్కరించుకోగలిగారు.

నాట్యమయూరి సుధాచంద్రన్ వంటివారు, దుర్ఘటనల రూపంలో విధి తమను వైకల్యాలతో వేధించినా, నిలదొక్కుకొని పూర్వవైభవానికి చేరుకున్నారు. అందుకే హెలెన్ కెల్లర్ "I thank God for my handicaps, for, through them, I have found myself, my work, and my soul" అంటారు. ఆ లోపాల వల్లనే కదా నన్ను నేను తెలుసుకోగలిగాను, నా లక్ష్యమేంటో నిర్ణయించుకోగలిగాను; నా ఆత్మను అన్వేషించుకోగలిగానని ఆ భగవంతుడికి ఆమె కృతజ్ఞతలు ప్రకటించుకున్నారు. చిన్నతనం నుంచి సమాజంలో ఎదుర్కొనే అవమానాలు వికలాంగుల్లో సంఘర్షణకు దారితీస్తాయి. ఆ సంఘర్షణ వారిలో ఒక రకమైన కసిని రగిలిస్తుంది. తమను తాము నిరూపించుకోవాలనే తపనను పెంచుతుంది. ఆ లక్షణాలే వారిలో ఎవ్వరిపై ఆధారపడకూడదన్న ఆత్మాభిమానాన్ని జ్వలింపచేసి, స్వతంత్రులుగా ముందుకు నడిపిస్తాయి. ఏ మాత్రం అవకాశం చిక్కినా సమస్యల చిక్కుముళ్ళను విప్పుకొని తమను తాము పరిపూర్ణులుగా తీర్చిదిద్దుకునేలా చేస్తాయి. అన్నీ ఉన్నవాళ్ళు కూడా అందుకోలేని అందలాలను వారు అందిపుచ్చుకోవడానికి ప్రధాన కారణం, తమ ప్రారబ్ధాన్ని వారు పట్టుదలతో తిరగరాసుకోవడమే!

సానుభూతి కాదు సహకారం...: ఎదుటివారు సానుభూతి చూపితే, వైకల్యం ఉన్నవారు చాలా అసౌకర్యానికి గురవుతారు. నిజానికి వారు తోటివారి దైన్యపు దృక్కులను భరించలేరు. మనం వారితో సహజంగానే ఉండి, సహకారంతో మసలుకుంటే అదే మనం వాళ్ళకు చేసే పెద్ద సాయం. కానీ చాలామందిలో అంధులతో, బధిరులతో, వికలాంగులతో ప్రవర్తించే కనీస సభ్యత, సంస్కారాలు కూడా కొరవడుతున్నాయి. ఉదాహరణకు చూపులేని వారితో రంగుల గురించి మాట్లాడకూడదు; వారు నిరుత్సాహ పడతారు. వాళ్ళు వాసనలు, ధ్వనులు తేలిగ్గా అర్థం చేసుకోగలరు. ప్రపంచాన్ని వాటి ద్వారానే వర్ణించి చెప్పాలి. అందుకే "కాలులేని వ్యక్తిని అతడు ఎందుకలా అయ్యాడని అడగాలనుకుంటే, 'నీవు ఎలా కుంటివాడవయ్యావు?' అని కటువుగా అడగకూడదు; నీ కాలు ఎందుకలా అయ్యింది? అని అడగాలి" అంటారు దివ్యజనని శారదామాత. మనోవికారాలతో బతికే మనలో చాలామంది కన్నా శారీరక వికలాంగులు భాగ్యహీనులేమీ కారు. వారిని దురదృష్టవంతులుగా భావించి, మన చేయూత కోసం వారు ఎదురు చూస్తున్నారని, మనం లేకపోతే వారు మనుగడ సాగించలేరని భావించుకోవడం మన అమాయకత్వమే! వాళ్ళ మానస ప్రపంచంలో వాళ్ళు మన కన్నా ఆనందంగానే ఉండగలిగే స్థితిని భగవంతుడు కల్పిస్తాడు.

సాధన లేని సాధనాలు: నిశితంగా పరిశీలిస్తే మనలో చాలామంది అన్నీ ఉండీ, అంగవికలురుగానే జీవిస్తూ ఉన్నారు. కళ్ళుండీ ప్రపంచాన్ని కళగా చూడలేరు; వినగలిగీ నాలుగు మంచి మాటలు వినడానికి ఆసక్తి చూపరు; నోరుండీ పదుగురితో మధురంగా మాట్లాడలేరు; చక్కగా రెండు చేతులుండీ పక్కవారికి సాయపడలేరు. ఇక అవన్నీ ఎంత ఆరోగ్యంగా ఉన్నా ఏం లాభం? విలువైన సాధనాలను వృథాపనులకు వినియోగించినట్లు, అమూల్యమైన కరచరణాదులను నిరుపయోగం చేసేస్తున్నారు. ఉదాహరణకు కవి బసవేశ్వరుడు అన్నట్లు **'పలికిన ముత్యపు సరంబుగ నుండవలె; పలికిన మాణిక్యపు దీప్తిగ నుండవలె; పలికిన స్ఫటికపు పూసలాగ నుండవలె...'.** అలా కానప్పుడు మాటలు రావడం కన్నా మూగతనమే మేలు. అయితే మనలో చాలామందికి అవయవాల విలువ తెలియడం లేదు. మహత్కార్యాలకు నియోగించాల్సిన వాటిని మామూలు పనులకే పరిమితం చేస్తూ, దుర్వినియోగ పరుస్తున్నాం. తత్ఫలితంగా మరుజన్మలో సంబంధిత వైకల్యాన్ని అనుభవించక తప్పదని తెలుసుకోవాలి. భగవంతుడిచ్చిన ఈ అవయవాలను అపురూపంగా భావించుకొని సద్వినియోగపరచుకోవాలి. ప్రహ్లాదుడు చెప్పినట్లు కరములతో కమలాక్షుని అర్చించక పోయినా, జిహ్వతో శ్రీనాథుని వర్ణించకపోయినా, కన్నులతో సురరక్షకుని చూడకపోయినా, వీనులతో విష్ణునాకర్ణించక పోయినా... హస్తాలతో అనుచిత చర్యలకు పాల్పడకుండా, నాలుకతో నలుగురిని నిందించకుండా, చూపులతో ఎదుటి వారిపై ఈర్ష్యాద్వేషాలను రగిలించకుండా, వీనులతో దుర్వచనాలను వినకుండా ఉండగలిగితే చాలు. అలా ప్రవర్తించని నాడు మాటను, నడకను నిలిపివేయమని ఆ పరమాత్ముడిని ప్రార్థిస్తే మేలు! ❖

(డిసెంబర్ 3, అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం)

కనురెప్పే కలంగా...



దేహం అచేతనమై, అననుకూలంగా పరిణమించినా విశ్వరహస్యాల ఆవిష్కరణలో అద్భుతఫలితాలను సాధించారు స్టీఫెన్ హాకింగ్. ఆయనలో నిరంతరం అవయవాల శక్తి సామర్థ్యాలకు, ఆత్మశక్తికి మధ్య పోరాటం కొనసాగుతూనే ఉండేది. ఒకానొక దశలో తన కాళ్ళు, చేతులతో పాటు మాట కూడా పడిపోయింది. ఆ సంక్లిష్ట సమయంలో హాకింగ్ కుడి కనురెప్పనే కలంగా చేసుకొని తన ఆలోచనలకు అక్షరరూపమిచ్చారు. ఒక సహాయకుడిని నియమించుకొని, తన భావాలకు అనుగుణంగా కనురెప్పను మూస్తూ, తెరుస్తూ ముందున్న కంప్యూటర్‌లోని సాంకేతిక అక్షరఫలకంపై పదాలను, వాక్యాలను నిర్మించుకునేవారు. ఆయన కనురెప్ప సంకేతాలను ఆధారంగా చేసుకొని అక్షరరూపం దాల్చిన '*A Brief History of Time*' అనే పుస్తకం ప్రపంచవ్యాప్తంగా ఎన్నో భాషల్లోకి అనువదించబడి, లక్షలాది ప్రతులు అమ్ముడుపోయింది. ❖

మేఘం సూర్యుణ్ణి మరుగునపరిచినప్పుడు అలముకున్న అంధకారం తాత్కాలికమే! అలాగే జీవితంలో ఎదురయ్యే కష్టాలు కూడా తాత్కాలికమే అని తలచిన ధీరులను జయం తప్పక వరిస్తుంది. -స్వామి వివేకానంద



అమ్మ మాట!

– శ్రీమతి సుధామూర్తి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్

మా తరంలో అమ్మాయి అత్తారింట్లో అడుగుపెట్టేటప్పుడు ఆ తల్లితండ్రులు ఎన్నో మంచిమాటలు చెప్పి పంపేవారు. సర్దుకుపోవడం, సామరస్యంగా మసలుకోవడం, అణకువగా ఉండడం ఆడపిల్లకు ఎంత అవసరమో పదేపదే గుర్తు చేసేవారు. ఈ రోజుల్లో అవి చాదస్తంగా అనిపించవచ్చు. కానీ ఆడపిల్ల కొత్త జీవితానికి ఆ సూచనలే విలువైన సూత్రాలుగా సాయపడతాయనడానికి నా జీవితమే తార్కాణం.

మా అమ్మ విమల కూడా అలాంటి మాటలతోనే నన్ను అత్తారింటికి పంపింది. ముఖ్యంగా మా అమ్మ చెప్పిన పొదుపుమంత్రం నా భవిష్యత్ జీవితానికి ఆశాజ్యోతిగా నిలిచింది. పుట్టింటి నుంచి నాకు మా అమ్మ వీడ్కోలు పలుకుతూ, 'అమ్మా సుధా! మన జీవితంలో గడ్డురోజు ఎప్పుడొస్తుందో తెలీదు. అప్పుడు నీ దగ్గర డబ్బు లేకపోవచ్చు. ఆ పరిస్థితిని ఎదుర్కొనేందుకు నీ జీతంలో నుంచి ఎప్పుడూ కొంత డబ్బు పొదుపు చేస్తూ ఉండాలి. నువ్వు సంపాదించకపోతే నీ భర్త సంపాదనలో నుంచి కొంత దాచుకోవాలి. వెయ్యి సంపాదిస్తే యాభయ్యో, వందో తీసి పక్కనపెట్టు. ఈ డబ్బును నగలు, పట్టుచీరలు కొనేందుకు ఖర్చు చేయకూడదు. వయస్సులో ఉన్నవాళ్ళకు డబ్బు ఖర్చు చేయాలనీ, ఏవేవో కొనాలనీ అనిపిస్తుంది. కానీ నీవు సమస్యల్లో ఉన్నప్పుడు నీకవేవీ సాయం చేయవు. అలాంటప్పుడు నీ ధైర్యం, కొత్త పరిస్థితితో సర్దుకుపోగల నీ సామర్థ్యం, నీవు దాచుకున్న డబ్బు– ఇవే నిన్ను ఆదుకునేవి' అని వివరించింది.

ఆమె సలహా విని నవ్వుకున్నాను. నా జీవితంలో అటువంటి గడ్డురోజు రానే రాదని అనుకున్నాను. యుక్తవయస్సులో ఉన్నాను; ఉద్యోగం చేస్తున్నాను. ప్రతిరోజూ ప్రశాంతంగానే ఉంటుందనుకున్నాను. అయినా మా అమ్మ మాటకు విలువనిచ్చి, సంపాదనలో కొంత మిగుల్చుకోవడం అలవాటు చేసుకున్నాను. పెళ్ళైన తరువాత కొంతకాలం ముంబయిలో జీవితం సాఫీగానే సాగిపోయింది.

ఓ రోజు సాయంత్రం నా భర్త మూర్తిగారు ఆఫీసు నుంచి దిగులుగా వచ్చారు. 'అంత దిగులుగా కనిపిస్తున్నారు ఎందుకు?' అని అడిగాను. అప్పుడు వారు 'రాబోయే సంవత్సరాల్లో సాఫ్ట్‌వేర్ అతి పెద్ద వ్యాపారం కాబోతోంది. మనదేశంలో దానికి సరిపోయే ఎంతోమంది మేధావులు ఉన్నారు. వారి తెలివితేటల్ని ఉపయోగించుకోవాలని అనుకుంటున్నాను. ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించాలని అనుకుంటున్నాను' అంటూ వారి వ్యాపార ప్రణాళికను కళ్ళకు కట్టినట్లు వివరించారు.

'కొత్త కొత్త అవకాశాల్ని వినియోగించుకోవాలి. ధైర్యం చేసి ముందుకు నడవాలి. మేధస్సుతో నడిచే ఈ పరిశ్రమకు నీ హృదయపూర్వకమైన సహకారం కావాలి' అన్నారు.

దిగ్భ్రమకు గురయ్యాను. మా ఇద్దరి కుటుంబాల్లో ఎవరికీ వ్యాపార అనుభవం లేదు. మూర్తి గారి కుటుంబం చాలా పెద్దది. అందరికీ ఆయనే ఆధారం. పెళ్ళి కాని చెల్లెళ్ళున్నారు. ఈ పరిస్థితిలో మేము కొత్త కంపెనీ ప్రారంభిస్తే మా ఆర్థిక పరిస్థితి చాలా దెబ్బ తింటుంది. నాకు భయంగా ఉంది. కానీ ఆయనపై విపరీతమైన నమ్మకమూ ఉంది. నేను మనస్ఫూర్తిగా తనతో నిలవకపోతే ఈ సాహసానికి దిగలేరు. నష్టమొచ్చినా, నిలదొక్కుకునే వయస్సు అది. పైగా వారి స్వరంలో నిజాయతీ ఉంది. పట్టుదల ఉంది. ఆయన నిజాయతీని నేనెప్పుడూ గౌరవిస్తాను; అభినందిస్తాను.


మూర్తి గారు తిరిగి కొనసాగిస్తూ 'సుధా! చట్టసమ్మతంగా, నీతిమంతంగా సంపాదించేందుకు మనకున్న ఒకే ఒక్క అవకాశం ఇది. సాఫ్ట్‌వేర్ పరిశ్రమకు భారతదేశం నాయకత్వం వహించాలన్నదే నా కల. దాని ద్వారా మన దేశానికి గౌరవం, ఆదాయం వస్తాయి. నీ సహాయం నాకు కావాలి. ఏమైనా డబ్బివ్వగలవా? నీ సాయం లేకపోతే నా ఆశయం నెరవేరదు' అన్నారు.

అప్పుడు 'డబ్బు పొదుపు చేయి. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే వాడుకో' అన్న మా అమ్మ మాటలు గుర్తొచ్చాయి. ఇది అలాంటి పరిస్థితే. చివరికి ఓ నిర్ణయానికి వచ్చాను. వంటగదిలోకి వెళ్ళాను. కష్టసమయాల కోసం దాచుకున్న పెట్టె తెరిచాను. ప్రతి నెలా నేను జమ చేసిన డబ్బు బయటకు తీసి లెక్కపెట్టాను. పదివేల రూపాయలున్నాయి. ఆ డబ్బు తీసుకొని, కొద్దిసేపు భగవంతుణ్ణి ప్రార్థించి ఆయన చేతిలో పెట్టాను.

'అంతా మంచి జరగాలండీ! నేనివ్వగలిగింది ఇంతే. ఈ కొత్త వ్యాపారానికి సంబంధించి మీరు ఇచ్చే ఏ బాధ్యతనైనా సంతోషంగా స్వీకరిస్తాను' అని మాట ఇచ్చాను.

అలా అమ్మ మాటతో దాచుకున్న ఆ స్వల్పపెట్టుబడితో ఆరంభమైందే – 'ఇన్ఫోసిస్' సాఫ్ట్‌వేర్ సంస్థ. ❖

సేకరణ: జి. సతీష్



అపర శుక'మహర్షి'



– స్వామి రంగనాథానంద
(రామకృష్ణ సంఘ 13వ సర్వాధ్యక్షులు)

తిరువణ్ణామలై వెళ్ళి భగవాన్ రమణ మహర్షిని ప్రత్యక్షంగా దర్శించుకునే అదృష్టం నాకు (స్వామి రంగనాథానంద) రెండు మార్లు కలిగింది. 1936లో మొదటిసారిగా వారి వద్దకు వెళ్ళాను. శ్రీభగవాన్ అసాధారణులు. ప్రపంచంలోని అందరి హృదయాలనూ ఆకర్షించగలిగే మహనీయులు వారు. శ్రీమద్భాగవతం వర్ణించిన పుణ్యాత్ముని లక్షణాలన్నింటినీ పుణికిపుచ్చుకున్నవారు రమణ మహర్షి. వారి శాంతచిత్తం, నిశ్చల సముద్రం లాంటి మనస్సు, కరుణార్ద్రమైన దృక్కులు, సకల జీవరాసులపై వారు కురిపించే దయ మరువలేనివి. వారి సమక్షమే సమస్త దుఃఖాల నుంచి విమోచనం కలిగిస్తుందనడంలో సందేహం లేదు.

భగవాన్ రమణ మహర్షి అమరులు, నిత్యులు. అందువల్లనే వారిది పరమోన్నత స్థానం. అందరి మధ్యన అతి సాధారణమైన వ్యక్తిలా మసలేవారు. అరుణాచలంలో వెలసిన జ్యోతి స్తంభానికి ఆదీ అంతమూ అంచనా వేయడమెంత అసాధ్యమో, మహర్షిని అంచనా వేయడం కూడా అంతే అసాధ్యం. వారెంత ఉన్నతులో, ఎంత గంభీరులో చెప్పలేం!

భగవాన్ రమణమహర్షి సన్నిధిన నిలచిన ప్రతి ఒక్కరికీ తమకూ ఒక విలువ ఉందన్న స్ఫురణ కలుగుతుంది. తాము ధన్యులమయ్యామన్న భావన జనిస్తుంది. వారి స్పర్శానుభూతే వేరు! వారు ఒంటరిగా కూర్చొని ఉన్నా, మౌనముద్రలో ఉన్నా, ప్రూఫులు దిద్దుతున్నా, పత్రిక చదువుతున్నా, కూరగాయలు తరుగుతున్నా – సంతోషభరితులై, ఎప్పుడూ ఆత్మనిష్ఠులై ఉండేవారు. వారు పలికిన ప్రతి పదమూ ఆత్మవిద్యాభరితమే! 'అహం బ్రహ్మాస్మి' అనే మహావాక్యానికి భాష్యం చెబుతున్నట్లుగా కనిపించేవారు. ఆ అనుభవం అందరికీ కలగడం తేలికే అంటారు వారు. 'దాని కోసం ఏ ఆసనాలూ వేయక్కర్లేదు, మన భావన కేంద్రాన్ని మరల్చుకోవాలి. అంతే' అంటారు.

మన పురాణాల్లోని శుకమహర్షికీ, రమణ మహర్షికీ ఎంతో పోలిక ఉంది. ఆత్మానందులై, బాహ్యంగా ఏ బంధమూ లేకుండా ఉండడంలో ఇద్దరూ ఒక్కటే! అవ్యాజమైన ప్రేమమూర్తులు. ఒక్కమాటలో చెప్పాలంటే సనాతనమైన బోధనకు మానవ రూపమే రమణ మహర్షి అంటే అతిశయోక్తి కాదు.

భగవాన్ రమణులను తలచుకొనగానే జగద్గురువులు ఆదిశంకరాచార్యులు 'వివేక చూడామణి'లో బ్రహ్మజ్ఞాని లక్షణాలను వివరిస్తూ చెప్పిన కింది శ్లోకం స్ఫురిస్తుంది.

నిర్ధనోఽపి సదా తుష్టోఽప్యసహాయో మహాబలః ।
నిత్య తృప్తోఽప్య భుంజానోఽప్య సమః సమదర్శనః ॥

'బ్రహ్మజ్ఞాని నిరుపేద అయినా నిత్యసంతోషిగా; అసహాయుడైనా మహాబల శాలిగా; భుజింపకున్ననూ నిత్య తృప్తుడుగా; అసమాన్యుడైనా అందరినీ సమదృష్టితో చూస్తాడు'.

ఈ విశిష్ట గుణాలను పోతపోసుకున్న మహర్షితో ముఖాముఖి కూర్చోవడం, మాట్లాడడం ఓ మధురానుభూతి.

నేను మూడు రోజులు ఉండేందుకు రమణ ఆశ్రమానికి వెళ్ళాను. తీరా వారి దగ్గరకు వెళ్ళాక, మూడో రోజు నేను రైలులో తిరుగు ప్రయాణం చేయాల్సి ఉందన్న విషయమే మరచిపోయాను. అయితే రైలు సమయం దగ్గర పడుతుండగానే, రమణులు నా వైపు చూసి 'నీవు వెళ్ళవలసిన వేళ అయింది. నీ కోసం ఆశ్రమం నుంచి బండిని కూడా ఏర్పాటు చేశాం' అన్నారు. ఎంతటి సహృదయం! మామూలు మనిషిలాగే మాట్లాడారు. కానీ ఎంత ఉత్కృష్టులు!

అదే విధంగా శ్రీకృష్ణుడి గురించి శ్రీమద్భాగవతం దశమస్కంధం చెప్పింది, రమణ మహర్షికి కూడా వర్తిస్తుంది. వారి గురించి వింటున్న కొద్దీ ఇంకా వినాలనిపిస్తుంది. వారిని ప్రత్యక్షంగా చూసినా, పరోక్షంగా జ్ఞాపకం చేసుకున్నా మనకు తెలియకుండానే మన హృదయాల్లో ఆధ్యాత్మికశక్తి ద్విగుణీకృతమవుతుంది. ❖ **సేకరణ: ఆర్. కృష్ణ**

(డిసెంబరు 30న భగవాన్ రమణమహర్షి జయంతి,
డిసెంబరు 15న స్వామి రంగనాథానంద మహరాజ్ జయంతి)

సర్వత్రా వ్యాపించినది ఒకే ఆత్మచైతన్యం. ఆత్మ తప్ప అన్యమైనదేదీ లేదు. అదియే మన నిజస్వరూపమని ఎరిగిన వారికి ఎవరు శత్రువు? ఎవరు సఖుడు? ఏది సత్యం? ఏది అసత్యం? -స్వామి వివేకానంద

(...18వ పేజీ తరువాయి)

అమెరికాలో విశ్వమత మహాసభలలో పాల్గొనడానికి వెళ్ళినప్పుడు స్వామీజీ ఎదుర్కొన్న కష్టాలు, అవమానాలు కోకొల్లలు. ఇతర సన్న్యాసులైతే వెంటనే వెనుదిరిగే వారు. కానీ వివేకానందుడు తన పేరు ప్రతిష్ఠలు, సుఖభోగాల కోసం అమెరికా వెళ్ళలేదు. అసూయాపరులెందరో అవరోధాలు సృష్టించినా, అభాండాలు వేసినా, చివరకు చంపివేయడానికీ వెనుకాడకపోయినా స్వామీజీ చలించలేదు, సంకల్పం సడలనీయలేదు. 'యోగక్షేమం వహామ్యహం' అని భగవద్గీతలో పరమాత్ముడు ఆశ్వాస మిచ్చినట్లుగానే ఆయనే స్వామీజీని రక్షించారు. కోటీశ్వరులు స్వామీజీకి ఆతిథ్యమివ్వడానికి పోటీ పడినా, సుందరీమణులు ఆయనను ఆకర్షించడానికి ప్రయత్నించినా స్వామీజీ తన ఆదర్శం – 'భారతదేశ పునరుత్థానం, భరతమాత గతవైభవ సౌరభం' అని మరువలేదు. ప్రలోభాలకు లొంగలేదు. విశ్వమత మహాసభలో మిగతా మతాచార్యులకు ఏడు వేల మంది సభికులు 'Ladies and Gentlemen – స్త్రీ, పురుషులు'గా మాత్రమే కనిపిస్తే, వివేకానందులకు మాత్రం 'Sisters and Brothers – సోదరీ సోదరులు'గా అగుపించారు. మనం నిజంగా ఒకే భగవంతుని బిడ్డలమైతే మనమంతా 'సోదరీ సోదరులం' కాక ఇంకేమవుతాం?



బారానగర్ మఠంలో సోదర సన్న్యాసులతో స్వామీజీ

శ్రీరామకృష్ణుల మహానిర్యాణానంతరం మిగిలిన సోదర శిష్యులు అటూ ఇటూ వెళ్ళిపోతూ ఉంటే, వారినందరినీ ప్రోత్సహించి ఒక పాడుబడిన అద్దె ఇంట్లో (కలకత్తాలోని బారానగర్ మఠం) ఉంచారు. రాత్రీపగలు వారందరితో జపధ్యాన స్వాధ్యాయాది తీవ్ర సాధనలలో మునిగిపోయారు. ఒంటి నిండా బట్ట, కడుపు నిండా అన్నం, కంటి నిండా నిద్ర లేకపోయినా '16 మంది పిచ్చి బిచ్చగాళ్ళ, భూతాల దండు'గా ఉగ్రతపస్సుతో వారితో కలిసి మహోన్నత త్యాగ, వైరాగ్యమయ జీవితం గడిపారు. మహోన్నత చరిత్రాత్మక రామకృష్ణ సంఘానికి పటిష్ఠమైన పునాదులు వేశారు మన స్వామీజీ! 'ఆనాడు ఆ బారానగర్ మఠంలో మా తీవ్ర తపశ్చర్యలు, సాధనానుష్ఠానాలు చూసి ఉంటే దయ్యాలు కూడా భరించలేక పారిపోయి ఉండేవి!' అని స్వామీజీ తమ స్మృతులను గుర్తుచేసుకునేవారు.

ఆనాడు వారు ఆ మహాత్యాగాలు చేశారు కనుకనే వారి త్యాగ ఫలంగా ఈనాడు రామకృష్ణ మఠం, మిషన్‌లు విశ్వమంతా వ్యాపించి విశ్వమానవ విశ్వాస గౌరవాలు, పండితుల, ప్రభుత్వాల ప్రశంసలు పొందుతున్నాయి! స్వామీజీ ఆనాడు నిస్వార్థంగా అలా మహోన్నత సంకల్పం, ఆశయంతో 'పరుల కోసం, దేశం కోసం, విశ్వం కోసం' పాటుపడక, కేవలం తన కోసం, తన కుటుంబ సభ్యుల కోసమే ఆలోచించి, ఆరాటపడి ఉంటే ఈనాడు ఈ 'రామకృష్ణ మహాసంఘం' విశ్వమంతా విస్తరించి ఉండేదా? కోట్లాది దీన దుఃఖిత తాడిత పీడిత నిరుపేద హృదయాలలో విద్య, వైద్య, సంస్కృతి, సభ్యత, ఆధ్యాత్మిక ఆనందం, శాంతి, ప్రేమ, సర్వమానవ సౌభ్రాతృత్వ పరిమళాలు వెదజల్లి ఉండేదా? 'మహా త్యాగాల వల్లే మహత్కార్యాలు సిద్ధిస్తాయి' అన్న స్వామీజీ మాట అక్షరసత్యం కా(లే)దా?

కలకత్తాలో ప్లేగు మహమ్మారి విలయతాండవం చేస్తుంటే స్వామీజీ తన శిష్య బృందంతో స్వయంగా నడుం బిగించి వేలాది రోగులకు నారాయణ భావంతో సేవ చేశారు. వీధులు ఊడ్చారు. రోగుల ఇళ్ళు శుభ్రం చేశారు. వారి మందులకూ, సపర్యలకూ తగిన విరాళాలు సకాలంలో అందక పోయేసరికి, "మనం సన్న్యాసులం, చెట్లకింద, అడవిలోనే ఉండగలం! పేదల కోసం ఈ మఠస్థలం, భవనాలు అమ్మి ఆ ధనంతో రోగులకు సేవ చేద్దాం" అంటూ అతి కష్టంతో స్థాపించిన బేలూరు మఠాన్ని సైతం అమ్మడానికే సిద్ధపడ్డారు! అమ్మ 'శారదాదేవి' అనుగ్రహంతో ఆ మఠం నిలిచింది, నిధులూ వచ్చాయి!

అహర్నిశలూ అష్టకష్టాలు పడి 'రామకృష్ణ మఠం' స్థాపించి, శాఖోపశాఖలతో విశ్వమంతా వ్యాపింపజేసి, మానవాళికి మహామేలు చేసి, ఆ విశ్వస్థాయి సంస్థకు స్వామీజీ అధ్యక్షులు కానీ, ఉపాధ్యక్షులు కానీ, కార్యదర్శి కానీ కాలేదు. కనీసం ట్రస్టీ (ధర్మకర్త) పదవి కూడా ఆశించలేదు! తన సోదర శిష్యులకే పదవులన్నీ పట్టం కట్టారు! తాను ఓ సంపూర్ణ సన్న్యాసి, ఆదర్శత్యాగి, శ్రేష్ఠయోగి, దివ్యశిశువుగానే అమ్మ శ్రీకాళికాదేవి ఒడిలోకి వెళ్ళిపోయారు.

ఈ రోజుల్లో ఒక బడికో, గుడికో ఒక్క ట్యూబ్‌లైట్ దానం చేసి ఆ ట్యూబ్‌లైట్ నిండా తమ పేర్లు పెద్ద అక్షరాలతో రాయించుకొని, ఆ ట్యూబ్‌లైట్ వెలుగులో తమ పేరు చూసుకుని మురిసిపోయే అపర దానకర్ణులు 'బతికి ఉన్నా చచ్చినట్లే!'

ఎందరినో అమృతతుల్యుల్ని చేసిన స్వామీజీ 'సంజీవనీ మంత్రాలు' మనలో కూడా నవజీవం పోయుగాక! ఈ అవనిలో అమరులుగా జీవింతుముగాక! ❖



(1884 – 1967)

ముందుకు సాగిపో!

దివ్యజనని శ్రీశారదాదేవి ప్రత్యక్ష శిష్యులైన స్వామి ప్రేమేశానంద (1884-1967) రామకృష్ణ సంఘంలో అత్యున్నత గౌరవాన్నీ, ప్రేమాభిమానాలనూ చూరగొన్న అగ్రశ్రేణి సన్యాసి. ఆయన జీవితం శ్రీరామకృష్ణ - వివేకానందుల ఆశయాలతోనూ, భగవద్గీత సారాంశంతోనూ నిండింది. చాలామంది యువతీ యువకులకూ, గృహస్థులకూ, బ్రహ్మచారులకూ, సన్యాసులకూ ఆయన ఎన్నో లేఖలు వ్రాశారు. జీవితంలో అంకితభావం, ఆధ్యాత్మిక, సేవా భావాలను అలవరచుకొనేందుకు ఆ లేఖా పరంపరలు మార్గదర్శకాలయ్యాయి. పాఠకుల ప్రయోజనార్థం విలువైన ఈ లేఖలను 'శ్రీరామకృష్ణ ప్రభ'లో 2009 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం.

సార్‌గాచీ, మాహులా
14-7-1937

ప్రియమైన నరేశ్!*

'ఆత్మోన్నతి' అంటే సర్వదా, సర్వోత్కృష్టమైన సంతోషంతో ఉండడమేనని నా ఉద్దేశం. జీవితంలో ఔన్నత్యం అన్నది ఆత్మ యొక్క క్రమ పరిణామం ద్వారా సహజసిద్ధంగా వస్తుంది.

ఒక వ్యక్తి ఒక పని చేస్తున్నాడనుకో, దాని వల్ల అతడు పొందే సుఖం కన్నా బాధ ఎక్కువైనప్పటికీ అతడు దాన్నే పట్టుకొని వ్రేలాడుతుంటాడు. దాని వల్ల ఎంత బాధ, ఒత్తిడి కలిగినా ఆ పని మానడు. అది మూర్ఖత్వం. జనానికి ఒక అంశంలో ఎలా ప్రవేశించాలో తెలుసు తప్ప, ఎలా దాని నుండి నిష్క్రమించాలో తెలియదు. ధనం సంపాదించడం తెలిసిన వారికి దాన్ని ఎలా ఖర్చు పెట్టాలో తెలియదు. అలాగే ప్రేమించేవారికి ఎలా మర్చిపోవాలో తెలియదు. అసూయతో దహించుకుపోయే వారికి అందరినీ తన వారుగా చేసుకోవడం తెలియదు. మత సాధన అంటే ఇవన్నీ సాధించగలగడమే. అంతేగాని మతం ఒక మత్తు మందు లాంటిది కాదు.

'ప్రేమకు పరాకాష్ఠ స్వేచ్ఛే! మనం శరీరాలం మాత్రమే అనే భావం నుండి, సంకుచితత్వపు హద్దుల నుండి విముక్తులను చెయ్యగల ఏకైక ఔషధం ప్రేమ మాత్రమే సుమా! నిజమైన ఆధ్యాత్మికత, ప్రేమ ద్వారానే ఆవిష్కృతమవుతుంది. 'ఐక్యత' దీన్నే 'యోగం' అంటారు. భగవంతుణ్ణి సాక్షాత్కరించుకొనే ఏకైక మార్గం ఇది మాత్రమే.

మనం ప్రేమించే వానికి ఏ లక్షణాలున్నా అతడు మనకు ప్రియమైన వాడే! కానీ మనిషి తన మనస్సును గమనించకుండా తాను చేసేదంతా మంచే అని తలపోస్తాడు. తాను ప్రేమించే వారిని మంచివారుగానే భావిస్తూ తన ప్రేమను కొనసాగిస్తాడు.

ఈ ప్రపంచంలో అన్ని కర్మలూ చెడుతో కప్పివేయబడే ఉంటాయి. 'సర్వారంభా హి దోషేణ ధూమేనాగ్నిరివా వృతాః' *(భగవద్గీత 18-48)* – అగ్ని పొగచేత కప్పబడినట్లు కర్మలన్నీ దోషంతో కూడి ఉంటాయి. ప్రతి మంచిలోనూ చెడు, ప్రతి చెడులోనూ మంచి ఇమిడి ఉంటాయి. 'సాధుష్వపి చ పాపేషు సమబుద్ధిర్విశిష్యతే' *(భగవద్గీత 6-9)* – సాధువుల, పాపుల పట్ల సమదృష్టి గలవాడే విశిష్టుడు.

మనం పొందే రవ్వంత సుఖం దుఃఖంతో మిళితమై ఉంటుంది. అది ఆ కాస్త సుఖాన్ని కూడా దుఃఖమయం చేస్తుంది. ఉదాహరణకు రుచికరమైన ఆహారంలో రవ్వంత ఇసుక కలిసిందనుకో అది నలభీమపాకమైనా నాశనమైనట్లే. దాని రుచి, కమ్మని వాసన అన్నీ వృథాయే కదా! మన శాస్త్రాలు జీవితం ఎంతో కష్టభూయిష్ఠమని చెబుతున్నా, నేటి యువతరం దానిని నిరాశావాదం అంటోంది.

సంతృప్తి అన్నది యోగి లక్షణం. ఒక వ్యక్తి అన్ని బాధల నుండీ విముక్తుడై తన సచ్చిదానంద స్వరూపాన్ని తెలుసుకోగలిగితే అతడు సంతృప్తి చెందినట్లు భావించాలి. ఆ విధమైన అవగాహన పొందకుండా తాను సంతృప్తుడనని చెబితే అతడు తమోప్రవృత్తితో కూడిన పశువు అని అర్థం చేసుకోవాలి.

ప్రేమాశీస్సులతో
స్వామి ప్రేమేశానంద

తెలుగుసేత: *కె. త్రివిక్రమరావు*

(*నరేశ్ చంద్రపాల్ ఉపాధ్యాయుడు. విద్యార్థి దశ నుండీ స్వామి ప్రేమేశానందకు పరిచితుడు.)

కళ్ళకు మన చేతులను అడ్డుగా పెట్టుకొని అంతటా చీకటే అని విలపిస్తున్నాం. అలాగే మన మనస్సుకు దుర్బలతను ఆపాదించుకొని బలహీనులమనీ, అపవిత్రులమనీ విలపిస్తున్నాం. -స్వామి వివేకానంద

(…13వ పేజీ తరువాయి)

వెదకి తలచుకొంటే విష్ణుడు గానవచ్చు
చెదరి మరచితే సృష్టి చీకటౌ
పొదలి నడచితేను భూమెల్లా మెట్టిరావచ్చు
నిదిరించితే కాలము నిమిషమై తోచు..నని ఈ తాళ్ళపాక వంశభూషణుడు వివరిస్తూ ఉన్నాడు. 'పొదలి' అంటే స్థిరంగానని అర్థం. ఈ స్థిరత్వం కొరవడటం వలననే మనిషి పరమలక్ష్యానికి చేరువ కాలేకపోతున్నాడు. నిరంతరం ఏదో భయం, బలహీనత, ప్రలోభం, ప్రమత్తత మనల్ని అధోగతి పాల్జేస్తూ ఉన్నాయి. మానసికంగా పరాధీనులుగా మార్చేస్తూ ఉన్నాయి. ఈ తమోగుణ లక్షణాలు జీవితంలో ఎదురయ్యే సంఘర్షణలు, సవాళ్ళ నుంచి తప్పించుకొని పారిపోయేలా చేస్తున్నాయి. చివరకు పరాజితులుగా మిగిల్చి పక్కన పడేస్తున్నాయి. అందుకే ఆదిశంకరాచార్యులు తమ 'వివేకచూడామణి'లో…


ఓడక తపసియైతే ఉన్నతోన్నతుడౌ

అజ్ఞాన మాలస్య జడత్వ నిద్రా
ప్రమాద మూఢత్వముఖాస్తమోగుణాః ।
ఏతైః ప్రయుక్తో న హి వేత్తి కించి
న్నిద్రాలువత్ స్తంభవదేవ తిష్ఠతి ॥ 'అవివేకం, బద్ధకం, జడత్వం, నిద్ర, అజాగ్రత్త, మూఢత్వం తదితరమైనవి తమోగుణ లక్షణాలు. ఈ గుణాలున్నవారికి జ్ఞానమెంత మాత్రమూ కలుగదు. అలాంటి వ్యక్తి నిద్రించేవానిలా, స్తంభంలా జడుడై ఉంటాడ'ని విస్పష్టం చేస్తారు. ఈ దుర్గుణాల్లో ఏ ఒక్కటి మనలోకి ప్రవేశించినా చాలు, మిగతావి మూకుమ్మడిగా వచ్చి చేరతాయి. మనల్ని కార్యవిముఖులుగా మార్చేస్తాయి. ఆశయాలే లేని అనామక జీవులుగా ఈ ప్రపంచం నుంచి నిష్క్రమింపచేస్తాయి.

సోమరియైతే గుణహీనుడవును...

గురువు ద్రోణాచార్యులు శిష్యుడిగా స్వీకరించేందుకు ససేమిరా అన్నా, పట్టుదలతో ఆయన మట్టిబొమ్మను ముందు పెట్టుకొని ఏకలవ్యుడు విలువిద్య నేర్చుకున్నాడు; చరిత్రలో ఆ గురువుకు సమంగా చిరకీర్తిని సముపార్జించాడు. రామదర్శనం కానిదే కన్నుమూసేది లేదని రాలనిపండుటాకులా నిరీక్షించి, చివరకు దేవదేవుడిని దర్శించుకొని, సేవచేసుకొని తరించింది భక్తశిరోమణి శబరి. ఇలా ఏ యుగంలోనైనా మనిషి సంకల్పానికి, సర్వేశ్వరుడూ సహకరించక తప్పలేదు. ఈ దృఢదీక్షే, కర్తవ్యనిష్ఠే మనిషిని ఉన్నతోన్నతునిగా నిలబెడుతుందని హితవు చెబుతూ…

వేడుకతో చదివితే వేదశాస్త్ర సంపన్నుడౌ
జాడతో నూరకుండితే జడుడౌను
ఓడక తపసియైతే ఉన్నతోన్నతుడౌ
కూడక సోమరియైతే గుణహీనుడౌను...

'వేడుకతో అధ్యయనం చేస్తే వేదశాస్త్రాల్లో సంపన్నుడవుతాడనీ, అనాసక్తుడై ఊరకుంటే అజ్ఞానమనే అంధకారంలో కొట్టుకుపోతాడనీ, ఓటమికి బెదరని తాపసి మహోన్నతుడవుతాడనీ, సాహసించని సోమరి గుణహీనుడిగానే మిగిలిపోతాడ'నీ స్పష్టం చేస్తున్నాడు అన్నమయ్య. మహాభారతంలో సంజయుడు, సింధురాజు చేతిలో ఓడిపోయి, శత్రుభయంతో ఇంటికి వచ్చి శయనిస్తాడు. అప్పుడు అభిమానవంతురాలు, సాహసవంతురాలయిన సంజయుడి మాతృమూర్తి విదుల ఆయనలో పౌరుషాన్ని రగిలిస్తూ, **ముహూర్తం జ్వలితం శ్రేయః న చ ధూమాయితం చిరమ్...** 'కొరివిలా రవ్వలు చిమ్ముతూ భగ్గుమని కొన్నిక్షణాలు బతికినా చాలు, నిప్పులేకుండా పొగలు గుప్పించే కర్రలా ఎన్నాళ్ళుండి ఏం లాభం' అని అంటుంది.

మనిషిలా పుడితే ధైర్యసాహసాలతో జీవించి కన్నుమూయాలి; కానీ భీరువులా బతుకు ఈడ్చకూడదు.

సంశయించితే పాషండుడే...

మురహరు గొలిచితే మోక్షము సాధించవచ్చు
వెరవెరగ కుండితే వీరిడియౌను
శరణంటే శ్రీవేంకటేశ్వరుడు రక్షించును
పరగ సంశయించితే పాషండుడౌను...

'ప్రాపంచికతను పక్కన పెట్టి పరమాత్ముడిని కొలిస్తే మోక్షాన్ని సాధించవచ్చు. అలా కాకుండా బంధాల నుంచి బయటపడే ఉపాయం తెలుసుకోకుంటే మనిషి అవివేకి అవుతాడు, విశ్వాసంతో ఆ వేంకటేశ్వరుడిని శరణంటే తనే మనల్ని రక్షించుకుంటాడు, సంశయించి అహంకరిస్తే పాషండుడైపోతాడు' అని పునరుద్ఘాటించాడు ఈ పదకవితాపితామహుడు.

'వీరిడి' అంటే 'అవివేకి' అని, 'పాషండుడు' అంటే వేదబాహ్యుడని అర్థం. నిత్యసంశయాలతోనే మనిషి నిరాశావాదిగా మిగిలిపోతున్నాడు. చిన్నచిన్న అడ్డంకులకే కుదేలైపోతున్నాడు. అందుకే 'ఓ ధీరహృదయుడా! పట్టుసడలనివ్వకు! చిరుమబ్బు మాటునే సూర్యుడు దాగినా,కారు చీకట్లలో స్వర్గమూ మసకేసినా పట్టుసడలనివ్వకు, నీ పయనం ఆగనీయకు'! అంటారు స్వామి వివేకానంద. శ్రీనివాసుడి సంకీర్తనాచార్యుడు కూడా, పట్టువిడువకుండా ప్రాపంచిక స్థాయి నుంచి ఎదిగి పరమార్థాన్నీ కైవసం చేసుకోమని కోరుకుంటున్నాడు. ❖



చిక్కని చీకటిని సైతం చీల్చుకొని, ఆకాశాన్నీ అచ్చెరువొందించే ఆ అరుణ కాంతులు లోకానికే మేలుకొలుపు... విధి చేసిన పెనుగాయానికి వెరవక వైకల్యంతోనూ సాహసవనితగా సవాళ్ళను గెలిచిన ఈ 'అరుణిమ' ఆత్మవిశ్వాసానికే పొద్దుపొడుపు. 'కష్టాలెన్నైనా గుండె చెదరక ముందుకు సాగే సాహసవంతుల చరిత్రే ప్రపంచ చరిత్ర' అన్న స్వామి వివేకానంద ధీరవచనాలతో స్ఫూర్తి పొందిన అరుణిమా సిన్హా జీవితమే ఓ సందేశం. తన పర్యటనలో భాగంగా అరుణిమ ఇటీవల హైదరాబాద్ రామకృష్ణ మఠాన్ని సందర్శించారు. ఆ సందర్భంలో 'శ్రీరామకృష్ణ ప్రభ'తో తన అనుభూతులను పంచుకున్నారు.

పట్టుదలే పాదంగా...

ఉత్తరప్రదేశ్ ఆడపడుచు అరుణిమ జీవితం ఇరవైరెండేళ్ళ వరకూ సజావుగానే సాగిపోయింది. కానీ రెండేళ్ళ క్రితం కాలం ప్రమాదం రూపంలో విషాదం కమ్మింది. లక్నో నుంచి ఢిల్లీకి రైలులో ప్రయాణిస్తున్న ఆమె దోపిడీదొంగల బారినపడ్డారు. ప్రతిఘటించిందన్న కసితో దొంగలు దారుణంగా నెట్టివేయటంతో పరుగెత్తే రైలులో నుంచి అరుణిమ కిందపడ్డారు. ఆ ప్రమాదఫలితంగా ఆమె ఓ కాలు కోల్పోయి అభాగినిగా మిగిలిపోయారు.

కానీ ఆమెలోని ఆత్మవిశ్వాసం మాత్రం చెక్కుచెదరలేదు. "ఒక్కసారిగా నా జీవితమే అంధకార బంధురమైనట్లు అనిపించింది. ఆసుపత్రిలో గడిపిన నాలుగు నెలల్లో, నన్ను నేనే ఎక్కువగా ఓదార్చుకున్నాను. ఎవరూ ఊహించనిదీ, ఏదో గొప్పదీ సాధించాలని అప్పుడే కలగన్నాను. దాని ఫలితమే ఎవరెస్ట్‌ను అధిరోహించాలన్న సంకల్పం" అంటారు అరుణిమ. ఓ పాదం లేకపోయినా అరవయ్యవ ఏట ఎవరెస్ట్‌ను జయించిన అమెరికన్ మహిళ రోండా గ్రాహమ్‌ను ఆదర్శంగా తీసుకొని తన ఆశయానికి అరుణిమ అంకురార్పణ చేశారు.

ఎందరు నిరుత్సాహపరచినా ఆ సమయంలో నాకు స్వామి వివేకానంద "Have faith in yourself - all power is in you - be conscious and bring it out. Say, 'I can do everything' " అన్న అగ్నికణాల వంటి మాటలే గుర్తొచ్చాయి. నాలో అనంతశక్తి ఉందని విశ్వసించి, అంతర్గతమై ఉన్న ఆ శక్తిని వ్యక్తపరచాలనుకున్నాను. అలా 'నేను ఏదైనా సాధించగలను' అన్న పట్టుదల నాలో పెరిగింది.

బచేంద్రిపాల్ బాసటతో...: ఆసుపత్రిలో ఊపిరిపోసుకున్న ఆ ఆలోచనను ఎవరెస్ట్‌ను అధిరోహించిన ప్రథమ భారతీయ మహిళ బచేంద్రిపాల్ ముందు ఉంచారు అరుణిమ. టాటా స్టీల్ సాహసకృత్యాల సహాయక సంస్థ బాధ్యతలను చూస్తున్న బచేంద్రిపాల్ దానికి సానుకూలంగా స్పందించి, సంస్థ తరఫున అరుణిమకు సాయపడేందుకు సిద్ధపడ్డారు.

ఆ తరువాత అరుణిమ పర్వతారోహణకు సంబంధించి ఉత్తర కాశీ, తదితర ప్రాంతాల్లో ఎన్నో శిక్షణలు తీసుకున్నారు. చిన్న చిన్న పర్వతాలపై ప్రయోగాత్మకంగా తన ప్రతిభను చాటుకున్నారు. 'ఆ యా సమయాల్లో కూడా ఎన్నో అడ్డంకులు, ప్రతికూలతలు ఎదురయ్యాయి. కానీ వెంటనే నాకు స్వామీజీ 'Be not afraid of any thing. You will do marvellous work. The moment you fear, you are nobody' అన్న అభయ వచనాలు గుర్తొచ్చేవి. అలా దేనికీ భయపడకుండా, అద్భుతాలను సాధించగలనన్న నమ్మకంతో ముందుకే సాగిపోయాను' అంటారు అరుణిమ.



ఎవరెస్ట్‌పై 'అరుణిమ' కాంతులు

చిట్టచివరకు బంధువుల, మిత్రుల సహకారంతో ఈ ఏడాది ఏప్రిల్ 1న ఒంటికాలితో అరుణిమ ఎవరెస్ట్ సాహస యాత్ర ఆరంభమైంది. మనిషి దృఢదీక్ష ముందు 21 వేల అడుగుల ఎవరెస్ట్ ఎంత చిన్నదో నిరూపించి, 2013 మే 21న ఆ పర్వతాగ్రాన అరుణిమ తన జయకేతనాన్ని రెపరెపలాడించారు. రామకృష్ణ సంఘం భక్తురాలిగా ఆరాధనాభావంతో ఆ ఎవరెస్ట్‌పై శ్రీరామకృష్ణ పరమహంస, దివ్యజనని శారదామాత, స్వామి వివేకానందల చిత్రాలను పెట్టి పూజించి, అరుణిమ తన భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

అరుణిమ జీవితం వికలాంగులకే కాదు, చిన్న చిన్న కష్టాలకే కుంగిపోయి కలవరపడిపోయే చాలామంది యువతీ యువకులకు పాఠం లాంటిది. సమస్యను భగవంతుడిచ్చిన సవాలుగా తీసుకొని ఎదిగేవారి ముందు ఎవరెస్ట్ కూడా చిన్నబోతుందనడానికి **అరుణిమా సిన్హాయే** నిదర్శనం. ❖

విధి విపరీతమై నిన్ను విషమపరీక్షలకు గురిచేసి హింసించినప్పటికీ, ప్రకృతి అంతా నిన్ను అణచడానికి ప్రయత్నించినప్పటికీ కలతచెందకుండా గమ్యంపై నీ దృష్టిని సారించు. -స్వామి వివేకానంద


- స్వామి విశారదానంద

బెంగుళూరులోని వివేకానంద యోగ అనుసంధాన మహా విద్యాపీఠానికి చెందిన స్వామి విశారదానంద భగవద్గీత పదమూడో అధ్యాయంలో 7-11 శ్లోకాల్లోని భగవానుడి బోధామృతాన్ని వివరిస్తూ 'భగవద్గీత - మానవీయ విలువలు' అనే శీర్షికతో ప్రసంగాలు ఇచ్చారు. చెన్నైలోని శ్రీరామకృష్ణ మఠ ఆంగ్ల మాసపత్రిక 'వేదాంత కేసరి'లో ప్రచురితమైన ఆ ప్రసంగాల సారాన్ని 'శ్రీరామకృష్ణ ప్రభ' పాఠకులకు 2011 జూన్ సంచిక నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

ప్రశాంతతకు భక్తి సాధన

భక్తి చాలా ఉత్తమమైన సాధన. కానీ 'పరాభక్తి', 'ఆత్మజ్ఞానం' - ఈ రెండూ ఒకటే! సాధారణ మానవుని జీవితం అహంకార కేంద్రితమై ఉంటుంది. అహంకారాన్ని భక్తి కరిగిస్తుంది. 'త్వదీయం వస్తు గోవింద తుభ్యమేవ సమర్పయే - ఓ ప్రభూ! నీ వస్తువే (నీ నుంచి పొందినదే) నీకు సమర్పిస్తున్నాను' అన్నదే భక్తుని దృక్పథం.

ఆ విధంగా భక్తి ద్వారా 'అహంకారం' రెండో పక్షాన ఉండే 'భోగి' (గౌణ భోక్తృత్వం)గా అవుతుంది. అప్పుడు ఈశ్వరుడు, లేక గురువు, లేక మహాత్ములు తన కన్నా ఎక్కువ ప్రాధాన్యం గలవారు అవుతారు. ఇది వృత్తి పరమైన వంటవాని పనిలా ఉంటుంది. వంట చేయడంలో ఆనందాన్ని అనుభవించినా, అతను వంట చేయడంలో ముఖ్య ఉద్దేశం - 'యజమాని'ని ఆనందింపజేయడమే! అదే విధంగా బండి నడిపే వ్యక్తి బండిని నడపడంలో సంతోషాన్ని పొందినా, అతను బండి నడపడం మాత్రం ముఖ్యంగా తన యజమాని కోసమే! రెండో పక్షపు భోగి విషయం ఇదేవిధంగా ఉంటుంది. దీన్ని జీవితానికి వర్తింపజేస్తే, మనలోని అహంకారం అదృశ్యమై మనస్సు పవిత్రమవుతుంది.



మనలోని అహంకారాన్ని క్రమంగా, నెమ్మదిగా కరిగించేదే భక్తి. భగవంతుని చేతిలో మనం కేవలం ఉపకరణాలం మాత్రమేనని గ్రహించేలా చేస్తుందది. ఈ భావన మనలో శాశ్వతంగా ఏర్పడినప్పుడు మన వ్యక్తిత్వంలో మార్పు కలుగుతుంది. మనలోని లోటుపాట్లు తొలగిపోతాయి. బాధల నుంచి విముక్తులం అవుతాం.

భక్తిమార్గాన్ని ప్రతి ఒక్కరూ 'నేనూ, భగవంతుడూ వేరు' అన్న భావనతో ప్రారంభిస్తారు. కానీ క్రమంగా పురోభివృద్ధి చెందుతున్నప్పుడు తానూ, భగవంతుడూ వేరు కాదన్న విషయాన్ని కనుగొనగలుగుతారు. దీన్నే 'అనన్యభావం' అంటారు. 'అనన్యం' అంటే ఇతరం కాదు- భిన్నమైనది కాదు- వేరు కాదు- అని అర్థం. చివరికి భగవంతుడు తన సొంతవాడనీ, తన స్వరూపమేననీ కనుగొనగలుగుతాడు. భేదబుద్ధితో ప్రారంభమైన 'భక్తి మార్గ యాత్ర' భగవంతునితో తన ఏకత్వాన్ని కనుగొనేవరకూ కొనసాగుతుంది.

ఇంకోవిధంగా చెప్పాలంటే, భక్తి మార్గంలో భక్తుడు తనను తన అబద్ధపు వ్యక్తిత్వమైన 'ఉపాధి' శరీరంతో ఉన్న ఏకత్వ భావన నుండి విడివడతాడు. మన శరీరం, మనస్సు ఒకరి స్వాధీనంలో ఉండే వస్తువులు. వాటిని నియంత్రించేది 'పరమాత్మ'యే!

మన అంతరంగంలో ఉండే అధికారి భగవంతుడే (అంతర్యామి). ఆయనే మనల్ని పని చేసేటట్లు చేస్తాడు. ప్రతి వ్యక్తీ తన వ్యక్తిత్వపు లోతులలో ఉన్న కోణాలను (విషయాలను) నెమ్మది నెమ్మదిగా తెలుసుకోవాలి. భగవంతునితో మనకు గల ఏకత్వాన్ని దర్శించగలిగే శక్తినీ, ప్రశాంతతనూ ప్రసాదించాల్సిందిగా భగవంతుణ్ణే ప్రార్థించాలి.


చివరగా మనం గుర్తుంచుకోవలసిన విషయమేమంటే, ఈ జీవితంలోగానీ, మరొక దానిలో గానీ మనం జీవించేది ఈ మనస్సులోనే! కాబట్టి దాన్ని పరిశుభ్రపరచుకోవాలి. చెత్తకుప్పల లాగా ఉన్న ఆందోళనలు, కలతలు, అహంకారపు పోరాటాలు, దోషపూరిత అభిప్రాయాలన్నిటినీ తొలగించుకొని, మనస్సును పవిత్రంగా ఉంచుకోవాలి. భగవద్భక్తి కలిగి ఉండడం అలవరచుకోవాలి. ఈ విధంగా జరిగినప్పుడు 'శాంతి' మన జీవితంలో ప్రవేశిస్తుంది. ❖

తెలుగుసేత: డాక్టర్ పన్నాల శ్యామసుందర మూర్తి

(వచ్చే సంచికలో... 'ఏకాంత ప్రదేశంలో నివాసం')

మరణాన్ని స్వాగతించిన మహాత్ములు

- స్వామి భాస్కరానంద



జ్ఞాన్ మహరాజ్

'మరణాన్ని హుందాగా, హృదయపూర్వకంగా ఆహ్వానించేవారు కారణజన్ములు' అనేవారు దివ్యజనని శారదామాత. అలా మృత్యువును చిరునవ్వుతో స్వాగతించి, ధన్యులైన ఎందరో సాధువరేణ్యులను రామకృష్ణ సంఘంలో ప్రత్యక్షంగా దర్శించుకునే భాగ్యం నాకు (స్వామి భాస్కరానంద) కలిగింది. భగవాన్ రామకృష్ణుల భక్తులుగా వారు మరణమంటే ఏ మాత్రం భయం లేకుండా, ఇచ్ఛాపూర్వకంగా, ధైర్యంగా తనువు చాలించారు.

స్వామి వివేకానంద ప్రత్యక్షశిష్యులైన జ్ఞాన్ మహరాజ్ అలాంటి వరిష్ఠ సాధువుల్లో ఒకరు. వారు భౌతికంగా చాలా వృద్ధాప్యంలో ఉన్నప్పుడు వారిని దర్శించుకునే అదృష్టం నాకు కలిగింది. అప్పుడు వారి వయస్సు ఎనభై ఏళ్ళకు పైబడి ఉంటుంది. స్వామి వివేకానంద ప్రత్యక్ష శిష్యుడిగా రామకృష్ణ సంఘంలో జ్ఞాన్ మహరాజ్‌పై సన్న్యాసులకూ, భక్తులకూ ప్రత్యేక గౌరవాభిమానాలు ఉండేవి.

వేడుకను వీక్షించండి: జీవిత చరమాంకంలో వారు శారీరక రుగ్మతలతో బాధపడ్డారు. కానీ ఎప్పుడూ ప్రసన్నంగానే కనిపించేవారు. వారికి స్వామి వివేకానందపై ఎనలేని ఆరాధనా భావం. జ్ఞాన్ మహరాజ్, స్వామి వివేకానంద శతజయంతి ఉత్సవాలను కళ్ళారా చూడాలని ఆకాంక్షిస్తూ ఉండేవారు. అందుకే చాలామంది సోదర సన్న్యాసులు 'స్వామీజీ నూరేళ్ళ పండగ వరకు జ్ఞాన్ మహరాజ్ తన శరీరాన్ని విడిచిపెట్టరు' అనేవారు. అదే ఆశతో మహరాజ్ ఎన్నో భయంకర వ్యాధుల్ని తట్టుకుంటూ వచ్చారు.

1963 జనవరి రానే వచ్చింది. స్వామి వివేకానంద శత జయంతి ఉత్సవాలు దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బేలూరు మఠంలో కూడా ఆ వేడుకలను వైభవంగా నిర్వహించారు. జ్ఞాన్ మహరాజ్ ఎంతో సంబరంగా ఆ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఆ తరువాత కొద్దిరోజులకే వారి ఆరోగ్యం తీవ్రంగా క్షీణించింది. ఆ విషయం తెలిసి అందరూ వారి గదిలోకి వచ్చారు. ఏ క్షణంలోనైనా వారు కన్నుమూస్తారని వైద్యులు నిర్ధరించారు. అప్పుడు కూడా మహరాజ్ ముఖంపై చిరునవ్వులు చెరిగిపోలేదు. ఒక్కరొక్కరుగా సోదర సన్న్యాసులు తన గదిలోకి రావడం చూసి ఉల్లాసంగా, 'ఒకరు ప్రాణం విడిచేస్తుంటే, ఆ వేడుకను కళ్ళారా వీక్షించడానికి ఎంతమంది వచ్చారో!' అంటూ తన సహజప్రవృత్తితో మందహాసాన్ని చిందించారు. కొన్ని క్షణాల్లోనే తన ప్రాణాలు వదిలేశారు. ❖



స్వామి సంతోషానంద

ఆనందంగా అంతిమ పయనం : కలకత్తా రామకృష్ణ మిషన్ స్టూడెంట్స్ హోమ్ ఆర్థికంగా బలహీనమైన కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ఉచిత విద్య, వసతులను కల్పించి వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దుతోంది. ఆ స్టూడెంట్స్ హోమ్ బాధ్యతల్ని స్వామి సంతోషానంద నిర్వహిస్తూ ఉండేవారు. విద్యార్థులకు ఏ మాత్రం ఇబ్బందులు ఎదురు కాకుండా అప్రమత్తంగా ఉండేవారు.

వృద్ధాప్యంలో అనారోగ్యం వల్ల వారికి ఎన్నో శస్త్రచికిత్సలు చేయాల్సి వచ్చింది. అయినా ఏ మాత్రం కుంగిపోకుండా, విద్యార్థులతో సరదాగా గడిపేవారు. శరీరం ఎంత బాధపెడుతున్నా, ఆ ఛాయలేవీ వారి ముఖంలో ప్రతిఫలించేవి కావు. ఒకసారి స్వామి సంతోషానంద మహరాజ్ ఆరోగ్య పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారిపోయింది. సాయంసంధ్యా సమయంలో వారికి గుండెనొప్పి మొదలైంది. వెంటనే మహరాజ్, సోదర సాధువులనందరినీ పిలిచారు. 'నేను ఈ రోజు చనిపోవచ్చు. నా వల్ల విద్యార్థులు రాత్రి భోజనం చేయకుండా ఉంటారేమో! అందుకే ఈ రోజు వారికి ముందే భోజనం పెట్టేయండి. లేకపోతే, హడావిడిలో వారు ఈ రాత్రంతా ఆకలితో ఉండాల్సి వస్తుంది' అన్నారు.

వెంటనే వారి ఆదేశానుసారం, ఆ రోజు రాత్రి విద్యార్థులకు ముందే భోజనాన్ని వడ్డించారు. హుటాహుటిన వైద్యులు కూడా మహరాజ్ దగ్గరకు వచ్చారు. వైద్యులను, సోదర సన్న్యాసులను ఉద్దేశించి వారు 'మరణాన్ని గురించి, ఆ మానసిక స్థితి గురించి ఇన్నాళ్ళూ వినడమే జరిగింది. ఇప్పుడు దాన్ని ప్రత్యక్షంగా అనుభవించడం చాలా కొత్తగా ఉంది. మరణాన్ని అనుభూతి చెందుతున్నాను' అని అంటూ 'ఇక ఉంటాను మరి!' అని కొన్ని క్షణాలకే స్వామి సంతోషానంద భౌతికంగా ఈ లోకం నుంచి నిష్క్రమించారు. ❖

కర్మానుసారంగా ఈ దేహం మండన దండనలను అనుభవించని. కర్మ ప్రవాహంలో కొట్టుకు పోయే ఈ దేహం గురించి చింతించకు. సాంత్వన పొంది జీవించు. *-స్వామి వివేకానంద*

పిలిచిన పలికేటి పరంధాముడు

చిత్రకథ: మేఘనా సూర్యనారాయణన్ చిత్రాలు: శంకర్ అనుసృజన: స్వామి జ్ఞానదానంద


1 పాండవులు పన్నెండేళ్ళు వనవాసం చేస్తున్నారు. దుర్యోధనుడు వారికి అపకారం చేయాలన్న దురుద్దేశంలో ఉన్నాడు. ఇలా ఉండగా ఒక రోజు అతడి రాజప్రాసాదానికి దుర్వాస మహర్షి విచ్చేశారు. ఆయనకూ, ఆయన శిష్యులకూ దుర్యోధనుడు చక్కగా ఉపచర్యలు చేశాడు.



2 ఎంతో తృప్తి చెందిన దుర్వాసుడు...





3 దుర్యోధనుడి దురుద్దేశం దుర్వాస మహర్షికి అర్థమైంది. అయినప్పటికీ శ్రీకృష్ణుని భక్తులైన పాండవులను చూడగోరి అరణ్యానికి వెళ్ళాడు.




ఇంతమందికి వీళ్ళు ఎలా భోజనం ఏర్పాటు చేయగలరని దుర్వాసుడు కూడా సంశయించాడు.


4
పర్ణశాలలో ద్రౌపది, ధర్మరాజుతో...
మహర్షి తన శిష్యులతో స్నానాదులు ముగించుకు రాగానే భోజనం పెట్టాలి. ఏం చెయ్యాలి?
ద్రౌపదీ! సూర్యుడు ప్రసాదించిన అక్షయపాత్ర ఉండగా కలత చెందడం ఎందుకు?
5
మన భోజనాలు పూర్తి కావడంతో అక్షయపాత్రను తోమి, కడిగివేశాను! అక్షయపాత్ర నుండి రోజుకు ఒక్కసారే ఆహారం పొందగలం!
దుర్వాస మహర్షి మహాకోపిష్ఠి గదా... ఇప్పుడు ఏం చెయ్యాలి?
6
వెంటనే ద్రౌపది కళ్ళుమూసుకొని ప్రార్థించింది.
కృష్ణా! నాడు కురుసభలో అక్షయంగా వస్త్రాన్ని ప్రసాదించి నా మానం కాపాడావు. నేడు నాకు నువ్వు తప్ప మరో గతి లేదు. ఆకలితో ఉన్న మహర్షి ఆతిథ్యానికి ఎలాగైనా ఏదో ఒక ఏర్పాటు చేసిపెట్టు.
7
ద్వారకలో శ్రీకృష్ణుని అంతఃపురం. ఉయ్యాల నుండి హఠాత్తుగా ఆయన లేచి, బయలుదేరాడు.
స్వామీ! ఎక్కడకు ఇంత హడావిడిగా బయలుదేరు తున్నారు?
ద్రౌపది ఆపదలో ఉంది. ఆమె సహాయార్థం తక్షణమే నేను వెళ్ళాలి.


8
హఠాత్తుగా కృష్ణుడు, ద్రౌపది ముందు ప్రత్యక్షమయ్యాడు.
ద్రౌపదీ! బాగా ఆకలిగా ఉంది. ఏదైనా నాకు పెట్టు.
మమ్మల్ని నువ్వు కూడా పరీక్షిస్తున్నావా కృష్ణా! అక్షయపాత్రను కడిగివేశాను. ఇక ఆహారం ఎలా లభిస్తుంది?
9
అక్షయపాత్రను తోమి, కడిగి వేశావా? వెళ్ళి జాగ్రత్తగా చూడు.
పాత్రను శుభ్రంగా కడిగివేశాను కృష్ణా!
నాకు ఆకలిగా ఉందే! సరే! ఆ పాత్రను ఇక్కడకు తీసుకురా! చూద్దాం.
10
అక్షయపాత్రలో ఒక అన్నం మెతుకు కనిపించింది.
ఆహా! మూలలో ఒక అన్నం మెతుకు అంటుకుని ఉందే! నా ఆకలికి ఇది చాలు. యాగాలతో తృప్తి చెందే జగదీశ్వరుడైన శ్రీహరి దీనితో తృప్తి చెందుగాక!
ఇలా అంటూ కృష్ణుడు దాన్ని తిని, నవ్వాడు.
11
విశ్వరూపుడైన శ్రీకృష్ణుడు ఆ అన్నం మెతుకును తినగానే అక్కడ దుర్వాసుడు, ఆయన శిష్యుల కడుపులు నిండిపోయాయి.
12
కృష్ణా! నా కష్టం నీకు తెలియదా? దుర్వాస మహర్షి, ఆయన శిష్యులూ భోజనాలకు ఇక్కడకు వస్తున్నారు.
ఇంతేగదా! దిగులు పడకు. ఆయన హృదయపూర్వకంగా నిన్ను ఆశీర్వదించి మరీ వెళతాడు!







నిజంగా, నిశ్చయంగా చెబుతున్నాను వినండి: ప్రేమపూరిత హృదయంతో భగవంతుణ్ణి మనసారా ప్రార్థించగానే భగవంతుడు ప్రత్యక్షమవడానికి ఒక్క నిమిషమైనా ఆలస్యం చేయడు. కావాలంటే ఈ సత్యాన్ని మీ జీవితంలో మీరే స్వయంగా పరీక్షించుకోండి.

- భగవాన్ శ్రీరామకృష్ణ పరమహంస

రాజమండ్రిలో రాష్ట్రస్థాయి సదస్సులు

రాజమండ్రి, శ్రీరామకృష్ణ మఠం స్వామి వివేకానంద 150వ జయంత్యుత్సవాలను పురస్కరించుకొని 2013 డిసెంబర్ 14,15,16 తేదీల్లో **'సనాతన ధర్మ సదస్సు'**ను; 2013 డిసెంబర్ 18,19,20 తేదీల్లో **'యువజన సమ్మేళనం'**ను నిర్వహిస్తుంది.

రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో పాల్గొన దలచినవారు ప్రతినిధి రుసుము రూ. 50/- చెల్లించి పేర్లను నమోదు చేయించుకోవాలి. ఇతర ప్రాంతాల నుండి వచ్చి ధర్మ సదస్సులో పాల్గొన్న ప్రతినిధులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలు కల్పించబడును. యువసమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సదుపాయాలతో పాటు ప్రయాణ ఖర్చులు ఇవ్వబడును.

ఈ సదస్సుల్లో స్వామీజీలు, ప్రసిద్ధ వక్తల ప్రసంగాలు; భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహింపబడతాయి.



ప్రకటన ప్రతిని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. కిరణ్ కుమార్ రెడ్డి, రామకృష్ణ మఠ స్వామీజీలు.

పూర్తి వివరాల కోసం సంప్రతించండి:

శ్రీరామకృష్ణ మఠం

స్వామి వివేకానంద రోడ్డు, రాజమండ్రి – 533 105

సెల్: 93966 73111, 93966 73112.

Email: sv150rjy@gmail.com

స్వామి వివేకానంద క్విజ్ – జవాబులు

(1) 1893 సెప్టెంబర్ 27న జరిగిన చికాగో విశ్వమత మహాసభల్లో చివరి సమావేశం ప్రసంగంలో.

(2) అమెరికాలోని రిడ్జ్‌లీమేనర్‌లో.

(3) స్విట్జర్లాండ్‌లోని జెనీవా నగరంలో.

(4) అమెరికాలోని రిడ్జ్‌లీమేనర్‌లో, చిత్రకారిణి మిస్ స్టమ్ వద్ద.

(5) అమెరికాలోని క్యాంప్ ఇర్వింగ్‌లో.

(6) 1. ఆధ్యాత్మిక సాధనలు. 2. సేవ. 3. అధ్యయనం, ప్రచారం.

(7) ద్వైతం, అద్వైతం, విశిష్టాద్వైతం.

(8) త్యాగం, సేవ.

(9) ఫాదర్ పోప్, మదర్ చర్చ్.

(10) ప్యారిస్‌లో.

(11) ఆరు. 1. స్వాగతానికి ప్రత్యుత్తరం. 2. మన విభేదాలకు కారణం. 3. హిందూమతం 4. మతం– భారతదేశ సత్వర ఆవశ్యకత కాదు. 5. హైందవమత సాఫల్యతే బౌద్ధమతం 6. తుది సమావేశ ప్రసంగం.

(12) 'స్వామీజీ! రాబోయే రోజుల్లో మిమ్మల్ని అవతార పురుషునిగా జనం పరిగణిస్తారు. అలా పరిగణించిన వారిలో ప్రథమున్ని, మహమ్మదీయుడనైన నేనే అని మీరు జ్ఞాపకం ఉంచుకోండి'.

(13) పవహారీబాబా.

(14) హార్వర్డ్ విశ్వవిద్యాలయం.

Printed and published by **Swami Jnanadananda** owned by Ramakrishna Math Trust
and printed at Kala Jyothi Process, 1-1-60/5, RTC Cross Roads, Musheerabad, Hyderabad - 500 020
and published at Ramakrishna Math, Domalguda, Hyderabad - 500 029. **Editor: Swami Parijneyananda**



22వ వార్షిక భక్త సమ్మేళనం, మారుటేరు, (ప.గో. జిల్లా) తేదీలు: 2014 జనవరి 3, 4, 5

సమ్మేళన ప్రాంగణం : రెడ్డి కల్యాణ మండపం, తాడేపల్లిగూడెం రోడ్, మారుటేరు.

పశ్చిమ గోదావరి జిల్లాలోని శ్రీరామకృష్ణ సేవాసమితుల ఆధ్వర్యంలో మారుటేరులో **2014 జనవరి 3,4,5** తేదీల్లో జరగబోయే 22వ వార్షిక భక్త సమ్మేళనానికి సాదరంగా ఆహ్వానిస్తున్నాం.

- ఈ సమ్మేళనంలో పాల్గొనదలచిన ప్రతినిధులు ఒక్కొక్కరు **రూ. 200/-లు** ప్రతినిధి రుసుము చెల్లించవలెను. ఈ రుసుమును తేదీ **7-12-2013** లోగా **'శ్రీరామకృష్ణ సేవాసమితి, మారుటేరు'** పేరున మనియార్డర్/ డి.డి.ల ద్వారా క్రింద సూచించిన చిరునామాకు పంపవలెను. సంస్థలు రుసుము చెల్లించిన ప్రతినిధుల వివరాలను సంబంధిత పత్రములో పొందుపరచి క్రింది చిరునామాకు పంపవలెను.
- ప్రతినిధులకు భోజన, వసతి సౌకర్యాలు 2014 జనవరి 3వ తేదీ శుక్రవారం ఉదయం నుండి జనవరి 5వ తేదీ ఆదివారం సాయంత్రం వరకు ఏర్పాటు చేయబడును.
- ప్రతినిధులకు సాధారణ వసతి సౌకర్యములు మాత్రమే ఏర్పాటు చేయబడును. ప్రత్యేక సదుపాయాలు కావాల్సినవారు హోటల్ నందు గదులు స్వయముగా రిజర్వు చేసుకొనగలరు.
- **భక్తుల సేవ భగవంతుని సేవ** గనుక ఈ బృహత్ కార్యక్రమములో శ్రీరామకృష్ణ సేవాసమితి భక్తులు, శ్రేయోభిలాషులు, అభిమానులు యావన్మందీ పాల్గొని ధన, వస్తు, సేవా రూపేణ తమవంతు సహాయ సహకారములు అందించి భగవాన్ శ్రీరామకృష్ణుల కృపకు పాత్రులు కాగలరు.
- ఈ భక్తసమ్మేళనం సందర్భంగా ఒక స్మారక సంచికను విడుదల చేయనున్నాము. ఆ సంచికలో ప్రకటనలు ఇచ్చి ప్రోత్సహించాల్సిందిగా కోరుచున్నాము. ప్రకటన వివరాలతో కూడిన సి.డి.ని - డాక్టర్ పన్నాల శ్యామసుందరమూర్తి, ఇంటినెం. 13-3-20, గుంటూరువారి తోట, 2వ లైను, గుంటూరు - 522 001 చిరునామాకు పంపగలరు.

ప్రకటనల ట్యారిఫ్ వివరాలు :

	పూర్తి పేజీ	అర పేజీ	పావు పేజీ
కలర్	6,000	3,000	1,500
బ్లాక్ & వైట్	3,000	1,500	800
2,3 కవరుపేజీలు	15,000	-	-
4వ కవరు పేజీ	20,000	-	-

- పై కార్యక్రమాలకు విరాళములు, ప్రతినిధి రుసుములు, ప్రకటనల రుసుములను మనియార్డర్/ డి.డి.ల ద్వారా **మద్దుల వేంకటేశ్వరరావు, విజయలక్ష్మి జ్యూయలర్స్, టి.పి.గూడెం రోడ్డు, మారుటేరు - 534 122** చిరునామాకు పంపించవలెను. **చెక్కులు స్వీకరించబడవు.** బ్యాంక్ డి.డి.లను **శ్రీరామకృష్ణ సేవాసమితి, మారుటేరు అకౌంట్ నెం. 11289011477, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మారుటేరు** (IFSC-SBIN0001737) పేరున తీసి, పంపగలరు.

మీ అమూల్య సహాయ, సహకారములతో ఈ మహత్తర కార్యక్రమమును విజయవంతం చేయ ప్రార్థన.

సంప్రతించవలసిన చిరునామా

శ్రీరామకృష్ణ సేవా సమితి, మారుటేరు

వి.ఎస్.ఎన్. మూర్తి (నిర్వహణ కార్యదర్శి) **98663 69986**

చిర్ల సూర్యనారాయణ రెడ్డి - **94404 85495**

వి.ప్రకాశరావు (బాబ్జీ) - **94914 79831**

చిర్ల సత్యనారాయణ రెడ్డి - **97054 35559**

Vol.70-12, Sri Ramakrishna Prabha (Telugu Monthly) December 2013, Regd. with the Registrar of Newspaper for India Under No.1120/57.
Postal Registration No. HD-1071/2013-15. Licensed to Post Under WPP : AP/CPMG/HC-13/WPP/2013-14. Date of Publication : 18th of every month.

అమ్మ గాంచిన అద్భుత దర్శనం



పూర్ణచంద్రుని చల్లని కిరణాలు ప్రతిబింబిస్తూ ఉండడంతో గంగానది ఓ వెండి నదిని తలపిస్తుంది. మాతృదేవి ప్రశాంతంగా గంగాతీరంలో మెట్లమీద కూర్చొని ఆ అందాన్ని తిలకిస్తున్నారు.

అప్పుడు హఠాత్తుగా శ్రీరామకృష్ణులు ప్రత్యక్షమై మాతృదేవి వెనుకవైపు నుండి వస్తూ, గంగలోకి దిగారు. అలా నీళ్ళలోకి దిగి, వారు అందులోనే కరిగిపోయారు. మరుక్షణమే నరేంద్రుడు (స్వామి వివేకానంద) అక్కడ కనిపించాడు. అతడు ఆ నీటిని చేతులలో తీసుకుని, 'జై శ్రీరామకృష్ణ! జై శ్రీరామకృష్ణ!' అంటూ అసంఖ్యాక ప్రజానీకంపై చిలకరించాడు.

గురుదేవుల సందేశాన్ని నరేంద్రుడు ప్రపంచమంతా వ్యాపింపజేసి మానవాళిని తరింపజేస్తాడని సూచించే ఈ దృశ్యం మాతృదేవి మనస్సులో గాఢంగా నాటుకుపోయింది. ఈ దివ్యదర్శనం గాంచిన తరువాత శారదాదేవి విశ్వమత మహాసభల్లో పాల్గొనడానికి అనుమతిని కోరిన స్వామి వివేకానందకు సంపూర్ణ ఆశీస్సులను అందించారు. ❖



కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో 'వివేకానంద రథం' పర్యటన వివరాలు:

2013 డిసెంబర్ 1-ధర్మపురి; 2-లక్సెట్టిపేట; 3,4 మంచిర్యాల; 5- బెల్లంపల్లి; 6- తాండూరు, రెబ్బెన; 7- అసిఫాబాద్; 8- కాగజ్‌నగర్; 9-చెన్నూరు; 10-గోదావరిఖని,మంథని; 11- పెద్దపల్లి, సుల్తానాబాద్; 12 -బొమ్మకల్; 13- కరీంనగర్, తిమ్మాపూర్; 14-సింగాపూర్,హుజూరాబాద్; 15-జమ్మికుంట, ఎల్కతుర్తి; 16,17 హన్మకొండ; 18-ఆత్మకూరు, పరకాల; 19- మొగుళ్ళపల్లి, చిట్యాల, చల్లగరిగ; 20-రేగొండ, భూపాలపల్లి; 21-ఘన్‌పూర్,రామప్ప; 22 -ఏటూరునాగారం తాడ్వాయి, గోవిందరావుపేట; 23-ములుగు, మల్లంపల్లి; 24-నర్సంపేట,నెక్కొండ; 25-మహబూబాబాద్; 26-నెల్లికుదురు, తొర్రూరు; 27- రాయపర్తి, వర్ధన్నపేట, కల్లెడ; 28-పర్వతగిరి, సంగెం, ఖిలా వరంగల్; 29,30 హన్మకొండ; 31- కాజీపేట, ఘన్‌పూర్.